కాళీ సిద్ధులు



కుర్తాళంశంకరాచార్య, జగద్గురు

శ్రీ సిద్ధేశ్వరానందభారతీమహాస్వామి

కాశీ సిద్ధులు

రచన

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు

శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి

శ్రీ సిద్ధేశ్వరీపీఠాధిపతి, కుర్తాళం (తమిళనాడు)

విక్టరీ పబ్లిషర్స్

డోర్. నెం. 30-17-3ఎ, వారణాశివారి వీధి, సీతారాంపురం,

విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

కాళీసిద్ధులు

ప్రథమ ముద్రణ : 2015

వెల : రూ. **200-00**

ప్రతులకు :
ధర్మాధికారి
స్వయం సిద్ధకాళీపీఠం
బి1, సి40 - 4వలైను,
కాళీపీఠం రోడ్డు, రవీంద్రనగర్,
కొత్త పట్టాభిపురం, **గుంటూరు - 522 006**
ఫోన్లు : 0863-2231625, 2256666

సోల్ డిస్ట్రిబ్యూటర్స్

శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
ఫోన్ : **0866 - 2444156**

శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మి నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు - 500027.
ఫోన్ : **(040) 65528228, 24653879**
(ఫాక్స్) **24745257,** సెల్ : **9346771314**

సాయి వెంకటేశ్వర బుక్ డిపో
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
ఫోన్ : **(0866) 2570192, 2570309**

మనవి : మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపు లలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచి లలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరిముద్రణలో సరి చేయగలం. ఏవిషయమైన **ramakumarimmadisetty@yahoo.com** మెయిల్‌కు తెలియ జేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 32987503888 విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

Published by : **విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

ద్వితీయ ముద్రణ పీఠిక

కాళీసిద్ధులు గ్రంథం ప్రచురితమైన తర్వాత కొందరు పాఠకులలో రకరకాల సందేహాలు బయలుదేరినవి. వ్యతిరేకులు కొందరు దీనిని సాకుగా చేసుకొని విమర్శించటం మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇందులో వామాచార సాధనలను గురించిన అంశాలు వివాదాస్పదంగా ఉన్నవన్న అభిప్రాయం అక్కడక్కడ ప్రకటితమైంది.

శంకరపీఠములకు సంబంధించిన ఏ సన్యాసి వామాచారాన్ని సమర్థించడు. శ్మశానసాధనలను అంగీకరించడు. ఈ విషయంలో రెండవ అభిప్రాయానికి తావులేదు. అయితే ఈ గ్రంథంలో వాటికి సంబంధించిన విషయాలను ఎందుకు చెప్పవలసి వచ్చింది? అనే ప్రశ్న ఉదయిస్తుంది.

కాళి వంటి దేవతకు సంబంధించిన సాధనలను చెప్పేటప్పుడు వామాచార సాధనలను గురించి చెప్పకపోతే ఆ గ్రంథం పరిపూర్ణతను సంతరించుకోదు. దాని కోసము, ఆయా విశేషాలు కాలగర్భంలో కలిసిపోయి నష్టం కారాదన్న భావనతో వాటిని తెలియజేయటం జరిగింది. ఈ సంగతి గ్రంథంలో చెప్పటం జరిగింది కూడా. ఇది ఒక సమాధానం. మరొకటి ఈ సాధనలు చేయటము ఆచార విరుద్ధము, ప్రమాదకరము అని హెచ్చరించటం కూడా జరిగింది.

జగద్గురు శంకరాచార్యులవారు బౌద్ధచార్వాకాది మతాలను తమ గ్రంథాలలో తీవ్రంగా ఖండించారు. ఖండించాలంటే వారి వాదాలను చెప్పి వానిలో దోషాలను చూపించాలి గదా! అంతమాత్రాన ఆయా మతాలనుగూర్చి వ్రాశారు గదా! అని విమర్శిస్తే ఎలా? అర్వాచీనకాలంలో ఒక ప్రసిద్ధ శంకర పీఠాధిపతి కౌళమార్గాన్ని నిరసిస్తూ ఒక గ్రంథం వ్రాశారు. అందులో మూడువంతులు కౌళాచారాన్ని వివరించటానికి ఒకవంతు ఖండించటానికి వినియోగించారు. అంతమాత్రాన గ్రంథంలో ఎక్కువభాగం కౌళమార్గప్రచారం కోసం వ్రాశారనటం ఉచితమా? న్యాయస్థానంలో ఒక్కోసారి న్యాయవాది ప్రతిపక్షవాదాన్ని దీర్ఘంగా చర్చించి లోపాలు చూపించి క్లుప్తంగా, నిశితంగా తనవాదాన్ని న్యాయసూత్ర

నిబద్ధంగా వినిపించి గెలుస్తాడు. ధర్మాన్ని సమర్థించటానికి స్థలము, సమయము ప్రధానంకాదు. చివరకు తన నిర్ణయంగా ఏది ప్రస్థాపించాదన్నదే తీసుకోవాలి.

ఒకసారి ఇతర మతస్థుడొకడు హిందూమతాన్ని విమర్శిస్తూ మీ భాగవతంలోనే దేవుడు లేడని వ్రాసి ఉన్నదని సవాలుచేశాడట! తీరాచూస్తే అతడు చూపించిన పేజీలో – హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో అన్న సందర్భం కనిపించింది. ఇలా ఉంటవి తెలిసీ తెలియక చేసే విమర్శలు.

ఇక వామాచార, శ్మశాన సాధన మార్గాలలో సాధనచేసి సిద్ధులైన వారెందరో ఉన్నారు. ఎన్నో సంవత్సరాలు శ్మశానంలో ఉండి కాళీమంత్రం జపించి సిద్ధుడై కాశీలో దిగంబరుడై తిరుగుతూ మూడువందల సంవత్సరాలు జీవించిన వాడు త్రైలింగస్వామి. అటువంటి సాధనలే చేసి ఔరంగజేబువంటి హిందూమత ద్వేషిచేత కూడా నమస్కారాలు పొంది, అద్భుత శక్తులతో దాదాపు రెండు వందల యేండ్లు ప్రకాశించినవాడు కీనారాం అఘోరీ. నిరంతర మద్యపానంచేసి, పంచ కపాలాసనంమీద కూర్చుండి కాళీసాక్షాత్కారాన్ని పొంది సమకాలీన రాజులచే, ప్రజలచే పూజించబడిన మహాపురుషుడు రామప్రసాద్. శ్మశానంలో దిగంబరుడై ఎన్నో సంవత్సరాలు పంచకపాలాసనం మీద కూర్చుండి తపస్సుచేసి ఎన్నో తాంత్రిక సాధనలుచేసి సిద్ధుడై ఈనాడు అవతార పురుషునిగా కీర్తింపబడుతున్న పూజ్యుడు రామకృష్ణ పరమహంస. కుళ్ళిన నరశవ మాంస ఖండాన్ని కూడా ఆయన ప్రసాదంగా స్వీకరించినట్లు రామకృష్ణ మఠ ప్రచురణ గ్రంథంలో ఉంది. ఇటువంటిదే మరోఘట్టం. ఒకసారి నరేంద్రుడు (వివేకానంద) 3 గంటలసేపు వామాచారాన్ని ఖండిస్తూ ప్రచండ వాదం చేశాడు. అంతా విని రామకృష్ణుడు "ప్రతి పెద్ద యింటికి సింహద్వారము, దొడ్డివైపు చిన్న తలుపు ఉంటవి. దక్షిణాచారులు సింహద్వారంలో నుండి లోపలికి వెళితే వామాచారులు దొడ్డితలుపులో నుంచి ప్రవేశిస్తారు. ఇద్దరూ గమ్యాన్ని చేరుకొంటారు" అన్నాడు.

ఈ విమర్శకులు వీరినిగూర్చిగాని, వీరి సాధనలను గూర్చిగాని, మాట్లాడరు. ఖండించరు ఎందుకంటే ధైర్యం చాలదు కనుక. మొత్తంమీద ఇటువంటి వాటిని పట్టించుకోవలసిన అవసరంలేదు. శంకరాచార్య సంప్రదాయానికి చెందిన యతిగా వామాచారాన్నిగాని, శ్మశాన సాధనలను గాని నేను ప్రోత్సహించను, సమర్థించను.

శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి

కాళీ విశేషాలు

కాలమునకు అధిదేవతగా సృష్టిస్థితి లయములకు అధికారిణిగా కాళీదేవిని గురించి కొన్ని విశేషాలు చెప్పటం జరిగింది. ఆదిశక్తి, జగన్మాత అయిన కాళీదేవి, నిర్గుణ పరబ్రహ్మము, సగుణముగా అభివ్యక్తమయినపుడు తీసుకొన్న మొదటి రూపమే 'కాళి' అని పురాణములు వర్ణిస్తున్నవి. ఆమె శివారూఢ అయిన శిల్పాలు, చిత్రాలు, వర్ణనలు ఎన్నో లభించినవి. ఒక కథ –

కాళీదేవి మహాయుద్ధంలో సర్వరాక్షసులను నాశనంచేసి ఆనందంతో మద్యపానం చేసి విజయోత్సాహంతో నాట్యం చేయటం మొదలుపెట్టింది. ఆ మహాతాండవాన్ని లోకాలు భరించలేకపోయినవి. దేవతల ప్రార్థనమీద శివుడు స్వయంగా వచ్చి ఈ ప్రళయ తాండవాన్ని ఆపమని కోరాడు. మద్యపానపు మత్తులో ఉన్న ఆమె పరమేశ్వరుని మాట వినలేదు. పట్టించుకోలేదు. అపుడు శివుడు చంపబడిన రాక్షసుల శరీరాల మధ్యలో ఒక శవాకారంలో పడుకొన్నాడు. ఉద్రేకంతో, ఆవేశంతో నాట్యం చేస్తున్న కాళి, శివుని శరీరంమీద కూడా అడుగులు పెట్టింది. ఆ శరీర స్పర్శతో, తన భర్తనే తొక్కి గాయపరుస్తున్నానని గ్రహించి, లజ్జతో నాలుక కొరుక్కొని నాట్యం ఆపింది. అందుకే ఆమె నాలుక ఎప్పుడూ చాపి ఉంటుంది. ఈ కథ జానపదగాథలలో ప్రసిద్ధం.

మరొక పురాణ గాథ : పార్వతీ పరమేశ్వరులు సరససల్లాపాలు ఆడుతున్న సమయంలో, పార్వతీదేవి "నేను కాళీ, తార, ఛినమస్తా, షోడశీ భువనేశ్వరీ, ధూమావతి, మాతంగి, కమలాత్మిక, బగళా, త్రిపురభైరవి అన్న దశ విధ రూపాలు ధరించాను గదా ! ప్రభూ !మీకు వీటిల్లో ఏ ఆకృతి ఇష్టము?" అని శివుని అడిగింది. శివుడు కాళీ రూపం తనకు ఎక్కువ ఇష్టమని, నిరాభరణ, నిరాడంబర, కాలమునకు నిజమైన అధికారిణి అయిన కాళికాకృతి తనకు అత్యంత ప్రీతికరమైనదని అన్నాడు. అప్పుడు పార్వతి, ఆయన సంతోషం కోసం కాళీ రూపాన్ని ధరించింది. తన ఉత్కర ప్రేమకు చిహ్నంగా ఆమె పాదములను తన వక్షస్థలముమీద పెట్టుకొని, ఆమె దివ్య సౌందర్యాన్ని అర్ధ నిమీలత నేత్రాలతో చూస్తూ పడుకొన్నాడు. పరమేశ్వరుడు, "తమ ఇద్దరి ఈ భంగిమ సర్వలోకపూజితమగుగాక!" అన్నాడు. అందుకే కాళీ, శివుల ఆకారాలు ఎక్కువ ఈ భంగిమలో ఉంటవి.

మరొక కథ : శత్రు సంహారానంతరం, మధుపానమత్తయై, యుద్ధములో రక్తముచే తడిసిన భూమిమీద ఆమె తాండవం చేస్తూంటే, ఆ వీర విజృంభణాన్ని లోకాలు భరించలేనపుడు, దేవతల ప్రార్థన మీద శివుడు వచ్చి, ఎంత చెప్పినా ఎంత బ్రతిమిలాడినా ఆమె పట్టించుకోపోతే శిశు రూపాన్ని ధరించి, భయంతో వలె పెద్దగా ఏడవటం మొదలు పెట్టాడు. పసిబిడ్డ ఆక్రందన ఆమెను ఆకర్షించి చూచి తన నాట్యాన్ని ఆపి ఆ శిశువును

ఎత్తుకొని తలపై ముద్దాడి, తన వయోధరముల నుండి పాలు ఇచ్చింది. ఆమె ఉగ్రత శాంతించి ప్రేమమూర్తి అయింది. కాళి పసిబిడ్డకు పాలు కుడుపుతున్న కొన్ని శిల్పాలు, చిత్రాలు లభించినవి. అయితే ఆమె భీషణ రూపం ఆకర్షించినంతగా, ఈ రూపం ప్రజలలోకి ఎక్కువగా పోలేదు.

కాళీదేవి యొక్క వివిధాకృతులు, ప్రాచీన గ్రంథాలలో వివిధ రీతుల వర్ణించబడినవి. అగ్ని యొక్క సప్త జిహ్వాలలో ఒక జిహ్వాకు 'కాళి' అని పేరున్నట్లు ముండకోపనిషత్తులో కన్పిస్తున్నది. అధర్వణ వేదములోని 'కాటక గృహ్య' సూత్రములలో కాళీదేవి పేరు మొదటగా దర్శనమిస్తున్నది. మహాభారతంలోని శౌక్తిక పర్వంలో దేవతగా ఆమె వర్ణని భాసిస్తున్నది. పాండవ సైనికులకు ఆమె చాలామందికి కలలో కనిపించిందట. ద్రోణ పుత్రుడైన అశ్వత్థామ దాడి చేసినపుడు ఆమె కనిపించినట్లు భారతం వర్ణిస్తున్నది. ఆరవ శతాబ్దంగా భావించబడుతున్న 'దేవీ మాహాత్మ్యము'లో రక్తబీజ సంహారిణిగా, 10వ శతాబ్దంనాటి 'కాళికా పురాణం'లో ఆమె పరమ సత్యమైన మహాశక్తిగా వర్ణించబడినది. అందులో ఆమె ఆదిశక్తిగా, పరాప్రకృతిగా వర్ణితమైనది.

శివునిమీద కుడి పాదముంచి, కత్తిని ఎడమ చేతితో పట్టుకొంటే ఆమె దక్షిణకాళిగా గ్రంథాలు చెపుతున్నవి. పూరీ జగన్నాథ ఆలయంలో, క్షేత్ర రక్షకిగా, జగన్నాథుని రూపంగానే భావించబడుతున్నది. దక్షిణ దేశంలో కాళీ, శివులకు సంబంధించిన ఒక కథ వ్యాప్తిలో ఉన్నది. శుంభ, నిశుంభ సంహారం తరువాత కాళీదేవి తమిళదేశంలోని 'తిరువణ్కారు' అరణ్యంలో నివసించిందట. ఆమె భయంకర వినాశక లక్షణం వల్ల ఆ ప్రాంతపు ప్రజలు భయభ్రాంతులై ఉన్నారు. ఒక శివ భక్తుడు, తన అర్చనా కర్మకలాపాలు నిర్వర్తించటానికి ఆమెవల్ల కలిగిన అడ్డంకులను చూచి, ఈ మారణదేవతను అదుపుచేయమని, అక్కడ నుండి పంపివేయమని శివుని ప్రార్థించాడు. భక్తుని ప్రార్థనమీద శివుడు రాగా, ఈ ప్రాంతమంతా తనదని ఇక్కడకు రావటానికి వీలులేదని బెదిరించింది. తనతో సమానంగా నాట్యం చేయమని, ఎవరు గెలిస్తే ఈ ప్రదేశం వారిదవుతుందని శివుడు సవాలు విసిరాడు. ఆ కాళి అంగీకరించి అన్ని విధములైన భంగిమలలోను ఆమె శివునితో సమానంగా నాట్యం చేసింది. చివరకు శివుడు కుడికాలు నిట్ట నిలువుగా పైకెత్తి ఊర్ధ్వతాండవ భంగిమను చూపినపుడు స్త్రీగా ఆ పనిచేయటం ఉచితంకాదని కాళి ఓటమిని అంగీకరించి శివుని కోరికపై శాంతమూర్తిగా మారింది.

ఎడమ కాలు ముందుకు పెట్టి, కుడి చేతిలో కత్తి పట్టుకొంటే, కాళి శ్మశాన కాళి అవుతుంది. ఈ దేవతను శ్మశానంలో కూర్చొని ఉపాసిస్తే చాలా వేగంగా సిద్ధిస్తుంది. రామకృష్ణ పరమహంస, కలకత్తా శ్మశానంలోనే సాధనచేసి కాళీ సాక్షాత్కారాన్ని పొందగలిగాడు. ప్రసిద్ధకాళీ ఉపాసకుడైన 'భృగురామస్వామి' పశ్చిమ బెంగాలు 'వర్ధమాన్' జిల్లాలోని 'బారాబెలూన్' శ్మశానంలో పంచముండి ఆసనాన్ని నెలకొలిపిన తరువాత అక్కడ కాళీపూజ, సాధన చేసే సాధకులు ఎక్కువ అయినారు.

మహాకాళి అంటే పది తలలతో పదికాళ్లతో వివిధ ఆయుధములు ధరించిన పది చేతులతో ప్రకాశించే దేవత. కొన్నిచోట్ల, ఏకముఖంతో రెండు పాదములతో పది చేతులతో విరాజిల్లే మూర్తులు కూడా 'మహాకాళి' పేరుతో ఉన్నవి. చతుర్భుజగా కూడ మహాకాళి కొన్నిచోట్ల వర్ణించబడింది. 'కత్తి, త్రిశూలము, నరుకబడిన తల, ఆ తల నుండి కారిన నెత్తురుతో నిండిన కపాలపాత్ర', ఈ రూపంలో చెప్పబడినవి.

'భద్రకాళి' దక్షిణ దేశంలో ప్రసిద్ధ దేవత. ముఖ్యంగా కేరళలో అత్యధికంగా ఈ దేవతను పూజిస్తారు. నాలుగు, లేక పన్నెండు లేక పద్దెనిమిది చేతులతో వివిధ ఆయుధధారిణియై ముఖమునందు మూడు కన్నులతో నాలుక ముందుకు చాచి శిరస్సునుండి మంటలు విరజిమ్ముతున్నట్లుగా కన్పిస్తుంది. సంస్కృతంలో భద్ర అంటే 'మంచి'. భద్రకాళి అంటే ఒక శాంతదేవతగా, ఒక మహారాణిగా భావిస్తారు. మామూలుగా కాళీ మంత్రంలో 'క్రీం' బీజము. కానీ, కేరళలో ఎక్కువమంది 'గ్లాం' బీజమును ప్రధాన బీజంగా ఉపయోగిస్తున్నారు. ఈమె వీరభద్రుని భార్యగా వర్ణించబడుతున్నది. 'వరంగల్'లో పురాతనమైన భద్రకాళి ఆలయం అత్యంత ప్రఖ్యాతమైనది. ఆంధ్రదేశంలో గోదావరిజిల్లాలో ద్రాక్షారామం దగ్గర ఒక కొండమీద 'పట్టిశం వీరభద్రస్వామి' ఉన్నాడు. దక్షాధ్వర ధ్వంసం తరువాత భద్రకాళితో ఆయన అక్కడ కాపురం పెట్టినట్లు స్కాంద పురాణాంతర్గత 'భీమఖండం'లో ఉంది. శ్రీనాథ మహాకవి ఈ వీరభద్రుని, భద్రకాళీ సమేతంగా రమణీయంగా వర్ణించాడు. సంస్కృతంలో 'భద్ర' శబ్దానికి 'మంచి', 'శుభము' అనే కాక మరో అర్థం కూడా ఉన్నది. 'భ' అంటే 'మాయ', 'ద్ర' అంటే అన్నిటికంటే అధికమైనది అనే అర్థంలో వాడబడే ప్రత్యయం. (ఇంగ్లీషులో చెపితే సూపర్ లేటివ్ డిగ్రీ అన్నమాట). కనుక 'భద్ర' అంటే 'మహామాయ' అని అర్థం.

మార్కండేయ పురాణంలో 'దారుకుడు' అనే రాక్షసుని సంహరించి విశ్వమును దుష్టశక్తుల నుండి రక్షించిన గాథ ఉన్నది. ఇది కేరళలో 'కన్నూరు' జిల్లాలో 'మాదాయి' గ్రామంలో జరిగిందని స్థల పురాణం. రాక్షస సంహారం కోసం ఆమె శివుని మూడవ కన్ను నుండి ఉదయించి ముందుకు దూకిందని, అందుచేత శివపుత్రికగా మళయాళ దేశంలో పూజిస్తారు. ఈమెనే అక్కడ "మళయాళ భగవతి" లేక "మళయాళ భద్రకాళి" అని పిలుస్తారు. ఒక పర్యాయం 'వాసోరిమాల' అనే స్థానిక దేవతకు ఆమెకు విరోధం వచ్చి, ఆ దేవత భద్రకాళిపై స్ఫోటక ప్రయోగం చేసింది. దానివల్ల భద్రకాళి ముఖం మచ్చలు పడింది. దీనిని తొలగించటానికి వీరభద్రుడు ముందుకు రాగా, సోదరుడు సోదరిని తాకకూడదు కనుక వద్దని నివారించింది. దానివల్ల ఆ మచ్చలు నిలిచిపోయి, కొన్ని విగ్రహాలలో ఆ చిహ్నాలు కన్పిస్తున్నవి. భద్రకాళి 'దుర్గాదేవి' కూతురుగా ఆమె 'రక్తబీజ' సంహారం కోసం సృష్టించిన శక్తిగా కొన్ని చోట్ల కన్పిస్తున్నది. ఈమె మహాకాలుడు లేక భైరవుని భార్యగా చెప్పబడుతున్నది.

తమిళదేశంలో శ్రీరంగం దగ్గర, (సమయ పురి) కొద్ది మైళ్ల దూరంలో చాలా ప్రఖ్యాతి చెందిన మహామారి దేవాలయం ఉన్నది. నిత్యము అసంఖ్యాక జనం ఈ దేవతను దర్శిస్తుంటారు. ఈ గ్రామంలో ఊరి బయట విక్రమార్క చక్రవర్తి స్థాపించాడని చెప్పబడే మహాకాళి ఆలయం ఉన్నది. ఆ చక్రవర్తి సమర్పించాడని చెప్పే వస్తువులు కొన్ని అక్కడ ఉన్నవి. ఆ చక్రవర్తి, ఉజ్జయినిలో పూజించిన మహాకాళి, ఆ పేరుతో భారత దేశంలో దేవాలయాలు చాలాచోట్ల ఉన్నవి. సికింద్రాబాదులోని, తిరువనంత పురంలోని ఉజ్జయిని మహాకాళి ఆలయాలు పేర్కొనదగినవి.

తమిళ, మళయాళ రాష్ట్రములలో యుద్ధవిద్యలకు, భద్రకాళి అధిదేవత. ఈవాళ, ప్రపంచంలో జాడో, 'జుజిట్స్', కరాటే మొదలైనవాని వలనే 'కలరిప్పయత్తు' అనే మారణవిద్య కేరళలో ప్రసిద్ధి. అక్కడి 'లోకనర్కవు'లోని భద్రకాళి ఆలయంలో ఈ యుద్ధకళల శిక్షణ బాగా జరుగుతుంది. ఆ కేంద్రానికి 'మళయాళ షావోలిన్ ఆలయం' అని పేరు. ఈ విద్యలు నేర్పే ప్రదేశాలు ఆ రాష్ట్రంలో చాలా ఉన్నవి. వీటన్నింటికి భద్రకాళి అధిదేవత. 'విక్రమార్కుడు', ఆయన సోదరుడు 'భట్టి' ఉజ్జయినిలో భద్రకాళి భక్తులు. వారీదేశంలో ఎన్నో కాళీ ఆలయాలు నిర్మించారని చెప్పబడుతున్నవి. ఆ కాళీదేవి అనుగ్రహం వల్ల వారు సుదీర్ఘకాలం జీవించారని కథలలో ఉన్నది. ఆ చక్రవర్తి ఆస్థానకవి 'కాళిదాసు' ఆ దేవత అనుగ్రహం వల్లనే మహాకవి అయినాడని జగత్ప్రసిద్ధి.

కామాఖ్యకాళి అస్సాంలోని గౌహతిలో ఉన్నది. కామేశ్వరి అయిన 'లలిత' కామునకు అనగా మన్మథునకు పురర్జీవితాన్ని ప్రసాదించినపుడు కృతజ్ఞతగా అతడు పాశాంకుశములు లేని కామదేవతగా ఆమెను ప్రతిష్ఠించాడు. ఊహలకందని కొన్నివేల సంవత్సరాలక్రింద ఆ దేవతను కాళికగా పూజించటం మొదలుబెట్టారు. ఆ చరిత్ర ఇంతకుముందే ఇవ్వబడింది. ఈమెనే 'తారాకాళి' అని కొందరు భావించి గ్రంథములు రచించారు. ఈ మంత్రములు తారామంత్ర సంపుటితములుగా ఉన్నవి. అదే విధంగా 'శ్యామకాళి' అని మరొక పేరు కూడా వినిపిస్తున్నది. 'శ్యామ' అంటే నల్లని అని అర్థము. సుకుమార సుందరమైన ఆకర్షణీయమైన నల్లని రంగుకే 'శ్యామవర్ణం' అంటారు. అలంకారశాస్త్రంలో శ్యామ అంటే 'యవ్వన మధ్యస్థ'. అంటే 30, 40 సంవత్సరాల మధ్య వయస్సు. కలకత్తా ప్రాంతంలో శ్యామకాళి దేవాలయం ఒకటి ఉన్నది. ఇక్కడి మూర్తి లలితంగా, ప్రేమమూర్తిగా ఉంటుంది. బృందావనేశ్వరి అయిన 'రాధాదేవి' పరివారంలో 'శ్యామకాళి' ఉన్నట్లు యమునాతీరగాథలలో ఉన్నది. బృందావనంలో యమునాతీరంలో కాళీ దేవాలయాలు చాలా ఉన్నవి.

రసయోగి, సిద్ధ పురుషులు శ్రీ రాధికాప్రసాద్ మహారాజ్ 103 సంవత్సరాలు, జీవించిన రాధాభక్తుడు. ఆయన రాధాదేవి మందిరాలకు తప్ప ఇతర దేవాలయాలకు వెళ్లటం ఇష్టపడరు. అందుచేతనే గుంటూరులో అవతరించిన, స్వయం సిద్ధి కాళీ పీఠానికి ఆయన రాలేదు. ఒకరోజు ఆయన బృందావనం నుంచి రైలులో గుంటూరు వస్తుండగా

'కాళీదేవి' ఆయనకు కనిపించి "నేను రాధాదేవి సఖినే, నన్ను చూడటానికి రా!" అని చెప్పింది దానితో, వారు కాళీమందిరానికి వచ్చి పూజ చేశారు.

దివ్యక్షేత్రములలో ఒక సంప్రదాయమున్నది. ఆ క్షేత్ర దేవతను దర్శించి పూజించటానికి దేశంలోని ఇతర మహాదేవతలందరూ వస్తుంటారు. ఉదాహరణకు కాశీలో కామాఖ్యకాళి శ్రీశైల మల్లికార్జునస్వామి, కేదారేశ్వరుడు మొదలైన దేవతల గుళ్ళు ఎన్నో ఉన్నవి. అలానే బృందావనంలో కూడా చుట్టూ కొన్ని మైళ్ళ మేర పరిధిలో బదరీనారాయణ కేదారేశ్వరుడు, గంగానది మొదలైన దేవతాస్థానములున్నవి. ఈ విధంగా దేవతలంతా ఒకే క్షేత్రంలో వచ్చి కూర్చుంటే వాళ్ళ స్థానాల సంగతి ఏమిటి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. సమన్వయంగా, పర్వదినాలలో తమ స్వస్థానంలో ఒక కళ నుంచి మిగిలిన 15 కళలతో మహాక్షేత్ర దేవతలను సేవించటానికి వస్తుంటారని పెద్దలు చెపుతుంటారు. కాళీదేవి విషయంలో కూడా ఇలానే చెప్పాల్సి వస్తుంది. కామాఖ్యలో దశ మహావిద్యా దేవతలున్నారు. కాశీలో, కాళీమూర్తులెన్నో ఉన్నవి. వీటన్నింటిని పైన చెప్పిన దృష్టితో గ్రహించాలి.

సామాన్యంగా 'కాళి' అంటే శివుని మీద నిల్చుండిగాని లేక మామూలుగా నిల్చుండిగాని బొమ్మలలో కన్పిస్తుంది. కానీ, కాళీ పురాణంలో సింహవాహనంగా కత్తిని, నీలపద్మాన్ని ధరించినట్లు వర్ణించబడింది. కత్తి దివ్య జ్ఞానానికి చిహ్నంగా, పద్మము శక్తి చిహ్నంగా భావించబడుతున్నవి. కపాలధారిణి అయినపుడు, కపాలం అహంకారానికి చిహ్నంగా, ఖండించబడిన శిరస్సు ఒక రూపం గనుక, అహంకారాన్ని నశింపచేసే ఒక దేవత 'కాళి' అని అర్థం. కాశీలో 'శవ శివ కాళీ మందిరం ప్రసిద్ధమైనది. శవముపై శివునితో పురుషాయితము చేస్తున్నమూర్తిగా ఈ రూపం వర్ణించబడింది. ఈ మందిరంతో, పూర్వజన్మలో స్వామివారికి శిష్యులైనవారు. ఈ జన్మలో నలుగురైదుగురు గుర్తించబడ్డారు. నేపాల్‌లో శివునిపైన వున్న భైరవునితో క్రీడిస్తున్న కాళీ విగ్రహం 18వ శతాబ్దంనాటిది దొరికింది. శివునిలోని రాజసమూర్తి బయటకురాగా, ఆ శక్తి భైరవుడుకాగా ఆ దేవునితో క్రీడిస్తున్నట్లు అభిప్రాయమై ఉంటుంది. 'సర్ జాన్ ఉడ్రఫ్' మొదలైన పండితులు ఒకే చైతన్యం, శివ శక్తులుగా రూపొంది జ్ఞానానికి, శక్తికి చిహ్నంగా నిలిచినవని గుర్తించాలని ఉద్ఘాటించారు.

కాళీదేవికి సంబంధించిన ఇటువంటి విశేషాలు, కొన్నివందల వేల దేవాలయాలు భారతదేశంలోనేకాక, ఇతర దేశాలలో కూడా ప్రతిష్ఠించబడి అక్కడ కాళీదేవి పూజలు అందుకుంటున్నది.

కాళీదేవిని గూర్చి 'యోగవాసిష్ఠము'లో అద్భుతమైన వర్ణనలు ఉన్నవి. ప్రళయకాలంలో రుద్రభైరవుడు నాట్యం చేస్తూంటే, అతని శరీరము నుండి ఒక ఛాయా రూపిణి బయటకు వచ్చింది. అంధకారమయమైన ఆకాశంలో ఈ వినీల రూపిణి ఎలా ఉన్నదో ! ఆశ్చర్యం ! ఇంతలో ఆ ఛాయ నిస్పష్టమైన రూపాన్ని ధరించి, అగ్నిజ్వాలల మధ్య, అతిదీర్ఘ కరాళమూర్తి ప్రకాశించడం మొదలు పెట్టింది. ఆమె వర్ణన చూడండి.

కృష్ణా కృశాశిరాలాఙ్గీ జర్జరా వితతాకృతిః
జ్వాలా కులానలాలోల వనసంభార శేఖరా **–1**
భిన్నాఙ్గ నతమః శ్యామా యామినీ వాకృతిం గతా
తమః శ్రీర్దేహయుక్తేవ సాకారేవామ్బరద్యుతిః **–2**
అతిదీర్ఘా కరాలాస్యా నభో మాతుమివోద్యతా
దీర్ఘజానుభుజ భ్రాన్త్యా మాతు కామేవది జృమ్భమ్ **–3**
కృశా బహూపవాసేవ పరినిమ్నమహోతనుః
కజ్జలశ్యామలా మేఘమారేవ పవనాకురా **–4**
కృశా శక్త్రాయదాస్థాతుం సుదీర్ఘా విధినాతథా
గ్రథితేవ శిరారూపైర్ధామభి ర్దైర్ఘ్యశాలిభిః **–5**

నల్లని రంగుతో కృశించినది, శరీరము మీద నాడులు కనిపించేటట్లుగా శిథిలమైన అవయువములతో, మంటలు చుట్టూ వ్యాపించియుండగా గడ్డకట్టిన కాటుకవలె, రూపముదాల్చిన బహుళపక్షనిశవలె ప్రకాశిస్తున్న ఆ దేవత శిరస్సును, కాలిగోళ్ళను చూడాలంటే క్రిందికి, పైకి ఆకాశంలో ప్రయాణం చేయాలి. ఆమె నాట్యం చేస్తూంటే ఒంటికాలి మీద ఆడుతున్నదా! అని ఒక క్షణం అనిపిస్తుంది. మరుక్షణంలో వందల కాళ్ళతో నర్తిస్తున్నదా ! అని భాసిస్తున్నది. ఇంకోక్షణం అసలు పాదములే లేవా అని కూడా అనిపిస్తున్నది. అలానే కొంతసేపు ఒకే ముఖముతో, మరికొంతసేపు అనేక ముఖములతో, అలానే వివిధ సంఖ్యాకములైన చేతులతో ప్రకాశిస్తున్నది. అత్యంత భయంకరమైన ఆ మూర్తిని 'కాళరాత్రి' అని 'కాళీభగవతి' అని విబుధులు నిశ్చయించారు. ఆమె ఆవేశంతో నృత్యం చేస్తున్నకొద్దీ, శరీరము పెరిగిపోతున్నది. ఆమె నిశ్వాసముల తీవ్రతకు మేరుపర్వతాదులే ఎగిరిపోయేటట్లున్నవి. మలయ, కైలాస, సహ్య, మందర, మేరు పర్వతములు ఆమె కంఠమున వ్రేలాడుచున్న మాలవలే ఉన్నవి. హిమాలయ, సుమేరు పర్వతాలు ఆమె కర్ణములకు రజత, సువర్ణ ఆభరణములై విలసిల్లుచున్నవి. మూడు లోకములు ఆమె జంఘలపై, ఉదరముపై, కంఠముపై మణిమయములైన ఆభరణములవలె ప్రకాశిస్తున్నవి. బ్రహ్మాండములు ఆమె నడుమునకు కట్టిన మేఖలవలె చెలువందుచున్నవి. ఆమె శరీరములోని వివిధావయములలో పురములు, కాలములు ఎలా ప్రకాశిస్తున్నవో చూడండి

తీస్యా అఙ్గేషు దృష్టాని పురాణి నగరాణి చ
ఋతవశ్చ త్రయో లోకా మాసాహోరాత్రమాలికాః
ముక్తాలతాదికం నద్యః కాలిన్దీ త్రిపథాదికాః
ధర్మాధర్మావుభౌ కర్ణభూషణే చాన్యకర్ణయోః
స్తనాస్తస్యాస్తు చత్వారః స్రవద్ధర్మపయోలవాః

వేదాః సకలశాస్త్రార్థ చతుః సంస్థానచూచుకాః
త్రిశూలైః పట్టిశైః ప్రాసైః శరశక్త్యల ష్టిముద్గలైః
నిర్యదాయుధ జాలానిస్రగ్దా మాని బిభర్తిసా
చతుర్దశవిధా భూతజాతయోయాః సురాదికాః
తస్యాః శరీరశాలిన్యాస్తా లోమావలయః స్థితాః

నగరములు, గ్రామములు, ఋతువులు, నేలలు రాత్రింబవళ్లు ముల్లోకములు ఆమె అంగములందు చెన్నొందుచున్నవి. గంగా, యమున మొదలైన నదులు ఆమె మెడలో ముత్యాలహారములై ఉన్నవి. ధర్మాధర్మములు రెండూ ఆమె కర్ణ భూషణములు. వేదములామె స్తనములు, త్రిశూల, పట్టిస ప్రాశ, శర, శక్త్యాది ఆయుధములతో ఆమె విరాజిల్లుతున్నది. పదునాలుగు విధములైన దేవతలు మొదలగు ప్రాణి జాతులు ఆమె రోమములు ఆమె నాట్యం చేస్తూంటే సమస్త స్థావర జంగములు నాట్యం చేస్తున్నట్లున్నవి.

శ్లో. నానా విభవ విజ్ఞానయజ్ఞయజ్ఞోపవీతినీ
సాసరన్తినభస్యాసీత్ ఘనఘూత్కారఘోషిణీ.

కర్మఫలరూపములైన వైభవాలు వాటిని అనుష్ఠించటానికి కావలసిన విజ్ఞానములు వాని క్రియా రూపములైన యజ్ఞములు, ఈ మూడు సూత్రములతో కూడిన యజ్ఞోపవీతం ధరించి, కాళీదేవి నాట్యం చేస్తూంటే, వేదఘోష చేసే బ్రహ్మచారిణిలాగా ప్రకాశిస్తున్నది. (దీనిని బట్టి ఆదికాలంలో స్త్రీలకు కూడా ఉపనయనము, వేదాధ్యయనము ఉండేవని గ్రహించవచ్చు.)

ఆమె శరీరం అనే సరోవరంలో సమస్త ద్వీపములు గడ్డిపరకలవలె, సముద్రములు సుడులవలె స్వర్గాదులు పద్మమువలె భాసిస్తున్నవి. ఆమె శరీరంలో వింధ్యపర్వతము మొదలైనవి.

విన్ధ్యోన్నత్యతి కాఞ్చనాచలవనే సహ్యశ్చ సహ్యోగిరిః
కైలాసో మలయో మహేన్ద్ర శిఖరీ క్రౌఞ్చలయో మన్దరః
గోకర్ణో గగనాఙ్గణే వసుమతీ విద్యాధరణాం పురం
సర్వేజంగమతాం గతా వనభువన్తస్యాః శరీరే సదా.
అబ్ధిర్నృత్యతి పర్వతే గిరిరపి ప్రోచ్చైర్నభః కోటరే
వ్యోమా పీన్దు దివాకరైః క్వ చలితం భూమేరధస్తాద్గతమ్
సద్వీపాచలపత్తనో వనగణః ప్రోత్కీర్ణ పుష్పోదివి
వ్యాలోలం జగదమ్బుధావివతృణం దిక్చక్రకే భ్రామ్యతి.

మేరు పర్వతవనంలో వింధ్య పర్వతం నాట్యం చేస్తూంటే, దానిని సహింప లేక కైలాస, మలయ, మహేంద్ర, క్రౌంచ, మందర, గోకర్ణాది శైలములు తాండవం చేయటం మొదలుపెట్టినవి. వానిని చూచి విద్యాధరాదుల పురములు మొదలైనవన్నీ జంగమములైనవి.

ఇంకా ఆశ్చర్యమేమిటంటే సముద్రాలు పర్వతాల మీద నాట్యం చేస్తున్నవి. కొండలేమో మహాకాశమనే పెద్ద గొయ్యిలో ఎగురుతున్నవి. సూర్యచంద్రాదులతోసహా ఆకాశం, భూమి క్రిందికి ఎక్కడకోపోయింది.

భోవోద్భవస్థితి విపత్కరణ భ్రమణాం
సంహార సర్గ భువనావని విభ్రమాణామ్
మిథ్యైవ ఖేప్రకచతాం ఖశరీరకాణాం
సంలక్ష్యతే-త్ర మనాగపి నామసంఖ్యా.

ఆ పరమేశ్వరి శరీరంలో మూడులోకాలూ అటూ ఇటూ పొర్లాడుతూ 'ఝణఝణ' శబ్దం చేసే మణులలాగా ఉన్నవి. ఝుంకార శబ్దం చేస్తూ పైకి క్రిందకి కదులుతున్న ఆభరణాలలాగా తైజసములైన సూర్యాది పదార్థములు వెలుగుచున్నవి.

బ్రహ్మేన్ద్ర విష్ణుహర వహ్ని రలీన్దు పూర్వా
దేవాసురాః పరివివృత్తిభిరా తపన్తః
అన్యేఽన్య ఏవవివిధా ఉపయాన్తియాన్తి
వాతావధూతమశకాశని విభ్రమేణ

బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, ఇంద్రుడు, అగ్ని, సూర్య, చంద్రులు మొదలైన దేవతలు ఇంకా ఇతరులెందరో ఆమె శరీరంలో నుండి బయటకు వస్తూ లోపలకు పోతూ గాలికి కొట్టుకుపోయే మశకములవలె పరిభ్రమిస్తున్నారు.

ఈ విధంగా కాళీదేవి యొక్క వర్ణన చూస్తుంటే 'భగవద్గీత'లో కృష్ణుడు విశ్వరూపాన్ని చూపించిన ఘట్టం కంటే కూడా ఎన్నోరెట్లు అద్భుతంగా ప్రకాశిస్తున్నది. దేవతాపరమైన వర్ణనలో ఇటువంటిది మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. కాళీదేవి ఆదిశక్తి అన్ని సృష్టి స్థితి లయములన్నీ ఆమె ఇచ్ఛానుసారంగా జరుగుతుంటాయని ఆమెను మించిన మరొక దేవత లేదని 'యోగవాసిష్టము' నిర్ధారణగా తెలియచేస్తున్నది.

కామాఖ్యాస్తుతి

నమస్తే నీలశైలస్థే ! యోని పీఠనివాసిని !
భద్రకాళి ! మహాకాళి ! కామాఖ్యే ! కామసుందరి !
ఇహావతరకళ్యాణి ! కామరూపిణి ! కామిని !
కామేశ్వరి ! మహామాయే ! ప్రాగ్జ్యోతిషపురేశ్వరి !
భగలింగే ! భగాకారే ! భగమాలే ! భగేశ్వరి !
భగదాయిని ! భవ్యాంగి ! భద్రకాళి ! నమోఽ స్తుతే.
ఆనందభైరవస్వామి ప్రాణేశ్వరి ! రతిప్రియే !
రసికే ! రసికారాధ్యే ! వీరే ! వీరపథాశ్రితే !
కామే ! కామకళారూపే! కదంబవనవాసిని !
కామాక్షి ! కామసౌందర్యే ! కరుణావరుణాలయే
నీలోత్పలదళశ్యామే ! నీలాచలనివాసిని !
ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తి ప్రదాయిని ! మహేశ్వరి !
యోనికుండ మహాజ్వాలే ! యోనియంత్ర విలాసిని !
హోమప్రియే ! మహాదేవి ! తారామంత్ర ప్రకాశిని !
దర్శనం దేహికామేశి ! స్పర్శనం దేహి కామిని !
అభీష్టం దేహి కామాఖ్యే ! తారాకాళి ! నమో నమః

కామకాళి

గుండెవనమ్ములోన నొక కోవెల గట్టితి దానిలోపలన్
నిండిన పూలతావులను - నిల్పితి - సుందరకామకాళికన్
మెండగు పండువెన్నెలల మేల్కొని యుంటిని దేవిరాకకై
ఖండశశాంకమౌళియయి కామితదాయినియై కిశోర మా
ర్తాండ మనోజ్ఞ దీధితివిరాజితయై భువనాధినాయకా
ఖండల మౌళి విస్ఫురిత క్రమ కిరీట మణి ప్రసార రు
జ్మండల వర్ధమాన సుషమాసుకుమార పదాంబుజాతయై
అండజయానయై దిగిన ఆదిమశక్తికి అంజలించెదన్.

కాళికాదేవి



విషయ సూచిక

		పేజి
	ప్రవేశిక	18
1.	కాళీ స్తోత్రము	19
2.	పదాంజలి	20
3.	కాళి – అవతరణ	21
4.	కాళిదాసు	23
5.	తెనాలి రామలింగడు	24
6.	కామాఖ్యా కాళి	24
7.	ఉజ్జయినీ కాళి	27
8.	గుంటూరు కాళి	29
9.	రామకాళి	30
10.	నాథ యోగులు	30
11.	జడభరతుడు	31
12.	విష్ణుకాళి (కామాఖ్య కథ)	33
13.	రజస్వలా కాళి	34
14.	ఎ) కామాఖ్య కాళి	35
	బి) శక్తిపీఠములు	47
15.	కామాఖ్యా మంత్రసాధన	50
16.	రజస్వలా సాధన	52
17.	శత్రువినాశనాది ప్రక్రియలు	52
	మరొక ప్రయోగము	53
	వేరొక ప్రయోగము	54
18.	నరకుని కథ	59
19.	త్రైలింగ స్వామి	73
20.	కీనారం అఘోరి	95

21. రామప్రసాద్ 104
22. రామకృష్ణ పరమహంస 115
23. నాగమహాశయుడు 136
24. ఆనందమాయి 140
25. అన్నదా ఠాకూర్ 145
26. ఎల్లమ్మ కాళి 150
27. పాపయారాధ్యులు 150
28. భైరవీ బ్రాహ్మణి 151
29. సిద్ధేశ్వరానందభారతీస్వామి 172
30. కాళి నమస్తే 189
కాళీ సాధన 194
యోగులు, సూక్ష్మశరీరులు 197
31. రత్నప్రభ 206
32. కాళీ సహస్రనామావళి 223
33. కాళీ అష్టోత్తర శతనామావళి 242
34. కర్పూరాంబా స్తోత్రము 244
35. కాళీ స్తోత్రము 246
36. కాళీ కవచము 248
37. కాళీ హృదయము 251
38. కాళీ మాలా స్తోత్రము 253
39. దక్షిణ కాళీ కవచము (భైరవ ప్రోక్తము).. 254
40. కాళీ కవచము (కామాఖ్యా ప్రోక్తము).. 257
41. కాళీ ఉపనిషత్ 258
42. కాళీ సూక్తము 259
43. కాళీ సహస్రనామములు 261
44. కాళీ మంత్రములు 276
దక్షిణ కాళి 276
మహా కాళి 277
శ్యామ కాళి 277
భద్ర కాళి 277

	శ్మశాన కాళి	278
	కాల కాళి	278
	సిద్ధ కాళి	278
	గుహ్య కాళి	278
	భైరవ కాళి	278
	రక్త కాళి	278
	ఊర్ధ్వ కాళి	278
	కాళరాత్రి	278
	అగ్ని స్తంభన కాళి	279
	కపాల కాళి	279
	వివిధ కాళీమంత్రములు	279
	కాళీ గాయత్రి	279
	కాళీ పూజావిధి	280
	ప్రాణప్రతిష్ఠా మంత్రము	281
	మానవీ పూజ	288
45.	గంధర్వ గీతి	291
46.	పురాతన కాళీ స్తవము	330
47.	ఉజ్జయినీ కాళి	332
48.	కలకత్తా కాళి	333
49.	శ్రీశైల కాళి	333
50.	దక్షిణేశ్వర కాళి	333
51.	ఢిల్లీ కాళి	333
52.	బృందావన కాళి	333
53.	స్వయంభూ కాళి	334
54.	కాళీ గీతము	336
55.	దిగివచ్చిన కాళి	338
56.	కాళిని చూడాలి	340
57.	ఎ) కాళీ మంగళహారతి	340
	బి) జయజయ కాళి	341



సిద్ధేశ్వరానంద భారతీస్వామి

ప్రవేశిక

బృందావన ధామమ్మున వికసించిన కడిమిపూవు
కామాఖ్యా కాళిగుడిని కలకలమని హసియించెను
కాశీ క్షేత్రమ్ము నేలు కాలభైరవుడు పిలువగ
పరుగులెత్తి పదములపై వ్రాలిపోయె ననురక్తిని.

ఇది నా జీవిత గమనం – బృందావనం, కామాఖ్య, కాశీ ఈ క్షేత్రాలతో అనుబంధం ప్రతిజన్మలోనూ. అపుడపుడు కుర్తాళం – ఇంకా ఇతర ప్రదేశాలు – ఇతర దేశాలు. ఎందరు జీవులతోనో ఆత్మీయత – ఎందరో దేవతల, సిద్ధుల కరుణ. ఇలా సాగుతున్న ఈ ప్రయాణంలో ఇప్పుడున్న దొక మజిలీ. నాతో పాటు కొన్ని వందల వేలయేండ్ల నుండి కొందరు పరమాప్తులుగా, శిష్యులుగా కలసివస్తున్నారు. నావల్ల పూర్వ బంధాలు గుర్తుతెచ్చుకొంటున్నారు. ఆ వివరాలు కొన్ని కుర్తాళయోగులు, బృందావన యోగులు – అనే గ్రంథాలలో తెలియజేశాను.

ఇప్పుడు వెలువరిస్తున్న రచన "కాళీ సిద్ధులు" అనే పుస్తకం. కాళీదేవిని గూర్చి, కాళీ భక్తులను గూర్చి పౌరాణిక, చారిత్రక గాథలు ఇందులో ఉల్లేఖించబడినవి. నావి, నాతో వస్తున్న జన్మాంతర బంధువులవి కొన్ని విశేషాలు ఈ గ్రంథంలో చెప్పటం జరిగింది. తెలిసిన వానిలో చెప్పదగినవి ఇందులో చోటుచేసుకొన్నవి. ఇక పూజా తంత్ర సాధనలు సాధకులకు అవసరం గనుక వాటిని వ్రాయటం జరిగింది.

విజయవాడ వాస్తవ్యులు శ్రీ ఇమ్మడిశెట్టి రామకుమార్‌గారు ధర్మపత్ని శ్రీమతి యశోదాదేవిగార్లు, కుమారుడు చి॥ నాగ సుకుమార్, కోడలు దివ్య, మనవడు రితేష్, కుమార్తె చి॥ నాగసాయి సౌందర్య, అల్లుడు చి॥ టి. నాగవీర వెంకటేశ్వరరావులు నాకు చిరకాల భక్తులు. చాలా కాలం నుండి నా నుండి ఒక గ్రంథం అచ్చు వేయించాలని శ్రీ రామకుమార్‌గారి అభ్యర్థన. ఇప్పటికది సమకూడింది. ఈ భక్తుని, పైన చెప్పబడిన వారిని, బృందావనేశ్వరి శ్రీరాధాదేవి, జగదీశ్వరి కాళీమాత రక్షించి వారికి అభీష్టసిద్ధిని ప్రసాదింతురు గాక ! ఆధ్యాత్మిక మార్గీయులైన వీరిలో దివ్యచైతన్యము వికసించి పరమేశ్వరి అనుగ్రహము లభించును గాక !

కుర్తాళం
17.01.2015.

సిద్ధేశ్వరానంద భారతీస్వామి

కాళీ సిద్ధులు

1. కాళీస్తోత్రము

నీలాశ్మద్యుతిభాసినీం అరుణహాసోద్యన్ముఖోల్లాసినీం
శూలాద్యాయుధధారిణీం ప్రళయకాలోద్భూత విద్రావిణీం
నిద్రాముద్రిత విష్ణుజాగరణ కార్యార్థస్తుతాం బ్రహ్మణా
సంహర్తుం మధుకైటభౌ సముదితాం సేవే మహాకాళికాం

రక్తేనారుణ జిహ్వికాం త్రిణయనాం దంష్ట్రాకరాళాననాం
ముండీకర్పర శూలఖడ్గ విలసత్ హస్తాం నృమస్తస్రజాం
కాంచీభూషిత నిర్గతాసుకరమాలా లోల మధ్యోజ్వలాం
దేవీ మాశ్రితవత్సలాం సకరుణాం సేవే మహాకాళికాం.

తారా ఖడ్గధరీ ప్రచండ మహిమా శ్రీ ఛిన్నమస్తా శివా
విశ్వాత్మా భువనేశ్వరీ మునినుతా మాతంగినీ సుందరీ
దేవేశీ కమలాత్మికా చ బగళా ధూమావతీ భైరవీ
పాయా న్మాం పరమేశ్వరీ దశమహావిద్యాత్మికా కాళికా

జ్వాలాజాలజటాలినీ రిపుమనోఝంఝామరుద్రూపిణీ
క్రోధాగ్నిజ్వల దారుణీ రుధిరపానాసక్తి విస్తారిణీ
కాలక్షోభహరీ కఠోరముఖరీ కంకాళమాలాధరీ
నీలాంభోధరమాలికా విలసితా మాతామహాకాళికా

అగ్నిర్భూమితలే రవిస్సురపథే మేఘాంతరేచంచలా
విశ్వవ్యాప్తపదావిచిత్ర సుషమా విద్యోతితా విశ్రుతా
క్రీడా నిర్మిత విస్తృ తాద్భుతకథా కృష్ణత్వ విభ్రాజితా
భవ్యాధర్వణమంత్రతంత్ర విదితా మాతా మహాకాళికా.

క్రోధావేశముఖీం మహేశ్వరసఖీం చండీం ప్రచండ ప్రభాం
హూంకారానల దగ్ధ శత్రునికరాం క్రీంకారవిస్ఫూర్జితాం
దిగ్వస్త్రాం ప్రళయాగ్నిసన్నిభశిఖాం రుజ్మండలీమండితాం
విద్యుద్వి స్ఫురదుగ్రశక్తిలహరీం సేవే మహాకాళికాం.

శక్తినాం అధినాయికాం సురగణైస్సిద్ధైస్సమారాధితాం
మాయానాంచమహేశ్వరీం మదమయీం మాహేశ లీలాసఖీం
చండీం మాహిషమర్దినీం బలయుతాం శుంభాదిదైత్యార్దినీం
దేవీందేవపథస్ఫురత్పదయుగాం సేవే మహాకాళికాం

కాలాహీంద్రఫణామణిద్యుతిశిరః కోటీరముగ్ధామరాం
జీమూతాద్భుత దివ్యదేహ విదితాం శ్రీకంఠ దేహస్థితాం
క్రూరాహంకృతి ఘోరహుంకృతి రిపుస్త్రీకంఠ సూత్రచ్ఛిదాం
హస్తాలంకృతమస్తకాం వివసనాం సేవే మహాకాళికాం

కల్పాంతానల కాంతిమండల యుతాం కారుణ్య విస్ఫూర్జితాం
భూతప్రేతపిశాచ రాక్షస మహాబేతాళ భీతిప్రదాం
మూలాధార భుజంగ జాగృతి కరీం షట్చక్ర సంచారిణీం
శీర్షేరత్న కిరీటినీం శివసఖీం సేవే మహాకాళికాం.

2. పదాంజలి

నలువ పూజించిన నడిమింటి చెలువ
సృష్టికి ముందర చెలువొందు చెలువ
మునిమనస్సరసి పూచిన నల్లకలువ
వలువయేలేని ఆ చెలువకే విలువ
ఆనందరసకేళి ఆ శ్యామ కాళి
పదముల వ్రాలెద వలపు విరాళి

తోచిన వాక్కుముందునకు త్రోయగ అంజలి పట్టి భక్తితో
పూచిన ప్రేమపుష్పముల పూజ యొనర్చెద కాళిపేర నీ
లాచల యోనిపీఠమున అద్భుత సుందర కామదేవిగా
లేచిన చెల్వకున్ హిమగిరిన్ వికసించిన నల్ల కల్వకున్

నా చిరకాలవాంఛితము నా హృదయేశ్వరి శ్యామకాళికిన్
పూచిన మల్లెపూపొదల పున్నమివెన్నెల సూర్యపుత్రికా
వీచికలూగ పాటవినిపింపగ – దానిని దీర్చినట్టి నీ
లాచల సుందరిన్ గొలుతు అద్భుతరాగసుధారసేశ్వరిన్.

చల్లని తల్లి ప్రేమరససౌధవనాంతరమల్లి వేదనా
దోల్లసిత ప్రభావ సుమహోదయకాంతిమతీమతల్లి చిత్
పల్లవ సిద్ధయోగ సుమభక్తి ఫలాశ్రయ కల్పవల్లి మా
నల్లని తల్లి కాళి కరుణామయి పాదములాశ్రయించెదన్.

మందార వారుణీ మదిరామదంబుచే
నృత్యంబు గావించు నిర్మలాంగి
ఘనచితాతల్పాన కాలకాలునితోడ
పురుషాయితము సేయు పూవుబోడి
వీరమార్గమనస్వి ప్రేమతో పిలువంగ
దివినుండి దిగివచ్చు భువననేత్రి
కనులు మూడింటిలో కరుణను కురిపించి
తపసుల గాచు వాత్సల్యమూర్తి

హిమగిరిని – ఆరు వందల యేండ్ల క్రింద
నా తపము మెచ్చి అవతరణమ్ము నొంది
నేను జన్మలు మారినన్ విడువకుండ
చేరవచ్చిన కాళిని కోరి కొలతు

జంతువులందు నెందు నరజన్మము దుర్లభమందు నింక జ
న్మాంతర సంస్కృతుల్ కలుగు టద్భుత మందును దేవి నిత్యమున్
చెంతను నిల్చి కాచుట విశేషము నన్నటు ప్రోచు నా లలా
టంతపకాంత – కాళిక – కటాక్షము నెప్పుడు సంస్మరించెదన్.

3. కాళి - అవతరణ

దశమహావిద్యలో కాళి మొదటిది. కాల శబ్దము యొక్క స్త్రీలింగ రూపము కాళి. మహాకాళుని శక్తిగా, లయకారిణిగా, సంహారస్వరూపిణిగా, ఋషులామెను భావించారు. వేదములలో కూడా కాళీ విద్య మంత్రరూపంగా భాసిస్తున్నది. కాళీదేవి అవతరణను గూర్చి పురాణాలలో ఎన్నో కథలున్నవి.

చండీ సప్తశతిలో శుంభనిశుంభవధ సందర్భంగా ఆ రాక్షసరాజుల సేనాపతులలో ఒకడైన రక్తబీజుడు భయంకరంగా యుద్ధం చేస్తున్నాడు. సింహవాహిని యైన దుర్గ వాని మీదకి బహువిధాలైన ఆయుధాలను ప్రయోగించింది. ఏ ఆయుధం కొస తగిలినా వాని శరీరానికి గాయమై కారిన నెత్తురు చుక్కలలో నుండి వందల వేలమంది రక్తబీజులు పుట్టుక వచ్చి యుద్ధం చేస్తున్నారు. ఎటుచూచినా రక్తబీజులే. వాడిని చంపాలంటే నెత్తురు నేల మీద పడకుండా చెయ్యాలి. దానికోసం దుర్గాదేవి శరీరంలో నుండి భీషణ మూర్తియైన కాళిక ఉదయించింది. ఆమె తన పొడవాటి నాలుకను నేలపై పరచి క్రిందపడకుండా రక్తబీజుని రక్తాన్ని తాగి వేసేది. మదమత్తుడైన రక్తబీజుడు సంహరింపబడ్డాడు. ఆ కాళిక శత్రుసంహారమూర్తిగా అనాటి నుండి లోకంలో ఆరాధింపబడుతున్నది.

మరొక కథ సృష్టి ప్రారంభంలో మహావిష్ణువు నాభికమలం నుండి బ్రహ్మ ఉదయించాడు. ఆ విష్ణువు నిద్రావశుడై ఉండగా ఆయన చెవిలోని గువిలి నుండి పుట్టిన మధుకైటభ రాక్షసులు బ్రహ్మను బాధించటం మొదలు పెట్టారు. బ్రహ్మవారి నేమీ చేయలేక మహా విష్ణువును నిద్రలేపటానికి, ప్రయత్నించి విఫలుడై మహామాయయైన కాలస్వరూపిణిని స్తుతించాడు. అప్పుడు మహాకాళి అవతరించి విష్ణువును నిద్రలేపింది. శ్రీహరి రాక్షసులను యుద్ధంచేసి చంపాడు. ఆవిధంగా తన మాయావశుడైన విష్ణువునకు జాగృతి కల్గించినది, రాక్షస సంహారానికి శక్తి నిచ్చినది. ఈ దేవతయే – ఈమెయే మహాకాళి అని చెప్పబడుతున్నది.

ఇంకొక కథ. మహాప్రళయవేళ సంహారశక్తియైన కాళి మహాతాండవం చేస్తున్నది. ఆమె పాదఘాతములకు సర్వగోళములు సమస్తలోకములు దద్దరిల్లి పోతున్నవి దిక్పాలకులు దేవతలు భయభ్రాంతులైనారు. అప్పుడు పరమశివుడు లోక రక్షణార్థమై ముందుకు వచ్చి దేవీ! ప్రళయతాండవం చేస్తున్న నీ పాద ఘట్టనకు సమస్త బ్రహ్మాండములు కదిలి కల్లోలితమౌతున్నవి. అవి ఇంక తట్టుకోజాలవు. ఇదిగో నా శరీరాన్ని నీకు సమర్పిస్తున్నాను ఈ దేహం పైనే కాలు మోపు అన్నాడు శివుడు. ఆ మహేశ్వరుని మాట నంగీకరించి కాళి శివునిపై నిలుచున్నది. ఆనాటి నుండి కాళి శివారూఢయైంది. ఆమె వర్ణన చూడండి.

శివారూఢాం మహాభీమాం ఘోర దంష్ట్రాం హసన్ముఖీం
చతుర్భుజాం ఖడ్గ ముండ వరాభయకరాం శివాం
ముండమాలా ధరాం దేవీం లలజ్జిహ్వాం దిగంబరాం
ఏవం సంచితయేత్ కాళీం శ్మశానాలయవాసినీం

కాళీదేవికి తంత్రగ్రంథాలలో ఎన్నో రూపాలు చెప్పబడ్డవి. ప్రధానంగా దంష్ట్రాకరాళ వదనము, ముండమాలా ధారణం, చాపిన నాలుక, దిగంబరత్వము, సామాన్య లక్షణాలు. చేతుల సంఖ్య ఆయుధాల తీరు వివిధ రూపాలల్లో భిన్నంగా ఉన్నవి. కర్పూరాది స్తోత్రంలో మహాకాళుడు వర్ణించిన రూపం చూడండి.

గతాసూనాం బాహు ప్రకరకృత కాంచీపరిలసన్
నితంబాం దిగ్వస్త్రాం త్రిభువన విధాత్రీం త్రిణయనాం
శ్మశానస్థే తల్పే శవహృది మహాకాళ సురత
ప్రసక్తాం త్వాం ధ్యాయన్ జపతి జడచేతా అపి కవిః

నడుము చుట్టూ హతులైన వారిచేతుల మాలలు ధరించి దిగంబరయై మూడుకన్నులతో ప్రకాశిస్తూ శ్మశానము నందు శవతల్పము పై మహాకాళునితో రతిక్రీడ చేయుచున్న నిన్ను ధ్యానిస్తూ జపం చేసేవాళ్ళు ఎంత జడుడైనా మహాకవి ఔతాడు. పగటివేళ హవిష్యము తీసుకుంటూ దక్షిణాచారపరుడై అర్చన చేసి రాత్రి వేళ దిగంబరుడై కామరతుడై సాధన చేయాలని దీనిలో చెప్పబడింది.

శ్లో॥ వశీలక్షం మంత్రం ప్రజపతి హవిష్యాశనరతో
దివామాత ర్యుష్మచ్చరణ యుగళ ధ్యాననిరతః
పరం నక్తం నగ్నో నిధువన వినోదేన చ మనుం
జనోలక్షం సమ్యక్ స్మరహర సమానః క్షితితలే

బహు విధములైన జంతువులను బలియిచ్చి దేవిని సంతృప్తిపరచాలని ఇతడు చెప్పిన వైనం కనిపించింది.

శ్లో॥ సలోమాస్థి స్వైరం పలలమపి మార్జారమపితే
పరంచోష్ట్రం మేషం నరమహిషయోశ్ఛాగమపివా
బలింతే పూజాయామపి వితరతాం గోత్రవసతాం
సతాం సిద్ధిస్సర్వా ప్రతిపద మపూర్వా ప్రభవతి

ఇటువంటి శ్మశాన సాధనలు కామమార్గ సాధనలు కాళీ తంత్రములలో చెప్పబడినవి. వీటిలో బలులకు చాలా ప్రాధాన్యం ఇవ్వబడింది. సుప్రసిద్ధమైన కాళిదాస అశ్వధాటీ స్తోత్రంలో కూడా కాళీ నామంతో ఒక శ్లోకం ఉన్నది చూడండి.

శ్లో॥ ఆళీభిరాత్తతను రాళీలసత్ప్రియ కపాలీషుఖేలతి భయ
వ్యాళీ నకుల్యసితచూళీభరా చరణ ధూళీలసన్మునివరా!
బాలీభృతి శ్రవసి తాళీదళం వహతి యాలీక శోభితిలకా
సాஉళీకరోతు మమ కాళీమనః స్వపద నాళీకసేవనవిధౌ

4. కాళిదాసు

కాళిదాసన్న పేరు రావటానికి చిత్రమైన కథ విన్పిస్తున్నది. ఒక రాజునకు అందమైన కుమార్తె ఉన్నది. ఆ రాజుగారి ప్రధాన మంత్రి తన కుమారునకు ఆ అమ్మాయిని చేసుకోవాలని ఆశించాడు. రాజు అంగీకరించలేదు. కోపం తెచ్చుకొన్న మంత్రి ఒక అమాయకుడు మూర్ఖుడు అయిన పిల్లవానికి రాజు వేషం వేసి, రాజ కుమారుడని నమ్మబల్కి వాడితో రాజకుమారి పెళ్ళి చేయించాడు. రాత్రి శయ్యాగృహంలో రాజకుమారి విషయాన్ని గ్రహించింది. విద్యాహీనుడైన ఆ యువకుడు సత్స్వభావుడని తెలుసుకొని అతని నెలాగైనా విద్యా వేత్తను చేయాలని ఆలోచించి ఒక పథకం వేసింది. తమ ఉజ్జయినిలోని మహాకాళి ప్రసిద్ధదేవత. ఆమె అనుగ్రహాన్ని పొందేమార్గం అతనికి చెప్పింది. ఆమె చెప్పిన పద్ధతి ప్రకారం మర్నాడు రాత్రి అతడు మహాకాళీ ఆలయానికి వెళ్ళాడు. అమ్మవారు రాత్రి సంచారం కోసం బయటకు వెళ్ళింది. ఆమె దూరంగా వెళ్ళిన తర్వాత ఇతడు లోపలికి వెళ్ళి తలుపు గడియ వేసికొని కూర్చున్నాడు. తెల్లవారు ఝామున తిరిగి వచ్చిన కాళీదేవి– తలుపులు వేసి ఉండటం చేత గర్భగుడిలోకి ప్రవేశించ లేకపోయింది. తలుపుతీయమని లోపల యువకుని ఆజ్ఞాపించింది. తనకు విద్యనిస్తే తలుపు తీస్తానన్నాడు. ఎంత చెప్పినా వినని ఆ మూర్ఖుని పై దయకలిగి

ఆమె లోపలకు పోవాలంటే వాడు తలుపు తీయాలి గనుక తలుపుకున్న చిన్న సందు దగ్గర వానిని నాలుక చాపమన్నది. తనవేలు, ఆ తలుపు కంతలో జొనిపి వాడి నాలుకపై వాగ్బీజాన్ని వ్రాసింది మహాకాళి. దాని ప్రభావం వల్ల అతడు మహాకవియై కాళిదాసన్న పేరుతో విఖ్యాతుడైనాడు. కాళీదేవి బయటకు సంచారానికి వెళ్ళట మేమిటి? తిరిగి వస్తే తలుపులు వేసి ఉన్నంత మాత్రాన లోపలికి ప్రవేశింప లేక పోవడమేమిటి? ఈ తలుపులు ఆమెకు అడ్డమౌతాయా? ఆమెది స్థూల పాంచభౌతిక శరీరమా? ఇటువంటి ప్రశ్నలు కథ విన్నవారికి రావటం సహజం, ఇటువంటి వాటిలో కథను కథగా తీసుకోవాలే కాని ప్రశ్నలు వేసి ప్రయోజనం లేదు.

5. తెనాలి రామలింగడు

సంస్కృత సాహిత్యంలో కాళిదాసును గూర్చిన కథలు ఎలా వ్యాపించినవో తెలుగులో తెనాలి రామలింగని గురించి కూడా అటువంటి కథలే వినబడుతున్నవి. రామలింగడు కాళిని గూర్చి తపస్సు చేశాడు. అతని సాధనకు మెచ్చి ఆమె ప్రత్యక్షమై రెండు చేతులలో రెండు పాత్రలు ధరించి ఒకదానిలో పెరుగు ఒకదానిలో పాలు ఉన్నవి, ఒకటి విద్యను మరొకటి ఐశ్వర్యాన్ని ఇస్తుంది వీటిలో ఏదో ఒకదానిని తీసుకో అన్నదట. రామలింగడు అమ్మా! రెండు నా చేతికివ్వు చూచి ఎన్నిక చేసుకుంటాను అన్నాడు. ఆమె రెండు పాత్రలు ఇతని చేతికిచ్చింది. రెండూ పట్టుకొని కలిపి గటగట త్రాగివేశాడు. దేవి కుపితురాలైంది. అతడు ఆమెను స్తోత్రం చేస్తూ తల్లీ! చదువుండి సంపద లేకపోయినా, సంపద ఉండి చదువు లేక పోయినా ఈ లోకంలో పూర్ణ సుఖం ఉండదు. కనుక రెండూ తీసుకొన్నాను క్షమించవలసింది అన్నాడు. కాళీదేవి నవ్వి నీవు వికటకవివి అగుదువుగాక! అన్నదట. అందుకే రామలింగడు వికటకవి ఐనాడని అనుశ్రుత కథ. ఇటీవల తెనాలిలో రామలింగేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభము పడిపోగా దాని పునఃస్థాపన చేసే ప్రయత్నాలు జరిగినప్పుడు క్రింద కాళీ విగ్రహము, తెనాలి రామలింగడు వేసిన శాసనము లభించినట్లు పత్రికలలో వార్తవచ్చింది. దీనిని బట్టి రామలింగడు కాళీభక్తుడని ఆధార పూర్వకంగా చెప్పవచ్చును.

6. కామాఖ్య కాళి

కాళీ పురాణంలో అస్సాంలోని కామాఖ్యలో వెలసిన కాళిని గురించి విపులంగా వర్ణించబడింది. దక్షయజ్ఞ వేళ ప్రాణత్యాగం చేసిన సతీదేవి శరీరాన్ని ధరించి మహేశ్వరుడు ప్రళయతాండవం చేయగా, దాని వలన లోకానికి కలిగిన కల్లోలాన్ని ఆపటానికి విష్ణువు చక్రప్రయోగం చేశాడు. సతీదేవి శరీరం ఖండఖండములుగా దేశం నలుమూలలలో పడినది. ఆ ఖండములలోని 18 ప్రధానమైన భాగములు పడినచోట్లే అష్టాదశ మహాశక్తిపీఠములైనవి. వానిలో కామాఖ్య అనునది యోని పీఠము. దాని అధిష్ఠానదేవత కాళి.

ద్వాపరయుగంలో నరకాసురుడు ఈ దేవత నారాధించాడు. భగరూపిణిగా, భగేశ్వరిగా, భగవతిగా కొలిచి వామాచార మార్గంలో సిద్ధిని సాధించాడు. తత్ఫలితంగా మనసులో ఇష్టమున్నా లేక పోయినా 16 వేల మంది రాజకుమారిక లతని వశమైనారు. ఇష్టం లేని వీరిని బలాత్కరించి అనుభవించిన మహాపాప ఫలితంగా అతడు కృష్ణుని చేతిలో హతుడైనాడు. కాళీపురాణంలో నరకునిగాథ చిత్రంగా చెప్పబడింది. ఇప్పటికి సృష్టి ప్రారంభమై 199 కోట్ల సంవత్సరాలపైన. మహాప్రళయానంతరము హిరణ్యాక్ష సంహారమునకై వచ్చిన మొదటి అవతారము ఆదివరాహమూర్తి. ఆ శ్వేతవరాహుడు భూదేవిని ఆమె కోరికపై అసురసంధ్య వేళ సంగమించగా ఆమె గర్భవతియైనది. అప్పుడు పుట్టినవాడు నరకుడు. ఆనాడు ఉదయించిన ఆరాక్షసుడు ఇన్ని కోట్ల సంవత్సరాలు ఏమిచేస్తున్నాడు? ఇన్ని యుగాలలో హిరణ్యకశిపు, తారక, రావణాది రాక్షసు లెందరు రాలేదు? ఎందరు మరణించలేదు. నరకుని పాత్ర ఎక్కడా కనబడదు వినబడదు. దీనికి సమాధానం కాళీపురాణం చెపుతున్నది. భూదేవి గర్భము దాల్చినదేగాని ప్రసవించలేదట. ఒకసారి భరించలేని నొప్పులు రాగా విష్ణుదేవుడు తన హస్తపద్మస్పర్శతో ఆమె బాధను నివారించాడు. త్రేతాయుగమునందు భూదేవి కుమారులతో సీతాదేవితో వాడు చిన్నతనంలో ఆడుకున్నాడు. పెరిగి యువకుడై నప్పుడు పరాక్రమవంతుడైన ఈ తరుణుడు తమ రాజ్యాన్ని కాజేస్తాడేమోనని జనకుని కుమారునకు అనుమానం కలిగింది. అప్పుడు జనకుడు భూదేవికి ఆ కుఱ్ఱవాణ్ణి తిరిగి అప్పగించాడు. భూదేవి తన కుమారుని కోసం విష్ణుదేవుని ప్రార్థించగా ఆయన వచ్చి బ్రహ్మపుత్రానదీ తీరంలోని కామరూప రాజ్యానికి ప్రభువుని చేసి ప్రాగ్జ్యోతిషము రాజధానిగా పరిపాలించుకోమని అప్పటికే అక్కడ వెలసి ఉన్న కామాఖ్యా కాళిని భక్తి శ్రద్ధలతో అర్చించమని చెప్పి వెళ్ళిపోయాడు. నరకుడు కాళీదేవి అనుగ్రహాన్ని పొంది పరాక్రమవంతుడై పరిపాలిస్తుండగా అతని రాజ్యంలోని చీనీయులు తిరుగు బాటు చేశారు. తన శౌర్యసాహసాలతో ఆ చీనీవారిని పారద్రోలి శక్తి రూపుడై రాజ్యం ఏలుతున్నాడు. కొంతకాలం గడిచిన తర్వాత ద్వాపరయుగం వచ్చింది. ఒకసారి వసిష్ఠ మహర్షి కాళీదేవి దర్శనానికి వచ్చాడు. ఏ కారణం వల్లనో దేవాలయ అధికారులు ఆయనను లోపలకు అనుమతించలేదు. ఆయన నరకుని వద్దకు వెళ్ళి విషయం చెప్పాడు. నరకు డాయనను లెక్కచేయలేదు వసిష్ఠునకు కోపం వచ్చి ఆలయం నుండి కాళీదేవి అదృశ్యమగునుగాక! అని శపించాడు. ఆ శాప ప్రభావం వల్ల కామాఖ్య నుండి కాళి మాయమైంది. వసిష్ఠుడు తిరిగి పోయాడు. మర్నాడు గుడికి దర్శనానికి వెళ్ళిన నరకునకు అక్కడ కాళి కనబడలేదు. భయభ్రాంతుడైన నరకుడు ఎంతో ప్రార్థించాడు. అంతకు ముందు తన ఆరాధనకు సంతృప్తి చెంది ప్రత్యక్షమై వరములిచ్చిన కాళి ఎంత జపించినా ధ్యానించినా కనబడలేదు పలుకలేదు. కాళీమాత అనుగ్రహం తప్పిందని గ్రహించాడు. ఏమి చేయాలో తోచక రాక్షసకుల పురోహితుడైన శుక్రాచార్యులను పిలిచి పరిష్కారం చేయమని ప్రార్థించాడు. ఆయన కాళీదేవిని తిరిగి రప్పించటం నా వల్ల కాదు. అంతకంటే నీకు రక్షణ కోసం యజ్ఞములు చేయిస్తాను. అని

రుద్రాత్మకమైన యజ్ఞములు చేయించి వెళ్ళి పోయినాడు. ఆ తర్వాత కొంత కాలానికి శ్రీకృష్ణుడు దండెత్తి వచ్చినప్పుడు యుద్ధరంగంలో కృష్ణుని వెనుక తన పీఠ దేవతయైన కాళి కనిపించింది. ఆ దేవత శత్రుపక్షంలోనికి వెళ్ళిందని గ్రహించిన నరకుడు నిస్సహాయుడైనా వీరోచితంగా పోరాడి మరణించాడు. * కాళీదేవి మళ్ళీ కామాఖ్యలో అవతరించింది. ఇప్పటికీ ఆ క్షేత్రంలో సిద్ధ సాధకులెందరో తీవ్రసాధనలు చేసి అద్భుత శక్తులు సాధించారు.

20వ శతాబ్దంలో ఇద్దరు మిత్రులు కామాఖ్య వెళ్ళి కొన్ని కఠోర సాధనలు చేసి అద్భుతమైన శక్తులు సాధించారు. అందులో ఒకరు ఒరిస్సాలోని కటక్‌లో నివాసం ఏర్పరచుకొని సర్వజ్ఞుడన్న పేరుతో ప్రసిద్ధిచెంది భూత భవిష్యత్ వర్తమానాలను చెప్పేవాడు. విశాఖ పట్టణంలో ఆంధ్రాయూనివర్శిటిలో తెలుగు ప్రొఫెసర్‌గా పని చేసిన జోగారావుగారు చిన్న తనంలో స్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడు వారింటికి సర్వజ్ఞుడు వచ్చిన సంఘటనను ఈ విధంగా చెప్పారు. "నాచిన్నప్పుడు మాయింటికి చాలమంది యోగీశ్వరులు వచ్చేవారు. మా నాయన వాళ్ళందరినీ ఆదరించేవాడు. ఒకసారి ఒరిస్సానుండి సర్వజొణొ అనే మంత్ర వేత్త వచ్చాడు. ఏదడిగినా చెబుతాడని ఆయనను గురించి అందరూ అంటున్నారు. నాకు మర్నాడు లెక్కల పరీక్ష-సరిగా చదువలేదు. నాకు లెక్కలు బాగారావు. అందుచేత ప్రశ్నపత్రం ముందే తెలుసు కుంటే తయారుకావచ్చుకదా! అనిపించింది. సర్వజొణోగారిని తాతగారూ! రేపటి లెక్కల పేపరు చెప్పండి అని అడిగాను. అది ఎక్కడ ఉంటుంది అని అడిగాడాయన. హెడ్ మాష్టరుగారి వద్ద బీరువాలో ప్రశ్నపత్రాల కట్ట ఉంటుంది. బీరువాకు తాళము శీలు వేయబడి ఉంటవి. రేపుప్రొద్దున పరీక్షకు ముందు తెరుస్తారు అని చెప్పాను. ఆయన కళ్ళుమూసుకున్నాడు ఒక్కక్షణం ఆగి ఆ ప్రశ్నపత్రం నా భాషలో లేదే అన్నాడు. ఆ రోజుల్లో అంతా ఇంగ్లీషుమీడియం. మంత్రవేత్త ఇంగ్లీషు భాషలోని ప్రశ్నపత్రాన్ని మొత్తం చెప్పాడు. మర్నాడు సరిగ్గా అదే పరీక్ష హాలులో కనిపించింది. నేను ముందే తయారు కావటం వల్ల పరీక్ష బాగా వ్రాశాను."

అతడు తరువాత కొంత కాలానికి తనకంటే అధికశక్తి సంపన్నుడైన ఒక మహాయోగి యొక్క ప్రభావాన్ని జనాకర్షణను చూచి ఈర్ష్యపడి ఆయనపై తనశక్తిని ప్రయోగించాడు. ఆ యోగికి ఏమీ కాలేదు సరికదా ఇతని శక్తి పూర్తిగా పోయింది. అసూయ ఫలితంగా తన ఇష్టదేవత తన దగ్గర నుండి వెళ్ళిపోయింది.

మరొక సిద్ధుడు ఇంతకన్నా గట్టివాడు. అధికమైన సిద్ధశక్తిని ఆర్జించినవాడు. అతడు వస్తు సృష్టి చేసేవాడు. తననుతాను కృష్ణుని యొక్క అవతారంగా ప్రకటించుకున్నాడు. తన భార్యను రాధాదేవిగా మహాయోగీశ్వరిగా తెలిపాడు. ఆయన ఉపన్యాసం చెబుతుంటే ఆకాశం నుండి వెన్నముద్దలు రాలేవి. ఆ దంపతుల పటాలను విగ్రహాలను పెట్టుకొని పూజచేస్తే

* ఈ కథ 53వ పేజీ నుండి వివరంగా ఇవ్వబడింది.

వేడివేడి ప్రసాదాలు ప్రత్యక్ష మయ్యేవి. లోక సహజంగానే కొన్నివేల మంది భక్తులు తయారై ఆయన ఒక క్రొత్త దేవుడై కూర్చున్నాడు. దేశం మొత్తం మీద కొన్ని వందల దేవాలయాలు ఆ దంపతుల పేర నిర్మింపబడ్డాయి. వారి విగ్రహాలకు నిత్య పూజలు జరుగుతున్నవి. కవులు అష్టోత్తర సహస్రనామాలు వ్రాశారు. వారిపై పాటలు పాడుతున్నారు. భక్తులు వారి పేర్లతో భజనలు చేస్తున్నారు **"గతాను గతికోలోకః నలోకః పారమార్ధికః"** అన్న సూక్తి సార్ధకమైనది.

భాగవతంలో కాలాన్ని గురించి చెబుతూ పోతన గారీ పద్యాన్ని వ్రాశారు.

వాయువశంబులై ఎగసి వారిధరంబులు మింటకూడుచున్
పాయుచునుండు కైవడి ప్రపంచము సర్వము కాలతంత్రమై
పాయుచు కూడుచుండు ఒక భంగి చరింపదు కాలమన్నిటిన్
చేయుచునుండు కాలము విచిత్రము దుస్తరమెంత వారికిన్

ఆకాశంలో మబ్బులు కమ్ముకొని విడిపోతున్నట్లుగా కాలవశమై సమస్తమూ జరిగి పోతుంటుంది. కాలము ఎంత వారికైనా దుస్తరము. అవతారమూర్తులుగా పేరుగాంచిన ఈ దంపతులు కూడా ముందు సిద్ధుడు తర్వాత అతని భార్య శరీర పతనమై కాల గర్భంలో కలిసి పోయారు. ఆనాటి భక్తులు ఇంకా కొందరు మిగిలి ఉన్నారు కనుక ఒక తరంపాటు వారిని స్మరిస్తుంటారు. భర్తృహరి తన శతకంలో చెప్పిన ఒక శ్లోకం చూడండి.

సారమ్యా నగరీ మహాన్సనృపతిః సామంత చక్రంచ తత్
పార్శ్వే తస్యచ సా విదగ్ధ పరిషత్ తాః చంద్ర బింబాననాః
ఉద్వృత్త స్సచ రాజపుత్రనివహః తేవందినః తాః కథాః
సర్వం యస్య వశాదగాత్ స్మృతిపథం కాలాయ తస్మైనమః

మహానగరాధిపులై సామంత దండనాధులు వంగివంగి నమస్కారాలు చేస్తూ ఉండగా, వందిమాగధులు స్తోత్రాలు చేస్తుండగా, చామరగ్రాహిణులు వింజామరలు వీస్తుండగా, అఖండ భూమండలాన్ని పరిపాలించే చక్రవర్తియైనా స్మృతి పథంలోకి వెళ్ళక తప్పదు. కాల ప్రభావ మటువంటిది. కాల స్వరూపిణియైన కాళీ ప్రభావము అదే.

7. ఉజ్జయినీ కాళి

ఉజ్జయినీ కాళిని గూర్చి ఒక అద్భుతమైన కథ ప్రచారంలో ఉన్నది. విక్రమార్కుడు పరిపాలిస్తూ ఉండగా ఒక మాంత్రికుడు ఆయన ఆస్థానానికి వచ్చి రోజూ ఒక పండు బహుకరించి వెళ్ళేవాడు. కొన్నాళ్ళు గడచిన తర్వాత ఒక రోజు పండు తీసుకుంటూ ఉండగా క్రింద పడింది. పగిలిన పండులో నుండి ఒక రత్నం క్రింద పడింది. పరిశీలిస్తే అన్ని పండ్లలోనూ విలువైన రత్నాలున్నాయి. ఇంత విలువైన కానుకలు ఎందుకిస్తున్నారు? అని

విక్రమార్కుడా యోగిని అడిగాడు. ఇతరులు సాధించలేని ఒక పని మీరు నాకు చేసి పెట్టాలి అని ఆ యోగి కోరగా సరేనన్నాడు విక్రమార్కుడు. కృష్ణచతుర్దశినాడు అర్ధరాత్రి వేళ ఆ మాంత్రికుడు విక్రమార్కుని కాళికాలయానికి తీసుకొని వెళ్ళి కాళీపూజచేసి శ్మశానంలో ఒక శవం చెట్టుకు వ్రేలాడుతూ ఉంటుంది. దానిని తీసుకు రావలసింది. మధ్యలో శవాన్ని దించకుండా మాట్లాడకుండా మౌనంగా రావాలి అన్నాడు. ఈ నియమానికంగీరించి విక్రమార్కుడు శ్మశానానికి వెళ్ళాడు ఆ శవాన్ని తెస్తూ ఉండగా దానిని ఆవేశించిన బేతాళుడు ఒకథ చెప్పాడు. అందులో ఒక చిక్కు ప్రశ్న వచ్చేలా చేసి దానికి తిరిగి సమాధానం తెలిసి చెప్పకపోతే తలపగులుతుంది అన్నాడు. ప్రజ్ఞావంతుడైన రాజుకు జవాబు తెలుసు కనుక చెప్పాడు. మౌన నియమం భంగమైంది గనుక బేతాళుడు మళ్ళీ వెనక్కువెళ్ళాడు. రాజు మళ్ళీ శ్మశానానికి వెళ్ళడం మళ్ళీ శవాన్ని తేవడం శవం కథలు చెప్పడం ప్రశ్నలు వెయ్యడం ఇవే బేతాళ కథలుగా ప్రసిద్ధి చెందినవి. చివరకు ఒక కథలో జవాబు చెప్పలేని ప్రశ్న బేతాళుడు వేయడం, రాజు జవాబు చెప్పలేక మౌనంగా ఉండటం జరిగింది. అప్పుడు బేతాళుడు ఆ మాంత్రికుడు దుష్టుడని ఒక మహాసిద్ధికోసం నిన్ను కాళికి బలి ఇవ్వాలనుకుంటున్నాడని ఆ పనిని నీవే చేసి ఆ మాంత్రికుని బలి ఇచ్చి ఆ సిద్ధశక్తిని పొందమని చెప్పాడు. విక్రమార్కుడా పని చేసి కాళీ వరంవల్ల వెయ్యేళ్ళురాజ్యం పరిపాలించే వరాన్ని పొందాడు. బేతాళు డాయనకు వశుడై యావజ్జీవితము సేవించాడు. తీవ్రసాధనల ద్వారా కాళీభక్తులు మహాశక్తులు సాధించేవా రనటానికి ఈ కథలు ఉదాహరణములు.

నా చిన్నతనంలో ఒక కాళీ సిద్ధుని గురించి మహిమాన్వితమైన ఒక కథ విన్నాను. క్రొత్తగా పెళ్ళి అయిన ఒక కుటుంబంలో భర్తను దురదృష్టవశాత్తు ఒక మహాభూతం ఆవేశించింది. ఇవి మూడురకాలు. బలికాములు, రతి కాములు, హంతుకాములు అని చెప్పబడింది. మనుష్యులను కొందరు బలుల కోసం, కొందరు చంపటంకోసం, కొందరు కామతృప్తి కోసం ఆవహిస్తారు. ఈ నవదంపతులలో భర్తను ఒక కామ పిశాచం ఆవహించింది. పగలంతా మామూలుగానే ఉండేవా డీ వరుడు. రాత్రివేళ భార్యతో భయంకర రతిచేసేవాడు. ఆ పిల్ల తట్టుకోలేక ఆ రతిహింస భరించలేక అల్లాడిపోతున్నది. తమ కుమార్తె కృశించటానికి కారణమేమో తెలియని, తల్లిదండ్రులు ఈ మాంత్రికుని ఆశ్రయించారు. అతడు ధ్యానంలో విషయం గ్రహించి ఒక తాటాకుపై ఏదోవ్రాసి ఆ బాలిక సోదరుని పిలిచి రాత్రి శ్మశానానికి ఒక్కడవే వెళ్ళి నేను చెప్పినట్లు చేయి అన్నాడు. ఆ యువకుడు అర్ధరాత్రి ప్రేతభూమికి వెళ్ళి గురువు గారిచ్చిన తాటాకు చేతిలో పట్టుకొని నిలుచున్నాడు. ఇంతలో కాగడాలతో పరివారంతో ఒక పెద్ద ఊరేగింపు వచ్చింది. ఆ మధ్యలో ఒక పల్లకి. ఈ తాటాకును ఉంచాడు. దానిలో వ్రాసిన దానిని ఆమె చదివింది. పల్లకి ఆగింది ఊరేగింపు ఆగింది. ఆమె ఒక భటుని పిల్చి ఏదో చెప్పింది. వాడు కాసేపట్లో ఒక భూత పురుషుని లాక్కొనివచ్చాడు. ఆమె వానిని గద్దించి ఏమిరా! ఫలానా కుటుంబంలో వ్యక్తిని ఆవహించి అతని భార్యను రతిహింసలు చేస్తున్నావుట అని వానిని చెరసాలలో బంధించమని ఆజ్ఞాపించింది. భటులు వానిని లాక్కుని

వెళ్ళారు. చూస్తుండగానే ఒక క్షణంలో అంతా మాయమైంది. ఈ యువకునకు దిగ్భ్రాంతి కలిగింది. జాగ్రత్తగా ఇంటికివచ్చి జరిగింది పూజా గృహంలో కూర్చొని ఉన్న మంత్రవేత్తకు విన్న వించుకున్నాడు. పిశాచబాధతొలగి మర్నాటి నుండి ఆ దంపతులు హాయిగా కాపురం చేసుకుంటున్నారు. కాళి ఉపాసకుల శక్తులు ఈ విధంగా భాసిస్తుంటవి.

వంగదేశంలో కాళీ సాధన అధికంగా ఉన్నది. సుప్రసిద్ధమైన కలకత్తా కాళికను వామాచారమార్గంలోనే పూజిస్తారు. అక్కడ ఇప్పటికీ జంతుబలులు బాగా జరుగుతూనే ఉంటవి. నరబలులు కూడా జరుగుతవని ప్రతీతి. ఏదైనా అక్కడి వాతావరణం, అక్కడి పూజారుల ప్రవర్తన అన్నీ దారుణంగానే ఉంటవి. సరి! దానికేమి! అదొకచిన్న అంశం. ఇక రామప్రసాద్ అనే కాళీభక్తుని గురించి ఎన్నెన్నో కథలు వ్యాపించి ఉన్నవి. ఆయన పన్నెండు సంవత్సరాలు నిరంతర మద్యపానం చేస్తూ పంచకపాలాసనం మీద కూర్చొని కాళీ మంత్ర సాధన చేశాడట. తత్ఫలితంగా కాళీ సాక్షాత్కారం కావటం మాత్రమేగాక వారి ఇంట్లో చిన్న పిల్లలాగా ఆ దేవత తిరుగుతూ ఉండేదట. ఆయన నులక మంచం అల్లుతూ ఉంటే రెండో వైపు ఆయన కూతురులాగా కూర్చొని తానూ అల్లుతూ నులక ఆయన చేతికి అందిస్తూ ఉండేదట. రామప్రసాద్ గొప్పకవి వాగ్గేయ కారుడు. ఆయన రచించిన పాడిన పాటలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నవి. ఈనాడు జగత్ప్రసిద్ధుడైన రామకృష్ణ పరమహంస తన సాధన వేళ రామప్రసాద్ పాటలే పాడుకొనేవాడట. పరమహంస కూడా 12సంవత్సరాలు కాళీ సాధన చేసి ఆమె యొక్క పరిపూర్ణమైన అనుగ్రహాన్ని పొందాడు. కాళీదేవి ఆయనతో మాట్లాడేది. ఆయన నైవేద్యం పెడితే తినేది. సాధనకాలంలో పగలు దక్షిణేశ్వర కాళీ గుడిపూజారిగా మడికట్టుకొని ఆచార బద్ధమైన పూజలు చేస్తూ రాత్రివేళ అక్కడికి దూరంగా ఉన్న శ్మశానంలో ఆమలక వృక్షం క్రింద పంచకపాలాసనంపై దిగంబరుడై కూర్చొని తపస్సు చేసేవాడు. ఆ కఠోరతపస్సు ఫలించింది.

8. గుంటూరు కాళి

పూర్వజన్మలో నేను హిమాలయ పర్వతాలలో కాళీసాధన చేసినప్పుడు ఆమె విగ్రహరూపంలో అవతరించి నా పూజలందుకొన్నది. దానితో దేశ సంచారం చేస్తూ ఉత్తర ప్రదేశ్‌లోని రాధాకృష్ణ విహార భూమియైన బృందావనానికి వచ్చాను. అక్కడ కృష్ణ చైతన్యస్వామి శిష్యుడైన రూప గోస్వామితో అనుబంధం ఏర్పడింది. అక్కడ ఆయన, నేను చెప్పగా చేసిన సాధనల ఫలితంగా కాళీ సిద్ధుడొకడు అవతరించాడు. ఆయన అనుబంధం వల్ల గోస్వామికి ఎన్నో దివ్యానుభూతులు శక్తులు లభించినవి. ఆ సిద్ధుడే తర్వాత రామకృష్ణపరమహంసగా జన్మ పొందినట్లు కాళీదేవి ధ్యానవేళ తెలియచేసింది. ఆ దేవతే ఇటీవల గుంటూరులోని మా ఆశ్రమంలో సిద్ధ సహకారంవల్ల ఎందరో ధ్యానం చేస్తుండగా అంతరిక్షం నుండి దిగి పూజలందు కుంటున్నది. అదే ఇప్పుడు "స్వయం సిద్ధ కాళీపీఠం" అయింది.

కాళీ తంత్రములలో ఎన్నో మంత్రభేదాలున్నాయి. దానిలో దక్షిణకాళి అత్యంత ప్రసిద్ధి. మహాకాళి, శ్యామకాళి, భద్రకాళి,శ్మశానకాళి మొదలైన రూప మంత్ర భేదాలెన్నో ఉన్నాయి. వేదంలో కాళీమంత్రం ఉన్నది. అందలి ప్రాణ విద్య ఇదే అని గణపతిముని అంటాడు. ఈనాడు ఆనాపానసతి లేక విపస్సన అన్న పేర్లతో పిలువబడుతున్న సాధనకు పూర్వం “సంవర్గ విద్య” అన్న పేరుండేది. **“గత్యాగతి ప్రత్యవేక్షణ ద్వారా ప్రాణవాయుం ధ్యాయేత్ సా సంవర్గ విద్యా”** ఉచ్ఛ్వాసనిశ్వాసముల గమనాగమనములను పరిశీలిస్తూ నిర్గుణ ధ్యానం చేయటమే ఈ సాధన.

ప్రాణ ప్రయాణం పరితః ప్రమాణం ఉచ్ఛ్వాసనిశ్వాసగతిం విలోక్య
ధ్యానే భవేత్ సంతత మౌన యుక్తః సపశ్యతి ప్రాతిభ కాలమూర్తిం

ఈవిధంగా కాళీసాధన చేసి ఆ దేవి అనుగ్రహాన్ని పొందిన వారు మృత్యుంజయులై సిద్ధేశ్వరులై లోకపూజితు లౌతారు.

9. రామకాళి

యుద్ధంలో శ్రీరాముని ముందు నిలువలేక రావణుడు వివిధ దేవతలను ఆరాధించి జయం పొందటానికి చేసిన ప్రయత్నాలలో భాగంగా శ్రీ చక్రార్చన చేసినట్టు లలితా తంత్రంలో ఒక కథ ఉంది. లలితాదేవి చరిత్రలో ఆ వివరాలు చెప్పాను. ఉత్తర హిందూస్థానంలో ఇటువంటి చిత్రచిత్రమైన కథలు కొన్ని వ్యాప్తిలోకి వచ్చినవి. వాటిలో ఒకటి – శ్రీరాముడు రావణుని జయించటం కోసం కాళీదేవిని ఏడురోజులు ఉపాసించగా ఆమె చివరిరోజురాత్రి ప్రత్యక్షమై రామునకు విజయాన్ని వరంగా ఇచ్చింది. దాని వల్ల 8వ రోజు రఘువీరుడు రావణుని చంపి అశోకవనంలోని సీత యొక్క శోకాన్ని పోగొట్టాడు. కనుక చైత్రశుద్ధ అష్టమికి అశోకాష్టమి అన్న పేరు వచ్చింది.

10. నాథయోగులు

పాతాళలోకంలో మహిరావణుడు (మైరావణుడు) అనే రాక్షసుడు రాజు. అతని సోదరుడు అహిరావణుడు. వాళ్ళు కాళీ ఉపాసకులు అక్కడ పెద్ద కాళీ ఆలయం ఉంది. ఆ పాతాళకాళి వారి రక్షకి. రావణుడు రాముని ముందు నిలవలేక మిత్రులైన పాతాళ ప్రభువులను సహాయ చేయమని కోరాడు. వారు అంగీకరించి తమ మాయా శక్తితో రామలక్ష్మణులను తీసుకువెళ్ళి పాతాళంలో బంధించారు. రామలక్ష్మణులను విడిపించటానికి హనుమంతుడు బయలుదేరి వెళ్తుంటే పాతాళలోక ముఖద్వార పాలకుడు మత్స్యేంద్రనాధుడు అడ్డగించాడు. ఆంజనేయుడు అతనిని జయించలేక ఆశ్చర్యపడుతుంటే మత్స్యేంద్రుని తల్లి మత్స్యకాంత వచ్చి లంకకు రావటానికి హనుమంతుడు సముద్రం దాటుతుంటే అతని చెమట బిందువు సముద్రంలో ఉన్న తన నోటిలో పడిందని, దానివల్ల తాను గర్భం ధరించానని తన కన్న బిడ్డయే ఇతడని కనుక మీరు వీని తండ్రియని చెప్పింది. తండ్రియని తెలిసిన తర్వాత

మత్స్యేంద్రనాధుడు త్రోవయిచ్చాడు. హనుమంతుడు కాళిని మెప్పించి రామలక్ష్మణులను విడిపించాడు. తరువాత యుద్ధంలో రాముడు రాక్షసరాజులను చంపాడు.

మత్స్యేంద్రనాధుడు తరువాత కాళిని గూర్చి తపస్సు చేసి మహా సిద్ధుడై నాథ సంప్రదాయాన్ని నెలకొల్పాడు. అతని సమాధి- అని చెప్పబడుతున్న ఒకటి ఉజ్జయినిలో ఇప్పటికీ ఉన్నది. చెవులకు కుండలాలు-చేతిలో ఇనుపబద్దీ ముఖమున తిలకము ధరించి అలఖ్ నిరంజన్ అంటూ ఈ సంప్రదాయస్థులు తీవ్రోపాసకులుగా ప్రసిద్ధిచెందారు. నవనాధులన్న పేరుతో ఈ మహాసిద్ధులు తొమ్మిది మంది మహనీయులుగా ప్రఖ్యాతులైనారు. వారిలో చౌరంగి అని పేరుగాంచిన సారంగధరుడు తెలుగువాడని రాజమహేంద్రవర పాలకుడైన రాజరాజ నరేంద్రుని కుమారుడని ఒక కథ ఆంధ్రదేశంలో వ్యాపించి నాటకాలకు, సినిమాలకు ఎక్కింది. మత్స్యేంద్రనాధుని ఆత్మపుత్రుడు గోరఖ్ నాధుడు (గోరక్షుడు). ఇతని శిష్యుడు భర్తృహరి సుభాషితత్రిశతి కర్త. విక్రమార్కుని సోదరుడని అంటారు. ఇతని గుహలు ఉజ్జయినిలో మహాకాళి ఆలయం సమీపంలో ఉన్నవి. ఇతడు కాళీమంత్ర సిద్ధుడని చెప్పబడుతున్నది. కాశీదగ్గరి చునార్‌కొండల సమీపంలో విక్రమార్కుని కోట ఒకటి ఉన్నది. అందులో ఇతని సమాధి ఉన్నది. దీనిని పగులగొట్టటానికి ఆజ్ఞాపించిన ఔరంగజేబు-సైనికులు గునపాలతో త్రవ్వుతుంటే భయంకర శబ్దాలు రాగా - వెరపుచెంది త్రవ్వకం ఆపించి దీని జోలి కెవరూ పోరాదని ఫర్మానా జారీ చేశాడు. అది ఇప్పటికీ అక్కడ ఉన్నది ఈ కాళీసిద్ధుల కథలెన్నో దేశంలో వ్యాపించి ఉన్నవి.

మహనీయ సిద్ధికై మత్స్యేంద్రనాధుండు
పూజించినట్టి అంభోజనయన
బేతాళ సిద్ధుడౌ విక్రమార్కుడు కొల్వ
దీర్ఘాయువిచ్చిన దేవమాత
భైరవనాధుండఘోర సాధనలతో
అర్చింప మెచ్చిన ఆదిశక్తి
బద్ధానురాగుడౌ సిద్ధేశ్వర యతీంద్రు
కరుణించినట్టి శృంగార మూర్తి
శ్రీగిరి క్షేత్రమందు కాశీపురాన
ఉజ్జయినిలోన కామాఖ్య నున్నతల్లి
కామితములిచ్చి కాచెడి కల్పవల్లి
కాళికాదేవి భక్తుల కాచుగాక!

11. జడభరతుడు

ఈ దేశములో ఏ పూజ చేసినా, వ్రతం చేసినా సంకల్పం చెప్పటం ఆచారము. దానిలో భరతవర్షము పేరు స్మరించబడుతుంది. జంబూద్వీపంలో ఉన్న వర్షాలలో భరతవర్షమొకటి. (వర్షమంటే పెద్దభూభాగం) దానిలో కొన్ని ఖండాలు. ఆ ఖండాలలో

భరత ఖండం శ్రేష్ఠమైనది. భరత వర్షమన్న పేరు మహాయోగియైన ఋషభపుత్రుడైన భరతుని వల్ల వచ్చింది. భరతఖండమనే పేరు దుష్యంతుని కుమారుడైన భరతుని వల్ల వచ్చింది. ఇతడు తనకాలంలో యవనమ్లేచ్ఛరాజులను జయించి పారద్రోలి ఈ దేశాన్ని రక్షించి ధర్మస్థాపన చేసినందువల్ల అతని పేరుతో భరతఖండ మైంది. ఇలా యిద్దరు భరతులు ప్రముఖులు. భరతవర్షమన్న పేరు రాకముందు ఈ భూమికి అజనాభమన్న పేరుండేదని విబుధవాక్యము.

ఋషభుడు మహాయోగి. భాగవతం ప్రకారం ఇతడు సర్వసిద్ధిసమన్వితుడైన విష్ణుభక్తుడు. తరువాత జైనులు ఇతనిని తమ మొదటి తీర్థంకరునిగా స్వీకరించారు. ఇతని కుమారుడు భరతుడు. రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించి ఎన్నోయజ్ఞాలు చేశాడు. సుదీర్ఘకాలం పరిపాలించి వైరాగ్యం కలిగి పుత్రులకు రాజ్యాన్ని ఇచ్చి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి పులహాశ్రమంలో ఉన్నాడు. కఠోరతపస్సు చేస్తూ ప్రణవ జపంచేస్తూ నారాయణస్మరణలో ఉన్న భరతుడు ఒక రోజు సింహగర్జన వల్ల మరణించిన ఒక లేడి గర్భం నుండి జారిన పిల్లను దయతో ప్రాణభయం నుండి కాచిపెంచాడు. దాని మీది మమకారంతో విష్ణుస్మరణ మరచి ఆయువు తీరగా దానినే చూస్తూ మరణించి లేడియై పుట్టాడు. పూర్వతపస్సు వల్ల తానెవరో గుర్తుకు వచ్చి ఆ శరీరాన్ని కాలక్రమాన త్యజించి ఆంగిరసగోత్రంలో ఒక బ్రాహ్మణునిగా పుట్టి లోకసంగంలో పడకూడదన్న భావంతో జడునివలె ప్రవర్తిస్తున్నాడు. తల్లిదండ్రులు మరణించిన తర్వాత సోదరు లితనిని పొలం కాపలాకు పెట్టారు.

ఆ పొలానికి దగ్గరలోని గ్రామానికి ఒక కోయరాజు ప్రభువు. అతనికి పిల్లలు లేరు. కాళికి నరబలియిస్తే పిల్లలు పుడతారని ఊరిలోని మంత్రవేత్త చెప్పాడు. అందువల్ల ఒక మనిషిని సంపాదించి తీసుకువెళుతుంటే వాడు తప్పించుకొని వెళ్ళిపోయినాడు. అప్పుడు ఆ వృషలరాజుభటులు పొలంలో ఉన్న జడభరతుని పట్టుకువెళ్ళారు. కాళికాలయానికి తీసుకువెళ్ళి తలంటిపోసి స్నానం చేయించి కొత్త గుడ్డలు కట్టి చందనం ఒంటి నిండా పూసి మెడలో పూలదండలు వేసి ఆభరణాలతో అలంకరించి కడుపు నిండా మంచి విందుభోజనం తినిపించారు.

కాళీదేవికి పూజ చేసి ధూపదీపములు పేలాలు, పండ్లు మొదలైన నైవేద్యాలు – సమర్పించి – పంచమహావాద్యాలు వాయించారు. డోళ్ళు, డప్పులు, తప్పెటలు, రుంజలు మొదలగు వాని ధ్వనులతో వాతావరణం ప్రతిధ్వనించింది. భిల్లరాజు వృషలుడు భయంకరమైన కత్తిని తీసుకొని ఆ బలిఖడ్గాన్ని కాళీమంత్రంతో అభిమంత్రించి భరతుని శిరస్సు ఖండించబోతున్నాడు. భరతుడు ఎంత మాత్రం భయం చెందకుండా చంపటానికి పూనుకొన్న ఆ భిల్లునిలో, ఖడ్గంలో ఎదురుగా ఉన్న కాళిలో సర్వభూతమయుడైన విష్ణువును భావిస్తూ నిశ్చలధ్యానయోగంలో ఉన్నాడు.

భాగవతంలో ఈ ఘట్టంలోని పద్యం చూడండి.

ఉ॥ అచ్చుట విప్రసూనుడు భయం బొకయించుకలేక చంపగా
వచ్చినవారియందు కరవాలము నందును కాళియందు తా
నచ్యుతభావముంచి హృదయంబున పద్మదళాక్షునెంతయున్
మచ్చిక తోడనిల్పి అనుమానము నొందకయుండె నత్తరిన్

విష్ణు తేజోమయుడైన ఆ భరతుని చూచింది కాళీదేవి. అతనిని చంపబోతున్న వృషలుని అతని పరివారాన్ని చూచింది. ఆగ్రహంతో ఆ విగ్రహం నుండి భయంకర రూపంతో బయటకు వచ్చి ఆ కోయరాజును, వాని పరివారాన్ని వికటాట్టహాసం చేస్తూ సంహరించింది. ఆ భిల్లుని శిరస్సు పట్టుకొని కాసేపు ఆడుతూ పాడుతూ తాండవం చేసి అదృశ్యమైంది. ఆమె కరుణవల్ల భరతుడు విముక్తుడై స్వేచ్ఛగా బయటకు వెళ్ళగలిగాడు.

12. విష్ణుకాళి / కామాఖ్య కథ

ఒకరోజు వైకుంఠవల్లభుడైన విష్ణుమూర్తి గరుత్మంతుని మీద అధిరోహించి ఆకాశంలో వెళ్తూ నీలాచలాన్ని దాటుతున్నాడు. ఆ నీలకూట పర్వతం మీద కామాఖ్య కాళి అవతరించి ఉన్నది. తగిన భక్తి గౌరవాలను చూపించకుండా వెళుతున్న వాళ్ళను ఆపివేసింది కాళీదేవి. గరుడుడు ముందుకు కదలలేక స్తంభించిపోయినాడు. శ్రీహరికి కోపం వచ్చింది. నా గమనానికి అడ్డం వచ్చిన ఈ పర్వతమెంత – దీనిమీద దేవత యెంత – అని అహంకారంతో రెండు చేతులతో కొండను ఎత్తి విసిరేయాలని ప్రయత్నించాడు. కాళీదేవి – సిద్ధసూత్రముతో వారిద్దరిని బంధించి సముద్రంలో పడేసింది. లవణజలరాశి అడుగున వారిద్దరు సుదీర్ఘకాలం పడి ఉన్నారు. కొంతకాలం తర్వాత బ్రహ్మ – వారి ఉనికిని తెలుసుకొని – వెళ్ళి సముద్రంలో నుండి వారిని పైకి తీసుకురావాలని ప్రయత్నించాడు. కాళీదేవిశక్తిని గ్రహించలేని బ్రహ్మకూడా అక్కడే పడిపోయి హరిగరుడులతో పాటు పైకి రాలేక ఉండిపోయినాడు. దేవతలు కూడా అలానే ప్రయత్నించి విఫలులై సముద్రం అడుగున బంధితులైనారు. ఈ వార్తవిని బృహస్పతి మహాదేవుని దగ్గరకు వెళ్ళి సహాయపడమని ప్రార్థించాడు. శివుడు కామాఖ్య కాళిని లెక్కచేయనందువల్ల విష్ణువుకీ గతి పట్టిందని, బ్రహ్మ, దేవగణము ఈ దోషం వల్లనే బంధితులైనారని, నీవు కూడా అక్కడికి వెళితే వారివలెనే అవుతావని హెచ్చరించాడు.

శ్లో॥ అవజ్ఞాతా మహాదేవీ మహామాయా జగన్మయీ
తేన తన్మాయయా బద్ధో విష్ణుస్తిష్ఠతి సాగరే

దేవగురుడు వేడుకోగా మహాదేవుడు బృహస్పతితో సముద్రం అడుగుకు వెళ్లి పశ్చాత్తప్తులైన బ్రహ్మవిష్ణువులకు, దేవతలకు కామాఖ్య కాళీకవచాన్ని ఉపదేశించాడు. దాని ప్రభావం వల్ల అందరూ సముద్రం పైకి వచ్చారు. పరమశివుడు వారిని కాళీదేవి కాళ్ళపైబడి

అపరాధాన్ని క్షమించమని ప్రార్థించవలసిందిగా ఆదేశించాడు. వారంతా అలానే వేడుకొన్నారు. కాళీదేవి వారితో ఇలా అన్నది.

శ్లో॥ కేశవో బ్రహ్మణాసార్ధం సర్వాదేవాగణైస్తథా
మద్యోని సలిలే స్వాద్య స్నానం పానం కురు ద్రుతం.

బ్రహ్మతో, దేవతలతో కలసి విష్ణుమూర్తి – నా యోని నుండి స్రవించిన జలములో స్నానము చేసి, ఆ నీటిని త్రావి – పవిత్రులగుదురుగాక!

ఆమె ఆజ్ఞ ప్రకారంచేసి వారంతా విముక్తులై తమ స్థానాలకు వెళ్ళిపోయినారు.

13. రజస్వలా కాళి

దశమహావిద్యలలో మాతంగికి శ్యామల అనిపేరు. కాళి యొక్క సుకుమార రూపంగా ఈ దేవత చెప్పబడుతున్నది. ఆ రూపాలలో ఉచ్ఛిష్టమాతంగి – ఒకటి – ఆమె వర్ణన చూడండి.

శ్లో॥ స్మరేత్ ప్రథమ పుష్పిణీం రుధిర బిందుశోణాంబరాం
గృహీతమధుపాత్రికాం మదవిఘూర్ణ నేత్రోజ్వలాం
శయస్థమణివల్లకీం విమలశంఖతాటంకినీం
ఘనస్తన భరాలసాం గళిత చూళికాం శ్యామలాం.

మొదటిసారి రజస్వలయై ఆ నెత్తురు బిందువులు పడి చీర ఎర్రగా కాగా మద్యం తాగుతూ ఆ కైపువల్ల కన్నులు కెంపెక్కి చలిస్తుంటే చెవులకున్న శంఖాభరణాలు ఊగుతూ ఉంటే, జుట్టుముడి ఊడిపోయి కదులుతూ ఉంటే పెద్దవిగా ఉన్న చన్నుల బరువుతో బద్ధకంగా ఉండి నెమ్మదిగా వీణవాయిస్తూ ఉన్న శ్యామలను స్మరించాలి అని మంత్ర ఋషి అంటాడు.

రజస్వలయైన స్త్రీ యొక్క యోని రక్తము అంటిన వస్త్ర ఖండములతో హోమం చేస్తే అద్భుతవశీకరణశక్తి లభిస్తుందని శాక్తేయవిద్యలు చెపుతున్నవి. ఇవి ఇలా పలుకుతుంటే కామాఖ్యకాళి యొక్క రజోరక్త లిప్త వస్త్రాలు దివ్యశక్తి సమన్వితాలుగా చెప్పబడినవి. కామాఖ్య కాళి నిత్య రజస్వల అని ఆమె యోని నుండి ఎప్పుడూ రక్తం కారుతుంటుందని – అది అంటిన గుడ్డ ముక్కలు పూజలో పెట్టుకోవాలని కొందరు చెపుతుండగా మరికొందరు సంవత్సరంలో ఒకసారి ఆమె రజస్వల అవుతుందని ఆ మూడురోజులు గుడిమూసివేస్తారని ఆ రోజులలో స్రవించే రక్తాన్ని గుడ్డలకద్ది ప్రసాదంగా ఇస్తారని అంటున్నారు. ఏదైనా సంవత్సరంలో మూడురోజులు గుడిమూసి వేసి ఆ సమయంలో అక్కడ పెద్దజాతర చేస్తారు. కొలుపులు, కోలాటాలు, ఖడ్గవిద్యా ప్రదర్శనలు చాలా సంరంభంగా ఉంటుంది. నాలుగవరోజు గుడి తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ రోజులలోని రజోరక్తంతో తడిసిన వస్త్రాలతో సంవత్సరం పొడుగునా భక్తులకు చిన్న చిన్న ముక్తలు చేసి యిస్తుంటారు. ఇటీవల సపరివారంగా మేము కామాఖ్య వెళ్ళినప్పుడు అక్కడి ఆప్తులైని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అప్పుడక్కడి గుడిపూజారులు అందరికీ అమ్మవారి రజస్వలా రక్తవస్త్ర ఖండాలను ఇచ్చారు. ఆ అర్చకుడు వినిపించిన శ్లోకాలలో ఒకటి.

శ్లో॥ రజస్వలా కామకాళీ భగరక్త పరిప్లుతం
వస్త్రఖండం పవిత్రంతు పూజయేత్ ధారయేత్ సదా.

రజస్వలయైన కామాఖ్య కాళి యొక్క యోని నుండి కారుతున్న నెత్తురుతో తడిసిన గుడ్డముక్కలు పవిత్రమైనవి. వాటిని పూజించవలెను. శరీరము మీద ధరించ వలెను. (చేతికి కట్టుకొనవచ్చును.)

20వ శతాబ్దం ప్రథమార్థంలో ఇద్దరుమిత్రులు కామాఖ్యలో తీవ్రసాధనలు చేసి అద్భుతశక్తులు సాధించారు. వారిలో ఒకడు బెంగాల్‌లో స్థిరపడి తాను గోలోకంలో నుండి దిగివచ్చిన కృష్ణుడనని, తన భార్య రాధాదేవి అని ప్రకటించుకొని సాధించిన మహిమల వల్ల కొన్ని వేల మంది భక్తులు ఏర్పడగా వారు వీరికి ఆలయాలు కూడా నిర్మించి పూజలు చేయటం జరుగుతున్నది. అంతటి మహానీయులు కూడా కర్మబద్ధులై శరీరాలు విడిచి వెళ్ళిపోయినారు. రెండవ సిద్ధుడు ఒరిస్సాలో స్థిరపడి భూతభవిష్యత్ వర్తమానాలు చెపుతూ రోగాలు బాగుచేస్తూ దురదృష్టవశాన ఒక రాధాభక్తుని మీద ప్రయోగం చేసి తన శక్తులు పోగొట్టుకొన్నాడు. లోకం చిత్రమైనది. ఏ తీవ్రవిద్యవల్లనో, ఏ శ్మశానసాధనవలననో అద్భుతశక్తి సాధించి మహిమలు చూపిస్తూ బయటికిమాత్రం హరేరామ హరేకృష్ణ భజనలు చేయిస్తూ ఈ భజనవల్లనే శక్తులు వచ్చినవని చెపుతుంటారు. ఇటువంటి వారినిచూచే

అంతశ్శాక్తా బహిశ్శైవాః సభాయాం వైష్ణవామతాః

(లోపల శాక్తేయులు బయటికి శైవులు సభలలో వైష్ణవులు–) వంటి శ్లోకాలు పుట్టినవి.

14. ఎ) కామాఖ్య కాళి

త్రేతాయుగంలో రామావతార కథ ప్రారంభమైనది. రావణ సంహారము కోసము దేవతల ప్రార్థన మీద మహావిష్ణువు దశరథమహారాజు కుమారునిగా ఉదయించాడు. పెరిగి పెద్దవాడై విశ్వామిత్రుని వెంటవెళ్ళి అస్త్రవిద్యలు నేర్చుకొని రాక్షస సంహారము చేసి విశ్వామిత్రుని యాగాన్ని రక్షించి ఆ మహర్షి వెంట, తన సోదరుడైన లక్ష్మణునితో కలసి మిథిలానగరానికి వెళ్తూ త్రోవలో అహల్యా శాపవిమోచనం చేసి జనకుని ఆస్థానంలో శివధనుర్భంగము చేసి, సీతాదేవిని స్వయంవరంలో గెలిచి పెండ్లి చేసుకున్నాడు. తదనంతరం తండ్రి తన పినతల్లి యైన కైకేయికి ఇచ్చిన వరం కోసం రాజ్యాన్ని పరిత్యజించి సీతాలక్ష్మణ సహితుడై అరణ్యానికి వెళ్ళాడు. అరణ్యంలో రామలక్ష్మణులను దూరంగా వెళ్ళేటట్లు చేసి రావణాసురుడు సీతాదేవిని అపహరించుకొని వెళ్ళాడు. తిరిగి వచ్చిన రాముడు తన భార్య కనబడక దుఃఖిస్తున్నాడు.

ఆ సమయంలో ఆకాశంలో శివుడు, దక్షపుత్రిక అయిన సతీదేవితో కలసి విమానంలో వెళ్తున్నాడు. క్రింద రాముడు సీతాదేవి కోసము దుఃఖిస్తూ ఉండటం వారి కంటపడింది. సతీదేవి తన భర్త శివునితో ఇలా అన్నది "స్వామీ ! రాముడు దేవుడని, సర్వేశ్వరుడని, సర్వజ్ఞుడని, సర్వశక్తి సంపన్నుడని మీరు చాలా సార్లు నాతో చెప్పారు. కానీ క్రింద జరుగుతున్న దృశ్యం చూస్తుంటే నాకేమాత్రం నమ్మకం కల్గడం లేదు. రావణాసురుడు సీతను ఎత్తుకెళ్ళి లంకలో ఉంచాడని మీకు తెలుసు, నాకూ తెలుసు. కానీ రామునకు తెలిసినట్లు లేదు. తెలిస్తే ఈ విధంగా దుఃఖించ వలసిన పనిలేదు. అతడు అజ్ఞాని అయిన మానవునిగా మాత్రమే కన్పిస్తున్నాడు". మహాదేవు డా మాటలు విని – "సతీ ! జగన్నాథుని తత్వాన్ని తెలుసుకోవడం అంత సులభం కాదు. ఆయన మాయలు లీలలు అచింత్యములు, అనూహ్యములు. సర్వజ్ఞుడు, సర్వశక్తి సంపన్నుడైన శ్రీరాముడు అమాయకుని వలె నటిస్తున్నాడు. ఆయనకన్నీ తెలుసు." అన్నాడు. సతీదేవి నమ్మలేదు. ఉండండి ! నే నిప్పుడే క్రిందికి వెళ్ళి వస్తాను అని విమానం మీద నుండి ఆమె భూమి మీదకు వచ్చింది. సీతాదేవి యొక్క ఆకారాన్ని ధరించి, నెమ్మదిగా రాముని దగ్గరకు వెళ్ళి – "ఏమిటండీ! నే నెక్కడికో వెళ్ళిపోయినట్లు దుఃఖిస్తున్నారు. నేను అడవిలో పూలు కోసుకొద్దామని వెళ్ళాను. కొంచెము ఆలస్యమైనది. నన్నెవరో ఎత్తుకు పోయినట్లు మీరు శోకిస్తారు దేనికి ? నే నిక్కడే ఉన్నాను" అన్నది. రామచంద్రుడు ఒక్కసారి తలెత్తి చూచి "అమ్మా ! దాక్షాయణీ! శివపత్నీ ! మీ రిలా రాకూడదు. నా భార్య యొక్క ఆకారాన్ని ధరించి మీరిలా మాట్లాడటం ఉచితం కాదు. వెంటనే వెళ్లిపోండి" అన్నాడు. సతీదేవికి సిగ్గుకలిగింది. తానెవరో రామునికి తెలిసిపోయింది. ఆయనకు దివ్యదృష్టి ఉన్నది. దివ్యజ్ఞానం ఉన్నది. తాను పొరపాటు పడింది. వెంటనే జానకి యొక్క ఆకారాన్ని విడిచి తన స్వరూపం ధరించి ఆకాశంలో ఉన్న విమానంలోకి వెళ్ళి కూర్చుంది. శివుడు వెంటనే "సతీ ! చెబితే విన్నావు కాదు ఇప్పుడు సత్యం తెలుసుకొన్నావు. శ్రీరాముడు సర్వేశ్వరుడని, సర్వజ్ఞుడని ఎరుక కల్గింది. అదే విధంగా సీతాదేవి కూడా పరమేశ్వరి. రావణాసురుడు తీసుకు వెళ్తుంటే ఊరుకున్నది చేతకాక కాదు. ఒక్క శాపవాక్కుతో ఆమె వానిని దగ్ధం చేయగలదు. కానీ దాని ప్రణాళిక వేరు. రాముని చేతిలో రావణుడు హతుడు కావాలి. అది దైవ నిర్ణయం. అందుకోసం జరిగే లీలలే ఇవన్నీ. అయితే ఇప్పుడొక క్రొత్త చిక్కు వచ్చింది. జగన్మాత, నాకు పూజనీయురాలు అయిన సీతాదేవి యొక్క ఆకారాన్ని, నీవు ధరించి రాముని వద్దకు వెళ్ళావు. ఒకసారి ఆ రూపాన్ని ధరించావు అంటే నీ శరీరం కూడా నాకు మాతృశరీర సమానమే. కాబట్టి ఇకముందు మనం సంసారం చేయడం జరుగదు" అన్నాడు. సతీదేవి దిగ్భ్రాంతి చెందింది. దిగాలు పడిపోయింది. ఒక చిన్నపొరపాటు జీవితం మీద ఎంతటి ప్రభావాన్ని చూపిస్తుందో ఎటువంటి పరిణామాన్ని తీసుకొస్తుందో తెలిసి వచ్చింది. ఇంతలో విమానం కైలాసం చేరుకున్నది. వారి సంసారము, నిస్సారముగా గడుస్తున్నది.

కొంతకాలం గడిచిన తరువాత ఒకరోజు ఆకాశంలో దేవతల కోలాహలం వినిపించింది. అదేమిటో తెలుసుకొని రమ్మని సతీదేవి ప్రమథులను పంపింది. వారు వెళ్ళి

సతీదేవి తండ్రియైన దక్షుడు బ్రహ్మాండమైన యజ్ఞము చేయబోతున్నాడని దాని ఆహ్వానాన్ని అందుకున్న దేవతలు అక్కడికి వెళ్తున్నారని వార్త తెలిసింది. తండ్రి యజ్ఞానికి వెళ్ళాలని ఆమెకు కోరిక కల్గింది. పరమశివుని దగ్గరకు వెళ్ళి ప్రమధులు చెప్పిన వార్త మీరూ విన్నారు కదా! యజ్ఞానికి మనమూ వెళ్దాము" అన్నది. శివుడు వెంటనే ఇలా అన్నాడు – "దేవీ ! పిలవకుండా వెళ్ళకూడదు మనకు ఆహ్వానం రాలేదు. మీ నాయనకు నామీద కోపం. అల్లుడనైన నేను తనకంటే చిన్నవాడిని కనుక తనకు నమస్కారం చేయాలని ఆశించాడు. కానీ ఈ సృష్టిలో నేను నమస్కరింపదగిన వారు లేరు. ఆ కోపం ఆయన మనస్సులో పెట్టుకొని శివరహితమైన యజ్ఞాన్ని చేస్తున్నాడు. కనుక అటువంటి చోటుకి మనం వెళ్ళకూడదు' ఆ మాటలువిన్న సతీదేవి "తండ్రి ఇంటికి వెళ్లటానికి పిలవవలసిన పని ఏమున్నది ? పుట్టింటిలో బిడ్డలకు స్వాతంత్ర్యం ఎప్పుడూ ఉంటుంది. నేను ముందు వెళ్ళి నా తండ్రికి నచ్చచెప్పి మిమ్మల్ని కూడా ఆహ్వానించేలా చేస్తాను. మీ శక్తిప్రభావము తెలుసుకోలేని నా తండ్రిని మార్చటానికి ప్రయత్నిస్తాను. కనుక నేను తప్పకుండా వెళ్ళాలి' అన్నది. శివుడు విని ఊరుకున్నాడు. ఆమె సపరివారంగా విమానంలో బయలుదేరి దక్షయజ్ఞానికి వెళ్ళింది. అక్కడ యజ్ఞవాటికలో కాలు పెట్టగానే అఖండ వైభవంతో అలరారుతున్న ఆ ప్రదేశాన్ని చూచి ఆశ్చర్యానంద వివశురాలైంది. ప్రజాపతులు, దిక్పాలకులు, సూర్యచంద్రాదులు, అష్టవసువులు, విద్యాధరులు, గంధర్వులు, సిద్ధులు, కిన్నరులు, అప్సరసలు అసంఖ్యాకంగా అక్కడ ఉన్నారు. మంత్ర ప్రయోగదక్షులైన బ్రాహ్మణులు, ఋత్విక్కులు, హోతలు తమ తమ కర్తవ్యాలు నెరవేరుస్తున్నారు. హోత ఋగ్వేద మంత్రాలతోటి, అధ్వర్యుడు యజుర్వేద మంత్రాలతో, ఉద్గాత సామవేద మంత్రాలతోటి యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. యూపస్తంభములు సాలంకృతములై అలరారుతున్నవి. అచటికి ప్రవేశించిన సతీదేవి తల్లికి నమస్కరించి బంధువులను పలకరించి తండ్రి దక్షుని దగ్గరకు వెళ్ళింది. అతడు ఈమెను చూచి పలకరించకుండా ముఖం తిప్పుకున్నాడు. ఈమె వెళ్ళి నమస్కారము చేసి పలుకరించింది. దక్షుడు ఆగ్రహంతో – "ఓసీ ! పాపాత్మురాలా ! నీ విక్కడి కెందుకు వచ్చావు ? నిన్నెవరూ పిలువలేదే ! అనాచారపరుడు, శ్మశానవాసి, చితాభస్మధారి, కపాలధరుడు అయిన శివునకు భార్యవై నీ గౌరవాన్ని, అర్హతను పోగొట్టుకున్నావు. మిథ్యాభిమాని, వట్టి అహంకార పూరితుడైన ఆ ధూర్తుని భార్యవై నీ విక్కడ ప్రవేశించే యోగ్యతను పోగొట్టుకున్నావు. కుక్క ముట్టుకున్న ఆవుపాలలాగా దూష్యురాలవైనావు. నీవు భిక్షుకింకరివి. ఇక్కడ నుండి వెంటనే వెళ్ళిపో" అన్నాడు. సతీదేవి దుర్భరమైన బాధతో భర్తను దూషించిన దక్షునితో తన కోపాన్ని వెళ్ళగ్రక్కింది – యజ్ఞస్వరూపుడు, యజ్ఞభోక్త, అయిన శివుని దుఃస్వభావముతో దూషించావు. అజ్ఞానాంధకారములో పడి ఆత్మ నాశనాన్ని కొని తెచ్చుకుంటున్నావు. జ్ఞానాగ్ని దగ్ధకర్ములైన తపోనిష్ఠులు ఆత్మారాములు ఎవరిని ఆరాధిస్తుంటారో అటువంటి పరమశివుని నిందించి పాపము మూటగట్టుకున్నావు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. చేసిన తప్పులు తెలుసుకొని మహేశ్వరుని ఆహ్వానించు ! లేకపోతే నాశనమై పోతావు. ఆ తీవ్రవాక్కులు విన్న దక్షునకు

ఇంకా క్రోధము పెరిగింది. మరింతగా శివదూషణ చేశాడు. అప్పుడు సతీదేవి మనస్సులో ఒక్కక్షణం ఆలోచించింది. ఈ దక్షుని వల్ల పుట్టిన ఈ శరీరం ఇంక ఉండరాదు. రామాపచారం వల్ల నాకు సంసారం చేసే అర్హత ఎలాగూ పోయింది. కనుక ఈ శరీరాన్ని విడిచిపెట్టి మరొక చోట జన్మించి అప్పుడు శివుని భార్యనౌతాను. ఈ దేహాన్ని విడిచిపెట్టే సమయం వచ్చింది అని ఆలోచించి, "శివద్రోహీ ! దక్షుడా ! నిన్నిక తండ్రి యని కూడా పిలువను. నీ వల్ల పుట్టిన ఈ శరీరాన్ని వదలి వేస్తున్నాను. నీవు తగిన శిక్షను అనుభవిస్తావు" అని సతీదేవి యోగసమాధిలోకి వెళ్ళి ప్రాణాలు వదలివేసింది. నిశ్చేతనమైన శరీరం అక్కడ పడిపోయింది. ఆమెతో వచ్చిన ప్రమథులు, పరివారము ఆగ్రహావేశాలతో దక్షుని ఎదిరించారు. కానీ దక్షుని సైన్యము వాళ్ళను తరిమివేసింది. ప్రమథగణమంతా, నిర్విణ్ణులై కైలాసానికి చేరి శివుని దగ్గరకు వెళ్ళి జరిగినది విన్నవించుకున్నారు. దుఃఖంతో, కోపంతో పరమశివుడు ఊగిపోయినాడు. కైలాసం తల్లడిల్లింది. ఆయన నుండి పుట్టిన క్రోధాగ్నికి తలపై ఉన్న గంగ కూడా సలసల కాగిపోతున్నది. శివునకు ఒళ్ళంతా చెమట పట్టింది. తన నొసటి మీద చెమటి బిందువును మహేశ్వరుడు కొనగోటితో విదిలించాడు. అది భూమి మీద పడగానే అందులో నుండి ప్రళయకాలంలో మండే అగ్నిలాగా ఆకాశమంత ఎత్తున వీరభద్రుడు ఉద్భవించాడు.

అభ్రంలిహో దభ్ర విభ్రమాభ్రభ్రమ
　　కృష్ణీల దీర్ఘ శరీర మమర
ప్రజ్వలజ్జ్వలన దీప్త జ్వాలికాజాల
　　జాజ్వల్య మాన కేశములు మెరయ
చండదిగ్వేదండ శుండాభ దోర్దండ
　　సాహస్ర ధృత హేతి సంఘ మొప్ప
వీక్షణత్రయలోక వీక్షణ ద్యుతిలోక
　　వీక్షణతతి దుర్నిరీక్షమగుచు
క్రకచ కఠిన కరాళ దంష్ట్రలు వెలుంగ
ఘనకపాలాస్థి వనమాలికలును దనర
అఖిల లోక భయంకరుడగుచు వీర
భద్రుడుదయించె మారటరుద్రుడగుచు　　　　– పోతన భాగవతము

శ్లో॥ తత ఉత్తస్థివా నేకో లోక ఘస్మరవిగ్రహః
కాలాగ్నిరివ దీప్తాంగో వీరభద్రో గణేశ్వరః
బద్ధభ్రుకుటి రూర్ధ్వాంగ భిత్తి భేద కృదున్నతిః
దీప్తోర్ధ్వకేశశ్చబభౌ భగవానంత కోయథా　　– బ్రహ్మాండపురాణము

వీరభద్రుడు ఈశ్వరునకు సాష్టాంగ నమస్కారము చేసి “మహాదేవా ! ఏమి చేయటానికి నన్ను సృష్టించావు ? నీ అనుగ్రహం వల్ల నాకు అసాధ్యమనునది లేదు. మూడు లోకాలను మ్రింగమంటావా ? సప్తసముద్రాలనూ త్రాగేయ మంటావా ? ఈభూమిని విసిరివేయ మంటావా ? మీ ఆజ్ఞ ఏదైతే అది చేస్తాను” అన్నాడు. అంతట మహేశ్వరుడు – “వీరభద్రా! నీతల్లి సతీదేవి మరణానికి కారకుడైన శివద్రోహి దక్షుని శిక్షించు. వాని యజ్ఞాన్ని ధ్వంసం చేయి” అన్నాడు.

శివాజ్ఞను స్వీకరించి వీరభద్రుడు బయలుదేరాడు. అతడి శరీరభాగాలనుండి వేల లక్షల సంఖ్యలో రుద్రగణము పుట్టుకొచ్చారు. వారందరితో కలసి మహావేగంగా దక్షయజ్ఞవాటికకు వీరభద్రుడు చేరాడు. ఆ భయంకరమైన ఆకారాన్ని ఆ రుద్రగణాన్ని చూచి యజ్ఞంలో ఉన్నవారంతా భయభ్రాంతులై చెల్లా చెదరై పరిగెత్తారు. యజ్ఞదేవత భయపడి లేడిరూపంతో పారిపోతుంటే వీరభద్రుడు దాని తలనరికేశాడు. దేవవల్లభుడైన ఇంద్రుడు మయూర రూపంతో పరిగెత్తి తప్పించుకున్నాడు. ఇంతలో సూర్యుడు దొరికాడు. వీరభద్రుడు జుట్టు పట్టుకొని సూర్యుని తలవంచి పళ్ళు రాలగొట్టాడు. చంద్రుని పట్టుకొని కాలితో త్రొక్కి పిండి పిండి చేశాడు. సరస్వతీదేవిని పట్టుకొని ఆమె ముక్కు కోశాడు. అగ్ని దేవుని రెండు చేతులను కత్తితో నరికేశాడు. వైకుంఠనాథుడైన విష్ణువు కాసేపు వీరభద్రుడితో యుద్ధం చేశాడు. కానీ నిలువలేక చక్రం ప్రయోగించాడు. ఆ వేయి అంచుల ఆయుధాన్ని నోరు పెద్దగా తెరిచి మ్రింగివేశాడు వీరభద్రుడు. యుద్ధం విరమించుకొని విష్ణువు వెళ్ళిపోయినాడు. బ్రహ్మదేవుడు భయపడి వీరభద్రునికి నమస్కరించి ఆయన రథానికి సారథియై గుర్రాలు త్రోలడం మొదలు పెట్టాడు.

రుద్రగణం దక్షుని దండించాలని హుంకరిస్తున్నారు.

ఉ॥ **వీండు ఖలుండు దక్షుడను వీరిడి పారుడు వీండు సర్వవ**
ధ్యుం డెడ సేయకుండుశివదూషకు నాలుకగోసి ఉప్పునిం
పుండు త్రపుద్రవ మ్మొడల బూయుడు లోహము గాచి నోర బో
యుండు దురాత్ము చర్మపట మొల్వుడు కన్నులు మీటు డుక్కరన్.

ఈ దక్షుడు దుర్మార్గుడు పాపాత్ముడు – శివదూషకుడు – వీడి నాలుక గోసి ఉప్పు పెట్టండి. సీసంకరిగించి ఒంటి మీద పూయండి. లోహము కరిగించి నోట్లో పోయండి. ఈ దుష్టుని తోలు ఒలవండి. కండ్లు పీకేయండి – ఇటువంటి అరుపులు బయలుదేరినవి. ఇవన్నీ వింటూ ముందుకు వెళ్ళాడు వీరభద్రుడు. అక్కడ అతనిని అడ్డగలవారు లేరు. యాగశాలలో ప్రవేశించి దక్షుని పట్టుకొని తలనరికి దానిని హోమకుండంలో వేసి – భక్షయ భక్షయ తిను – తిను అంటూ అగ్నిని ఆజ్ఞాపించాడు. ఇంతకు ముందే రెండు చేతులూ నరికాడు. తినకపోతే తలనరుకుతాడేమో అని భయంతో అగ్ని దక్షుని తలను దహించివేశాడు. ఆ శిరస్సు బూడిదై పోయింది. భయంతో వణికిపోతున్న దక్షుని భార్యలు విలపిస్తూ వీరభద్రుని

కాళ్ళపై బడి ప్రార్థించారు. "వీరభద్రుడా ! నీవు సంహార భైరవుడవు, రౌద్రవిక్రమనిధివి అయినా దయామయుడవు. ప్రజాపతినన్న గర్వంతో దక్షుడు శివద్రోహం చేశాడు. దానికి తగిన శిక్ష విధించావు. నీ కోపాన్ని ఉపసంహరించు. మేము విధవలమై జీవించలేము. దయచేసి బ్రహ్మపుత్రుడైన ఈ దక్షుని మళ్ళీ బ్రతికించు" అన్నారు. వారి ప్రార్థనలు విన్న వీరభద్రునకు దయ కల్గింది. దక్షుని బ్రతికించాలి అని సంకల్పం కల్గగానే అతని కబంధము కన్పించింది. కానీ తల హోమాగ్నిలో దగ్ధమై పోయింది. అయినా "శివదూషణ చేసిన ఆ శిరస్సు యోగ్యమైనది కాదు" అని భావించి ప్రక్కనే ఉన్న మేకతల తెచ్చి దక్ష కబంధానికి అతికించి బ్రతికించాడు. మేష శిరస్సుతో దక్షుడు పునర్జీవితుడై లేచి వీరభద్రుని స్తుతించాడు – "ఓ వీరభద్రా ! గర్వంతో నేను తప్పు చేశాను. ప్రజాపతి నన్న అహంకారంతో లోకేశ్వరుడైన మహేశ్వరుని తెలుసుకోలేక దూషించాను. నాకు తగిన శిక్ష విధించి మేలే చేశావు. ఈ క్షణం నుండి నేను నీ పాదసేవకుడిని–

"నమో నమస్తే వరవీరభద్ర ! పునః పునర్వీర నమోనమస్తే ।
కృతాగసం మామశరణ్య మత్ర కృపాకటాక్ష ప్రసరేణ రక్ష॥" – అని స్తుతించాడు.

దక్షస్తుతి విన్న వీరభద్రుడు ప్రసన్నుడైనాడు. రుద్రగణముతో బయలుదేరి కైలాసానికి వెళ్ళి శివునకు జరిగినది విన్నవించాడు. దక్షాధ్వర ధ్వంసం విన్న తరువాత శివుడు బయలుదేరి యజ్ఞవాటికకు వచ్చాడు. భార్య సతీదేవి శరీరం అక్కడనే పడి ఉన్నది. ప్రాణరహితమైన ఆ శరీరాన్ని చూడగానే శివునకు దుఃఖం కల్గింది. తనభార్య ప్రాణాలను తీసుకొని వెళ్ళిన వారెవ్వరు ? ఆమెలోని జీవుడు ఎక్కడికి వెళ్ళాడు ? ప్రాణులకు మరణాన్ని ఇచ్చి ప్రాణాలను తీసుకెళ్ళే యమధర్మ రాజు తన క్రింది వాడే, దిక్పాలకులందరూ తన కింకరులే, సతీదేవి ప్రాణాలను తీసుకెళ్ళే సాహసం వీరెవ్వరికీ లేదు. ఆమె ఏమైనది ? శివునకు కోపం వచ్చింది. దుఃఖము, క్రోధమూ తనను ఆవేశింపగా సతీదేవి శరీరాన్ని రెండు చేతులతో పైకెత్తాడు శివుడు. అప్రయత్నంగా ఆయన శరీరం కదలడం మొదలు పెట్టింది. అది తాండవంగా మారింది. శివతాండవము భువనభీషణముగా జరుగుతున్నది. ఆ ధాటికి లోకాలన్నీ కదలిపోతున్నవి. దేవతలకు ఏం చేయాలో తోచలేదు. అందరూ విష్ణుదేవునకు విన్నవించుకున్నారు. విష్ణువు వచ్చి చూచి పరిస్థితి గమనించి ఈ తాండవం ఆపకపోతే లోక ప్రళయం జరిగేటట్లున్నది అని గ్రహించి "శివతాండవం" ఆపాలంటే సతీదేవి శరీరాన్ని ఆయన చేతుల నుండి తొలగించాలి. అదొక్కటే మార్గము. కానీ శివుడు దాన్ని విడిచిపెట్టేలా లేడు. అని ఆలోచించి తన ఆయుధంతో సతీదేవి శరీరాన్ని ఖండ ఖండములు చేశాడు. దానితో శివునకు స్పృహవచ్చి ఇది పరమేశ్వరి లీల అని గ్రహించి హిమాలయ పర్వతానికి వెళ్ళి దక్షిణామూర్తియై తపస్సు చేసుకోవడం మొదలు పెట్టాడు. అక్కడ ఖండములైన సతీదేవి శరీరభాగాలు ఆకాశం నుండి భూమి మీద వివిధ భాగాలలో పడినవి. అందులో 18 పెద్ద ఖండాలు. అవి పడిన చోట్లే అష్టాదశ మహాశక్తి పీఠములైనవి. వానిలో ప్రయాగలో వెలసినది

లలితాపీఠము, కాశీలో విశాలాక్షి అదే విధముగా మిగిలిన ప్రదేశాలు భారతదేశములో ఉన్నవి. లంకలో పడిన శరీరభాగము శాంకరీ పీఠమైనది. సతీశరీరంలో నుండి పడిన చిన్న చిన్న ముక్కలు అవి కూడా చాలా చోట్ల శక్తిపీఠములై ప్రకాశిస్తూ ఉన్నవి.

అయితే కాళికాపురాణం ప్రకారం సతీదేవి శరీరభాగాలు పడినచోట్లు అయిదు మాత్రమే 1) పాదములు – దేవీ కూటము నందు 2) తొడలు – ఉడ్డియాన పీఠము నందు 3) యోని – కామరూపరాష్ట్రములోని హిమగిరి యందు 4) వక్షోజములు – జాలంధరపీఠము నందు 5) కంఠము, భుజములు – పూర్ణగిరి యందు – అన్నీ కామాఖ్య ప్రాంతములే.

అంతేకాక సతీదేవి శరీరఖండములైన తీరు కూడ మరొకరకం – శివుడు సతీశరీరంతో తాండవం చేస్తుంటే దానిని ఆపటం సాధ్యంకాదని గ్రహించి బ్రహ్మ, విష్ణువు శని – ఆమెశరీరంలోకి ప్రవేశించి లోపలి నుండి దానిని ముక్కలు చేసి – లోకశ్రేయస్సు కోసం ఆ భాగాలను ఎంపిక చేసిన ప్రదేశాలలో పడేలా చేశారు. ఆ ప్రదేశాలు పైన ఇవ్వబడినవి.

ఇక్కడ మరొక చిత్రమైన అంశము కూడా కనిపిస్తున్నది. సతీమరణంతో దుఃఖిస్తున్న శివుని కండ్ల నుండి అశ్రువులు రాలుతున్నవి. అవి క్రిందపడితే భూమి దగ్ధమయ్యే ప్రమాదం ఉన్నది. అందుకని దేవతలు భూమిని – శివుని కన్నీళ్ళ నుండి రక్షించవలసిందిగా శనైశ్చరుని కోరారు. శనైశ్చరుడొకసారి మేఘాలు వర్షించకుండా వంద సంవత్సరాలు ఆపాడట ! ఆ శక్తి గల వాడు గనుక దేవతలు కోరగానే అంగీకరించి బాష్పములను ఆపితే శివునకు కోపం వస్తుందేమో ఆ కోపం నుండి నన్ను మీరు కాపాడాలని దేవతలను అడిగాడు. దేవతలంగీకరించి శివుని మీద దేవమాయను ప్రయోగించారు.

అప్పుడు శని శివాశ్రువులను ఆపాడు. అయితే కొంత సమయం తర్వాత అతని శక్తి సరిపోలేదు. వాటిని తన చేతులతో తీసుకొని ఒక కొండమీదికి విసిరేశాడు. ఆ కొండకు జలధారక అనే పేరు వచ్చింది. ఆ పర్వతం మీద నుండి ఆ బాష్పధారలు – నదిగా మారి యమనగరం దగ్గర – వైతరణి అని పిలువబడి తూర్పుసముద్రంలో కలిసినవి.

ఇక ప్రధానమైన అంశం. కామాఖ్యలో పడిన సతీదేవి భాగము – అత్యంత శక్తిమంతమైన యోని పీఠంగా పేరుచెందింది. ఈ పీఠంలో పూజింపబడేది – యోని కామమునకు అధిదేవతయైన యీమె కామదేవి. కాముడైన మన్మథుడు తిరిగి శరీరము పొందిన యీ ప్రదేశం కామశక్తికి నిలయం. కామము తీరాలన్నా, అత్యధిక కామశక్తి కావాలన్నా, స్త్రీలకు పురుషులు, పురుషులకు స్త్రీలు వశీకరణం కావాలన్నా చివరకు కామమును జయించాలన్నా ఈ దేవతను ఆరాధిస్తే కోరిన శక్తిని ప్రసాదిస్తుంది.

ఈ కామకాళిని పూజించే విధానాలు కాళికాపురాణంలో వివరంగా చెప్పబడినవి. మామూలు షోడశోపచారాది పద్ధతులు అందరికి తెలిసినవే. ఇవి కాక మరి కొన్ని వింత పద్ధతులు కనిపిస్తున్నవి. అలంకరించుకొన్న స్త్రీలు ముఖ్యంగా వేశ్యలు ఆడుతూ పాడుతూ

వాద్యములు మృదంగములు మొదలైనవి ఉపయోగిస్తూ ఒకళ్ళ మీద ఒకళ్ళు పూలు, పేలాలు, నీళ్ళు, బురద చల్లుకొంటూ ఉత్సాహంగా అమ్మవారిని గూర్చి అశ్లీల పదాలు – బూతులు – వాడుతూ ఆమె యోనిని రతిక్రీడలను వర్ణిస్తూ ఊరేగింపులో అమ్మవారి ఉత్సవవిగ్రహంతో పాల్గొనాలట. ఆలయంలో పండుగలకు కూడా ఇదే పద్ధతి. భారతదేశంలో వివిధ ప్రాంతాలలో గ్రామదేవతల జాతరలలో అక్కడక్కడ ఈ ఆచారం కనిపిస్తున్నది. ఉత్సవంలో బూతులు మాట్లాడకపోతే అమ్మవారికి కోపం వస్తుందట ! అందువల్ల ఇది తప్పనిసరి అని కాళికాపురాణం చెపుతున్నది.

శ్లో॥ భగలింగాభిధానైశ్చ భగలింగ ప్రగీతకైః
భగలింగాదిశబ్దైశ్చ క్రీడయేయురలంజనాః

యోని, లింగము – వీని పర్యాయపదాలు వాడుతూ వీటిపై పాటలు పాడుతూ జనులు క్రీడలలో పాల్గొనాలి. ఇలా చేస్తే కామాఖ్య కాళి అనుగ్రహిస్తుంది.

ఇక సాధకులు – మంత్రపురశ్చరణ చేసి – ముఖ్యంగా యోని పూజ చేయాలి.

ఆనీయ కామినీం ప్రౌఢాం రమణీయాం రతిప్రియాం
కృత్వాదిగంబరాం తస్యాః సర్వాంగాణి సమర్చయేత్
కాళీయంత్రంతు సంభావ్య ప్రత్యేకం పూజయేత్ భగం

సురతాసక్తి కలిగిన ప్రౌఢాంగనను తెచ్చి వస్త్రములు తొలగించి నగ్నునుచేసి అంగపూజ – అనగా సర్వావయములను అర్చించవలెను. ప్రత్యేకముగా యోనియందు కాళీయంత్రమును ఊహాచిత్రము గీసి లేదా యోనిక్రింద కాళీయంత్రమును పెట్టి పూజించవలెను. ధూపదీపములు, మద్యనివేదనము చేసి ఆ ప్రసాదమును స్త్రీ పురుషులిరువురు స్వీకరించవలెను.

అనంతరం రతిం కుర్యాత్ ఉచ్చైరుచ్చారయన్ మనుం
ఆనందభైరవ ఇతి స్వయం సంభావయన్ నరః
కాంతాతు సురతం కుర్యాత్ స్వయం కాళీతి భావయన్
శిశ్నంచ చూషయేత్ కాంతా పురుషోభగచుంబనం
యోనిమేఢ్రరసం కించిత్ దేవీయంత్రే విలేపయేత్
విభాగమితరం మద్యే మేళయిత్వా పిబేన్ ముదా
అథవా రసలిప్తార్కపుష్పై ర్యంత్రం సమర్చయేత్
కామకాళీ తథా తృప్తా సిద్ధశక్తిం ప్రయచ్ఛతి.

సాధక మార్గంలో పురుషుడు స్త్రీయోనిని, స్త్రీ – పురుషాంగమును పూజించి పిదప ఇద్దరు రతి చేయవలెను. రతిలో భాగముగా పురుషుడు భగచుంబనాదులను, స్త్రీ

శిశ్నచూషణము (ముఖరతి) చేయవలెను. ఈ సమయములో మంత్రోచ్చారణము, అశ్లీల పదభాషణము అవసరము. రతిపూర్తియైన తర్వాత యోని నుండి రతిరసమును తీసికొంత పూజాయంత్రమునకు పూయవలెను. కొంతభాగము మద్యముతో కలిపి తీర్థముగా తీసుకోవలెను. మరికొంత భాగములో జిల్లేడుపూలతో అద్ది కాళీ యంత్రమును మంత్రముతో పూజించవలెను. ఈ ప్రక్రియవల్ల కామాఖ్యకాళి సంతృప్తి చెంది సిద్ధశక్తులను ప్రసాదించును. (సంప్రదాయమునకు, దక్షిణాచార మార్గమునకు విరుద్ధమైన ఈ పద్ధతి తంత్ర విద్య నశించిపోగూడదన్న ఉద్దేశముతో మాత్రమే ఇయ్యబడినది).

(కామాఖ్యకాళి భర్త - ఆనందభైరవుని గుడి బ్రహ్మ పుత్రానదికి అవతల వైపు కొండమీద ఉన్న విషయం గమనించవలెను)

శ్లో॥ తంత్రాగారే రహసినిహితే కామినీ నగ్న దేహా
పాత్రేమద్యం మరిచ కటుకానీష్టభక్ష్యాణి మధ్యే
కుర్యాత్కాళీ రతిజపవిధిం తాంత్రికస్సిద్ధికామః
ఏతన్మార్గః పరమగహనో యోగినామప్యగమ్యః

ఈ మార్గంలో సాధుకుడు రహస్యంగా ఏర్పరచుకొన్న తంత్రాగారములో కాముకురాలైన స్త్రీని దిగంబరను చేసి ఇద్దరూ మద్యము తాగుతూ మధ్య మధ్య ఇష్టమైన భక్ష్యములను తిని కాళీమంత్రమును జపించుచు రతి చేయవలెను. సిద్ధికాముకుడైన తాంత్రికుడు చేసే ఈ ప్రక్రియ మహాయోగులకు కూడా అగమ్యమైనది. కష్టసాధ్యమైనది. అందరికి అందుబాటైన పథము కాదు. చీనాదేశంలో ఈ పద్ధతులకు ఒకప్పుడు ప్రాచుర్యం పెరిగి వీటికి చీనము, మహాచీనము, దివ్యచీనము - అని కొద్దితేడాలతో పేర్లు వచ్చినవి. వీనిలో కొందరు సాధకులు1) యోని పూజ - దిగంబర స్త్రీ సర్వావయములను పూజించుట చేస్తారు. 2) మరికొందరు ఇతరులు చేస్తున్న రతిక్రీడను దర్శిస్తూ మంత్రజపం చేస్తారు. 3) ఇంక కొందరు నగ్న స్త్రీ ఒడిలో కూర్చుండి జపం చేస్తారు. 4) వేరు కొందరు స్వయం స్త్రీతో రతిచేస్తూ జపం చేస్తారు. రామకృష్ణపరమహంస పై వానిలో మొదటి మూడింటిని నిర్వికారంగా చేసినట్లు రామకృష్ణ మిషన్ ప్రచురణలలో ఉన్నది. ఆయన నైవేద్యం పెట్టిన మద్యాన్ని వాసన చూడగానే పారవశ్య స్థితిపొందినాడట. అంతే కాదు నర కపాలంలో వండిన చేపలను, మనుష్యశవమాంసాన్ని కూడా ఏవగింపు లేకుండా తిన్నాడని వారి చరిత్రలో వ్రాయబడి ఉన్నది. భైరవీబ్రాహ్మణి సహకారంతో చేయబడిన ఈ సాధనల వివరాలు కొన్ని మాత్రమే గ్రంథాల కెక్కినవని, కొన్ని రహస్యమైనవి వదిలి వేయబడినవని కొందరు అభిప్రాయపడుతున్నారు. కామాఖ్య అని పిలవటానికికారణం ఇలా చెప్పబడింది.

శ్లో॥ కామార్థ మాగతాయస్మాన్ మయాసార్థం మహాగిరౌ
కామాఖ్యా ప్రోచ్యతే దేవీ నీలకూటే రహోగతా

నీలకూట పర్వతము మీద కామము కొరకై అవతరించిన దేవతగనుక కామాఖ్య అని పిలువబడుతున్నది.

కామ + ఆఖ్య (పేరు) – అనగా కామదేవత.

దేవి నివసించే నీలపర్వతము కూడా త్రికోణ ఆకారంలోనే ఉంటుంది. పర్వతం మధ్యలో కొంచెం పల్లం – అందులో ఒక వృత్తాకార ప్రదేశం. దానిలో మనోభవగుహ – మన్మధ గుహ – అక్కడ 30 మంది శక్తులుంటారు. గుహలో 21 అంగుళాల పొడవు ఒక వితస్తి వెడల్పు ఉన్న శిలాయోని. దానిలో రంధ్రము క్రిందికి పోతున్న కొద్ది ఇరుకవుతుంది. మన్మధ శిలపై ఉన్న ఈ భగదేవత చుట్టూ – కాముకనామంతో భైరవుడు, లలితానామంతో లక్ష్మి, మాతంగీ నామంతో సరస్వతి ఉన్నారు. ఆమె పరివార కామయోగినులు – 1) భగ 2) భగజిహ్వా 3) భగాస్య 4) భగమాలిని 5) భగోదరి 6) భగారోహ 7) అనంగ కుసుమ 8) అనంగవేష 9) అనంగమదన 10) అనంగమదనాంకుర 11) అనంగవేష 12) అనంగమాలిని 13) మదనాతుర 14) మదనాంకుశ

వీరితో పాటు కొండమీద అసంఖ్యాకదేవతాగణం వేంచేసి ఉన్నది.

బలులు : కామాఖ్యకాళికి – పశువులు, పక్షులు, జలచరములు, మనుష్యులు, అన్నీ బలిగా సమర్పించవచ్చు. మామూలుగా కోళ్ళు, మేకలు, గొర్రెలు – ఇస్తుంటారు. ఎప్పుడన్నా దున్నపోతులను ఇవ్వటం కూడా ఉన్నది. కానీ కాళికాపురాణంలో చేపలు, కప్పలు, మొసళ్ళు మొదలగు జలజంతువులను, పిల్లులు, పులులు మొదలగు జంతువులను విశేషించి మనుష్యులను బలియివ్వటం గూర్చి చెప్పబడినది. అంతేకాక సాధకుడు తన శరీరంలోని రక్తమును బలిగా సమర్పిస్తే వేగంగా సిద్ధి కలుగుతుందని చెప్పబడింది. అయితే జంతు హింస పాపం కదా అంటే వైదిక యజ్ఞాలలో చేసే బలి పాపం కాదని శాస్త్రములు చెపుతున్నవి.

శ్లో॥ **యజ్ఞార్థం పశవస్సృష్టాస్స్వయమేవస్వయంభువా**
అతస్త్వాం ఘాతయామ్యద్య తస్మాద్యజ్ఞే వధోఽ వధః

బ్రహ్మ పశువులను యజ్ఞముల కొరకు సృష్టించాడు. కనుక యజ్ఞములో పశువధ – వధ కాదు.

ఈ సిద్ధాంతాలు – నిర్వచనాలు ఎలా ఉన్నా తపస్వులైన ఋషులు పశువధ చేయలేక యజ్ఞాలలో పిష్ట పశువును వాడటం మొదలు పెట్టారు. అంటే పిండితో పశువు బొమ్మ చేసి దానిని ఖండించి బలిగా సమర్పించటం. ఈ సందర్భంగా దేవతలకు ఋషులకు మధ్య జరిగిన వివాదానికి సంబంధించిన కథ ఒకటి భారతంలో ఉంది. దేవతలు పశుబలి నిజమైనదే కావాలని పట్టుబట్టారట ! ఋషులు అంగీకరించలేదు. మధ్యవర్తిగా తీర్పు చెప్పమని బహుయజ్ఞకర్తయైన వసుమహారాజును రెండు పక్షాలవారు అర్థించారు. ఆయన దేవతల వైపు అనుకూలంగా తీర్పు చెప్పాడు. ఋషులకు కోపం వచ్చి హింసను సమర్థిస్తావా అని పాతాళమున పడిపోదువుగాక అని శపించారు. దేవతలు నారాయణమంత్రాన్ని ఉపదేశించగా అధఃపతితుడైన వసుమహారాజు ఉద్ధరించబడినాడు.

జంతుహింస స్వయముగా చేయటానికి ఇష్టపడని వారు పశువధశాలలో చంపబడుతున్న జంతువుల రక్తాన్ని, మాంసాన్ని – తెచ్చి నైవేద్యానికి, హోమాలకు ఉపయోగిస్తారు. ఏదైనా అది దేవతముందు ఇచ్చిన బలితో సమానం కాదు. పిష్టపశువు కూడా అసలు పశువుతో సమానం కాదు. ఋషులు చేసిన యజ్ఞాలలో వారి మంత్రశక్తివల్ల వధ సమయంలో పశువుకు స్పృహ ఉండదని – అనంతరం దానికి మంచి జన్మవస్తుందని చెపుతారు. ఏమైనా బలులవల్ల తీవ్ర దేవతలు సంతృప్తి చెంది కొన్ని శక్తులనిస్తారు. వాని యందు మోజు కలవారు ఆ మార్గాలను అనుసరిస్తారు. హింసచేసినందువల్ల వచ్చే పాపఫలితాన్ని అనుభవించక తప్పదు. దేని ఎకౌంటు దానిదే. తన శరీరం నుండి రక్తాన్ని తీసి బలి యివ్వటం వల్ల పాపమా, కాదా ? అంటే కొందరి దృష్టిలో పాపమే. గాయత్రీ మంత్రాది జపముల చేత పవిత్రమైన శరీరాన్ని హింసించటం దోషం. చక్రాంకితాలు, శూలముద్రలు – వీటిని కూడా వైదికులు అంగీకరించరు. అయితే జంతువుల ప్రాణం తీయటం కంటె ఇది నయం. చండీ సప్తశతి నాల్గవకథలో సురధుడనే రాజు, సమాధి అనే వైశ్యుడు మూడు సంవత్సరాలు రక్త తర్పణం చేసి చండీ సాక్షాత్కారం పొంది అభీష్ట సిద్ధి సాధించినట్లున్నది. కనుక ఇది తీవ్రసాధకులకు నిషిద్ధం కాదని కొందరి అభిప్రాయం.

ఇక సౌత్రామణి యజ్ఞంలో యజమాని యజ్ఞశాలలో మంచె మీద భార్యతో రమించగా క్రిందపడిన వీర్యాన్ని పాత్రలో ఉంచి దానితో హోమంలో ఆహుతులు వేస్తారు. దానిలోను హింసలేదు. మహాకాళ రచిత కర్పూరాది స్తోత్రంలో వీర్యంలో అద్దిన జిల్లేడు పూలతో 1000 సార్లు మంత్రం చెపుతూ కాళీదేవిని పూజిస్తే మహారాజవుతాడని చెప్పబడింది. ఈ విధంగా వీర్యపూజ, వీర్య హోమం తంత్ర గ్రంధాలలో అత్యధిక ప్రయోజనదాయకంగా చెప్పబడినవి.

కాళీసాధనలో ప్రధానమైన మరొకటి శ్మశానసాధన. శవములను దహనం చేసే స్థలమే శ్మశానం. పూడ్చిపెట్టటం కూడా ఉండవచ్చు. చితాభస్మాన్ని ధరించి పంచకపాలాసనం మీద కూర్చుండి జపధ్యానములు చేస్తే మంత్రసిద్ధి త్వరగా కలుగుతుంది. శవం మీద కూర్చుండి లేదా సమాధి మీద కూర్చుండి చేసే సాధనవల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. పూడ్చిన శవానికి మూడు రోజుల వరకు నీలకాంతివలయం (ఆరా) ఉంటుంది. దాని మీద కూర్చున్నందువల్ల సాధకునిలోనికి అది ఆకర్షించబడుతుంది. ఆ తరువాత ఆ శవం తాలూకు జీవుడు వశం కావచ్చు. లేదా మంత్రదేవతకు మాధ్యమంగా (మీడియం) మారవచ్చు. పంచకపాలాసనం రెండు విధాలు. 4 జంతువుల కపాలాలు, 1– నరకపాలం, లేదా అయిదూ నరకపాలాలు. శ్మశాన సాధనల వల్లనే త్రైలింగస్వామి, కీనారాం అఘోరీ, రామప్రసాద్, రామకృష్ణపరమహంస మొదలైనవారు కాళీమంత్రసిద్ధిని పొందగలిగారు. శ్మశానంలో సాధన చేయటానికి అవకాశం లేనివారు తమ సాధన గదిలో పంచకపాలాసనం వేసుకొని చితాభస్మమును ధరించి ఉపాసన చేయవచ్చు. హోమకుండంలో కూడా అడుగున కపాలములను పెట్టి పైనమట్టి పోసి హోమం చేస్తే ఎక్కువ ఉపయోగం ఉంటుంది. ఆహుతులకు రక్తాన్నము, మాంసము, మద్యము మొదలగునవి వినియోగించాలి. ఎంత

చేసినా మంత్రసిద్ధి కానప్పుడు మేరు తంత్రంలో ఒక ప్రక్రియ చెప్పబడింది. నరసంచారం లేని చోట రావి చెట్టు క్రింద కపాలంలో ఆవ లేక జీడి లేక తీవ్ర తైల మేదైనా పోసి, నెత్తురులో తడిపి ఆరబెట్టిన వత్తి వెలిగించి అర్ధరాత్రి జపం చేస్తే దేవతా సాక్షాత్కారం తప్పక కలుగుతుందట ! అలానే శవంలో కాళీయంత్రాన్ని పెట్టి కొన్నాళ్ళుంచి తెచ్చుకొని పూజాజపములు చేసినా వేగంగా సిద్ధి లభిస్తుందట ! ఇటువంటి పద్ధతులు తాంత్రికమార్గంలో చాలా కనిపిస్తవి.

ప్రాచీనమైన రావిచెట్టు, మర్రిచెట్టు మొదలైన వాని క్రింద జపం ప్రశస్తం. ఐదు చెట్లతో పంచవటి ఏర్పాటు చేసుకొని రామకృష్ణ పరమహంస మొదలైనవారు సాధన చేశారు. కాళీసాధకుడు నల్లని వస్త్రములు ధరించి గాని, దిగంబరుడై కాని అర్ధరాత్రులు భయపడక జపం చేయాలి.

శ్మశానస్థశ్శవస్థోవా కపాలాసన సంస్థితః
చితాభస్మధరో నగ్నః జపేద్రాత్రౌతు నిర్భయః

శ్మశానములో గాని, శవము మీద కూర్చుండిగాని, పంచకపాలాసనం మీద ఉపస్థితుడై గాని చితాభస్మాన్ని ధరించి దిగంబరుడై అర్ధరాత్రులు భయపడక జపం చేయాలి.

కాళీమంత్రసిద్ధికి ఇటువంటి విధానాలెన్నో తంత్రగ్రంధాలలో చెప్పబడినవి. కాళీసాధనలో పంచమకారాలకు ప్రాముఖ్యం ఉన్నది. మద్యం, మత్స్యం, మాంసం, మైధునం, ముద్ర – ముద్ర అంటే మాంసముతో చేసిన భక్ష్యము. మాంసాహారం ఇష్టం లేని వారు మద్యం వరకు మాత్రమే ఉపయోగిస్తారు. ప్రసిద్ధకాళీభక్తుడు రామప్రసాద్ మద్యపానం చేసి పంచకపాలాసనం మీద కూర్చుండి సాధన చేసి సిద్ధి సాధించాడని ఆయన చరిత్రను బట్టి తెలుస్తున్నది. మద్యం వల్ల ఏకాగ్రత రావటమే కాక రాజస తామస దేవతలకు ఇష్టం గనుక శీఘ్రసిద్ధి కలుగుతుంది. మహిషాసుర వధాఘట్టంలో మహాదేవి మాటి మాటికి మద్యపానం చేస్తూ అట్టహాసం చేస్తూ యుద్ధం చేసిన సంగతి గమనించదగినది. కొందరు మద్యం బదులు 'సంవిత్' అంటే భంగువాడతారు. దీనివల్ల దర్శనాలు త్వరగా కలుగుతవని వారి అభిప్రాయం.

"సంవిదాసవ యోర్మధ్యే సంవిదేవగరీయసీ"

భంగు – మద్యము ఈరెండింటిలో సాధనకు భంగు శ్రేష్ఠమైనదని తంత్రగ్రంధాలు చెపుతున్నవి. కొందరు గంజాయి పీల్చి ఆ మత్తులో ధ్యానం చేస్తారు. కాశీలో నివసించిన తాంత్రికుడు కీనారాం అఘోరీ భంగు బాగా ఉపయోగించేవాడు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్కమార్గంలో సాధన చేసి ఉత్తీర్ణులైనారు. అయితే ఇవి చాలా సందర్భాలలో వ్యసనాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉన్నది. ఈ మార్గాలలో ప్రవేశించిన వారు మనస్సును అదుపులో పెట్టుకోలేకపోతే భ్రష్టులయ్యే అవకాశాలెక్కువ. కనుక ఎన్నో జాగ్రత్తలు తీసుకొని ఈసాధనలు చేయాలి. లేదా కాస్త ఆలస్యమైనా దక్షిణాచార మార్గం శ్రేష్ఠమైనది – దివ్య క్షేత్రాలలో, శక్తిపీఠాలలో తపస్సు చేస్తే తప్పక ఫలిస్తుంది.

౨. శక్తిపీఠములు

ఉత్తర హిందూస్థానంలోని కొన్ని ప్రాంతాలలో సతీదేవి శరీరభాగాలు 54 ఖండములు పడినచోట్లు, అక్కడి దేవతలు ఈ క్రింది విధముగా చెప్పబడినవి. ఆ పట్టిక చూడండి.

స్థానము	దేశిశరీర భాగము	దేవత పేరు	సంబంధిత భైరవుడు
1. కొటరి	బ్రహ్మరంధ్రము	హింగుళ	భీమలోచనుడు
2. కరవీర (కొల్హాపూర్ శర్కరాయ)	మూడు కన్నులు	అంబాజీ/మహాలక్ష్మి (మహిషమర్ధని)	క్రోధీశుడు
3. బంగ్లాదేశ్, షికార్‌పూర్ (సుగంధాయ)	నాసిక	సుగంధ/ఉగ్రతార	త్ర్యంబకుడు
4. కాశ్మీర–శ్రీగనర్	కంఠము	భగవతి మహా మాయ/శారద	(త్రిసంధ్యేశ్వర అమరనాధ తీర్థ)
5. కాంగడా జ్వాలాముఖి	జిహ్వ	సిద్ధిద / అంబిక	ఉన్మత్త
6. జలంధర్ (జాలంధర)	వామస్తనము	త్రిపురమాలిని	భీషణ
7. వైద్యనాథ(బీహార్)	హృదయము	జయదుర్గ	వైద్యనాథ
8. నేపాల్	రెండు జంఘలు	గుహేశ్వరి / మహామాయ	కపాల
9. మానస/మానవ క్షేత్ర టిబెట్/ అమరనాధ	సగము చేయి	దాక్షాయణి	అమర
10. ఉత్కళ (ఒరిస్సా) విరజాక్షేత్ర	నాభి	విమలాదేవి	జగన్నాధ
11. నేపాల్ గండకీ నది మధ్యము	చెంప కుడి భాగము	గండకీ చండి	చక్రపాణి
12. బేహులాయ (బరద్వాన్‌జిల్లా) ప.బెం.ఖత్యాకు పడమర, కేతు గ్రామం	వామబాహువు	బాహుళ	భీరుక
13. ఉజ్జయిని	దక్షిణ కోర్పరం (కోహని)	మహాకాళి	కపిలాంబిక
14. చిటగాం (బంగ్లాదేశ్)	కుడిచెయ్యి సగభాగం	భవాని	చంద్రశేఖర
15. కర్ణాటక	రెండు చెవులు	జయదుర్గ	అభీరుక భైరవ
16. త్రిపుర, రాధా కిశోర్‌పూర్	కుడి చరణము	త్రిపురసుందరి	త్రిపురేశ

స్థానము	దేశిశరీర భాగము	దేవత పేరు	సంబంధిత భైరవుడు
17. త్రిసోతాయ (త్రిస్రోత)	వామపాదము	భ్రామరి	ఈశ్వర
18. అస్సాం / గౌహతి	మహాముద్ర (యోని)	కామాఖ్య	ఉమానంద భవ
19. ప్రయాగ	రెండు చేతుల వేళ్ళు	లలిత	క్రమధీశ్వర
20. జయంతి, మేఘాలయ	వామజంఘు	జయంతి	
21. కలకత్తా / కాళీ ఘాట్	కుడికాలివ్రేళ్ళు	కాళిక	నకులేశ్వర
22. కిరీట / బడా నగర్/బెంగాల్	నుదురు / కిరీటము ముకుట్	విమల	సంవర్తక
23. వారణాసి	కర్ణకుండలములు	విశాలాక్షి	కాల
24. కన్యా కుమారి	పీఠ/పృష్ఠము	శర్వాణి	నిమిష
25. కురుక్షేత్రం / హర్యానా	కుడికాలి గుల్ఫము	సావిత్రి	స్థాణు (అశ్వనాధ)
26. పుష్కరవర్థి/ మణిబంధ రాజస్థాన్	మణికట్టు(కర గ్రంధి)	గాయత్రి	సర్వానంద (పుష్కర)
27. శ్రీశైలం (శ్రీహట్ట)	గ్రీవము	భ్రమరాంబ	మల్లికార్జున
28. కాంచి/బోల్ పూర్ (W.B)	వెన్నుభాగము	వేదగర్భ	రురు
29. కాలమాధవ	వామనితంబము	కాళి	అసితాంగ
30. శోణానది(M.P.)	దక్షిణనితంబము	నర్మద	భద్రసేన
31. రామగిరి/చిత్ర కూటం (M.P.)	దక్షిణస్తనము	శివాని	చండభైరవ
32. బృందావనము	కేశములు	ఉమ	భూతేశ
33. సూచీదేశ/ సుచీంద్రము (తమిళనాడు)	ఊర్ధ్వదంతపంక్తి	నారాయణి	సంహార
34. పంచసాగర్ కర్ణాటక	క్రిందిపళ్ళ వరుస	వారాహి	మహారుద్ర
35. కరతోయా రనోవా నది ఒడ్డు(బంగ్లాదేశ్)	జరాయు	అపర్ణ	వామన
36. శ్రీ పర్వత - కాశ్మీర్	దక్షిణ గుల్ఫము	సునంద	నంద (లద్దాఖ్)

స్థానము	దేశశరీర భాగము	దేవత పేరు	సంబంధిత భైరవుడు
37. విభాషకే (తమ లుక్) (W.B) విభాష	వామగుల్ఫము	భీమరూప /కపాలిని	సర్వానంద
38. ప్రభాస (గుజరాత్)	ఉదరము	చంద్రభాగ	వక్రతుండ
39. భైరవ పర్వత (గిర్నార్) గుజరాత్	పైపెదవి	మహాదేవి/శిఖరకాళి	లంబకర్ణ
40. మగధ	దక్షిణ జంఘ	సర్వానందకరి	వ్యోమకేశ
41. జనస్థాన / నాసిక్	చిబుకము	భ్రామరి	వికృతాక్ష
42. కోటితీర్థం / గోదావరి	వామగండ	విశ్వమాతృక	దండపాణి
43. రత్నావళి / కాళహస్తి	దక్షిణస్కంధము	కుమారి/జ్ఞాన ప్రసూనాంబ	శివ
44. యుగాద్య / ఖేర్‌గ్రామ్ (బెంగాల్)	కుడికాలి బొటన వ్రేలు	భూతరాత్రి/యోగాద్య	క్షీర కంటక
45. మిథిల (ఉ.ప్ర)	వామస్కంధము	మహాదేవి	మహోదర
46. నలహట్టి (W.B.)	ఉదరనాళము	కాళిక	యేగీశ
47. కాళీఘాట్ (మైసూర్)	ముండము	చాముండ	క్రోధీశ
48. వక్రేశ్వర (W.B) (యువరాజ్‌పూర్)	భ్రూమధ్యము	మహిషమర్దిని	వక్రనాథ
49. జశోర్, ఈశ్వరీపుర (బంగ్లా)	వామపాణి పద్మము	యశోదేశ్వరి	చండ
50. అట్టహాస (బరద్వాన్)	క్రిందిపెదవి	ఫుల్లర	విశ్వేశ
51. నందీపూర్ (సైధియా) (బెంగాల్)	గళహారము	నందిని	నందికేశ్వర
52. శ్రీలంక	నూపురము	ఇంద్రాక్షి/శాంకరి	రాక్షసేశ్వర
53. విరాట్‌నగర్ (రాజస్థాన్)	వామపాద అంగుళి	అంబిక	అమృత
54. గండక(నేపాల్)	వామగండము	రాకినీ	వత్సనాధ భైరవ

ఈ పట్టికలో అష్టాదశ మహాశక్తి పీఠములలో ప్రసిద్ధమైన కొన్ని స్థానములు చెప్పబడ లేదు. గయలోని మంగళచండి, దక్షారామ మాణిక్యాంబ, శ్రీశైల భ్రమరాంబ, అలంపూర్ జోగులాంబ మొదలగునవి. అదేవిధంగా జీలంనది ఒడ్డున సతీదేవి చేతి వ్రేలు పడినచోటు అని ఒక గుడి ఉంది. ఆ దేవతకు 'ఛా ఛా ఛీ ఛీ దేవి' అని పేరు. డోగ్రా భాషలో ఛీ ఛీ అంటే వ్రేలు అని అర్థం. అలానే కాళికాపురాణంలో సతీదేవి శరీర భాగాలు పడినచోట్లు వేరే ఇవ్వబడినవి. హిమాచల్ ప్రదేశ్ ప్రాంతంలో ప్రసిద్ధమైన క్షేత్రాలు - నయనదేవి, జమ్మూలోని వైష్ణవి వంటి ప్రసిద్ధ ప్రదేశములు కూడా ఈ పట్టికలో రాలేదు. దీనిని బట్టి చూస్తే ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్క పట్టిక ప్రచారంలో ఉన్నట్లు గమనించవచ్చు. అన్నీ శక్తి క్షేత్రములే. దేనికదే ప్రమాణం.

15. కామాఖ్య మంత్రసాధన

ధ్యానము :

శ్లో॥ అతిసులలిత వేషాం హాస వక్త్రాం త్రినేత్రాం
జిత జలద సుకాంతిం పట్టవస్త్రాం ప్రకాశాం
అభయవరకరాఢ్యాం రత్నభూషాతి భవ్యాం
సురతరుతలపీఠే రత్నసింహాసనస్థాం
హరిహర విధి వంద్యాం శుద్ధబుద్ధి స్వరూపాం
మదనశర సమాక్తాం కామినీం కామదాత్రీం
నిఖిలజన విలాసాం కామరూపాం భవానీం
కలికలుష నిహంత్రీం యోనిరూపాం భజామి.

మంత్రం : త్రీం త్రీం త్రీం హూం హూం స్త్రీం స్త్రీం కామాఖ్యే ప్రసీద
త్రీం త్రీం త్రీం హూం హూం స్త్రీం స్త్రీం స్వాహా.

దీనిముందు ప్రణవమును చేర్చి కూడా జపించవచ్చును. ఈ మంత్ర ప్రభావాన్ని భైరవుడిలా చెపుతున్నాడు.

శ్లో॥ వరమంత్రం ప్రపక్ష్యామి సాదరం శ్రుణు పార్వతి
యస్య ప్రసాద మాసాద్య బ్రహ్మ విష్ణు శివా అపి ॥
ఇంద్రాద్యా దేవతాః సర్వా భజంతే కామనీ యుతాః
గంధర్వాః కిన్నరాదేవి తథా విద్యాధరాదయః ॥
యత్ ప్రసాదాత్ సమాగత్య స్వకీయ విషయాన్వితా
యోగినీ, డాకినీ, విద్యా, భైరవీ నాయికాదికాః
కామాఖ్యా మంత్రమాసాద్య భజంతే యోగ్యతాంపరాం
స్వర్గే మర్త్యే చ పాతాలే యేయే సిద్ధ్యంతి సాధకాః

ఓ పార్వతి ! ఈ మంత్ర దేవత యొక్క అనుగ్రహము పొంది బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు, ఇంద్రాది దేవతలు, గంధర్వులు, కిన్నరులు, విద్యాధరాదులు కామినీయుతులై తమ తమ కార్యములలో సమర్థతతో ప్రకాశిస్తున్నారు. భూలోకంలో, స్వర్గములో, పాతాళంలో సాధకులంతా యోగినులు, డాకినులు, విద్యాదేవతలు, భైరవీ నాయికాగణం, కామాఖ్యా మంత్రము పొందియే సిద్ధశక్తియుతులై అలరారుచున్నారు.

ప్రణవమును మొదట ఉంచి ఈ మంత్రమును జపించినచో ధర్మార్థ కామ మోక్షములు లభించును. సర్వ విఘ్నములు తొలగిపోవును. మండే అగ్నిలో పురుగులు పడితే ఏ రకముగా దహనమై పోతవో ఈ మంత్రస్మరణ వల్ల సర్వపాపములు నశిస్తవి. ఈ మంత్ర ప్రభావాన్ని వర్ణించటానికి నూరుకోట్ల ముఖములు కాని వెయ్యి కోట్ల నాలుకలు కాని చాలవు.

ఈ మంత్రము సిద్ధించటానికి కామాఖ్య తంత్రములోని నాల్గవ పటలములో భగలింగసాధన చెప్పబడినది.

శ్లో॥ స్వయంభూ కుసుమేనైవ తిలకం పరికల్ప్య చ
తూలికాయాం మహాదేవి కులశక్తిం సమావిశేత్ ॥
కర్పూర పూరిత ముఖః సాధకశ్చుమ్బయేన్ ముదా
తస్యాధరం యథా భృంగో నీరజవ్యాకులః శివే।
దంత క్షతి వితానాంచ పరమం తత్రకారయేత్
ఆలింగయేత్ మదోన్మత్తః సుదృఢం కుచమర్దనం ॥
నఖఘాతైః నితంబేచ రమయేత్ రతిపండితః
పునః పున శ్చుంబనంచ యోనౌ కుర్యాత్ కులేశ్వరి ॥
శుక్రంతు స్తంభయేత్ వీరో యోనౌ లింగం ప్రవేశయేత్,
అఘాతై స్తోషయేత్ తాంతు సంధాన భేదతః ప్రియే ॥
తతో లింగే స్థితే యోనౌ ఆజ్ఞాం తస్య ప్రగృహ్య చ
అష్టోత్తరశతం మంత్రం జపేత్ హోమాది కాంక్షయా ॥
దినత్రయం మహావీరః ప్రజపేత్ ధ్యానతత్పరః
ప్రాప్యతే మానసం వస్తు నాత్ర కార్యా విచారణా ॥

సాధకుడు స్వయంభూ తిలకం ధరించి సాధనకు అనుకూలవతి అయిన స్త్రీని తీసుకొని వచ్చి పక్కపై పడుకొన బెట్టవలయును. తుమ్మెద పద్మములోని తేనెను త్రాగినట్లుగా పచ్చకర్పూరము వేసుకొనిన నోటితో ఆమె క్రింది పెదవిని ముద్దు పెట్టుకొనవలయును. మధ్య మధ్యలో దంతక్షతములను అనగా పంటిగాట్లను చేయవలెను. గాఢముగా కౌగలించుకొనుచు కుచములను మర్దించవలెను. పిరుదుల యందు నఖక్షతములు చేయుచు యోనిని మరల మరల చుంబించవలయును. ఆ తరువాత యోనియందు లింగమును

ప్రవేశపెట్టి బలమైన ఆఘాతములతో రమించవలెను. అప్పుడామె అనుమతి తీసుకొని యోనియందు లింగము ఉండగా అష్టోత్తరశత మంత్రము జపించలెను. దీనివలన హోమాధికారము లభించును. ఈ విధముగా మూడురోజులు వరుసగా మహావీరుడై ధ్యానతత్పరుడై క్రీడించుచు జపించవలెను. ఈ ప్రకారముగా చేసినచో మనసులో కోరినవన్ని లభించును. ఎటువంటి సందేహమును చెందవలసిన పనిలేదు.

16. స్త్రీ రజస్వల అయినప్పుడు చేయవలసిన సాధన

శ్లో॥ ఋతుయుక్త లతాందేవీం నివేశ్య తూలికోపరి
కరవీర ప్రసూనంచ తస్యా లింగోపరిన్యసేత్ ॥
తద్వీక్ష్య దేవదేవేశి జపే దష్టసహస్రకమ్
దినత్రయం తతో దేవ్యాః ప్రీతిస్యాదచలాప్రియే ॥
ధనం విందతి తస్యైవ లక్ష సంఖ్యం న సంశయః
ఆనందం వర్థతే నిత్యం సాధకస్య న చాన్యథా

ఋతు యుక్త అయిన కాంతను పక్కపై పరుండబెట్టి ఆమె భగలింగంపై గన్నేరు పూవును వుంచి దానిని చూచుచు అష్టోత్తర సహస్రము జపించవలయును. మూడురోజులు ఈ విధముగా చేసినచో లక్షరూపాయిల ధనము లభించును. రోజురోజుకు సాధకునకు సుఖములు పెరుగును.

శ్లో॥ అష్టోత్తర శతం యోనిం సంచుంబ్య పూజ్యసజ్జనః
పునర్లింగే స్థితే యోనౌ జపే దష్ట సహస్రకమ్ ॥
కాంక్షా పంచగుణం విత్తం ప్రాప్యతే సర్వదాసుఖీ
నిత్యం తస్య మహేశాని నాయికా సంగమోభవేత్ ॥

యోనిని 108 సార్లు ముద్దుపెట్టుకొని పూజించి సాధకుడు యోని యందు లింగము నుంచి వెయ్యి ఎనిమిదిసార్లు జపించవలెను. దీనివలన కోరిన దానికి 5 రెట్లు ధనము లభించును. ప్రతిరోజూ నూతన కాంతా సంగమమును పొందును.

అదేవిధముగా యోని యందు దేవతా యంత్రము యొక్క ఊహాచిత్రమును భావించి యోనిని చూచుచు ప్రతిరోజు 300 సార్లు మంత్రమును జపించినచో సాధకుడు సిద్ధీశ్వరుడగును. దీనిలో ఎటువంటి సంశయమును లేదు.

17ఎ. శత్రువినాశనాది ప్రక్రియలు

కామాఖ్యాతంత్రములోని సప్తమపటలములో ఈ ప్రయోగమునకు సంబంధించిన వివరములు చెప్పబడినవి.

శ్లో॥ శ్రుతం రహస్యం దేవేశ కామాఖ్యాయా మహేశ్వర ।
మహాశత్రు వినాశాయా సాధనం కిం వద ప్రభో ॥

శివా ! కామాఖ్య యొక్క రహస్యములయిన విశేషములు విన్నాను. శత్రునాశన సాధనలు చెప్పవలసినది. అప్పుడు శివుడీ విధముగా చెప్పుచున్నాడు.

శ్లో॥ అతి గుహ్యతమం దేవి తవ స్నేహాత్ వితన్యతే
మహావీరః సాధకేంద్రః ప్రయోగంతు సమాచరేత్ ॥
పూజయిత్వా మహాదేవీం పంచతత్వేన సాధకః
మహానందమయో భూత్వా సాధయేత్ సాధనం మహత్ ॥

దేవీ ! ఇది పరమరహస్యము నీయందలి స్నేహము వలన మాత్రమే చెప్పుచున్నాను. మహావీరుడైన సాధకుడు కామాఖ్యాదేవిని పంచమకార సాధనలచే పూజించి ఆనందమయుడై ఈ సాధనములను చేయవలెను.

శ్లో॥ స్వమూత్రంతు సమాదాయ కూర్చబీజేన శోధయేత్ ।
తర్పయేత్ భైరవీం ఘోరాం శత్రునామ్నా పిబేత్ స్వయం
దశ దిక్షు మహా పీఠే ప్రక్షిపే దానవేపిచ
నగ్నో భూత్వా భ్రమేత్ తత్ర శత్రునాశోభవేత్ ధ్రువం

ఒక పాత్ర యందు తన మూత్రమును పోసి 'హూం'కారముతో దానిని శుద్ధి చేయవలెను. ఘోరమైన భైరవికి, శత్రునామమును ఉచ్చరించుచు ఆ మూత్రముతో తర్పణములు సమర్పించవలెను. ఆ మూత్రమును దేవతా పీఠమునకు పది దిక్కుల యందు చల్లి దేవత యొక్క ముఖముపై కూడ చల్లి దానిలో కొంత భాగము తాను తీర్థముగా తీసుకొనవలెను. నగ్నుడై మంత్రము జపించుచూ ప్రదక్షిణములు చేయవలెను. ఇట్లు చేసినచో శత్రువు నిశ్చయముగా నశించును.

17.బి. మరొక ప్రయోగము

శ్లో॥ మృత్పాత్రంతు సమాదాయ సాధ్యనామ్నాలిఖేత్ శివే
వాయునా పూరితం కృత్వా స్వమూత్రం తత్ర నిక్షిపేత్
మాయాబీజం మహేశాని అష్టోత్తర శతం జపేత్
భైరవ్యై తర్పయేత్ దేవి మారణోచ్చాటనం భవేత్ ॥

ఒక మట్టికుండను తెచ్చి తాను సాధించవలసిన వాని పేరును వ్రాయవలెను. 'యం' బీజమును ఆ పేరునకు అటు ఇటు చేర్చి ఉచ్చరించుచూ పాత్రలో మూత్రము పోయవలెను. పిదప 108 సార్లు 'హ్రీం' కారమును జపించవలయును. తరువాత ఆ మూత్రముతో భైరవికి తర్పణములు సమర్పించవలెను. దీనివలన శత్రువు యొక్క మారణముగాని ఉచ్చాటనము గాని జరుగును.

17.సి. వేరొక ప్రయోగము

పైవిధముగానే మట్టికుండలో సాధించవలసిన వాని పేరును వ్రాసి ఎడమ చేతితో లింగమును పట్టుకొని దానిలో మూత్రము పోయుచూ భైరవీమంత్రమును జపించవలయును. ఎడమచేతితో ఆ పాత్రను పట్టుకొని ఈ విధముగా మంత్రజపమును చేసినచో సాధకుడు కోరినది జరుగును. సాధ్యుడు వశమగుటగాని, పిచ్చివాడగుట గాని, క్షోభపొందిన వాడగుట గాని లేక మృతుడగుట గాని జరుగును.

శ్లో॥ స్వమూత్రంచ సమాదాయ వామహస్తేన శంకరి
శోధితం భైరవీ మంత్రే(ణ) నిక్షిపేత్ సాధకోత్తమః
ఉన్మాదో జాయతే శత్రుః మ్రియతే వా మహేశ్వరి.
మోహితః క్షోభితశ్చాపి వశ్యో వాపి భవేత్ ధ్రువం
మూత్రసాధన మాత్రేణ సహస్రాక్ష సమం రిపుం
నాశయేత్ సాధకో వీరో నాత్ర కార్యా విచారణా.

మూత్రసాధనల వలన ఇంద్రుని వంటి శత్రువునయినా జయించవచ్చును. సందేహము లేదు.

ఈ సాధన విశేషములు విని శ్రీదేవి క్రింది సందేహమును అడిగినది.

శ్లో॥ శుక్రశోణిత మూత్రాణి శుద్ధా నీహ కథం ప్రభో
తత్ వదస్వ మహేశాన సందేహ నాశనం మమ.

మహేశ్వరా శుక్రము, శోణితము, మూత్రము ఇవి శుద్ధమైనవి ఎట్లగును
దానికి శివుడు ఇలా చెప్పుచున్నాడు.

శ్లో॥ శృణుదేవి రహస్యంచ మహాజ్ఞానం వదామ్యహమ్
శుక్రోహం శోణి తస్త్వం హి ద్వయో రేవాఖిలంజగత్.
శుద్ధం సర్వశరీరంతు శక్ర శోణితజం యతః
పూర్వం భూత శరీరేతు యత్ యత్ వస్తుప్రజాయతే.
అశుద్ధం తత్ కథం దేవి పామరో నిందతి ధ్రువం.
బ్రహ్మజ్ఞాన మిదం దేవి మయాతే గదితం కిల.

దేవీ ! రహస్యమైన ఈ మహాజ్ఞానమును వినుము. నేను శుక్రమును, నీవు శోణితమవు. మన ఇద్దరి నుండియే, ఈ రెంటి నుండియే, ప్రపంచము పుట్టినది. ఈ రెంటికి గాని ఈ రెండింటి నుండి పుట్టిన శరీరముల నుండి పుట్టిన ఏ వస్తువులకు గాని అశుద్ధత లేదు. పామరులు తెలియక నిందింతురు. ఇవి అన్నియు శుద్ధమైనవని తెలిసినవాడే బ్రహ్మజ్ఞాని.

ఈ విధముగా కామాఖ్య తంత్రములోని వివిధ పటలములలో రహస్యము లయిన సాధనలు చెప్పబడినవి. ఈ విషయుములన్నీ గోప్యములు గనుక జాగ్రత్తగా రక్షించుకొనవలెను.

శ్లో॥ యధా రతిర్గోపనీయా యధా హి స్తనమండలం
యధా యోని ర్గోపనీయా గోపనీయం ప్రయత్నతః

ఏ విధముగా స్తనమండలము, యోని, రతిక్రియ ఇతరులకు కనపడకుండా ఉంచవలెనో అదే విధముగా ఈ విద్యలను కాపాడు కొనవలెను. మరొక చోట ఇదే విధముగా

శ్లో॥ స్వనారీ యోనివత్ గోప్యం గోప్తవ్యం మాతృ జారవత్

అనగా తన భార్య యొక్క యోనివలె తల్లి యొక్క జారత్వము వలె రహస్యముగా ఈ విద్యలను అట్టి పెట్టుకొనవలయును.

తన తల్లి వ్యభిచారిణి అని పదిమందికి తెలిసినచో తాను జారిణీపుత్రు డను అపవాదము కలుగును. కనుక చాలా జాగ్రత్తలను తీసికొనవలెను.

కామాఖ్యా దేవతను వర్ణిస్తూ

శ్లో॥ యాదేవీ కాళికా మాతా సర్వవిద్యా స్వరూపిణీ
కామాఖ్యా సైవ విఖ్యాతా సత్యం దేవి న చాన్యథా

సర్వవిద్యాస్వరూపిణి అయినా కాళీదేవియే కామాఖ్య అని పిలువబడుచున్నది.

శ్లో॥ శంభునేత్రాగ్ని నిర్ధగ్ధః కామః శంభో రనుగ్రహాత్
తత్రరూపం యతః ప్రాప కామరూపం తతోభవత్

శివుని కంటిమంటచే దహనమైన కాముడు మరల రూపమును పొందిన చోటు కామరూపదేశం (అస్సాం). ఈ ప్రదేశమునందు అతడు కామదేవిని స్థాపించెను. సతీదేవి యోని భాగము పడిన చోటనే ఈ దేవత కాముని చేత ఆవాహన చేయబడినది. కాముడు నల్లనివాడు. అతడు స్థాపించిన ఈ కామదేవి కూడ సహజముగా నల్లనిదే. నీలవర్ణము కలిగినది కనుక కాళిగా భావించబడినది. అష్టాదశ మహాశక్తి పీఠములలో ఉజ్జయినిలో కాళీదేవత ఉన్నది. మరల అదే పేరు మరొక చోట ఉన్నదని అనుకోవటం కంటె ఈమెను కామదేవి అని పిలవడం సముచితం. కానీ ప్రాచీన కాలములోనే ఈ దేవతను గూర్చి కాళికాపురాణము చెప్పినది. ఉజ్జయినీకాళికి ఈ దేవతకు తాత్వికముగా కొంత భేదము కలదు. ఉజ్జయినీకాళి ఉగ్రరూపిణి, భీషణమూర్తి. కామాఖ్యలోని కాళి ప్రేమస్వరూపిణి. ఈమె కామమును ప్రసాదిస్తుంది. అదే విధంగా కాశీకి కామాఖ్యకు ఉన్న భేదం గమనించతగినది. కాళికా పురాణము ప్రకారం కామదాయిని అయిన గౌరి కాశీలో లేదు. వారణాసిలోని విశ్వనాధుడు యోగీశ్వరుడు. ఆయన యోగసిద్ధిని ప్రసాదిస్తాడు. కామాఖ్యలోని కాళి, ఈ కాళితో కూడిన హరుడు ఇక్కడ సర్వకామములను అనుగ్రహిస్తారు.

శ్లో॥ వారాణసీ నామపురీ గంగాతీరే మనోహరే
స్వయం వృషధ్వజ స్తత్ర నిత్యం వసతి యోగినాం
సదా ప్రీతికరో యోగీ స్వయం చాప్యాత్మ చింతకః
నతత్ర కామదోదేవో న చిరాచ్చ ప్రసీదతి
ఆరాధిత శ్చిరం ప్రీత్యా నిర్వాణాయ ప్రసీదతి.
గౌర్యా వివర్జితా సాధు పురీ తత్ర నగచ్ఛతి.

కామకాంక్షులైన వ్యక్తులు కాశీలో సాధన చేస్తే ప్రయోజనం లేదని అక్కడ విశ్వనాథుడు ముక్తిని మాత్రమే ఇస్తాడని కోరికలు తీరాలనుకున్నవారు కామాఖ్యను ఆశ్రయించాలని కాళికాపురాణంలోని 51వ అధ్యాయంలో చెప్పబడినది.

శ్లో॥ కామరూపం మహాపీఠం గుహ్యాత్ గుహ్యతమం పరం
సదాసన్నిహితస్తత్ర పార్వత్యాసహ శంకరః
నచిరాత్ పూజితోదేవః తస్మిన్ పీఠే ప్రసీదతి
పార్వతీ చాను గృహ్ణాతి భర్గ భక్తంతు తత్రవై

కామరూప మహాపీఠమునందు పార్వతీ సహితుడైన శంకరుడు వేగముగా సర్వకామములను ప్రసాదిస్తాడు. పార్వతీదేవి కూడా శివభక్తులను వెంటనే అనుగ్రహిస్తుంది.

కామాఖ్య – కాళిగా భావించబడిన తరువాత సహజంగా ఆ దేవతామంత్రం కాళీ మంత్రం కావాలి. కానీ కామాఖ్య తంత్రంలో తారాబీజమైన 'త్రీం' వధూబీజమైన 'స్త్రీం' క్రోధబీజమైన 'హూం' కన్పిస్తున్నవి. కామబీజమైన 'క్లీం' కారం గాని కాళీ బీజమైన క్రీంకారము గాని చెప్పబడలేదు. అంతేకాక ఈ దేవతామంత్రాన్ని కాళీ తారామంత్రమని చెప్పటం జరిగింది.

శ్లో॥ కాళీతారా మనుంప్రాప్య వీరాచారం కరోతిన
భ్రష్టత్వం తత్ శరీరేణ ప్రాప్తంతేన నచాన్యథా.

కాళీతారామంత్రమును స్వీకరించి వీరాచారము అనుసరించనిచో సాధకుడు భ్రష్టుడగును. వీరాచారమనగా పంచమకారములతో గూడిన సాధన.

శో॥ కాళికా తారిణీ దీక్షాం గృహీత్వా మద్య సేవనం
నకరోతి నరో యస్తు సకలౌ పతితో భవేత్ ॥

కలియుగమునందు కాళీతారామంత్రదీక్ష తీసుకొని మద్యమును సేవించనిచో వాడు పతితుడగును. మొత్తం మీద తంత్రగ్రంథం ప్రకారం కామాఖ్యాదేవత 'కాళీతార' ఈ విషయము కామాఖ్యాతంత్రములోని తృతీయపటలములో స్పష్టముగా చెప్పబడినది. దశమహావిద్యలలోని తారాపటాలంలో తారామంత్రానికి 'అక్షోభ్యుడు' ఋషిగా చెప్పబడినది. కాళీ మంత్రములకు భైరవుడు ఋషి. ఇక్కడ కామాఖ్యామంత్రమునకు అక్షోభ్యుడే ఋషిగా చెప్పబడినది. కనుక కామాఖ్యామంత్రములో తారాతత్వము కన్పిస్తున్నది.

శ్లో॥ కామాఖ్యా మంత్ర రాజస్తు కాళీ తారాస్వరూపకః
అక్షోభ్యశ్చ ఋషిః ప్రోక్తఃఛందోనుష్ట బుదాహృతం
కామాఖ్యా దేవతా సర్వసిద్ధయే వినియోజితా
కరాంగన్యాసకాదేవి నిజబీజేన కారయేత్.
షట్ దీర్ఘ భుజాం ధ్యాయేత్ కామాఖ్యాం ఇష్టదాయినీం.
రక్తవస్త్రాం వరోద్యుక్తాం సిందూర తిలకాన్వితాం
నిష్కళంక సుధాకామ వదానాంబురుహోజ్వలామ్
స్వర్ణాది మణి మాణిక్య భూషణైర్ భూషితాం పరాం.
నానారత్నాది నిర్మాణ సింహాసనో పరిస్థితాం
హాసవక్త్రాం పద్మరాగ మణికాంతి సముజ్జ్వలాం
పీనోత్తుంగ కుచాం కృష్యాం శ్రుతిమూలగతేక్షణాం
కటాక్షైశ్చ మహాసంపత్ దాయినీం పరమేశ్వరీం
సర్వాంగ సుందరీం నిత్యాం విద్యాభిః పరివేష్టితామ్.
డాకినీ యోగినీ విద్యాకరీభిః పరిశోభితాం
కామినీ భిర్యుతాం నానా గంధాద్యైః పరిగంధితాం.
తాంబూలాది కరాభిశ్చ నాయికాభిర్విరాజితాం
సమస్త సిద్ధవర్గాణాం ప్రణతానాం ప్రతీక్షణామ్
త్రినేత్ర సమ్మోహకరాం పుష్పచాపేషు బిభ్రతీం
భగలింగ సమాఖ్యానం కిన్నరీ భ్యోపి శృణ్వతీమ్
వాణీ లక్ష్మీ సుధావాక్య ప్రతివాక్య మహోత్సుకామ్
అశేష గుణ సంపన్నాం కరుణాసాగరాం శివాం.

ఈ వర్ణన చదువుతూంటే సాక్షాత్ లలితాదేవి వర్ణనవలె ఉన్నది. ఎఱ్ఱని వస్త్రములు ధరించి ఎర్రని దేహకాంతితో, పుష్ప ధనుర్బాణములు ధరించి కామవృత్తాంతములందు ఆసక్తి చూపిస్తున్న కామదేవత ఈమె. కాళీదేవి వలె కపాలమాలలు ధరించటం గాని, శ్మశాననివాసం కాని, దిగంబరత్వం కాని నరకరమేఖల ధరించటం గానీ లేదు. పూర్తి శృంగార స్వరూపిణిగా చెప్పటం జరిగింది. ఈ దేవతకు గన్నేరు పూవంటే చాలా యిష్టం. జపాకుసుమములన్నా అంతే.

శ్లో॥ కరవీరేషు దేవేశి కామాఖ్యా తిష్ఠతి స్వయం
జపాయాంచ తథావిద్ధి మాలత్యాది సమీపకే.
కరవీరస్య మాహాత్మ్యం కథితుం నైవశక్యతే
ప్రధానాత్తు జపాయాశ్చ గాణపత్యమవాప్నుయాత్

కామాఖ్యాదేవి గన్నేరు పూలయందు, జపాపుష్పములయందు ఉండటానికి ఇష్టపడు తుంది. ఆ దేవతామంత్రంతో ఆ పూలను దానం చేస్తే గాణపత్యము లభిస్తుంది. ఆమె

మాలతీ పుష్పములకు దగ్గరగా ఉంటుంది. ప్రధానంగా ఈ దేవతా మంత్రసిద్ధి కలగటానికి పంచమకారములుపయోగించి తీరవలెనని ఈ తంత్రము చెప్పుతున్నది.

శ్లో॥ పూజయేదంబికాం దేవీం పంచతత్వేన సర్వదా
పంచతత్వం వినాం పూజాం అభిచారాయ కల్పతే
పంచతత్వేన దేవ్యాస్తు ప్రసాదో జాయతే క్షణాత్
మద్యేనమోదతే స్వర్గో మాంసేన మానవాధిపః
మత్స్యేన భైరవీ పుత్రో ముద్రాయా ధాతృతాంవ్రజేత్
మైధునేన మహాదేవి సాయుజ్యం లభతేనరః

కామాఖ్యా దేవతయొక్క మంత్రసిద్ధి కలగటానికి మకార పంచకములు తప్పవు. ఇవి లేక పూజిస్తే అభిచారముతో సమానము. ఇవి ఉపయోగిస్తే క్షణంలో దేవీ ప్రసాదం లభిస్తుంది. మద్యముచే స్వర్గము, మాంసము చేత రాజ్యాధికారము, మత్స్యము చేత భైరవీ పుత్రత్వము, ముద్రచేత బ్రహ్మ పదవి, మైధునము చేత సాయుజ్యము పొందవచ్చునట వామాచార తంత్రములన్నింటిలోనూ ఈ ప్రక్రియలు చెప్పబడినవి. కామాఖ్యా తంత్రములో అదనంగా చెప్పబడినది మూత్రసాధన. గణపతి తంత్రంలో మాత్రమే ఈ విధానము వర్ణించబడినది. ఉచ్ఛిష్ట గణపతి విగ్రహముపై ఉమ్మి వేయుచు జపము చేయుట మూత్రముతో తర్పణములు అభిషేకములు చేయుట ఉచ్ఛిష్ట విధానములలో కలదు. ఉచ్ఛిష్ట గణపతి తంత్రములలో సాధకుడు తన మలములో శ్మశాన భస్మమును కలిపి మూత్రముతో ముద్ద చేసి గణపతి విగ్రహమును తయారుచేసి మద్యాదులు నైవేద్యం పెట్టి మంత్రసాధన చేసినచో గణపతి సిద్ధిస్తాడని చెప్పబడింది. శాక్తేయ సాధనలలో రక్తానికి ప్రాధాన్యము ఎక్కువ. శ్మశానభస్మంలో తన రక్తాన్ని కలిపి దేవీ విగ్రహాన్ని చేసి పూజించటం, అలానే జంతురక్తము లేక మానవరక్తము కుంకుమ, చితాభస్మములలో కలిపి దానితో బియ్యము కలిపి అక్షతలు చేసి ఆ అక్షతలతో దేవీ యంత్రమునకు గానీ విగ్రహమునకు గాని మంత్రముతో పూజ చేస్తే చాలా వేగంగా తీవ్రదేవతల అనుగ్రహం కలుగుతుందని తంత్రగ్రంధములు చెప్తున్నవి. అదే రీతిగా స్త్రీ యోనిని కడిగిన నీళ్ళతో అభిషేకము తర్పణము కూడా ప్రశస్తముగా వర్ణించ బడినవి. పురుషుడు తన వీర్యము అద్ది జిల్లేడుపూలతో కాళీదేవిని పూజిస్తే మహారాజవుతాడని చెప్పబడింది. అదే విధముగా స్త్రీల రజోరక్తముచే తడిసిన వస్త్ర ఖండములతో హోమము చేస్తే చరాచర వస్తువులను సర్వజీవులను ఆకర్షించవచ్చునని శాక్తేయవిద్యలు అభివర్ణించినవి. వీటన్నింటిలో స్వశరీరములోని రక్తమునకు విలువ ఎక్కువ అని తాంత్రికుల అభిప్రాయము. చండీ సప్తశతిలోని సమాధి, సురధుల కథలో వారిద్దరు మూడు సంవత్సరముల పాటు నిత్యము చండీదేవికి రుధిర తర్పణం చేయటం వల్ల దేవీ సాక్షాత్కారాన్ని పొందడమే కాక కోరిన వరములన్నింటిని అందుకో గలిగారు.

లోకంలో మత్స్యమాంసములు తినేవారు కూడా రక్తమును తీసుకోరు. రక్తము తీసుకోవటం రాక్షస లక్షణం. రక్తతర్పణం వల్ల రక్తాన్ని సమర్పణ వల్ల తీవ్రదేవతలకు

వేగంగా దయకలుగుతుంది. చండీసప్తశతిలో రక్తబీజుడనే రాక్షసుని సంహరించడానికి కాళీదేవి తన నాలుకను నేలమీద పరచగా దానిపై పడిన ఆ రాక్షసుని రక్తమును ఆమె త్రాగి వానిని సత్వహీనుని చేసి సంహరించిన కథ సుప్రసిద్ధమైనది. అక్కడి నుండి కాళీదేవి అంటే రక్తపానముచేసే దేవత అని లోకంలో ప్రఖ్యాతి వచ్చింది. కాళీదేవి యొక్క బొమ్మ అనగానే ఎర్రనినాలుక చాచిన భయంకరమూర్తిగా చిత్రించటం అలవాటయింది. ఆమె ఎప్పుడూ నాలుక చాచే ఉంటుందా! భక్తులతో మాట్లాడేటప్పుడు, ప్రియుడైన మహాకాలునితో క్రీడించేటప్పుడు నాలుకచాచి ఉంచదు కదా ! అయినాసరే ప్రపంచంలో ఒక దేవతకు ఒక గుర్తు ఏర్పడిన తరువాత దానినే అనుసరించటం ఆచారం అవుతుంది. అదే కాళీదేవి విషయంలో కూడా జరిగింది.

ఒక తీవ్రదేవత రాక్షస సంహారానికి అవతరించినప్పుడు ఆ తామసమూర్తి ఉపాస్యదేవత కావటం సహజమే. అయితే కాలక్రమాన ఆమెలో వాత్సల్యాన్ని, ప్రేమను చూడాలనుకున్న భక్తులు ఆమె పెదవుల కొక చిరునవ్వును, ఆమె కన్నులలో కరుణను, ముఖములో లాలిత్యాన్ని భావించి దర్శించి ఆ స్వరూపాన్ని లోకానికి తెలియచేస్తారు. కాళీదేవి విషయంలో కూడా అదే జరిగింది. సాత్వికమూర్తి అయిన శ్వేతకాళిగా, రాజసమూర్తి అయిన అరుణకాళిగా, ప్రేమస్వరూపిణి అయిన శ్యామకాళిగా ఆమెను భక్తులు దర్శించారు. వైదికమైన ఆచారాన్ని పాటించే ఆలయాలలో జంతుబలులు లేవు గాని తాంత్రికమైన పద్ధతులలో పూజలు జరిగే చోట ఇప్పటికీ జరుగుతూనే ఉన్నవి. ప్రభుత్వాలు చట్టాలు కొంతవరకు మాత్రమే ఆపగలవు. ఉదాహరణకు అస్సాం లోని కామాఖ్యలో జంతుబలుల సమర్పణ ఇప్పటికీ సాగుతునే ఉన్నది. కలకత్తాలో శక్తి పీఠమయిన కాళీమందిరంలో ఇప్పుడు కూడా జంతుబలులు కొనసాగుతూనే ఉన్నాయి. దక్షిణేశ్వరంలో రాణీ రాసమణి నిర్మించిన కాళీ ఆలయంలో చాలా కాలం జంతుబలులు ఇవ్వబడినట్లు రామకృష్ణమిషను ప్రచురణలలో ఉన్నది. ఇప్పుడు మాత్రం అక్కడ ఆపివేశారని చెప్పబడుతున్నది. ఏమయినా కాళీసాధన దక్షిణాచార మార్గంలో కంటే వామాచార శ్మశానసాధన పద్ధతులలోనే వేగంగా సిద్ధిస్తుందనేది అధిక సంఖ్యాకుల విశ్వాసం.

18. నరకుని కథ

కామాఖ్యకాళిని ఉపాసించి వివిధ శక్తులు సాధించి వానిని దుర్వినియోగం చేసి నాశనమయిన వారిలో నరకుడు ప్రధానుడు. ద్వాపరయుగంలోని నరకుని కంటె ముందు ఆ పేరుగల రాక్షసుడు మరొకడు ఉన్నట్లు పురాణములలో కన్పిస్తుంది. రామాయణంలోని కిష్కింధకాండలో సుగ్రీవుడు తన మామ అయిన సుషేణునితో సముద్రంలోని ప్రాగ్జ్యోతిష పురములోని నరకాసురుని గుహలలో సీతాదేవిని రావణుడు ఉంచాడేమో వెదకవలసినదిగా సూచించాడు. అక్కడ 'దుష్టాత్మా నరకోనామ దానవః' అని చెప్పబడింది. యుద్ధకాండలో రావణాసురు డొకచోట ఇలా అన్నాడు.

శ్లో॥ శంబరో దేవరాజేన నరకో విష్ణునాయథా
తథాద్య శాయితారామో మయాయుద్ధినిపాతితః

దేవరాజు చేత శంబరుడు, విష్ణువు చేత నరకుడు చంపబడినట్లుగా ఈనాడు యుద్ధములో రాముడు నాచేత చంపబడి భూమిపై పడియున్నాడు". ఇక్కడ నరకుడు 'దితి' పుత్రుడు. పదివేల సంవత్సరములు తపస్సు చేసి గొప్పవరములు పొందినవాడు. వాడు తపస్సిద్ధుడైనప్పటికి, వానిని తాను చంపుతానని విష్ణువు ఇంద్రునికి వాగ్దానము చేసి,ఆ విధముగానే సంహరించినాడు. దీనిని బట్టి ఈ నరకాసురుడు పూర్వ యుగములలో దితి పుత్రుడయిన రాక్షసుడు. కృష్ణుడు చంపిన నరకాసురుని కథ ప్రస్తుత పరిశీలనములోనిది.

విష్ణువు వరాహావతారములో ఉన్నపుడు పృథ్వీ దేవి ఆయనను మోహించి తన కామవాంఛ తీర్చమని కోరింది. ఆ సమయానికి ఆమె రజస్వల అయి ఉన్నది. ఆమె కోర్కెను కాదనలేని ఆది వరాహమూర్తి ఆమెతో క్రీడించాడు. రజస్వలా సంగమ ఫలితంగా ఆమె గర్భములోని వాడు రాక్షసుడయినాడు. ఆ రాక్షసుడు ఉదయిస్తే లోకవినాశకుడవుతాడని, వానిని జయించటం, చంపటం సులభం కాదని భావించిన దేవతలు ఆమె ప్రసవించకుండా తమ దివ్యశక్తితో ఆపివేశారు. ప్రసవం ఆగిపోయింది కాని నెప్పులు తగ్గలేదు. ఆ బాధ భరించలేక ఆమె విష్ణువును ప్రార్థించింది. విష్ణుదేవుడు సాక్షాత్కరించి లోకవినాశన భయంతో దేవతలు ప్రసవాన్ని ఆపివేశారని ఆమెకు 28వ మహాయుగంలోని త్రేతాయుగంలో కుమారుడు పుడతాడని చెప్పి తన శంఖంతో ఆవిడ గర్భాన్ని స్పృశించాడు. ఆమె నొప్పులు తగ్గినవి.

తరువాత కొంతకాలానికి త్రేతాయుగంలో సంతానం లేని దశరధుడు పుత్రకామేష్టి చేసి నలుగురు కుమారులను పొందాడు. వారే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు. అదే సమయంలో విదేహరాజుగా ఉన్న జనకునికి కూడా సంతానం లేక దశరధుడు చేసిన యజ్ఞాన్ని గురించి విని తన ఆస్థాన పురోహితుడయిన శతానందుని తన చేత కూడా యజ్ఞం చేయించి పిల్లలు పుట్టే లాగా చేయవలసినదని ప్రార్థించాడు. శతానందుడు అంగీకరించి తన తండ్రి అయిన గౌతముని సహాయంతో ఒక ప్రత్యేకమయిన యాగాన్ని చేయించాడు. శతానందుడు జనకునితో "మహారాజా! వసిష్ఠమహర్షి దశరథమహారాజుతో చేయించిన యజ్ఞంలో యజ్ఞపురుషుడు హోమకుండంలో సాక్షాత్కరించి పాయసాన్ని ఇచ్చాడు. దశరధుడు ఆ పాయసాన్ని తన భార్యల కీయగా వారు గర్భవతులై సంతానాన్ని కన్నారు. మేము చేస్తున్న యజ్ఞం ఆ యజ్ఞం కంటె కూడా అధికతర శక్తి కలిగినది. మహా తపస్సంపన్నుడైన మా తండ్రి గౌతమ మహర్షి అనుమతితో ఈ యజ్ఞశాలలో నేను అపూర్వమును సృష్టిస్తాను. యజ్ఞపురుషుడు పాయసాన్ని తెచ్చి ఇవ్వటము దానిని మీరు మీ భార్యకు ఇచ్చి ఆమె గర్భవతియై తొమ్మిది నెలల తరువాత సంతానాన్ని కనటము జరుగనక్కర లేదు. ఈ యజ్ఞభూమి నా మంత్రశక్తి చేత పవిత్రీ కృతమైనది. మీరు బంగారు నాగలి తీసుకొని భూదేవికి నమస్కరించి ఈ నేలను దున్నండి. మీ నాగలి చాలులో నుండి పిల్లలు పుట్టుకు

వస్తారు. ఈ అద్భుతమైన అనుభూతిని మీరే స్వయముగా చూచి పొందండి" అన్నాడు. జనకమహారాజుకు ఆశ్చర్యం కల్గింది. అందరూ చూస్తూ ఉండగా ఆయన నాగలితో భూమిని దున్నాడు. నాగలి చాలు చీల్చుకొని భూమి పగిలి దానిలో నుండి ఇద్దరు మగపిల్లలు ఒక ఆడపిల్ల పైకి వచ్చారు. భూమిలో నుండి ఒక దివ్యవాణి ఈ విధముగా వినిపించింది. "జనకమహారాజా ! నేను భూదేవిని. ఈ యజ్ఞమునకు నేను సంతోషించి నిన్ను అనుగ్రహిస్తున్నాను. దేవర్షి అయిన నారదుడు, యజ్ఞము చేయించిన శతానంద గౌతములు ఇంకా యెందరో ఋషులు ఇక్కడ ఉన్నారు. వీరి సన్నిధిలో నేను చెప్పింది జాగ్రత్తగా విను. నీ వంశం నిలవడం కోసం ఇద్దరు మగబిడ్డలను ప్రసాదించాను. వారితో పాటు ఒక ఆడపిల్ల కూడ నీకు ఇవ్వబడింది. ఈమె కారణజన్మురాలు. ఈమె కారణంగా లోకకంటకుడయిన రావణుడు సంహరించబడతాడు. రావణవధ జరిగిన తరువాత మరల నీవు ఈ యజ్ఞప్రదేశానికి రావాలి. అప్పుడు మరొక మగబిడ్డ నీకు ఇవ్వబడతాడు. వాడు నా కుమారుడు. వానిని నీవు పెంచి పెద్ద చేయవలెను" భూదేవి యొక్క మాటను జనకుడు శిరసావహించి ఆ విధంగానే చేస్తానని వాగ్ధానం చేశాడు.

కాలం గడుస్తున్నది సీతారాముల వివాహం రావణవధ జరిగిన కొంత కాలానికి భూదేవి జనకుని యజ్ఞభూమిలో కుమారుని ప్రసవించింది. జనకుని దగ్గరకు వెళ్ళి పూర్వము అతడు చేసిన వాగ్ధానాన్ని గుర్తుచేసి అర్థరాత్రి అతనిని యజ్ఞభూమి దగ్గరకు తీసుకు వచ్చి తన కుమారుని అప్పగించి అతనిని స్వంతబిడ్డవలె పెంచమని కోరింది. జనకుడు అంగీకరించి భూమి మీద నుండి ఆ బిడ్డను ఎత్తుకుంటూ ఆ శిశువు తల క్రింద ఒక నరకపాలముఉండటాన్ని గమనించాడు. నరకపాలముపై దొరికిన వాడు గనుక నరకుడు అని పేరు పెట్టాడు. జనులను తండ్రివలె కాపాడు వాడు జనకుడు. ఈ బిడ్డ కూడా ఆ విధంగానే నరులను కాపాడే వాడు కావాలని నరకుడు అని పేరు పెట్టారని కొందరు భావిస్తున్నారు. ఆ బిడ్డను రాజభవనానికి తీసుకొని వెళ్ళి తన మహారాణికి అప్పగించి, ఇంతకు ముందు యజ్ఞశాలలో మనకు బిడ్డలు లభించినట్లుగానే ఈ పిల్లవాడు గూడ లభించాడని వీడూ తన కుమారుడే కనుక, జాగ్రత్తగా పెంచమని కోరాడు. పురోహితుడయిన శతానందుడు శాస్త్రోక్త సంస్కారములన్నీ ఆ పిల్లవానికి చేయించాడు. జనకుని పిల్లలతో పాటు నరకుడు కూడా పెరిగి పెద్దవాడవుతున్నాడు. తన బిడ్డను తాను జాగ్రత్తగా చూచుకోవాలన్న కోరికతో భూదేవి కాత్యాయని అన్న పేరుతో మానవాకారాన్ని ధరించి రాజపరివారంలో దాదిగా చేరి నరకునికి సేవచేస్తున్నది. 16 సంవత్సరములు ఈ విధముగా గడిచిన తరువాత జనకుడు తన కుమారుల కంటె నరకుడు ఎక్కువ బలపరాక్రమాలతో ప్రకాశించటాన్ని గమనించి వాడినే రాజును చేయవలసి వస్తుందేమో అని విచారించాడు. ఆయన వ్యాకులపాటును చూచి మహారాణి కారణమడిగితే చెప్పకుండా ఒక పరమరహస్య మున్నది మూడు నెలల తరువాత చెపుతాను, తానొక వాగ్దానము చేతకట్టుబడిఉన్నానని జనకుడు చెప్పాడు. వీరి సంభాషణను విన్న కాత్యాయని ఇక ఎక్కువ కాలం ఇది దాగదన్న సంగతి గ్రహించి ఒక

రోజు గౌతముని సన్నిధిలో జనక మహారాజుతో "మహారాజా ! నా మాట మన్నించి నా బిడ్డను పెంచి పెద్దచేశారు. కృతజ్ఞురాలిని. ఇక నా బిడ్డనునేను తీసుకుపోతాను" అన్నది. జనకుడు చాలా సంతోషించి అంగీకరించాడు.

ఆ రోజు రాత్రి కాత్యాయని (భూదేవి) నరకునితో తనతో ఏకాంతంగా గంగానది దగ్గరకు రమ్మని కోరింది. తండ్రియైన మహారాజు అనుమతి లేక రానని తిరస్కరించాడు నరకుడు. అప్పుడామె విషయాన్ని వివరించి రహస్య సత్యాన్ని తెలిపి నీ అసలు తండ్రి విష్ణుమూర్తి అని తెలియజేసింది. ఆశ్చర్యపడిన నరకుడు ఆసక్తితో ఆమెతో గంగానదీ తీరానికి ఏకాంతంగా వెళ్ళాడు. ఆమె ప్రార్థించగా విష్ణుమూర్తి ప్రత్యక్షమై నరకుని ఆశీర్వదించాడు. ముగ్గురూ కలసి గంగానదీ మార్గంకుండా ప్రయాణం చేసి ప్రాగ్జ్యోతిషపురాన్ని చేరుకున్నారు. విష్ణుదేవుడు ప్రాగ్జ్యోతిష పురం రాజధానిగా బ్రహ్మపుత్రానదీ ప్రాంతం మొత్తానికి అతనిని రాజుగా ఏర్పాటు చేశాడు. విదర్భరాజు కూతురైన 'మాయ' అనే కన్యను నరకునికిచ్చి పెండ్లి చేసి సుఖంగా పరిపాలించుకొమ్మని ఆజ్ఞఇచ్చి ఇలా సలహా ఇచ్చాడు. "నాయనా ! నీ తల్లి అయిన భూదేవికి ఇచ్చిన వాగ్దానం వల్ల నీకీ ఉపకారం చేశాను. నీ రాజ్యంలో, నీ పరిపాలనలో అందరినీ ధర్మబద్ధంగా పరిపాలించు. బ్రాహ్మణులతో, మహర్షులతో, దేవతలతో ఎప్పుడూ ఘర్షణపడవద్దు. వారితో పోట్లాటలు తెచ్చుకొనవద్దు. ఈ నీలాచలయోనిపీఠంలో మహాశక్తి అయిన కామాఖ్యాదేవి ప్రకాశిస్తున్నది. ఆమె జగన్మాత. ఆమెను తప్ప ఏ ఇతర దేవతనూ నీవు పూజించరాదు. ఈ మాటలకు భిన్నంగా జరిగితే నీకు ప్రమాదం వస్తుంది. అయినా ఆత్మరక్షణ కోసం ఒక శక్త్యాయుధాన్ని నీకు అనుగ్రహిస్తున్నాను. ప్రాణాపాయం వచ్చినప్పుడు మాత్రమే దీనిని ఉపయోగించు. ఈ విధంగా చెప్పి విష్ణుమూర్తి చిరునవ్వుతో "భూదేవీ ! నీకు ఇచ్చిన మాట ప్రకారం వీనికి తగిన ఏర్పాట్లు చేశాను. నీకు సంతృప్తి కలిగింది కదా?'' అన్నాడు. భూదేవి కృతజ్ఞత తెలిపింది. నరకుని ఆశీర్వదించి ఇద్దరూ అదృశ్యులయినారు.

విష్ణుమూర్తి ఇచ్చిన సూచనల ప్రకారం తన రాజ్యంలో బ్రాహ్మణాదులకు ఉన్నత స్థానాన్ని కల్పించాడు. వేదాధ్యయనములు యజ్ఞములు విష్ణుప్రీతికరమైన పురాణ ప్రవచనములు రాజ్యమంతా జరుగుతున్నవి. దేశమంతా శాంతిగా, సుభిక్షంగా, ధర్మబద్ధంగా సాగుతున్నది.

ఈవిధంగా కొంతకాలం గడిచింది. తండ్రి అయిన విష్ణుదేవుడు చెప్పిన మరొక మాట అతని మనసులో మెదలుతున్నది. కామఖ్యాదేవిని తప్ప 'ఇతర దేవతలను పూజించవద్దు", 'ఆమెను భక్తితో అర్చించు' అని చెప్పిన అంశాన్ని మనసులో పెట్టుకొని ఆ దేవి గుడికి వెళ్ళి పూజలు చేయటం మొదలుపెట్టాడు. ఆ దేవత యొక్క అనుగ్రహాన్ని పొందటానికి సులభమైన పద్ధతులేమైనా ఉన్నవా? అని గుడి పెద్దలను పిలిపించి విచారించాడు. వారిలో ఒక వృద్ధ పూజారి మహారాజుకు ఇలా మనవి చేశాడు. "మహాప్రభూ ! ఈ దేవత

సాధన యందు మీకు అభిరుచి ఉంటే ఏకాంతంగా మీకు తెలియచేస్తాను. ఆ సాధన పద్ధతులన్నీ బహిరంగా చెప్పేవి కావు. ఆ మాటలకు ఆసక్తి కల్గిన నరకుడు ఆయనను ఒంటరిగా పిలిపించుకొని మాట్లాడాడు. ఏకాంత ప్రదేశంలో ఆ వృద్ధపూజారి మహారాజుతో ఈ విధంగా విన్నవించాడు. “సార్వభౌమా ! కామాఖ్యాదేవి ఆలయం అత్యంత పురాతనమైనది. ఈ దేవతకు సంబంధించిన పూజావిధానాలు జపహోమ సాధనలు ప్రత్యేకమైనవి. భారతదేశంలోని శక్తిమంతమైన దేవాలయాలకు ఒక్కో దానికి ఒక్కో చరిత్ర ఉన్నది. సాత్విక, రాజస, తామస, ఆలయాలలో వేని పద్ధతులు వానివే. కానీ ఈ దేశములో బ్రాహ్మణ్యము అన్ని దేవాలయాలను సాత్విక పద్ధతిలోనికి మార్చివేసినవి. అందువలన వేదోక్త మార్గంలో దక్షిణాచార పద్ధతి ననుసరించి అన్నిచోట్ల అర్చన విధానాలు వచ్చినవి. దానివలన ప్రజలు శాంతి సుభిక్షాలతో ఉండటం జరుగుతున్నది. ఆ బ్రాహ్మణులలో కోటికొక్కడు కఠోర తపస్సు చేసి దివ్య శక్తులు సాధించిన వాడుంటాడు. వానిని చూపించి మిగతా వారంతా వట్టి అహంకారముతో దర్పయుతంగా జీవిస్తుంటారు. ఇప్పుడు ద్వాపరయుగము జరుగుతున్నది. వెనుకటి కాలంలో వలె ఉగ్రతపస్సులు చేసేవారు తగ్గిపోయినారు. ఆ మార్గంలో దివ్యశక్తులు సాధించటం సులభం కాదు. రాజస, తామస పద్ధతులలో సాధనచేస్తే వేగంగా సిద్ధశక్తులు సాధించవచ్చు. కానీ వాటిని క్షుద్రములని దురాచారములని పాపహేతువులని వైదికులు త్రోసిపుచ్చుతారు. నరక మహారాజా ! దివ్యశక్తులు సాధించటానికి కావలసిన యోగ్యత మీలో ఉన్నది. మీ తండ్రి అయిన విష్ణుమూర్తి ఈ కామాఖ్య కాళిని అనన్యభక్తితో సేవించమని చెప్పినట్లు నేను విన్నాను. కాని మీరు యజ్ఞములు చేయిస్తున్నారు. యజ్ఞశాలకు వెళ్ళి అక్కడి దేవతలను, బ్రాహ్మణులను పూజిస్తున్నారు. అంటే మీరు మీ తండ్రిగారు చెప్పిన మాట తప్పినట్లే కదా ! నేను తొందరపడి ఈ మాట అన్నందుకు మన్నించండి. మీ రాజ్యములోని బ్రాహ్మణులలో ఇందరు యజ్ఞములు చేసిన వారుండగా వీరిలో ఒక్కరైన తపస్సంపన్నులయిన శాపాయుధులు ఉన్నారా ? ఎక్కడో వీరారణ్యంలో కొండమీది ఆశ్రమంలో ఉన్న వసిష్ఠుడు మహిమాన్వితుడని దూరంతా చెపుతుంటారు. అవునో కాదో అది వేరే విషయము. నేనూ బ్రాహ్మణుడనే. గాయత్రీ మంత్రాన్ని చిరకాలం అనుష్ఠానం చేశాను. విశ్వామిత్రుని వలె వేల ఏండ్లు ఈ రోజులలో చేయలేము కదా! విసిగి వేసారుతున్న నాకు ఒక కౌలికుడు తటస్థించాడు. అతడిది ఏ కులమో తెలియదు. అతని దగ్గర కొన్ని చిత్రమైన శక్తులున్నాయి. వాని యందు నేను మోజుపడి అతనికి సేవచేశాను. కొన్నాళ్ళకు కనికరము కలిగి “ఏమయ్యా ! నీవు కామాఖ్య గుడి పూజారివి. ఆ దేవత సర్వశక్తి సంపన్నురాలు. ఆమె అనుగ్రహాన్ని పొందితే నా దగ్గర ఉన్న వాటి కంటే అధికతరమైన శక్తులను నీవు పొందవచ్చు అన్నాడు. ఆ మార్గాన్ని చెప్పమని ప్రార్థించాను. అతడు కొన్ని రహస్య సాధన పద్ధతులు నాకు నేర్పాడు. ఆ పద్ధతులలో సాధన చేసి నేను కొంత సాధించగలిగాను. అవి పదిమందిలో చెప్పరానివి. మీరు ఏకాంతముగా నన్ను పిలిచారు కనుక మీరనుమతిస్తే చెబుతాను. అయితే ఈ వృద్ధుడు అసభ్యములు, అశ్లీలములు అయిన

విషయములు పలుకుతున్నా డేమని అనుకోవద్దు. అగ్రహించవద్దు. మీరు శ్రద్ధగా వింటానని అంటే చెప్పటానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు. నరకుడు నవ్వుతూ నిన్ను అందుకేనయ్యా ! పిలిపించాను. నిన్ను గురించి కొంత విన్నాను. నీ సాధనల గురించి కూడా కొంత తెలుసు. నీకు స్వేచ్ఛగా చెప్పటానికి అనుమతిస్తున్నాను" అన్నాడు. అప్పుడు మళ్ళీ ఆ వృద్ధుడు ఇలా ప్రారంభించాడు. "రాజాధిరాజా ! నేను ఏమి సాధనలు చేశానన్నది పెద్ద ప్రధానం కాదు. తమ రేమి చేస్తే మహాశక్తులు వస్తవన్నది ప్రధానము. నా సాధనల వల్ల కొంత స్ఫురణ కలిగింది. ఆదియుగములలో ఉన్న ఒక అసురేశ్వరులు మీరు. అప్పుడు కూడా మీ పేరు ఇదే. పదివేల సంవత్సరాలు బ్రహ్మను గూర్చి తపస్సు చేసి ఎన్నో వరములు పొందారు. అయినా మాయావి అయిన విష్ణుమూర్తి చేత సంహరించబడ్డారు. దేవదానవ యుద్ధాలలో ఎప్పుడూ జరుగుతున్నదే ఇది. ఈ జన్మలో భూదేవికి వరాహమూర్తికి మీరు ఉదయించారు కదా ! ఆ వరాహమూర్తి విష్ణుమూర్తి యొక్క అవతారము. మీకంటే ముందు భూదేవి, వరాహమూర్తులకు పుత్రులుండేవారు. వారు పరాక్రమసంపన్నులయిన రాక్షసులే. దేవతలను జయిస్తే, సహించలేని ఆ దేవతలు రుద్రుని సహాయం కోరారు. తన బిడ్డల మీద ప్రేమతో వానిని చంపటానికి వచ్చిన మహేశ్వరునితో మీ తండ్రి యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో మహేశ్వరుడు ఓడిపోయే స్థితిలో ఉండగా తన అంశ అని కూడా పరిగణించకుండా విష్ణుమూర్తి మహేశ్వరునికి సహాయం చేశాడు. ఆ సాయం వల్ల వచ్చిన శక్తితో మహేశ్వరుడు మీ తండ్రిని సోదరులను చంపివేశాడు. నీవు మహారాక్షసుడవు. ఆ స్ఫురణ మీకు కలిగి అసురసంబంధమైన మాయాశక్తి సాధించాలంటే ఈ కామాఖ్యదేవత నుపాసించాలి.

ఉజ్జయినిలోని కాళి ఉగ్రదేవత. రక్తతర్పణం చేస్తే, శ్మశానసాధనలు చేస్తే ఆ దేవత అనుగ్రహిస్తుంది. ఆమె తామస శక్తి. ఇక్కడి కాళి రాజసశక్తి. శివుని కంటిమంటచే దహనమయిన కాముడు – కామేశ్వరి అయిన లలితాదేవి అనుగ్రహం వల్ల తిరిగి రూపాన్ని పొంది, ఆ కామేశ్వరిలోని కామశక్తిని ఆవాహన చేసి ఇక్కడ ప్రతిష్ఠించాడు. దాక్షాయణి అయిన సతీదేవి యొక్క శరీర ఖండములలో యోని భాగం పడిన ఈ చోట, ఈ కామదేవత స్థాపితమైనది. కనుక ఈ దేవత 'కామరూప', 'కామప్రియ'. ఈమెను కామంతో పూజించాలి. సౌందర్యవతులైన కన్యలను తెచ్చి ఈమె ఎదురుగా గర్భాలయంలో కామాఖ్యా మంత్రము జపిస్తూ రతి చేయాలి. రతిరసాన్ని పీఠయోనియందు అనులేపనము చేయాలి. స్రవించిన వీర్యంలో జిల్లేడుపూలు అద్ది పూజించాలి. ఆ స్త్రీ యొక్క యోని ప్రక్షాళిత జలంతో దేవికి తర్పణములు, అభిషేకములు చేయాలి. అంతేకాదు. ఆ కాంతలు రజస్వలలు అయినపుడు ఆ రజో రక్తము అద్దిన వస్త్ర ఖండములతో హోమములు చేయాలి. లక్షలసంఖ్యల హోమములు చేయటానికి, ఇంతకుముందు చెప్పిన పూజలు చేయటానికి ఎందరో కన్యలు కావాలి. ఈ మార్గానికి కౌళిక మార్గమని పేరు. పంచమ కారములలోని అయిదు వస్తువులూ ఇక్కడ పూజకు అవసరమే. వానిలో మద్య మైధునములకు ప్రాధాన్యము ఎక్కువ. మామూలు వామాచారసాధనలో ఏ స్త్రీ అయినా పనికి వస్తుంది. కానీ నేను మీకోసం ఎంపిక చేసిన

ప్రత్యేక సాధనలో కన్యలే కావాలి. ఇతర పురుషునిచేత అనుభవించబడని కన్యలను తెచ్చి వారి భగములకు తంత్ర శాస్త్రోక్తమైన పద్ధతులలో పూజలు చేసి మంత్ర సహితముగా వారితో రమిస్తే కామాఖ్యాదేవి అత్యంత వేగంగా సిద్ధులను ప్రసాదిస్తుంది. మీరు మహారాజులు. మీరు తలచుకొంటే ఏమయినా చేయగలరు. చేయగలరని, చేస్తారని నాకు స్ఫురించబట్టే నేను ఇన్ని మాటలు మీతో సాహసించి పలికాను. నరకాసుర మహారాజా ! మిమ్ము మొదటిసారి అసురరాజుగా సంబోధించి ఈ విశేషాలను అందిస్తున్నాను. నేను భృగువంశీయుడను. భార్గవులమైన మేము ఎప్పుడూ అసురులకు ఆప్తులమే".

నరకుడు ఈ మాటలన్నీ విన్నాడు. భార్గవ శ్రేష్ఠుడా ! నీ మాటలు నమ్ముతున్నాను. మీరు చెప్పిన విధంగా కామసాధనలు చేస్తాను. భగోపాసన చేసి దివ్యములైన సిద్ధులు సాధిస్తాను. వేలకన్యలను తెచ్చి దేవికి సమర్పిస్తాను. వారితో నేను చేసే రతిక్రీడలతో, పూజాభిషేకములతో కామదేవి అనుగ్రహాన్ని సాధిస్తాను మీరు నాకు అన్ని విధాల సహకరించండి. ఈనాటి నుండి మా కులగురువులు మీరే.

ఆ తరువాత కొద్ది రోజుల నుండే నరకుడు తీవ్రకామసాధనలు ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు సాగిన కామయాగంలో ఎందరో కన్యలు అతని కామార్తికి బలి అయినారు. త్వష్ట యొక్క కూతురు 'కశేరు' నామం కలిగిన కన్యను బలవంతంగా తెచ్చాడు. అదేవిధంగా గంధర్వకన్యలు, రాజకుమారికలు, మొత్తం 16000 మందికి పైగా నరకుని చేత బలవంతంగా తీసుకొని రాబడ్డారు. వామాచార మార్గంలో తీవ్రకామసాధనలు చేసిన నరకునకు కామాఖ్యాదేవి ఎన్నో వరములను ప్రసాదించింది. అప్రతిహతమైన పరాక్రమము అజరత్వము అఖండ భోగశక్తి ఆమె అతనికి అనుగ్రహించింది. ఆ పరాక్రమప్రాభవంతో తనను ఎదిరించిన చైనాజాతి వారి నందరిని ఓడించి లొంగదీసుకొన్నాడు. ఇవాళ అస్సాం, నాగాలాండ్, మేఘాలయ, సిక్కిం అని చెప్పబడుతున్న దేశాలన్నీ అతని రాజ్యంలో ఉండేవి.

అతని పెంపుడు తండ్రి అయిన మిథిలానగర ప్రభువు, జనకమహారాజు నరకుని వైభవాన్ని శౌర్యగాథలను విని తన మహారాణితో కలిసి ప్రాగ్జ్యోతిషపురానికి వచ్చాడు. వారికి అపూర్వమైన స్వాగతం చెప్పి శ్రద్ధాభక్తులతో మహారాజోచితమైన మర్యాదలు చేశాడు. 'విదేహ' చిన్నరాజ్యం. దాని ప్రభువైన జనకునకు వేదాంతిగా బ్రహ్మజ్ఞానిగా సమస్త రాజలోకములో ఋషిమండలిలో గౌరవ మర్యాదలున్నవి. అంతే కాని సార్వభౌములకుండే వైభవం లేదు. తన పెంపుడు కొడుకు యొక్క అనంతమైన ఐశ్వర్యాన్ని చూచి జనకుడు ముగ్ధుడైనాడు. నరకుని ఆతిధ్యాన్ని ప్రేమతో స్వీకరించి కొన్నాళ్ళ తరువాత ఆ వృద్ధరాజదంపతులు మిథిలకు వెళ్ళిపోయినారు.

మాయాదేవి యందు నరకుడు నలుగురు కుమారులను కన్నాడు. తన మొదటి కుమారునకు తన భగోపాసనకు గుర్తుగా 'భగదత్తుడు' అని పేరు పెట్టాడు. మిగిలిన ముగ్గురు మహాశీర్షుడు, మదవంతుడు, సుమాలి. కామాఖ్యాదేవి ఇచ్చిన సిద్ధశక్తుల వరగర్వంతో

అతడు ఇంద్రుని జయించాడు. దేవమాత అయిన అదితిదేవి యొక్క మహిమాన్వితమైన కుండలములను అపహరించాడు. రత్నములతో స్థగితమై అమృతవర్షిణియై దివ్యతేజస్సు కలిగిన వరుణుని ఛత్రమును బలవంతముగా తీసుకొన్నాడు. ఆ కాలంలో అతనిని ఎదిరించగలవాడు గాని, గెలవ గలవాడు గాని ఎవరూ లేరు.

తాంత్రిక సాధనల వల్ల భగోపాసన వల్ల కామాఖ్యాదేవి కరుణను పొంది దివ్యశక్తులను పొందిన తరువాత అతనికి వైదికమైన క్రతుకలాపములు నిస్సారముగా కన్పించినవి. వేదపండితులు, వేదవిద్యలు అతని దృష్టిలో చాలా అల్పమైనవిగా కన్పిస్తున్నవి. తనవలె సిద్ధశక్తులు సాధించిన వారెవరూ ఆ వేదవేత్తలలో లేరు. వేదమంత్రముల వల్ల, యజ్ఞముల వల్ల తొందరగా దివ్యశక్తులు రావన్న నిశ్చయానికి ఎప్పుడోవచ్చాడు. అతడు తాను వైదిక క్రతువులు చేయటం మానేశాడు. వాటిని ప్రోత్సహించటమూ మానివేశాడు.

ఈ విధంగా నరకాసురుడు సుదీర్ఘకాలం కామరూప రాజ్యాన్ని పరిపాలించాడు. ఎదిరించిన కిరాతరాజు ఘటకుని సంహరించి చైనీయులను గెలిచి తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకొన్నాడు. ఇది ఇలా వుండగా కామరూపదేశంలోని చాలా ప్రాంతాలలో నిరంతర యజ్ఞయాగములు జరిగినందువల్ల ప్రజలు దీర్ఘకాలం జీవిస్తున్నారు. మరణించిన వారు కూడా ఎవరూ నరకానికి వెళ్ళటం లేదు. అందరూ స్వర్గాది దివ్యలోకాలకే వెడుతున్నారు. దీనితో నరకంలోని వివిధ విభాగాలు ఖాళీగా ఉన్నవి. యమధర్మరాజుకు దిగులు పుట్టి బ్రహ్మతో వెళ్ళి చెప్పుకున్నాడు. అందరూ కలసి మహేశ్వరుని దగ్గరకు వెళ్ళారు. మహేశ్వరుడు తన పరివారంలోని ఉగ్రతార అన్న తీవ్రదేవతను పిలిచి పరివారంతో వెళ్ళి ఆ పరిస్థితిని చూడమన్నాడు. ఉగ్రతార ఆధ్వర్యంలో రుద్రగణాలు బయలుదేరి యజ్ఞశాలలను ధ్వంసం చేసినవి. యజ్ఞకర్తలయిన బ్రాహ్మణుల ఇండ్లు వాకిళ్ళు ఆక్రమించి అందరినీ వెళ్ళగొట్టినవి. దిక్కులేని బ్రాహ్మణులంతా ఆ ప్రాంతంలో ఉన్న వసిష్ఠ ఆశ్రమానికి పరుగెత్తారు. ఉగ్రతార సపరివారంగా వసిష్ఠాశ్రమం మీదకే దాడి చేసింది. వసిష్ఠుడు బ్రాహ్మణ్యానికి అభయమిచ్చాడు. ఆశ్రమం ఆవరణలో ప్రవేశించబోయిన రుద్రగణం శక్తిహీనమై నిలుచుండి పోయింది. అపారమైన ఆ మహర్షి తపఃప్రభావం ముందు వారి ఆయుధాలు కాని వారి దగ్గర ఉన్న క్షుద్రవిద్యలు కాని వారి వశంలో ఉన్న తాంత్రికశక్తులుకానీ ఏవీ పనిచేయలేదు. దుష్టసేనలకు ఆధ్వర్యం వహించిన ఉగ్రతారను “తారా ! ఇన్నాళ్ళుగా మహాదేవతగా పూజలందుకొన్న నీవు బ్రాహ్మణ హింస తలపెట్టావు. యజ్ఞవిధ్వంసము చేయించావు. నిన్ను దేవగణం నుండి బహిష్కరిస్తున్నాను. వైదికమైన పూజలలో నీకు స్థానము లేకుండుగాక ! నిన్ను ఈ దుష్కార్యానికి పంపిన రుద్రుడు కూడా అట్లే అగునుగాక. యజ్ఞములలో ఇకపై మీకు ఆహుతులు పడవు. హోమగుండములోని హవ్యహవానుడు మీకు పవిత్రములైన హవ్యములను అందించడు. దురాచారపరులైన మ్లేచ్ఛులచేత క్షుద్రమార్గములలో పూజింపబడుతూ, జంతుబలులను స్వీకరిస్తూ బ్రతకండి. ఈ కామరూప దేశంలో రుద్రునకు గాని, తారాదేవికి గాని వేదవిహితములైన అర్చనలో స్థానము లేకుండును గాక !” అని శపించాడు. ఆ

మహాపురుషుని బ్రహ్మతేజస్సు ముందు నిలువలేక తార, ఆమెతో వచ్చిన రుద్రగణము నిశ్శబ్దముగా వెళ్ళిపోయినారు.

అప్పుడు వసిష్ఠుడు "విప్రులారా ! ఈ జరిగిన సంఘటనలు చాలా ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నవి. ఈ ప్రాంతానికి పరిపాలకుడు నరకుడు, భూదేవి, విష్ణువుల కుమారుడు. విష్ణుదేవుని అనుగ్రహం వల్ల తన రాజ్యాన్ని పొంది బ్రాహ్మణులను పోషిస్తూ యజ్ఞయాగాలు చేయిస్తూ దేవతా ప్రీతికరంగా ప్రవర్తిస్తున్నాడని విన్నాను. చక్రవర్తి అయిన అతనికి తెలియకుండా అతని అనుమతి లేకుండా అతని రాజ్యంలోని ఒక రాష్ట్రంలో ఇలా ఎందుకు జరిగింది అన్నాడు. అప్పుడు ఆ బ్రాహ్మణ్యములోని పెద్దలు కొందరు ముందుకు వచ్చి పరిస్థితిని తెలియచేశారు. "బ్రహ్మర్షీ ! మీరు మహానుభావులు. ఈ ప్రపంచ వ్యవహారములు మీకు ఎక్కువ పట్టవు. నిరంతర తపోధ్యానములలో ఉన్న మీరు ఎప్పుడో కాని ఈ విషయాలను పట్టించుకోరు. బ్రాహ్మణులకు ఇప్పుడు పెద్ద ఆపద వచ్చింది. మీ దగ్గరకు వచ్చి ప్రార్థించి మీ రక్షణ పొందగలిగాము. ఇప్పుడు కామరూపదేశంలో ఉన్న పరిస్థితి బ్రాహ్మణులకు అనుకూలంగా లేదు. ఇటీవల దేశాధిపతి అయిన నరకుడు యోనిపీఠము నందలి కామాఖ్యాదేవిని వామాచారమార్గంలో పూజించి సిద్ధశక్తులు సాధించాడని కథలు ప్రచారంలో ఉన్నవి. కామాఖ్యా దేవాలయంలో ఇప్పుడు వైదికమార్గంలో పూజ జరగటం లేదు. దేవీయజ్ఞము లేవీ ఆగమశాస్త్ర పద్ధతిలో నిర్వహించబడటం లేదు. ఇది వరకు వలె బ్రాహ్మణులను గౌరవించటం లేదు. పోషించటం గాని యజ్ఞములు చేయించటం గాని నరకుడు చేయటం లేదు. అంతేకాక పూర్వయుగములలోని నరకాసురుడు తానేనని, తాను దేవ విరోధినని బాహాటంగా ప్రకటించి త్రివిష్టపముపై దాడి చేసి ఇంద్రుని జయించి అక్కడి సిరిసంపదలను కొల్ల గొట్టి తెచ్చాడు. అతడిప్పుడు బ్రాహ్మణద్వేషి. విశేషించి కొన్ని సిద్ధశక్తులు సాధించిన వాడు. వామాచారసాధనల కోసం మైధునం ద్వారా కామాఖ్యా దేవిని సంతృప్తి పరచటం కోసం కొన్ని వేల మంది గంధర్వ, రాజ, కన్యకలను తెచ్చి వాళ్ళ ఇష్టంతో సంబంధం లేకుండా మంత్ర సహిత మైధున క్రీడలను చేసి కాళీ అనుగ్రహాన్ని పొందాడని అంటున్నారు. ఈ వార్తలన్నీ చిలవలు పలవలుగా పల్లెలలో పట్టణాలలో వ్యాపించినవి. పరమేశ్వరి అయిన జగన్మాత యోనిపీఠనివాసినిని, కామాఖ్యకాళి ఏమి చేస్తున్నదో తెలియదు. ఎందుకు ఉపేక్షిస్తున్నదో అర్థం గావటం లేదు".

బ్రహ్మర్షి అయిన వసిష్ఠుడు "మీరు చెపుతున్న ఈ సంగతులు దిగ్భ్రాంతికరంగాను బాధాకరంగాను ఉన్నది. నేను స్వయంగా వెళ్ళి నరకునితో మాట్లాడుతాను. జగజ్జనని అయిన కామాఖ్యను స్వయంగా పూజించి ప్రార్థిస్తాను. మీలో ముఖ్యులు నాతో రావచ్చు" అన్నాడు. ఆ భూసురులలో ప్రముఖులు కొంతమంది వసిష్ఠునితో బయలుదేరి అందరూ ప్రాగ్జ్యోతిష పురం చేరుకున్నారు.

సరాసరి వీరు కామాఖ్యా మందిరానకి చేరేసరికి సామాన్య దర్శన సమయం అయిపోయింది. రాత్రివేళ మొదటిజాము అయిపోవస్తున్నది. అక్కడి అర్చకులను బ్రాహ్మణులు

వెళ్ళి "మహానుభావుడయిన వసిష్ఠమహర్షి అమ్మవారిని స్వయంగా పూజించటానికి వచ్చారు అనుమతించండి" అని అడగారు. ఆ పూజారులు వీరిని లెక్కచేయలేదు. దర్శన సమయం అయిపోయింది. అంతేకాదు గర్భగుడిలోకి వెళ్ళి పూజచేయటానికి వసిష్ఠమహర్షినే కాదు మరెవ్వరినీ అనుమతించేది లేదు" అన్నారు. ఇంతలో ఆ రోజు నిశాపూజ చేయటానికి నరకుడు స్వయంగా అక్కడకు వచ్చాడు. గర్భాలయంలో పంచమకారములు సిద్ధం చేయబడి ఉన్నవి. అతని మైధునక్రీడకు రాజకన్యలు కొందరు అలంకృతలై ఉన్నారు. అప్పటికే నరకుడు మద్యపానం చేత కైపెక్కి ఉన్నాడు. అక్కడ జరుగుతున్న గందరగోళాన్ని పూజారులు, రాజోద్యోగులు వసిష్ఠుని రాకను ఆయన కోరికను మహారాజుకు తెలియజేశారు. నరకుడు క్రోధ వివశుడై వసిష్ఠునితో కామాఖ్యా దర్శనంగాని, గర్భాలయ ప్రవేశంగాని, వీలుకాదని ఖండితంగా తిరస్కార పూర్వకంగా అహంకారముతో గద్దించాడు. బ్రాహ్మణ నాయకులందరూ భయభ్రాంతులై నిశ్చేష్టులై చూస్తున్నారు. వసిష్ఠుని ముఖంలో జ్వలిస్తున్న అగ్నిదేవుడు కన్పిస్తున్నాడు. ఆ బ్రహ్మణ్యుని ముఖం ఎర్రబడింది. ఆగ్రహంతో ఆ మహర్షి నోటి వెంట ఇలా వచ్చింది. "మూర్ఖ నరకాసురా ! దైవద్రోహం చేశావు. ధర్మద్రోహము చేస్తున్నావు. దీని ఫలితంగా నీ తండ్రి అయిన విష్ణువే మానవునిగా అవతరించి నిన్ను సంహరించునుగాక ! నీవు చంపబడిన తరువాతనే నేను ఈ కామాఖ్య దర్శనానికి వస్తాను" అంటూ కామాఖ్యదేవి గర్భాలయం వైపు తిరిగి "కాళీ! ఎందుకు సహిస్తున్నావు ? ఈ దుష్టుని ఎందుకుపేక్షించావు ? ఎందుకైనా ఏమయినాసరే పూజార్హతను నీవు కోల్పోయినావు. ఈ దేశము నుండి నిన్ను బహిష్కరిస్తున్నాను. ఇక్కడ నుండి వెళ్ళిపో. అపూజ్యవైన నీకు ఇక్కడ స్థానం లేదు. అనుల్లంఘనీయమైన నా తపశ్శక్తితో నిన్ను శపిస్తున్నాను" అన్నాడు. నరకుడు, రాజాధికారులు దిగ్భ్రాంతులయినారు. మహారాజును, దేవతను శపించిన ఈ వ్యక్తి ఎవరు ? ఇతనిని ఖండ ఖండములుగా నరకాలి. ఇతనితో వచ్చిన ఈ బ్రాహ్మణులను సంహరించాలి. అని రాజు సైనికులు కత్తులు దూశారు. వసిష్ఠుడొక్కసారి, అందరివైపు తీక్ష్ణంగా చూశాడు. కత్తులు పట్టిన చేతులు స్తంభించిపోయినవి. తనతో వచ్చిన బ్రాహ్మణులతో వసిష్ఠమహర్షి నిశ్శబ్దంగా నిష్క్రమించాడు.

నరకాసురుడు నెమ్మదిగా తేరుకొని కామాఖ్యా మందిరంలోకి నడిచాడు. గర్భాలయంలోకి ప్రవేశించగానే వికృతమైన నిశ్శబ్దం తప్ప అక్కడ ఏమీ లేదు. యోని పీఠంగాని, కామాఖ్యాదేవిగాని అక్కడ కన్పించటం లేదు. ఇంతకాలంగా తన చేత పూజలందుకొని తనకు వరము లిచ్చిన మహాదేవత ఉన్నట్లుండి అదృశ్యమయి పోయింది. ఈ బ్రాహ్మణుని తపశ్శక్తికి జగజ్జననియే నిలువ లేకపోయినదా! భయంతో వణికి పోయినాడు నరకుడు.

నరకుడు తన మందిరానికి వెళ్ళి తల్లి అయిన భూదేవిని తండ్రి అయిన విష్ణువుని ఈ ప్రమాదం తప్పించమని ప్రార్థించాడు. ఆ ఇద్దరిలో ఎవరూ సాక్షాత్కరించలేదు. ఏమి చేయాలో తోచక నరకుడు అసుర గురువైన శుక్రాచార్యుల కోసం కబురు చేశాడు. ఆయన

వచ్చి నరకుని ప్రార్థన విని కామాఖ్య దేవిని తిరిగి రప్పించటం తన వల్లకాదని, కొన్నియజ్ఞాలు బ్రహ్మరుద్ర దేవతాత్మకమైనవి చేయించి ఆ దేవతలు నరకునికి కొన్ని వరములిచ్చేలా చేసి వెళ్ళిపోయినాడు.

వసిష్ఠుని తపశ్శక్తి వల్ల అదృశ్యమైన కామాఖ్య పరమేశ్వరుడైన మహాదేవుని దగ్గరకు వెళ్ళి తన శాపాన్ని తొలగించమని ప్రార్థించింది. మహాదేవుడు వసిష్ఠుని శాపం అనుభవించక తప్పదని అయితే శాపసమయాన్ని మూడు వందల సంవత్సరాలకు తగ్గిస్తున్నాని వరమిచ్చాడు. (ఈ విషయమంతా యోగినీ తంత్రంలో వర్ణించబడింది).

ఇక్కడ ప్రాగ్జ్యోతిషములో నరకాసురుని దగ్గరకు శోణనదీ ప్రాంతపరిపాలకుడు, మిత్రుడు అయిన బాణాసురుడు వచ్చి ఆప్తునికిగా కొన్ని సలహాలు ఇచ్చాడు. నీవు వసిష్ఠుని శాపము వల్ల, కామాఖ్యాదేవి అదృశ్యం కావటం వల్ల నీ వినాశనం కోరుకొంటున్న దేవతలు సంతోషిస్తున్నారు. నీ చేత ఓడించబడిన వారంతా ఇప్పుడే నీ మీదకు దండయాత్రకు రావటానికి సాహసించరు. అయితే నీ జాగ్రత్తలు నీవు తీసుకోవాలి రాజ్యంలోని ప్రధానమైన అధికార స్థానాలన్నింటిలో విశ్వాసపాత్రులు, బ్రహ్మద్వేషులు అయిన రాక్షసులను నియమించు అని నరకునికి చెప్పాడు. నరకుడు ఆ సలహాను పాటించి మురాసురుడు, హయగ్రీవుడు మొదలైన పరాక్రమవంతులయిన రాక్షసులను రాజ్యాధికారులుగా నియమించగా వారు పరిపాలన కొనసాగిస్తున్నారు.

దేవతలంతా విష్ణుదేవుని దగ్గరకు వెళ్ళి నరకాసురుని దురాగతాలను వివరించి వానిని సంహరించవలసిందిగా ప్రార్థించారు. విష్ణుమూర్తి అంగీకరించి భూలోకంలో మానవునిగా అవతరించి ఒక్క నరకాసురునే కాక దుష్టరాక్షసులనందరినీ సంహరించి శాంతిని నెలకొల్పుతానని మాట ఇచ్చి వారిని పంపించాడు. ఆ తరువాత షుమారు 250 సంవత్సరములు గడవగా దేవకీ, వసుదేవుల కుమారునిగా, విష్ణుమూర్తి, కృష్ణుడన్న పేరుతో ఉదయించాడు. మధురలో పుట్టి బృందావనంలో పెరిగి పన్నెండేండ్ల వయసులో తిరిగి మధుర వచ్చి కంససంహారము చేసి జరాసంధుని దండయాత్రల నుండి యాదవులను రక్షించటం కోసం యాదవులనందరినీ తీసుకొని సుదూరంగా పశ్చిమ సముద్రతీరంలోని ద్వారకకు వెళ్ళిపోయి అక్కడ రాజ్యాన్ని స్థాపించి, తన మాతా మహుడు, కంసుని తండ్రి అయిన ఉగ్రసేనుని రాజుగా ఏర్పాటు చేశాడు. కాలక్రమాన రుక్మిణి, సత్యభామ మొదలైన అష్టమహిషులను పెండ్లిచేసుకొన్నాడు.

ఈ విధంగా కృష్ణుడు ద్వారకలో ఉండగా దేవవల్లభుడైన మహేంద్రుడు వచ్చి దర్శనం చేసుకొని నరకాసురుని దురాగతాలను వివరించి వానిని సంహరించ వలసిందిగా ప్రార్థించాడు. కృష్ణుడు అంగీకరించి సైన్యంతీసుకొని బయలుదేరాడు. ముద్దులభార్య అయిన సత్యభామ తానుకూడా వస్తానని మారాం చేసింది. సర్వజ్ఞుడైన కృష్ణుడు, భూదేవి యొక్క అంశయైన సత్యభామ నరకాసురుని వధకు తోడ్పడటం మంచిదని భావించి అంగీకరించాడు.

సేనానివహంతో బయలుదేరి కామరూపదేశంలో ప్రవేశించాడు. నరకుని రాజధాని అయిన ప్రాగ్జ్యోతిషాన్ని ప్రవేశించాలంటే దానికి ముందు నిర్మోచనపురం ఉన్నది. అది పేరుకు పట్టణమే కాని నరకుని సైనిక స్కంధావారము. ప్రధానమంత్రి అయిన మురాసురుని కుమారులు పరివారమైన రాక్షసవీరులు ఆరువేలమందితో దానిని రక్షిస్తుంటారు. ఖడ్గపాశధరులైన వారందరిని శ్రీకృష్ణుడు సంహరించాడు. వారిని దాటి రాజధానిలో ప్రవేశిస్తుండగా నరకుని ప్రధాన సైన్యంతో యుద్ధం చేయవలసి వచ్చింది. యుద్ధరంగంలో ముఖ్యులైన మురాసురుడు, హయగ్రీవుడు, మొదలైన వారందరినీ కృష్ణుడు చంపివేశాడు. ఇక నరకుడు స్వయంగా యుద్ధరంగంలోకి దూకాడు. తనకంటె ముందు పుట్టిన ఒక యాదవునితో అసురేశ్వరుడైన తాను యుద్ధం చేయవలసిరావటం నరకునికి నామోషి అనిపించింది. ఎన్ని వందల ఏండ్ల నుండి జీవిస్తున్నా కామాఖ్యకాళి ఇచ్చిన వరముల వల్ల అతడికి ముసలితనము రాలేదు. రణరంగంలో భార్యతో సహా వచ్చిన కృష్ణుని చూచి అతనికి ఆశ్చర్యము వేసింది. 'ఏమి సాహసమితనికి ?' అని ఆశ్చర్యపడ్డాడు. ఇంతలో మురాసురుని పుత్రిక 'కామకటంకట' అను పేరు గల కన్య నరకాసురుని దగ్గరకువచ్చి "మహారాజా ! నా తండ్రిని, సోదరులను అందరినీ ఈ కృష్ణుడు వధించాడు. ఇతనిని నేను సంహరిస్తాను. కామాఖ్యాదేవి నాకు అజేయత్వమును వరంగా ఇచ్చింది. అనుమతించు" అని ప్రార్థించింది. ఆమె తీవ్రమైన ఆకాంక్షను చూచి కాదనలేక నరకుడు సరేనన్నాడు. ఆమె కృష్ణుని మీదకు వెళ్ళి మాయాశక్తి వల్ల ఆయుధ వర్షాన్ని కురిపించింది. శ్రీకృష్ణుడు ఆమాయాజాలాన్నంతటిని తొలగించి ఆమెను వధించటానికి చక్రం తీసుకున్నాడు. అప్పుడు కామాఖ్యా దేవి ప్రత్యక్షమై కృష్ణదేవా ! ఈ బాలికను చంపవద్దు. ఈమెకు అజేయత్వాన్ని, అవధ్యత్వాన్ని వరంగా ఇచ్చాను. అప్పుడు వాసుదేవుడు, కాళీదేవి మాటను గౌరవించి ఘటోత్కచుని స్మరించాడు. స్మరణ మాత్రం చేత వచ్చిన ఘటోత్కచునితో 'ఈ అమ్మాయి సంగతి నీవు చూడు' అని తాను నరకుని మీదకు వెళ్లాడు. నెమ్మదిగా ప్రధాన యుద్ధరంగంలో నుంచి పక్కకు తప్పించి ఆమెతో యుద్ధం మొదలు పెట్టాడు ఘటోత్కచుడు. పేరుకు యుద్ధమే. అతడు ఏమీ యుద్ధం చేయటం లేదు. ఆమెకు ఆశ్చర్యంగా ఉంది. కృష్ణుని ముందు నిలువలేక పోతున్న తనతో వీడెవడో వచ్చి యుద్ధం మొదలు పెట్టాడు. అవతల కృష్ణ నరకాసురుల యుద్ధం మొదలయింది. ఇటువైపు వీడెవరో తమ రాక్షసజాతి వాని వలె ఉన్నాడు. వీడు కృష్ణుని వైపు వచ్చి యుద్ధం చేస్తున్నాడేమిటి ? ఏమైనా శత్రువు – శత్రువే. ఘటోత్కచుని మీద ఆసురియైన మాయను ప్రయోగించి బాణములు ఆయుధాలు కురిపించింది. ఘటోత్కచుడు ఆమె మీద ఏ ఆయుధ ప్రయోగమూ చేయలేదు. ఆమె ప్రయోగించిన ఆయుధాలన్నింటిని ఈగలను, దోమలను తోలినట్లుగా ప్రక్కకు నెట్టివేస్తున్నాడు. ఆమె ప్రయోగించిన మాయలు ఏవీ అతని మీద పనిచేయటం లేదు. ఘటోత్కచుడు ఇంతకంటె అధికమయిన మాయాశక్తులు కలవాడు. రాక్షసి అయిన హిడింబకు, పాండవుడయిన భీమునకు పుట్టినవాడు. అతడు సరాసరి ఆ ఆయుధవర్షం మధ్యలో నడుస్తూ వెళ్ళి కామకటంకట సమీపం చేరుకొని ఆమెను

కౌగలించుకొని ముద్దుపెట్టుకొన్నాడు. యుద్ధం చేయక ఇదేమి పని ? అని ఆమె అంటూంటే, "చేసిన యుద్ధం చాలు, నాతో కామయుద్ధం చేద్దువులే. దానిలోనైనా గెలవగలవేమో చూద్దాము" అన్నాడు ఘటోత్కచుడు. వారిద్దరి యుద్ధం ఆ రకంగా ముగిసింది. నరకాసురవధ తరువాత వారిద్దరికి వివాహం జరిగినట్లు స్కాందపురాణంలోని కౌమారీ ఖండంలో చెప్పబడింది.

ఇక నరకాసురుడు కామాఖ్యాదేవి రావటం, కృష్ణుని వెనకాల ఉండటం గమనించాడు. చిరకాలం తాను ఉపాసించిన దేవత శత్రుపక్షంలో చేరినదన్నమాట. తన ఉపాస్యదేవత, ఆమెను తానేమి చేయగలడు ? బహుశా ఈ కృష్ణుని చేతిలో తనకు మరణం తప్పనట్లున్నది. ఇన్నాళ్ళు ప్రపంచంలో తల ఎత్తుకొని మహావీరునిగా జీవించాడు' ఇప్పుడు కూడా వీరునివలె మరణించాలని నిశ్చయించుకొని అతి తీవ్రంగా కృష్ణునితో యుద్ధంచేశాడు. ఒకదశలో నరకుని బాణాహతికి కృష్ణుడు మూర్ఛపోతే, సత్యభామ విల్లు ధరించి నరకునితో యుద్ధం చేసింది. కృష్ణుడు కాసేపటికి తేరుకొని ఇక ఉపేక్షించి లాభంలేదని చక్రప్రయోగం చేసి నరకుని శిరస్సు ఖండించాడు.

నరకాసురుని సంహరించిన తరువాత రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని అదితిదేవి స్వర్ణకుండలాలను అమృతవర్షాన్ని కురిపించే వరుణుని ఛత్రాన్ని, ఇతర దివ్యాభరణాలు తీసుకొన్నాడు. తరువాత కొద్దికాలానికే స్వర్గానికి వెళ్ళి ఎవరి వస్తువులు వారికి అప్పగించాడు.

నరకాసురుని రాజ్యానికి, పెద్ద కుమారుడైన భగవదత్తుని పట్టాభిషేకం చేసి ధర్మబద్ధంగా రాజ్యాన్ని పరిపాలించుకోమని అప్పగించాడు. నరకుడు బలవంతంగా తెచ్చిన 16000 మంది రాజకుమారికలు శ్రీకృష్ణుని తమను భార్యలుగా స్వీకరించమని ప్రార్థించారు. నరకుని చేత పాడు చేయబడిన వారికి, సమాజంలో స్థానం లేదు. నిస్సహాయలై దయనీయమైన స్థితిలో ఉన్న ఆ బాలికల మీద కృష్ణునికి జాలి కలిగి వారందరినీ వివాహమాడి తనతో పాటు ద్వారకకు తీసుకు వెళ్ళే ఏర్పాటు చేశాడు. ఈ వ్యవహారాలన్నీ పూర్తి చేసిన తరువాత అక్కడి నీలాచలం మీద యోనిపీఠంలో కామాఖ్యాదేవికి పునః ప్రతిష్ఠ చేసి ఆ దేవతను అక్కడ ఉండి భక్తులను రక్షించమని కోరాడు. కామాఖ్యాదేవి అంగీకరించి మూడువందల సంవత్సరాల తరువాత మళ్ళీ యోనిపీఠ నివాసిని అయింది.

వసిష్ఠమహర్షి కూడా అక్కడకు వచ్చి ఆమెను పూజించాడు. (మరల యథావిధిగా పూజలు, అర్చనలూ అప్పటినుండి ఇప్పటిదాకా జరుగుతునే ఉన్నవి.) ఆ తరువాత కొంతకాలానికి ధర్మరాజు రాజసూయ యాగం తలపెట్టినప్పుడు దిగ్విజయానికి బయలుదేరిన అర్జునుడు ఆ ప్రాంతానికి వచ్చి శాకల ద్వీపాన్ని జయించి ప్రాగ్జ్యోతిషం మీదకు వచ్చాడు. కిరాతులతో, చైనీయులతో గూడిన అపార సేనావాహినితో భగదత్తుడు అర్జునుని ఎదిరించి 8 రోజులు భయంకర యుద్ధం చేసి కూడా అర్జునుని ఏమీ చేయలేక ఆశ్చర్యపడ్డాడు.

అప్పుడు యుద్ధమాపి అర్జునునితో "అర్జునా ! నీవు ఇంద్రపుత్రుడవని విన్నాను. ఇంద్రుడు నా స్నేహితుడు. మిత్రుని కుమారుడవైన నీతో యుద్ధం కొనసాగించటం నాకు ఇష్టం లేదు. నా 400 సంవత్సరాల వయస్సులో యాదవ వంశీయుడైన కృష్ణుని తప్ప నీ అంతటి పరాక్రమం కలవారిని నే నెవరినీ చూడలేదు. నీకేమి కావాలి ? యుద్ధానికి ఎందుకు వచ్చావు ? మన మధ్య శత్రుత్వమేమీ లేదు" అన్నాడు. అర్జునుడు అతనితో "రాజులకు శత్రుత్వాలు ఉండనవసరం లేదు. చక్రవర్తిత్వాన్ని స్థాపించుకోవటానికి దిగ్విజయ యాత్రలు చేస్తారు. మా అన్నగారైన యుధిష్ఠిర మహారాజు రాజసూయ యాగం చేస్తున్న సందర్భంగా యజ్ఞనియమాన్ని అనుసరించి, దిగ్విజయం చేయటానికి వారి సోదరుల మయిన నలుగురము నాలుగు దిక్కులకు బయలుదేరినాము. నా తండ్రి అయిన ఇంద్రుని మిత్రుడవని తెలిసింది. కనుక నాకు నీతో యుద్ధం చేయాలని లేదు. యుధిష్ఠిర మహారాజుకు తగిన కానుకలు సమర్పించండి" అన్నాడు. భగదత్తుడు కూడా అర్జునుడు చెప్పినవిధంగా కానుకలు సమర్పించాడు. ఆ తరువాత కాలంలో మహాభారత యుద్ధం వచ్చినప్పుడు భగవదత్తుడు దుర్యోధనుని వైపు వచ్చి పాండవులతో యుద్ధం చేశాడు. మహాభారతం ద్రోణపర్వంలో అర్జున భగదత్తుల యుద్ధం వివరంగా వర్ణించబడింది భగదత్తుడు చాలా ముసలి వాడని చర్మం వ్రేలాడుతున్నదని రెప్పలు కనుల మీద వాలిపోతూ కనులు తెరువలేని స్థితిలో రెప్పలను పైకి లాగి పట్టువస్త్రంతో కట్టి అర్జునునితో యుద్ధం చేశాడని వర్ణించబడింది. సుదీర్ఘకాలం జీవించిన అతని తండ్రికి కామాఖ్యాదేవి వరం వల్ల ముసలితనం రాలేదు. ఇతడు మాత్రం ముసలివాడయినాడు. భారతయుద్ధం నాటికి ఇతని వయస్సు 300 సంవత్సరాలకు పైన ఉన్నది. యోనిపీఠ నాయిక అయిన కాళి వరం వల్ల పుట్టాడు కనుక ఇతనికి భగదత్తుడని పేరు వచ్చిందని ఇంతకు ముందే చెప్పబడింది. ఆ తరువాత వసిష్ఠశాపం వల్ల కాళీదేవి 300 సంవత్సరముల పాటు ప్రాగ్జ్యోతిష పురంలో లేదు. ఆ తరువాత నరకాసురవధ, తదనంతరం షుమారు 40, 50 సంవత్సరములకు భారత యుద్ధం జరిగింది. కామాఖ్యకాళిని కులదైవం వలె కొలిచినా తండ్రివలె సిద్ధశక్తులను భగదత్తుడు సాధించలేదు. కాకపోతే తన దగ్గరి వైష్ణవశక్తిని నరకుడు భగదత్తునకు ఆయుధంగా ఇచ్చాడు. ఆ శక్తి విద్య, నరకుని రాజును చేసినపుడు విష్ణువు ఇచ్చినది. భారతయుద్ధంలో భగదత్తుడు దానిని అర్జునునిపై ప్రయోగించాడు. అప్రతిహతమైన అశక్తిని అర్జునుడు ఎదుర్కోలేదు. దానివల్ల అర్జున సంహారం తప్పదు. అయితే అర్జున రధసారధిగా విష్ణువు అవతారమైన కృష్ణుడున్నాడు. భగదత్తుడు ఆ వైష్ణవ శక్తిని ప్రయోగించగానే కృష్ణుడు ఒక్క క్షణం లేచి నిల్చొన్నాడు. అర్జునుని కంఠమును ఛేదించవలసిన అస్త్రం కృష్ణుని కంఠానికి తగిలి 'వైజయంతి మాల'గా మారిపోయింది. అర్జునునికి దిగ్భ్రాంతి కలిగి ఇదేమిటని ప్రశ్నించాడు. కృష్ణుడు దాని వివరాలు క్లుప్తంగా చెప్పి 'ముందు ఈ భగదత్తుని సంహరించు' అన్నాడు.

శ్లో॥ బలీ సంఛన్న నయనః సురైః పరమ దుర్జయః
అక్ష్ణోరున్మీల నార్థాయ బద్ధ పట్టో హ్యసౌ నృపః

దేవతలకు కూడా దుర్జయుడైన ఈరాజు కన్నులు తెరచి ఉండటంకోసం వాలిపోతున్న రెప్పలను పట్టాంశుకముతో కట్టుకొన్నాడు.

అర్జునుడు అతని నేత్రవస్త్రాన్ని బాణంతో ఖండించి రెప్పలు వాలటం వల్ల కన్నులు కన్పించని భగదత్తుని వధించాడు. భగదత్తుని కుమారుడు వజ్రదత్తుడు తండ్రి వధను చూచి ఆగ్రహించి అర్జునుని మీదకు యుద్ధానికి వచ్చి సంహరించబడ్డాడు. తదనంతర కాలంలో ఎందరో ప్రాగ్జ్యోతిష పరిపాలకులయినారు. కల్హణుని రాజ తరంగిణిలో ఇక్కడ రాజవంశీయుల వివరాలు చెప్పబడినవి. మేఘవాహనుడు, భాస్కర వర్మ మొదలైన రాజులు ఇక్కడి అధికారాన్ని వహించారు. అందరూ పీఠదేవతగా కామాఖ్యాదేవిని పూజించినవారే. ఈ విధంగా కామాఖ్యాకాళి అష్టాదశమహాశక్తి పీఠాలలో ఒక గొప్ప దేవతగా ఇప్పటికీ ఆరాధించబడుతోంది.

19. త్రైలింగ స్వామి

ఆంధ్రకళింగ దేశముల మధ్య 'హోలియా' అన్న గ్రామం వేద శాస్త్ర పండితులకు నెలవైన ప్రదేశం. ఒకప్పుడు బ్రిటీష్ వారి పరిపాలనలో మద్రాసు రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా –ఒరిస్సాలోని బెరహాంపూర్ వరకు విస్తరించి ఉండేది. సుప్రసిద్ధమైన విజయనగరం కుంభిలీపురం అధిపతులైన పూసపాటివారు తమ విజయాలకు చిహ్నంగా ఒక కోట నిర్మించి క్రీ.శ 1713 లో దానికి విజయనగరం అని పేరు పెట్టారు. ఈ హోలియా గ్రామం విజయనగరానికి దగ్గరలో ఉన్నదని చెప్పబడుతున్నది. ఆ ఊరిలో 'నరసింహ ధర్' అనే సత్కుల జాతుడైన బ్రాహ్మణునకు ఆయన భార్య 'విద్యావతికి' క్రీ.శ 1607వ సంవత్సరంలో పుష్యశుద్ధ ఏకాదశినాడు ఒక మగ పిల్లవాడు పుట్టాడు అతనికి 'శివరామ' అని పేరు పెట్టారు. 'త్రైలింగధర' అన్న పేరు కూడ ఈ బాలునకున్నట్లు ఆధారాలు కన్పిస్తూ ఉన్నవి. నరసింహధరుని రెండవ భార్య వలన శ్రీధరుడు అనే కుమారుడు పుట్టాడు. తమ్ముడితో అన్యోన్యంగా ఉంటున్నా చిన్నతనం నుంచి త్రైలింగధరుడు ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడేవాడు. 1616 వ సంవత్సరములో తండ్రి ఇతనికి ఉపనయనం చేశాడు.

ఆ రోజుల్లో బాల్య వివాహాలు సర్వ సామాన్యంగా ఉండేవి. తల్లితండ్రులు, వివాహం చేసుకోమని ఇతనిని బలవంతం చేశారు. వినయవంతునిగా సౌశీల్య సంపన్నునిగా, పెద్దల మాటను జవదాటని సుగణాన్వితునిగా ప్రకాశిస్తున్న ఈ యువకుడు ఈ ఒక్క విషయంలో మాత్రం వారి మాటను వినయ పూర్వకంగా తిరస్కరించాడు. సంసార బంధాలలో చిక్కుకోవటం తన కెంతమాత్రం ఇష్టం లేదని కనుక పెళ్ళి చేసుకోమని బలవంతం చేయవద్దని ప్రార్థించాడు. వారు కుమారుని ఏమీ అనలేక ఊరుకొన్నారు. కొన్నాళ్ళకు త్రైలింగధరుని సవతి తమ్ముడైన శ్రీధరునకు పెండ్లి చేశారు. ఇక త్రైలింగధరునకు వివాహం గురించి

ఆలోచించవలసిన అవసరం తప్పిపోయింది. 1647 వ సంవత్సరంలో నరసింహధరుడు మరణించాడు. అప్పటికి త్రైలింగధరునికి 40 సం. ల వయస్సు అవివాహితుడై వైరాగ్యంతో ఉన్న ఇతనికి ఇంటి వ్యవహారాలను ఆస్తిపాస్తులను నిర్వహించటం ఇష్టం లేకపోయింది అందువల్ల తనకు ఆస్తి ఏమీ అక్కర లేదని స్పష్టంగా చెప్పి మొత్తం బాధ్యతలను సవతి తమ్ముడైన శ్రీధరునకు అప్పగించి వేశాడు. తల్లి విద్యావతి కూడా దుఃఖాన్ని నెమ్మదిగా దిగమ్రింగుకొని భక్తి వైరాగ్యాలతో భగవద్ధ్యానం చేస్తూ కాలం గడుపుతున్నది. ఒకరోజు తల్లి కుమారుల మధ్య ఈవిధంగా సంభాషణ జరిగింది తల్లి అతనిని 'శివ' అని పిలిచేది శివరాం అన్నది అతని పేరుగా ఇంతకుముందే చెప్పబడింది.

తల్లి : నాయనా! శివా! నేనూ పెద్దదాన్ని అయినాను. నీ తండ్రివలెనే ఎప్పుడో ఒకప్పుడు రాలిపోక తప్పదు. ఎంత చెప్పినా నీవు వివాహం చేసుకోవటానికి అంగీకరించలేదు నా తరువాత నీ సంగతి ఎవరు పట్టించుకొంటారు? నాకు దిగులుగా ఉన్నది. ఒకసారి మళ్ళీ ఆలోచించు

శివ : అమ్మా! ఆలోచించవలసిన దెప్పుడో పూర్తయిపోయింది. నాకు ఈ గృహస్థ జీవితం మీద ఆసక్తి లేదని ఇది వరకే చెప్పాను. దానిలో ఏమార్పూ లేదు ఇప్పుడున్న ఆలోచనల్లా జ్ఞాన వైరాగ్యములు నిలుపుకొనడం మీదే. జ్ఞాన మార్గం ద్వారా బ్రహ్మానుభవాన్ని పొందాలి.

తల్లి : నీకు చెప్పగల్గినంత చదువుకొన్న దానిని కాదు కాని నాకు తెలిసినంతలో జ్ఞానప్రాప్తి అంత సులభం కాదు నీవు విరాగివే, సందేహం లేదు. సంసార బంధమునందు ఆసక్తి కూడా లేకపోవటం గుర్తించే ఉన్నాను. కనుకనే బాధ్యత కొద్దీ ఒకటికి నాలుగు సార్లు చెప్పినా నీలోని వైరాగ్యభావనను గమనించి మీ నాయనగారూ నేనూ ఒత్తిడి చేయటం మానుకొన్నాము. కానీ, జ్ఞానప్రాప్తికి ధ్యానసాధన చాలా అవసరం నీవు ధ్యానసిద్ధుడవైతే తప్ప ఆత్మానుభూతి కలగడం సులభం కాదు.

శివ: నీవు చెప్పింది నిజమే పండితుల దగ్గర వేదాంతతత్వాన్ని కొంత కొంత తెలుసు కొంటున్నాను. మన గ్రామంలో జరుగుతున్న అన్ని పురాణప్రవచనాలకు వెడుతున్నాను. ఆ మధ్య ఒక పండితుని దగ్గర ఉపనిషత్తులు కూడా కొంత చదువుకొన్నాను.

తల్లి : చదువు మంచిదే దాని వల్ల వివేకం వర్థిల్లుతుంది సత్యాసత్య విశ్లేషణ కలుగుతుంది. నీవు భారత పురాణ ప్రవచనం విన్నావు కదా! 18 పురాణాలు రచించిన తరువాత భారత రచన చేసి ధర్మాధర్మ తత్వాన్ని ప్రజలకు అందించి, భగవంతుడయిన కృష్ణుడు చేసిన గీతా ప్రబోధాన్ని మానవాళికి అందించి, మహోపకారం చేసిన వ్యాసునంతటి మహా పురుషునకు కూడా మనః క్లేశం తప్పలేదు. ఆయన వేదనను గుర్తించి నారదమహర్షి వచ్చి వాసుదేవుని భక్తిని విష్ణుభక్తుల కథలను గ్రంథంగా వ్రాయమన్నప్పుడు సాత్యవతేయుడు

భాగవతరచన చేసి భక్తి మార్గ విశేషాలను లోకానికి తెలియచేసి తరణోపాయాన్ని ప్రసాదించాడు. వ్యాసునంతటి మహాజ్ఞాని కూడా భక్తి మార్గాన్ని అనుసరించినప్పుడే శాంతిని పొందాడు. కనుక నీవు కూడా ఆ మార్గంలో తీవ్రసాధన చేసి ఒకదేవత యొక్క అనుగ్రహాన్ని సాధించటం అవసరమని నా కనిపిస్తున్నది ఆ దేవత ఒకరికి నారాయణుడు కావచ్చు మరొకరికి శివుడు కావచ్చు వేరొకరికి పరమేశ్వరి కావచ్చు. నీవు నీ ఇష్టదేవతను ఎన్నుకొని తీవ్రతపస్సు చేసి సిద్ధుడవు కావాలని నా ఆకాంక్ష.

శివ: తల్లీ! ఈరోజు నీ మాటలలో కొత్త వెలుగుబాట కన్పిస్తున్నది. ఇంతకుముందు ఎప్పుడూ చెప్పని తీరులో ప్రగాఢమైన వాంఛతో అనుశాసనాన్ని ఇస్తున్నావు. ఇది నాకు నూతన ప్రేరణను ఇస్తున్నది. కానీ, ఎప్పుడూ లేని విధంగా నీవిలా పలుకుతున్నావంటే దీని వెనుక ఏదో బలమైన ఆలోచన ఉండాలని అనిపిస్తున్నది.

తల్లి : శివా! నీవు చెప్పినది సత్యమే. బలమైన కారణం వల్లనే ఇలా చెప్పాలని అనిపించింది. సహజంగా అందరి వలెనే లోకంలో ఎందరి మరణాలనో నేను చూచాను ఈ ప్రపంచం అశాశ్వతమని ఈ తనువులు అనిత్యములని తెలుసు. అయినా మాయలో పడి భ్రాంతులమై జీవిస్తుంటాము భారతంలో యక్ష ప్రశ్నల ఘట్టంలో యక్షుడు ధర్మరాజును ప్రపంచమంతటిలోకి ఆశ్చర్యకరమయినది ఏది? అని ప్రశ్నించినపుడు ధర్మరాజు 'ప్రతిరోజూ ఎందరో మరణించడాన్ని చూస్తూ కూడా ఎవనికివాడు తాను స్థిరంగా ఉంటానని అనుకొంటూ ఉంటాడు ఇంతకంటె ఆశ్చర్యమేమున్నదని జవాబు చెప్పాడు.

శ్లో॥ అహన్యహని భూతాని
గచ్ఛంత్యేవ యమాలయం
శేషాః స్థిరత్వమిచ్ఛంతి
కిమాశ్చర్య మతః పరం.

నీ తండ్రి గారి మరణం నా మీద ఎక్కువ ప్రభావాన్ని చూపించింది. అది సహజం–లోకంలో ఎందరెందరి మరణాలను చూస్తున్నా వానిని పెద్దగా పట్టించుకోము. కానీ ఆత్మీయులు మరణించినపుడు దాని ముద్ర మనపైన పడుతుంటుంది. అప్పుడు నాకు మాతండ్రి గారు గుర్తువచ్చారు. ఆయన గొప్ప కాళీ మంత్రోపాసకుడు. అనేక సంవత్సరాలు తీవ్రసాధన చేసి కాళీదేవి అనుగ్రహాన్ని సాధించారు. దానివల్ల వందలవేల మందికి ఆయన ఉపకారాలు చేశాడు, బాధలు పోగొట్టాడు కష్టాలు తీర్చాడు, కాలమును జయించే శక్తిని ఆదేవత ఇస్తుందని ఆమె అనుగ్రహం వల్ల మృత్యువును జయించవచ్చునని ఆయన తరచుగా చెప్పేవాడు. ఆ సమయంలో ఎక్కువ భాగం కాళీ మంత్ర జపధ్యానములతో గడిపేవాడు. అప్పుడు ప్రాపంచిక స్పృహ ఆయనకు ఉండేదికాదు. ఆయన మరణ సమయానికి మగ పిల్లలు దగ్గర లేరు. నేనొక్క దానినే ఉన్నాను. ఆయన నాతో ఈవిధంగా అన్నారు. "అమ్మా! విద్యా! నాకు అంతిమ ఘడియలు వచ్చినవి. కొద్ది క్షణాలలో నేను శరీరాన్ని విడిచి

పెట్టివెడుతున్నాను. కాళీ దేవత యొక్క అనుగ్రహాన్ని నేను కొంత మాత్రమే సాధించగలిగాను. అనేకులకు ఉపకారాలు చేశాను. దానివల్ల చాలా పుణ్యం వచ్చింది. అయితే నే ననుకున్నది పూర్తిగా సాధించటం సాధ్యం కాలేదు. చిన్న తనంలోనే వివాహం, సంతానం, వృద్ధులయిన తల్లి దండ్రులకు సేవచేయటం దీనితో కాలంగడిచింది. బాధ్యతలన్నీ నెరవేర్చాను కానీ కోరినంత తపస్సు చేయటం కుదరలేదు. అప్పటికీ పట్టుదల వల్ల కులదేవతయైన కాళీదేవిని కొలిచాను. ఆమె కనికరించింది. కానీ, నా ఆశయం కాలానికి అధిదేవత అయిన ఆదేవి అనుగ్రహం వల్ల మృత్యువును జయించాలని. అది సాధ్యం కాలేదు ఈ సంసార బంధాలలో ఇరుక్కోకుండా దీర్ఘకాలం పవిత్ర గంగా తీరంలో, హిమాలయ పర్వతాలలో, కాశీలో, కామాఖ్యలో, ఉజ్జయినిలో తీవ్ర తపస్సు చేయాలి. మహాకాళి శ్మశాన వాసిని. శ్మశానంలో అర్థరాత్రులు సాధన చేయాలి. పద్ధతులన్నీ తెలిసినా పరిస్థితుల వల్ల అది సాధ్యం కాలేదు నేను కాళీ దేవిని ప్రార్థిస్తున్నాను. ఎక్కువ కాలం పై లోకాలలో ఉండాలన్న కోరిక నాకు లేదు. పుణ్యాన్ని భోగరూపంలో అనుభవించాలన్న ఇచ్ఛ నాకు లేదు. నేను చేసిన పుణ్యాన్ని నీకు ధారపోస్తున్నాను. ఆ పుణ్యఫలితంగా నీలో దైవభక్తి వికసించాలని ఆధ్యాత్మిక చైతన్యం వికసించాలని నాకోరిక. నేను కాళీ మాతను ప్రార్థిస్తున్నాను. నీ కడుపున బిడ్డగా పుట్టి సంసార బంధములో ఇరుక్కోకుండా కాళీ సాధన చేసి మృత్యువును జయించాలి! ఈ మాటలు పలుకుతూ నా చేయిపట్టుకుని నీ మాతామహులు ప్రాణములు అలవోకగా త్యజించారు. ఇన్నాళ్ళు నీకు ఈ విషయం చెప్పలేదు. ఇప్పుడు సమయం వచ్చింది ఇక నీ ఇష్టం.

శివ : ఈ మాటలు చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తున్నవి. బహుశా నీవు చెప్పినట్లు మీ తండ్రిగారి యొక్క పునర్జన్మను నేను కావచ్చును. తాతగారి ఆశయాన్ని సాధించటానికి తగిన కృషిని నేను చేస్తాను. నీవు ఏమార్గాన్ని సూచిస్తే ఆ మార్గంలో నేను ముందుకు వెడతాను నాకు కాళీ మంత్రాన్ని ఉపదేశించు.

తల్లి : మీ తాతగారు నా కుపదేశించిన కాళీమంత్రాన్ని నీ కుపదేశిస్తాను దానిని స్వీకరించి నీవు దీర్ఘాయు స్సంపన్నుడవు కావాలని కాళీదేవి యొక్క పరిపూర్ణమైన అనుగ్రహాన్ని సాధించాలని మహాసిద్ధుడవై ప్రకాశించాలని నా ఆకాంక్ష

శివ : తల్లీ! నీ కోరికను ఆజ్ఞగా శిరసావహించి సాధన ప్రారంభిస్తాను. త్రిశూల ధారిణి, ముండ మాలా ధారిణి, శ్మశాన వాసిని అయిన మహాకాళి న న్ననుగ్రహించును గాక.

శ్లో॥ కపాలమాలాం కరవాల హస్తాం
శ్మశాన వాసాంజ్వలదగ్ని రూపాం
మద్యప్రియాంభీషణ రక్తజిహ్వాం
కాళీం కరాళీం సతతం భజామి.

వాళ్ళ గ్రామంలో అమ్మవారి గుడి ఉన్నది. ఆ గుడిలోకి వెళ్ళి కూర్చొని రోజూ జపం చేయటం మొదలు పెట్టాడు. లక్షలు, కోట్లు మంత్ర జపం పూర్తవుతున్నది. మధ్య మధ్యలో అవకాశం ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న క్షేత్రాలకు వెళ్ళి అక్కడ కొంత సాధన చేసి వస్తున్నాడు. అయితే మాతృబంధం బలమయినది. ఇప్పటికి ప్రపంచంలో తల్లికి తాను తనకు తల్లీ తప్ప వేరెవరూ లేరు. అందువల్ల ఆమెను విడిచిపెట్టి ఎక్కువ కాలం ఎక్కడికి వెళ్ళటం ఇష్టం లేదు. విద్యావతీదేవి వృద్ధురాలయింది. ఒక పూట కుమారుడు కనపడక పోతే ఆమె తల్లడిల్లి పోయేది. ఆమెకు సేవచేస్తూ ఆసేవనే కాళీ సేవగా భావిస్తూ ఆమెనే కాళీ మాతగా పూజిస్తూ 12 సంవత్సరములు గడిపాడు. 1659 వ సంవత్సరంలో తల్లి మరణించింది. శ్మశానానికి తల్లి శవాన్ని తీసుకువెళ్ళి దహన సంస్కారాలు జరిపిన తరువాత శివరాం (త్రైలింగధరుడు) ఇక ఇంటికి రానన్నాడు. తమ్ముడు శ్రీధర్ మొదలయిన వారంతా బ్రతిమలాడారు. పెద్దలు చుట్టాలు చెప్పి చూచారు. అశాశ్వతమైన ప్రపంచం మీద తనకు ఆసక్తి లేదని ఇల్లు, ఇల్లాలు, సంసారము ఈ ప్రపంచము అంతా భ్రాంతి అని, తాను వీటన్నింటికి దూరంగా ఏకాంతంగా ఉండదల్చుకొన్నానని త్రైలింగధరుడు వారికి స్పష్టం చేశాడు. ఎవరు చెప్పినా మార్చుకోని దృఢనిశ్చయంతో ఉన్న అన్నకు ఒక కుటీరాన్ని నిర్మించి ప్రతిరోజూ ఆహారానికి కావలసిన ఏర్పాట్లను శ్రీధరుడు చేశాడు. భక్తురాలు, విజ్ఞానవతి అయిన తల్లి ఉపదేశించిన మార్గంలో అక్కడే ఉంటూ 20 సంవత్సరములు ప్రగాఢమైన కాళీ సాధన చేశాడు త్రైలింగధరుడు. శ్మశానకుటీరంలో ఉంటూ ప్రతిరోజు తాను పదిలంగా దాచుకొన్న మాతృశరీర భస్మాన్ని ధరించి రాత్రింబవళ్ళు కాళీమంత్రజపం చేశాడు. ధ్యాన వేళ ఎన్నో అనుభవాలు కలిగినవి. దివ్యచక్షువు వికసించి మానవేతర శరీరులను చూడగలిగే శక్తి లభించింది. అంతరిక్ష చరులయిన భూతప్రేతజీవులనే కాక సిద్ధులను దేవతలను చూడగల శక్తి లభించింది. కాళీదేవి అతనిని ఎన్ని రకాలు గానో పరీక్షించింది. పరమ సుందరమూర్తియై, దిగంబరయై, కామ ప్రేరకమైన దృక్కులతో ప్రేరేపించింది. తన తల్లి శరీరాన్ని దహించిన చితాభస్మాన్ని ధరించిన శివరామునకు కామవికారం కలుగలేదు. ఒక్కోసారి అతిభీషణ రూపంతో నక్కల అరుపుల మధ్య అట్టహాసం చేస్తూ పైనబడి విరుచుకు తినేటట్లుగా మీదకు దూకింది. అప్పుడూ భయపడలేదు. ప్రళయవేళ లోకములను నాశనము చేయటానికి అవసరమైన భీషణ రూపం ఇప్పుడు ఎందుకు ధరించావు తల్లీ? అని ప్రార్థించాడు. తల్లీ! నీవు దక్క నాకు దిక్కెవరూ లేరు. అన్నీ త్యజించిన నేను దేనిని చూచి భయపడాలి? నా తల్లి నిన్ను గురించి నాకు చెప్పింది. నాపూర్వ జన్మను గూర్చి తెలియచేసింది. అది సత్యమో కాదో! ఆ జన్మలో నిన్ను సరిగా ఆరాధించానో లేదో తెలియదు. ఎప్పటి సంగతో ఎందుకు? ఇప్పుడు మాత్రం నీవు తప్ప నాకు వేరు గతి లేదు. పూర్వ జన్మలలో కానీ, ఈ జన్మలో కానీ, తెలిసికానీ, తెలియక కానీ చేసిన దోషము లేవయినా ఉంటే నన్ను క్షమించి అనుగ్రహించు.

శ్లో॥ ప్రాగ్దేహస్థో యదావా తవ చరణయుగం నాశ్రితో నార్చితోఽహం,
తేనాద్యా కీర్తివర్గై ర్జఠర జదహనైర్బాధ్య మానో బలిష్ఠైః,
క్షిప్త్వాజన్మాంతరాన్నః పునరిహభవితాక్వాశ్రమః క్వాపిసేవా
క్షంతవ్యోమేఽ పరాధః ప్రకటితవదనే కామరూపే కరాలే.

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దిక్పాలకులయిన ఇంద్రాగ్ని యమవరుణాదులు, గ్రహాధిపతులయిన సూర్యచంద్రకుజ బుధాదులు, అందరూ నీ సృష్టిలోనివారే, నీ సేవకులే. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము మనస్సు, ప్రకృతి, సమస్తమూ నీ స్వరూపములే.

శ్లో॥ త్వం కాళీ త్వంచ తారా త్వమసి గిరిసుతా సుందరీ భైరవీత్వం
త్వం దుర్గా ఛ్చిన్నమస్తా త్వమసిచ భువనాత్వం హి లక్ష్మీశ్శివాత్వమ్
ధూమా మాతంగినీ త్వం త్వమసి చ బగళా మంగళాది స్తవాఖ్యా
క్షంతవ్యోమేఽ పరాధః ప్రకటితవదనే కామరూపే కరాళే.

అమ్మా! నీవు కాళివి, తారవు హిమగిరి పుత్రికవు, త్రిపురసుందరివి, భైరవివి, దుర్గవు నీవే. ఛిన్నమస్త అయిన వైరోచనివి నీవే, భువనేశ్వరివి, లక్ష్మివి, శివవు, ధూమావతివి, మాతంగివి, బగళవునీవే, దేవీ స్వరూపములన్నీ నీవే, లలిత సుందర మూర్తి అయిన బాలా రూపిణి అయిన మంగళవు నీవే, న న్ననుగ్రహించు తల్లీ కరుణించు. అని భక్తివివశుడై అతడు చేసిన ప్రార్థనలకు, సుదీర్ఘకాల తపస్సునకు, సంతృప్తి చెందిన కాళీదేవి సాక్షాత్కరించింది. ఇంతకుముందు ధ్యానసమయములలో కనిపించిన రూపము వేరు. ఇప్పుడు కనిపించినరూపం 12 ఏండ్ల బాలిక రూపము. పట్టుపరికిణీ ధరించి సుకుమారంగా నెమ్మదిగా అడుగులు వేస్తూ తన ముందుకు వచ్చింది. వాయుమండలంలో మంగళా! మంగళా అన్న శబ్దములు వినిపిస్తున్నవి. మంగళ కాళి సుందర మందహాస వదనార విందంతో అతని ముందు సాక్షాత్కరించింది "శివా" నీ తపస్సుకు సంతోషించాను. ఎన్నో జన్మల నుండి నీవు నా భక్తుడవు. ఈ జన్మలో నీ సాధన ఫలించింది. నీకు సిద్ధశక్తులు ప్రసాదిస్తున్నాను. వీనితో ఆర్తులను రక్షించు, ఆపదలో ఉన్న వారిని ఆదుకో. కలియుగ ప్రభావం వల్ల అలసులు, మందబుద్ధియుతులు, అల్ప తరాయువులయిన సామాన్యజనులలో ఆధ్యాత్మికచైతన్యాన్ని పెంపొందించు. దేశ సంచారము చేసి చివరకు పవిత్రమైన కాశీక్షేత్రానికి చేరుకో. నీకు దీర్ఘాయువును ప్రసాదిస్తున్నాను. ఎప్పటికప్పుడు ఏమేమి చేయవలసి ఉన్నదో ఆవిధంగా నీ బుద్ధి ప్రచోదించబడుతుంది. అవసరమైనప్పుడు నేను దర్శనమిస్తుంటాను, అని పలికి దేవి అదృశ్యమయింది. ఇప్పుడతడు కాళీసిద్ధుడు. ఇక అతడు భవిష్యత్ కార్యక్రమం కోసం ఎదురుచూస్తున్నాడు. పంజాబ్ లోని 'పాటియాలా' ప్రాంతం నుండి భగీరథస్వామి అన్న యతి దక్షిణదేశ యాత్రలు చేస్తూ, 'హోలియా' గ్రామానికి వచ్చి, ఇతని గురించి విని శ్మశానంలో త్రైలింగధరుని కుటీరానికి వచ్చాడు. చూచిన క్షణంలోనే భగీరథ స్వామి

త్రైలింగధరుడు అసామాన్య జీవుడని గ్రహించాడు. త్రైలింగధరుడు కూడా ఈ సన్యాసి యందు అపూర్వమైన భక్తి గౌరవాలు కల్గినవి. రామేశ్వరం దాకా వెళ్ళాలని యాత్ర కోసం బయలుదేరిన ఆ సన్యాసి ఇక్కడే ఉండిపోయినాడు. ఆ కుటీరంలోనే ఇద్దరూ నాలుగు సంవత్సరాల పాటు కలిసి ఉన్నారు. అనంతరం ఆ యతివరుని కోరిక మీద ఆయన వెంట త్రైలింగధరుడు పుష్కరక్షేత్రానికి వెళ్ళాడు. ఈ క్షేత్రం హర్యానా రాష్ట్రంలో జింధ్‌కు దక్షిణంగా 11కి.మీ దూరంలో 'పొంకర్‌కేరి' అన్న గ్రామంలో ఉన్నది. రాజస్థాన్‌లో మరో పుష్కరక్షేత్రం అజ్మీర్ కు 11కి.మీ దూరంలో ఉన్నది. ఇక్కడకు దేశం నలుమూలల నుండి భక్తులు వచ్చి ఈ క్షేత్రంలోని తీర్థంలో స్నానం చేస్తారు. మామూలుగా పుష్కరాలంటే 12ఏళ్ళ కొకసారి కొన్ని నదులకు వచ్చే పవిత్రమైన దినములు. ఇవి 12 రోజులు ఉంటవి. ఆ నదులు గంగ, యమున, నర్మద, గోదావరి,కృష్ణ, కావేరి, భీమ, తుంగభద్ర, బ్రహ్మపుత్ర, సింధు, ప్రణీత, మహానది. ఒకప్పుడు సరస్వతి కూడ ఈ పట్టికలో ఉన్నదని పండితుల అభిప్రాయం. పుష్కర క్షేత్రంలో విశేషం ఏమిటంటే సంవత్సరంలోని అన్ని రోజులలోను పుష్కర స్నాన ఫలితాన్ని ఇస్తుంది. అంటే పుష్కరకాలంలో ఇతర నదులు ఎంత పవిత్ర మయినవో ఈక్షేత్రంలో అన్నిరోజులు అంత పవిత్ర మయినవి అటువంటి దివ్యక్షేత్రంలో 1685వ సంవత్సరములో 78 ఏండ్ల వయస్సు గల త్రైలింగధరునకు భగీరథస్వామి సన్యాస దీక్ష ఇచ్చాడు. ఆ క్షణం నుంచి త్రైలింగధర్ అన్నపేరు 'గణపతి స్వామి' గా మారిపోయింది. గురు శిష్యులిద్దరూ 10 సంవత్సరాలు పుష్కరక్షేత్రంలోనే ఉన్నారు. 1695 సంవత్సరంలో భగీరథస్వామి సిద్ధి పొందిన తరువాత గణపతి స్వామి దక్షిణ దేశయాత్రకు బయలుదేరి క్షేత్రం తరువాత క్షేత్రం దర్శిస్తూ రామేశ్వరం చేరాడు. అప్పటికే ఆయనకు అనేక దివ్య శక్తులు మహాసిద్ధులు లభించినవి.

ఆయన రామేశ్వరంలో ఉండగా ఆంధ్రప్రాంతం నుంచి అక్కడకు చేరిన యాత్రికులు కొందరు ఈయనను గుర్తుపట్టి స్వస్థానానికి రావలసినదిగా అభ్యర్థించారు. తనకు, ఎవరితోను, ఏ స్థానముతోనూ అనుబంధం లేదని అన్ని అనుబంధాలు త్యజించినవాడు మాత్రమే సన్యాసి అని చెప్పి వారి మాటలను మృదువుగా తిరస్కరించాడు. రామేశ్వరంలో ఉండగా ఒక విచిత్రమయిన సంఘటన జరిగింది యాత్రకు వచ్చిన ఒక బ్రాహ్మణుడు, ప్రయాణశ్రమ తట్టుకోలేక తీవ్రజ్వరం వచ్చి మరణించాడు. అతని కుటుంబ సభ్యులు బంధువులు విపరీతంగా శోకిస్తున్నారు. అక్కడి స్థానికులు శవాన్ని శ్మశానానికి తీసుకు వెళ్ళడానికి సహకరించి ఏర్పాట్లు చేస్తున్నారు. మృతుని సన్నిహితుల ఆర్తిని ఆవేదనను చూడలేక గణపతిస్వామి క్రిందపడుకో పెట్టిన శవం మీద తన కమండలువు లోని నీరు తీసి చల్లాడు. మరు నిముషంలో శవంలో కదలిక వచ్చింది. అతనికి కాసిని పాలు త్రాగించమని స్వామి సూచించాడు. మృతుడు బ్రతికాడు. ఈ మహిమ చూచిన ప్రజలంతా స్వామిని కీర్తించారు. స్వామి దర్శనానికి వచ్చే జన సంఖ్య రోజురోజుకు పెరగటం మొదలుపెట్టింది. చచ్చిన వానిని బ్రతికించిన మహనీయుడంటే ఎవరికయినా ఆసక్తే కదా! ఇక అక్కడ ఉండటం ఇష్టం లేక 1699 వ

సంవత్సరంలో దక్షిణదేశాన్ని విడిచిపెట్టి తూర్పున పూరీకి వెళ్లి జగన్నాధ దర్శనం చేసుకొని, అక్కడి నుండి ఉత్తర దిక్కున ఉన్న ప్రయాగకు చేరి, అనంతరం పశ్చిమ దిశన ఉన్న ద్వారకలో కొంతకాలం ఉన్నారు. ఆయనను రామేశ్వరంలో చూచిన వారు కొందరు అక్కడ ఉండడం వల్ల ఆయన చనిపోయిన వానిని బ్రతికించిన మహిమాన్వితు డన్న ప్రచారం ఇక్కడా పెరిగింది. ఎందరో ఆయనను భక్తితో సేవించటం మొదలుపెట్టారు. ఇక్కడా ఏకాంతానికి భంగం కలిగింది దానితో ఆ స్థలం కూడా వదలాలని నిశ్చయించుకొని తనకు సేవ చేసిన వారందరికి కోరిన వరములు ప్రసాదించి 1701 వ సంవత్సరములో నేపాల్ బయలుదేరి వెళ్ళారు. అక్కడ ఒక అరణ్య ప్రాంతంలో నివాసం ఏర్పరుచుకొని ఒంటరిగా తపస్సు చేస్తున్నాడు.

ఆ ప్రదేశం క్రూర మృగాలకు నెలవయినది. వేట అంటే ప్రీతి గల్గిన నేపాల్ రాజు ఒకరోజు ఆ ప్రాంతానికి తన పరివారంతో వచ్చాడు. అక్కడ సంచరిస్తున్న ఒక భయంకరమైన పులిని రాజుగారి అనుచరుడు తుపాకీతో కాల్చాడు. గురి తప్పింది పులి భీషణంగా గాండ్రిస్తూ అక్కడి నుంచి వేగంగా తప్పించుకొని వెళ్ళిపోయి స్వామి కుటీరంలోకి ప్రవేశించింది. స్వామి దానిని చూచి నెమ్మదిగా తన హస్తంతో నిమిరాడు. అది పిల్లి వలే ఆయన పాదాల వద్ద కూర్చుండి పోయింది పరుగెత్తుకుంటూ వచ్చిన రాజభటులు కుటీరంలోని ఈ దృశ్యాన్ని చూచి దిగ్భ్రాంతి చెందారు. వారితో ఆయన "అనవసరంగా హింస చేయకండి అడవిలో తమ మానాన తాముంటున్న జంతువులను వేట పేరుతో చంపటం న్యాయం కాదు. ఇతర జీవులను చంపే హక్కు ఎవరికీ లేదు. భగవంతుడు దీనిని అంగీకరించడు" అని చెప్పి వారిని పంపించి వేశాడు వారు వెనక్కి వెళ్ళి జరిగిన విషయం రాజా వారితో చెప్పారు. రాజు ఆశ్చర్యపడి ఆయన దర్శనానికి వచ్చి విలువైన రత్నములను కానుకగా సమర్పించాడు. స్వామి వాటిని మృదువుగా తిరస్కరించి 'అన్నీ వదలివేసిన సన్యాసికి ఈ సిరి సంపదలతో పని ఏమున్నది. వాటిని ప్రజా శ్రేయస్సుకు వినియోగించండి' అని సలహా ఇచ్చాడు.

ఈ వార్త నేపాల్ రాజ్యంలో సుడి గాలిలా వ్యాపించింది. లెక్క లేనంత మంది ప్రజలు దర్శనానికి రావటం మొదలుపెట్టారు. మరలా ప్రజా సంగం తప్పలేదు. ఆరు సంవత్సరాలు నేపాల్‌లో ఉన్న తరువాత 1720వ సంవత్సరంలో మానససరోవరానికి వెళ్ళి ఆ ప్రాంతంలో తపస్సు చేసుకొంటున్నాడు. ఆ స్థలంలో కూడా ఒకరోజు ఒక స్త్రీ, మరణించిన తన ఏడు సంవత్సరాల కుమారుని మృతశరీరాన్ని శ్మశానానికి తీసుకువెడుతూ బంధువులతో సహా రోదిస్తూ త్రోవలో ఈ స్వామిని చూచి ఆయన కాళ్ళ దగ్గర శవాన్ని పెట్టి దయనీయంగా ఏడవటం మొదలుపెట్టింది. దానితో కరిగిపోయిన స్వామి ఆ పిల్లవాని నుదురును తన చేతి వ్రేలితో క్షణం స్పృశించాడు. పిల్లవానిలో కదలిక వచ్చింది లేచి కూర్చున్నాడు ఇంతకు ముందు దుఃఖాశ్రువులు ఇప్పుడు ఆనంద బాష్పాలుగా మారినవి. ఈ వృత్తాంతం వ్యాపించగానే మళ్ళీ జన సమ్మర్దం పెరిగింది. అప్పటికే సిద్ధశక్తులు వచ్చి ఉండటం వల్ల అందరూ చూస్తుండగా స్వామి అదృశ్యుడై వెళ్ళిపోయినాడు. ఇక్కడ ఉన్న సమయంలో శంకర

సంప్రదాయానికి చెందిన విద్యానంద సరస్వతీ స్వామి, అద్వైత సంప్రదాయంలో సన్యాస దీక్ష ఇచ్చాడని 'రామానందసరస్వతి' అన్న కొత్త నామాన్ని ఇచ్చాడని కొందరు వ్రాశారు. ఆరు సంవత్సరాలు మానససరోవర ప్రాంతంలో గడపిన తరువాత 1726 వ సంవత్సరములో స్వామి నర్మదానదీ తీరానికి వెళ్ళి అక్కడి మార్కండేయ ఆశ్రమంలో కొంతకాలం ఉన్నారు. అక్కడ 'ఖాకీ బాబా' అనే ఒక ప్రసిద్ధయోగి చాలా కాలంగా నివసిస్తూ ఉండేవాడు. నది ఒడ్డున కూర్చొని గంటల తరబడి గాఢ ధ్యానంలో ఉండటం ఆయనకు అలవాటు. ఒకరోజు ధ్యానంలో నుంచి లేచి మంచి నీళ్ళు తాగటం కోసం నదిలో దిగి రెండు చేతులతో నీళ్ళు తీసుకొంటే అవి పాలలాగా అయినవి. ఆశ్చర్యపడి చుట్టూ చూస్తే ఎవరో క్రొత్త స్వామి తన చేతితో నీళ్ళు తీసుకొంటుండగా అవి పాలుగా మారటం గమనించాడు. ఆశ్చర్యపడిన బాబా ఈ విషయాన్ని అందరికీ చెప్పాడు ఆశ్రమవాసులంతా గణపతి స్వామిని మహాయోగిగా గౌరవించారు. అక్కడ ఆరుసంవత్సరాలు ఉండి 1733 లో ప్రయాగకు వెళ్ళి అక్కడ నదీ సంగమ స్థానంలో ఎక్కువ కాలం ధ్యానంలో గడుపుతూ ఉండేవాడు. ఒకలోజు పెద్ద జడివాన పట్టుకొన్నది అందరూ ఇండ్ల దగ్గరికి, పటకుటీరాలలోకి పరుగెత్తుతూ ఉంటే స్వామి మాత్రం తడుస్తూనే నిశ్చలంగా నది వైపు చూస్తున్నాడు. రామతారక భట్టాచార్య అన్న బ్రాహ్మణుడు దగ్గరకు వచ్చి 'స్వామీ' వాన విపరీతంగా కురుస్తున్నది. దగ్గరలో ఉన్న గుడారం లోకి వెడదాం రండి అన్నాడు. స్వామి చిరునవ్వు నవ్వుతూ 'తన గురించి విచారించవద్దని ఎదురుగా నదిలో ప్రయాణీకులతో నిండి ఉన్న పడవ మునిగి పోబోతున్నదని, వారిని రక్షించాలని' అన్నాడు. ఆయన ఈ మాట అంటూండగానే పడవ మునిగి పోయింది. స్వామి మరుక్షణం అదృశ్యడైనాడు. కొద్ది నిముషాలలో పడవ మళ్ళీ పైకి తేలింది. అందరు ప్రయాణికులు భద్రంగా ఒడ్డుకు చేరి ఎవరి దోవన వారు వెళ్ళిపోయినారు. స్వామి కూడా ఆ పడవలో నుంచి ప్రయాణీకుని వలే నడచి వచ్చాడు నదిలో ఆయన కౌపీనం కొట్టుకుపోయింది. నగ్నంగా నడచివచ్చిన ఆ స్వామి తమ రక్షకుడని ఆ ప్రయాణీకులకు తెలియదు. ఒక్క రామతారక పండితుడు మాత్రం గుర్తించి ఆయన కాళ్ళ మీద పడి ఇంతటి మహిమ ఎలా వచ్చిందని ప్రశ్నించాడు. భౌతికమైన సుఖ భోగాలను త్యజించి ఇంద్రియాలను జయించి భగవత్ సాధన చేస్తే ఏదైనా సాధ్యమే అని అతనికి బోధించి స్వామి అదృశ్యమైనాడు.

1737 లో స్వామి ప్రయాగనుండి కాశీ వెళ్ళాడు చేరిన మొదట్లో 'అసి' ఘాట్ దగ్గరి తులసీదాస వనంలో ఉంటూ అప్పుడప్పుడు లోలార్క కుండానికి వెళ్ళి స్నానం చేసేవాడు. అక్కడ ఎక్కువ భాగం తపస్సులో గడిపేవాడు. ఒకరోజు అక్కడ కుష్ఠు వ్యాధితో బాధపడుతున్న ఒక బధిరుని చూశాడు. బాధ భరించలేక తపిస్తున్న ఆ ఆర్తుని చూచి స్వామికి దయకలిగి ఒక ఆకు అతనికి ఇచ్చి దానిని నెత్తిన పెట్టుకొని లోలార్క కుండంలో స్నానం చేసి రమ్మన్నాడు. స్నానం చేసి ఇవతలకు వచ్చే సరికి అతని కుష్ఠు, చెముడు మాయమయినవి. బ్రహ్మసినావా అన్నపేరు గల ఆవ్యక్తి ఆనాటినుండి స్వామి వెంట ఉంటూ ఆయనకు పరిచర్యలు చేసేవాడు. ఈ విధంగా కష్టాలలో ఉన్న వారిని ఆదుకొని నిరంతరము సహాయం చేస్తుండేవాడు స్వామి.

ఈ రోజుల్లో స్వామి గంగానది ఎప్పుడయినా దాటవలసివస్తే పడవ ఎక్కేవాడు కాదు, నీళ్ళ మీదుగా నడచుకొంటూ వెళ్ళేవాడు. ప్రజలు ఈ దృశ్యాన్ని దిగ్భ్రాంతితో చూసేవారు. కొన్నాళ్ళ తరువాత తులసీదాసవనం నుండి వేదవ్యాస ఆశ్రమానికి మారాడు. అక్కడి నుండి ఒకరోజు గంగా స్నానానికి వెడుతూఉంటే సీతానాథ్ బందోపాధ్యాయ అన్న రాజయక్ష్మ వ్యాధిపీడితుడు గంగా స్నానానికి వచ్చి ఆపుకోలేని దగ్గురావటంతో ఉన్నట్లుండి కూలిపోయినాడు. దయార్ద్ర హృదయుడైన స్వామి అతని రొమ్ముని తాకి కూర్చోబెట్టాడు. ఆరోగి స్వామి కాళ్ళమీద పడి రక్షించమని ప్రార్థిస్తే స్వామి అతనితో పవిత్రమయిన గంగా స్నానానికి వచ్చావు, గంగ నిన్ను రక్షిస్తుంది, గంగలోని బురద తిను నీరోగం పోతుంది అన్నాడు. అతడు మరేమి ఆలోచించకుండా సందేహించకుండా గబగబా వెళ్ళికొంచెం బురద మ్రింగాడు. అతని వ్యాధి అదృశ్యమయింది అతనికి ఆక్షణం నుంచి స్వామియే దేవుడయినాడు.

అలానే జయగోపాల్ కర్మాకర్ ఇంకొక భక్తుడు. స్వామికి శ్రద్ధతో సేవచేసేవాడు. ఒకరోజు అతడికి కారణం లేకుండా విపరీతంగా దుఃఖం రావటం మొదలుపెట్టింది. నిర్హేతుకమైన ఈ వేదనకు కారణమేమిటో తెలియటం లేదని దానిని పోగొట్టమని స్వామిని ప్రార్థించాడు. స్వామి అతనిని ఓదార్చి కలిగిన వ్యధ 'హేతువులేనిది కాదని అతని స్వగ్రామంలో ఉన్న కుమారుడు ఆయువు తీరి మరణించాడనీ, కనుక బాధ పడవద్దని, జనన మరణములు జీవికి సహజమైన పరిణామములని అతనికి బోధించాడు. కొద్ది గంటలలోనే గ్రామం నుండి అతడికి వార్తవచ్చింది అతడిప్పుడు కొంత ధైర్యంతో దానిని స్వీకరించాడు.

ప్రయాగలో త్రివేణిసంగమంలో మునిగిపోయిన పడవలోని మనుషులను రక్షించడానికి వెళ్ళినప్పుడు ధరించిన వస్త్రం కొట్టుకొని పోయిన తరువాత, స్వామి వస్త్రధారణ చేయలేదు. అవధూత స్థితిలో ఉన్నవారు లౌకికమైన ఆచారములకు, వ్యవహారములకు అతీతులు. కాశీ వాసులకు ఇటువంటివి తరచుగానే సంభవించటం వల్ల, స్వామి నగ్నతను ఎవరూ పెద్దగా పట్టించుకొనే వారు కాదు. కానీ కొందరికి నచ్చదు. ఒక మహారాష్ట్ర మహిళ తన భర్తకడుపులో పుండు నయం చేయించుకోవటం కోసం కాశీకి వచ్చి విశ్వనాధుని దర్శనానికి వెడుతూ ఈ దిగంబరస్వామిని చూచి గుడ్డలు తీసివేసినంత మాత్రాన ప్రతివాడు శివుడు కాలేదని అవహేళనగా అని వెళ్ళి పోయింది. ప్రతిరోజూ ఆవిడ ఇలానే అంటుండేది. ఒకరోజు విశ్వనాధుడు ఆమెకు కలలో కనపడి "ఆ దిగంబరస్వామి మహనీయుడనీ, ఆయన విషయంలో నీవు అపచారం చేశావనీ నీ భర్త వ్యాధిని కుదిరించగలవాడు ఆయన ఒక్కడేననీ" అన్నాడు. ఆమె మరునాడు స్వామి పాదాలపైబడి క్షమాపణవేడి తనభర్త వ్యాధిని పోగొట్టమని ప్రార్థించింది. సహనస్వరూపుడయిన స్వామి కొంచెం భస్మం ఆమె చేతికి ఇచ్చి దానిని ఆమె భర్త ఉదరం మీద రాయమని చెప్పాడు. ఆమె అలానే చెసింది అతని వ్యాధి మాయమయింది.

ఒకరోజు రాంపూర్ నుండి శివప్రసాద్‌మిశ్రా తన కుమారుని పక్షవాతం బాగు చేయించుకోవడం కోసం సకుటుంబంగా కాశీకి వచ్చాడు. మందులెన్ని ఇప్పించినా

ప్రయోజనం కలుగలేదు స్వామిని గురించి విని ఆయన భార్యపిల్లవానిని తీసుకువచ్చి స్వామి పాదాలపైన పడవేశారు. వారి ప్రార్థనలకు మనసు కరిగిన స్వామి ఆపిల్లవానిని ఒక్కసారి తాకి ఇంటికి తీసుకు వెళ్ళమన్నాడు. ఆ బాలునకు మామూలు స్థితి వచ్చింది. నెమ్మది నెమ్మదిగా స్వామి మహానుభావుడని, దివ్యశక్తులు కలవాడని ప్రచారం ఎక్కువ కావటంతో స్వామి తన సాధనకు ఆటంకాలు ఎక్కువ అయిపోతున్నవని భావించి, వాటిని తొలగించటంలో ఒక భాగంగా మాట్లాడటం తగ్గించి వేశాడు. ఎప్పుడో అత్యవసరమని అనిపించినపుడు తప్ప మౌనంగా ఉండటంవల్ల 'మౌనిబాబా' అన్న పేరు ప్రచారంలోకి వచ్చింది. కొత్తవారు ఈయన ఎక్కడివారని అచ్చటి ప్రజలని అడిగినపుడు, తెలుగుదేశం నుండి వచ్చాడని చెప్పటంవల్ల త్రైలింగస్వామి అన్న పేరు వ్యవహారంలోకి వచ్చి నిల్చిపోయింది, చుట్టూ ఉన్న ప్రజలను వాతావరణాన్ని పట్టించుకోకుండా పరిపూర్ణమైన అవధూత స్థితిలో ఉండటం ఎక్కువ అయింది. ఎండాకాలపు మండుటెండలో గంగ ఒడ్డున ఇసుకలో పడుకొని ఉండేవాడు. ఈయనకు పేరు ఎక్కువ అయిన కొద్ది కొందరికి అసూయ కూడ ఎక్కువ అయింది. ఈయన అంటే గిట్టని ఒకదుర్మార్గుడు, సున్నపునీరు త్రాగటానికి ఇచ్చాడు. స్వామి ఏమీ పట్టించుకోకుండా గటగటా త్రాగేశాడు. ఆయనకు ఏమీ కాలేదు. ఒకరోజు ఒకధనవంతుడు స్వామి యందు భక్తితో 20 తులాలు ఉన్న రెండు బంగారపు కంకణాలు సమర్పించాడు. వాటిమీద కన్నేసిన కొందరు దుష్టులు ఆయనకు మత్తు మందు కలిపిన ఆహారం ఇచ్చారు. ఆ ఆహారం ఆయన తీసుకున్నా ఆయన మీద పనిచేయలేదు. ఏమాత్రం కోపం తెచ్చుకోకుండా ఆ ఆభరణాలను వారికి ఇచ్చేశాడు. ఈ విధంగా స్వామి ఎవరెవరో తనకిచ్చిన కానుకలన్నింటిని వచ్చిన వారికి ఇచ్చివేసేవాడు, ఏదీ తన దగ్గర ఉంచుకొనేవాడు కాదు.

కాశీలోని ప్రజలకు ఆయన దిగంబరత్వం అలవాటు అయినా ఆనాడు దేశాన్ని పరిపాలించే తెల్ల దొరలకు అది నచ్చలేదు. కొందరు అధికారుల భార్యలు బజారుకు వచ్చినపుడు ఈయనను చూచి మేజిస్ట్రేటుకు రిపోర్టు చేశారు. ఆ అధికారి పోలీసులను పంపి వీరిని అరెస్టు చేయమన్నాడు. పోలీసులు ఈయనను మేజిస్ట్రేటు దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఆ అధికారి ఈయనను ధోవతి కట్టుకోమని ఆజ్ఞాపించాడు. స్వామి ఆమాట పట్టించుకోలేదు. అతనికి సంకెళ్ళు వేసి జైల్లో పెట్టమని అధికారి ఆజ్ఞాపించాడు. పోలీసులు దగ్గరకు రాగానే స్వామి అదృశ్యుడయినాడు. అందరూ దిగ్భ్రాంతులయినారు. కాసేపు గడచిన తరువాత మళ్ళీ స్వామి అక్కడ ప్రత్యక్షమయినాడు. దానిని చూచిన మేజిస్ట్రేటు ఆయన మహిమాన్వితుడని గ్రహించి స్వామి జోలికి పోవద్దని ఆదేశించాడు. అప్పుడప్పుడు ఇటువంటి ఇబ్బందులు పునరావృతమవుతునే ఉండేవి. మరొక మేజిస్ట్రేటు స్వామిని జైలులో పెట్టించాడు. వేసిన తాళాలు వేసినట్లు ఉండగానే స్వామి కటకటాలకు ఇవతల కనపడటంతో జైలు అధికారులు ఖంగుతిన్నారు. మేజిస్ట్రేటు ముందు హాజరు పరచగా స్వామిని ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఆ న్యాయాధికారి స్వామితో జైలుగదిలో నుండి బయటకు రాగలిగిన

మహిమలున్న వాడవటకదా! నిన్ను విడిచిపెడతాను. అయితే! నీవు శాకాహారివని విన్నాను. నాతో పాటు మాంసం తింటే నిన్ను విడుదల చేస్తాను అన్నాడు. స్వామి న్యాయాధికారితో "నేను తినేది మీరు తింటానంటే మీరు తినేది నేను తింటాను. నాకు అభ్యంతరం లేదు" అన్నాడు న్యాయాధికారి దానికేముంది అలానే అన్నాడు. స్వామి ఎలానూ శాకాహారమే తీసుకొంటాడు కనుక తాను మాంసాహారి కనుక మాంసం తినమంటే స్వామి ఎలా తింటాడో చూడాలని కుతూహలం. మేజిస్ట్రేటు మాట వినగానే త్రైలింగ స్వామి కోర్టుహాలులో మలవిసర్జన చేశాడు. దానిని చేత్తో తీసిపట్టుకొని "మేజిస్ట్రేటుగారూ! ఇదే నేను తినేది నేను తింటాను, మీకు ఇస్తాను, మీరు తింటారు కదా?" అన్నాడు. న్యాయాధికారి అసహ్యించుకొని "తిను నువ్వు ఎలా తింటావో చూస్తాను" అన్నాడు. స్వామి ఏ సంకోచమూ లేకుండా నోట్లో పెట్టుకొని తినేసాడు. అది తియ్యటి రసగుల్లాగా మారిందని కొందరు లేఖకులు వ్రాశారు. మారినా మారకపోయినా యోగులకది విశేషం కాదు. దీనిని చూచిన ఆ తెల్లదొర స్వామిని విడుదల చేసి మీ ఇష్టము వచ్చినట్లు వెళ్ళవచ్చును అన్నాడు. ఇటువంటి సంఘటనలతో స్వామి మహిమ దశదిశలా వ్యాపించింది.

1788 వ సంవత్సరంలో ఆ ప్రాంతపు రాజొకడు సకుటుంబంగా సపరివారంగా గంగా స్నానానికి కాశీ వచ్చాడు. రాణీగారు స్నానం చేయటం కోసం ఆయన భటులు ఆ ఘాట్‌ను ఖాళీ చేయించారు. ఆమె స్నానం చేస్తూ ఉండగా నదిలో నుంచి స్వామి బయటకు వస్తున్నాడు ఆ దీర్ఘస్థూల దిగంబరుని చూచి రాణీగారు మిగతా స్త్రీలు, పెద్దగా అరచి ఇవతలకు వచ్చేశారు. ఆగ్రహించిన రాజు భటులను ఆజ్ఞాపించగా వారు వెళ్ళి ఆయనను బంధించటానికి ప్రయత్నించారు స్వామి చిక్కినట్లే చిక్కి వెళ్ళిపోయాడు. ఆ రోజు రాత్రి రాజుగారికి కలలో పులి ముఖం కలిగిన ఒకభయంకర ఆకారం పైనబడి మహనీయుడైన స్వామిని ఇబ్బంది పెట్టినందుకు గాను కాశీ విడిచిపెట్టి వెళ్ళిపొమ్మని బెదిరించింది. భయంతో వణికిపోతూ కలచెదిరి లేచి పెద్దగా అరచి రాజు స్పృహతప్పిపోయాడు. పరివారమంతా ఆదుర్దాపడ్డారు. కాసేపటికి స్పృహవచ్చింది. తెల్లవారింతరువాత స్వామి ఎక్కడ ఉన్నాడో కనుక్కొని రాజుగారు వెళ్ళి ఆయన కాళ్ళమీద పడ్డాడు.

1800 సంవత్సరంలో స్వామి ఒక స్థిర నివాసంలో కుదురుకొన్నారు వేదవ్యాసాశ్రమం నుండి హనుమాన్ ఘాట్, అక్కడ నుండి దశాశ్వమేధ ఘట్టము, అక్కడ నుండి పంచగంగా ఘట్టము, ఇలా ఒకచోట నుండి ఒక చోటుకు మారుతున్న స్వామి దక్షిణదేశం నుంచి వచ్చిన మంగళదాస్ అనే భక్తుని ప్రార్థన మన్నించి బిందుమాధవ దేవాలయ ప్రాంతంలో భక్తులు నిర్మించిన ఆశ్రమంలో ఉండటం మొదలుపెట్టాడు. మంగళదాస్ ఠాకూరు, ఆయన సోదరుడు కృష్ణ ప్రసాద్ ఆయనను సేవించేవారు. వాళ్ళ తల్లి అంబాదేవి స్వామికి వంటచేసి పెట్టేది. ఆశ్రమంలోని ఒక గది ప్రత్యేకంగా ఆయన ఏకాంత మందిరంగా ఉండేది. దాంట్లో ఒకరమణీయమైన కాళీ విగ్రహాన్ని స్థాపించి రోజు దానికి పూజ, హారతి చేసేవాడు.

అప్పుడాయన కాళీ భక్తుడని శిష్యులకు ప్రజలకు తెలిసింది. ఇప్పటికీ ఆయన పూజించిన కాళీదేవి ఆయన ఆశ్రమంలో (కాశీలో) ఉన్నది. తల్లి మరణించిన తరువాత ఆ మిషతో శ్మశానవాసం చేసి కాళీ సాధన చేసి ఆమె యొక్క దివ్యానుగ్రహాన్ని పొందిన మహాసిద్ధుడన్న సంగతి తెలిసినవారు కొద్దిమందే.

తన ఆశ్రమంలో 'మంగళకాళిని' స్థాపించిన తరువాత ఒకరోజు రాత్రి ధ్యాన సమయంలో కాళీదేవి సాక్షాత్కరించి ఇలా పలికింది. "నాయనా! దివ్యమైన ఈ అవిముక్త క్షేత్రంలో స్థిరనివాసం ఏర్పరుచుకొన్నావు. నన్నిక్కడ స్థాపించి రోజూ పూజిస్తున్నావు. సంతోషకరమైన విషయమే. ఇది విశ్వనాధుని క్షేత్రం. ఇక్కడి క్షేత్రపాలకుడు 'కాలభైరవుడు' ఏ క్షేత్రానికి వచ్చినపుడు అక్కడి దేవతలను పూజించాలి. అది మర్యాద. నీవు గంగా స్నానము, విశ్వనాధుని దర్శనము చేస్తూనే ఉన్నావు. మంచిదే-క్షేత్ర పాలకుడయిన కాలభైరవుని అనుమతి ఉంటేనే ఇక్కడ నివసించటం సాధ్యం. కనుక మహావీరుడయిన కాలభైరవుని దర్శనానికి వెడుతూ ఉండు. ఆయన అనుగ్రహం ఎంతయినా అవసరం. మరొక ప్రధానమైన అంశం-త్వరలో ఇక్కడికి హిమాలయ పర్వతాలనుండి ఒక సిద్ధ పురుషుడు వస్తాడు. అతడు నా అనుగ్రహానికి పాత్రుడైనవాడు. కఠోరదీక్షతో అతడు చేసిన తపస్సుకు మెచ్చి అతనికి దివ్యశక్తులు ఎన్నో ఇచ్చాను. నా ప్రతి రూపంగా సజీవమైన శిలా విగ్రహమొకటి అతనికి అనుగ్రహించాను. అది వయసును బట్టి పెరిగే విగ్రహం అతను ఇప్పటికే దాదాపు 300 ఏండ్ల వయసువాడు అతనిని దర్శించు, నీకు మేలు కలుగుతుంది".

ఈ దర్శనం కలిగిన రోజునుండి త్రైలింగస్వామి కాలభైరవాలయానికి హారతి సమయానికి తప్పక వెళ్లేవాడు. 'కాశికా పురాధినాథ కాలభైరవం భజే' అంటూ కాలభైరవ అష్టకాన్ని భక్తితో పఠించేవాడు.

తదనంతరం కొద్దిరోజులకే హిమాలయ పర్వతప్రాంతం నుండి సంచారం చేస్తూ జగన్మాత చెప్పిన కాళీయోగి వారణాసి క్షేత్రానికి వచ్చాడు. త్రైలింగ స్వామి ఆయనను దర్శించి ఆయన దగ్గర ఉన్న కాళీదేవి విగ్రహాన్ని చూచి ముచ్చటపడి దానిని పూజించటానికి అనుమతి కోరాడు. త్రైలింగస్వామి కూడా కాళీదేవి అనుగ్రహానికి పాత్రుడయినవాడని తెలుసు కనుక ఆయన అనుమతి ఇచ్చాడు. ఆయన కాశీలో ఉన్నంత కాలం త్రైలింగస్వామి ఆయన వసతికి వెళ్ళడం, అప్పుడప్పుడు ఆయన త్రైలింగ స్వామి ఆశ్రమానికి రావటం జరిగేది. కొంతకాలం గడచిన తరువాత కాళీ యోగి అక్కడనుండి బయలుదేరి వెళ్ళేసమయంలో త్రైలింగ స్వామి "మీ రిక్కడే ఈ కాశీ క్షేత్రంలో ఉండవచ్చు గదా " అని అన్నాడు. ఆమాటలకు కాళీయోగి ఇలా జవాబు చెప్పాడు. "త్రైలింగస్వామీ! మన మా జగన్మాత కాళీదేవి యొక్క ఉపకరణాలము. ఆమె ఏమి నిర్దేశిస్తే అది చేయటమే మన కర్తవ్యం పరమేశ్వరి నీకు కాశీక్షేత్ర నివాసాన్ని నిర్ణయించింది. నా జీవిత గమనం వేరు. నేనింకా జన్మలు ఎత్తవలసి ఉన్నది. ఇప్పటికి కలియుగ ప్రారంభం నుండి అవసరమయిన జన్మలు ఎత్తి భగవత్ తత్వప్రచారం చేస్తున్నాను.

ద్వాపరాంతంలో నాగజాతి వాడనై కామాఖ్యలో కాళిని గూర్చి తపస్సు చేశాను. ఇప్పుడు మళ్ళీ హిమాలయాలలో తపస్సు చేయటం జరిగింది. సిద్ధమండల యోగుల ఆజ్ఞవల్ల భూమిపై అప్పుడప్పుడు పుట్టి దైవతత్వ ప్రచారం చేసే బాధ్యత వహించవలసి వస్తున్నది. కాళీదేవి ఆజ్ఞవల్ల నేనిప్పుడు బృందావనం వెడుతున్నాను. రసదేవతలయిన రాధాకృష్ణులు నన్ను కరుణించి నాల్గువేల ఏండ్ల క్రింద సర్పయాగంలో ఆహుతికాకుండా రక్షించారు. ఇప్పుడు మళ్ళీ అక్కడకు వెళ్ళి కొంత కాలం ఉంటాను. జన్మాంతర సఖులైన కొందరు గోస్వాములను రాధాకృష్ణ భక్తులను కలసికొని వారితో కొంతకాలం భక్తిరసామృత సింధువులో మజ్జన మాడుతాను. ఆ పిమ్మట కళింగ దేశంలోని భువనేశ్వర ప్రాంతానికి వెళ్ళి ఒక ఆశ్రమాన్ని నిర్మిస్తాను. అప్పటికి నా దగ్గరి కాళీ విగ్రహం పెరిగి పెద్దదవుతుంది. దానిని అక్కడ స్థాపించి నా శిష్యుల కప్పగించి ఈ శరీరాన్ని విడిచి పెడతాను. కొన్నాళ్లకు దక్షిణ దేశంలో జన్మించి కాళీ భక్తుడనై దేశ సంచారం చేస్తూ కాశీ వచ్చి రెండో సారి నిన్ను చూస్తాను. అప్పటికి నీవు ఇంకా జీవించే ఉంటావు. ఆతరువాత నీవీ క్షేత్రంలో ఇచ్ఛాపూర్వకంగా కాళీదేవి ఆజ్ఞవల్ల శరీరాన్ని వదలివేస్తావు. నేను కూడా ఎక్కడో శరీరాన్ని వదలి మళ్ళీ ఆంధ్రదేశంలో పుట్టి తపస్సు చేసి సన్యాసినై 'సిద్ధేశ్వరానంద భారతీస్వామి' అన్న పేరుతో సంచారం చేస్తూ మళ్లీ కాశీకి వచ్చి నీ ఆశ్రమాన్ని చూస్తాను. నీ శిష్యులు కొందరు జన్మలు మారి సాధన పరిపూర్ణతకోసం నా దగ్గరకు చేరుతారు. ఇలా కాళీదేవి ఇచ్ఛ ఒక్కొక్కరి యందు ఒక్కొక్క విధంగా ప్రసరిస్తుంది. ఏమైనా నీవు అదృష్టవంతుడవు." త్రైలింగ స్వామి ఆశ్చర్యంతో ఆ కాళీయోగిని విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు. ఆ సమావేశం అలా ముగిసింది. ఈ సిద్ధపురుషుని జీవితంలో జరిగిన మహిమాన్వితపు సంఘటనలను వర్ణిస్తే అసంఖ్యాకంగా ఉన్నవి. అందరూ చూచిన ఒక అద్భుత సంఘటనను ఉదాహరిస్తున్నాను. 1810 వ సంవత్సరంలో ఉజ్జయిని రాజు వారణాసి వచ్చి కాశీరాజుకు అతిథిగా ఉన్నాడు. అతడు మణికర్ణికా ఘాట్ ప్రాంతంలో పడవలో ప్రయాణం చేస్తుండగా కొంత దూరంలో స్వామి నీటిపై తేలియాడుతూ కన్పించాడు. ప్రక్కన ఉన్నవారు ఆ స్వామి మహిమలను గురించి రాజావారికి చెప్పారు. పడవను స్వామి దగ్గరకు తీసుకువెళ్ళమని చెప్పి ఆ రాజు స్వామిని తనపడవలోకి రావలసినదిగా ఆహ్వానించాడు. స్వామి పడవలోనికి వచ్చి రాజుగారి దగ్గర మణులు పొదిగిన పిడితో ఉన్న కత్తిని చూచి అదేమిటని ప్రశ్నించాడు? అది బ్రిటీష్ ప్రభుత్వం వారు తన కిచ్చిన బహుమతి అని సగర్వంగా చెప్పి చూడమని స్వామి చేతికి ఇచ్చాడు. స్వామి దానిని చేతిలో పట్టుకొని అటూ ఇటూ త్రిప్పుతూ ఉండగా అది గంగలో పడిపోయింది ఆగ్రహోదగ్రుడైనరాజు స్వామిని శిక్షించాలని అనుకొన్నాడు. ప్రక్క ఉన్నవారు ఈతగాళ్ళను పిలిపించి కత్తిని వెతికిద్దామని అంటున్నారు. రాజు ముఖకవళికలను చూచిన స్వామి గంగ నీటిలో చేయిపెట్టి రెండు కత్తులను తీసాడు. రెండూ ఒకవిధంగా రాజుగారి కత్తివలెనే ఉన్నవి. ఇందులో నీ కత్తి ఏదో తీసుకో అన్నాడు స్వామి. రెండు తన చేతిలోకి తీసుకొని రాజు ఎంత పరీక్షించినా తనదేదో కనుక్కోలేకపోయినాడు. "నీవస్తు వేదో నీవే తెలుసుకోలేవు,

అస్థిరమైన వీటి మీద మమకారం పోగొట్టకోలేని వాడివి నీవు” అన్నాడు స్వామి. తన ఆగ్రహానికి క్షమించమని రాజు స్వామి కాళ్ళ మీద పడ్డాడు. అతని కత్తి అతనికి ఇచ్చి రెండవ దానిని నీటిలో విసిరేసి స్వామి తాను కూడ నీళ్ళలోకి దూకి వెళ్ళిపోయినాడు.

1863 వ సంవత్సరంలో కలకత్తా నుండి రామకృష్ణ పరమహంస కాశీ యాత్రకు వచ్చి విశ్వనాధుని దర్శించిన తరువాత త్రైలింగ స్వామిని గూర్చి విని దర్శనానికి వెళ్ళాడు. సమున్నత స్థూల శరీరుడు, దిగంబరుడు అయిన ఈ యోగి అప్పటికే 250 సంవత్సరాల వయస్సు పైబడిన వాడని విన్నప్పుడు ఆశ్చర్యం కలిగింది. ఏవో సాధనలు చేసి దీర్ఘకాలం జీవించిన వ్యక్తిగా భావించి వెళ్ళిపోయినాడు. మొదటి దర్శనంలో ఆయనకు గొప్ప అభిప్రాయమేమీ కలుగలేదు తిరిగి తన స్వస్థానికి చేరుకొన్న తరువాత కాళీదేవి ముందు ధ్యానం చేస్తుంటే దేవి ఆయనకు సందేశం ఇచ్చింది. “నాయనా! త్రైలింగ స్వామిని నీవు తెలుసుకోలేకపోయినావు. అతడు నా చిరకాల భక్తుడు. కఠోర దీక్షలతో ఎన్నో సంవత్సరాలు ఏకాంత తపస్సు చేసి నా అనుగ్రహాన్ని పొందాడు. దయతో అతనికి ఎన్నో సిద్ధశక్తులు ప్రసాదించాను. నీవు మళ్ళీ కాశీకి వెళ్ళి అతనిని పూజించు”.

రామకృష్ణుడు పరమేశ్వరి ఆజ్ఞకు ఆశ్చర్య చకితుడై, కొద్ది కాలానికే ఆప్తులతో శిష్యులతో ఒక వంద మందిని తీసుకొని వారణాసికి వెళ్ళి ఆ మహనీయుని దర్శించాడు. తాను స్వయంగా ఆవుపాలతో పాయసం వండి అది త్రైలింగ స్వామికి సమర్పించి దగ్గర ఉండి స్వయంగా తినిపించాడు పరమహంస అడిగిన ప్రశ్నలన్నింటికి త్రైలింగస్వామి హస్త సంజ్ఞలతో సమాధానమిచ్చి, ఒక చిన్న నస్యపు పెట్టెను తన గుర్తుగా బహుకరించాడు. రామకృష్ణ పరమహంస తరువాత కాలంలో త్రైలింగ స్వామి గొప్ప అవధూత అని పరమహంస అని ప్రాస్తావికంగా తన శిష్యులకు తెలియచేశాడు. అనంతర కాలంలో వివేకానంద స్వామి కూడా వారిని దర్శించి పూజించాడు.

1869 లో స్వామీ దయానంద సరస్వతి కాశీకి వచ్చి విగ్రహారాధనను నిరసిస్తూ ప్రసంగాలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని త్రైలింగస్వామి దృష్టికి తీసుకు వచ్చినపుడు ఆయన మంగళదాస్ అనే తన శిష్యుని పిలిచి చిన్న కాగితపు ముక్క మీద రెండు వాక్యాలు వ్రాసి పంపించాడు. ఏమి వ్రాశాడో ఎవరికీ తెలియదు ఆ కాగితం చూచిన వెంటనే దయానంద సరస్వతి మూటా ముల్లె సర్దుకొని కాశీ విడిచి వెళ్ళిపోయినాడు.

1874 వ సంవత్సరంలో స్వామీ పృధ్వీగిరి అనే గొప్ప యోగి శిష్యుడు, స్వామి విద్యానంద కాశీకి వచ్చినపుడు పరిచితులు క్షేత్రంలోని విశిష్ట స్థానాలు చూచే ఏర్పాటు చేయమంటారా అని అడిగారు. ఆయన ఒక్క త్రైలింగ స్వామిని చూడటం తప్ప ఇంక ఏమీ చూడాలన్న కోరిక తనకు లేదని చెప్పి, వారి దర్శనానికి శిష్యులందరితో కలిసి వెళ్ళాడు. త్రైలింగస్వామి అతనిని ఆప్యాయంగా కౌగిలించుకొని ఇద్దరూ అదృశ్యులయి పోయినారు. కాసేపటికి త్రైలింగస్వామి ఒక్కరూ కనిపించారు. తామిద్దరము మాట్లాడుకొంటూ వెళ్ళామని విద్యానందస్వామిని రాజాఘాట్‌లో విడిచిపెట్టి వచ్చానని అన్నారు. అది నిజమో కాదో

తెలుసుకోవటానికి ఆ శిష్యులు ఆ ఘట్టానికి వెంటనే వెళ్ళి తమ గురువుగారిని చూచి ఆనందించారు. రామకమల్ ఛటోపాధ్యాయ అనే సోనాపూర్ వాసి కుమారుడు అయిదేండ్లవాడు మెట్ల మీద నుంచి పడి ఊపిరితిత్తులకు పక్కనున్న ఎముక విరిగింది. దానిని బాగు చేయటం వైద్యుల వల్ల కాలేదు. స్వామిని ప్రార్థించగా గంగలోని బురద తెచ్చి దెబ్బ తగిలిన ప్రదేశంలో రాయమని, రాసిన వెంటనే జ్వరం వస్తుందని, ఇంకాసేపటికి ఆకలి అవుతుందనీ, అప్పుడేదో కొద్ది ఆహారం ఇవ్వవచ్చునని, దానితో విరిగిన ఎముక అతుక్కొంటుందని చెప్పి పంపాడు. స్వామి చెప్పిన ప్రకారం వారు చేశారు– పిల్లవాడు కోలుకొన్నాడు.

భవానీచరణ్ అనే మరొక పౌరుడు జ్వరము, విరేచనాలు మరి అనేక బాధలతో ఏళ్ళ తరబడి బాధ పడుతున్నాడు. అతడు ఆర్తితో వచ్చి స్వామిని ఆశ్రయించాడు. దుష్కర్మ పీడితుడయిన అతనిని స్వామి ఎన్నో విధాల పరీక్షించారు. ఒకరోజు వాంతి చేసుకొని మరొక రోజు మల విసర్జన చేసి ఆ ప్రదేశాలను శుభ్రం చేయమన్నాడు వాడు ఏమీ సందేహించకుండా అసహ్యించుకోకుండా శుభ్రం చేశాడు. స్వామి, అతని యందు దయకలిగి కొంత భంగు అతనికిచ్చి తినమన్నాడు. వాడు దానిని తిన్న తరువాత "నీవింక నా దగ్గరకు రానక్కరలేదు – రోగం కుదురుతుంది ఫో" అన్నాడు. మరునాటికి వాడి రోగాలన్నీ మాయమయినవి. అయినా వాడు రావటం మానలేదు రోజూ స్వామిని దర్శించి వీలైన సేవచేసేవాడు.

కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన ఒక నాస్తికుడు కాశీవచ్చి విశ్వనాధుని చూచాడు. నమస్కరించటం కానీ ప్రార్థించటం కానీ చేయలేదు. ఏదో వింత చూడటానికి వచ్చినట్లు చూచి వెళ్ళాడు. తెలిసిన వారెవరో త్రైలింగస్వామిని గూర్చి చెపితే ఆయన్ను చూడటానికి వెళ్ళాడు. మౌని అయిన స్వామి మాట్లాడలేదు. అతని వైపు ఒకసారి చూచారు అంతే! ఆ న్యాయమూర్తిలో ఏదో మార్పు వచ్చింది. అతని చెవిలో ఎవరో 'స్వామి మహనీయుడు, వెళ్ళి కాళ్ళ మీదపడు' అని ఆజ్ఞాపించినట్లు వినిపించింది. అటూ ఇటూ చూచాడు, ఎవరూ లేరు. ఇంతలో ఎవరో ఒక తోపు తోసినట్లనిపించింది స్వామి కాళ్ళ మీద అతడు బొక్క బోర్లా పడ్డాడు. స్వామి చిరునవ్వు నవ్వుతూ ఉన్నారు. ఆక్షణం నుండి ఆ న్యాయమూర్తి సనాతనధర్మ విశ్వాసిగా మారిపోయినాడు. స్వామి దృష్టి యొక్క ప్రభావం అటువంటిది.

ఆశ్రమంలో ఒక పెద్ద గొయ్యి త్రవ్వించి స్వామి అందులో కూర్చుండేవాడు. విశ్వనాధునికి అభిషేకం చేసినట్లుగా భక్తులు చిల్లుల పాత్రలో నీళ్ళు పోసి ఆయనకు అభిషేకం చేసేవారు. సాయంకాల హారతి సమయాలలో తన గదిలోని కాళీదేవికి స్వామి స్వయంగా కర్పూర నీరాజనం సమర్పించేవాడు. ప్రధానమైన పూజా దినాలు వచ్చినపుడు ఆశ్రమంలో హారతి పూర్తి చేసి, సరాసరి కాలభైరవాలయానికి హారతి సమయానికి వెళ్ళి భైరవుని పూజించేవాడు. ఆ దేవుని యందు ఏర్పడిన భక్తికి చిహ్నంగా కాలభైరవ విగ్రహం కూడా

స్వామి వారి ఆశ్రమంలో స్థాపించబడింది. కాలభైరవాలయంలో కూడా స్వామి వారి విగ్రహాన్ని భక్తులు స్థాపించారు. ఇప్పటికీ భక్తులు దానిని చూడవచ్చు. కాళీ, కాలభైరవుడు కాలజయాన్ని ప్రసాదించి దీర్ఘాయువును ఇచ్చే దేవతలు కదా!

కాలభైరవాలయం పక్కనే ఒక పేద ముసలమ్మ పాలు అమ్ముకొనేది. ఆమె వ్యాపారం సరిగ్గా సాగడం లేదు స్వామివారియందు ఆమెకు భక్తి ఏర్పడి ఆయన కాలభైరవాలయానికి వచ్చినప్పుడల్లా గోరువెచ్చని పాలు ఒక పాత్రలో స్వామికి సమర్పించేది. స్వామి ఆదరంగా ఆ పాలను త్రాగేవాడు. కొద్దికాలానికి ఆమె వ్యాపారం మూడుపూవు లారుకాయలుగా వర్ధిల్లింది.

ఆ కాలంలో కాశీలో కీనారామ్ అఘోరి గొప్ప పేరుగల సిద్ధుడు. అతడు 179 సంవత్సరాలు జీవించాడు. త్రైలింగస్వామి, అతడు మంచిమిత్రులు. ఒకరోజు స్వామి అసిఘాట్ ప్రాంతంలో ఉన్న అతని ఆశ్రమానికి వెళ్ళి అక్కడ అనాలోచితంగా అతని సింహాసనం మీద కూర్చున్నాడు అతని శిష్యులకు కోపం వచ్చింది. వారు వెళ్ళి తమ గురువుగారితో ఈ విషయం చెప్పారు. ఆయన వెంటనే తన శిష్యులతో స్వామి మహానుభావుడు ఎక్కడ కూర్చున్నా పరవాలేదని చెప్పి స్వామి దగ్గర మరొక కుర్చీలో కూర్చుని చాలా సేపు మాట్లాడుకొన్నారు. సంభాషణ జరుగుతూ ఉండగా శిష్యులు ఆతిథ్య మర్యాద కోసం వారి పద్ధతి ననుసరించి ఒకముంతెడు భంగు కలిపిన పాలు తెచ్చి ఇచ్చారు. స్వామి ఆ ముంతెడు త్రాగి పాత్ర ప్రక్కన పెట్టాడు. శిష్యులు ఆయన పూర్తిగా పాత్ర ఖాళీ చేయటం చూచి మరొక ముంతెడు తెచ్చి ఇచ్చారు. స్వామి త్రాగుతూ ఉన్నాడు. అయిదు ముంతలు పూర్తయినవి. స్వామి మామూలుగా ఆ పదార్థానికి అలవాటు పడ్డవాడు కాడు. సాత్విక ఆహారం తీసుకోనే మనిషి. కీనారామ్ శిష్యులు దిగ్భ్రాంతితో చూస్తున్నారు ఎందుకంటే ఒక ముంతెడు త్రాగితేనే కళ్ళు తిరుగుతవి. ఒళ్ళు తూలుతుంది స్వామి అయిదుముంతలు ఎలా త్రాగాడో వారికి ఆశ్చర్యం వేసింది. ఈయన ఈపూట ఇక్కడ కళ్ళు తిరిగి పడిపోక తప్పదు అనుకొన్నారు. కాసేపటికి మాట్లాడడం పూర్తయిన తరువాత త్రైలింగస్వామి కీనారాంతో చెప్పి తన ఆశ్రమానికి బయలుదేరాడు. ఆయన ముందుకు నడచి వెడుతూఉంటే కొంచెం తూలినట్లుగా కనిపించి, కీనారామ్ ఆశ్రమందాకా తోడు వెళ్ళమని తన శిష్యులను పంపించాడు కొద్ది దూరం వెళ్ళిన తరువాత తనతో వస్తున్న వారిని చూచి "మీరు నాతో ఎందుకు వస్తున్నారని అడిగాడు స్వామి". "మీ ఆశ్రమం దాకా పంపించి రమ్మని చెప్పారు మాగురువుగారు" అన్నారువారు. వారి వైపు చూచి నవ్వి స్వామి అదృశ్యుడయినాడు.

గంగా స్నానం ఆయనకు చాలా ఇష్టమైన అంశం. ఎండలుగాని, వానలుగాని, చలిగాని ఏమైనా సరే ప్రతిరోజూ గంగా స్నానం చేయవలసిందే. ఒక్కొక్క సారి గంటల తరబడి నీళ్ళలో మునిగి ఉండేవాడు. ఒక్కొక్క సారి నీళ్ళమీద తేలుతూ ఉండేవాడు. మరొకసారి నది మీద నడిచి వెళ్ళేవాడు.

బీహారులోని ముంగేర్‌లో ఉమాచరణ్ ముఖోపాధ్యాయ అనే ప్రభుత్వోద్యోగి ఉండేవాడు. హరిద్వార్ మొదలైన తీర్థయాత్రలకు వెళ్ళటం కోసం మూడు నెలలు సెలవు తీసికొని మొదట కాశీకి వెళ్ళాడు. అతని స్నేహితునికి కాశీలో ఒక ఇల్లు ఉన్నది. దానిని నిర్వహించటానికి అతడు ఏర్పాటు చేసిన రామచందర్ ముఖోపాధ్యాయ అనే వ్యక్తికి ఆ మిత్రుడు ఒక ఉత్తరం వ్రాసి ఇచ్చాడు. దానివల్ల వారణాసిలో ఏ ఇబ్బందులు లేకుండా గతించిన తల్లితండ్రులకు చేయవలసిన క్షేత్రవిధులు నిర్వర్తించాడు. కాశీలో చూడవలసిన ప్రదేశాలను చూచిన తరువాత రామచంద్ర త్రైలింగస్వామి గూర్చి మహిమాన్వితుడైన యోగిగా వర్ణించి పంచగంగా ఘాట్‌లోని ఆశ్రమానికి వెళ్ళి ఆయనను దర్శించమని సలహాఇచ్చాడు. ఉమాచరణ్ సంస్కృతం బాగా చదువుకొన్నవాడు. వేదాంత గ్రంథాలు ఎన్నో చదివాడు. పఠించిన కొద్దీ సంశయాలు పెరుగుతున్నవి. ఎవరైనా మహాపురుషులు ఋషితుల్యులు దొరికితే సందేహాలు తీర్చుకోవాలని ఆశతో ఉన్నాడు. ఈ స్వామిని గురించి విని మరునాడు ఉదయం పెందలకడ లేచి గంగా స్నానం చేసి స్వామి దర్శనానికి వెళ్ళి, నమస్కారం చేసి, దూరంగా కూర్చుని స్వామి వైపు చూస్తున్నాడు. అతనిని చూస్తూనే మౌనిగా ఉన్న స్వామి చేతితో అక్కడి నుండి వెళ్ళి పొమ్మని సౌంజ్ఞచేశాడు. స్వామి అనుచరుడు మంగళదాస్ ఆలస్యం చేయవద్దని హెచ్చరించి పంపివేశాడు. మళ్ళీ మరునాడు వెళ్ళాడు. కలకత్తా నుంచి ఒక వకీలు స్వామి దర్శనానికి వచ్చాడు. అతడిని దూరంగా ఉండమని తన అనుచరులకు స్వామి సూచించాడు. అందరూ వెళ్ళిపోయిన తరువాత ఆ వకీలు స్వామి దగ్గరకు వెళ్ళి వినయంగా తనను దూరంగా ఉంచటానికి కారణం తెలియచేయమని ప్రార్థించాడు. అనూహ్యంగా స్పందించి స్వామి నీవు నీ భార్య తల్లితో అక్రమ సంబంధం పెట్టుకున్నావు ఇక్కడకు రాదగవు వెళ్ళు అన్నాడు. ఆ న్యాయవాది తలవంచుకొని వెళ్ళిపోయాడు. మరొకరోజు ఇంకోవ్యక్తిని ఇలానే నీ మనస్సు ఇక్కడ లేదు బయట పెట్టిన ఖరీదైన చెప్పులమీద ఉన్నది. అవి భద్రంగానే ఉన్నవి, వెంటనే వెళ్ళి వాటిని తొడుక్కొని వెళ్ళిపో అన్నాడు స్వామి. ఇవన్నీ చూస్తూ వింటున్న ఉమాచరణ్ ప్రతిరోజూ రావటం దూరంగా నించోటం నమస్కారం చేయటం, స్వామి వెళ్ళిపోమంటే వెళ్ళిపోవడం ఇలా 12 రోజులు గడచినవి 13 వరోజు స్వామిని చూచి ఆర్తుడై ఏడవటం మొదలుపెట్టాడు. స్వామి ఆజ్ఞ మీద అనుచరుడు మంగళదాస్ ఉమాచరణ్‌కు ఎఱ్ఱని సుద్దరాయి ఇచ్చి దానిని పెద్ద బండమీద పెట్టి గంధం లాగా తీయమన్నాడు. ఇతడు గంధం తీయటం, స్వామి దానిని ఎవరికో ఇవ్వటం ఇలా కొన్నాళ్ళు సాగింది. 28 రోజులు ఈ విధంగా గడచినవి. అలవాటు లేని ఈ పనికి చేతులు నెప్పులు పుట్టి ఇంక ఈ సుద్దరాయి పని చేయలేను అన్న స్థితికి వచ్చాడు, చేయకపోతే బయటకు పంపిస్తాడేమో అని భయం. ఈ భయంతో బాధతో వెళ్ళిన అతనిని ఆ రోజు ఆ పని చేయమని స్వామి చెప్పలేదు నీకు సంస్కృతం వచ్చునా ? అని అడిగారు స్వామి. వచ్చునని వినయంగా చెప్పాడు ఉమాచరణ్. అప్పుడు స్వామి తన గదిలో నుండి ఒక పుస్తకం తెప్పించి దాని నుండి కొన్ని శ్లోకాలను బెంగాలీలోకి అనువదించమని చెప్పాడు. ఉమాచరణ్ చక్కటి అనువాదం చేసి చూపించాడు.

ఇలా కొన్ని రోజులు ఈ అనువాద కార్యక్రమం సాగింది. స్వామికి నెమ్మదిగా ఇతని యందు దయగలిగింది. ప్రతిరోజూ ఆశ్రమానికి రావటం, స్వామి పాదధూళి శిరస్సున ధరించటం, చెప్పిన పని చేయటం జరుగుతుండగా ఒకరోజు స్వామికి అనుగ్రహం కలిగి లోపల ఉన్న తన గదిలోనికి తీసుకు వెళ్ళాడు. అక్కడ పరమేశ్వరి అయిన కాళీమాత విగ్రహాన్ని శివలింగాన్ని దర్శించే అదృష్టం కల్గింది. స్వామి అతనిని చూచి ఇలా అన్నారు– నేను పెట్టిన పరీక్షలో నీవు నెగ్గావు. పూర్వజన్మ సంస్కారం వల్ల నీకీ యోగ్యత లభించింది. నీకు పరమ ఆప్తుడయిన ఒక మిత్రుడు ఫలానా పేరు కలవాడు పూర్వజన్మలో నీకు తండ్రి. అలానే నీ స్వస్థలంలోని నీ మేనమామ పూర్వజన్మలో నీ స్నేహితుడు. ఇంతకు ముందు జన్మలో నీ ఊరు, పేరు ఇది.................... అని చెప్పి అతని ప్రార్థన మీద మంత్రోపదేశం చేయటానికి అంగీకరించాడు. తరువాత కొద్దిరోజులలో వచ్చేగ్రహణం నాడు ఒక ప్రత్యేక వస్తువును బ్రాహ్మణునికి దానం చేయవలసినదిగా సూచించి, ఆ తరువాత తన తగ్గరికి రమ్మన్నాడు. గ్రహణ సమయంలో దాన స్వీకారానికి ఉత్తమ బ్రాహ్మణులు దొరకరని అతడు విన్నవించగా, దొరుకుతాడు వెళ్ళు అన్నారు స్వామి. స్వామి అనుగ్రహం వల్ల గ్రహణం వచ్చినప్పుడు ఉమాచరణ్ దానం ఇవ్వగలిగాడు. బహుశ స్వామియే వచ్చి తీసుకొన్నాడేమో ! అని అత డనుకొన్నాడు. స్వామి దగ్గరకు వెళ్ళగానే నీ విప్పుడు దోషరహితుడవయినావు, అని మంత్ర దీక్ష ఇచ్చాడు.

ఉమాచరణ్ ప్రార్థన మీద అతని భిక్ష స్వీకరించటానికి స్వామి అంగీకారించారు. వండిన పదార్థాలు మొత్తం స్వామి తింటూ ఉంటే విస్తట్లో ఒక్క మెతుకు అయినా తనకు విడిచిపెట్టమని అతడు ప్రార్థించాడు. ఎందుకని, స్వామి అడిగితే అతడు 'మీ ఎంగిలి నాకు మహాప్రసాదము' అన్నాడు. ఈ విధంగా ఉమాచరణ్ స్వామి వారి ఆప్త శిష్యులలో ఒకరిగా మారగలిగాడు.

ఒకనాడు సాయంకాలం స్వామిని చూడటానికి కొందరు పరమహంసలు వచ్చారు. వారి దగ్గర 30 కి పైగా లిఖిత గ్రంథాలున్నవి వారు స్వామితో రకరకాల విషయాలు సంభాషిస్తూ తమ సందేహాలు అడిగారు. స్వామి తమ అనుచరుడు మంగళదాస్‌ను పిలిచి యోగుల దగ్గర ఉన్న గ్రంథాల్లో ఒకదానిని తీయించి అలవోకగా ఒక పేజీ త్రిప్పి అందులో చదవమన్నాడు. దానిలో వారడగిన ప్రశ్నలకు సమాధాన మున్నది. ఉమాచరణ్ స్వామి వారి దివ్య జ్ఞానానికి దివ్య దృష్టికి ఆశ్చర్యపోయినాడు. ఇంతలో ఉరుములు మెరుపులతో పెద్ద జడివాన మొదలయింది. స్వామి ఇతని వైపు చూచి వెంటనే ఇంటికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. ఎందుకో అర్థం కాలేదు అయినా ఆజ్ఞ పాటించక తప్పదు. ఆశ్రమం దాటి ఉమాచరణ్ తన ఇంటికి వెడుతూంటే ఒక చుక్క నీరు కూడ పైనపడటం లేదు. చుట్టూ బ్రహ్మాండమైన వాన – అతడి ముందు దోవ చూపుతు దీపం పట్టుకొని ఒక మనిషి నడుస్తున్నాడు. ఇంటికి చేరి వెనక్కి తిరిగి చూస్తే దీపమూ లేదు, మనిషిలేదు. స్వామి యొక్క

కరుణ తనమీద ప్రసరిస్తున్నదని అతడు గ్రహించగలిగాడు. ఈ విధంగా కొద్దిరోజులు గడచిన తరువాత ఒకరోజు స్వామి నీ విక్కడి నుండి వెళ్ళిపోవలిసిన సమయం వస్తున్నది నీ కేదైనా కోరిక ఉంటే చెప్పు అన్నారు. ఉమాచరణ్ "స్వామి! మీరు మహానుభావులు, దయతో నాకు కాళీ మంత్రాన్ని ఉపదేశించారు. నా సాధనవల్ల ఆదేవతను చూడగలనన్న నమ్మకం నాకు లేదు మంత్రసిద్ధి కలుగుతుందని అనుకోలేకపోతున్నాను. మహాసిద్ధులయిన మీరు కాళీదేవి యొక్క నిత్య సాక్షాత్కారం కలిగినవారు. నా కొక్కసారి అమ్మ దర్శనం చేయించండి" అని దీనంగా ప్రార్థించాడు. స్వామికి అతని యందు అనుగ్రహం కలిగింది. ఆ రోజు చీకటిపడిన తరువాత అతడిని తనకాళీ మందిరంలోకి తీసుకు వెళ్ళాడు. అందమైన తరుణకాళీ విగ్రహం నాలుగు అడుగుల ఎత్తుతో ప్రకాశిస్తున్నది. ఆమెను స్వామి ఎప్పుడూ మంగళా అని పిలిచేవాడు. తలుపులన్నీ మూయబడినవి. వారిద్దరూ మాత్రమే లోపలఉన్నారు స్వామి ధ్యాన నిమగ్నుడై కాళిని ఆవాహనం చేశాడు. ఆ శిలా విగ్రహం ఒక సుందర బాలికగా మారి నడచి వచ్చింది. 'ఉమాచరణ్ ! అమ్మను చూడు' అన్నారు స్వామి. ఆశ్చర్యానందాలతో పరవశించిన ఉమాచరణ్ దేవిపాదాలు స్పర్శించటానికి అనుమతి కోరాడు. స్వామి అనుమతించగా అతడు ఆమె పాదములు తాకి నమస్కరించాడు. అది శిలా స్పర్శకాదు. మానవ శరీర స్పర్శ. అతని జన్మ తరించింది. అనంతరము స్వామి మంగళకాళిని పూర్వస్థానానికి వెళ్ళమని కోరాడు. ఆ సుందరబాలిక నెమ్మదిగా నడచివెళ్ళి మళ్ళీ శిలాకృతిని ధరించింది. ఉమాచరణ్ స్వామితో "ఇదేలా సాధ్యం, కదలనిరాయి కదిలే మానవిగా ఎలా మారింది" అని అడిగితే స్వామి చిరునవ్వుతో దైవకృపకు అసాధ్యం లేదు అన్నారు. ఆ విధంగా కాళీ దర్శనంతో పునీతుడయినాడు ఉమాచరణ్.

ఒకరోజు ఆశ్రమంలో ఉండగా స్వామి ఉమాచరణ్‌తో "కళ్ళుమూసుకో నేను తెరవమన్నపుడు తెరువు" అన్నారు. సుమారు ఒక గంట సేపు గడచి ఉండవచ్చని పించింది ఉమాచరణ్‌కు. స్వామి కళ్ళు తెరవమన్నారు చూస్తే వాళ్ళిద్దరు గంగానది మీద ఉన్నారు. నదిమీద ఒక మంచం, దాని మీద తెల్లటి దిండ్లు ఉన్నవి. స్వామి కూడా దగ్గర కూర్చుని ఉన్నాడు. అప్పుడు స్వామి నదిలో నీరు ఉన్నదో లేదో చూడమన్నాడు. ఉమాచరణ్ ముందుకు వంగి వేళ్ళతో నీళ్ళు తాకి చూశాడు. ముందుకు వంగటంతో నీళ్ళలో పడబోయి స్వామి కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు. మంచము తాము పరుపు నీళ్ళలో ఎలా తేలుతున్నాయో అర్థం కాలేదతనికి. కొంత సేపయిన తరువాత స్వామి మళ్ళీ అతనిని కళ్ళు మూసుకోమన్నాడు. కళ్ళు తెరిచే సరికి మళ్ళీ ఇద్దరూ ఆశ్రమంలో ఉన్నారు. ఇతనికి కనిపించిన విషయం దేనినీ విశ్వాసము లేని వారికి చెప్పవద్దని స్వామి ఆదేశించాడు. ఆ తరువాత కొద్ది రోజులకే అతడు నేర్చుకోవలసినది సంతృప్తికరంగా తెలిసికోబడినది కనుక, ఆశ్రమం నుంచి వెళ్ళవచ్చునని సూచిస్తూ "ఈ ప్రపంచంలోనికి మళ్ళీ రావాలనే కోరిక త్యజించ"మని ఆదేశించాడు. ఉమాచరణ్ తన పాపములన్నీ నశించి పోయినవా? అని ప్రశ్నించగా" నీకే నిదర్శనం కన్పిస్తుంది. నీరెండు చేతులు కాలినట్లుగా నల్లగా అయినవి నెమ్మదిగా చర్మము

మీద పైపొర ఊడిపోతుంది. పాపములు పోయినవనటానికి అదే గుర్తు" అన్నారు స్వామి.

స్వామి ఆదేశము మీద అతడు అయోధ్య వెళ్లి సమర్థరామదాస స్వామిని దర్శించుకొని, అక్కడి నుండి ప్రయాగ వెళ్ళి, సూరదాస్ బాబాను దర్శించాడు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం జరిగినపుడు అతడున్న ప్రాంతంలో యుద్ధం ముమ్మరంగా జరుగుతూ ఉంటే భద్రతకోసం ఆస్థలాన్ని విడిచిపెట్టి వెళ్ళమని భక్తులు ఆయనను ప్రార్థించారు. కానీ ఆయన కదలలేదు ఒకరోజు విదేశీ సిపాయి ఒకడు కాగడాతో ఈయనను కాల్చాడు. కానీ సూరదాస్‌బాబాకు ఏమీకాలేదు. ఆయనను కాల్చిన చోటు ఇప్పటికీ చూపించబడుతూ ఉంటుంది. తీర్థయాత్రలు పూర్తి చేసికొని ఉమాచరణ్ త్రైలింగ స్వామిని దర్శించుకొని స్వస్థానానికి వెళ్ళిపోయినాడు. ఆ తరువాత కొద్ది కాలానికి మళ్ళీ ఆశ్రమానికి రమ్మని పిలుపు వచ్చింది.

త్రైలింగస్వామి భౌతికశరీరాన్ని విడిచిపెట్టాలని నిశ్చయించుకొన్నాడు. శిష్యులంతా ఆశ్రమానికి చేరుకొన్నారు. సదానంద స్వామి, కాళీచరణ్ స్వామి,బ్రహ్మానంద స్వామి, భోలానాథ స్వామి, ఇంకా ఇద్దరు పరమహంసలు వారిలో ఉన్నారు. నిత్యము పరిచర్యలు చేసే మంగళదాస్ ఠాకూరు కూడా ఉన్నాడు. తన ముఖ్య శిష్యులందరికీ తాను ఈ పార్థివ శరీరాన్ని విడిచిపెట్టి వెడుతున్న సంగతిని విశదపరచి తరువాత చేయవలసిన విధులను గురించి స్పష్టంగా వివరించాడు. ఈ వార్తను విన్న పౌరులు చాలా మంది అక్కడకు గుంపులు గుంపులుగా తరలివచ్చారు.

క్రీస్తుశకము 1887 వ సంవత్సరము పుష్యశుద్ధ ఏకాదశినాడు ఉదయం 8 గంటలకు స్వామి తన గదిలోకి వెళ్ళి ధ్యాన నిమగ్నులయినారు. మధ్యాహ్నం మూడుగంటలకు తలుపు తెరుచుకొన్నది అప్పుడు అంతకు ముందే తయారు చేసి ఉంచిన పెట్టెలో యోగ ముద్రలో కూర్చున్నారు. కొద్ది క్షణాలలోనే ప్రాణాలను పరిత్యజించారు. ప్రాచీన శ్లోకమొకటి పరివ్రాజకుల మరణాన్ని గురించి ఇలా చెప్పింది.

శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే
సూర్య మండల భేదినౌ
పరివ్రాట్ యోగ యుక్తశ్చ
రణే చాభిముఖే హతః

యోగయుక్తుడయిన పరివ్రాజకుడు, రణరంగంలో వీర మరణం చెందిన యోధుడు సూర్య మండలాన్ని భేదించుకొని వెడతారు.

స్వామి ఆ విధంగా తృణప్రాయంగా (గడ్డిపోచవలె) ప్రాణములను పరిత్యజించాడు. స్వామి ఆజ్ఞ ఇచ్చిన ప్రకారం శిష్యులు పెట్టెను మూసి వేశారు. అది మామూలు శవపేటిక కాదు మామూలు శవాలను శవపేటికలో పడుకో పెడతారు. సన్యాసులను పద్మాసనంలో ధ్యానముద్రలో కూర్చోపెడతారు. త్రైలింగస్వామి తనకు తానుగా ఆ ముద్రలో కూర్చొని

ప్రాణాలు త్యజించాడు. భీష్ముని వలే స్వచ్ఛంద మరణం పొందాడా యోగివర్యుడు. తా నెప్పుడు మరణించాలో నిశ్చయిచుకొని ఆ నిర్ణయం ప్రకారం ప్రాణోత్క్రమణం చేసిన సిద్ధపురుషుడు ఆయన. ఆ దేహం పేటికను పడవలో ఉంచి 'అసి' ఘాట్ నుండి 'వరుణ' ఘాట్ వరకు తీసుకు వెళ్ళి పంచగంగా ఘాట్‌కు కొంచెం దూరంలో సూర్యాస్తమయం లోపల, శరీర పేటిక, గంగలో నిమజ్జనం చేయబడింది. చివరి క్షణంలో శవపేటిక తేలికగా ఉంటే శిష్యులు తెరిచి చూచారు. పూలున్నవట ! వాటిని ఉంచి సమాధి నిర్మించారని ఆశ్రమ నిర్వాహకులు చెపుతున్నారు.

స్వామిజీ దీక్ష ఇచ్చి సాధన చేయించిన వారిలో స్వామి కాళికానంద సరస్వతి, కాళీచరణ స్వామి శ్రీచైతన్యమహాప్రభువు యొక్క దగ్గరి బంధువు (1485–1533) బ్రహ్మానంద సరస్వతి, భోలానందస్వామి, దయాళ్‌బాబా, త్రిపురలింగ సరస్వతి, కన్నయ్యలాల్‌జీ, మంగళదాస్, భట్టబాల బ్రహ్మచారి, భైరవీ బ్రాహ్మణి (రామకృష్ణ పరమహంసకు తాంత్రిక విద్యలు నేర్పిన యోగిని) మాతారాజ్యలక్ష్మీదేవి, బ్రహ్మచారిణి శాంకరీమా, వేణునాథగంగూళీ, విజయకృష్ణ గోస్వామి, ఫకీర్ అబ్దుల్‌గఫూర్ మొదలగువారు. ఉత్తరప్రదేశ్‌లోని మైధిలీపురంలో 1833లో పుట్టిన 'స్వామీ భాస్కరానంద' స్వామి యొక్క సన్నిహితులలో ఒకరుగా తెలుస్తున్నది. స్వామి చేత ప్రభావితులు ప్రబోధితులు అయిన వారిలో గౌడస్వామి,కాష్ఠ జిహ్వాస్వామి రామనిరంజన స్వామి, విశుద్ధానందస్వామి, శ్యామాచరణ్ లాహిరి (మహావతార్ బాబా శిష్యుడు) మొదలైనవారు.

స్వామి యొక్క బోధలను ఆయన ప్రియ శిష్యుడు ఉమాచరణ్ 12 భాగాలుగా రచించాడు. రామకృష్ణపరమహంస జీవితాన్ని రచించిన క్రిస్టోఫర్ ఐషర్‌ఉడ్, 'రహస్యభారతంలోనా అన్వేషణ' గ్రంథాన్ని రచించిన పాల్ బ్రంటన్, వామదేవ శాస్త్రి అని తనపేరును చెప్పుకున్న డేవిడ్ ఫ్రాలే; తమ గ్రంథాలలో త్రైలింగ స్వామిని గూర్చి భక్తి పూర్వకంగా ప్రస్తావించారు. తెలుగులో ఆంధ్రప్రభుత్వ ఆస్థానకవి శ్రీపాద కృష్ణ మూర్తిశాస్త్రి (1866–1961), వద్దాది సీతారామాంజనేయ కవి (1900–1993) త్రైలింగస్వామి చరిత్రను రచించారు. శ్రీపాదవారు స్వామి నివసించిన గదిలో తనకు వేద ఘోష వినిపించిందని తన అనుభూతిని తెలియచేశారు.

ఇటీవల చాతుర్మాస్యదీక్ష కాశీలో చేస్తున్నప్పుడు కాల భైరవాలయంలో దర్శనమిచ్చాడు యోగిరాజు. అతడు కూడా నావలెనే రాధాపరివారం నుండి భూమికి దిగివచ్చినటులు తెలిసింది.

స్వామి శిష్యులు – ఉమాచరణ్ ముఖోపాధ్యాయ బెంగాలీలో చేసిన రచనకు డాక్టర్ వాసుదేవఛటర్జీ హిందీలో అనువాదం చేశారు. సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్ట్‌వారు 2003లో దీని తెలుగు అనువాదాన్ని ప్రచురించారు. ఆచార్య బిరుదురాజు రామరాజు –'ఆంధ్రయోగులు' అన్న తనగ్రంధంలో స్వామి జీవిత చరిత్ర క్లుప్తంగా రచించారు. కలకత్తా ఆంధ్రసంఘం

1973–74 సంచికలో శ్రీ మెట్ట ఆంజనేయులు స్వామి వారిని గురించిన కొన్ని విశేషాలు తమ వ్యాసంలో ప్రస్తావించారు. ఇలా మరికొందరు కూడా వారిని గురించి తెలిసిన విశేషాలు అందించారు. డాక్టర్ వి.వి.బి రామారావు 2004లో వారణాసిలో నడిచే దేవుడు అన్న పేరుతో ఆంగ్లంలో స్వామి జీవిత చరిత్ర ఆయన ప్రబోధాలు రచించారు.

ఈ విధంగా 1607 లో ఉదయించిన ఆ మహాపురుషుని భౌతిక జీవితం 1887 తో ముగిసింది. కానీ సిద్ధులకు మరణం లేదు. భౌతిక శరీరం వారికి నిమిత్త మాత్రం. పాంచ భౌతిక శరీరాన్ని విడచిపెట్టిన తరువాత కూడ వారు జీవించే ఉంటారు భక్తులను అనుగ్రహిస్తూనే ఉంటారు. త్రైలింగస్వామి కూడా ఆ విధంగానే సిద్ధభూమికలో ఉండి సాధకులను అనుగ్రహిస్తున్నాడు. ఆయన శిష్యులిద్దరు జన్మమారి ప్రస్తుతం నా భక్తులుగా ఉండి మంచి సాధన చేస్తున్నారు.

20. కీనారామ్ అఘోరీ

కాళీదేవి కృప వల్ల అద్భుత శక్తులు సాధించిన సిద్ధుడు ఇతడు. ఉత్తరప్రదేశ్‌లో చందౌలి జిల్లాలో రామఘర్ గ్రామంలో ఒక జమిందారు కుటుంబంలో ఇతడు ఉద్భవించాడు. తండ్రిపేరు అక్బర్ సింగ్, తల్లి మానసాదేవి. ఈ బాలుడు పుట్టిన సమయాన్ని బట్టి గ్రహదోషాలు ఉండటం చేత తల్లి తండ్రులు ఈ శిశువును ఒక బ్రాహ్మణునకు దాన మిచ్చి అతనికి ధనాన్ని సమర్పించి మళ్ళీ కొనుక్కొన్నారు. సంస్కృతంలో 'క్రీత–క్రీణ'. అన్న శబ్దానికి విక్రయము అని అర్థం. బ్రాహ్మణునకు విక్రయించబడి కొనుక్కొన్న శిశువునకు రామ్ అని పేరుపెట్టుకొని కీనారామ్ అని పిల్చుకున్నారు. కొనుక్కోబడిన రాముడని దీని అర్థం. పెరిగి పెద్దవుతున్న దగ్గరనుండి ఇతనిలో యోగి లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించేవి. లౌకిక విషయాలయందు ఏమాత్రము అభిరుచి ఉండెడిది కాదు. చదువుమీద కాని తోటి బాలురతో ఆటపాటల విషయంలో కాని ఆసక్తి చూపించేవాడు కాదు. ఎప్పుడూ కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తూండేవాడు. పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా చిన్నవయస్సులోనే దివ్యశక్తులు అతనిలో కనిపించటం మొదలుపెట్టాయి. ఒకరోజు నడి బజారులో ఒక పేద గృహస్థును చెట్టుకు కట్టి ఒకధనవంతుని సేవకులు. కొరడాలలో కొడుతున్నారు. అక్కడ చేరిన గ్రామస్థులు దానిని ఆపమనే ధైర్యం లేక ఊరికే చూస్తున్నారు. విషయమేమిటంటే ఆ పేదవాడు ధనవంతునికి బాకీ పడ్డాడు చెల్లించలేకపోయినాడు. అందుకని ఆ సంపన్నుని సేవకులు దౌర్జన్యం చేస్తున్నారు. కీనారామ్ ఆ ధనవంతుని చూచి "ఇక చాలు కొట్టటం ఆపండి ఇంకా కొడితే వాడు చచ్చిపోతాడు" అన్నాడు. ధనవంతుడు వెటకారంగా "చస్తే చస్తాడు ఏం ఫరవాలేదు, మిగతా వాళ్ళకు బుద్ధి వస్తుంది. అప్పు తీర్చకపోతే ఈ గతి పడుతుందని తెలిసివస్తుంది" అన్నాడు. కీనారామ్ "ఏమయినా సరే ఇంకా వాణ్ణి కొట్టటానికి వీలులేదు అన్నాడు. ఆ అప్పు నీవు తీర్చు, ఆపుతాను, అన్నాడు ధనికుడు. నేనెందుకు తీర్చటం ?

అతని చేతనే తీర్పిస్తాను" అన్నాడు కీనారామ్. ఎప్పుడు? అన్నాడు అతడు. కీనారాం – " ఇప్పుడే అతని కాళ్ళ దగ్గర త్రవ్వండి మీకు రావలిసిన బాకీ డబ్బులు ఉంటాయి" అన్నాడు. ఆశ్చర్యం! నేల కొంచెం పెళ్ళగించగానే బాకీకి సరిపడిన నాణెములున్నవి . అందరికీ దిగ్భ్రాంతి కలిగింది. ఆనాటి నుండి ఆ పేదవాడు కీనారాం భక్తుడు, అనుచరుడు అయినాడు. ఇటువంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతుండటంతో కీనారాం సామాన్యుడు కాదు దివ్య శక్తులున్న వాడన్న ప్రచారం జనంలో వ్యాపించింది.

ఇది ఇలా ఉండగా వయసులోకి వచ్చిన కుర్రవాడు, జమిందారు బిడ్డ, పెళ్ళి సంబంధాలు రావటం మొదలు పెట్టినాయి. ఆ రోజుల్లో బాల్యవివాహాలు సర్వ సామాన్యం. కీనారాం వివాహం చేసుకోవటానికి ఏమాత్రం అంగీకరించలేదు. కానీ తల్లి తండ్రులు పట్టుబట్టి పెళ్ళి జరిపించారు. కానీ, విచిత్రం! కార్యం కాక మునుపే ఆ వధువు మరణించింది. బలవంతపు బంధం వదిలిపోయింది. ఇంట్లో నించి వెళ్ళిపోయినాడు. దేశాటనం చేస్తూ దివ్యక్షేత్రాలను మహనీయులను దర్శిస్తున్నాడు. ఒక చోట 'బాబా శివరామ్' అనే మహనీయుని యందు భక్తి కలిగింది. ఆయన దగ్గర కాళీ మంత్రోపదేశం పొంది సాధన మొదలు పెట్టాడు. గురువుగారి సూచన ననుసరించి శక్తి క్షేత్రాలలో తపస్సు చేస్తూ కొన్నాళ్ళకు బెలూచిస్తాన్ లోని మాతాహింగుళాదేవి ఆలయానికి చేరాడు. ఆ దేవతను కాళీ దేవిగా అతడు భావించాడు. ఆ ఆలయం శ్మశానానికి చేరువలో ఉంది. పగలంతా ఆలయంలో ఒక ప్రక్కన కూర్చొని జపం చేసేవాడు. ఎవరో ఇంత ప్రసాదం పెట్టేవారు. రాత్రిళ్ళు శ్మశానంలో నివాసం. సుదీర్ఘకాలం ఈ కఠోర సాధన సాగింది. ఇతడు శ్మశాన సాధకుడని, శవాలను పీక్కుతింటాడని కథలు బయలుదేరినాయి. అయితే ఇతని జోలికి ఎవరూ వచ్చేవారు కాదు. అతని చూపులలోని తీవ్రత, అతని వాక్కులోని శక్తి అతనిని అధృష్యునిగా చేసినవి. అతని చిరకాల తపస్సు ఫలించి కాళీదేవి సాక్షాత్కరించింది."బిడ్డా! సుఖ భోగాలను జయించి చాలా సంవత్సరాలు నా కోసం కష్టపడ్డావు. సంపన్న వంశంలో పుట్టిన వారు సహజంగా అవకాశం ఉన్నది కనుక భోగాలాలసులు అవుతారు. అలా కాకుండా ఇంద్రియ నిగ్రహంతో కఠిన బ్రహ్మచర్యదీక్షతో ఓపికతో ఎన్నో సంవత్సరాలు ఈ ప్రేతభూమిలో చితాభస్మధారివై నన్ను ఆరాధించావు. నీకు అపూర్వమైన సిద్ధశక్తులను ప్రసాదిస్తున్నాను. అయితే, ఇంకా నీసాధన పరిపూర్ణం కాలేదు. గుజరాత్‌లోని గిర్నార్ కొండల దగ్గరకు వెళ్ళు. అక్కడ దత్తాత్రేయుడు సిద్ధమూర్తితో విరాజిల్లుతున్నాడు. అతని పాదములను ఆశ్రయించు. నా సంకల్పం వల్ల అతడు నీకు దర్శన మిచ్చి అనుగ్రహిస్తాడు" అని వరమిచ్చి అదృశ్యమయింది.

కీనారామ్ గిర్నార్ కొండలకు వెళ్ళాడు ఆ కొండల మీద సిద్ధ సాధకులు నరబలులు ఇచ్చి తీవ్ర దేవతలను వశం చేసుకొంటారని ప్రతీతి. కాళీదేవి కరుణ వల్ల దత్తాత్రేయుడు దర్శన మిచ్చాడు. అ మహనీయుడు చెప్పిన మార్గంలో అక్కడి ఒక కొండ గుహను నివాసంగా చేసుకొని మరికొంత కాలం తపస్సు చేసి 'మృతసంజీవిని' విద్యను మరికొన్ని సిద్ధశక్తులను

పొందగలిగాడు. అక్కడి నుండి మళ్ళీ హింగుళాదేవి దగ్గరకు వెళ్ళి జరిగింది విన్నవించుకొని "ఇంక ఇక్కడే నీ సన్నిధిలోనే శాశ్వతంగా ఉండిపోతాను అనుమతించు" అని ప్రార్థించాడు. హింగుళాకాళి దరహసితవదనంతో "కీనారాం! నీ విప్పుడు సిద్ధుడవు. నీవల్ల కావలసిన కార్యక్రమములు కొన్ని ఉన్నవి. పవిత్రమైన వారణాసి క్షేత్రానికి వెళ్ళు అక్కడ ఒక ఆశ్రమాన్ని స్థాపించి ప్రజాసేవచేయి తాంత్రికమార్గ సాధనలను అందరూ చేయలేరు. సాధకులలోని శ్రద్ధను గుర్తించి వారికి సహాయం చేయి – ఎన్నో సమస్యలతో సతమతమవుతూ, బాధపడుతూ నీదగ్గరకు వచ్చేవారికి, ఆర్తులకు, ఆపన్నులకు ఆదరహస్తాన్ని అందించు అన్నది. ఆ ఆజ్ఞను విని తల్లీ ! నీమాట నాకు శిరోధార్యము. నీవు చెప్పినవన్నీ, నీవిచ్చిన సిద్ధశక్తులతో నెరవేరుస్తాను. అయితే నిన్ను విడిచి నేను ఉండలేను. నిన్ను చూడకుండా ఎక్కడో కాశీలో ఉండటం నాకు సాధ్యంకాదు. నేను ఆ కాశీక్షేత్రంలో ఉండాలంటే నీవుకూడా నాతో రావాలి. మాతా! నీ బిడ్డకు ఈ వరాన్ని ప్రసాదించు. కాదనకు తల్లీ ! "అని కాళీదేవి కాళ్ళు పట్టుకొని విడవలేదు కీనారామ్. కాళీదేవి పెద్దగా నవ్వింది" అలాగే వస్తాను. అయితే కాశీలో ఒక నియమం ఉన్నది. అక్కడి క్షేత్ర పాలకుడు కాలభైరవుడు. వారణాసిలో ఎవరు ప్రవేశించాలన్నా, ఎవరక్కడ ఉండాలన్నా భైరవదేవుని అనుమతి కావాలి. కాశీలో అడుగు పెట్టగానే అతని ఆలయానికి వెళ్ళి దర్శించు, నా హృదయ వల్లభుడైన కాలభైరవుడు నా కోసం నిన్ను వాత్సల్యంతో స్వీకరిస్తాడు. నీ ఆశ్రమంలో నాతో పాటు భైరవుని కూడా స్థాపించు. ఇక బయలుదేరు శుభమస్తు" అన్నది.

జగన్మాత ఆ దేశించిన విధంగా అతడు వారణాసి చేరి హరిశ్చంద్రఘాట్‌కు దగ్గరలో ఒక ఆశ్రమాన్ని నిర్మించాడు. అక్కడ ఒక పాతపుష్కరిణి ఉన్నది. హరిశ్చంద్రుడు నిర్మించినదని ప్రతీతి. దానిని బాగుచేయించి క్రీం కుండమని పేరే పెట్టాడు. క్రీం కాళీ బీజము. తాను చిరకాలం జపించిన ఆ బీజము ఆ తీర్థానికి పేరే పెట్టి, దానిలో స్నానం చేసిన వారికి సర్వబాధలు తీరే పద్ధతిని ఏర్పరిచాడు. ఆదివారము, మంగళవారము అక్కడ ప్రత్యేకపు స్నానపు రోజులు – వందల, వేలమంది అక్కడకు వచ్చి కీనారాం అనుగ్రహం వల్ల బాధా విముక్తులు కావటం మొదలయింది. అక్కడ హింగుళాకాళి ఆలయం ఏర్పాటు చేయబడింది. అపురూపమయిన ఒక యంత్రాన్ని చెక్కించి దాని మీదకు హింగుళా దేవిని ఆవాహన చేసి దానిని ఒక శాశ్వత కాళీపీఠంగా కీనారాం ప్రస్థాపన చేశాడు. కాళీదేవి ఆజ్ఞ ప్రకారం ఒక వైపున కాలభైరవుడు కూడా స్థాపించబడ్డాడు.

కాశీలో 56 గురు వినాయకులు వివిధ స్థలాలో ప్రకాశిస్తూ ఉండగా ఈ ఆశ్రమ ప్రదేశంలో పురాతనమైన కూటదంత వినాయకుని ఆలయమున్నది. ఆశ్రయించిన వారి విఘ్నాలను అలవోకగా తొలగిస్తాడీ వినాయకుడు. మంగళవారం ఇక్కడ ప్రత్యేక పూజలు జరిగే ఏర్పాటు చేశాడు కీనారాం. క్రీం కుండం ప్రక్కనే అమ్మవారి ముందు ఒక హోమ కుండాన్ని నిర్మించి హరిశ్చంద్రఘాట్ నుండి శవములను కాలుస్తున్న చితాగ్నిని తెచ్చి కుండాన్ని అభిమంత్రించి "ఇక్కడనుండి ఈ అగ్ని ఈ కుండంలో ఆరకుండా శాశ్వతంగా ఉంటుంది.

ఇందులో వేసిన కాష్ఠముల భస్మాన్ని ఎవరుధరిస్తే వారికి కాళీదేవి అన్ని కష్టములను తొలగించి అభీష్ట సిద్ధిని ప్రసాదిస్తుంది" అని నిర్ణయించాడు కీనారామ్. ఆ కుండానికి "ఆగ్నేయ రుద్రధుని" అని పేరు పెట్టటం జరిగింది.

ఈ విధంగా కాశీలో తన ఆశ్రమంలో అన్ని ఏర్పాట్లు చేసి అప్పుడప్పుడు భక్తుల కోరిక మీద సంచారం చేస్తూ ఉండేవాడు కీనారామ్. ఢిల్లీలో ఒకసారి విడిది చేసిఉండగా ఇతని మహిమలను గురించి విని మొఘల్ పాదుషా షాజహాన్ వచ్చి దర్శనం చేసుకొన్నాడు.కీనారాం చక్రవర్తిని ఆదరంగా ఆశీర్వదించాడు. పాదుషా తన ఇబ్బందులు చెప్పుకొంటూ ఆఫ్ఘన్ సుల్తాన్ తనకు కొరకరాని కొయ్యగా ఉన్నాడని అతని కోటను పట్టుకోవాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా ఓటమి చవి చూడవలిసి వస్తున్నదని, తనకు విజయం కలిగేలా ఆశీర్వదించమని ప్రార్థించాడు. అతని యందు దయకలిగి కీనారాం ఈసారి యుద్ధంచేయండి గెలుపు వస్తుందని వరమిచ్చాడు. ఆయన చెప్పిన ప్రకారమే షాజహాన్ గెలుపుసాధించాడు. అప్పటి నుండి మొగల్ ప్రభువు ఆయన అధికారులు ఈ మహాసిద్ధుని యందు భయభక్తులు కలిగిఉండేవారు. షాజహాన్ తరువాత అతని కుమారులలో ఒకడయిన ఔరంగజేబు అధికారానికి వచ్చాడు. హిందూ మత ద్వేషంతో అతడు చేసిన దుర్మార్గాలు ఇన్ని అని చెప్పటానికి సాధ్యం కాదు. అత డొకసారి సైన్యంతో యుద్ధయాత్రకు వెడుతూ త్రోవలో ఒకచోట కీనారామ్ అఘోరీ ఉన్నారని విని దర్శనం చేసుకోవటానికి వచ్చాడు. కీనారాం అతడిని ఆదరంగా పలకరించి "పాదుషా! నీ తండ్రిగారి కాలం నుండి మీ కుటుంబంతో పరిచయం ఉన్న సంగతి నీకు తెలుసునుకదా ! ప్రజల హృదయాలలో ప్రేమాభిమానాలతో నిల్చిన నీ తాత తండ్రుల మార్గాన్ని విడిచి పెట్టి మత ద్వేషంతో హిందువులను నీవు బాధిస్తున్న సంగతి నేను గమనిస్తున్నాను. దైవం మెచ్చని మార్గమిది. హిందూహింసను, దేవాలయ విధ్వంసాలను నీవు మానుకోవడం మంచిదని నీకు సూచిస్తున్నాను". ఔరంగ జేబు ఈ మాటలు విని మర్యాదా పూర్వకంగా నమస్కరించి వెళ్ళిపోయినాడు. అతని పద్ధతులేమీ మార్చుకోలేదు సరికదా, కీనారాం నివసిస్తున్న కాశీని ధ్వంసం చేశాడు. విశ్వనాధుని ఆలయాన్ని పగులగొట్టి అక్కడ మసీదులను నిర్మించాడు. అయితే కీనారామ్ అఘోరి ఆశ్రమానికి వెళ్ళలేదు. భక్తి కంటే భయమే కారణం కావచ్చు. ఆ సిద్ధుని జోలికి పోతే ప్రమాదం అని అనిపించి ఉండవచ్చు. అక్కడి దగ్గరలో ఉన్న చునార్ కొండలకు సమీపంలో ఉన్న భర్తృహరి సమాధిని ధ్వంసం చేయించపోయి అక్కడ వెలువడిన భీషణ శబ్దాలకు భయం చెంది దానిని వదిలేశాడు.

వారణాసి విధ్వంసం జరిగినపుడు కీనారాం అఘోరి అక్కడ లేడు. సంచారానికి వెళ్ళి సుదూర ప్రాంతంలో ఎక్కడో ఉన్న కీనారామ్‌కు ఈ వార్త ఆలస్యంగా తెలిసింది. తిరుగు ప్రయాణం చేసి కాశీ వచ్చేసరికి వినాశనం చేసి ఔరంగజేబు ఢిల్లీ వెళ్ళిపోయినాడు. ఆశ్రమానికి చేరిన తరువాత జరిగిన విధ్వంస విశేషాలన్నీ తెలిసికొని ఎంతో విచారం పొందిన సందర్భంలో ఆయనను చూడటానికి వచ్చిన భక్తులు ఎన్నో ప్రశ్నలు వేశారు.

భక్తులు : స్వామీజీ! మొగల్ పాదుషాలు మీ భక్తులు కదా? ధర్మ కేంద్రమయిన ఈ కాశీ పట్టణ విధ్వంసాన్ని మీరు ఆపవచ్చు కదా!

కీనారామ్ : షాజహాను పాదుషా మాత్రమే నాకు భక్తుడు. ఔరంగజేబు నా భక్తుడు కాదు. ఇదివరకు ఒకసారి అతనిని హెచ్చరించాను, అతడు వినలేదు, అతని కర్మ అతడు అనుభవిస్తాడు.

భక్తులు : అతని సంగతి ఎట్లా ఉన్నా ఇప్పుడీ కర్మ ఫలితాన్ని అనుభవిస్తున్నది హిందువులు.

కీనారామ్ : తప్పదు కాలము, కర్మము ప్రపంచాన్ని నడుపుతాయి. హిరణ్య కశిపుని కంటే గొప్పవాడు కాదు కదా! ఇతడు. వాడు తాను దేవుడననే ప్రకటించుకొన్నాడు వీనిలో ఇంకా అది లేదు.

భక్తులు : వీడు మీ ఆశ్రమాన్ని విడచిపెట్టాడు. మీరంటే భయం కారణము కావచ్చు కానీ, నగరంలోని ఛిన్నమస్తా ఆలయం ధ్వంసం చేసిన అతడి సైనికులందరూ మర్నాడు మరణించారు. ఈవార్త విన్న ఔరంగజేబు ఆ గుడి మహంతుని పిలిపించి "మీ గుడి, మీ గుడిలోని దేవత మహిమగలదని తెలిసింది. మీ గుడి మీరు మళ్ళీ కట్టుకోండి దానికి కావలసిన ధనమిస్తాను" అన్నాడు. దాని కా మహంతు "అయ్యా! మీరు డబ్బు ఇవ్వక్కర లేదు పునర్నిర్మాణానికి అనుమతిస్తే చాలు" అని అన్నాడు. పాదుషా అనుమతించాడు ఇప్పుడు ఆ గుడి నిర్మాణం జరుగుతున్నది అక్కడి దేవతా శక్తిని ఔరంగజేబు అంగీకరించినట్లే కదా!

కీనారామ్ : నిజమే, సందేహం లేదు అతని దగ్గర ఒక చిన్న మంత్ర విద్య ఉన్నది. మంత్రములు సంస్కృతములోనే కావు అన్ని భాషలలోనూ ఉన్నవి. మహిమాన్వితుడైన ఒక ఫకీరు ఇచ్చిన ఆ విద్య వల్ల ఏ గుడి దగ్గరకైనా వెళ్ళి ఆ ఉర్దూ మంత్రాన్ని స్మరిస్తే అక్కడి దేవత యొక్క ఉనికి అతడికి తెలుస్తుంది అక్కడ దేవత ఉన్నట్లు అతనికి అనుభూతి కలిగితే ఆ గుడి జోలికి అతడు పొయ్యేవాడు కాదు. అతడికి జవాబు రాకపోతే అక్కడ దేవత లేనట్లుగా భావించి దానిని ధ్వంసం చేసేవాడు. ఛిన్నమస్తాగుడి దగ్గరికి అతడు స్వయంగా రాలేదు. తరువాత దేవతాశక్తి తెలిసింది కనుక దానికి తగ్గట్లుగా విక్రియ చూపించాడు.

భక్తులు : మీ సమాధానం బాగుంది. అయితే విశ్వనాధుడు కాలభైరవుడు మొదలైన ప్రధాన దేవతల ఆలయాలను ధ్వంసం చేస్తుంటే అతనికి తెలియలేదా ? లేక అక్కడ ఆ దేవతలు లేరా? వినాశనం జరుగుతూంటే వాళ్ళు ఎందుకు ఉపేక్షించారు? ఈ ప్రశ్నలు మా మనసులలో సుడిగుండాల వలే తిరుగుతున్నవి. వీటికి జవాబులు దొరికితే కాని మాకు శాంతి లేదు. వీటికి దయచేసి ప్రత్యుత్తరం చెప్పండి.

కీనారామ్ : మీశాంతి కోసం కాకపోయినా భవిష్యత్తరాల వారి కోసమైనా విషయం వివరిస్తాను. మంత్ర విద్యలలో అనేక రహస్యాలు, పరిమితులు ఉన్నవి. ఒక అల్ప విద్య కొన్నింటిని మాత్రమే తెలుసుకోగలదు. ఉదాహరణకు ఒక శ్మశాన సాధన వల్ల ఒక ప్రేతం ఒక సాధకునికి స్వాధీనమయిందనుకోండి, అది సమకాలంలో ఎక్కడ ఏమి ఉన్నా చెప్పగలదు. జరిగిన సంఘటనలను, జరిగిపోయిన సంఘటనలను, భూత కాలంలో కొంతవరకు తెలుసుకొని చెప్పగలవు. భవిష్యత్ దానికి తెలియదు తన పరిధిని మించి ఊర్ధ్వభూమికలలోని దేవతలను అది గుర్తించలేదు. ఈ సందర్భంగా ఒక పురాతన కథ చెబుతాను.

భారత దేశాన్ని విక్రమార్క చక్రవర్తి పరిపాలిస్తున్న కాలంలో దూర ప్రాంతంలో ఉన్న ఒకరాజుగారి కూతురు విక్రమార్కునే పెళ్ళిచేసుకోవాలని పట్టుపట్టింది. తండ్రి "అమ్మా! అతనికి ఇదివరకే చాలా మంది భార్యలు ఉన్నారు. వయసులో పెద్దవాడు ఇంకెవరినైనా సుక్షత్రియుడితో నీకు పెళ్ళి చేస్తాను" అని ఎంత నచ్చచెప్పినా ఆమె వినలేదు. గారాబుకూతురు మాట కాదన లేక రాజు అంగీకరించాడు. విచారణ చేయగా చక్రవర్తి ఉజ్జయినిలో లేడని దేశాటనానికి వెళ్ళాడని ఆరు నెలలదాకా రాడని తెలిసింది. రాజకుమారి విక్రమార్కుడు ఎక్కడ ఉన్నాడో తెలుసుకొని ఆయనను స్వయంగా కలుసుకొంటానని తండ్రి అనుమతి తీసుకొని సముచిత పరివారంతో బయలుదేరింది. కర్ణాకర్ణిగా చక్రవర్తి ఉన్న ప్రదేశం గురించి విని ఆ ప్రదేశం చేరుకొని, అది అరణ్య ప్రాంతం కావటం వల్ల పలుకుటీరాలు వేసివిడిదిచేసింది. అచట ఒకరోజు రాత్రి ఆరు బయట వెన్నెలలో ఆమె ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తుండగా ఒక గంధర్వుడు ఆమెను చూచి మోహించాడు. ఆమె దగ్గరకువచ్చి తనను వరించమని కోరాడు. ఆమె తాను మానసికంగా విక్రమార్కుని పరమయినానని చిత్రంలో చూచి ఆయనను వలచానని అందువల్ల ఇతరులను అంగీకరించలేనని చెప్పి మృదువుగా తిరస్కరించింది. గంధర్వుడు వెళ్ళిపోయి ఆమె మీద మోహాన్ని వదులుకోలేక తన దివ్య శక్తి వల్ల ఆ మరునాడు రాత్రి విక్రమార్కుని రూపాన్ని ధరించి ఆమె దృష్టిలో పడే విధంగా ఆ ప్రదేశంలో అడుగు పెట్టాడు. చిత్రపటంలో అంతకు మునుపు విక్రమార్కుని చూచి ఉన్నది కనుక వెంటనే గుర్తు పట్టి స్వాగతం చెప్పి, తనగుడారానికి తీసుకు వెళ్ళి తన విషయం అంతా చెప్పి తనను భార్యగా స్వీకరించమని అభ్యర్థించింది. విక్రమార్కరూపుడయిన గంధర్వుడు కాదనలేక అంగీకరిస్తున్నట్లు నటించి, అప్పుడే ఆమెను గాంధర్వ విధిలో వివాహమాడి కామక్రీడలతో ఆనందించి, తనకు పగటిపూట వేరేపనులున్నవి కనుక ప్రతిరోజూ రాత్రిపూట వస్తుంటానని చెప్పి వెళ్ళాడు. ఆ విధంగా నిశాక్రీడలు కొంతకాలం జరిగినవి ఒకరోజు అసలు విక్రమార్కుడు పగటిపూట అక్కడికి వచ్చాడు ఆమె మర్యాదలు చేసి "ప్రతిరోజూ రాత్రి వచ్చేవారు ఇవ్వాళ పగలు కూడా వచ్చారే! చాలాసంతోషం" అని గౌరవం చేసింది. తెలివిగల విక్రమార్కుడు జాగ్రత్తగా విషయసేకరణ చేసి తనరూపంతో ఏ దివ్య శక్తి కలవాడో ఆమెను మోసగిస్తున్నాడని గ్రహించి ఆరోజూ రాత్రి అక్కడ రహస్యంగా తన వశమై సేవచేస్తున్న బేతాళుని నియమించాడు. ఆ నాటి రాత్రి ప్రతిరోజూ వలెనె గంధర్వుడు విక్రమార్క

రూపంతో రాగానే బేతాళుడు అతనిని పట్టుకొన్నాడు. గంధర్వుడు అతనిని వదిలించుకొని ఒక్క దెబ్బతో బేతాళుని అవతలకు నెట్టివేసి ఆకాశంలోకి ఎగిరి వెళ్ళిపోయినాడు. బేతాళుడు విక్రమార్కుని దగ్గరకు వెళ్ళి మహారాజా “వాడెవడో గంధర్వుడు, మీ రూపాన్ని ధరించి వచ్చాడు. నేను వానిని పట్టుకొన్నా నాకంటే అధికతర శక్తులు కలవాడు కావటం వల్ల నను విదిలించి కొట్టి వెళ్ళిపోయినాడు అన్నాడు. ఆ తరువాత ఆ కథ ఏమయింది? అనేది అంత ముఖ్యం కాదు దేవ జాతులలో, మంత్ర దేవతలలో ఒకరిని మించిన వారొకరుంటారు. అంటే ఔరంగ జేబు దగ్గర ఉన్నది భూత విద్య. విశ్వనాధుని వంటి మహాదేవతలను గుర్తించటం దానికి సాధ్యం కాదు కనుక అచటి దేవతల ఉనికిని తన విద్య ద్వారా తెలుసుకోలేక అక్కడ ఆ దేవతలు లేరనే భ్రాంతితో విగ్రహారాధన ద్వేషి అయిన ఆ క్రూరుడు గుడులు గోపురాలను నేలమట్టం చేశాడు. విగ్రహాలను నేలమట్టం చేశాడు.

ఇప్పుడు మరొక ప్రశ్న ఉదయిస్తుంది. మీరు వేయకపోయినా నేనే వేసుకొని సమాధానం చెబుతున్నాను. తమ ఆలయాలను ధ్వంసం చేస్తూంటే ఆ దేవతలు ఏమి చేస్తున్నారు? తమను తాము రక్షించుకోలేని దేవతలు భక్తుల కోరికలనేమి తీరుస్తారు? ఇది చాలా జాగ్రత్తగా పరిశీలించవలసిన ప్రశ్న. దేవాలయాలలో దేవతలుంటారు. స్వయం భువులయినా, ఋషి ప్రతిష్ఠితములయినా, మానవ నిర్మితములయినా, అక్కడ దేవతలు నెలకొని ఉండటం అనేది నిశ్చితము. పూజల చేత సంతుష్టి చెందిన దేవతలు, భక్తులకు కోరిన కోరికలు తీరుస్తారు. దేవాలయలు నిర్మించిన వారికి పుణ్యానుభవాన్నీ ఇస్తారు. గుడులను కూలగొట్టిన వారికి పాపాను భావాన్ని నరకంలో కొంత, తరువాతి జన్మలో కొంత అనుభవింపచేస్తారు. దేవతల చట్టం వేరు మానవుల చట్టం వేరు. మానవులు చేసిన పుణ్యపాపాలను ఆ జన్మలో అనుభవింప చేయటం ఉండదు. తరువాత స్వర్గ నరకాలలో కొంత జన్మాంతరములో మిగతాది అనుభవించవలసి ఉంటుంది. అందువల్ల గుడి కట్టిన వాడు కాని కూల్చిన వాడుకాని, పుణ్యపాపాలను అనుభవించేది కాలాంతరమందు, దేహాంతర మందు. అయితే, దేవతలను ఆవాహన చేయకలిగిన తపః సంపన్నుడో, భక్తుడో ప్రార్థిస్తే అతనికోసం దిగివచ్చి అతని కోరికను నెరవేరుస్తారు. ఆపదలో ఉన్న గజేంద్రుని రక్షించిన విధంగా, హిరణ్యకశిపుని నుండి ప్రహ్లాదుని రక్షించినట్లుగా, భక్తుల మొరలు విని పరమేశ్వరు డవతరిస్తాడు. అంటే పిలవగలవారు పిలిస్తే దేవతలు దిగి వస్తారు తప్ప దేవతలు తమకు తామై వచ్చి జోక్యం చేసుకోరు.

ఇవన్నీ అట్లాఉంచి, ఇది కలికాలం యుగధర్మానికి దాని విధానం దానికి ఉన్నది. అనంతమయిన కాలంలో ఎన్ని జాతులు పతనమయినవి? ఎందరు మహావీరులు కాలగర్భంలో కలిసి పోయినారు? ఇది మ్లేచ్ఛుల కనుకూలమైన కాలం. దేశ జాతకాన్ని పరిశీలిస్తే ఈ మహమ్మదీయుల ఆగడాల దురాగతాలు కొంతకాలం తప్పవు. త్వరలో విశ్వేశ్వరుడయిన పరమశివుడు ఔరంగజేబు ఉద్ధతిని రూపుమాపటానికి తన అంశను భూమి

మీదకు పంపిస్తాడని తోస్తున్నది. మహారాష్ట్రలోని యోగి వర్యుడు సమర్థరామదాస్ దీనికి స్ఫూర్తికేంద్రంగా ఉదయిస్తాడు కాశీ రక్షకుడయిన కాలభైరవుడు కాలస్వరూపుడు. ఔరంగజేబు పాపాలకు తగిన ఫలాన్ని పొందక తప్పదు. ఎప్పుడు ఎవరిచేత ఏపని చేయించాలో దేవతలు నిర్ణయిస్తారు.

భక్తులు : మీ మాటల వల్ల కొంతవరకు సందేహాలు తీరినవి. కానీ, మీ వంటి మహాపురుషులు దుష్టులను శిక్షించవచ్చు కదా? అనిపిస్తుంది. ఈ దేశంలో మీ వంటి మహానుభావులున్నారు. క్రూరులను, దుష్టులను ఎందుకు దండించరు?

కీనారామ్ : ఈ ప్రశ్నకు ఇంతకు ముందే సమాధానం వచ్చింది ఏ సిద్ధుని శక్తులయినా పరిమితమయినవే. పరమేశ్వర సమానులయిన సిద్ధులకు ఈశ్వరేచ్ఛ, విధి విధానము, యుగధర్మములు అన్నీ అవగతమయిన వారు కనుక వారు కాలగమనంలో ఎక్కువ జోక్యం చేసుకోరు. గిర్నార్ కొండలలో దత్తాత్రేయస్వామి నాకీ రహస్యం తెలియచేశారు. ఆయన యొక్క దివ్యాంశ అయిన బాబా కాలూరాంను మీరు కాశీలో ఎప్పుడయినా చూసిఉండవచ్చు. మహాసిద్ధుడైన ఆ యోగీశ్వరుడు హరిశ్చంద్రఘాట్‌లో నాకు దర్శన మిచ్చి ఈ ఆశ్రమ నిర్మాణానికి దోహదం చేసి భవిష్యత్ స్వరూపాన్ని గురించి ఎన్నో విశేషాలు చెప్పాడు. అన్నీ ఆయన చెప్పిన ప్రకారమే జరుగుతున్నవి. మాతా హింగుళాదేవి ఆదేశం అదే. నేను చేయవలసిన వేవో హింగుళాదేవి నిర్దేశిస్తుంది. వానిని ఎందుకు శిక్షించరాదు? వీనిని ఎందుకు భక్షించరాదు? అన్న ప్రశ్నలకు జవాబులు ఉండవు. ఎవరి పరిమితులు వారి కుంటవని ఇదివరకే చెప్పాను. పరమేశ్వరి నాకు ఇచ్చిన అనుశాసనం ప్రకారం దైవభక్తిని పెంపొందిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల హృదయంలో జాగృతం చేస్తూ నా కర్తవ్యాన్ని నేను ముగించుకొని వెళ్ళిపోతాను.

భక్తులు : మహాత్మా! మీరు అంతమాట అనకండి మీరు శాశ్వతంగా ఉండాలి మావంటి సామాన్యులను అనుగ్రహిస్తూ ఉండాలి.

కీనారామ్ : మానవ శరీరాలకు శాశ్వతత్వం లేదు.

ఎప్పటికయినా శరీర పతనం తప్పదు. శివుని ఐదు ముఖములలో ఒకటయిన అఘోర ముఖము నుండి ఒక అద్భుతమయిన తాంత్రిక సంప్రదాయం వచ్చింది. సిద్ధేశ్వరుడైన దత్తాత్రేయుడు ఆ సంప్రదాయాన్ని ప్రవర్ధమానం చేశాడు. వేదములో అఘోర రుద్రుని మంత్రములు ఉన్నవి. ఆ మంత్రవిద్యలు, తంత్రగ్రంథాలలో వివిధరీతులుగా ఆవిష్కరింపబడినవి ఈ అఘోరసాధనలకు శ్మశానం కేంద్రము. అది ఒక అద్భుతమైన ప్రయోగశాల. శవముల మధ్య అస్థికల మధ్య, కపాలాసనము పైననో, శవముపైననో చితాభస్మధారియై తీవ్రసాధనలు చేయాలి. పంచ కపాలముల నుపయోగించాలి. నేను

బ్రహ్మచర్య దీక్షను ధరించాను కనుక, మైథునము తప్ప మిగిలిన మద్యము, మత్స్యము, మాంసము, ముద్రలు వీటిని సిద్ధికి ఉపకరణములుగా ఉపయోగించాను, వానిని స్వీకరించాను. నేను బ్రాహ్మణుడను కానుకనుక వీనిని స్వీకరించటానికి నాకు ఏ ఇబ్బందీ లేదు. కొందరు నన్ను ఈసడించారు. దురాచారుడనని అధిక్షేపించారు. మద్య మాంస భక్షణ దేవీ భక్తులకు తగదని నాతో వాదులాడారు. ఒక గ్రామంలో ఇటువంటి సంఘటన జరిగినపుడు వాదనలో నాకు కోపం వచ్చింది. నేను మద్యమాంస సమర్పణ వల్ల కాళీదేవి అనుగ్రహం పొందాను. మీకు చేతనయితే చెయ్యండి లేకపోతే మాట్లాడకుండా ఊరుకోండన్నాను. అవతలివారు కోపంతో అంతమహా సిద్ధుడివా? నీ శక్తి చూపిస్తే మేమూ నీ మార్గంలోకి వస్తాము అని సవాలు చేశారు. 'ఏమి చూపించమంటారు! అని అడిగాను'. ఇదిగో ఇక్కడ ఒక ఏనుగు చచ్చిపోయింది. దానిని బ్రతికిస్తే నీవు శక్తి కలవాడవని అంగీకరిస్తాము అన్నారువారు. కాళీదేవిని తలచుకొని ఏనుగుకు ప్రాణం పోశాను. అది ఘీంకరిస్తూ లేచి కూర్చున్నది. చూచిన వారిలో పందెమునకు నిలచిన వారు కొందరు నామార్గమునకు వచ్చారు. సిద్ధశక్తులు సాధించాలంటే ప్రాచీన కాలంలో మహర్షుల వలె ఆకులలములు తింటూ వందల సంవత్సరములు తపస్సు చేయటం ఇప్పుడు సాధ్యంకాదు, కనుక వేగంగా సిద్ధులు సాధించాలంటే ఇటువంటి పద్ధతులు కొన్ని అవలంబించక తప్పదని నా అభిప్రాయము, నా అనుభవము.

జగన్మాత కాళిక నా పద్ధతులు మెచ్చి నాకు కొన్ని సిద్ధశక్తులను ఇచ్చినది. నేను వాటిని తగిన విధంగా వినియోగించాననే భావిస్తాను. అయితే ఇటీవల జరుగుతున్న సంఘటనలు నాకు చాలా బాధను కలిగిస్తున్నవి. ఈ మహమ్మదీయుల దురాగతాలను నేను చూడలేకుండా ఉన్నాను. ఈ దేశ చరిత్ర గమనంలో నా పాత్ర ఎంతని నాలో అంతర్మధనం చెందుతున్నాను. అందుకే ఇంక ఎక్కువ కాలం భూమి మీద ఉండాలని అనిపించటం లేదు. త్వరలోనే ఈ ఆశ్రమంలో సమాధిని నిర్మించుకొని సజీవంగా దానిలోనికి ప్రవేశిస్తాను. నా తరువాత నాచే రక్షించబడి, చిరకాలంగా నాకు సేవచేస్తున్న యువకుని "బాబా బీజారామ్" అన్న పేరుతో నా తరువాతి పీఠాధిపతిగా నియమిస్తున్నాను. నా అనుగ్రహం వల్ల తాంత్రిక సాధనలు చేసి ఆకాశ గమనాది సిద్ధులను సాధించిన వాడా యువకుడు. ఈ పీఠ పరంపర ఇలా అవిచ్ఛన్నంగా రామ శబ్దంతో కొనసాగుతూ ఉంటుంది.

సజీవ సమాధిలోకి ప్రవేశించిన తరువాత భక్తులను అనుగ్రహిస్తూ కొంతకాలం ఉంటాను ఆ తరువాత మళ్ళీ జన్మ తీసుకొని పదకొండవ పీఠాధిపతిగా ఈ పీఠాన్ని అధిష్ఠిస్తాను.

భక్తులు నిశ్శబ్దంగా కీనారామ్ అఘోరీ వాక్కును విన్నారు. దాదాపు 200 సంవత్సరాలు జీవించి ఈ యోగి సజీవ సమాధిలోకి వెళ్ళిపోయినాడు. కాళీ భక్తులలో పేర్కొనదగిన గొప్ప సిద్ధపురుషుడితడు.

21. రామప్రసాద్

కలకత్తా ఉత్తరంగా సుమారు 50 కిలో మీటర్ల దూరంలో గంగానది ఒడ్డున కౌమార్ హాకీ అనే గ్రామం ఉన్నది. ఒకప్పుడది విజ్ఞాన కేంద్రంగా విలసిల్లేది. సుప్రఖ్యాతమైన నవద్వీపపండితులు కూడా ఇక్కడి విద్వాంసులతో వాదించాలంటే భయపడేవారు. క్రీ.శ.1723 సంవత్సరంలో రాంసేన్ అనే ఆయుర్వేద వైద్యునకు సిద్ధేశ్వరి అనే సౌశీల్యవతికి రామప్రసాద్ ఉదయించాడు. చిన్నతనంలోనే ఎంతో ప్రతిభచూపించి సంస్కృతం బాగా అధ్యయనంచేశాడు. పంచకావ్యాలలో మంచి పాండిత్యం వచ్చింది. తండ్రికి మాత్రం తనకుమారుడు మంచి ధనవంతుడు కావాలని అభిలాష. కోరిక మంచిదే, అయితే రాంప్రసాద్‌కు దానిమీద పెద్దగా అభిరుచి లేదు. సాహిత్యంలో కల్గిన పరిచయంవల్ల సంస్కృతం బెంగాలీ మొ॥ ఇతరభాషలు నేర్చుకోవాలన్న ఆసక్తి బాగా కలిగింది. కుమారుని అభిప్రాయాన్ని ఆసక్తిని తండ్రి కాదనలేదు. ఎందుకంటే అతని ఆయుర్వేద వైద్యంవల్ల కీర్తి సంపాదించగలిగాడే కాని పెద్దగా ధనసంపాదనలేదు. కుటుంబపోషణే అంతంతమాత్రంగా ఉన్నది ఆచిన్నగ్రామంలో. అంతకంటే ఆశించి ప్రయోజనం కూడా లేదు. కనుక తన కుమారుడు పార్శీ హిందీ భాషలు నేర్చుకుంటే ఏదైనా ఉద్యోగం దొరుకుతుందేమోనని ఆశపడి రాంప్రసాద్‌ను ప్రోత్సహించాడు. ఆనాడు బెంగాల్ రాష్ట్రం ముస్లింనవాబు పరిపాలనలో ఉన్నది. కనుక ఈ భాషలవల్ల ప్రభుత్వఉద్యోగం ఏదైనా లభించవచ్చు. రాంప్రసాద్ ఆ భాషల్లో కూడా బాగా కృషి చేశాడు.

ఒకసారి తండ్రితో అతడు కలకత్తా వెళ్ళినప్పుడు అక్కడి గ్రామదేవత కాళీదేవిని దర్శించాడు. ఆ దర్శనం అతనిలో సుప్తమైన ఆధ్యాత్మిక చైతన్యాన్ని మేల్కొల్పింది. ఎప్పడినుండో ఎన్నియుగాల నుండో తా నామె భక్తుడనన్న భావన అంతరాంతరాలలో స్ఫురించటం మొదలు పెట్టింది. అమె భీషణ రూపం అతనికి ఎంతమాత్రము భయంకలిగించ లేదు. ఆ భీషణరూపంలోనే అతిమానుష సౌందర్యాన్ని అతడు దర్శించాడు.

కాలాభ్రశ్యామలాంగీ విగళితచికురా ఖడ్గముండాభిరామా!
త్రాసత్రాణేష్టదాత్రీ కుణపగణశిరోమాలినీ దీర్ఘనేత్రా!
సంసారస్యైకసారా భవజననహరా భావితానైవభావైః
క్షంతవ్యోమేఽ పరాధః ప్రకటితవదనే కామరూపే కరాళే ॥

నల్లని మేఘం వలె ప్రకాశించే శరీరంతో, విరబోసిన జుట్టుతో, ఒకచేతిలోకత్తి, మరొక చేతిలో నరశిరస్సు వరదాభయముద్రలు, కపాలమాల, భాసిస్తున్న నిన్ను ఇన్నాళ్ళు చూడలేపోయాను. ఇప్పటికి దర్శనాన్ని ప్రసాదించి అనుగ్రహించావు. నిన్ను గుర్తించి చూడలేని జడుడను నేను, నన్ను క్షమించుమాతా! నా పైకరుణను ప్రసరించు

కపాలమున మద్యమ్మును కడు ప్రీతిని త్రావిత్రావి
కెంపెక్కిన కనులతోడ కైపెక్కిన తనువుతోడ
శ్మశానమున శవశయ్యను మహాకాళుపై మమతను
ఉపరిసురతమొనరించెడి యోగేశ్వరి ! కరుణింపుము ॥

నరుకబడిన చేతులమాల మేఖలగా, దిగంబరయై సంచరిస్తూ, మూడు లోకములను పరిపాలిస్తూ, శ్మశానంలో చితాతల్పమునందు మహాకాళునితో క్రీడించే ఓ నీల సుందరీ ! నీ మంత్రమును జపించినవాడు ఎంతటి జడుడైనా కవి ఔతాడు అని మహాకవి నిన్ను వర్ణించాడు. నిన్ను స్తోత్రం చేయాలనీ నీ గురించి పాటలు పాడుకోవాలనీ నా మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది. కరుణామయీ ! నన్ను అనుగ్రహించు. ఈ విధంగా రామప్రసాద్ కాళీదేవిని స్తుతించాడు.

స్వగ్రామానికి తిరిగి వచ్చింతరువాత కూడా అతని ధ్యాస కాళికాదేవిపైననే. ఎప్పుడూ ఆమె నామాన్నే స్మరిస్తూ దేనిని పట్టించుకోకుండా కాలంగడుపుతున్నాడు. ప్రాపంచిక విషయాలమీద ఆసక్తి పూర్తిగా పోయింది. ఇతని పద్ధతి చూస్తున్న తల్లిదండ్రులకు ఈ విధంగా ఉంటే వీడు బైరాగుల్లో కలసిపోతాడేమో, పిచ్చివానిలాగా మారిపోతాడేమో అన్న అనుమానం కలిగింది. పెండ్లి చేస్తే నలుగురితోపాటు బాధ్యతలు తెలిసి మామూలు మనిషి అవుతాడన్న ఆలోచనతో బలవంతంగా వప్పించి శర్వాణి అన్న అమ్మాయితో పెళ్ళి చేశారు. సంసార స్వీకారంవల్ల వివాహబంధం అతనిలో కొంత మార్పు తెచ్చింది. పెళ్ళి చేసుకున్న భార్యకు అన్యాయంచేయటం ఇష్టంలేదు. అందువల్ల సాంసారిక జీవితాన్ని ప్రారంభించాడు. బిడ్డలు పుట్టటం మొదలైంధి.

కాని కాళీదేవిని అతడు విడిచి పెట్టలేదు. కాళీదేవి కూడ అతనిని విడిచిపెట్టలేదు. నెమ్మదిగా సాధన ప్రపంచంలోకి వెళ్ళి పోతున్నాడు. ఆరోజుల్లో పల్లెటూళ్ళలో పెద్ద పనులేమీ ఉండేవి కావు. తండ్రి సంపాదనలో కుటుంబం గడుస్తున్నది. ఇలా ఉండగా ఒక గొప్ప తాంత్రికుడు ఆగమవాగీశు డన్న మంత్రవేత్త ఆ ఊరికి వచ్చాడు. ఊళ్ళోని అనేకులు ఆయన దగ్గరకు వెళ్ళటం కష్ట సుఖాలు చెప్పుకోవటం ఆయన వాటికి పరిష్కార సూచనలు చేయటం జరుగుతున్నది. రామప్రసాద్ కూడా ఒక రోజు వారి దర్శనానికి వెళ్ళాడు. ఇతనిని చూడగానే ఆ తాంత్రికుడు అతనిలోని దైవీభావ సంపత్తిని గమనించాడు చూడటానికి వచ్చిన వాళ్ళందరూ వెళ్ళిపోయిన తర్వాత ఇతనితో ప్రత్యేకంగా సంభాషించాడు వాగీశుడు.

వాగీశ : నాయనా! నీ పేరేమిటి? నీకేం కావాలి?

రామ్ : నా పేరు రామ ప్రసాద్. ఈ ఊళ్ళో ఆయుర్వేద వైద్యుడు రాంసేన్ గారి కుమారుడను. నాకు భౌతికమైన ఏ కోరికలూ లేవు. మహానుభావులైన మిమ్ము దర్శించి మీ ఆశీస్సులు తీసుకుందామని వచ్చాను.

వాగీశ : నిన్ను చూస్తేనే నలుగురివంటి వాడివి కాదని తెలుస్తున్నది. వైరాగ్య లక్షణములు దైవభక్తి, నీలో వికసిస్తున్నవి. తగిన సాధన చేస్తే ఆధ్యాత్మికరంగంలో ముందుకు వెళ్ళగలుగుతావు.

రామ్ : ఆ విషయంలో మీవంటి మహాత్ముల అనుగ్రహం కోసం ఎదురుచూస్తున్నాను. ఇష్టంలేకపోయినా సంసారబంధంలో ఇరుక్కున్నాను. జగన్మాత అయిన కాళీదేవి కరుణకోసం పరితపిస్తున్నాను. దానికి తగిన మార్గాన్ని మీరు నాకు దయతో ప్రసాదించండి.

వాగీశ : తప్పకుండా నీ కోరిక తీరుతుంది. నేనీ ఊరురావటం బహుశా నీకోసమే. నా ఉపాస్యదేవత కాళి. ఆమె సూచన వల్లనే నే నిక్కడకు వచ్చాను. నేను ఏ ప్రదేశానికి వెళ్ళినా మామూలు జనులు తమ కష్టాలు తీర్చమని వస్తుంటారు. వారిలో ఎవరైనా మంచి సాధకులయ్యేవారు ఉన్నారేమోనని పరిశీలిస్తుంటాను. వారిని ప్రోత్సహించి సాధనలో మెలుకువలు నేర్పి దేవతానుగ్రహం త్వరలో వచ్చేటట్లు చేస్తుంటాను. ఈసారి కాళీమాత సూచన వచ్చినప్పుడు ఏదో విశేషం ఉంటుందని అనుకున్నాను. ఇప్పుడు నిన్ను చూడగానే అవగతమైంది. నీకు కాళీమంత్రోపదేశం చేస్తాను. మంత్రసిద్ధి త్వరగా అయ్యే పద్ధతులు చెప్తాను. వానిలో నీకు కావలసిన మార్గాన్ని ఎన్నుకొని సాధన చేయవచ్చు.

రామ్ : మీరు ఏది సూచిస్తే ఆ పద్ధతిలోనే సాధన చేస్తాను. ఎంత తీవ్రమైనదైనా కఠిన నియమ సమన్వితమైనా అనుసరించి తీరుతాను.

వాగీశ : నీ మీద ఆ నమ్మకం నాకున్నది. కాళీ సాధన రెండు పద్ధతులు. ఒకటి దక్షిణాచారము మరొకటి వామచారము. శుచియై శాస్త్రోక్త విధానంలో షోడశోపచార పూజలు చేస్తూ ఆ యంత్రము, విగ్రహము ఉపయోగిస్తూ ఏకాంతంగా ఏ నదీతీరంలోనో, ఏ కొండ గుహలోనో, ఏ సిద్ధక్షేత్రంలోనో, ఏమహర్షి ఆశ్రమంలోనో, కొన్ని సంవత్సరాల పాటు మంత్రజపం చేయాలి.పాలు, పండ్లు మధుర పదార్థములు నైవేద్యం పెట్టాలి. ఇది నీకు సమ్మేతమా? నీకు వీలవుతుందా?

రామ్ : సాధన నియమాలను చెప్పినట్లుగా పాటించగలను, కాని తల్లిదండ్రులు వృద్ధులైనారు భార్యాబిడ్డలున్నారు. వారందరినీ వదిలి ఏ అరణ్యానికో పోవటం ఇష్టమే కాని ధర్మం కాదు. ధర్మవిరుద్ధమైన మార్గాన్ని అనుసరించటం శ్రేయోదాయకం కాదు కదా!

వాగీశ : ధైర్యంగా ఉన్న మాట చెప్పావు భారతంలో కౌశికుని వలెకాకుండా ఉచితమైన ఆలోచనా విధానంలో ఉన్నావు.

రామ్ : కౌశికుడెవరు ? అతని పోలిక తీసుకొని రావటంలో విశేషమేమిటి?

వాగీశ : రాంప్రసాద్! పూర్వకాలంలో కౌశికుడనే బ్రాహ్మణ యువకుడు తపస్సు వల్ల సిద్ధిని సాధించాలనే కోరికతో వృద్ధులైన తల్లిదండ్రులను వదలి దూరంగా ఉన్న ఒక అరణ్య ప్రదేశానికి వెళ్ళి ఒక చెట్టు క్రింద కూర్చొని నిరంతరం మంత్ర జపధ్యానములు చేసేవాడు. అక్కడికి దగ్గరలో ఉన్న గ్రామానికి వెళ్ళి భిక్షాటన చేసి జీవించటానికి అవసరమైన ఆహారం మాత్రం స్వీకరించి, మిగతా సమయమంతా ధ్యానంలోనే నడిపేవాడు. దానివల్ల నెమ్మదిగా కొంచెం కొంచెం శక్తి రావటం మొదలుపెట్టింది. ఒకరోజు మధ్యాహ్నం వేళ

అతడు జపంలో ఉండగా ఒక కాకి అతని మీద రెట్ట వేసింది. కోపం వచ్చి తలయెత్తి తీవ్రంగా చూశాడు. అది చచ్చి క్రింద పడింది. తనకు శక్తి వచ్చిందని గ్రహించాడు. సంతోషం కలిగింది. కొంచెం అహంకారము వచ్చింది. భిక్షాన్న వేళ గనుక గ్రామంలోకి వెళ్ళాడు.ఒక ఇంటి ముందు నిలుచొని భవతి భిక్షాందేహి అన్నాడు. ఇల్లాలు ఇతనిని చూచి ఉండండి ఇప్పుడే భిక్షతెస్తానని లోపలికిపోయింది. ఇంతలో బయటికి వెళ్ళిన ఆమె భర్త ఇంటిలోనికి వచ్చి ఆకలిగా ఉన్నది త్వరగా వడ్డించు అన్నాడు. ఆయన కాళ్ళు కడుక్కొని వచ్చి కూర్చోగానే భోజనం వడ్డించి ఆయన భుజించిన తరువాత భిక్ష తీసుకొని బైటకు వచ్చింది. అంతసేపూ కౌశికుడు వాకిట్లో నిలుచునే ఉన్నాడు. ఆమెను చూచి కోపంతో ఇంతసేపు నిలుచో బెట్టావు అతిథిని అన్న జ్ఞానం కూడా లేదా నీకు! అని ఆగ్రహంతో చూచాడు. దానికామె నవ్వుతూ అయ్యా! మీరు ధర్మవేత్తలు సతికి పతిసేవ ముఖ్యం కదా! దూరం నుండి వచ్చిన ఆకలి గొన్న భర్తకు అన్నం పెట్టి వచ్చాను. ఇంతలోనే మీకు కోపం వచ్చింది. మీ తీవ్రమైన చూపులకు మరణించటానికి నేను కాకిని కాదు. దయతో భిక్ష తీసుకోండి అన్నది. కౌశికునకు దిగ్భ్రాంతి కలిగింది. అమ్మా! ఎక్కడో అడవిలో జరిగిన సంఘటన నీ కెలా తెలిసింది? గృహిణిగా ఉన్న నీకు ఇంత దివ్య జ్ఞానం ఏలా కలిగింది? అనగా అందుకామె విప్రుడా! నీతో వివరంగా మాట్లాటానికి నాకు సమయం లేదు. ఈ ఊళ్ళో ధర్మ వ్యాధుడనే మాంస విక్రేత ఉన్నాడు, అతని దగ్గరకు వెళ్ళు నీ సందేహాలు తీరుస్తాడు అని చెప్పింది. అక్కడ నుండి కౌశికుడు సూటిగా ఆ మాంసపు దుకాణం దగ్గరకు వెళ్ళాడు. ధర్మ వ్యాధుడు అతనికి స్వాగతం చెప్పి, బ్రాహ్మణ గృహిణి పంపించగా వచ్చిన నీ సందేహాన్ని నేను తీరుస్తాను. ఇది తగిన స్థలం కాదు మా యింటికి వెళ్ళుదాం రండి అని తీసుకొని వెళ్ళి అతనిని కూర్చోబెట్టి ఇంటిలోని తల్లిదండ్రులకు స్వయంగా దగ్గర ఉండి భోజనం తినిపించి బ్రాహ్మణుని వద్దకు వచ్చాడు. కౌశికుడు అతనితో నాకు ఒకదాని కంటె ఒకటి ఈ రోజు సంఘటనలు ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నవి. అక్కడ గృహిణి ఇక్కడ నీవు మీరిద్దరూ ఏ తపస్సు చేసినట్లు కనబడదు. కానీ త్రైకాలిక విషయాలు తెలుసుకోగల దివ్యజ్ఞానం మీ వద్ద కనుపిస్తున్నది. నావల్ల పక్షి మరణించిన సంగతి గృహిణి చెప్పింది. ఆ ఇల్లాలు పంపిన సంగతి నీవు చెప్పావు. ఈ శక్తి ఏలా వచ్చింది? తపస్సు వల్ల తప్ప వేరే మార్గంలో దివ్యశక్తులు రావు కదా! ధర్మ వ్యాధుడు ఆ మాటలు విని ఆర్యా! మీరు చెప్పినది సత్యమే తపస్సు సిద్ధులకు మూలము. అయితే నీవనుకున్నట్లు అడవిలో ఏకాంతంగా మంత్రజపం చేయటం ఒక్కటే తపస్సు కాదు. పతిసేవ తపస్సు, మాతా పితృసేవ తపస్సు, ధర్మనిరతుడై కర్మనిరతితో ఏకాగ్రతగా శ్రద్ధతో సేవచేస్తే అది మహత్తర తపస్సు. నీవు పురాణములను అంతో ఇంతో చదివి ఉంటావు, విని ఉంటావు సూర్యుని గమనాన్ని ఆపిన సుమతి కథ వినలేదా! త్రిమూర్తులను పసి పాపలను చేసిన అనసూయ కథ తెలియదా? నిష్ఠతో చేసిన పని యేదైనా తపస్సే. ఆ ఇల్లాలు తపస్సు భర్తృసేవ, నా తపస్సు తల్లిదండ్రుల సేవ. నేను మాంస విక్రేతను నేను జంతువులను చంపను. చంపి తెచ్చిన వాటిని అమ్మటం మాత్రమే

చేస్తాను. తరతరాలుగా వస్తున్న వృత్తి గనుక దానిని వదలను. నాదివ్య జ్ఞానం వల్ల తెలిసిన విషయం చెపుతున్నాను విను. వృద్ధులైన తల్లిదండ్రులను గాలికి వదిలి సిద్ధుల మీది మోజుతో తపస్సు చేస్తున్నావు. ఇది ధర్మం కాదు. ముందు వెళ్ళి తలిదండ్రులను సేవించు. దానినే భగవత్సేవగా భావించు. నీకు పరమేశ్వరుని కరుణ లభిస్తుంది. నీవు కోరిన దివ్యశక్తులు కూడా వస్తవి అన్నాడు. కౌశికునకు తన కర్తవ్యం బోధపడింది. ధర్మ వ్యాధుడు చెప్పిన మార్గాన్ని అనుసరించి అతడు ఉత్తీర్ణుడైనాడు.

కనుక నాయనా! నీవు కూడా ఆ పద్ధతిలోనే వెళ్ళవచ్చు.వృద్ధులైన మాతాపితలను సేవిస్తూ, భార్య బిడ్డలను చూచుకుంటూ కాళీ సాధన చేయవచ్చు.

రామ్ : మహానుభావా! మీరు చెప్పింది నాకెంతో నచ్చింది.ఇప్పుడు సాధనలోని మెలుకువలను చెప్పండి.

వాగీశ : ఇంతకు ముందే రెండు మార్గాలను గురించి చెప్పాను. మంత్రము-పూజ-జపము-స్థలము- సమయము ఇవి ప్రధానములు. ఫలాన్ని గురించిన చర్చ అంత అవసరం లేదు. ఇంటి వ్యవహారాలు చూచుకుంటూ వీలైనంత సమయాన్ని సాధనకు వినియోగించాలి. తెల్లవారు ఝామున రాత్రి సమయము ఈ రెండూ శ్రేష్ఠమైన సమయాలు. ఎప్పుడు ఎంతకాలాన్ని గడిపినా ఎన్ని లక్షలు కోట్లు జపం చేసినా ఎప్పటికి మంత్ర సిద్ధికలుగుతుందో చెప్పటం కష్టం. ఇంకొకటి వామాచారమార్గం. దీనిలో పంచ మకారములు ఉపయోగించాలి. ఇవి మద్యము, మత్స్యము, మాంసము మైధునము, ముద్రలు. వీటిని వినియోగించటంలో సాధకుడు వేగముగా ఫలితాలు సాధించవచ్చు, లేదా ఆ వ్యసనాలకు బానిసయై పతనము కావచ్చు. ముఖ్యంగా మైధున సాధన, అనగా కామసాధన, నేనంగీకరించను. శీలభ్రష్టతయే కాక జగన్మాతను ప్రియురాలిగా భావించవలసి ఉంటుంది. దీనిని వీరమార్గము అంటారు. సహజయానమని కూడా దీనికి మరొక పేరు. మిగిలిన నాలుగు నీయిష్టము. మత్స్యము, మాంసము, ముద్ర మాంసముతో చేసిన భక్ష్యములు; వీనిని ఇష్టమైతే ఉపయోగించవచ్చును. అన్నిటికంటే ముఖ్యమైనది మద్యము. మంత్రజపంచేస్తూ అమ్మవారికి నివేదించిన మద్యము త్రాగి ధ్యానం చేస్తే ఏకాగ్రత తొందరగా కుదురుతుంది. ఆ సాధన వల్ల మద్యప్రియ అయిన కాళి త్వరగా దర్శనమిస్తుంది.

రామ్ : మత్స్యము, మాంసము, ముద్ర నాకిష్టంలేదు మా ఇంటిలో శాకాహారము తప్ప తదితరములు స్వీకరించే అలవాడులేదు. మీరు చెప్పిన ప్రకారం మైధున సాధన నేను అంగీకరించను. వృక్షజన్యమైన మద్యమును ఏకాగ్రత కోసం స్వీకరించటంలో దోషం లేదని భావిస్తున్నాను.

వాగీశ : ఇంతవరకు వామాచారము. కానీ ఇది కూడా కాళీ మంత్రసిద్ధిని ఇవ్వటానికి చాలదు. దీనికి కొన్ని శ్మశాన సాధనలు జోడించాలి. రాత్రివేళ చితాభస్మము ధరించి

శ్మశానంలో పూడ్చిపెట్టిన శవముపైగాని లేదా కపాలాసనముపైగాని కూర్చుండి జపం చేయాలి. ఏ మాత్రం భయపడినా మనసు చెదిరినా ఉన్మత్తుడు కావచ్చు లేక మరణించవచ్చు. ధైర్యము, నిర్భీకత, దీనికి ప్రధానము.

రామ్ : అమ్మ నాతో ఉంటే భయందేనికి? అయితే సమాజాన్ని చూచి భయపడవలసి వస్తుంది. ఇతడర్ధరాత్రులు శ్మశానంలో తిరుగుతున్నాడు, ప్రయోగాలు చేస్తాడు అని ప్రచారం జరుగుతుంది. ఎవరికి ఏ అపకారం జరిగినా నా వల్లనే అని గిట్టని వాళ్ళు అంటారు. కనుక దానికంటే అనువైన చోట ఒంటరిగా ఏ తోటలోనో కపాలాసనం సిద్ధం చేసుకొని చితాభస్మాన్ని తెచ్చుకొని రాత్రులు ధ్యానం చేయవచ్చు. దానికి ఇబ్బంది ఉండదు.

వాగీశ : అయితే ఒక పని చేయి. ఏకాంత ప్రదేశంలో **అశ్వత్థము (రావి) (బిల్వము) (మారేడు) అశోకము, వటము, (మఱ్ఱి) అమలకము (ఉసిరిక)** ఈ అయిదు వృక్షములు ఒక్క చోట ఉండే ఏర్పాటు చూడు. **దీనికి పంచవటి** అని పేరు. దగ్గరదగ్గరగా ఉన్న ఈ చెట్ల మధ్య పంచముండి ఆసనం తయారుచేయి. ముండమనగా తల, పాము, కప్ప, కుందేలు, నక్క, మూరెడు, వెడల్పు చతురస్రాకారంగా ఉన్న స్థలంలో ఈ నాల్గింటి పుఱ్ఱెలను మూరెడులోతున పాతి పెట్టు. మధ్యలో మానవ కపాలం ఉంచు. మట్టితో పూడ్చు. దీనిని పంచముండి లేదా పంచకపాలాసనం అంటారు. జంతువులవి ఒకవేళ దొరకక పోతే మిగిలిన నాలుగు కూడా మనుషుల పుఱ్ఱెలనే పెట్టవచ్చు. దీనిపై కూర్చొని వీలైనంత ఎక్కువ సేపు జపం చేయి. మంత్రసిద్ధి లభించటంలో సందేహం లేదు.

శ్లో॥ చిదాం అనన్యాం వివిధ ప్రభావాం
కాళీం కళామాలిని విశ్వవంద్యాం
కపాల ఖట్వాంగధరాం నృముండాం
మాలా విభూషాం మృగచర్మ శోభాం
సుశుష్క మాంసాంచ శవాసనస్థాం
విభీషణీం భీషయతీం సురారీన్
రక్త ప్రియాం మాంస మదావ ఘూర్ణాం
కాళీం శరణ్యాం శరణం వ్రజామి.

కాళీదేవి కపాలమును, మంచపుకోడును చేతులలో ధరించి యుండును వ్యాఘ్ర చర్మమును ధరించి మనుష్యుల తలల మాలతో శవం మీద నిల్చొని ఉంటుంది. రక్తపానం చేస్తూ, మాంసం తింటూ, మద్యం త్రాగుతూ, మహాప్రభావంతో విరాజిల్లే ఆ దేవత రాక్షసులను నాశనం చేస్తుంది. సర్వలోకములకు పూజ్యురాలైన ఆ మహాశక్తిని శరణువేడుతున్నాను. ఇలా భావిస్తూ అమ్మ రూపాన్ని ధ్యానించాలి.

రామ్ : ఈ రూపం నా కంటిముందు నిత్యము భావిస్తున్నాను. కలకత్తా కాళిని చూచిన తర్వాత ఆ ఆకారం నా మనస్సులో నిల్చిపోయింది. కాళిదాసమహాకవి రచించిన కర్పూరాది స్తోత్రంలోని శ్లోకాలలో ఆ దేవిని స్తుతిస్తూ ఉంటాను. ఇటీవల బెంగాలీలో ఆమెపై పాటలు కూడా వస్తున్నాయి.

వాగీశ : ఇంకేమి? సరియైన త్రోవలోనే ఉన్నావు. ఆ స్తోత్రంలో మొదటి దానిలో కాళీమంత్రం జపిస్తే జడుడు కూడా కవి ఔతాడని ఉన్నది కదా! ఆ కవి తార్ఘురి మొదలైనదన్నమాట. నీ కవిత వల్ల వంగభాషలో కాళీభక్తి పెరుగుతుందని భావిస్తున్నాను. ఇప్పుడొక పని చేద్దాం. నీవు నాతో పాటురా. కొన్ని గ్రామాలకు అవతల ఒక ఊరి బయట నిర్జన ప్రదేశంలో ఒక కాళీ మందిరం ఉన్నది. ఆమె నా ఇష్ట దేవత. అక్కడ చాలాకాలం నేను సాధన చేశాను. ఆ దేవత పేరు 'శ్యామకాళి'. నే నామెను 'శ్యామా' అని పిలుస్తాను. ఆమె సుకుమార సుందర మూర్తి. అక్కడ నీకు కాళీ మంత్రాన్ని ఉపదేశిస్తాను. మూడురాత్రులక్కడ జపం చేద్దువుగాని. నేను దగ్గర ఉంటాను.శ్యామకాళి అనుగ్రహం వల్ల నీలో భక్తి భరితమైన మధుర మంజుల కవిత ఉదయిస్తుంది. భవిష్యత్తులోని కాళీభక్తులందరూ నీ పాటలేపాడు కొంటారు అని నా కనిపిస్తున్నది. మూడురోజుల తర్వాత మళ్ళీ ఇక్కడకు వచ్చి ఇంతకు ముందు నేను చెప్పిన ప్రకారం సాధన చేద్దువుగాని.

రామ్ : మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను. మీ ఆశీస్సుల వల్ల కాళీదేవి నన్ను వేగంగా కరుణిస్తుందని ఆశపడుతున్నాను.

ఆ మర్నాడు బయలుదేరి వాగీశపండితుని ఉపాసనా స్థలానికి వెళ్ళి, శ్యామ కాళీ దర్శనం చేసుకొని, మంత్రోపదేశం స్వీకరించి, త్రిరాత్రోపవాస నియమంతో జపధ్యానములు చేశాడు. కాళీ విగ్రహం నుండి కాంతి తరంగాలు తనలోకి ప్రవేశిస్తున్న అనుభూతి కలిగింది. అప్రయత్నంగా అతనిలో నుండి కాళీస్తుతి వెలువడింది. ఆ పాట విని వాగీశ పండితుడు పులకించిపోయి దీవించాడు.

తర్వాత స్వగ్రామం చేరి తీవ్రంగా సాధన ప్రారంభించాడు. పంచవటిని ఏర్పరుచుకొని గురువుగారు చెప్పిన విధంగా పంచముండాసనాన్ని సిద్ధం చేసుకొని ఒక్క భోజనానికి మాత్రం ఇంటికి వస్తూ మిగతా సమయమంతా జపధ్యానములలో మునిగి పోయి ఉండేవాడు. ఈ విధంగా కొన్ని నెలలు గడచింది.ఇంతలో కుటుంబంలో కష్టాలు వచ్చినవి. రామప్రసాద్ తండ్రి ముసలితనం పెరిగి పండిన ఆకు చెట్టు నుండి రాలినట్లుగా మరణించాడు. సంసారభారం రామప్రసాద్ మీదపడింది. ఇన్నాళ్ళుగా తండ్రి వైద్యంలో అంతో ఇంతో సంపాదించి ఇల్లు గడుపుతున్నాడు. ఏదో బోటాబొటిగా గడవడమే తప్ప నిలవచేసిందిలేదు. వేరే ఆస్తులు లేవు. తాను కష్టపడి సంపాదించక పోతే కుటుంబం గడవదు. తన తండ్రి వైద్యాన్ని తాను నేర్చుకోలేదు.ఆ పల్లెటూళ్ళో సంపాదనకు అవకాశాలు కనపడలేదు. పెద్దల సలహా మీద కలకత్తా వెళ్ళి ఏదో చిన్న ఉద్యోగం సంపాదించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

అదృష్టాన్ని వెతుక్కుంటూ రామప్రసాద్ కలకత్తా నగరం చేరాడు. వెతుకగా దుర్గా చరణ్ మిత్రా అన్న ధనవంతుని గృహంలో చిన్న గుమస్తా ఉద్యోగం దొరికింది. జీతం నెలకు 30 రూపాయలు ఆరోజుల్లో ఆజీతంతో తనను తాను పోషించుకొని కుటుంబాన్ని కూడా సులభంగా పోషించవచ్చు. కాళీదేవి కరుణవల్ల తనకీ భాగ్యం దక్కిందని ఆమెకు

కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు చేస్తూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తున్నాడు. ఆస్తులు-వ్యాపారాలు వాటి లెక్కలు వ్రాయటానికి అతనికి తెల్ల కాగితాల పుస్తకాలు ఇవ్వబడినవి. ఒక వైపు లెక్కలు వ్రాస్తూనే కాళీకరుణ వల్ల ఉదయించిన కవిత్వాన్ని పాటలనూ పద్దు పుస్తకంలో వ్రాస్తుండేవాడు. ఆ పుస్తకమంతా పాటలతో నిండిపోయింది. తనలో తాను ఆ పాటలను సన్నగా పాడుకుంటుండేవాడు. తోటి గుమస్తాలు యజమానికి ఫిర్యాదుచేశారు. యజమాని రామప్రసాదుని పిలిపించి వ్యాపార లెక్కలపుస్తకాన్ని పరిశీలించాడు. దాని నిండా కాళీదేవిని గూర్చిన పాటలే. ఆ సంపన్నుడు కాళీ భక్తుడు ఆ పాటలు చదువుతుంటే అతని హృదయం పరవశించటం మొదలు పెట్టింది. రామప్రసాద్ వైపుచూచి ఇదేమిటియ్యా! ఈ పని ? అని అడిగాడు? రామప్రసాద్ తడబడుతూ భక్త్యావేశం వల్ల వస్తున్న కవిత్వాన్ని వేరే అవకాశం లేక ఈ పుస్తకంలో వ్రాశాను మన్నించండి అన్నాడు. ఆఫీసులో నీవు పాటలు కూడా పాడుతుంటావుట గదా ? అని ప్రశ్నించాడు యజమాని. నిజమేనండీ! ఏదో సన్నగా అప్పుడప్పుడు పాడుతూ ఉంటాను అన్నాడు రాంప్రసాద్. అయితే ఈ పుస్తకంలోని పాటలు పాడి నాకు వినిపించు అన్నాడు యజమాని. అమ్మ సంకీర్తనకు అవకాశం వస్తే చాలు అని పొంగి పోయిన రాంప్రసాద్ తన మధురమంజుల మనోహర కంఠంతో ఆ పాటలు గానం చేశాడు. వాటిని విన్న యజమాని శరీరం పులకించింది పరవశించిపోయినాడు. ఇతడు సామాన్యుడు కాదు మహాభక్తుడు. ఇతని గుమస్తా గిరిలో బంధించి ఉంచటం న్యాయం కాదు అని నిశ్చయించుకొని అతని సాధన గురించిన వివరాలను, కుటుంబ పరిస్థితులను విశదంగా అడిగి తెలుసుకున్నాడు. అప్పు డా సంపన్నుడు ఇలా అన్నాడు "రాంప్రసాద్, నీవు మహాభక్తుడవు. నీపాటలు వింటూ నన్నునేను మరచిపోయాను. మా కుల దేవత కాళి. ఆ జగన్మాత మీద నీవు రచించిన పాటలు వింటూ నేను ధన్యుడనైనాను. ఈనాటి నుండి నిన్నీ గమస్తా గిరి నుండి విముక్తుడ్ని చేస్తున్నాను. ఇకముందు నీవు ఈ కచేరి లెక్కలు వ్రాయనక్కరలేదు. నీవు హాయిగా నీ గ్రామం వెళ్లి నీ పంచవటిలో తపస్సు చేసుకో. ఇప్పుడు నీకిస్తున్న జీతం ముద్దర శుద్ధిగా నీ యింటికి పంపబడుతుంది. నీ వంటి ఉత్తమ భక్తుని కోసం ధనం దానం చేసే అవకాశం కలగటం నా అదృష్టంగా భావిస్తున్నాను. కాళీ దేవికి ఇక్కడ చేసే పండుగలలో పబ్బాలలో చేసే ఉత్సవాలలో పాల్గొనటానికి ఇక్కడ కప్పుడప్పుడు వస్తూ ఉండు నీ పాటలు నాకు వినిపిస్తూ ఉందువుగాని. నాకు వీలు కుదిరినప్పుడు నేనే నీ దగ్గరకు వచ్చి నీ గాన మాధుర్యాన్ని అనుభవిస్తాను. ఇవాళ నా పద్దుపుస్తకంలో నీవు వ్రాసిన పాటలోని రెండు చరణాలు నా మనస్సులో నిలిచి పోయినవి.

"ఇక్కడ జీతం తీసుకొని పనిచేస్తున్నా
కాళీమాతా, నీ కచ్చేరీలో జీతం లేకుండా పనిచేస్తున్నా
నీ పవిత్ర పాద ధూళి నాజీతం
అది శిరస్సునధరించే
హక్కు నాకెప్పుడూ ఉంది
నేను నీ కింకరుల కింకరుడను
సేవకుల సేవకుడను"

రామప్రసాద్! ఈ మాటలను నే నెప్పుడు గుర్తు పెట్టుకుంటాను. ఇక్కడ లెక్కల పుస్తకంలో నీవు వ్రాసిన పాటలు జాగ్రత్తగా నా దగ్గర అట్టిపెట్టుకుంటాను. మహాభక్తుడవైన నీ గుర్తుగా వీటిని నా పూజా మందిరంలో పెట్టుకుంటాను. ఇక నీవు నీ గ్రామం వెళ్ళి పూర్తి కాలాన్ని తపస్సుకు వినియోగించు. జగన్మాత తప్పకుండా నిన్ను అనుగ్రహిస్తుందని నా విశ్వాసం. ఈ పలుకులు వినగానే రామప్రసాద్ ఆశ్చర్యానందాలతో పులకించిపోయాడు. అతని హృదయంలో నుండి ఆశువుగా అప్పటికప్పుడే ఒక పాట వెలువడింది.

ఆ పాట విన్న గృహస్థు పరమానంద భరితుడై ఎన్నో కానుకలిచ్చి రామప్రసాద్‌ను పంపించాడు.

రామప్రసాద్ ఇప్పుడు స్వేచ్ఛా జీవి. పంచవటిలో ఎక్కువ కాలం గడుపుతూ తపస్సాధన అత్యంత తీవ్రంగా చేస్తున్నాడు. అక్కడికి ప్రక్కన ఆ తోట దగ్గరే గంగానది ప్రవహిస్తున్నది. గంగలో స్నానం చేస్తూ గంటలతరబడి నిలబడి సంకీర్తన చేసేవాడు అప్రయత్నంగా ఆశువుగా అతని హృదయకుహరం నుండి సహజ సరళ సరస రీతిలో వెలువడుతున్న గానలహరి గంగాతరంగాల వాద్య ధ్వనులతో కలిసి ప్రకృతినే పరవశింపచేసేది. అతని తీయని కంఠం ప్రజలను తండోపతండాలుగా ఆకర్షించేది. అతడు పాడుతుంటే జనం గుమికూడేవారు. గంగాతరంగాల మీద కాళిదేవి నడయాడుతున్నట్లే అతడు భావించేవాడు. ఆ భావం వాగ్రూపాన్ని ధరించేది. అది దివ్య నాదంగా మారి వాయుమండలశ్యామలకోమల కాంతులతో నిండిందా అన్నట్లుండేది. పడవల మీద ప్రయాణాలు చేసేవాళ్ళు వాటిని ఆపి ఇతని పాటలు వింటుండేవాళ్ళు.

ఒక రోజు నవద్వీప మహారాజు కృష్ణ చంద్రుడు సాలంకృతమైన నౌకలో ప్రయాణం చేస్తూ ఈపాటను విని పడవను ఆపించాడు. పాట పూర్తి అయింతర్వాత ఆ దివ్యగానానికి మోహితుడైన రాజావారు నౌకను ఆపించి ఒడ్డుకు వచ్చి రామప్రసాద్‌తో పరిచయం చేసుకున్నాడు. ఇంతటి ఈ మహాగాయకుడు ఈ చిన్న గ్రామంలో ఉండటం తగదని తన ఆస్థాన గాయకునిగా రమ్మని ఆహ్వానించాడు. రామప్రసాద్ గురువుగారైన ఆగమవాగీశ పండితుడు ఆ రాజు ఆస్థానంలోనే ఉన్నాడు. ఆయా విద్యలలో ప్రవీణులైన వ్యక్తులను తన కొలువులో పెట్టుకొని ఆ రాజు పోషించేవాడు. అయితే రామప్రసాద్ ఆ రాజు ఆహ్వానానికి లొంగిపోలేదు. రాజస్థానానికి వెళ్ళితే తన స్వాతంత్ర్యం పోతుందని అతనికి తెలుసు. అదికాక తన సాధన క్షేత్రాన్ని ఏకాంత తపస్సును వదులుకోవటానికి అతను సిద్ధంగాలేడు. ఉద్యోగము, ధనము, రాజభోగములు ఉన్నత పదవులు ఈ వ్యామోహంలో పడితే తన ఆశయం నెరవేర్చుకోలేనని గుర్తించిన రాంప్రసాద్ రాజుగారి ఆహ్వానాన్ని మృదువుగా తిరస్కరించాడు. అప్పటికి రాజు వేరేయేమీ మాట్లాడకపోయినా ఈ భక్తగాయకుని ఆయన విడిచి పెట్టలేదు. అప్పుడప్పుడు వచ్చి పాటలు వింటూ కొంతకాలం తర్వాత తన కొలువులో చేరకపోయినా అతని పాటలు వింటున్నందుకు కృతజ్ఞతగా భూదానం స్వీకరించమని పట్టుబట్టి

అంగీకరింపచేసి సుమారు 30 యకరాల పొలాన్ని కానుకగా సమర్పించాడు. ఈ విధంగా రామప్రసాద్ సాధనకు ఇబ్బంది కలుగకుండా సంసారం సుఖంగా జరగటానికి తగిన ఏర్పాట్లను కాళీదేవి చేసింది. "యోగక్షేమం వహామ్యహం" అని భగవద్గీతలో పలికిన విధంగా జగన్మాత తన భక్తుని బాధ్యతలను స్వీకరించింది.

మరొక పర్యాయం ఇటువంటి సంఘటనే ఇంకొకటి జరిగింది మూషిరాబాద్ నవాబు సురాజుద్దౌలా, ఈ మహానుభావుని పాటలు విని తన్మయుడైనాడు. అతడు కూడా రాంప్రసాద్‌ను తన ఆస్థానానికి రమ్మని ఆహ్వానించాడు. తన పరిస్థితిని తెలియచెప్పి తాను ప్రత్యేకంగా ఏ పదవిలోనూ ఉండలేనని చెప్పిన మీదట నవాబు కూడా అతని విషయం విని ఉండటం చేత ఒకసారైనా తన కొలువులోకి వచ్చి వెళ్ళమని ఆహ్వానించాడు. అంతవరకు ఇబ్బంది లేదు కనుక తర్వాతి కాలంలో వీలైనప్పుడు ఒకసారి వెళ్ళి కాళీభక్తి గానంతో అక్కడి సహృదయులను మైమరపించి వచ్చాడు.

నెమ్మదిగా నెమ్మదిగా భౌతిక వాసనలు పూర్తిగా తగ్గిపోయినవి. కాళీదేవి యొక్క పరిపూర్ణమైన అనుగ్రహం కోసం రాత్రింబవళ్ళు ఉన్మత్తుని వలె పరితపిస్తుండేవాడు. నిస్సారమైన ఈ ప్రపంచంలో నన్నెందుకింకా ఉంచావు తల్లీ! అని విలపించేవాడు.

ఈ తీవ్ర తపస్సు ఫలితంగా కరుణించి కాళీదేవి దర్శనమిచ్చింది. ఆ అనుభూతి కలిగిన తర్వాత అతని శరీరంలో చాల మార్పు వచ్చింది. ఇంతకు ముందులేని అద్భుత–కాంతితో అతని దేహం ప్రకాశిస్తూ ఉన్నది. ఎన్నో చిత్రచిత్రమైన అనుభవాలు పొందటం జరుగుతున్నది. అతని కుటీరం చుట్టూ ఉన్నతడికలలో కొంతభాగం పాడైపోతే దాన్ని బాగుచేయవలసి వచ్చింది. తన కూతురును పిలచి పాత తడికకు క్రొత్త తడిక కలిపి పురికోసతో దాన్ని కలిపి చుట్టుతున్నాడు. పురికొసను దబ్బనంకు గుచ్చి తడికకు ఒక ప్రక్క తానుండి రెండవ ప్రక్క నుండి కూతురుని పురికొస అందించమని చెప్పాడు. పని జరుగుతుండగా ఇంట్లో వాళ్ళ అమ్మ పిలిచింది కాబోలు ఆ అమ్మాయి ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్ళింది. కాళీ స్మరణంలో ఉన్న రాంప్రసాద్ ఆ మాటలను వినలేదు. అతడు అల్లటం పూర్తిఅయింది. ఇంతలో కూతురు వచ్చి నాన్నా! అమ్మ పిలిస్తే సగం పనిలో వెళ్ళాను. ఇటువైపు నుండి పురికొస మీకు ఎవరు అందించారు? మొత్తం అల్లటం పూర్తి అయిపోయిందే! అని ఆశ్చర్యంగా అడిగింది. ఆ అమ్మాయి పేరు జగదీశ్వరి ఇంతసేపూ పురికొస అందించింది నీవు కాదా! తల్లీ! అసలు జగదీశ్వరి వచ్చిందన్న మాట అయ్యో కళ్ళున్న కబోదినైనాను. జగన్మాతను గుర్తించలేకపోయినాను, అని వేదన చెందాడు.

ఒకరోజు గంగా స్నానం చేయటానికై వెళుతుంటే త్రోవలో మనోహర రూపం కల్గిన ఒక కాంత కనిపించింది. ఆ ఊరి గుడి గోడ దగ్గర ఆమె నిలుచొని మీ పాటలు విందామని చాలా దూరం నుండి వచ్చా ఒకసారి పాడండి అని కోరింది. రాంప్రసాద్ స్నానం చేయటానికి గంగ వద్దకు వెళ్ళుతున్నాను. కాసేపు వేచి ఉండు! వచ్చి పాడి వినిపిస్తాను అన్నాడు. స్నానం

పూర్తి చేసుకొని తిరిగి వచ్చి చూస్తే ఆమె ఎక్కడా కనపడలేదు. ఆమె కోసం ఆ ప్రదేశమంతా వెతికాడు. చివరకు ఆ దేవాలయపు గోడ మీద రెండు వాక్యాలు కనపడ్డాయి. నేను 'కాశీ అన్నపూర్ణను నీ పాట వినాలని వచ్చాను కుదరలేదు. నా క్షేత్రానికి వచ్చి సంకీర్తనం చేయి ' అని ఉన్నది. రాంప్రసాద్ చాల బాధపడ్డాడు. అయ్యో! అమ్మవారిని గుర్తించలేకపోయానే ఎంత అపచారం చేశాను అని దుఃఖిస్తూ వెంటనే కాశీకి బయలుదేరాడు. ముందుగా ప్రయాగ చేరగానే స్వప్నంలో అన్నపూర్ణాదేవి సాక్షాత్కరించి త్రివేణీ సంగమంలో పాడమని ఆజ్ఞాపించింది. మర్నాడు ఉదయం గంగా యమునా సరస్వతులు కలిసినచోట నీటిలో నిలుచుండి లలిత కోమల మధురగానం చేసి పరమేశ్వరి అనుగ్రహానికి పాత్రుడైనాడు.

మళ్ళీ ఇంటికి తిరిగివచ్చి పూర్తి కాలం సాధనలో నిమగ్నమైనాడు. ఒకనాటి రాత్రి ధ్యానంలో ఉండగా శవముపై కూర్చొని మంత్ర జపం చేయమని ఆదేశం వినిపించింది. పంచకపాలాసనం మీద కూర్చొండి చిరకాలంగా సాధన చేస్తూనే ఉన్నాడు. ఇప్పుడీ ఆదేశాన్ని పాటించాలంటే సామాజిక పరంగా చాల జాగ్రత్తలు అవసరం. కాని కావలసిన అవకాశాన్ని కాళీదేవే పంపించింది. త్వరలోనే గ్రామంలో ఒకరు మరణించటం ఆ యింటివారు స్మశానికి తీసుకొని వెళ్ళి దాన్ని పూడ్చిపెట్టి రావటం జరిగింది. రాత్రి మొదటి జాము దాటగానే రాంప్రసాద్ అక్కడకు వెళ్ళి ఆ శవం మీద కూర్చొని ఏకాగ్రతతో నిష్ఠతో మంత్రజపం చేశాడు. శ్మశాన వాసినియైన మహాకాళి సాక్షాత్కరించి తన భక్తుని అనుగ్రహించింది. ఈ విధంగా కాలం గడుస్తూ ఉంటే అతనిలో అవధూత లక్షణాలు పెరగటం మొదలైంది. ఒక్కోసారి కాళీదేవికి పూజ చేయవలసిన వస్తువులను తానే అలంకరించుకునేవాడు. మరొకసారి పిచ్చివానివలె చెత్తకుప్పపై పడుకుండేవాడు. ఒక్కోసారి బాహ్యస్మృతి కోల్పోయి గంటల తరబడి శవం లాగా ఉండేవాడు. ఇలా గడుస్తూ ఉండగా తనయందు అత్యంత భక్తి గౌరవాలను చూపించిన నవద్వీపరాజు కృష్ణ చంద్రుడు మరణశయ్యపై ఉండి రాంప్రసాద్‌కు కబురుచేశాడు. అతని మీద ఉన్న అభిమానం వల్ల అక్కడకు వెళ్ళి అతని ప్రక్కన కూర్చొని మధురంగా కాళీదేవి మీద పాటలు పాడాడు. జీవితంలో ప్రాణోత్క్రమణ సమయంలో ఈ అదృష్టం దక్కిందని కృష్ణ చంద్రుడు ఆనందపరవశుడై మరణించాడు తనయందు చిరకాలంగా అభిమానం చూపిస్తున్న ఆ మహారాజు మృతి రామప్రసాద్ మీద ఎంతో ప్రభావం చూపింది. భక్తితో పాటు వైరాగ్యభావన, జగత్తు యొక్క అశాశ్వతత్వము క్షణక్షణము అతనిలో మార్పుతెస్తున్నది. అంతకుముందు కేవలం భక్తిని గూర్చి మాత్రమే మాట్లాడేవాడు. ఇప్పుడు తాత్వికచింతన కూడా చేయసాగాడు భగవద్గీతను చదువుతూ మిత్రులతో చర్చించేవాడు. ఇలా కాలం గడుస్తూ ఉండగా దీపావళి పండుగ వచ్చింది. ఆ ప్రాంతంలో కాళీ ప్రతిమను మట్టితో చేసి దీపావళి నాడు పూజించి మరుసటి రోజు గంగలో నిమజ్జనం చేయటం ఆచారం. ఆ పూజకోసం ప్రతి సంవత్సరం రాంప్రసాద్ తన స్వంత చేతులలో ప్రతిమను తయారు చేసేవాడు. దీపావళి రోజంతా ముఖ్యంగా రాత్రిపూట కాళీపూజ

వైభవోపేతంగా చేసి పాటలు పాడి పరవశించిపోయేవాడు. ఈసారి ఎందుకో రాంప్రసాద్‌లో ఉదాసీనత చోటు చేసుకున్నది. లాంఛనంగా పనిచేశాడే కాని కూర్చున్న చోటనే బాహ్యస్మృతి కోల్పోయాడు. ఆ రాత్రంతా అలాగే ఉన్నాడు. పాటలు పాడటంలేదు. అతని కంఠం మూగపోయింది. మనస్సు నిశ్చలమైన సమాధి స్థితిలోకి వెళ్ళిపోయింది. ఇంచు మించు తెల్లవారుతుండగా స్పృహవచ్చింది. ఆ రాత్రి సమాధిస్థితిలో అతడి భౌతిక శరీరాన్ని పరిత్యజించవలసిన సమయం వచ్చిందని సందేశం ఇవ్వబడింది. రాంప్రసాద్ పూజా కలశాన్ని శిరస్సు మీద పెట్టుకొని ముందు నడుస్తూఉంటే భక్తులు కాళీ ప్రతిమను మోసుకొని వెనుక వస్తున్నారు. గొంతులోతు నీళ్ళలోకి వెళ్ళిన తర్వాత రామప్రసాద్ తన హంసగీతాన్ని పరమహంస గీతాన్ని పాడటం మొదలుపెట్టాడు. "కాళీమాతా, నా కాలం ముగిసింది. ఋణములన్నీ తీర్చేశాను. ఎవ్వరికీ బాకీలేను తల్లీ ! నన్నేం చేస్తావో! నీ ఇష్టం" అంటుండగానే అతని తలవాలిపోయింది. భక్తులంతా చుట్టూచేరి పట్టుకున్నారు. ఆ మహాభక్తుడు తన ఇష్టదేవతయైన కాళిలో కలిసి పోయినాడు.

భౌతికశరీరం పోయింది కాని అతని స్ఫూర్తి శరీరం శాశ్వతంగా ఉన్నది. కాళీభక్తులెవరైనా సరే బెంగాలులో రాంప్రసాద్ పాటలు పాడనివాడు లేడు. మహనీయుడైన రామకృష్ణపరమహంస రాంప్రసాద్ పాటలనే తన యావజ్జీవితమూ పాడుతూ ఉండేవాడు, ఆ పాటలు అమరములు శాశ్వతములు.

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తి తేషాం యశః కాయే జరా మరణజం భయం.

22. రామకృష్ణ పరమహంస

క్రీ.శ.1836 సంవత్సరం ఫిబ్రవరి 17వ తేదీ సూర్యోదయానికి 12 నిముషాలుండగా మన్మధనామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ విదియనాడు క్షుదీరాం, చంద్రాదేవి దంపతులకు ఈ దివ్యశిశువు జన్మించాడు. గ్రామం కామార్పుకూర్ జన్మ స్థలం (బెంగాల్ రాష్ట్రం). జాతకరీత్యా శంభుచంద్ర అని పేరుపెట్టినా తనకంతకు ముందు వచ్చిన స్వప్న సూచనను బట్టి 'గదాధర్' అని పిలవటానికి తండ్రి క్షుదీరాం నిశ్చయించుకొన్నాడు. అతడు కొద్దికాలం కింద 'గయ' క్షేత్రం దర్శించినపుడు క్షేత్రాధిపతి అయిన గదాధరుడు విష్ణుమూర్తి కలలో కనిపించి నీ భక్తికి ప్రసన్నునయినాను. నీకు కుమారునిగా అవతరిస్తాను అని ఇచ్చిన మాట మనసులో ఉండటం వల్ల 'గదాధర్' అన్న పేరే స్థిరపడిపోయింది. గదాధర్ పెరిగి పెద్దవాడవుతూ ఉండగా చిన్నతనం నుంచి ఉన్న అతనిలోని ఆధ్యాత్మిక చైతన్యం వికసింపసాగింది. ఒక రోజతడు పొలాల మధ్య వెడుతూ ఆకాశం వైపు చూస్తూ నల్లని కారుమబ్బులు, దానిక్రింద తెల్లని కొంగలు బారులు తీరిపోవటం చూచి పరవశించి ఏదో

తెలియని దివ్యానంద స్థితిలో స్పృహతప్పిపోయినాడు. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు మూర్ఛరోగమేమో నని భయపడ్డారు. ఇతని బాల్యంలోనే తండ్రి మరణించటం వల్ల తల్లి పెంపకంలో ఈ పిల్లవాడు పెరుగుతున్నాడు. ఇంటి పనులలో పూజా కలాపాల్లో తల్లికి అతడు తోడ్పడుతుండేవాడు. ఊరికి ఎవరయినా సాధువులు వస్తే వారికి సేవచేస్తూ వారి నుండి భజనలు, కీర్తనలు నేర్చుకొన్నాడు. తొమ్మిదవ సంవత్సరంలో ఉపనయనం జరిగింది. స్వయంగా పూజచేయటానికి అర్హతరావటం వల్ల కులదైవం అయిన రఘువీరుని పూజ చేసేవాడు. దానిలో పూర్తిగా నిమగ్నమై అప్పుడప్పుడు భావసమాధి స్థితి పొందేవాడు. ఆ సంవత్సరం శివరాత్రికి శివునికి సంబంధించిన వీధినాటకం ఇతని స్నేహితులు ప్రదర్శిస్తున్నారు. చివరి క్షణంలో శివుడి వేషం వేసే వ్యక్తి జ్వరం వచ్చి వేషం వేయలేకపోతే మిత్రులంతా ఇతనిని బలవంతం చేసి వేషం వేయించారు. ధ్యానంలో కూర్చొని ఉండటం, మధ్యలో ఒకటి రెండు చిన్న సంభాషణలు అతడు చేయవలసినవి. ఒంటినిండా విభూతి మెడలో రుద్రాక్షలు, తలమీద జటాజూటము ధరించి ధ్యానం చేస్తున్నట్లు అభినయించవలసిన గదాధర్ నిజంగానే ధ్యానస్థితికి వెళ్ళిపోయి మధ్యలో చెప్పవలసిన సంభాషణలు చెప్పలేదు. అతనికి ఏమయిందని తోటివారు కదలించి చూస్తే స్పృహ లేదు. దానితో వీధి నాటకం అర్థాంతరంగా ఆగిపోయింది. చాలా సేపటికి స్పృహ వచ్చింది. అప్పుడప్పుడు ఇటువంటి స్థితులు రావటం వల్ల మొదట్లో తల్లి, బంధువులు భయపడినా వాటివల్ల అతని ఆరోగ్యం చెడకపోవటం తన పనులన్నీ మామూలుగా చేసుకోవటము చూసి తరువాత భయపడటం మానివేశారు.

ఇంకొంచెం పెరిగి యౌవనంలో ప్రవేశిస్తున్న వయస్సులో గ్రామంలోని స్త్రీలకు పురాణకథలు చదివి వినిపించేవాడు. అప్పుడప్పుడు వీధి నాటకాలలోని పాత్రలను అభినయించేవాడు. అనేకుల కంఠాలను అనుకరించి హాస్యాన్ని పుట్టించేవాడు. విశేషించి స్త్రీల వేషభూషలు ధరించి వివిధ పాత్రలను అభినయించేవాడు. మహిళా స్నేహితురాళ్ళు కోరినపుడు బృందావనేశ్వరి రాధారాణి పాత్రను ఆమె సఖి లలితా దేవి పాత్రను ధరించేవాడు. చెపితే తప్ప అతనిని ఎవరూ గుర్తు పట్ట గలిగేవారు కాదు. కంఠ స్వరం కూడా అచ్చు ఆడవారి గొంతు పోలి ఉండెడిది. మామూలు చదువు మీద, పాఠశాల విద్యాభ్యాసం మీద అతనికి పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. పొట్టకూటి చదువుల కోసం జీవితాన్ని వ్యర్థం చేయకూడదని అతడిలో ఆలోచనలు మెదులుతూ ఉండేవి. కుటుంబాన్ని పోషిస్తున్న పెద్దన్న రాంకుమార్ ఆ గ్రామంలో తగిన ఆదాయం లేకపోవటం వల్ల అతడు మంచి సంస్కృత పండితుడు కావటం వల్ల కలకత్తా వెళ్ళి అక్కడ సంస్కృత పాఠశాల స్థాపించాడు. అక్కడ విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం వల్ల పాఠశాల నిర్వహణకు సహాయంగా ఉండటం కోసం తల్లి అనుమతితో తమ్ముడైన గదాధర్‌ను కలకత్తాకు తీసుకువెళ్లాడు. అప్పుడు గదాధర్‌కు 16 సం. నిండి 17వ ఏడు జరుగుతున్నది.

ఈ సంస్కృత పాఠశాల ఒకవైపు నడుస్తుండగా కలకత్తాలో ఒక గొప్ప సంఘటన ప్రారంభమయింది. రాజచంద్రదాస్ అనే ఒక జమిందారు భార్య రాణీరాసమణీ దేవి చిన్నవయసులో భర్త మరణించి అపార సంపదకు ఆమె అధికారిణి అయింది. భగవత్ భక్తి, సమర్థత, ధైర్య సాహసాలు, పెద్దల పట్ల సానుభూతి, దానధర్మాలు, పుణ్యకార్యాలు, వీటిద్వారా ఆమె కలకత్తాలో ప్రసిద్ధురాలయింది. తన అల్లుడయిన మధురమోహన్ కార్యదక్షుడు కావటం వల్ల అతడి సహకారం ఆమెకు ఎంతగానో ఉపకరించింది. ఒకరోజు కలలో ఆమెకు పరమేశ్వరి అయిన కాళీమాత కనిపించి గంగాతీరంలో తనకు ఆలయాన్ని నిర్మించమని ఆజ్ఞాపించింది. సంపన్నురాలు కనుక ఆలయ నిర్మాణం చేయటం ఆమెకు పెద్ద కష్టం కాలేదు. అయితే శాస్త్ర సంప్రదాయాన్ని అనుసరించి ఆమె స్వయంగా విగ్రహ ప్రతిష్ఠ చేయటం, నిత్య నైవేద్యాలు పెట్టటం కుదరదు కనుక దానికి ఏం చేయాలని పండితులను అభ్యర్థించింది. తాను కట్టిస్తున్న ఆలయానికి ప్రజలంతా రావాలని ఆమె కోరిక. ఆ కోరిక నెరవేరటానికి ప్రసిద్ధ పండితుడయిన రామకుమార్ ఒక మార్గం సూచించాడు. లాంఛనంగా దేవాలయాన్ని ఒక బ్రాహ్మణునకు సమర్పించి ప్రతిష్ఠ కలాపం బ్రాహ్మణుల చేత చేయించి, పూజారులుగా బ్రాహ్మణులను నియమించి, ఆలయంలో నిత్య పూజలు జరుపుతూ ఉండాలి. కార్య నిర్వహణ బాధ్యతను అధికార వ్యవహారాలను రాణీ రాసమణీ దేవి చూచుకొనవచ్చు. ఆమె దానికి అంగీకరించి ఆ విధంగానే ఆలయం నిర్మించి కాళీ దేవిని స్థాపింపచేసింది. ఆలయంలో ఒకవైపు రాధా గోవిందుల మందిరాన్ని కూడా నిర్మించారు. ప్రముఖ పండితుడైన రామ్‌కుమార్ చేసిన ఈ ఏర్పాటు వల్ల నగరంలోని బ్రాహ్మణ్యం ఈ ఆలయానికి తగిన స్థానాన్ని ఇవ్వటానికి అంగీకరించింది. ప్రజలంతా దేవాలయానికి రావటం పూజా కార్యక్రమాలలో పాల్గొనటం మొదలయింది. రామ్‌కుమార్ మీద ఏర్పడిన గౌరవంతో ఎక్కువ జీతం మీద దేవాలయ ప్రధాన పూజారిగా ఉండమని రాణీ రాసమణీదేవి అభ్యర్థించింది. సంస్కృత పాఠశాల అంత బాగా నడవటం లేదు కనుక ఈ పదవిని స్వీకరించడానికి, అతడి మనస్సు మొగ్గింది. కానీ స్వతంత్రమయిన, గౌరవప్రదమైన పాఠశాలను వదిలిపెట్టి మరొకరి క్రింద ఉద్యోగానికి చేరటం గదాధర్‌కు నచ్చలేదు. దానికోసం అప్పుడు ధర్మపత్ర మార్గం ఉపయోగించాడు. ఆ పద్ధతి ఏమిటంటే ఏదైనా ఒక విషయంలో సరియైన నిర్ణయానికి రాలేనపుడు, రెండు రకాల నిర్ణయాలను రెండు కాగితాలపై వ్రాసి ఒక కుండలో పెట్టాలి. దానిని బాగా కదిపించి ఒక పిల్లవానిని పిలిచి కుండలో నుండి ఒక కాగితాన్ని తీయమంటారు. దానిలో ఉన్న దానిని భగవంతుని నిర్ణయంగా స్వీకరిస్తారు. ఈ పద్ధతిలో ఒక కాగితం మీద సంస్కృత పాఠశాల నడుపుతుండాలి అని, రెండవ కాగితం మీద కాళిమందిర పూజారిగా చేరాలని వ్రాసి కుండలో పెట్టి ఒక చిన్న పిల్లవానిని పిలిచి కాగితం తీయించాడు. తీసిన కాగితం మీద పూజారిగా చేరాలి అన్న నిర్ణయముంది. దీనిని దైవ నిర్ణయంగా భావించి రామ్‌కుమార్ రాసమణీ దేవి ఆలయంలో పూజారిగా చేరాడు. ఎందుకైనా మంచిదని పూజా విధానమంతా తమ్ముడైన

గదాధర్‌కు కూడా నేర్పించాడు. గదాధర్ కమనీయ కంఠంతో స్తోత్రాలు చదువుతూ, పాటలు పాడుతుంటే జనం పరవశించి పోయేవారు. ఆనందాశ్రువులు రాలుస్తూ అతడు భావ సమాధి స్థితులలోకి వెడుతూంటే ప్రేక్షకులు ఆశ్చర్యపడుతుండే వారు. ఇతడు సామాన్యుడు కాదు. మహాభక్తుడన్న పేరు నెమ్మది నెమ్మదిగా వ్యాపిస్తున్నది. దేవాలయ నిర్వాహకుడయిన మధుర్‌బాబు – గదాధర్ పట్ల ప్రత్యేక ఇష్టాన్ని పెంచుకొన్నాడు. ఒకనాడు అతడు రామ్‌కుమార్‌తో "నీ తమ్ముడ్ని కూడా అర్చకునిగా చేర్చండి. మీకు సహాయంగా ఉంటాడు" అన్నాడు. తన తమ్ముడు కూడా ఈ రకంగా కొంత ఆదాయం వచ్చే స్థితికి రావటం రామ్‌కుమార్‌కు సంతోషం కల్గించింది. అన్నకు తోడుగా ఉంటూ గదాధర్ కాళీదేవిని అలంకరించి పూజించటం అన్న ఇక్కడ పూజ చేస్తూంటే తాను రాధా గోవిందుల మందిరంలో పూజలు చేయటం అలవాటు చేసుకొన్నాడు. అయితే కాళీమంత్ర దీక్ష లేకుండా కాళీపూజ చేయటానికి పరిపూర్ణమయిన అధికారం లేదని విన్న తరువాత తన అన్న గారికి పూర్వ పరిచయస్థుడు, శక్త్యుపాసకునిగా కలకత్తాలో అత్యంత గౌరవస్థానంలో ఉన్న మహామహుడు అయిన కేనారాంభట్టాచార్య దగ్గర గదాధర్ కాళీమంత్ర దీక్ష తీసుకొన్నాడు. మంత్రం స్వీకరించి ఉచ్చరిస్తూనే సమాధిస్థితిలోకి వెళ్ళిన శిష్యుని చూచి ఆ గురువు దిగ్భ్రాంతి చెంది; 'దేవీదర్శన ప్రాప్తిరస్తు' అని దీవించాడు. తరువాత కొద్ది కాలానికే రామ్‌కుమార్ మరణించాడు. ఇప్పుడు గదాధరుడు ప్రధాన పూజారి. ఆయన మేనల్లుడు 'హృదయ్' సహాయకునిగా ఉద్యోగంలో చేరాడు. అతడు రామకృష్ణునకు ఎంతోకాలం సేవ చేశాడు. పగలంతా దేవాలయంలో పూజలు చేస్తూ బాధ్యతలు నిర్వర్తిస్తూ రాత్రి ఆలయం మూసివేసిన తరువాత గదాధర్ దగ్గరఉన్న అడవిలోకి పోయేవాడు. అందరిలాగా ఆయనకు రాత్రిపూట నిద్రపట్టేది కాదు. ఆ అడవిలో పంచవటి ఏర్పాటు చేసుకొన్నాడు. అక్కడకు వెళ్ళి ఒక ఉసిరిక చెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేస్తూండేవాడు. అది అడివే కాక శ్మశానప్రాంతం కూడా. అందువలన అటువైపు ఎవరూ వెళ్ళేవారు కాదు. తన మేనమామ ఇలా అర్ధరాత్రులు, అపరాత్రులు వెళ్ళటం గమనించిన హృదయ్ రోజూ ఎందుకు వెడుతున్నావని ఆయనను అడిగాడు. "అడవిలో ఒక ఉసిరిక చెట్టు ఉన్నది. ఆ చెట్టు క్రింద ధ్యానం చేస్తే ఏ కోరికయినా తీరుతుందని శాస్త్రాలు చెపుతున్నవి. అందుకని అక్కడ ధ్యానం చేస్తున్నాను" అన్నాడు గదాధర్. ఇతడు నిజంగా ఏం చేస్తున్నాడో చూడాలని, తెలియకుండా వెనకాల వెళ్ళాడు హృదయ్. గదాధర్ అరణ్యంలోని పంచవటిలో ఆమలక వృక్షం క్రిందకు వెళ్ళి గుడ్డలన్నీ విప్పేశాడు. మెడలోని జందెం కూడా తీసేసి ప్రక్కన పెట్టాడు. అప్పుడాయన కూర్చొని ధ్యానం చేయటం చూచి మామకు పిచ్చిపట్టిందేమో అన్న అనుమానం కలిగింది. వెంటనే అక్కడకు వెళ్ళి గట్టిగా "ఇలా దిగంబరంగా కూర్చున్నావేమిటి? ఏం చేస్తున్నావు?" అని అడిగాడు. కళ్ళు తెరచి గదాధర్ "ధ్యానం ఇలానే చేయాలి. కులము, జాతి, మానావమానాలు, లజ్జా, భయాలు ఇవన్నీ మనిషికి బంధాలు. ఇవన్నీ వదిలేసి ఏకాగ్ర

చిత్తంతో పరమేశ్వరిని పిలవాలి. అందుకని ధ్యానం కోసం వీటన్నిటినీ తీసేశాను. తిరిగి వచ్చేటప్పుడు లోకం దృష్టిలో నేను బ్రాహ్మణుడను అర్చకుడను కనుక పై పటాటోపం అంతా వేసుకువస్తా" అన్నాడు. ఊహించని ఈ సమాధానానికి హృదయ్ దిగ్భ్రాంతి చెంది వెళ్ళిపోయాడు. ఈ విధంగా కొంతకాలం సాగింది.

అనంతర కాలంలో రామకృష్ణ నామం ఆయన ధరించటం అదే ఇవాళ ప్రచారంలో ఉండటం దృష్టిలో పెట్టుకొని గదాధర్ అన్న పేరు వదిలేసి రామకృష్ణులు అన్న పేరే ఉపయోగిద్దాము. ఈయన సాధన రోజురోజుకు తీవ్రమవుతూ పగలు కూడా దేవీపూజ, ధ్యానాలలో ఎక్కువ కాలం గడిపేవాడు. పూజ చేస్తూ శిలా ప్రతిమలా గంటల తరబడి ఉండిపోయేవాడు. కాళి దర్శనం కోసం వ్యాకుల హృదయంతో రామప్రసాద్ రచించిన పాటలు పాడుతూ, "తల్లీ! రామప్రసాదుకు దర్శనమిచ్చినట్లు నాకు ఎందుకు దర్శన మివ్వవు. ఈ ప్రపంచంలో నేనేమి కోరటం లేదు. నీ సాక్షాత్కారం కావాలి" అని విలపించేవాడు. ఒకరోజు అమ్మను చూడలేకపోతున్నానని వ్యథతో దుర్భరమైన బాధతో అమ్మ దర్శనం కలుగని ఈ బ్రతుకెందుకు! అని ఆమె చేతిలోని ఖడ్గాన్ని తీసుకొని తనను తాను నరుక్కొని అంతం చేసుకోవాలనుకున్నాడు. కత్తిని చేత్తో పట్టుకోగానే అనంత చైతన్య మయమైన జ్యోతిః పుంజం మధ్య కాళీ మాత సాక్షాత్కరించింది. రామకృష్ణులు స్పృహ తప్పిపోయినారు. స్మృతి వచ్చిన తరువాత ఆనంద బాష్పాలు రాలుస్తూ అమ్మా! అమ్మా! అని ఆర్తితో పిలిచాడు.

కాలక్రమాన జగన్మాతను నిరంతరం చూడకల్గిన దివ్య చక్షువు వికసించింది. అమ్మ గుడి ఎదురుగా, గోడమీద ధ్యానంలో ఉన్న భైరవుని విగ్రహం ఉండేది. ఆ విగ్రహాన్ని చూస్తూ "నేను కూడా ధ్యాన భైరవుని లాగా ఉండాలి" అని మనసుకు చెప్పుకొని కూర్చోగానే రామకృష్ణులకు శరీరం నిశ్చలమయ్యేది. కళ్ళు మూసుకోగానే మిణుగురు పురుగు వంటి వెలుగు బిందువు ఒకసారి, వెలుగుల దొంతరలు మరొకసారి, అలలు అలలుగా కాంతులు ఇంకొన్ని సార్లు కనిపించేవి. జగన్మాత కోసం తీవ్రమైన వేదన కలిగిన మరుక్షణమే ఆ తేజస్సు మధ్య అభయవరద హస్తాలతో కాళీదేవి కనిపించి మాట్లాడి బుజ్జగించేది. గుడిలో పూజ చేస్తున్నప్పుడు నైవేద్యాన్ని ఆమె స్వయంగా స్వీకరించేది. ఒకరోజు గుడిలోకి పిల్లి వస్తే ఆ పిల్లినే దేవిగా భావించి నైవేద్యం పెట్టాడు. ఇంకోసారి తానే ముందు తింటూండేవాడు. నీవు ముందు నన్ను తినమన్నావుగా మిగతాది నువు తిను అని విగ్రహం నోటి ముందర నైవేద్యం పెట్టేవాడు. ఇదంతా లోకం దృష్టికి అనాచారంగా ఉన్నది. దేవాలయం అధికారి అయిన మధురబాబుకు ఈ విషయాలు తెలిసినవి. ఆయన ఒకరోజు స్వయంగా వచ్చి రామకృష్ణుల పూజా విధానము జగన్మాతను బ్రతిమలాడటం, కన్నీళ్ళతో వేడుకోవటం ఇవన్నీ చూచాడు. జగన్మాత సాక్షాత్కారం పొందిన మహాభక్తుడని అతనికి నమ్మకం కలిగింది. "రామకృష్ణుని తమ ఇష్టం వచ్చినట్లు పూజ చేయనివ్వండి. ఆయనను ఎవరూ ఏమి అనవద్దు, అడ్డు చెప్పవద్దు" అని ఆజ్ఞాపత్రం పంపించాడు.

ఒకరోజు పూజా మందిరానికి రాణీ రాసమణీ దేవి వచ్చి కూర్చున్నది. అమ్మను గూర్చి మంచి పాట ఏదైనా పాడమని ఆమె కోరగా, రామకృష్ణుడు పరవశించి పాడుతున్నాడు. ఆమెమాత్రం తన ఆస్తిని గూర్చిన ఒక కోర్టు దావా గురించి ఆలోచిస్తున్నది. ఉన్నట్లుండి రామకృష్ణుడు పాట ఆపి ఇక్కడ కూడా ఆ పాడు ఆలోచనలేనా? అని ఆమె చెంపపై కొట్టాడు. ఆమె కోపించకుండా పశ్చాత్తాపం చెందింది. అయితే ఈ విషయం విన్న మధురబాబు రామకృష్ణునకు పిచ్చెక్కిందేమో అని అనుమానించి ప్రసిద్ధ వైద్యుని చేత చికిత్స చేయించాడు. అంతతో ఆగక లోకంలో ఉన్నప్పుడు సాధనలో ఉన్నప్పుడు ప్రవర్తన ఎలా ఉండాలో రామకృష్ణునకు సలహా ఇచ్చాడు. ఈ సలహాలు సంకల్పాలు మానవాతీతమైన దైవసంకల్పం ముందు నిలువవు అంటే, మధురబాబు, అంత దైవశక్తి నిజంగా ఈ కాలంలో ఉంటుందా? అన్నాడు. "ఎప్పుడూ ఉంటుంది" అన్నాడు రామకృష్ణుడు. అప్పుడు మధురబాబు ఒక పూల మొక్కను చూపి ఈ మొక్క తెల్లటిపూలు పూస్తుంది. ఎర్రటి పూలు పూయమంటే పూస్తుందా? అనగా అప్పుడు ఏమీ మాట్లాడలేదు రామకృష్ణుడు. మర్నాడు రామకృష్ణులు మధురబాబును తీసుకొని వెళ్ళి ఆ పూలకొమ్మకు ఒక పక్కన ఎర్రని పూవు గూడా పూచి ఉండటాన్ని చూపించాడు. ఆశ్చర్యపడిన మధురబాబు, రామకృష్ణుల మాటనంగీకరించక తప్పలేదు. రామకృష్ణుడు భక్తి తన్మయులవుతూ పూజా కార్యక్రమాలు సరిగా నిర్వర్తించ లేకపోవటం వల్ల ఆయన పినతండ్రి కుమారుడు వయసులో కొంచెం పెద్ద అయిన రామ్‌తారక్ అనే పండితుడు పూజారిగా నియమితుడయినాడు. రామకృష్ణుడతనిని 'హలధారి అని పిలిచేవాడు. కాళీపూజ చేయటానికి హలధారికి ఏ అభ్యంతరమూ లేదు. కానీ పర్వదినాలలో ఇచ్చే జంతుబలి అంటే అతడికి ఇష్టం ఉండేది కాదు. దక్షిణేశ్వర కాళికాలయంలో జరుగుతున్న బలి దినాలలో అతడు శ్రద్ధగా పూజ చేయలేకపోయేవాడు. అన్యమనస్కంగా అశ్రద్ధగా అతడు పూజ చేస్తూంటే కాళీదేవి భయంకర మూర్తితో కన్పించి "నీవీ విధంగా అశ్రద్ధగా పూజ చేస్తే నీ వంశాన్ని నాశనం చేస్తాను. నువ్వు నా పూజ చేయవద్దు" అని హెచ్చరించింది. దానిని తన భ్రాంతిగా భావించి ఆ హెచ్చరికను నిర్లక్ష్యం చేసి పూజలు కొనసాగించాడు. కొద్దికాలంలో అతని చిన్న కొడుకు అకాలమరణం చెందటంతో భయపడి కాళీపూజ మానుకొని రాధాగోవిందుల మందిరంలో పూజలు చేసేవాడు. కాళీ మందిరంలో హృదయ్ పూజలు చేసేవాడు. కాళీ పూజ మానుకున్నాడే కాని హలధారి తాంత్రిక సాధనలు మానుకోలేదు. వైష్ణవునిగా పరకీయా సాధన చేసేవాడు. అంటే రహస్యంగా పరస్త్రీలతో పంచమకారాలలో ఒకటయిన మైధున సాధన చేసేవాడని ప్రజలు గుసగుసలాడుకుండేవారు. అయితే ఎవరూ అతని జోలికి వెళ్ళేవారుకారు. అతనికి వాక్శుద్ధి ఉన్నదని భయం. ఒకనాడు రామకృష్ణుడు లోకులు ఇలా అనుకుంటున్న దానిని గూర్చి చెప్పి అన్నను హెచ్చరించాడు. దానిని వినగానే హలధారి కోపించి "ఓరీ గదాయి! నాకంటే చిన్నవాడివి నన్నే హెచ్చరిస్తావా? నెత్తురు కక్కుతావు!" అని శపించాడు. రామకృష్ణుడు ఎంత బ్రతిమాలినా వినలేదు. ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకే రామకృష్ణుని నోటినుండి నెత్తురు ధారగా పడటం మొదలు

పెట్టింది. ధోవతి అంచుతో అదిమి ఆపటానికి ప్రయత్నించినా ఆగలేదు. అందరూ ఆందోళన చెందారు. హలధారి కూడా బాధపడ్డాడు. రామకృష్ణుడు అన్నా! నీ శాపం ఎంత పని చేసిందో చూడు అన్నాడు. ఆ సమయంలో ఆలయంలో ఉన్న ఒక వృద్ధ సాధువు వచ్చి పరీక్షగా చూచి ఈ రక్త స్రావం మేలుకే జరిగింది. నీ విటీవల హఠయోగ సాధనలు చేస్తున్నావు గదా! దానివల్ల సుషుమ్నా ద్వారం తెరచుకొని నెత్తురు శిరస్సు వైపు ప్రవహిస్తున్నది. అదే జరిగితే స్పృహ పోయి మరణిస్తావు. బహుశా, నీవల్ల ఏదో లోక కల్యాణం జరుగవలసి ఉన్నది. అందుకే జగన్మాత ఈ రక్తస్రావం కలిగించి నిన్ను రక్షించింది. ఈ విధంగా శాపం కాస్తా కాళీదేవి సంకల్పం వల్ల వరంగా మారింది. హలధారి రామకృష్ణుని ఎప్పుడూ విమర్శించేవాడు. దిగంబరునిగా ఉండటం, జంధ్యం తీసివేయటం అంతేకాక అతడు పూజించే కాళీదేవి తామసదేవత అని జంతు బలులు తీసుకొనే క్రూరదేవత అని ఆమెను పూజించకూడదని తీవ్రంగా విమర్శిస్తుంటే అది వినలేక ఆలయంలోని కాళి దగ్గరకు వెళ్ళి ఆమెతో మొరపెట్టుకొన్నాడు. కాళీదేవి ప్రేమతో రామకృష్ణునకు త్రిగుణాతీతమైన తన తత్వాన్ని తెలియచేసింది. పూజాపీఠంపై కూర్చుని ఇష్టదేవతా పూజ చేసుకొంటున్న హలధారి దగ్గరకు వెళ్ళి చేత్తో తట్టి "కాళీదేవి త్రిగుణాతీత, శుద్ధసాత్విక స్వరూపిణి, ఆమే నాకు చెప్పింది తెలుసా!" అన్నాడు. రామకృష్ణుల స్పర్శతో హలధారికి విచిత్రమైన అనుభూతి కల్గింది. తన తమ్మునిలో ఆయన చైతన్యవంతమైన దైవ తేజస్సును చూచాడు. వెంటనే భక్తితో రామకృష్ణుని పాదాలకు చందనం రాసి పూలతో పూజించి కళ్ళకద్దుకొన్నాడు. ఇంతలో హృదయ్ అక్కడకు వచ్చి మామను దయ్యం పట్టింది పిచ్చివాడు అనేవాడివి, ఆయనకు పాదపూజ చేసావేమిటి?" అని అడిగాడు. హలధారి "అదే నాకూ అర్థం కావటం లేదు. వాడు నన్నేదో మాయ చేశాడు. చిత్రంగా అతనిలో దేవత కన్పించింది. అందుకే పూజ చేశాను. ఈ రహస్యం ఏమిటో నాకూ తెలియడం లేదు" అన్నాడు.

సాధన రెండు భాగాలు, జపము, ధ్యానము – తపస్సు. వీటిలో ఆయన ఉత్తీర్ణుడై సాధన ప్రారంభించిన మొదటి నాలుగు సంవత్సరాలలోనే కాళీ సాక్షాత్కారాన్ని పొందాడు. తరువాత చేసిన వివిధ సాధనలు దాని విస్తరణలు మాత్రమే రెండో భాగం. ఈ సమస్త ప్రపంచము, చరాచర జగత్తు అంతా భగవంతుని విభూతియే, అంతా బ్రహ్మ పదార్థమే, భిన్నమైనది లేదు, అన్న జ్ఞాన భావనను దృఢీకరించుకోవటానికి మరొక రకమైన సాధన కూడ అతడు చేశాడు. అన్నం బ్రహ్మమని ఉపనిషత్తులు చెప్తున్నవి. అన్నం బ్రహ్మమయినపుడు మలం మాత్రం బ్రహ్మమెందుకు కాదు? కనుక అన్నము వలెనే మలమును కూడా రుచి చూచాడు. మనుష్యులందరూ బ్రహ్మ పదార్థమయినపుడు ఒక కులము ఎక్కువ ఒక కులము తక్కువ అని ఎందుకనుకోవాలి? ఆ భేద భావన పోవటానికి ముష్టి వారి ఎంగిలి మెతుకులు తిన్నాడు. వారు తిన్న స్థలాన్ని శుభ్రం చేశాడు. పాకీవారి మరుగుదొడ్లలోని మలాన్ని స్వయంగా ఎత్తివేశాడు. ఈ విధంగా తపః సాధనతో పాటు జ్ఞాన సాధన కూడా చేసి అత్యంత పరిణతి చెందిన జీవునిగా తనను తాను రూపొందించుకొన్నాడు.

ఆ కాలంలో రామకృష్ణులు ధ్యానానికి కూర్చున్నప్పుడు త్రిశూలధారి అయిన ఒక యువ సన్యాసి కనిపించి ఎన్నో విషయాలు చెప్పటం మొదలుపెట్టాడు. అనంతర కాలంలో ఇతడు చెప్పిన విషయాలనే తోతాపురి, భైరవి బ్రాహ్మణి ఉపదేశించారు. ఒకసారి ఆయన శరీరం నుండి ఒక నల్లని పురుషుడు బయటకు వచ్చాడు. భోగమయుడు, కామక్రోధ మోహ వాసనాయుతుడైన పాప పురుషుడతడు. ఈ సన్యాసి ఆ పాప పురుషుని త్రిశూలంతో పొడిచి చంపేశాడు.

దక్షిణేశ్వర కాళీ మందిరంలో సరిగ్గా పూజలు చేయకపోవటం పిచ్చివానిలాగా తిరుగుతూ ఉండటం ఈ వార్తలు స్వగ్రామానికి చేరి తల్లీ చంద్రాదేవి ఎంతో ఆందోళన చెంది వెంటనే రమ్మని కబురు చేసింది. తల్లి కోసం వెంటనే రామకృష్ణుడు స్వగ్రామం, కామార్పుకూర్, వెళ్ళారు. గ్రామానికి వెళ్ళిన తరువాత మామూలుగానే ప్రవర్తిస్తున్నా అప్పుడప్పుడు జగన్మాత కోసం విలపిస్తూ అమ్మా! అమ్మా! అంటూ స్పృహ కోల్పోయేవాడు. అప్పుడు మాత్రం ఆయన ప్రవర్తన పిచ్చివాని వలే ఉండేది. తల్లి చంద్రాదేవి ఆందోళన చెంది ఆ గ్రామ పెద్దలతో చెపితే, వారు భూతమాంత్రికులను పిలిపించారు. ఒకరోజు రాత్రి ఆ మంత్రవేత్తలు 'చండ' అన్న క్షుద్రశక్తిని ఆవాహన చేశారు. ఒక మనిషిలోకి ఆ శక్తి ప్రవేశించి వీరిచ్చిన పూజలను, బలులను స్వీకరించి వాళ్ళడిగిన దానికి సమాధానంగా "ఈ గదాధరుని ఏ భూతమూ పూనలేదు. అతనికి ఏ గాలీ సోకలేదు అని చెప్పి ఇతని వైపు తిరిగి "గదాయ్! నీవు సాధువు కావాలనుకుంటున్నావు కదా! కామ ప్రకోపాన్ని కలిగించే వక్కలు ఎందుకు తింటున్నావు?" అన్నది. ఆ మాటలు విన్న తరువాత రామకృష్ణుడు వక్కలు తినటం మానివేశాడు. ఇతనికి ఏ దయ్యమూ పట్టలేదు. మామూలు మనిషే అని రూఢి పడిన తరువాత 23 ఏండ్ల వయస్సు వచ్చింది కనుక, పెళ్ళి చేస్తే బాగుండునని తల్లీ బంధువులు అనుకొన్నారు. పెద్దలు అడగగానే రామకృష్ణులు అంగీకరించారు. అయితే ఎంత వెదికినా సరి అయిన సంబంధం దొరకలేదు. ఎక్కడన్నా దొరికినా తగినంత కన్యాశుల్కం ఇచ్చే శక్తి వీరికి లేదు. వాళ్ళ ఆందోళనను చూచి రామకృష్ణులు 'జయరామ్‌బాటి'లో రామచంద్ర ముఖోపాధ్యాయ కూతురు ఉన్నది. ఆమె నాకోసమే పుట్టింది. వెళ్ళి మాట్లాడండి" అన్నారు. పెద్దలు వెళ్ళి మాట్లాడి వివాహం నిశ్చయం చేశారు. త్వరలోనే వివాహం జరిగింది. అమ్మాయి వయస్సు అయిదు సంవత్సరాలు, రామకృష్ణుల వయస్సు 24 సం॥లు. పెళ్ళయిన తరువాత రామకృష్ణుడు కలకత్తాకు వచ్చేశాడు. చిన్నపిల్ల అయిన భార్యను పుట్టింటి వారు తీసుకువెళ్ళారు. అక్కడకు వెళ్ళగానే స్వగ్రామము తల్లి, భార్య, లౌకిక వ్యవహారాలు అన్నీ ఆయన మనస్సు నుండి అదృశ్యమై అవిచ్ఛిన్న జపధ్యానములో మునిగి పోయినాడు. దానివల్ల వళ్ళు అంతా మంటలు, నిద్దర పట్టకపోవటం మొదలైనది. మధురబాబు నిర్దేశం వల్ల సుప్రసిద్ధ వైద్యులు రకరకాల మందులు ఇచ్చారు. వాటివల్ల పెద్దగా ప్రయోజనం కలుగలేదు. ఒక తూర్పు బెంగాలు వైద్యుడు మాత్రం ఇది మందులకు లొంగే వ్యాధి కాదు. ఇది దివ్యోన్మాదము అని చెప్పాడు.

రామకృష్ణుని అనారోగ్యం తల్లి అయిన చంద్రాదేవికి తెలిసింది. ఆమె ఆందోళన చెంది తమ ఊరిలోని పురాతన శివాలయంలో జాగృత దేవుని ముందు ప్రాయోపవేశం చేపట్టింది. ఆ విధంగా దీక్ష ధరించి ఉండగా ముకుందపూర్ శివాలయంలో ఆమరణ నిరాహార దీక్ష పూనమని దైవాదేశం వచ్చింది. అక్కడ రెండు మూడు రోజులు గడచిన తరువాత ఆమెకో దివ్య స్వప్నం వచ్చింది. ఆ కలలో శివుడు దర్శన మిచ్చి "భయపడవద్దు, నీ కుమారుడు పిచ్చివాడు కాదు. దైవావేశం వల్ల వచ్చిన అనుభూతులివి" అని చెప్పి అదృశ్యమయినాడు. దానితో ఆమె శాంతించి ఇంటికి వచ్చింది.

ఇక్కడ రామకృష్ణుడు నిరంతరం దివ్యానుభవాలతో అహోరాత్రాలలో ఎక్కువ భాగం కాళీ దర్శనాన్ని పొందుతూ ఉండేవాడు. "ఇది ఏదైనా వ్యాధేమో! ఈ శరీరం పోతే పోనీ, నన్ను ఎట్టి పరిస్థితులలోను విడవవద్దు తల్లీ" అని ప్రార్థించగానే జగన్మాత దర్శనమిచ్చేది. దాంతో ఆయన ఉపశమనం పొందుతూ ఉండేవాడు. జగన్మాత సంకల్పం వల్ల జమిందారు మధురబాబుకు శివుడు, కాళీమాత రామకృష్ణునిలో దర్శనమిచ్చారు. దాని ప్రభావం వల్ల ఆయన రామకృష్ణులను సాక్షాత్ భగవంతునిగానే భావించటం మొదలుపెట్టి ఆయన జీవితమంతా సేవ చేశాడు.

1855లో రాసమణీ దేవి కాళికాలయం ప్రతిష్ఠ చేయించింది. ఆతరువాత కొద్ది కాలానికే రామకృష్ణుడు అక్కడకు చేరటం ఆయన సాధన మొదలైనవి జరిగినవి. 1859లో ఆయన వివాహం 1861లో రాణీ రాసమణి మరణించింది. ఆమె అల్లుడు మధురబాబు అంతకు ముందు కూడ ఆమె ఆస్తులను నిర్వహించేవాడు. ఇప్పుడు సర్వాధికారి అయినాడు. జరిగిన 4, 5 సంవత్సరాలలో రామకృష్ణుడు కాళీసిద్ధిని పొంది, ఆమె నిత్య దర్శనానుగ్రహానికి పాత్రుడై ఉన్నాడు. ఈ స్థితిలో రాణీ రాసమణి మరణించిన కొద్దికాలానికి దక్షిణేశ్వరఆలయానికి పడమర గంగాతీరాన ఉన్న తోటలో రామకృష్ణులు కాళీపూజకు పూలు సేకరిస్తున్నారు. అక్కడ గంగ ఒడ్డున పెద్ద వకుళవృక్షం (పొగడ చెట్టు) ఉన్నచోట బకుల్ ఘాట్‌లో ఒక పడవ ఆగింది. దానిలో నుండి అద్భుత సౌందర్యవతి కాషాయ వస్త్రధారిణి అయిన ఒక సన్యాసిని దిగి, దేవాలయ దక్షిణద్వార మంటపం వైపు వస్తున్నారు. ఆమె వయస్సు దాదాపు 40 ఏండ్లు ఉండవచ్చు. అయినా కోమలంగా సుకుమారంగా 20 ఏండ్ల కన్యలాగా ప్రకాశిస్తున్నది. ఆమెను చూడగానే ఏదో ఆకర్షణ కలిగి ఆమెతో మాట్లాడాలని అనిపించింది. వెంటనే తన గదికి వెళ్ళిపోయి హృదయ్‌ని పిలిచి ఆ సన్యాసినిని తీసుకురమ్మన్నాడు. "ఆమె ఎవరో మనకు తెలియదు కదా! పిలిస్తే ఆమె ఎందుకు వస్తుంది? అన్నాడు అతడు. 'నా పేరు చెప్పు, తప్పక వస్తుంది' అన్నారు రామకృష్ణులు. అపరిచితస్త్రీలతో మాట్లాడాలన్న ఆయన కోరికకు హృదయ్ ఆశ్చర్యపడినా, ఆయన ఆదేశం పాటించాలి కనుక ఆమె దగ్గరకు వెళ్ళి "మా మామ దైవభక్తుడు, మిమ్మల్ని చూడాలని అనుకుంటున్నారు వస్తారాః" అని అడిగాడు. ఆమె వెంటనే అంగీకరించి రామకృష్ణుని గదిలోకి వచ్చింది. ఆమె పేరు 'యోగేశ్వరి'.

తాంత్రిక సాధనలు చేసే సన్యాసిని కనుక ఆమె భైరవి అయింది. బ్రాహ్మణ స్త్రీ కనుక 'భైరవీ బ్రాహ్మణి' గా పిలువబడుతున్నది.

రామకృష్ణుని చూడగానే ఆశ్చర్యానందాలతో కంటి వెంట కన్నీరు వచ్చి "నాయనా! నీవు ఇక్కడ ఉన్నావా! గంగా తీరంలో కొంతకాలం నుంచి నీకోసం వెతుకుతున్నాను. ఇన్నాళ్ళకు కనిపించావు" అన్నది. రామకృష్ణుడు "నాకోసం వెదకటమేమిటి? నే నెవరో నీ కెలా తెలుసు?" అని అడిగారు. ఆమె "నేను చిరకాలం కాళీ సాధనలు చేశాను. ఆమె భక్తురాలిని. ఆమె అనుగ్రహం నాలో అనేక విధాల నెలకొన్నది. కొద్దికాలం క్రింద తన సాధనలు చేసే ముగ్గురు వ్యక్తులకు సహకరించి వారికి మంత్రసిద్ధిని కలిగించవలసినదిగా జగన్మాత నన్ను ఆదేశించింది. అందులో ఇద్దరిని గుర్తించి వారికి సహాయం చేశాను. కాళీదేవి అనుగ్రహం వల్ల వారు తాము కోరిన సిద్ధశక్తులను పొందారు. మూడవ వాడివి నీవు. మిగిలిన ఇద్దరూ తూర్పు బెంగాలులో ఉన్నారు. ఇప్పుడు నీ సాధనల వివరాలు చెప్పు. తరువాత ఏం చేయాలన్నది నేను నిర్ణయిస్తాను అన్నది. రామకృష్ణుడు తన కప్పటివరకు కలిగిన దివ్యానుభవాలన్నీ చెప్పాడు. చాలామంది తనను పిచ్చివాడు అంటున్నారని, ఇదే భావనలో స్పృహ కోల్పోతే మూర్ఛ రోగం అంటున్నారని నిద్రపోక పోవటం వళ్ళంతా మంటలు ఎత్తడం ఇవన్నీ వివిధ రోగ లక్షణాలుగా వైద్యులు భావిస్తున్నారని చెప్పాడు. ఆ మాటలు వింటూ భైరవీ బ్రాహ్మణి పుత్రవాత్సల్యంతో దయతో ఆయనను ఊరడించి ఇలా అన్నది. నాయనా ! నీది దివ్యోన్మాదము. నీది మహాభావస్థితి. బృందావనంలో శ్రీరాధ ఈ స్థితిని పొందింది. కృష్ణ చైతన్య మహాప్రభువు ఇటువంటి అవస్థనే పొందాడు. భక్తి మార్గాలతో దానికి సంబంధించిన వాఙ్మయంతో ఆ అనుభూతులు చెందిన మహనీయుల జీవిత చరిత్రలతో పరిచయమున్న వారికి తప్ప ఇతరులకు అర్థం కాదు. శాస్త్ర వైదుష్యము కాళీమంత్రసిద్ధి కలిగిన నేను నీ అనుభూతి భ్రమకాదని సత్యమని నిరూపిస్తాను.

ఈ విధంగా ఆత్మీయంగా వారి సంభాషణ మొదలయింది. దేవాలయంలో ఆమెకు వసతి ఏర్పరిచారు. సన్యాసులు, యోగులు ఎందరు వచ్చినా అందరికీ వసతి, భోజన సౌకర్యాలను అక్కడి అధికారులు మధురబాబు ఆదేశం వల్ల చేస్తుంటారు. ఆమె తన వంట తాను చేసుకొని ఇష్ట దేవతకు సమర్పించి స్వీకరించేది. ఒక్కొక్కసారి ఆ నైవేద్యాన్ని రామకృష్ణుడు ముందు తింటూండేవాడు. సగం తిన్న తరువాత ఆమె కండ్లు తెరచి చూడగా అమ్మా ! పొరపాటు చేశాను ఎందుకిలా చేస్తున్నానో నాకే తెలియటం లేదు. అనగా ఆమె ఓదార్చి "నాయనా! నీవేమి తప్పు చేయలేదు. నీలోని దేవత ఈ పని చేసింది" అని ఆయన ఉచ్ఛిష్టాన్ని తాను ప్రసాదంగా తీసుకొంది. ఈ విధంగా దాదాపు ఏడు రోజులు కాలగమనం తెలియకుండా ఆలయంలోనూ పంచవటి దగ్గర సన్నిహితంగా కూర్చొని మాట్లాడుకొంటుండేవారు. వయసులో ఉన్న ఒక స్త్రీ పురుషుడు సన్నిహితంగా ఉంటే లోకం అపార్థం చేసుకొంటుంది. పురుషుల కంటే స్త్రీలకు దీనివల్ల వచ్చే ప్రమాదం ఎక్కువ.

అందువల్ల ఆమెకు అపకీర్తి రాకూడదన్న ఆదుర్దాతో రామకృష్ణుడు ఆమెతోటి ఈ విషయం చర్చించి ఆమెకు వేరే నివాసం కొంతదూరంగా ఏర్పాటు చేసి ప్రతిరోజు ఇక్కడకు వచ్చి రామకృష్ణుని చూచి మాట్లాడి వెళ్ళాలి అన్న ఆలోచనకు వచ్చారు. దాని ప్రకారం దక్షిణేశ్వర గ్రామంలోనే ఆలయానికి ఉత్తరంగా గంగా తీరంలో ఉన్న దేవమండలి ఘాట్ వద్ద ఒక గది ఆమెకు ఏర్పాటు అయింది. అక్కడి గృహస్థురాలొకరు వారి గది ఒకటి ఆమెకు ఇచ్చి దానిలోకి కావలసిన సామాగ్రి అంతా సమకూర్చారు. పండితురాలయిన ఆమె చైతన్యుని అనుభవాలకు, రామకృష్ణుని అనుభవాలకు పోలిక ఉన్నట్లుగా గమనించింది. దివ్య భావనతో పరవశత్వం పొందటం, దేవీ విరహంతో దుర్భరమైన మంటలు పుట్టటం చూచి ఇటువంటి లక్షణాలు వచ్చినపుడు, చైతన్యునకు చందనం రాసి పూలమాలలతో అలంకరిస్తే ఆ బాధ తగ్గేది. ఆమె రామకృష్ణునికి కూడా ఈ విధంగా చేయించింది. రామకృష్ణులకు బాధ తగ్గేది. చైతన్యుడే ఈయనలో అవతరించాడా! అని ఆమె భావించేది. ఒకరోజు పంచవటి దగ్గర హృదయ్‌తో కలిసి ఉండగా మధురబాబు వచ్చాడు. ఆయనతో రామకృష్ణుడు భైరవీ బ్రాహ్మణి గొప్ప విద్వాంసురాలు. ఆమె దగ్గర శాస్త్రగ్రంథాలు చాలా ఉన్నవి. ఆమె నన్ను అవతార పురుషుడంటున్నది అన్నాడు. మధురబాబు ఆ మాటలు విని నవ్వి "బాబా! ఆమె ఏమైనా అనవచ్చు, అనుకోవచ్చు, కానీ అవతారాలు పదే కదా! కృష్ణావతారం పూర్తయింది. రాబోయే కల్కి అవతారం ఎప్పుడో కాని రాదు కదా! కనుక ఆమె చెప్పేది సత్యం ఎలా అవుతుంది? కాని ఒకటి మాత్రం సత్యం–కాళీమాత అనుగ్రహం నీకు లభించింది" అన్నాడు. ఇంతలో భైరవీ బ్రాహ్మణి అక్కడకు వచ్చింది. తమ సంభాషణల వివరములను రామకృష్ణుడు ఆమెకు వివరించారు. మధురబాబు ఆమెకు నమస్కరించాక ఆమె ఆశీర్వదించి ఇలా అన్నది. "భాగవతంలో దశావతారాలే కాక ఇంకా చాలా చెప్పబడినవి. అవతారాలలో కల, అంశ, పూర్ణ, పూర్ణతమ విబేధాలు ఉన్నవి. విష్ణువు ఎన్నిసార్లయినా అవతరించవచ్చు అని వ్యాసభగవానుడు తెలియచేశాడు. వైష్ణవగ్రంథాలలో చైతన్యుడు మరల అవతరిస్తాడని ఉన్నది. రామకృష్ణ, చైతన్యుల అనుభూతులు ఇంచుమించుగా ఒకటిగా ఉన్నవి. మీరు పండితపరిషత్‌ను సమావేశపరచండి. నా వాదాన్ని సప్రమాణంగా నిరూపిస్తాను" అన్నది. కొన్నాళ్ళ తరువాత మధురబాబు పండిత సమావేశం ఏర్పరచటం అందులో భైరవీ బ్రాహ్మణి సప్రమాణంగా ప్రతిపాదించటం నిరుత్తరులయిన పండితులు అంగీకరించటమూ జరిగింది.

తీవ్రసాధనల వల్ల ఉదయించిన దివ్యదృష్టితో తను సహాయ పడవలసిన వ్యక్తులలో మూడవవ్యక్తి రామకృష్ణులని గుర్తించిన తరువాత ఆయన గొప్పతనము ఆయన సాధనలో సాధించినవి తెలుసుకొన్న తరువాత తంత్ర శాస్త్ర విధానాలతో వివిధ సాధనలు చేయించి ఆయనను పరిపూర్ణ సిద్ధుడుగా చేయటమే తన ఆగమన ఆశయం కనుక, దానిని అమలు చేయటానికి ఆమె పూనుకుంది. ఆమె విషయాన్ని ప్రతిపాదించగనే ఆయన ధ్యానం చేసి కాళీదేవిని అడిగాడు. ఆమె అనుజ్ఞ ఇచ్చిన తరువాత ఆ సాధనలకు అంగీకరించాడు. తాంత్రిక సాధనలకు అవసరమయిన ప్రత్యేక వస్తు సామగ్రిని భైరవీబ్రాహ్మణి ఎంత శ్రమపడి

అయినా సేకరించేది. వాటిని ఎలా ఉపయోగించాలో రామకృష్ణునకు బోధించి సాధన చేయించేది. వీనిలో పంచకపాల ఆసనం ప్రధానమయినది. గంగానది ఆవలి సుదూర ప్రాంతాల నుండి ఆమె ఈ సామాగ్రిని సాధించింది. 1) నక్క 2) పాము 3) కుక్క 4) ఎద్దు ఈ నాల్గింటి మధ్య మనిషి పుర్రె. అట్లనే మూడుపుర్రెలతో చేసే ఆసనం కూడా ఉంది. 1) మనిషి 2) దున్నపోతు 3) పిల్లి దీనిని త్రిముండాసనం అంటారు. మనిషి పుర్రెలు ఎన్ని సంపాదించగలిగితే అంత మంచిది. ఈ పుర్రెలను భూమిలో పాతిపెట్టి దానిమీద ఒక చదరపు వేదికను నిర్మించి దానిపై కూర్చుండి జపం చేస్తే మంత్ర సిద్ధి వేగంగా కలుగుతుందని తంత్ర గ్రంథాలు చెప్తున్నాయి. భైరవీ బ్రాహ్మణి కాళికాలయంలో మారేడు చెట్టు క్రింద ఒకటి, పంచవటిలో మరొకటి, రెండు కపాల ఆసనాలను ఏర్పాటు చేసింది. తంత్ర గ్రంథాలలో చెప్పబడిన దుర్లభమైన వస్తువులను కూడా ఆమె సేకరించి రాత్రివేళ ఆ వస్తువులతో కాళీపూజ చేయించి పంచకపాల ఆసనం మీద రామకృష్ణునిచే ధ్యానం చేయించేది. ఈ విధంగా 64 తాంత్రిక సాధనలను రామకృష్ణుని చేత చేయించి అద్భుతమైన దివ్యశక్తులు వచ్చేటట్లు చేసింది. వాటిలో కొన్ని చాలా దుష్కరమైనవి, అసహ్యమైనవి. ఒకరోజు అమె మనిషి పుర్రెలో చేపను వండి కాళీదేవికి నైవేద్యం పెట్టించింది. ఆ చేపను ప్రసాదంగా తినమని ఆమె ఆదేశించింది. రామకృష్ణుడు ఆమె ఆదేశాన్ని పాటించి ఏహ్యాభావమేమీ లేకుండా దానిని తిన్నారు. మరొకరోజు కుళ్ళిన నరమాంసాన్ని తీసుకువచ్చింది. దానిని కాళీదేవికి నైవేద్యం పెట్టి ప్రసాదంగా తినమన్నది. మనసంతా ఏహ్యాభావంతో నిండగా, ఇది తినటం ఎలా సాధ్యం అన్నాడు రామకృష్ణుడు? ఇలా సాధ్యం అంటూ ఆమె కొంత తిని చూపించింది. దేనిని అసహ్యించుకోరాదు అని బోధించింది. ఆమె అలా చేయటం చూస్తున్నప్పుడు కాళీదేవి యొక్క ప్రచండరూపం ఆమెలో దర్శనమిచ్చింది. ఆ దర్శనంతో భావావేశం కల్గిన రామకృష్ణుని నోట్లో ఆమె నరమాంస ఖండాన్ని ఉంచింది. ఏవగింపు ఏమీ లేకుండా రామకృష్ణుడు దానిని తినేశాడు. మరొకసారి నిండు యౌవనంలో ఉన్న ఒక అందగత్తెను తెచ్చి దిగంబరను చేసి ఈమెను దేవిగా పూజించు అని ఆదేశించింది. పూజ పూర్తయిన తరువాత ఆమె ఒడిలో కూర్చొని జపం చేయమని ఆదేశించింది. ఎంతో సంకోచించి ఏ బలహీనతా రాకుండా నన్ను కాపాడు దేవి అని కాళీదేవిని ప్రార్థించి ఆమె చెప్పినట్లు చేశాడు. ఆ స్త్రీని స్పర్శించగానే సమాధి స్థితిలోకి వెళ్ళటం వల్ల ఆయనకు ఏ వికారమూ కలుగలేదు. మరొక రోజు ఆమె సౌందర్యవతి అయిన స్త్రీని దిగంబరగా చూచి పూజ చేసినా ప్రత్యేకంగా యోని పూజ చేసినా వెంటనే నీవు భావసమాధి లోకి వెళ్ళి కామప్రకోపం నుండి తప్పించుకొంటున్నావు. నీవు నిజంగా జితేంద్రియుడవైనావో లేదో మరొక వీరసాధన ద్వారా పరిశీలించాలి" అని ఒకరోజు రాత్రి రహస్యంగా పంచవటిలోనికి ఇద్దరు యువతీ యువకులను పిలిపించి దిగంబరులుగా వారు రతిక్రీడ చేస్తూంటే, సమాధి స్థితిలోకి వెళ్ళకుండా కళ్ళు తెరిచి చూస్తూ కాళీ మంత్రజపం చేయమని ఆదేశించింది. దానిలో శివ, శక్తి లీలా విలాసాన్ని చూచి రామకృష్ణుడు ఏ వికారమూ చెందలేదు. వీర

భావ సాధనలో ఇది చివరి మెట్టు అని నీవు జితేంద్రియుడవైనావని భైరవ బ్రాహ్మణి రామకృష్ణుని ఆశీర్వదించింది. ఈ సందర్భంలో కొందరు భైరవీ బ్రాహ్మణి పై సాధనలు తనతోనే చేయించిందని అంటారు. ఆమెయే దిగంబరిగా కూర్చొని పూజ చేయించుకొందని, అలానే రెండవ ప్రక్రియలో కూడా స్ఖలించకుండా రామకృష్ణులు మంత్ర జపం చేశాడని అన్నారు. ఈ పూజా సందర్భాలలో మద్యాన్ని నైవేద్యం పెట్టటం ఆచారం. దానిని మాత్రం ఆయన స్వీకరించలేదు. ప్రసాదాన్ని స్వీకరించాలి కనుక దానిలో వేలు ముంచి వాసన చూసేవాడట. దానితో అది తీసుకొన్న ఫలితం లభించేది.

ఇక్కడ ఒక ప్రధాన అంశాన్ని గమనించాలి. రామకృష్ణులు అచంచలమైన బ్రహ్మచర్య నిష్ఠ గల వ్యక్తి. ఏ స్త్రీనైనా మాతృభావనతోనే చూచేవారు. అంబర సహితయా అంబర రహితయా అన్న ప్రశ్నే లేదు. ఆయనకు గురువయిన భైరవీబ్రాహ్మణి అయినా, తల్లి అయిన చంద్రాదేవి అయినా, భార్య అయిన శారదాదేవి అయినా అందరూ జగజ్జనని అయిన కాళీదేవి మూర్తులే. జగన్మాత ధరించే ఏ రూపమయినా ఆయనకు గౌరవముండేది. కాళీదేవి నక్కల రూపం ధరిస్తుందని అలానే కాలభైరవుని వాహనం శునకమని తెలుసుకొని వాటి ఉచ్ఛిష్టాన్ని పవిత్రంగా భావించి స్వీకరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

కాళీదేవి కరుణామూర్తి కదా! ఆమె తామస శక్తిగా ఎందుకు చెప్పబడుతున్నది అన్న ప్రశ్నకు సమాధానంగా పరమేశ్వరి – సృష్టి, స్థితి, లయకారిణి. ప్రపంచంలో అన్ని గుణాలు ఉంటాయి. అంతా ఆమెయే కనుక అందులో ఏది ఎప్పుడు అభివ్యక్తం కావాలనుకుంటే అది అభివ్యక్తమవుతుంది అన్న అంశాన్ని నిరూపించే ఒక దివ్యానుభవము ఆయన పొందారు. ఒక రోజు లోకోత్తర సౌందర్యవతి అయిన స్త్రీ మూర్తి గంగా జలాల నుండి బయటకు వచ్చి పంచవటికి చేరింది. పరిపూర్ణ గర్భవతి అయిన ఆమె రామకృష్ణుని ముందు అందమైన బిడ్డను ప్రసవించింది. ఆ పాపకు వాత్సల్యంతో పాలు ఇచ్చింది. మళ్ళీ వెంటనే అతి క్రూరరూపాన్ని ధరించి ఆ పసిబిడ్డను కసకస నమిలి మ్రింగి మళ్ళీ గంగా జలాలలో ప్రవేశించి అదృశ్యమయింది. సృష్టి యొక్క రహస్యం ఆయనకు అవగతమయింది. కాళీమంత్రసిద్ధి లభించిన తరువాత ఇతర దేవతలను చూడాలన్న ఆకాంక్ష ఆయనకు కలిగి ఆయా మంత్రాలను జపం చేస్తూ ఒక్క మాల తిప్పేసరికి ఆదేవత సాక్షాత్కరించేది. ఈవిధంగా ఆయన భైరవాది మూర్తులనెందరినో దర్శించాడు. అందరు దేవతలలో షోడశీ మంత్రాధిదేవత అయిన లలితా త్రిపుర సుందరి సౌందర్య సార సర్వస్వ అనీ, ఆమెను మించిన అందమైన స్త్రీ ఏ లోకంలోనూ లేదని తన అనుభవాన్ని ఆయన చెప్పారు. ఆయన చేసిన మరొక సాధన బృందావన ధామంలో గోపికా సాధన. అక్కడ ప్రేమకు తప్ప మరొక దానికి స్థానం లేదు. శ్రీకృష్ణుని ప్రేమ కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన గోపికలు సర్వార్పణ భావంతో నిండిన మధురభావం సర్వసాధనా మార్గాలలోనూ అత్యున్నతమైనది. శాంత, దాస్య, వాత్సల్య మాధుర్యాది సర్వభావముల సమాహారణ మహాభావం. ఆ మహా భావస్వరూపిణి

రాధాదేవి. శ్రీకృష్ణుని శరీరం నుండి ఉదయించిన దివ్యజ్యోతి గోపికల దేహాలను తాకగానే కామప్రేరితమైన రతి సుఖం కంటే కోట్ల రెట్లు అధికమయిన దివ్యానందం వారికి కలిగేది. ఆ ప్రేమ తత్వాన్ని అర్థం చేసుకోవాలంటే కామరహితులు కావాలని మహాభావస్వరూపిణి అయిన రాధాదేవి ప్రేమభావాన్ని అర్థం చేసుకోవటానికి మానవశక్తి చాలదని రామకృష్ణులు ఉద్ఘాటించారు. ఆ మధుర ప్రేమ భావనతో తనను రాధగా భావించుకొని చీర కట్టుకొని ప్రేమ తపస్సు చేసి దానిలో ఆయన ఉత్తీర్ణతను సాధించారు. అపర చైతన్యునివలె రాగభక్తిలోని మాధుర్యాన్ని చవిచూచి రాధాకృష్ణుల దివ్యానుగ్రహాన్ని ఆయన పొందారు. బృందావన ధామం యొక్క ప్రభావం రామకృష్ణుల మీద ఎంతగా ఉన్నదంటే బృందావనం నుండి రాధాకుండ్, శ్యామ్‌కుండ్‌ల నుండి మృత్తికను సేకరించి పంచవటిలో దానిని చల్లి ఇప్పుడీ పంచవటి దివ్యభూమి అయింది అని ఆయన అన్నారు. కామరహితమయిన ప్రేమ బృందావన ధామంలో పొందిన ఆ ప్రేమ యోగి, భార్య విషయంలో అదే విధంగా ప్రవర్తించాడు. శారదా దేవిలో జగజ్జనని భావిస్తూ ఆమెను పూజించారు. ఎడతెగక ఎనిమిది నెలల పాటు ఆమెతో ఏకశయ్యావ్రతులై ఉండి కూడా ఎటువంటి కామ వికారం లేకుండా ఉండ గల్గిన ఇంద్రియ విజేత ఆ మహాపురుషుడు.

కాళీ సాక్షాత్కారమయిన తరువాత కూడా రామకృష్ణుడు తాంత్రిక సాధనలు ఎందుకు చేశారన్న దానికి వారిని గూర్చి రచించిన శిష్యులు భక్తులు ఎన్నో విశ్లేషణలు చేశారు. వాటిని పరిశీలించిన తరువాత వాటి సమన్వయాన్ని గమనించవచ్చు. పూర్వ యుగాలలో మంత్ర ద్రష్టలయిన ఋషులు ఉన్నారు. మంత్ర ద్రష్ట అంటే మంత్రాన్ని దర్శించిన వాడు. దివ్య భూమికలలో ఉన్న మంత్రాలు ధ్యాన స్థితిలో ఉన్న ఋషికి వినిపించేవి. మంత్ర దేవత కనిపించేది. కానీ ఆ మంత్రాన్ని చిరకాలం జపించిన తరువాతనే ఆ ఋషులకు దివ్య శక్తులు లభించేవి. ఉదాహరణకు గాయత్రి మంత్రానికి ఋషి విశ్వామిత్రుడు. అంటే గాయత్రీదేవి ఆ ఋషికి దర్శనమిచ్చి తన మంత్రాన్నిచ్చిందని అర్థం. దానిని కొన్ని వేల సంవత్సరాలు జపించటం ద్వారా మాత్రమే అతడు దివ్యశక్తిని పొందాడు. శాపానుగ్రహ శక్తి, సృష్టికి ప్రతిసృష్టి చేయటం, ఇంద్రుడు పెట్టిన కామక్రోధ లోభ పరీక్షలకు గురియై, చివరకు బ్రహ్మఋషిత్వాన్ని సాధించటం ఇవన్నీ ఆ మంత్ర తపస్సు దీర్ఘకాలం చేయటం వల్లనే జరిగింది. ఇటువంటి గాథలెన్నో మనం పురాణ వాఙ్మయంలో చూడవచ్చు. నారదుడు ధ్రువునకు వాసుదేవ మంత్రాన్ని ఉపదేశిస్తూ ఈ మంత్రాన్ని ఏడు రోజులు చేస్తే అంతరిక్షంబునన్ పోవు ఖేచరులను చూచు సామర్థ్యంబు కల్గు అన్నాడు అంతేకాని కనిపించే వారంతా చెప్పిన పని చేస్తారని అనలేదు. కనుక దేవతలు కనిపించటం వేరు, పనులు చేయటం వేరు. సిద్ధత్వం వస్తే కాని కార్యసిద్ధి రాదు. దానికి తపస్సు చేయాలి. సాధనలో కొంత దూరం వెళ్ళిన తరువాత దివ్య చక్షువు వికసించి దేవతలు కనిపించవచ్చు. అప్పుడప్పుడు మాట్లాడవచ్చు కూడా. తీవ్ర తపస్సు యొక్క ఫలితంగా రామకృష్ణుడు కాళీ సాక్షాత్కారాన్ని పొందారు. ఆమె వాత్సల్యాన్ని చూరగొన్నారు. అంతవరకే– భవిష్యత్

కాలంలో ఇతరులకు ఉపకారం చేయాలన్నా, ఆర్తుల బాధను తొలగించాలన్నా, శిష్యులైన సాధకులకు సహాయం చేయాలన్నా, ఇచ్ఛను క్రియా రూపంగా పరిగణింప చేయగల సిద్ధశక్తి కావాలి. దానికి తీవ్ర తపస్సు చేయాలి. ప్రాచీన కాలంలో ఆహారాదులు వర్జించి వందల వేల సంవత్సరాలు తపస్సు చేసేవారు. కానీ ఇది కలియుగం. అంత సుదీర్ఘకాలం మానవుడు జీవించడు. తాంత్రిక సాధనల వల్ల శీఘ్రంగా సిద్ధశక్తులు సంపాదించవచ్చు. అందుకే రామకృష్ణులు ఆ సాధనలు చేశారని భావించవచ్చు. ఆ మార్గాలలో నిష్ణాతురాలయిన భైరవీ బ్రాహ్మణి ఆయనను వెతుక్కుంటూ రావటం అదృష్టం, దైవ నిర్దేశం. దీనిలో శీఘ్రతరమైన ఫలితాలు ఇవ్వటానికి వామాచార సాధనాలు, పంచమకార సాధనలు అనగా మద్యము, మత్స్యము, మాంసము, మైధునము, ముద్ర దీని సాధన విధానము తెలుసుకొని ఉపయోగించుకొన్నందువల్ల ఫలితాలు శీఘ్రంగా సాధించవచ్చునని తంత్ర గ్రంథాలు ఉద్ఘోషిస్తున్నాయి. ఆ పద్ధతులన్నిటిలో అనుభవక పూర్వమయిన సామర్థ్యం కల్గిన భైరవీ బ్రాహ్మణి ఈయన చేత ఆ సాధనలు చేయించి సిద్ధశక్తులను పొంద చేసింది. శ్మశానంలో కూర్చొని పంచకపాలాసనం మీద కూర్చుని ఈ సాధనలు చేయుటం వల్ల సిద్ధి వేగతరమవుతుంది. మంత్ర ప్రేరణ వల్ల శ్మశానంలో ఉండే భూత ప్రేతములు మాధ్యమములుగా మారి దేవతాత్వమును పొంది సాధకునకు వేగ, సిద్ధిని అందిస్తవి. దీనికొక చిన్న ఉదాహరణ చూడండి.

ఒక నవలలో విశ్వనాథ సత్యనారాయణ గారు ఒక మంత్ర శాస్త్ర రహస్యాన్ని కథారూపంగా తెలియచేశారు. ఒక వ్యక్తి ఉన్నట్లుండి రోగగ్రస్తుడై మరణశయ్యపై ఉన్నాడు. వారి కుటుంబ సభ్యులు ఆ ఊరికి వచ్చిన ఒక ధ్యాన యోగికి అతనిని చూపించారు. ఆయన ధ్యానంలో చూడగా అతనిని పీడిస్తున్న ఒక పిశాచి కన్పించింది. దానితో ఆయన మాట్లాడిన తీరును చూడండి.

యోగి : నీవెవరు? నీ వితనిని ఎందుకు పీడిస్తున్నావు ?

పిశాచి : నేను వారాహిని. ఒక దేవతను. నన్నొక మాంత్రికుడు ఇతనిని చంపమని ప్రయోగించాడు.

యోగి :వారాహి గొప్ప దేవత, ఇటువంటి నీచమైన పనులు చేయదు. నీవెవరు?

పిశాచి : 'మంత్రాధీనంతు దైవతం' అన్న మాట నీకు తెలియదా? దేవతలు మంత్రాధీనులు. మాకు మంచి చెడులతో పనిలేదు. మంత్ర సిద్ధుడు కోరిన పని చేయటం మా కర్తవ్యం.

యోగి : కావచ్చు. నిన్ను చూస్తే నీవు అసలైన వారాహివి కాదని స్ఫురిస్తున్నది. నా యోగ శక్తితో ఆజ్ఞాపిస్తున్నాను. నీవెవరు? నిజం చెప్పు.

పిశాచి : నీ యోగ శక్తి బలమైనది. నిజం చెప్తున్నా. నేను మరణించిన ఒక స్త్రీని. ప్రేతమునై శ్మశానంలో తిరుగుతున్నాను. ఒక మాంత్రికుడు అక్కడకు వచ్చి వారాహి సాధన చేశాడు. అతని మంత్ర శక్తికి నేను వశమయినాను. అత డితనిని హింసించి చంపమని ఆజ్ఞాపించాడు. అందుకే ఇలా చేస్తున్నాను. ఇంతలో మీరు వచ్చారు.

యోగి : ఇతనిని విడిచిపెట్టి వెళ్ళు. నా ఆజ్ఞ.

పిశాచి : తప్పదు కనుక వెడుతున్నాను.

తరువాత ఆరోగి వ్యాధి పోయి జీవించాడు. ఇక్కడ గమనించవలసినదేమిటంటే ఒక తీవ్ర దేవతా మంత్రాన్ని ఇంట్లోనో దేవాలయంలోనే చేస్తే ఎప్పటికో గాని సిద్ధించకపోవచ్చు. శ్మశానంలో చేస్తే ఏ భూతమో ప్రేతమో మంత్ర దేవతా రూపాన్ని ధరించి సాధకుని కోరికలు తీరుస్తుంది. అదీకాక, దివ్య క్షేత్రాల దగ్గర ఉన్న మహాశ్మశానాలలో అసలు దేవతలు కూడా రుద్ర భైరవ శక్తి మండలాలకు చెందినవారు ఉంటారు. వారు సాధకుని ధైర్యాన్ని పరీక్షించి, సిద్ధులను ప్రసాదిస్తారు. ఈ శ్మశాన సాధన ఈ విధంగా రామకృష్ణునికి ఎంతో ఉపకరించింది. కాళీసిద్ధికి దోహదం చేసింది. త్రైలింగస్వామి, రామప్రసాదు వంటి మహనీయులు శ్మశాన సాధన వలననే కాళీమంత్ర సిద్ధులయినారన్న సంగతి గమనించటం అవసరం.

శాక్తేయ సాధనలలో దిగంబరీ పూజయే కాక కుమారి పూజ, సువాసిని పూజ వంటివి కూడా ఉన్నవి. దక్షిణాచారపరులు ఈ రెండింటినీ అనుష్ఠిస్తారు. చిన్న వయస్సులో ఉన్న బాలికలను అలంకరించి దేవిగా ఆవాహన చేసి పూజ చేయటం భారతదేశం అంతటా ఉన్నది. అయితే వీటిని కూడా అపార్థం చేసుకోవటం భయపడటం వంటివి కూడా ఉన్నది. తండ్రి అనుమతి లేకుండా ఒక చిన్న పిల్లకు దేవీ పూజ చేసినందుకు రామకృష్ణుని మేనల్లుడు హృదయ్ దక్షిణేశ్వర కాళీ మందిరం నుండి వెళ్ళగొట్టబడ్డాడు. సువాసినీ పూజ కూడా ఆమె యొక్క ఆమె భర్త యొక్క అంగీకారము తీసుకొని చేస్తే ఏ ఇబ్బందులూ ఉండవు. రామకృష్ణుడు తన భార్య అయిన శారదాదేవితో సువాసినీ పూజ నిర్వహించారు. దీనికోసం ఒకరోజు రహస్యంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కాకుండా ఆయన నివసించే గదిలో ఏకాంతంగా రాత్రి మొదటి ఝాము గడచిన తరువాత షోడశీపూజ జరిగింది. కుంకుమాదులతో అలంకృతమైన దేవీ పీఠంమీద శారదా దేవిని ఉత్తరాభిముఖంగా కూర్చోపెట్టి రామకృష్ణుడు తూర్పు ముఖంగా కూర్చొని ఆమెలోకి త్రిపుర సుందరిని ఆవాహన చేశారు. మంత్ర పూరిత జలాన్ని ఆమెపై ప్రోక్షిస్తూ షోడశోపచార పూజ ఆయన చేస్తూంటే ఆమె అప్రయత్నంగా సమాధి స్థితిలోకి వెళ్ళింది. పూజ పూర్తి కాగానే రామకృష్ణులు కూడా భావ సమాధిలోకి వెళ్ళారు. ఇంచుమించు రెండు ఝాములు ఇద్దరూ ఆ స్థితిలోనే ఉన్నారు. ఇంక కాసేపటికి తెలవారుతుందనగా ఆయనకు స్పృహ వచ్చి తన జపమాలను తన సాధన ఫలితాన్ని ఆమెకు సమర్పించారు. ఆమెకు కూడా నెమ్మదిగా స్పృహ వచ్చింది. నిజమైన సువాసినీ పూజ ఇలా ఉంటుంది. అయితే అందరికీ ఈ స్థితి రావటం కష్టం కనుక శాస్త్రోక్త

విధానంలో పూజ చేసి నైవేద్యాన్ని ఆమెకు సమర్పించి కొంత ఆమె స్వీకరించి ఈయగా ఆ మిగిలిన దానిని ఎంగిలిగా భావించక దేవీ ప్రసాదంగా స్వీకరించాలి.

రామకృష్ణుడు అనేక సంప్రదాయములకు చెందిన సాధనలు ఇస్లాం, క్రైస్తవ, సూఫీ మొదలైన మార్గాలలో సాధనలు చేసి వానిలో పరమావధిని దర్శించారు. జైన, సిక్కు సంప్రదాయాల పట్ల ఆయన కెంతో గౌరవముంది. బుద్ధుని అవతారమూర్తిగా ఆయన విశ్వసించాడు. ఏసుక్రీస్తును తాను చూచిన ఆకృతిని వర్ణిస్తూ ఆయనకు గౌరవర్ణం, విశాల నేత్రాలు, కొంచెం చప్పిడిముక్కు ఉన్నవని చెప్పారు. ఎన్ని సాధనలు చేసినా ఆయన ఇష్ట దేవత, ప్రధాన దేవత, కాళీమాత. భక్తి శాస్త్రములలో ఏ భక్తుడూ భగవంతుడు కావాలని కోరుకోడు. తన ఇష్ట దేవత సన్నిధిలో సేవ చేస్తూ ఉండాలని వాంఛిస్తాడు. ప్రసిద్ధ కాళీ భక్తుడు రామప్రసాద్ "నేను పంచదారగా మారాలని కోరుకోను, పంచదారను రుచిచూడ కోరతాను. అలానే దేవీ దివ్యానుభూతిలోని ఆనందాన్ని పొందాలని మాత్రమే ఎప్పుడూ కోరుకుంటాను" అన్నదే భక్తులకు శిరోధార్యము. అందుచేత భక్తులు అద్వైత మార్గాన్ని అనుసరించటానికి ఇష్టపడరు. కానీ రామకృష్ణుల జీవితంలో ఈ పరిణామం కూడా రావలసి ఉన్నది. దానికి దారి తీసిన సంఘటన ఇది. పవిత్ర నర్మదానదీ తీరంలో శంకరుల దశవిధ సన్యాస సంప్రదాయాలలో ఒకటైన 'పురి' సంప్రదాయానికి చెందిన తోతాపురి అనే సన్యాసి సుదీర్ఘ కాలం సాధనలు చేసి బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందాడు. కోరినప్పుడు నిర్వికల్ప సమాధి స్థితిలో ఉండగల్గిన స్థితిని సంపాదించాడు. బ్రహ్మ జ్ఞాన సిద్ధి కలిగిన తరువాత పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ తీర్థయాత్రలు చేయాలన్న కాంక్ష కలిగి, పూరి మొదలైన క్షేత్రాలు దర్శిస్తూ కలకత్తాకు వచ్చారు. నాగ జాతికి చెందిన ఆ సన్యాసి ఎప్పుడూ నగ్నంగా ఉండేవాడు. ఎక్కడా మూడు రోజులకంటే ఉండకూడదని ఆయన నియమం. దక్షిణేశ్వర ఆలయంలో సన్యాసులను భక్తితో చూస్తారని విని అక్కడకు వచ్చాడు. వస్తూనే గంగా తీరంలోని స్నానఘట్టం మీద మంటపం మీద కూర్చున్న రామకృష్ణుని చూసి ఆకర్షితుడయినాడు. రామకృష్ణుడు ఆయన దృష్టిలో యోగ్యుడైన సాధకునిగా కన్పించాడు. తాంత్రిక సాధనలతో ముదిరిపోయిన వంగదేశంలో ఇటువంటి అర్హుడైన శాంత సాధకులు కూడా ఉన్నారా! అని ఆశ్చర్యపడ్డాడు. నిశితంగా పరిశీలించి రామకృష్ణుని పలకరించి మంచి యోగ్యత గల వ్యక్తిగా గోచరిస్తున్నావు. వేదాంత సాధన నేర్పుతాను నేర్చుకుంటావా? అని అడిగాడు. జటాజూటధారి దీర్ఘోన్నత దేహుడు అయిన ఆ నగ్నసన్యాసిని చూసి ఆయన మాటలు విని ఏమి సమాధానం చెప్పాలో తోచక "నాకేమీ తెలియదు. మా అమ్మను అడగాలి, ఆమె ఏం చెపితే అది చేస్తాను" అన్నాడు. అప్పుడు తోతాపురి "అయితే పోయి అడిగిరా. ఈ ఆలయంలో అతిథి మందిరంలో కొద్దికాలం మాత్రమే ఉంటాను" అన్నాడు. రామకృష్ణుడు ఆలయంలోకి వెళ్ళి ధ్యానంలో కాళీదేవిని అడిగాడు. కాళీమాత "వెళ్ళు నేర్చుకో ఆ సన్యాసి నీకోసమే ఇక్కడకు వచ్చాడు" అని ఆదేశించింది. వెంటనే ఆయన తోతాపురి దగ్గరకు వెళ్ళి "మా అమ్మ ఒప్పుకొన్నది. మీరు వేదాంత సాధనలు నేర్పండి

అన్నాడు. రామకృష్ణుడు గుడిలోకి వెళ్ళిరావటం చూచిన తోతాపురి ఇతడు కాళీదేవి నుండి ఏదో ఆదేశాన్నో అంగీకారాన్నో పొంది వచ్చాడు అని గుర్తించాడు. అయితే ఆ సన్యాసి దృష్టిలో బ్రహ్మమొక్కటే సత్యము. దేవతలు వారికి సంబంధించిన సాధనలు, దేవతల అనుగ్రహములు, భగవద్భక్తి ఇవన్నీ భ్రమజనితములని ఆయన అభిప్రాయం. శంకరుల వారు 'అనాది' అని చెప్పిన ఆరింటిలో ఈశ్వరుడు కూడా ఉన్నాడు కనుక, ఆ ఈశ్వరుని ఉనికిని మాత్రం ఆయన అంగీకరిస్తాడు. కానీ ఉపాసించటం ఒప్పుకోడు. బ్రహ్మ పదార్థము కాని ఇతరములన్నీ భ్రాంతులు, భ్రాంతికి అస్తిత్వము లేదు కనుక ఈ సాధకుల దర్శనములు అనుభవాలు మిథ్యలు అని ఆయన నిశ్చిత అభిప్రాయము. రామకృష్ణుడు అనే ఈ యువకుడు, 'కాళీదేవి' అన్న భ్రాంతిలో ఉన్నాడు. మంచి సంస్కారం కలిగిన ఈ జీవుని భ్రాంతిని తొలగిస్తే బ్రహ్మానుభవము పొందే యోగ్యత వస్తుందని భావించాడు. ఇలా ఆలోచించి ఆయన రామకృష్ణునితో "వేదాంత సాధన కావాలంటే కొన్ని నియమాలు ఉన్నవి. సంసారాన్ని వదిలేసేయాలి శిఖ, యజ్ఞోపవీతాలను విసర్జించాలి, కొన్ని హోమాలు చేయాలి. ఆ తరువాత పూర్వనామాన్ని, పూర్వ జీవితాన్ని వదలి కొత్త నామంతో కౌపీనము కాషాయ వస్త్రాలు ధరించి బ్రహ్మోపదేశాన్ని పొందాలని బోధించాడు. ఆ మాటలు విని రామకృష్ణుడు "అయ్యా! నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. అయితే భౌతిక ప్రపంచానికి సంబంధించింది– వృద్ధురాలైన నా తల్లి ఉన్నది. నేను సన్యాసం తీసుకోవటానికి ఆమె ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించదు. అదికాక నాకు వివాహం కూడా అయింది. సహజంగానే నా భార్య కూడా అంగీకరించదు. కనుక వారెవ్వరికీ తెలియకుండా రహస్యంగా నాకు సన్యాసం ఇవ్వండి" అన్నాడు. తోతాపురి ఒక్కక్షణం ఆలోచించి "ఆచార ప్రకారం బ్రహ్మచారి అయితే తల్లి అనుమతి, వివాహితుడయితే భార్య అంగీకారము తప్పనిసరి. కానీ నీలోని యోగ్యతను చూచి, నీ ఆసక్తిని చూచి నీకు సన్యాస దీక్ష ఇవ్వటానికి అంగీకరిస్తున్నాను. సంప్రదాయ మర్యాదలు గురించి చెప్పానే కానీ నిజంగా సన్యాసి కావాలనుకున్నవాడు ఎవరినీ సంప్రదించడు, ఎవరి అంగీకారంతోను అతనికి పనిలేదు. ఎవరికోసమూ ఆగడు. కనుక శుభముహూర్తం చూచి గోప్యంగా నీకు సన్యాసము ఇస్తాను" అన్నాడు. కొద్దిరోజులలోనే మంచి ముహూర్తాన్ని తోతాపురి ఎంపిక చేశారు. పంచవటి దగ్గర ఒక మందిరంలో తోతాపురి రామకృష్ణుని చేత పితృశ్రాద్ధాదులు నిర్వర్తింప చేశాడు. ఆత్మశ్రాద్ధ క్రియ కూడా చేయించాడు. తరువాత విరజా హోమం జరిగింది. శిఖను యజ్ఞోపవీతాన్ని త్యజించటం జరిగింది. తోతాపురి ఇచ్చిన కౌపీనాన్ని కాషాయ వస్త్రాలను ధరించి అంతకుముందున్న 'గదాధర్' అనే పేరును వదలివేసి గురువు ప్రసాదించిన 'రామకృష్ణ' అన్న నామాన్ని స్వీకరించి ఆయన ఉపదేశించిన ఉపనిషద్వాక్యాన్ని అనుగ్రహంగా పొందాడు.

దీక్షానంతరం తోతాపురి మనస్సును నిర్వికల్పం చేసుకొని ధ్యానం చేయాలని ఉపదేశించాడు. రామకృష్ణులు ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా లోకసంబంధమైన ఆలోచనలు అరికట్టడంలో కృతకృత్యుడు అవుతున్నాడే కాని, చిత్తవృత్తి నిరోధం జరుగగానే కాళీమాత

యొక్క మూర్తి, కంటి ముందు జాజ్వల్య మాన్యంగా గోచరించేది. దానిని దాటి నిర్గుణ స్థితికి పోవటం అసాధ్యమనిపించి ఆ విషయాన్ని నగ్నమునికి విన్నవించాడు. ఆ నాగయోగి చివాట్లు పెడుతూ "ఏమిటి? నామ రూప ఆవరణను దాటిపోలేకుండా ఉన్నావా? సాధ్యం కావటం లేదా? అయి తీరాలి. సాధ్యం కావల్సిందే" అంటూ కుటీరంలో ఒక ప్రక్కన పడి వున్న గాజు పెంకును తీసుకొని పదునైన దాని మొనతో రామకృష్ణుని భ్రూమధ్యంలో గుచ్చి నీ మనస్సును ఈ బిందువు మీద కేంద్రీకరించు అన్నాడు. అప్పుడు రామకృష్ణుడు దృఢసంకల్పంతో ధ్యానానికి కూర్చుని కాళీరూపం కనుల ముందు నిలువగానే తీవ్ర సంకల్పంతో దానిని అధిగమించి నామరూపాత్మకమైన ప్రపంచాన్ని దాటి నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళాడు. కొద్ది క్షణాలలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోయినవి. గుండె కొట్టుకోవడం నిల్చిపోయింది. కూర్చున్నవాడు కూర్చున్నట్లే బిగిసిన కట్టె వలె ఉన్నాడు. ప్రక్కనే ఉన్న తోతాపురి కొన్ని గంటలు అక్కడే ఉండి తరువాత బయటకు వచ్చి రామకృష్ణుని ధ్యానానికి ఎవరూ భంగం కలిగించకుండా ఉండటం కోసం బయట తాళం పెట్టాడు. సమాధి నుంచి బయటకు రాగానే రామకృష్ణుడు పిల్చినప్పుడు తాళం తీయవచ్చునని ప్రక్కనే ఒక ఆసనం మీద కూర్చున్నాడు. పగలు గడిచింది. రాత్రి కూడా దాటింది. మూడు రోజులు గడచినా తలుపు తెరవమనే పిలుపు వినిపించలేదు. దానితో ఆదుర్దాపడి తలుపు తీసి చూచాడు. కొయ్య దుంగ వలె ఉన్నవాడున్నట్లే ఉన్నాడు రామకృష్ణుడు. శరీరంలో ప్రాణం జాడ లేదు. మరణిస్తే దేహం కుళ్ళిపోవాలి. కానీ కాంతితో ప్రకాశిస్తున్నది. సమాధి విశేషాలు రహస్యాలను ఎరిగిన తోతాపురి దిగ్భ్రాంతి చెందాడు. నలభై సంవత్సరాలు కఠోర సాధన చేసి తానేది సాధించాడో ఈ యువకుడు దానిని ఒక్కక్షణం లోనే సాధించాడు. ఇతడు సామాన్యుడు కాదు. కారణజన్ముడయిన మహాపురుషుడనిపించింది. అప్పుడాయన తన శిష్యుని బాహ్య చైతన్యంలోకి తీసుకురావటానికి 'హరిః ఓం' అని మేఘ గంభీర నిర్ఘోషంతో ఉచ్చరించటంతో రామకృష్ణుడు స్పృహలోకి వచ్చారు. ఈ సమాధి స్థితిని బాగా అనుభవంలోకి తీసుకురావటం కోసం పదకొండు నెలలు ఉండి తరువాత ఆయన తన దోవను తాను వెళ్ళిపోయినాడు. ఈ సాధనతో రామకృష్ణుడు అద్వైత సామ్రాజ్య పట్టభద్రులయినట్లే. ఈ అద్వైత సాధన – తోతాపురితో సాన్నిహిత్యం, భైరవీబ్రాహ్మణికి నచ్చలేదు. ఈ అద్వైత సాధువులు భక్తి సంప్రదాయాన్ని అంగీకరించరు. జగన్మాతను కూడ మిధ్య అంటారు. నీ వాయన మాయలో పడవద్దని హెచ్చరించింది. రామకృష్ణుడు ఎవరి మాయలోనూ పడలేదు, సరికదా, మాయను జయించాడు.

అద్వైత సాధన తరువాత రామకృష్ణుని మిగతా జీవితమంతా ఆయన సిద్ధశక్తి యొక్క లీలా విలాసాల విన్యాసమే. వివిధ వ్యక్తులతో శిష్యులతో ఆయన అనుబంధాలు, ఆయా మనుషులు ఏ ఏ విధంగా ప్రభావితులయినారు, వాటి కథలు లెక్కలేనన్ని కన్పిస్తున్నాయి. వివేకానందుని వంటి శిష్యులకు దివ్యానుభవాలను ప్రసాదించాడు. తన తపశ్శక్తిని ధారపోసి భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఆధ్యాత్మిక మహోన్నత సాధనకు వచ్చిన పరిణామాలకు కారణభూతునిగా ఆయన పాత్ర ఇవాళ జగద్విఖ్యాతమయినది.

సామాన్యంగా అందరికీ కనిపించే విధంగా ఆయన ఏ దివ్యశక్తులూ ప్రదర్శించ లేదు. కానీ వాటంతట అవి ఎన్నో సందర్భాలలో ప్రకటితమయినవి. రామకృష్ణునకు అపారమైన సేవ చేస్తున్న జమిందారు మధురబాబుయొక్క భార్య జగదంబాదాసి రక్త గ్రహణి వ్యాధితో బాధపడుతూ మరణశయ్యమీద ఉంది. ఎన్ని మందులకూ తగ్గలేదు. ఘన వైద్యులు ఆశలు వదిలారు. అప్పుడు మధుర బాబు రామకృష్ణుల దగ్గరకు వచ్చి విషయమంతా చెప్పి "బాబా! దుర్ఘటన జరుగబోతున్నది. అది భరించలేను అంతే కాదు. ఆమె మరణిస్తే జమిందారీ మీద నా అధికారం పోతుంది. ఈ దేవాలయంతోనూ నాకు సంబంధం ఉండదు. మిమ్ము సేవించుకొనే భాగ్యాన్ని పోగొట్టుకొంటున్నందుకు బాధ కలుగుతున్నది" అన్నాడు. అతని దైన్యాన్ని చూచి రామకృష్ణులు జాలిపడి, ఒక్క క్షణం కండ్లు మూసుకొని ధ్యానంలోకి వెళ్ళి "మధురానాథ్ భయపడవద్దు. నీ భార్యకు నయమవుతుంది" అన్నాడు. మధురానాథ్ ఇంటికి వెళ్ళగానే తన భార్య ఆరోగ్యం మెరుగవటం గమనించగలిగాడు. కొద్దిరోజులలోనే ఆమె కోలుకున్నది. అయితే, ఆ వ్యాధిని రామకృష్ణుడు స్వీకరించి ఆరునెలలు రక్త గ్రహణి మొదలైన వ్యాధులతో, "ఆమె కర్మను తాను తీసుకొని, అనుభవించాను" అన్నారు. చివరిదశలో ఆయన క్యాన్సరుతో మరణించటం కూడా ఇతరుల కర్మను తీసికోవటం వల్లనే అని కొందరు భక్తులు అభిప్రాయపడ్డారు.

ఆయన జీవితంలో భైరవీబ్రాహ్మణి పాత్ర కూడా నెమ్మదిగా తొలగిపోయింది. ఆమె ఒకసారి రామకృష్ణులతో వాళ్ళ స్వగ్రామానికి వెళ్ళింది. అక్కడ జరగిన ఒక చిన్న సంఘటనలో రామకృష్ణుని మేనల్లుడు హృదయ్ ఆమెపై గట్టిగా అరిచాడు. ఆమె సేవాభావంతో బ్రాహ్మణేతరులు తిన్న విస్తళ్ళు కూడా ఎత్తటమే ఆ కోపానికి కారణం. ఆమెను సమర్థిస్తూ ఒక్కరు కూడా మాట్లాడలేదు. రామకృష్ణుడు కూడా విషయం విని ఊరుకొన్నారే కాని ఏమీ మాట్లాడలేదు. దానితో రామకృష్ణుని జీవితంలో తన పాత్ర ముగిసిపోయిందని ఆమె గ్రహించి రామకృష్ణునితో చెప్పి కాశీకి వెళ్ళిపోయింది. జీవితాలలో అవసరమయిన వ్యక్తులు రావటం అక్కర తీరిన తరువాత నిష్క్రమించటం ఇవన్నీ సహజ పరిణామాలే. ఒక మహాపురుషునిగా కారణజన్మునిగా ఆయన జీవితం ఆదర్శప్రాయమైనది. నాస్తికవాదంతో ఒకవైపు, క్రైస్తవ మత విజృంభణంతో మరొకవైపు దెబ్బతింటున్న హిందూ సమాజానికి, ఆ మహనీయుని అవతరణ, ఆశాజ్యోతియై ప్రకాశించింది. ఈనాడు ఆయన భక్తులు, శిష్యులు ఆ పరంపరలోని వారు, ఆయన్ని సాక్షాత్ భగవంతునిగా విశ్వసిస్తున్నారు. పరమేశ్వరుని అన్ని అవతారాలలోను ఇది పరమశ్రేష్ఠమైన అవతారమని ప్రతిపాదిస్తున్నారు. దీనిని గురించి కొంత ఆలోచించటం అవసరం అనిపిస్తున్నది. గురువు నిజంగా దేవుడయినా కాకపోయినా శిష్యుడు ఆయనలో దేవుని చూడాలి. వేదశాస్త్రము లీ విషయాన్ని ప్రస్ఫుటంగా చెప్తున్నవి "ఆచార్య దేవోభవ, వంటి వేదవాక్కులు "గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః" వంటి ప్రాచీన శ్లోకాలు ఈ భావమును దృఢపరుస్తున్నవి. ఈ భావన దృఢపడిన శిష్యులు ఉద్ధరించబడతారు, అంతవరకే. కనుక రామకృష్ణ పరమహంస భక్తులు ఆ విధంగా భావించటంలో తప్పు లేదు.

రామకృష్ణుని అవతార విషయాన్ని చర్చించటానికి భైరవీబ్రాహ్మణి కోరిక మేరకు జమిందారు మధురానాధుడు పండిత సభను సమావేశపరిచాడు. ఆ సమావేశంలో రామకృష్ణుని యొక్క దర్శనాలను అనుభూతులను వివరించి ఇవన్నీ దివ్యానుభవ లక్షణాలని ఆమె వాదాన్ని ప్రతిపాదించింది. చర్చలు జరిగిన మీదట పండితులు దానిని అంగీకరించారు. ఇక్కడ కొందరు ఇలా అంటున్నారు – ఈ అనుభూతులను తాను పొందానని రామకృష్ణులు చెపితే వాటిని నిజమని నమ్మి అవి దివ్య లక్షణ సమన్వితములు కనుక రామకృష్ణుని అవతార పురుషుడు అని అంగీకరిస్తున్నారు.

ఆయన మహనీయుడు అబద్ధం చెప్పడు అన్న మాటను పక్కన బెట్టి ఆయన చెప్పినవి నిజమా, కాదా అని చూడగల తపస్సంపన్ను డెవరూ ఆ సభలో లేరు. ప్రమాణం లేని కొన్ని విషయాలను విశ్వాస ప్రాతిపదికపై తీసుకొని దానిలో నుండి ఒక సిద్ధాంతానికి రావటం తర్క శాస్త్రం అంగీకరించదు. వారిలో భైరవీ బ్రాహ్మణి ఆ రంగంలో కొంత తెలిసిన మనిషి. ఆమె కూడా రామకృష్ణులు చెప్పిన విషయాలను విశ్వసించి చెప్పిందే కాని తన దివ్యదృష్టితో చూచి అవన్నీ సత్యములని గ్రహించానని చెప్పలేదు. కనుక ఆమె మాటలు కూడా ప్రామాణికములు కావు. రామకృష్ణుడు తన ఒక అనుభూతిని గురించి చెపుతూ ఒకసారి తాను ధ్యానం చేస్తున్నపుడు తనలో నుండి నల్లని పాపపురుషుడు బయటకు వచ్చాడని తనలో నుండే ఉదయించిన మరొక త్రిశూలధారి అయిన సన్యాసి ఆ పాప పురుషుని తన త్రిశూలంతో పొడిచి వేశాడని చెప్పారు. రామకృష్ణుడు ఈ జన్మలో ఏ పాపమూ చేయలేదు. కనుక ఆ పాపము పూర్వ జన్మలోనిది. సాక్షాత్ భగవంతుడే అవతరించాడన్నప్పుడు పూర్వజన్మలో దేవుడు పాపం చేశాడనటం తప్పు కదా! కనుక రామకృష్ణుడు పూర్వ జన్మలో మానవుడు. ఏవో కొన్ని తప్పులు ఒప్పులు చేసి ఉండవచ్చు. మహాతపస్వి అయి ఉండవచ్చు. ఆజన్మాంతర సాంక్రామిక పాపము – ఇప్పుడు నశింప చేయబడి ఉండవచ్చు. రామకృష్ణుడే స్వయంగా ఎవడు రాముడో ఎవడు కృష్ణుడో అతడే నేను అనిన వాక్యాన్ని ఆయన అవతార లక్షణానికి ప్రమాణంగా చెపుతుంటారు. ఆయన ఏసుక్రీస్తు వంటి మహనీయుల ప్రస్తావన వచ్చినప్పుడు కూడా 'వారు నేనే' అని ఆయన అన్నారు. అద్వైత భావనలో సమస్తము తానే అని ఒక బ్రహ్మజ్ఞుడు చెప్పవచ్చు. అంతమాత్రాన వారే ఈయనగా పుట్టారనటం సత్యం కాజాలదు. ఏసుక్రీస్తును ధ్యానంలో ఆయన దర్శించారు. అంటే దివ్య భూమికలో ఏసుక్రీస్తు ఉన్నట్లే కదా! అప్పుడు ఆయనయే ఈయనగా పుట్టాడనటం సబబు కాదు కదా! ఒక వ్యక్తి యోగి కావచ్చు మహనీయుడు కావచ్చు. వారియందు భక్తి ఉన్నవారు విశ్వసించనూ వచ్చు. కానీ అంతటి వారెవరైనా చూచి ఫలానా వారు చెప్పింది నిజం. నేను నా దివ్య దృష్టితో చూచాను అని చెపితే దానికి ప్రామాణికత వస్తుంది. శైవ వాఙ్మయంలో బసవేశ్వరుడు తన అవతార విశేషాన్ని గురించి చెప్పినప్పుడు కొందరు నమ్మక సిద్ధరామయ్య అనే ఒక మహా యోగి దగ్గరకు వెళ్ళి బసవేశ్వరుడు చెప్పింది నిజమో కాదో నిర్ణయించమని అభ్యర్థించాడు. సిద్ధరామయ్య తన సూక్ష్మ శరీరంతో కైలాసానికి వెళ్ళి చూచి వచ్చి బసవడు

చెప్పింది నిజమే అని నిర్ధారించాడు. రామకృష్ణుని విషయంలో అటువంటి నిర్ధారణ జరుగలేదు. నిర్ధారణ చేసిన పండితులకు దివ్య దృష్టి లేదు. ఒక్క వేదములలోని వాక్కులు మాత్రం స్వతః ప్రమాణములు. మిగిలిన వేటినీ స్వతః ప్రమాణములని శాస్త్రములంగీకరించవు. కనుక రామకృష్ణులు అన్ని అవతారములలో కెల్ల శ్రేష్ఠులు అని వారి భక్తులు చెప్పటం విశ్వాసమునకు సంబంధించిన అంశం. మహనీయుడైన రామకృష్ణుడే స్వయంగా చెప్పాడు కనుక మేము నమ్ముతున్నాము అన్న మాట కూడ అటువంటిదే. కొందరు చేస్తున్న ఇటువంటి వాదనలలోని సత్యాసత్యాలను ప్రామాణ్యాన్ని నిర్ధారించాలని నే ననుకోవటం లేదు. ఈ ప్రపంచంలో రకరకాల వాదప్రతివాదాలు ఉంటాయి. వాటి వివరాలను, అభిప్రాయాలను పాఠకుల ముందు ఉంచటం జరుగుతున్నది. దీనిని గూర్చి ఎవరి ఇష్టం వారిది. ఎవరి నిర్ణయం వారిది. ఏది ఏమైనా జగత్పూజ్యుడైన మహాపురుషుడతడు. ఆధ్యాత్మిక గగనంలో ప్రకాశించే దివ్య భాస్కరుడు. దీనితో ఎవరికీ భేదాభిప్రాయం లేదు – ఉండదు.

23. నాగ మహాశయుడు

దుర్గా చరణ్ నాగ్ అనే పేరు గల ఈ భక్తుడు అనంతర కాలంలో నాగమహాశయునిగా ప్రసిద్ధి చెందాడు. వివేకానంద స్వామి ఒకసారి ఈయనను గురించి మాట్లాడుతూ "ప్రపంచంలో నేను సంచరించిన ఏ ప్రదేశంలోనూ ఇంతటి మహాత్ముడు కనపడలేదు". దుర్గాచరణ్ బెంగాలులోని ఒక చిన్న గ్రామంలో దీనదయాళ్ నాగ్ అనే సత్పురుషుని కుమారునిగా జన్మించాడు. చిన్నతనమందే తల్లి మరణించటం వల్ల మేనత్త పెంపకంలో పెరిగాడు. రామాయణ భారత కథలు, పురాణ గాధలు బాల్యంలోనే వినడం వల్ల వాటి ప్రభావం అతడి మీద బాగా పడింది. కలలో చాలాసార్లు దేవతలు కనపడేవారు. ఒకసారి ఇలలోనే దయ్యం కన్పించింది. రాత్రిపూట ఒక్కడూ ఇంటికి తిరిగొస్తుంటే స్పష్టంగా దయ్యం కన్పించినా అతడు భయపడలేదు. ఆ దయ్యానికి నేనేమీ కీడు తలపెట్టలేదు కదా! కనుక అది నాకెందుకు అపకారం చేస్తుందని ముందుకు వెళ్ళిపోయాడు. ఆ పిశాచం వెనుకనుంచి పెద్దగా నవ్వటం వినిపించింది. హోమియో వైద్యమభ్యసించి, దానిలో బాగా నైపుణ్యాన్ని సంపాదించి, దానితో ప్రజా సేవ చేస్తుండేవాడు. ఏదైనా ఇష్టపడి ఇచ్చేవారుంటే ఆ ధనాన్ని తీసుకుండేవాడు లేకపోతే లేదు. అప్పటి ఆచారాలను బట్టి చిన్న వయస్సులోనే వివాహం జరిగింది. కానీ ఆధ్యాత్మిక మార్గంలో సాధన చేయదలుచుకున్నవాడు కనుక దానికి బ్రహ్మచర్యం అవసరమని విశ్వసించి, ఆ నియమంతో ఉన్నాడు. దైవ వశాన భార్య అల్ప వయస్సులోనే మరణించింది. ఆమె మరణం దుర్గాచరణ్‌కు బాధ కల్గించినా ఆ వ్యాకులతతో కూడా ఎక్కువ సమయం ధ్యానంలో గడుపుతూ ఉండేవాడు.

పరమేశ్వరుని కోసం తీవ్రవేదన చెందే వ్యక్తికి దానికి కావలసిన వాతావరణం ఈశ్వరేచ్ఛ వల్ల వస్తుందని మహనీయుల చరిత్రలలో కన్పిస్తుంది. అదేవిధంగా వారి

కులగురువు ఒకరోజు వచ్చి జగన్మాత ఆదేశం వల్ల నీకు మంత్రోపదేశం చేయటానికి వచ్చాను అని చెప్పి కాళీమంత్రాన్ని ఉపదేశించాడు. ఈ మంత్ర ప్రాప్తితో దుర్గాచరణ్‌లోని దైవభావన మరింత తీవ్రమయింది. బాహ్య చైతన్యాన్ని కోల్పోయి దేవతా చైతన్యంలో అతడు లీనమై పోయేవాడు. అంటే సమాధి స్థితిలోకి వెళ్ళేవాడు. ఒకరోజు గంగ ఒడ్డున ధ్యానం చేస్తుంటే ఇలానే స్మృతి కోల్పోయినాడు. అలలు ఎగసి వచ్చి అతనిని నదిలోకి ఈడ్చుకొని వెళ్ళినవి. నీళ్ళలో కొంతదూరం వెళ్ళిన తరువాత స్మృతి వచ్చింది. ఈత వచ్చు కనుక ప్రమాదం లేకుండా ఈదుకొని ఇవతలకు వచ్చాడు. వీలైనప్పుడల్లా రాత్రివేళ శ్మశానానికి వెళ్ళి సాధన చేసేవాడు. భౌతిక మాయలో నుండి బయటపడటానికి కాళీదేవి కృప తప్ప వేరే మార్గం లేదని ఆమె కోసం విలపించేవాడు. కొంతకాలం తరువాత తన మిత్రుడైన సురేష్ అనే వ్యక్తి సలహా వల్ల రామకృష్ణ పరమహంసను దర్శించటానికి వెళ్ళాడు. ఆయనను దర్శించిన తరువాత పరమహంస ప్రభావం ఆయన మీద పడింది. దానివల్ల ఐహిక విషయాల మీద ఆసక్తి తగ్గిపోయి తను చేస్తున్న వైద్య వృత్తిని మానేశాడు. సంసారాన్ని వదిలి సన్యాసి కావాలన్న బలీయమైన కోరిక అతనిలో ప్రబలసాగింది. ఈ అంశాన్ని గురుదేవులయిన రామకృష్ణునితో చెప్పి ఆయన అంగీకారం తీసుకోవాలని వెళ్ళగా ఇతడు మాట్లాడకముందే రామకృష్ణుడు మనసును భగవంతుని మీద ఉంచు. గృహస్థుగా ఉండటం కోటలో ఉండి యుద్ధం చేయటం లాంటిది. విదేహ రాజయిన జనకుని వలె తామరాకు మీది నీటి బిందువులా సంసారంలో జీవించు. ఇతరులకు నీ గార్హస్థ్య జీవితం ఆదర్శప్రాయమవుతుంది అన్నాడు. అంతే – పరమహంస వాక్కులను అతడు శిరసావహించాడు. సంసారం నడపటం కోసం తన తండ్రి పని చేసిన వ్యాపార సంస్థలోనే చిన్న ఉద్యోగంలో ఉండి ఎక్కువ కాలం ధ్యానంలో గడిపేవాడు. ఇతడు పనిచేయ లేకపోతే ఇతని మీది అభిమానంతో ఎవరో ఒకరు పని పూర్తి చేసేవారు. సంస్థ యజమానులకు ఇతడంటే ఎంతో నమ్మకం. కలకత్తాలో ప్లేగు వ్యాధి వ్యాపించినపుడు వందలు వేల మంది మరణిస్తున్నారు. ఇతని సంస్థ యజమానులు కూడా భయపడి విశ్వాస పాత్రుడయిన ఇతని అధీనంలో తమ ఆస్తులన్నీ ఉంచి దూరంగా వెళ్ళిపోయి ఆ వ్యాధి తగ్గిపోయిన తరువాత నగరానికి వచ్చారు. యజమానులకు వారి ఆస్థిని లెక్కలలో ఏ లోటూ రాకుండా జాగ్రత్తగా అప్పగించాడు. ధనంమీద, ఆహారంమీద, భార్యమీద (కొంత కాలం క్రింద తండ్రి తనకి రెండో పెళ్ళి చేశాడు). ఆసక్తి ఉండేది కాదు. ఆ భార్య కూడా ఇతని వలెనే నిస్వార్థంతో సేవా భావంతో ఉండేది. తన భర్త అసాధారణ వ్యక్తి, దైవస్వరూపుడు అని గుర్తించిన ఆమె దానికి అనుగుణంగానే తన నడవడిని రూపొందించుకొంది. ఇటు దుర్గాచరణ్ తన గురువైన రామకృష్ణునిలో ఇష్ట దేవత అయిన కాళీమాతను దర్శించేవాడు. ఒకనాడు రామకృష్ణుడు ఇతనిని "నన్ను గురించి ఏమనుకుంటున్నావు' అని అడిగాడు. దుర్గాచరణ్ చేతులు జోడించి "గురుదేవా! నా కళ్ళు తెరచుకొన్నవి. పరమాత్మ అయిన కాళీమాతయే మీరని తెలుసుకొన్నాను" అన్నాడు. అహంకారం ఏ మాత్రం రాకుండా కామక్రోధాలకతీతమైన

పద్ధతిలో జీవించటానికి ప్రయత్నించేవాడు. రోజుల తరబడి అన్నము, నీరు లేకుండా ఉండేవాడు. తీసుకొనే సమయంలో కూడా ఉప్పు, చక్కెర ఉపయోగించేవాడు కాదు. చొక్కాలు, చెప్పులు ధరించటం మానుకొన్నాడు. ఎప్పుడయినా పొరపాటున ఎవరిని గురించయినా విమర్శిస్తూ మాట్లాడితే తనను తాను శిక్షించుకొనేవాడు. ఒకసారి ఒక రాతితో నెత్తురు వచ్చేదాకా తలను కొట్టుకొన్నాడు. ఆ గాయం మానటానికి నెలకు పైగా పట్టింది. 'నాలోని దుష్టునకు ఇది శిక్ష' అని తన చర్యను గురించి వ్యాఖ్యానించాడు.

ఒకసారి తండ్రిని చూడటానికి స్వగ్రామానికి వెళ్ళినపుడు ఒక విచిత్రం జరిగింది. ఇంటి దొడ్డిలో కట్టి వేయబడిన ఒక ఆవు కొంచెం దూరంలో ఉన్న సొర పాదును అందుకోవటానికి గుంజకు కట్టిన త్రాడు కురచ కావటం వల్ల అందుకో లేక పోతున్నది. ఇతడు దయతో దాని త్రాడు విప్పేశాడు. హాయిగా అది సొరపాదును తిన్నది. తండ్రి దీనదయాళ్ దీనిని చూచి కోపించి "పైసా సంపాదించటం లేదు! ఆఖరికి ఇలాంటి పనులు చేసి ఇంకా నష్టం ఎందుకు కలిగిస్తావు? మంచి ఆదాయం వచ్చే వైద్యవృత్తి మానుకొన్నావు. ఇప్పుడు నిన్ను నీవు ఎలా పోషించుకొంటావు?" అని అరిచాడు. దుర్గాచరణ్ నెమ్మదిగా వినయంతో "భగవంతుడు నాకు కూడు గుడ్డా ఎలానో ఇస్తాడు, మీరు దిగులు పడకండి" అన్నాడు. తండ్రి "అవును ఇస్తాడు! చివరకు నీవు కట్టు గుడ్డ లేక తిన తిండి దొరక్క దిగంబరుడవయి కప్పలు తింటూ బ్రతుకుతావు" అన్నాడు. వెంటనే దుర్గాచరణ్ "పెద్దలు, మీ మాట అసత్యం కాకూడదు" అంటూ కట్టుకొన్న గుడ్డలు విప్పేసి ఆవరణలో ఒక ప్రక్కన పడి వున్న చచ్చిన కప్పను తిన్నాడు. ఇది చూసేసరికి తండ్రికి దిగ్భ్రాంతి కలిగింది. తన కుమారునకు పిచ్చి ఎక్కిందని రూఢి చేసుకొని ఇంట్లో వారితో ఇక మీద వీడి మాటల కెవరూ ఎదురు చెప్పకండి ఎప్పుడు ఏమి చేస్తాడో! జాగ్రత్త!" అన్నాడు.

అచంచలమైన గురుభక్తి వల్ల దుర్గాచరణ్‌లో అద్భుత దైవశక్తి ప్రవేశించి ఎన్నో నిదర్శనాలు చూపించింది. కేన్సరుతో బాధపడుతూ మహాసమాధి చెందటానికి కొద్ది రోజులు ముందు రామకృష్ణుని చూడటానికి ఇతడు వెడితే ఎవరితోనో ఆయన నిమ్మపండు తినాలని వ్యక్తం చేస్తున్నాడు. ఆ ఋతువులో నిమ్మకాయలు దొరకవు. కానీ రామకృష్ణుని నోట ఆ మాట వచ్చిందంటే అవి దొరికి తీరుతవని ఇతని విశ్వాసం. కలకత్తాలోనూ ఎన్నో పరిసరాల తోటలలోను వెదికి వెదికి చివరకు నిమ్మపండును సంపాదించి గురుదేవునకు సమర్పించాడు. రామకృష్ణుడు సంతోషించి శారదా దేవిని పిలచి ఇతడు నాకోసం తిరిగి తిరిగి వచ్చాడు, వేడివేడిగా అన్నం పెట్టు అన్నాడు. ఆమె అలానే వడ్డించింది. ఆ రోజు ఏకాదశి కావటం వల్ల ఉపవాస నియమం ఉన్నా గురుదేవులు స్పృశించి ఆహారాన్ని స్వీకరించమనటం వల్ల దుర్గాచరణ్ అన్నం తినటమే కాక భక్తి పారవశ్యంలో విస్తరాకును కూడా తినేశాడు. తరువాత ఒకసారి పరమహంస దుర్గాచరణ్ ! "నా వ్యాధి తగ్గేది కాదని, వైద్యులు ఆశలు వదలివేశారు. నీవేమైనా చేసి నయం చేయగలవా? అన్నారు. దుర్గాచరణ్ ఒక క్షణం ఆలోచించి రామకృష్ణుల

క్యాన్సర్ వ్యాధిని సంకల్ప శక్తి వల్ల తనలోకి మార్చుకోవాలని నిశ్చయించి "గురుదేవా! ఇప్పుడే చేస్తాను మీ వ్యాధిని తొలగిస్తాను" అంటూ దగ్గరికి వెడుతున్నాడు. పరమహంస వెంటనే అతని ఉద్దేశాన్ని గ్రహించి దూరంగా నెట్టివేసి "నీకా శక్తి ఉన్నదని నాకు తెలుసు. అయినా వద్దు" అని నిషేధించివేశాడు. ప్రతిరోజు ఆయన ఇంట్లో సాయంత్రం పూట కాళీ, రామకృష్ణుల చిత్రపటాలు ఉంచి 'ఆరాత్రికం' పాడేవాడు. రామకృష్ణుడు సాక్షాత్ కాళీయే అని ఆయన విశ్వాసం.

ఒకరోజు పక్క ఇల్లు నిప్పంటుకొని కాలిపోవటం మొదలయింది. గాలి విపరీతంగా ఉండటం వల్ల నిప్పురవ్వలు వీళ్ళ ఇంటిమీద కూడా పడుతున్నాయి. మంటలార్పటానికి గ్రామస్థులు ప్రయత్నిస్తున్నారు. దుర్గాచరణ్ భార్య ఇంట్లోని వస్తువులను రక్షించటానికి బయటకు విసిరివేస్తున్నది. దానిని చూచి అతడు అగ్నిదేవునికి నమస్కరించి భార్యతో "భగవంతుని మీద నీకు విశ్వాసం ఇంకా గట్టి పడలేదు. భగవంతు డగ్నిరూపంలో వచ్చాడు. నిశ్చల భక్తితో ఆయనకు నమస్కరిస్తే మన జోలికి ఎందుకు వస్తాడు?" అన్నాడు. పక్క ఇల్లు పూర్తిగా తగలబడిపోయినా ఈయన ఇంటికి ఏమీ కాలేదు.

ఒకరోజు ఇంటి పెరటిలోనికి ఒక పెద్ద నాగుపాము వచ్చింది. ఆయన భార్య భయపడి దానిని చంపటానికి పొరుగు వారిని కేకవేసింది. వెంటనే ఆయన దానిజోలికి ఎవరూ వెళ్ళవద్దని ఆ పాము దగ్గరకు వెళ్ళి "నాగదేవతా! నీ నివాసం అరణ్యంలో ఉన్నది. ఈ పేదవాడి కుటీరం విడిచి పెట్టి వెళ్ళిపో అన్నాడు. అది వెంటనే పడగ వంచి వెళ్ళిపోయింది. ఈ విధంగా ఆయన జీవితమంతా అద్భుతమైన తపస్సుగా సాగింది. అతడు తనను తాను అత్యంత అల్పునిగా భావించు కొనేవాడు. అయినా ఆయన నుండి వ్యక్తమవుతున్న అద్భుత శక్తుల వల్ల ఎందరో ఆయన దగ్గరకు వచ్చి ఆయన మాటల వల్ల స్ఫూర్తి పొందుతూ ఉండేవారు. ఒకసారి ఒక గొప్ప పర్వదినం వచ్చింది. ఆ రోజు గంగలో స్నానం చేస్తే సర్వ పాపములు క్షాళితమవుతవని అఖండ పుణ్యప్రాప్తి కలుగుతుందని ప్రజల విశ్వాసం. ఆ సమయానికి కలకత్తా నుండి తండ్రిని చూడటానికి స్వగ్రామం వచ్చాడు దుర్గాచరణ్. తన కొడుకు రాకకు సంతోషించినా పర్వ సమయంలో గంగా స్నానం చేయవలసి ఉంటే నువ్వు ఎందుకు వచ్చావు? మత ధర్మాల పట్ల నీకు బొత్తిగా నమ్మకం ఉన్నట్లు లేదు. నీ పద్ధతి నాకేమీ అర్థం కావటం లేదు. వెంటనే నన్ను కలకత్తాకు తీసుకువెళ్ళు. గంగా స్నానం చేయాలి అన్నాడు. బలహీనంగా కదలలేని స్థితిలో ఉన్న తండ్రిని గంగా స్నానం కోసం కలకత్తా తీసుకు వెళ్ళటానికి దుర్గాచరణ్‌కు మనస్కరించలేదు. కానీ తండ్రి గంగా స్నానం కోసం పట్టుబడుతున్నాడు. అప్పుడు అప్రయత్నంగా అతని నోటి వెంట ఒక మాట వచ్చింది. "నిజమైన భక్తి ఉంటే మనం గంగ దగ్గరికి వెళ్ళనక్కరలేదు. గంగామాతయే స్వయంగా దర్శనమిస్తుంది అన్నాడు. ఆశ్చర్యంగా పెరట్లో ఒకచోట నేలబద్దలై నీరు పైకి విరజిమ్మటం మొదలుపెట్టింది. అది ఒక పెద్ద ప్రవాహంలా అయింది. దుర్గాచరణ్ అక్కడకు వెళ్ళి

నీటిని తలపై చల్లుకొని జయగంగా మాత ! మమ్ము పునీతులను కావించు అని నమస్కరించాడు. అతని తండ్రి గ్రామస్థులు, అందరూ ఆ నీటిలో స్నానం చేసి ధన్యులైనారు. ఈ విషయాన్ని విన్న వివేకానందస్వామి "నాగ మహాశయుని సంకల్పం అమోఘం. అటువంటి మహాత్ముల కోరిక ఎంతటి పనినైనా సాధిస్తుంది" అన్నాడు. (కాలక్రమాన దుర్గాచరణ్ నాగ్‌ను అందరూ నాగమహాశయుడు అనేవారు)

కాళీదేవి అనుగ్రహం వల్ల రామకృష్ణునియందలి అచంచలమైన భక్తి వల్ల ఎన్నో దివ్యశక్తులు వరించినా ఆయన వానిని ఎన్నడూ ప్రదర్శించేవాడు కాదు. ఆయన ఎవరినీ శిష్యునిగా స్వీకరించలేదు. ఎవరికీ మంత్రోపదేశం చేయలేదు. నేనే అందరికీ శిష్యుణ్ణి అనేవాడు. శరశ్చంద్రుడనే యువకుడు అనంతర కాలంలో నాగమహాశయుని జీవిత చరిత్రను రచించాడు. అతడు ఒకసారి తనకు మంత్ర దీక్ష ఇమ్మని నాగమహాశయుని ఎంతో బ్రతిమలాడితే, నాగమహాశయుడు "నీకు నేను కాదు మంత్రదీక్ష ఇచ్చేది. సాక్షాత్ పరమశివుడే నీకు మంత్రోపదేశం చేసేది" అన్నాడు. ఇది ఎలా జరుగుతుందో అని ఆ యువకుడు కొంతకాలం వేచి ఉన్నాడు. ఒకసారి ఆలంబజార్ మఠంలో ఉన్న వివేకానంద స్వామిని చూడటానికి వెళ్ళినప్పుడు అక్కడ ఒక గదిలో సాక్షాత్ శివుడే పడుకొని ఉండటం అతనికి కనిపించింది. కొంతసేపటికి ఆ శరీరం వివేకానందునిది అని తెలుసుకొన్నాడు. ఇతని అభ్యర్థన మీద వివేకానందుడు మంత్రదీక్ష ఇచ్చాడు. నాగమహాశయుని వాక్కు ఈ రకంగా ఫలించింది.

నాగమహాశయు డెన్నడూ తీర్థయాత్ర చేయలేదు. మరణసమయానికి రెండు రోజులు ముందు రామకృష్ణ పరమహంస ధ్యానంలో కన్పించి కాశీ ప్రయాగ మొదలైన క్షేత్రాలను తీర్థాలను చూపించాడు. తాను చూస్తున్న వాటి వివరాలను భక్తుడైన శరత్‌బాబుకు వర్ణించి చెప్పాడు. శరత్‌బాబుతో ప్రయాణానికి బయలుదేరాలి. శుభముహూర్తం పంచాంగం చూసి చెప్పు అన్నాడు. శరత్ ముహూర్తాన్ని తెలియచేయగానే, ఈ ముహూర్తానికే బయలుదేరి వెడతాను అన్నాడు. అదే ముహూర్తానికి 1899 డిసెంబరు 27వ తేదీ మహా సమాధిలోకి వెళ్ళిపోయినాడు.

24. ఆనందమాయి

తూర్పు బెంగాల్‌లో ధియోరా గ్రామంలో 1896 ఏప్రియల్ 30వ తేదీ ఒక పేద బ్రాహ్మణ కుటుంబంలో ఆనందమాయి జన్మించింది. చిన్నతనం నుండి తోటి బాలబాలికల యందే కాక పశుపక్ష్యాదులయందు కూడా ఆమె ప్రేమానురాగాలు చూపించేది. బెంగాల్‌లో మత్స్య భక్షణం తప్పుకాదు. కాని ఈమె వాటిని ముట్టేది కాదు. ఆనందమాయి అని పెద్దలు పెట్టిన పేరు సార్థకమయ్యే విధంగా దివ్యానంద స్వరూపిణిగా ప్రకాశించేది. 13వ

సంవత్సరంలో ఆమెకు భోలానాథ్ అనే యువకునితో వివాహం జరిగింది. 18ఏండ్ల వయస్సు వచ్చిన తర్వాత ఈమెను కాపురానికి పంపించారు. అయితే లోక సహజమైన దాంపత్య బంధం వారిద్దరి మధ్య ఏర్పడలేదు. పడకగదిలో ఆమెను ముట్టుకోగానే ఆమె భర్త భోలానాథ్‌కు కరెంట్ షాక్ కొట్టినట్లైంది. ఆ విద్యుద్ఘాతానికి భయాశ్చర్యమును పొంది భార్యతో ఇదేమిటి? అన్నాడు. చిన్నతనం నుండి నా స్థితి ఇలానే ఉన్నది. పరమేశ్వర చైతన్యం – నేను ఒకటైనట్లుగా అనిపించేది. సాంసారిక బంధముల మీద నాకు ఆసక్తి లేదు. కామ భావనకు నా మనస్సులో స్థానం లేదు. పరమేశ్వరి నా శరీరాన్ని, కామబంధ బంధిత కావటానికి ఇష్టపడటం లేదు. కనుక మీరింక ఆ దృష్టితో నన్ను చూడకండి. విషయమేమిటో అర్థం కాక భోలానాథ్ అప్పటికి ఊరుకున్నాడు. ఒకరోజు ఆ ఊరి దుర్గామందిరంలో అమ్మవారి పూజలు జరుగుతున్నవి. ఆనందమాయి ఆమె భర్త కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్ళారు. భక్తుడొకరు పరమేశ్వరిని మధురంగా గానం చేస్తున్నాడు. ఆ పాటలు వింటూ ఆనందమాయి సమాధి స్థితిలోకి వెళ్ళింది. ఆమె స్పృహలో లేనట్టు ఆమె భర్త మొదలైనవారు గుర్తించారు. ఆమె ముఖంలో అలౌకికమైన కాంతి ప్రసరిస్తున్నది. భోలానాథ్ స్నేహితుడొకడు మంచి ధ్యాన సాధకుడు. అత డామెను దుర్గామాతగా సంబోధిస్తూ ఆమె కాళ్ళమీద పడ్డాడు. చూచేవారిలో సంచలనం కలిగింది. ఈమె సామాన్య వ్యక్తి కాదు అనే విషయం వ్యక్తమైంది. రెండేళ్ళు గడచిన తర్వాత తీవ్రమైన అనారోగ్యానికి గురైతే తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్ళారు. రెండు సంవత్సరాలు పుట్టింటిలోనే ఉన్నది. ఆ తర్వాత మళ్ళీ భర్త వద్దకు వెళ్ళింది.

ఇంట్లో పనులు చేస్తున్నా విశ్రాంతి సమయంలో కూర్చుంటే చాలు ఆమెలోనుండి సంస్కృత శ్లోకాలు, ఏవేవో మంత్రాలు వచ్చేవి. ఏ ప్రయత్నమూ లేకుండా ఆమె శరీరం వివిధములైన యోగముద్రలను పొందేది. ఆమె మహనీయురాలన్న పేరు ప్రచారం కావటంతో రకరకాల బాధలు కలవారు ఆమె వద్దకు వచ్చేవారు. ఆమె తాకితే చాలు బాధలు నయమయ్యేవి. అయితే ఇంటిలోని వారు మాత్రం అంత సులభంగా నమ్మలేదు. ఎప్పుడూ శ్లోకాలు మంత్రాలు పలుకుతూ ఉండటం తనలో తాను మాట్లాడుకోవటం ఇవి పిచ్చి లక్షణాలుగా వారు భావించారు. అంతేకాక ఏ దయ్యమో పట్టిందని అనుమానించారు. ఆ ప్రాంతంలో ప్రసిద్ధుడైన భూత వైద్యునొకరిని పిలిపించి చూపించారు. అత డీమెపై తీవ్ర మంత్ర ప్రయోగం చేశాడు. అనూహ్యంగా అది బెడిసి కొట్టింది. అతడు కేకలు వేస్తూ క్రింద పడిపోయాడు. ఆనందమాయి అతని బాధను తొలగించింది. చూచేవారికి ఆశ్చర్యం కలిగింది. ఇంట్లోని పెద్దలు ఆ మాంత్రికుని శక్తిని మించిన మహాభూతమేదో ఈమెలో ఉండి ఉంటుందనుకొన్నారు. మరి కొందరు మాంత్రికులను పిలిపించారు. ఎవరివల్లా ఏమీ కాలేదు. చివరికొక గొప్ప యోగి వచ్చి చూచి ఈమెలో ఏ దయ్యమూ లేదు భూతమూ లేదు. ఇది దైవశక్తి. ఈమెలోని లక్షణాలు దివ్యోన్మాద చిహ్నాలు. దేవీభక్తితో పరవశించిపోతున్నది. ఈమెకు కలుగుతున్నది వేదశాస్త్రములలో చెప్పబడిన సమాధి దశలు.

మీ రింక ఈమెను గూర్చి విచారించవలసిన పనిలేదు. ఆమె ఎప్పుడు ఏ స్థితిలో ఉండాలో పరమేశ్వరి నిర్దేశిస్తుంది. ఇక మీదట మీ రీమెను డాక్టర్లకు చూపించటం కాని, భూతవైద్యులకు చూపించటం కాని చేయవద్దు అని చెప్పి వెళ్ళాడు. అతడు చాలా గొప్ప వ్యక్తి, గౌరవనీయుడు కావటం వల్ల ఆమె భర్తకు కుటుంబ పెద్దలకు ఈమె ఆధ్యాత్మిక స్థితియందు విశ్వాసం కలిగింది.

ఈ విధంగా కొంతకాలం గడచిన తరువాత ఒకరోజు ఆమె భర్త భోలానాధ్ ఇలా అన్నాడు. నీలో ఏదో దైవశక్తి ఉన్నట్లు అందరూ అంటున్నారు. నీ విచిత్రమైన ప్రవర్తన సామాన్య గృహిణి యొక్క పద్ధతికి భిన్నంగా ఉన్నది. మనిద్దరి మధ్య లోక సహజమైన సాంసారిక బంధం ఏర్పడలేదు. నీలో దివ్యశక్తులున్నట్లు నాకింకా నిశ్చయం కలుగలేదు. నిజంగా నీలో శక్తి ఉంటే నిరూపించు అప్పుడు నమ్ముతాను అన్నాడు. భర్తయందు కలిగిన కరుణ వల్ల ఆమె అంగీకరించింది. “నేను మీకు మంత్రోపదేశం చేస్తాను. దానిని స్వీకరించండి. ఇది లోకాచార విరుద్ధం కావచ్చు. భార్య భర్తకు మంత్రోపదేశం చేయటం మన కుటుంబాలలో ఆచారం కాదు. కాని నా స్థితి వీటి కతీతమైనది. నాలో అనంతమైన దివ్య చైతన్యం ప్రవహిస్తున్నది. నేను సర్వేశ్వరుడైన నారాయణుడనని ఒక క్షణం అనిపిస్తుంది. అదే సమయంలో నారాయణియైన కాళిని నేనే అన్న భావన కలుగుతున్నది. అనంతాకాశంలో నీలతోయదమండలం నుండి లోకానికి దివ్యశక్తి ప్రవహిస్తున్నది. మా కుటుంబం గురించి నన్ను గురించి పెళ్ళి చేసుకోకముందు విచారణ చేశారు. నేనెక్కడా ఏమీ చదువుకోలేదని మీకు తెలుసు. కాని అప్రయత్నంగా నా వాక్కు నుండి నాలోని దేవతలు పలుకుతున్నారు. పరమేశ్వరి నన్ను ఎలా నడిపిస్తుందో ఎటువైపు తీసుకెళ్ళుతుందో త్వరలో నిర్ణయమౌతుంది. ప్రస్తుతం మీకు నేను గురువును. మీరు నా శిష్యులు. ఈ సంబంధమే ఇప్పుడూ ఇకముందు కూడా” అని అన్నది. భర్త భోలానాధ్ దిగ్భ్రాంతి చెందాడు. ఈ మాటలు పలుకుతున్నది నా భార్యయేనా! ఎవరీ వనిత? కలకత్తా కాళి వలె, గంభీరమైన ఈ మూర్తి సామాన్య స్త్రీ కాదా; తేజస్సంపన్నమైన ఈమె ముఖంలో ఊహకందని శక్తియేదో ప్రసరిస్తున్నది. ఆమె నుండి ఉపదేశం పొందటానికి సిద్ధమైనాడు. ఆ రాత్రి సమయంలో ఏకాంతంగా వారిద్దరూ తప్ప ఇతరులెవరూ లేని వేళ హస్త మస్తక దీక్షనిచ్చి ఆనందమాయి తన భర్తకు మంత్రోపదేశం చేసింది. మంత్రాన్ని వింటూ అతడు సమాధిస్థితిలోకి వెళ్ళాడు. కళ్ళు తెరచి చూచేసరికి కొన్ని గంటల కాలం గడిచి పోయింది. ఇప్పుడతడు తన భార్య యొక్క దివ్యత్వము నందు విశ్వాసము చెందినవాడైనాడు. అప్పటి నుండి ఆమె సాధనకు ఏ ఆటంకము లేదు. దాదాపు మూడు సంవత్సరాలపాటు ఆమె ఎక్కువ కాలం ధ్యాన సమాధిలో ఉండేది. ఆమె తీవ్రధ్యానంలో ఉన్నప్పుడు ఆమె ముఖమండలం పద్మరాగ ఛాయతో అరుణారుణ కాంతులతో విరాజిల్లుతుండేది. 1930వ సంవత్సరంలో ఒకసారి ఆమె నాలుగు రోజులు కూర్చున్న చోటు నుండి కదలలేదు. శరీరంలో చలనం లేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఆగిపోయినవి. ఆమె మరణించేదేమో! అని అందరూ భయపడ్డారు. కాని ఆమె కూర్చునే ఉన్నది. శరీరంలో

చలనం లేదు కాని కాంతి తగ్గలేదు. నాలుగు రోజుల తర్వాత ఆమె మళ్ళీ స్పృహలోకి వచ్చింది. ఈ స్థితిలో ఆమెకు మనిషితోడు అవసరమైంది. భర్త ఉద్యోగి కావటం వల్ల ఇంట్లో ఉండటం కుదరదు. అందువల్ల భోలానాథ్ తన బంధువు భార్య ఒక వితంతువును ఆమెకు తోడు ఉండటానికి పిలిచాడు. ఆమె తల్లిదండ్రులకు కూడా కబురుచేసి రప్పించాడు. ఆమె ఒకసారి ఢాకా పట్టణంలో తిరుగుతూ ఊరి బయట అడవిలాగా ఉన్న ప్రదేశంలో ఒక పురాతన కాళీదేవి ఆలయం చూచింది. ఇది నా దేవతగుడి. నే నిక్కడే ఉంటాను అన్నది ఆనందమాయి. ఎక్కువకాలం అక్కడే ధ్యానం చేస్తూ గడపటం మొదలుపెట్టింది. ఇప్పటికే ఆమెకు భక్తులు అభిమానులు చాలమంది ఏర్పడ్డారు. ఆ కాళీదేవి గుడిని బాగు చేసి అక్కడొక పెద్ద ఆశ్రమాన్ని నిర్మించాలని వారంతా పూనుకున్నారు. ఆ శిధిలాలయాన్ని మరమ్మత్తులు చేయటానికి నూతన భవనాలు నిర్మించటానికి నేల త్రవ్వుతూ ఉంటే చాల అస్థిపంజరాలు బయట పడేవి. ఒకసారి ఒక యోగి యొక్క సమాధి కూడా కనిపించింది. ఇది ఒకప్పుడు శ్మశానమేమో! ఈ దేవత శ్మశాన కాళీ దేవత అయి ఉంటుంది అనుకొన్నారు కొందరు. ఆశ్రమం నిర్మితమైంది. దేవాలయ జీర్ణోద్ధరణ జరిగింది. అమ్మవారి ఆలయంలో పూజలు ప్రారంభమైనవి. అక్కడి ఆచారం ప్రకారం కాళీ ఆలయంలో పూజ అంటే జంతు బలి ఇచ్చి తీరాలి. ఆనందమాయికి ఆపని పెద్దగా ఇష్టం లేకపోయినా భక్తుల కోరిక మీద ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించింది. కాళీమాత ఆమెయందు అనుగ్రహం చూపించింది. ఆ పురాతన శ్మశాన భూమిలో మహాకాళి ఆలయంలో చాలాకాలం ఆమె నిరంతర జపధ్యానములతో గడిపింది. దేవతతో తాదాత్మ్యభావన కల్గి పూజకు కూర్చున్నపుడు అమ్మవారి కోసం ఏర్పాటు చేసిన గంధాన్ని తన శరీరానికి రాసుకున్నది. పూలను తనపై తానే చల్లుకున్నది. వరదాభయ ముద్రలతో నిశ్చల స్థితిలో తానే భద్రకాళి వలె దర్శనమిచ్చింది.

రోగాలు పోగొట్టమని ఆమె దగ్గరకు ఎందరో వచ్చేవారు. తరచుగా వాటిని ఆమె వెంటనే నయం చేసేది. కొన్నిసార్లు రోగుల రోగాలను తన శరీరం మీదికి తీసుకొని వాళ్ళ జబ్బు పోగొట్టేది. ఒక్కొక్కసారి రోగులు స్వయంగా రాలేక తమ వారి ద్వారా విజ్ఞప్తులు పంపుకొంటే ఎంత దూరంగా ఉన్నా కూడా ఆమె వారి బాధలను పోగొట్టేది. కలరా, క్షయ వంటి వ్యాధులతో వందల మైళ్ళ దూరంలో బాధపడేవారిని కూడా ఆమె బాధా విముక్తులను చేసిన ఘట్టాలు ఎన్నో ఉన్నవి.

భజనలు, సంకీర్తనలు జరిగేటపుడు ఆమె తరచుగా సమాధి స్థితిలోకి వెళ్ళేది. కొన్నిసార్లు మెరుపు కంటే వేగంగా నాట్యం చేసేది. ఒకసారి అనూహ్యమైన చిత్రం జరిగింది. సిద్ధేశ్వరీ క్షేత్రంలో ఉండగా, భజనలు జరుగుతున్నపుడు, అందరూ చూస్తూ ఉండగా ఆమె శరీరం కుంచించుకు పోయింది. తరువాత కాసేపటికి నెమ్మదిగా మళ్ళీ పెరిగి మామూలు స్థితికి చేరుకొన్నది. ఆమె శ్వాస నుండి, ఆమె ధరించిన దుస్తుల నుండి, ఆమె శయనించిన పక్క వస్త్రాల నుండి, సువాసనలు వస్తూండేవి. చాలాకాలం ఆహారం విషయంలో

నియమితంగా ఉండేది. ఘనపదార్థాలనే కాక ద్రవపదార్థాలను కూడా విడిచిపెట్టి 23 రోజులు శుష్కోపవాసం చేసింది. చెట్టు నుండి రాలిపడిన 2 లేక మూడు పండ్లను మాత్రమే తీసుకొంటూ ఆరు నెలల కాలం తపస్సు చేసింది. స్వతస్సిద్ధంగా చెట్టు నుండి రాలిన పండు జీవహింస క్రింద రాదని ఆమె అభిప్రాయం. మరొకసారి రోజూ రెండుసార్లు 3 ముద్దల చొప్పున అన్నం తింటూ 8 నెలలు గడిపింది. వేరొకసారి మూడు రోజులకొకసారి అత్యల్పమైన ఆహారం తీసుకొంటూ 5 నెలలు ధ్యానంలో ఉన్నది. భక్తులు మరీ మరీ ప్రార్థిస్తే అత్యాహార స్వీకారం కూడ చేసిన సందర్భములున్నవి. ఒక పర్యాయం 70 రొట్టెలు తగినంత కూరతో ఒకేసారి తిని పెద్ద బేసిను నిండా పాయసం త్రాగింది. అలానే పాలతో చేసిన 40 పౌండ్ల మధుర భక్ష్యం ఒక్కసారిగా తిన్నది. ఇది ఇలా ఉండగా – నిరంతర అన్నదానం ఆమెకు చాలా ఇష్టమైన అంశం.

ఉత్తర మధ్య భారత ప్రాంతంలో సంచారం చేసి ఎన్నో దివ్య క్షేత్రాలను దర్శించింది. వింధ్యాచల ప్రాంతంలో ఒక ప్రాచీన క్షేత్రాన్ని గుర్తించి ప్రభుత్వానికి తెలియపరిచింది. వారక్కడ త్రవ్వకాలు చేయించగా ఎన్నో విశేషాలు బయటపడ్డవి. అయోధ్య, హరిద్వార్, వారణాసి మొదలైన క్షేత్రాలలో అసంఖ్యాక భక్త జనాన్ని ఆమె ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్ళించింది. దేశంలోని ప్రసిద్ధులైన వ్యక్తులెందరో ఆమెకు భక్తులై ఆధ్యాత్మిక చైతన్యాన్ని పొందారు. ఆమె ఎక్కడఉంటే అక్కడ సాధువులు, విద్వాంసులు, రాజకీయనాయకులు, సామాన్యులు, ధీమాన్యులు విపరీతంగా చేరేవారు. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులైన పాశ్చాత్యుల కింక కొరత లేదు. జవహర్‌లాల్ నెహ్రూ భార్య కమలాదేవి, ఏకాగ్రతను ప్రసాదించమని ప్రార్థించగా ఒక్కక్షణంలో ఆమెకు సమాధి స్థితిని ఆనందమాయి ప్రసాదించింది. ఆతరువాత జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ కూడా ఆమె భక్తులయినారు. ఆమె భర్త భోలానాథ్, భర్త స్థానాన్ని వదలి భక్తునిగా స్థిరపడి అందరివలెనే తాను కూడా ఆమెను 'మా' అనే సంబోధించేవాడు. ఆమె ఆదేశం ప్రకారం 3 సంవత్సరాలు ఏకాంతంగా హిమాలయాలలో ధ్యానం చేసి, ఆతరువాత కొంత కాలానికి శరీరాన్ని వదలి ఆమె అనుగ్రహం వల్ల ఊర్ధ్వగతులకు వెళ్ళిపోయినాడు. 43 ఏండ్ల వయస్సులో ఆమెకు కాన్సర్ వ్యాధి వచ్చింది. దానికోసం చేసే చికిత్సా విధానం ఆమెకు నచ్చలేదు. ఏ మందుతోను అవసరం లేకుండానే ఆ వ్యాధి దానంతటదే కొంతకాలానికి మాయమయింది.

'శక్తి పాత' విధానంలో ఆమె ఎందరి శరీరాలలోకో తన శక్తిని అలలు అలలుగా పంపించేది. ఆమె తీక్షణంగా చూస్తే విద్యుత్ ప్రసారం కలిగిన అనుభవాలు ఎంతమందికో వచ్చినాయి. ఆమె స్వప్నంలో మాకు మంత్రోపదేశం చేసిందని కొందరు తమ అనుభవాలను ప్రకటించారు. బిడ్డలను పోగొట్టుకొన్న వ్యక్తులు దుఃఖంతో ఆమె దగ్గరకు వచ్చి ఆమెలో తమ బిడ్డను దర్శించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. రాం – అలెగ్జాండర్ అనే పాశ్చాత్య భక్తుడు ఆమెను చూస్తే దేవిని చూచినట్లున్నదని వ్రాసుకొన్నాడు. స్టెఫెన్ క్వాంగ్ అనే అమెరికన్

జాతీయుడు. ఆమె శరీరం నుండి కొన్ని వందల గజాల వరకు కాంతి తరంగాలు ప్రసరిస్తున్నాయని వర్ణించాడు. అతడే 'ఉమానంద' అన్న పేరుతో సన్యాసి అయినాడు. అస్ట్రియా రాజవంశానికి చెందిన 'బ్లాంకా' అనే స్త్రీ సన్యాసినియై ఆమె చేత ఆత్మానంద అన్న పేరు పొందింది. అనంతర కాలంలో ఈమెయే ఆనందమాయి బోధనలను ఇంగ్లీషులోకి, మరికొన్ని యూరోపియన్ భాషలలోకి అనువదించి ప్రచురించింది. బృందావన ధామంలో కొంతకాలం నివసించిన ఆనందమాయి రాధాకృష్ణ ప్రేమతత్వాన్ని హృదయగతం చేసుకొని రాసేశ్వరి వలె హ్లాదినీ శక్తి తరంగాలను తన చుట్టూ ప్రసరింపచేసేది. ఇప్పటికీ బృందావనంలో ఆమె ఆశ్రమం ప్రేమ భక్తులను ఆకర్షిస్తునే ఉన్నది. ఢాకాలోని ఆమె ఆశ్రమాన్ని, కాళీ మందిరాన్ని తరువాతి కాలంలో పాకిస్తాన్ సైనికులు ధ్వంసం చేయడం బాధాకరమైన అంశం. తిమోతీ కాన్వే అనే పాశ్చాత్యుడు ఆమె శరీరాన్ని విడిచిపెట్టేముందు మూడు రోజులకు పూర్వం ఒక అద్భుతమైన స్వప్నానుభవాన్ని పొందాడు. చాలా సంవత్సరాల క్రింద నీటిలో మునిగి మరణించిన అతని సోదరి ఒక హిందూ దేవాలయంలో ఆనందమాయి సన్నిధిలో మరికొందరు పుణ్యాత్ములతో కలిసి ఉన్నట్లు కనిపించింది. ప్రేమమయమైన ఒక పెద్ద వెలుగులో తాము మునిగిపోయినట్లు కలిసిపోయినట్లు అతనికి అనిపించింది. అతనికి ఈ అనుభూతి కలిగిన 3 రోజులకు 1982 ఆగస్టు 27వ తేదీ పాంచ భౌతిక శరీరాన్ని విడిచిపెట్టి ఆనందమాయి దివ్యభూమికలకు వెళ్ళిపోయింది. డెహ్రాడూన్‌లో మరణించిన ఆమె శరీర అవశేషాలు హరిద్వార్‌కు దక్షిణాన ఉన్న 'కంఖాత్' అశ్రమంలో నిక్షిప్తం చేయబడినవి. పార్థివశరీరం పతనమయిన తరువాత కూడా ఆమె ఎందరికో దర్శనమిచ్చింది. ఎందరి బాధలనో పోగొట్టింది. కాళీభక్తురాలిగా సాధన ప్రారంభించిన ఆమె సగుణ మార్గం నుండి నిర్గుణ మార్గం వైపు వెళ్ళి కాలపు లోతులకు చొచ్చుకొని వెళ్ళి తానే ప్రసన్న కాళికగా మూర్తీ భవించి ఈనాడు కూడా సిద్ధ మండలం లోనుండి ఆశ్రితులను అనుగ్రహిస్తున్నది.

26. అన్నదా ఠాకూర్

బంగ్లాదేశ్‌లో చిటగాంగ్ దగ్గర ఉత్తర గుజరా రౌజాన్ అనే గ్రామంలో ఇత డుద్భవించాడు. క్రీ.శ.20వ శతాబ్దపు ప్రారంభంలో ఆయుర్వేద వైద్యునిగా ఉండాలన్న దృష్టితో దానికి సంబంధించిన పరీక్షలలో ఉత్తీర్ణుడై ఏడు కొత్త రకాల మందులు కనుక్కొన్నాడు. వివిధ వ్యాధులను చాలా త్వరగా ఆ మందులు పోగొట్టటం వల్ల అతడికి ఆ రాష్ట్రమంతా మంచి పేరు వచ్చింది. కలకత్తాలో తన స్వంత వైద్యాలయాన్ని స్థాపించే ఉద్దేశ్యంతో అన్ని ఏర్పాట్లు చేసుకొన్నాడు.

పూర్వ జన్మ సంస్కారం వల్ల అతడి ఆంతర జీవితంలో చిత్రమైన మార్పులు రావటం మొదలైంది. ఒకరోజు అతడు బజారులో వెడుతూ ఉండగా ఒక పెద్ద కాళీ విగ్రహాన్ని

నలుగురు బాలికలు కలిసి మోసుకు వెడుతూ ఉండటం చూచాడు. ఆ విగ్రహం గంధపుష్పాదులతో అలంకరించబడి ఉన్నది. బహుశా! గంగా నిమజ్జనం కోసం తీసుకు వెడుతున్నారేమో అనుకున్నాడు. రోడ్డుకు ఒక ప్రక్కన ఆగి రెండు చేతులూ జోడించి కాళీదేవికి నమస్కారం చేశాడు. విగ్రహంతో ఆ బాలికలు ముందుకు వెళ్ళిపోయినారు. అప్పుడొక పెద్దమనిషి ఇతనిని చూచి ఆగి "ఎవరయ్యా నువ్వు? చదువుకొన్న వానివలె ఉన్నావు! నీ పేరేమిటి? నీ ఊరేమిటి? అన్నాడు. "నా పేరు 'అన్నదా చరణ్ భట్టాచార్య'. తూర్పు బెంగాలులోని చిటగాంగ్ నుండి వచ్చాను. ఆయుర్వేదం డాక్టరును అన్నాడు. అప్పుడా అవతలి వ్యక్తి "నీ విపు డెవరికి చేతులు జోడించి నమస్కారం చేశావు"? అన్నాడు. అన్నదా "ఇప్పుడే కదండి కాళీదేవి విగ్రహాన్ని మోసుకొంటూ నల్గురు బాలికలు వెళ్ళారు". ఆ దేవతంటే నాకు భక్తి కనుక నే నా శ్యామకు నమస్కారం చేశాను" అన్నాడు. పెద్దమనిషి "ఇప్పుడు ఏ ఊరేగింపూ వెళ్ళలేదు. ఏ బాలికలూ కాళీదేవి విగ్రహాన్ని తీసుకు వెళ్ళటం జరుగ లేదు. నీకేదో భ్రాంతి కల్గింది. కావాలంటే దోవన పోతున్న నల్గురిని అడిగి చూడు అన్నాడు. ఇతడు వెంటనే బాటసారులు కొందరిని అడిగాడు. "కాళీదేవిని మోసుకు వెడుతున్నట్లు ఎవరూ అంగీకరించలేదు. ఒకతను మాత్రం చిరునవ్వు నవ్వుతూ "నీకేమైనా పిచ్చి పట్టిందా? ఇవాళ బుధవారం కాదు, ఆదివారం కాదు, ప్రతిపత్ తిథి కాదు. పంచమి కూడా కాదు, ఇవాళ పూర్ణిమ కాదు, అమావాస్య కాదు. చతుర్దశి పూజానంతరం నిమజ్జన దినం కాదు, ఎవరితోనూ ఇలా మాట్లాడవద్దు. ఇలా ఇంకెవరినైనా అడిగితే నిన్ను పిచ్చివాడనో వేళాకోళం ఆడుతున్నాడనో అనుకుంటారు" అన్నాడు.

అన్నదా దిగ్భ్రాంతుడయినాడు. నిశ్శబ్దంగా ఆ ప్రదేశం నుంచి కదలి తాను నివసించే గదికి చేరుకొన్నాడు. అక్కడి మిత్రులతో కలసి ప్రార్థన చేసే ప్రత్యేక గదిలోకి వెళ్ళి ఎదురుగా ఉన్న దక్షిణేశ్వర కాళి చిత్రం ముందు కూర్చున్నాడు. పరమేశ్వరి అయిన శ్యామకాళిని చూస్తూ ఉండగా కన్నులు మూతలు పడినవి. అతడికి కాళీదేవి కన్నుల ముందు జీవన్మూర్తిగా కనిపించింది. చాలాసేపు భావసమాధిలో ఉన్న తరువాత మామూలు స్థితికి వచ్చిన అతని హృదయంలోనుండి జగజ్జననిపై కమనీయమైన కవిత వెలువడింది.

కొన్నాళ్ళ తరువాత అతడు తన స్వగ్రామానికి వెళ్ళాడు. అక్కడ ఉండగా ఒకరోజు ఒక యోగి వారి ఇంటికి వచ్చాడు. విశాలమైన నేత్రములు ఆజానుబాహువులు. పెద్దజుట్టు, చేతిలో కమండలువు, పులితోలు నడుముకు చుట్టుకొని వచ్చిన ఆ సాధువును చూచి అతనికి స్వాగతం చెప్పి మర్యాదలు చేశాడు. అన్నదా అతనికి సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. ఆ సాధువు ఈ పూట నాకు భోజనం ఏర్పాటు చేయండి అన్నాడు. అన్నదా తల్లి భక్తి శ్రద్ధలతో శాకపాకములు చేసి ఆయనకు పెట్టింది. తృప్తిగా భోజనం చేసిన తరువాత అతడు వెళుతూ అన్నదాకు ఒక తాయత్తు ఇచ్చి దీనిని ధరించమన్నాడు. ఆ సాధువు వెళ్ళిపోయిన తరువాత అతను చెప్పిన విధంగా ఇతడు తాయత్తు కట్టుకొన్నాడు. పదిరోజుల

తరువాత కలలో ఆ సాధువు కనపడి "తాయత్తు నీకిచ్చిన ప్రయోజనం నెరవేరింది. నీదగ్గర ఇంక అది ఉండవలసిన అవసరం లేదు. దానిని తిరిగి నాకు ఇవ్వు' అన్నాడు. అన్నదా దానిని ఇచ్చి వేశాడు. కలలో నుండి మెళకువ వచ్చి చూస్తే చేతికి కట్టుకొన్న తాయత్తు లేదు. ఇది జరిగిన 3, 4 రోజుల తరువాత అతని తల్లికి మరొక కల వచ్చింది. అందులో వారి దేవతా మందిరంలో వారు పూజించే 'దశభుజదుర్గ' సన్నిధిలో ఆ సాధువు కనిపించి "అమ్మా! నీ కుమారుడు దేవకార్య నిర్వహణ కోసం వచ్చినవాడు. మీ ఇంటిలోనే ఉండటం తగదు. నాతో పంపించు" అని అర్థించాడు. దుర్గాదేవి ఈమె వైపు చూచి "ఆ సాధువు చెప్పిన ప్రకారం చేయి" అన్నది. తల్లి అంగీకరించింది. అన్నదా ఆ సన్యాసి వెంట బయలుదేరి వెడుతున్నాడు. ఇంతలో ఆమెకు మెళకువ వచ్చింది. తన బిడ్డ తనను విడిచిపెట్టి ఎక్కడికో వెడతాడన్న భావన ఆమె భరించలేక పోయింది. వెంటనే తన కుమారుని పిలచి తనకు వచ్చిన కలను గురించి చెప్పి ఏడవటం మొదలు పెట్టింది. అన్నదా తల్లిని ఓదార్చి "పరమేశ్వరి సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. నేను ఎక్కడ ఉన్నా నీవు పిలచినపుడు తప్పక వస్తాను. నీవు బాధపడవద్దు" అని వాగ్దానం చేశాడు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకు అన్నదాకు మళ్ళీ చిత్రమైన కల వచ్చింది. దానిలో కాషాయ వస్త్రధారి అయిన సన్యాసి ఒకరు కనిపించి "కాళీదేవి విగ్రహాన్ని నీకిస్తాను. వెంటనే కలకత్తా రా" అని ఆజ్ఞాపించాడు. మెళకువ వచ్చిన తరువాత తల్లిని కుటుంబ సభ్యులను విడిచిపెట్టి పోవటం ఇష్టం లేక అతడు కొంత తాత్సారం చేశాడు. తల్లి, అన్నగారు కూడ ఈ విషయం విని "కొన్నాళ్ళుండు, తరువాత పోవచ్చులే" అన్నారు. ఆ రోజు రాత్రి మళ్ళీ కల వచ్చింది. దానిలో ఆ సన్యాసి మళ్ళీ కనిపించి రేపు కనక నీవు బయలుదేరకపోతే పెద్ద ప్రమాదం జరుగుతుంది జాగ్రత్త అని హెచ్చరించాడు. తెల్లవారిన తరువాత ఏమి కాబోతుందిలే అని ప్రయాణం కాలేదు. ఎందుకంటే అతనికి కొత్తగా పెళ్ళి అయింది. ఇంకా కాపురం మొదలు పెట్టలేదు కాని, ఆ అమ్మాయి ఇంటికి వచ్చి ఉన్నది. ఆ రోజు ఉన్నట్లుండి ఇతడు నివసించే గది ప్రక్కన ఉన్న గోశాలలు రెండూ తగలబడ్డవి. మిగతా ఇల్లు దగ్ధం కాకుండా అతి కష్టం మీద ఆపగలిగారు. ఇంక ఆలస్యం చేయటం ఇంకే ప్రమాదానికి దారితీస్తుందో అని వియోగ దుఃఖంతో ఉన్న భార్యను మిగతా వారిని విడిచిపెట్టి అన్నదా కలకత్తాకు బయలుదేరి వెళ్ళాడు.

అక్కడ తన మిత్రులతో కలసి ఉంటుండగా ఒక రాత్రి వింత కల వచ్చింది. ఒక సన్యాసి కనిపించి గుండు కొట్టించుకొని గంగాతీరం వెళ్ళమని సూచించాడు. ఠాకూర్ ఇష్టపడలేదు. అందమైన జుట్టును తొలగించుకోటానికి అంగీకరించలేదు. ఆ సన్యాసి ఇది గురుదేవుని ఆజ్ఞ అని చెప్పాడు. దానికి కోపంతో మీ గురుదేవుణ్ణే ఆ పని చేసుకోమనండి. ఇంకోసారి ఇలా మాట్లాడితే మెడపట్టి బయటకు గెంటుతాను అన్నాడు ఠాకూర్. మెలకువ వచ్చింది. మళ్ళీ మర్నాడు తెల్లవారు జామున రామకృష్ణ పరమహంస కలలో కనిపించి నేనే ఆ సన్యాసిని పంపాను. ఇది నా సంకల్పం అన్నాడు. మెలకువ వచ్చింది. మహనీయుడైన

పరమహంస ఆజ్ఞ గనుక ఠాకూర్ ముండనం చేయించుకొని గంగా స్నానం చేసి వచ్చాడు. మర్నాడు రాత్రి మళ్ళీ కల – పరమహంస కలలో కన్పించి ఈడెన్ గార్డెన్సులో రెండు చెట్లు కలసి ఉన్నచోట గంగ ఒడ్డున – కాళీ విగ్రహం దొరుకుతుంది. తెచ్చి పూజించు అన్నాడు.

తెల్లవారగానే మిత్రులతో కలసి వెళ్ళి నిర్దిష్ట ప్రదేశంలో కొద్దిలోతు నీళ్ళలో అడుగున బురదలో దొరికిన కాళీ విగ్రహం తీసుకొని తమ వసతికి చేర్చి శుభ్రంగా కడిగి పూజలో పెట్టారు. ఆ నల్లనిశిలా ప్రతిమ చాలా అందంగా ఉంది. భక్తి శ్రద్ధలతో ఠాకూరు, అతని మిత్రుడు వారి తల్లి అందరూ పూలు పండ్లు సమర్పించి అర్చన చేశారు. అన్నదా ఠాకూరుకు వచ్చే కలలు దైవానుగ్రహ పూరితమైనవని ఈ కాళీ విగ్రహం దొరకటంతో రుజువైంది. దేవీనవరాత్రులలో మహర్నవమినాడు ఈ సంఘటన జరగటం మరింత దేవతానుగ్రహాన్ని సూచించింది.

ఆరోజు రాత్రి మరొక వింత జరిగింది. మళ్ళీ కల – ఆ కలలో పదహారు సంవత్సరాల వయస్సు గల కన్యగా కాళి సాక్షాత్కరించింది.

కాళి: అన్నదా! నన్నెందుకు తెచ్చావు? భూగర్భంలో ఉన్న నన్ను తెచ్చి పూజించమని ఎవరు చెప్పారు?

అన్నదా: రామకృష్ణ పరమహంస చెప్పారు. లేకపోతే నీ విగ్రహం ఉన్న సంగతి, ఉన్నచోటు నాకు తెలియదు గదా!

కాళి : ఏమైనా నాకీ పూజ ఇష్టం లేదు. ఈ బహిః ప్రకటన వద్దు. నన్ను తెల్లవారగానే గంగలో నిమజ్జనం చెయ్యి

అన్నదా : నేను చెయ్యను. చెయ్యలేను. అద్భుత సంఘటన జరిగిందని అందరూ సంతోషిస్తుంటే ఇలా చెయ్యటం ఉచితం కాదు.

కాళి : నేను చెప్పినట్లు చేయకపోతే నిన్ను, నీ కుటుంబాన్ని నాశనం చేస్తాను.

అన్నదా : ఏమి చేసినా సరే! నిన్ను మళ్ళీ గంగలో వేయటానికి నేను ఇష్టపడను.

కాళి : ఎలా చెయ్యవో చూస్తాను.

అని చెప్పి కాళి అదృశ్యమైంది. అన్నదాకు మెలకువ వచ్చింది. మళ్ళీ కాసేపటికి నిద్ర వచ్చి ఇంకో కల వచ్చింది. అతనికి అత్యంత గౌరవనీయమైన పినతల్లి వచ్చింది.

అన్నదా : అమ్మా! నీవెప్పుడు వచ్చావు ?

తల్లి : ఇప్పుడే – నీకోసం అత్యవసరంగా వచ్చాను.

అన్నదా – ఏమిటమ్మా! ఏమి పని ?

తల్లి : కాళీదేవి ఆజ్ఞ మరవద్దు. నీవు కష్టాలలో పడటం నేను చూడలేను. మన అందరి శ్రేయస్సు కోసం కాళీ విగ్రహాన్ని గంగా నిమజ్జనం చేయక తప్పదు.

అన్నదా : నీవు కూడా అలానే ఆజ్ఞాపిస్తున్నావా తల్లీ! ఎవరి మాట కాదన్నా నీమాట కాదనలేను. కాని మనస్సు ఎంత మాత్రం అంగీకరించటం లేదమ్మా!

తల్లి : నిజమే! నేను నీ హృదయాన్ని అర్థం చేసుకోగలను. కాని అందరి మేలు కోసం ఇది తప్పదు. ఈ బొమ్మకు ఫోటో తీయించు. అటువంటిదే పంచలోహాలతో విగ్రహం చేయించి కాశీలో గుడి కట్టించి పూజిద్దువు గాని.

అన్నదా : తల్లీ! నా ఆర్థిక పరిస్థితి నీకు తెలుసు. గుడులు గోపురాలు కట్టించటం నాకెలా సాధ్యమవుతుంది ?

తల్లి : జగజ్జనని కృప ఉంటే ఏదైనా సాధ్యమవుతుంది.

ఈ కల పూర్తియై మెలకువ వచ్చిన కాసేపటికి తెల్లవారింది. మాత ఆజ్ఞను అందరికీ తెలియజేశాడు ఠాకూరు. ఎవరూ ఒప్పుకోలేదు. కాసేపటికి జనం గుంపులు గుంపులు వచ్చారు. విగ్రహాన్ని నిమజ్జనం చేయవద్దని కొందరు – చేయాలని కొందరు వాదోపవాదాలు చేశారు. చివరకు అన్నదా ఠాకూరు మాట కాదనలేకపోయినారు. గంగ దగ్గరకు ఊరేగింపుగా వెళ్ళి పడవలో విగ్రహాన్ని తీసుకువెళ్ళి – నది మధ్యలో అన్నదా – నిమజ్జనం చేశాడు.

అన్నదా ఠాకూర్ జీవితమంతా కాళీమాత, రామకృష్ణ పరమహంస కలలో ఇచ్చిన సందేశాలతో సాగింది. ఏదైనా సమస్య వస్తే దానికి సమాధానం కావాలని సంకల్పించి నిద్రపోతే స్వప్నంలో దానికి పరిష్కార విధానాలు సూచించబడేవి. రోగగ్రస్తులైన వ్యక్తులకు వాడవలసిన మూలికలు చెప్పబడేవి. కొందరి పూర్వజన్మ రహస్యాలు కూడా తెలియజేయబడిన సందర్భాలున్నాయి. అయితే కాళీవిగ్రహం విషయంలోను, కాళీమందిర నిర్మాణం వంటి విషయాలలోను దేవతలు, సిద్ధులు భిన్న నిర్ణయాలు తీసుకొని ఆజ్ఞాపించటం, ఒ:కసారి చేయమని చెప్పింది మళ్ళీ మార్చటం కొంత విచిత్రంగా భాసిస్తున్నది. మొత్తంమీద పరిశీలిస్తే రామకృష్ణ పరమహంస ఎక్కువ సార్లు దర్శనమిచ్చి తన జీవితాన్ని నడిపినట్లుగా ఇతడు వ్రాసుకొన్నాడు. మరికొందరు సన్యాసులు, యోగులు వచ్చినా వారు కూడా పరమహంస ప్రేరణ వల్లనే వచ్చినట్లు తరువాత తెలుసుకొన్నాడు. పరమహంస ఆజ్ఞ ప్రకారం ఆయన తపస్సు చేసిన పంచవటిలో ఇతడు కూడా ధ్యానం చేసి దివ్యానుభవాలు పొందాడు. అలానే రామకృష్ణుని ఆదేశం ప్రకారం బృందావనం వెళ్ళి రాధాకృష్ణ సాధన చేశాడు. ఆ ఆదేశంలో ప్రధానమైన మరొక అంశం దేవాలయ నిర్మాణం. ఆద్యా పీఠమన్న ఒక సేవా సంస్థను స్థాపించి అందులో గుడి కట్టటం ప్రారంభించాడు. రామకృష్ణ పరమహంస విగ్రహం – దానిపై కాళీ విగ్రహం – దానిపై రాధాకృష్ణుల యుగళమూర్తి – ఈ ఆలయం ఠాకూర్ కాలంలో ప్రారంభమై ఆయన మృతి చెందిన కొంతకాలానికి పూర్తి అయింది. ఈ స్వప్న జీవనుడు దురదృష్టవశాత్తు చిన్న వయస్సులోనే మరణించటం బాధాకరమైన అంశం. కాని

ఆయన స్థాపించిన ఆద్యా పీఠం మాత్రం అనాథ శరణాలయం, వితంతు శరణాలయం, వైద్యశాల, విద్యా సంస్థలు – మొదలైన అనేక విభాగాలతో వేలమందికి జీవనోపాధి కల్పిస్తూ – అపార సేవ చేస్తూ కలకత్తాలో ప్రకాశిస్తున్నది. అతడు పుణ్యాత్ముడని, దైవానుగ్రహ సంపన్నుడని అనటానికి ఇంతకంటే నిదర్శనమేమి కావాలి?

26. ఎల్లమ్మ కాళి

శ్లో॥ అపరా కాళికాదేవీ విద్యానగర రక్షకీ
విరాజితే ఎల్లమాంబా కృష్ణరాయ సుపూజితా

ఆనెగొందిలో ఎల్లమ్మగుడి ఉన్నది. ఆమె శక్తి స్వరూపాన్ని చూచి భక్తులు అపర కాళీమాత అనేవాళ్ళు. విద్యానగర రక్షకిగా ఆమె ప్రసిద్ధి వహించింది. కృష్ణరాయలు దండయాత్రలకు వెళ్ళేప్పుడు ఆ దేవతకు పూజ చేసి వెళ్ళేవాడట. ఎల్లమ్మ అంటే రేణుకాదేవి – ఏకవీర. క్రీడాభిరామంలో ఈమెను గూర్చి ఇలా ఉంది.

"తక దుమ్ముల్ యెకతాళముల్ జవనికల్ తందానలమ్మయ్యకున్
ఏకవీరమ్మకు మాహురమ్మకు అధోహ్రీంకారమధ్యాత్మకున్"

దిగంబరయైన ఈ దేవతకు ఉగ్రదేవతగా ప్రసిద్ధి. ఆనెగొందిలో ఈ ఆలయంలో నిధులున్నవని ప్రతీతి. కిందటి శతాబ్దంలో వీటికోసం చాలామంది ప్రయత్నం చేశారు. అక్కడి స్థానికులొకరు త్రిపురాంతకం నుండి ఒక మాంత్రికుని పిలిపించి అంజనం వేయించారు. ఆ మాంత్రికు డొక బాలుని కూచోపెట్టి అతని బొటన వేలిగోరు మీద అంజనం వేసి చూడమన్నాడు. ఆ బాలుడు నిధులున్న స్థానాన్ని గుర్తించాడు. అక్కడ పాములు కాపలాగా ఉన్నవని ఇంకా ముందే అమ్మవారు శూలంతో భయంకరంగా అడ్డం నిల్చున్నదని చెప్పి ఆ పిల్లవాడు భయపడి చూడలేనని చెప్పాడు. తరువాత కొంతకాలానికి నిధులు త్రవ్వటం వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోటం జరిగింది. ఎల్లమ్మ కాళి ఇప్పటికీ మహిమాన్వితురాలిగా ప్రజల పూజలందుకొంటున్నది.

27. పాపయారాధ్యుడు

రెండు వందల యేండ్ల క్రింద రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు అమరావతీ పరిపాలకుడుగా ఉన్నప్పుడు వారి ఆస్థానంలో ములుగు పాపయారాధ్యుడు పండితునిగా ఉండేవాడు. దేవీ భాగవతాన్ని తెలుగులో అనువదించి శాక్తేయ సాహిత్యానికి ఎంతో పుష్టి చేకూర్చిన దేవీ ఉపాసకునిగా ఆయనకు ప్రఖ్యాతి ఉన్నది. ఆయన కాళీభక్తుడని చాలామంది అంటున్నారు. అమరేశ్వరుని భార్య బాలచాముండేశ్వరీదేవి. ఆమెను గూర్చి పాపయారాధ్యులవారు "ముక్తి ద్వారము తల్పుదీయగదె చాముండా! జగజ్జీవనీ!" అనే మకుటంతో కొన్ని పద్యాలు –

"మహా! ప్రస్థానావసరంబుడాసె దరిజేర్పన్ నీవెసూ! భ్రామరీ!

అన్న మకుటంతో కొన్ని పద్యాలు వీరు రచించారు. భ్రామరి అంటే శ్రీశైల భ్రమరాంబ. తాంత్రికులు భ్రామరిని కాళిగానే భావించారు. ములుగువారి మహిమలను గూర్చి ఎన్నో కథలున్నవి. రాజావారు నవాబు దర్శనానికి వెళ్ళినప్పుడు ఒక్కోసారి కొన్ని నెలలు కూడ ఉండవలసి వచ్చేది. అప్పుడు అమరావతిలోని అధికారులు రాజావారికి ఏదైనా వార్త పంపవలసి వస్తే ఆరాధ్యుల వారికి ఆ కాగితం ఇచ్చేవారు. ఆరాధ్యులవారు దేవీభాగవతం పారాయణం చేసి ఆ గ్రంథంలో ఈ కాగితం పెట్టి ఇది రాజావారికి చేరాలని సంకల్పించేవారు. వెంటనే అది రాజావారు పారాయణం చేసే దేవీభాగవతంలోకి చేరేది. నాయుడుగారు దానిని చదివి తన ఉత్తరువులు మళ్ళీ తన పారాయణ గ్రంథంలో ఉంచేవారు. అది పాపయారాధ్యుల పారాయణ గ్రంథంలోకి వెళ్ళేది. ఈ విధంగా కాళీమంత్ర సిద్ధి వల్ల ఆరాధ్యులవారు జమిందారీకి సాయం చేసేవాడు. ఇటువంటి సిద్ధకవులు ఆంధ్రదేశంలో ప్రకాశించేవారు.

28. భైరవీ బ్రాహ్మణి

తూర్పు బెంగాలులోని జస్సర్ ప్రాంతానికి పరిపాలకునిగా ఉన్న ఒక జమీందారు దగ్గర కులగురువులుగా ఉన్న ఒక బ్రాహ్మణ కుటుంబం వారు వేదాధ్యయన పరులుగా మంత్రోపాసకులుగా, ఆధ్యాత్మిక విద్యావేత్తలుగా పేరుగాంచారు. 19వ శతాబ్దం ప్రారంభం నాటికి బ్రిటీష్ ప్రభుత్వం అప్పుడే, బలాన్ని పెంపొందించుకొంటున్నది. బెంగాలులో ఎక్కువ భాగం నవాబుల పరిపాలనలో ఉన్నది. ముస్లిం మతవిజృంభణం అరికట్టటం కష్టసాధ్యంగా ఉన్నకాలమది. హిందువులంతా మహమ్మదీయుల పాలనలో బిక్కు బిక్కు మంటూ జీవిస్తున్నారు. ఆరాధన మార్గాలదృష్టిలో వంగదేశంలో హిందూ సంప్రదాయాలు రెండు రకాలుగా వ్యాపించి యున్నవి. తాంత్రిక మార్గాలలో కాళీసాధన తీవ్రంగా ప్రచారంలో ఉండగా మరొక వైపు కృష్ణచైతన్య మహాప్రభువు ప్రభావం వల్ల కృష్ణభక్తి కూడా సామాన్య ప్రజల హృదయాలను ఆక్రమించుకొని ఉన్నది. మామూలు ప్రజలంతా ఉభయచరులు. అటు కాళీ ఉత్సవాలకు వెళతారు. ఇటు కృష్ణభజనలకు వెళతారు. చైతన్య మహాప్రభువు యొక్క ముఖ్య శిష్యులు, రూపగోస్వామి, సనాతన గోస్వామి అక్కడివారే. ఆ రెండు సంప్రదాయాల ప్రభావము ఈ రాజ గురువుల కుటుంబం మీద కూడా ఉన్నది. కలకత్తాలోని శక్తి పీఠమయిన కాళీదేవిని తరచుగా వారు దర్శించుటకు వెళ్తూనే ఉంటారు. అదే విధంగా కొన్ని కుటుంబాల వారు కలసి యాత్రికుల గుంపుగా బయలుదేరి భజనలు చేసుకొంటూ మధుర బృందావనాలకు వెళ్ళిరావటం కూడా తరచుగా జరుగుతున్న అంశమే.

ఈ రాజగురువుల కుటుంబంలో 19వ శతాబ్ధం మొట్టమొదట ఒక ఆడపిల్ల పుట్టింది. చాలాకాలం సంతానం కలగక చిరకాలం కులదేవత అయిన కాళిని ఉపాసించటం

వల్ల లేకలేక కలిగిన ఆ బిడ్డకు ముద్దుగా 'యోగేశ్వరి' అని పేరు పెట్టుకున్నారు. చిన్నతనం నుండే గృహవాతావరణంలో దైవభక్తి ఆధ్యాత్మిక చైతన్యం ఉండటం వల్ల ఆ లక్షణాలు ఈ బాలికలోనూ నెలకొన్నవి. చిరుతప్రాయంలోనే యోగేశ్వరి భజనలలో పాల్గొనేది. పూజలు చేయటానికి ఉత్సాహం చూపేది. యోగేశ్వరికి షుమారు పదిసంవత్సరాలు వచ్చిన సమయంలో ఆమె తల్లిదండ్రులకు మరొక ఆడపిల్ల పుట్టింది. ఆ అమ్మాయికి అయిదు ఏండ్ల వయస్సు వచ్చేసరికి, ఆయువు తీరి తండ్రి మరణించాడు. వీరి వంశంలో మగపిల్లవాడు లేకపోవటం వల్ల రాజగురువు పదవి వారి సోదరుల కుటుంబాలలో మరొకరికి వెళ్ళిపోయింది. పెద్దలు సంపాదించిన ఆస్తి కొంత ఉండటం వలన జరుగుబాటుకు లోటు లేదు.

ఇలాగడుస్తూండగా వారి గ్రామంలో ఊరి పెద్దలు ఒక పండితుని పిలిపించి భాగవత ప్రవచనం చేయించారు. ఆ పౌరాణికుడు మంచి సమర్థుడు కావటం వల్ల ఎంతో ఆకర్షణీయంగా కమ్మని కంఠంతో భాగవత కథలు వినిపిస్తున్నాడు. అందరితో పాటు యోగేశ్వరి, వాళ్ళ అమ్మ కూడా వెళ్ళేవారు. దశమస్కంధం చెప్పేటప్పుడు ఆ విద్వాంసుడు భాగవతానికి బ్రహ్మ వైవర్త పురాణాన్ని కూడ జోడించి చెప్పటంతో భాగవతంలో లేని కొత్త విశేషాలు ఎన్నో తెలిసినవి. ముఖ్యంగా రాధాదేవిని గురించి చాలా అద్భుతమైన విశేషాలు విన్నారు. తమ ప్రాంతం వారయిన రూపగోస్వామి, సనాతన గోస్వామి మొదలైనవారు చైతన్య మహాప్రభువు శిష్యులై, వైష్ణవులై, కృష్ణభక్తులై మహాప్రభువు ఆజ్ఞవల్ల బృందావనం వెళ్ళి అక్కడ రాధాభక్తులుగా మారిన విషయాలను ఆ పౌరాణికుడు విశదీకరిస్తూంటే బృందావన దర్శనాభిలాష ప్రబలంగా కలిగింది. యమునాతీరానికి వెళ్ళాలని కృష్ణుడు లీలలు ప్రదర్శించిన ప్రదేశాలన్నింటినీ చూడాలని రాధాకృష్ణుల విహార భూమిలో సంచరించి జీవితాలను చరితార్థం చేసుకోవాలని బలమైన ఆకాంక్ష కలిగింది. ఆ ఊళ్ళో ఉన్న చాలామందికి కూడా అటువంటి కోరిక కలగటం వల్ల అంతా ఒక బృందంగా ఏర్పడ్డారు. ఆ పౌరాణికుడు కూడా సకుటుంబంగా వీరితో బయలుదేరాడు.

శ్లో॥ ఆరాధ్యో భగవాన్ వ్రజేశతనయః తద్ధామబృందావనం
రమ్యా కాచి దుపాసనా వ్రజవధూవర్గేణ యాకల్పితా
శ్రీమద్భాగవతం ప్రమాణమమలం ప్రేమాపుమర్థోమహాన్
శ్రీ చైతన్య మహాప్రభోర్మత మిదం తత్రాదరో నః పరః

దేవతలందరిలో ఆరాధించతగినవాడు పరమేశ్వరుడైన కృష్ణుడు ఒక్కడే. ఆయన స్వస్థలం బృందావనము. ఆ జగన్నాథుని ఉపాసించే మార్గాలలో వ్రజకాంతలు అనుసరించిన మధురభక్తి మార్గం శ్రేష్ఠమయినది. మానవుడు సాధించవలసిన పురుషార్థములలో నాలుగు పురుషార్థములయిన ధర్మార్థ కామమోక్షములను మించిన అయిదవ పురుషార్థము ప్రేమ. అది బృందావనములో మాత్రమే సాధ్యము. ఈ ప్రేమ సిద్ధాంతమునకు శ్రీ మద్భాగవతములో దశమస్కంధము ప్రమాణం. ఇది చైతన్య మహాప్రభువు మతము. దీని యందు మాత్రమే

మాకు ఆదరము. ఈ విధంగా ఆ పౌరాణికుడు బృందావనయాత్ర అంతా కృష్ణగాథలు చెప్పి ప్రయాణశ్రమ అంతగా లేకుండా చేశాడు. యోగేశ్వరి, వాళ్ళ అమ్మ, చెల్లెలు బృందావనం చేరుకొన్న తరువాత అక్కడి విశేషాలన్నీ దర్శించారు. యాత్రికులందరూ కలసి స్థానికంగా ఉన్న రాధాకృష్ణ లీలాఘట్టాలన్నింటినీ చూచారు. హరిదాస్‌మహారాజ్ కోసం అవతరించిన బాంకే బిహారీ ఆలయం, అలానే రూపగోస్వామి సమాధి దగ్గర ఉన్న రాధాదామోదర మందిరం. సనాతనగోస్వామి పూజించిన మదనమోహనుని ఆలయం ఇటువంటివన్నీ వారు దర్శించారు. కృష్ణుని మునిమనుమడైన వజ్రుడు కృష్ణుని బాల్యదశను, యౌవనాన్ని, చివరి పరిణత దశను సూచించే విగ్రహాలతో నిర్మించిన మూడుదేవాలయాలను చూచినప్పుడు ఆనందకరమైన అనుభూతి కలిగింది. రాధాసుధానిధి గ్రంథకర్త హితహరివంశ మహారాజ్ సశరీరంగా గాలిలో కలిసిపోయి రాధాసఖిగా మారిన ప్రదేశం చూచినప్పుడు అందరికీ ఒళ్ళు పులకించింది. యమునకు రెండవ వైపు రాధాకృష్ణుల వివాహం జరిగిన భాండీరవనం, వేణుకూపం, లక్ష్మీదేవి తపస్సు చేసిన బిల్వవనం, అన్నిటికంటె 5000 ఏండ్లనాటి శ్రీకృష్ణుని వేణునాదాన్ని రాధాదేవి పాదనూ పురశింజితాలను వినిపించే వటవృక్షం దిగ్భ్రాంతిని పరవశత్వాన్ని కలిగించింది. ఆ మర్రిచెట్టు బోదెకు చెవి ఆనిస్తే దివ్యనాదం వినిపించడం మహాద్భుతమైన సన్నివేశం. అదేవిధంగా బృందావనానికి 50, 60 కిలోమీటర్ల పరిధిలో కృష్ణుడు యశోదకు విశ్వరూపాన్ని చూపిన బ్రహ్మాండఘాట్, స్నేహితులతో కలిసి ఆడుకున్న 'రమణరేతి' రాధాకృష్ణులు సృష్టించిన రాధాశ్యామకుండాలు, రాధాదేవి అవతరించిన రావల్ గ్రామంలోని పవిత్రస్థలం, పెరిగిన బర్సానా కొండమీది ఆలయం ఇవన్నీ భక్తులను ద్వాపరయుగాంతానికి తీసుకు వెళ్ళినాయి. అందరికీ ఆశ్చర్యం కలిగిన అంశం ఏమిటంటే బలరామకృష్ణులు, గోపకులు మొదట ఉన్న గోకులానికి తరువాత చేరిన బృందావనానికి, కృష్ణుడు లీలలు చూపిన మిగతా స్థలాలకు మధ్యలో చాలా దూరాలున్నాయి. ఈ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కృష్ణుడు నిద్రలేచి యమునలో స్నానం చేయటానికి ఒక 30 కి.మీ. మిత్రులతో కలసి చద్దన్నం తినటానికి మరొక వైపు 40 కి.మీ. ఆవులను మేపటానికి ఇంకో 50 కి.మీ. రోజు మొత్తం మీద షుమారు 150 కి.మీ. నడచినట్లు కన్పిస్తుంది. కృష్ణుడు మన్నుతింటున్నాడని గోపకులు ఒక 40 కి.మీ. వెళ్ళి ఇంట్లో ఉన్న యశోదకు చెపితే ఆమె రెండు నిమిషాలలో అక్కడకు నడచివచ్చి కృష్ణుని మందలించి అతడు చూపిన విశ్వరూపానికి దిగ్భ్రమచెంది మరల కృష్ణుని మాయలోపడిపోయి మామూలు మనిషిలాగా ఇంటికి వెళ్ళింది. అంటే సర్వశక్తి సంపన్నుడయిన కృష్ణుడేగాక పిల్లలు, వృద్ధులు కూడా ప్రతిరోజూ ఒక 100 కి.మీ. నడవటం సహజంగా ఉండేదన్నమాట. దీనిని బట్టి వాళ్ళ శరీర ప్రమాణాలు బలదార్ఢ్యాలు ఊహించవచ్చు. ప్రసిద్ధయోగిని ఆనందమాయి మహనీయుడైన దేవరహోబాబా అనుగ్రహం వల్ల తానుద్వాపరయుగ జీవులను చూచానని వారు 18 నుండి 20 అడుగుల ఎత్తులో ఉన్నారని చెప్పింది. ఇటీవల ఇంటర్నెట్‌లో జి.సుబ్రహ్మణ్యం అన్నపరిశోధకుడు "Bhima's son Gadotkach - Like Skeliton found" అన్న శీర్షిక క్రింద

లిఖించిన విషయాన్ని బొమ్మలను చూస్తే దానిలో భారత సైన్యము చేత రక్షితమైన ఒక ఎడారిలో బ్రహ్మాండమైన మానవుని అస్థిపంజరము బయటపడిందని దాని పొడవు షుమారు 30–40 అడుగులుందని, ప్రపంచంలో ఇంతటి పెద్దమానవ అస్థిపంజరం ఇంతవరకూ దొరకలేదని చెప్పబడింది. భీముని పుత్రుడైన ఘటోత్కచునిది అయి ఉండవచ్చునని ఆయన ఊహ. ఇటువంటి సాక్ష్యాలను బట్టి అప్పటి మానవులు మన ఊహకందని దీర్ఘశరీరాలు కలిగి ఉండేవారని భావించవచ్చు. బృందావనధామంలో ఇప్పటికి సుమారు 500 సంవత్సరాల క్రితం జీవించిన రూపగోస్వామి సనాతనగోస్వామి మొదలైన మహనీయుల సమాధులు అత్యంత స్ఫూర్తిదాయకములు. వాటి సన్నిధిలో ధ్యానము చేస్తే ఎవరికైనా దివ్యానుభవాలు కలగటం సహజం.

యోగేశ్వరి నెమ్మది నెమ్మదిగా వీటి వైపు ఎక్కువ ఆకర్షించబడింది. బంగారు రంగుతో లోకోత్తర సౌందర్యవతిగా రూపుదిద్దుకొన్న ఆ బాలిక బృందావన ధామంలోని ఆకర్షణతో రాదాకృష్ణ రసప్రపంచంలో మునిగిపోయింది. యాత్రకు వచ్చిన వారి సహకుటుంబీకులు ఆప్తులు అందరూ తిరిగి వెళ్ళటానికి ఉద్యుక్తులవుతున్న దశలో వీరు మాత్రం మరి కొంతకాలం బృందావనంలో ఉందామని నిశ్చయించుకొన్నారు. బెంగాలు నుంచి అప్పుడప్పుడు యాత్రికుల బృందాలురావటం అలవాటు గనుక వెళ్ళాలని అనిపిస్తే అటువైపు వెళ్ళే మరో బృందంతో వెళ్ళవచ్చునని అనుకొన్నారు. పెళ్ళీడుకు వచ్చింది. అమ్మాయికి పెళ్ళి చేయాలన్న ఆలోచన తల్లికి ఉన్నా యోగేశ్వరి ఎంత మాత్రం అంగీకరించటం లేదు. తాను సన్యాసిని అవుతానని తనకు విషయ సుఖములయందు ఆసక్తి లేదని తల్లితో ఎప్పుడూ అంటూండేది.

కాలం ఇలాగడుస్తూండగా ఒకనాడు రూపగోస్వామి సమాధిమందిరం దగ్గర ఒక మహనీయ వ్యక్తిని యోగేశ్వరి దర్శించింది. మధ్యవయస్కుడుగా ఉన్న ఆవ్యక్తికి అక్కడి పిన్నలు, పెద్దలు అందరూ సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారు. ఎవరీయన అని తెలిసిన ఒకవృద్ధుని అడిగితే ఆయన ఇలా అన్నాడు “అమ్మా ! ఆయన ఎవరో ఎక్కడివారో ఎవరికీ తెలియదు. నా చిన్నప్పుడు సుమారు 80 సంవత్సరాల క్రింద మొదటిసారి ఆయనను చూచాను. అప్పుడూ ఇలానే ఉన్నాడు. మహాపురుషుడైన రూపగోస్వామికి స్నేహితుడని అందరూ చెప్పుకోనేవారు. అంటే ఇప్పుడు ఆయన వయస్సు 300 సంవత్సరాలు పై బడి ఉంటుంది. బృందావనధామంలో ఎప్పుడోగాని ఇటువంటి మహాత్ములురారు. అందరూ ఆయనను ‘కాళీయోగి’ అంటారు. కాళీదేవి అనుగ్రహం వల్ల దీర్ఘాయువును అద్భుతశక్తులను సాధించాడని చెపుతారు” అందరితో పాటు యోగీశ్వరి కూడా వెళ్ళి ఆయన పాదములకు మ్రొక్కింది. ఆయన తలెత్తి చూచి చిరునవ్వుతో యోగేశ్వరీ ! బాగున్నావా ? అని తెలిసినవానివలె పలకరించాడు. తన పేరాయనకు ఎలా తెలుసు ? ఈ అమ్మాయికి ఆశ్చర్యం కలిగింది. ఆయన చూపులో మాటలో చిరకాలంగా తెలిసినవాడు పలకరించిన తీరు కనిపించింది. జనం చాలా మంది ఉండటం వల్ల అప్పుడు ఆయనతో మాట్లాడే అవకాశం కలుగలేదు. ఆ

రోజు రాత్రి ఎంతసేపయినాసరే ఉండి ఆయనతో మాట్లాడాలని వేచి ఉన్నది. అందరూ కదిలి వెళ్ళేసరికి చాలా ఆలస్యమైంది. అయినాసరే పట్టుదలతో దృఢసంకల్పంతో ఉన్నది. చివరికాయన లేచి తన వసతిగదిలోకి వెడుతూ ఈ అమ్మాయివైపు ఒక్కసారి చూచి మాట్లాడకుండా లోపలకు వెడుతున్నాడు. ఆయన పొమ్మనలేదు, అన్న ధైర్యంతో ఆయన వెంట లోపలికి వెళ్ళింది. లోపలికి వెళ్ళి ఆయన ఒక ఆసనం మీద కూర్చున్నాడు. ఆయన పాదములకు నమస్కరించి చేతులు కట్టుకుని ఎదురుగా నిల్చున్నది. అప్పుడాయన ఇలా అన్నాడు.

కాళీయోగి : యోగేశ్వరీ ! నీకేం కావాలి ? చాలాసేపటి నుండి వేచి ఉన్నావు.

యోగేశ్వరి : స్వామీ ! నాకేం కావాలో నాకు తెలియదు. మీరు కాళీదేవి అనుగ్రహం వల్ల సిద్ధశక్తులు సాధించారని కొన్ని వందల ఏండ్ల నుండి జీవిస్తున్నారని విని, మీతో మాట్లాడాలని అనిపించింది. కొత్తగా వచ్చిన నన్ను పేరుతో పలకరించారు. నే నెవరో మామూలుగా మీకు తెలిసే అవకాశం లేదు. చిన్నపిల్లను గనుక నన్ను ఎవరూ పరిచయమూ చేయలేదు.

కాళీయోగి : నేను ఎవరి గురించి తెలుసుకోవాలనుకుంటే వారి గురించి తెలుస్తుంది. నిన్ను చూడగానే చాలాకాలం నుండి, అంటే కొన్నివందల ఏండ్ల నుండి నిన్నెరుగుదు నన్న స్మృతి వచ్చింది.

యోగేశ్వరి : స్వామీ ! నన్నంతగా ఎరిగిన మీరెవరు ? నేనెవరు ?

యోగి : తెలియవలసిన సమయం వచ్చినప్పుడు అన్నీ తెలుస్తాయి. మీ అమ్మ నీ కోసం ఎదురు చూస్తున్నది. ఈపూటకు ఇంటికి వెళ్ళు. తరువాత కలువవచ్చు.

యోగేశ్వరి : నాకు మళ్ళీ దర్శనమెప్పుడు అనుగ్రహిస్తారు ?

యోగి : రేపు రూపగోస్వామి ఆరాధన. అతడు నా చిరకాలమిత్రుడు. చాలా కాలం తరువాత అతనిని చూడాలని సమాధిలో ఉన్న అతనిని పలుకరించాలని వచ్చాను. అందువల్ల రేపు పగలంతా అక్కడ కార్యక్రమంలో మునిగి ఉంటాను. రేపు కూడా ఇదే సమయానికి రా.

ఆమె నమస్కరించి వెళ్ళిపోయింది. మర్నాడు సాయంకాలం తాను వెళ్ళేసరికి సమావేశం జరుగుతున్నది. అందులో కాళీయోగి ప్రధానస్థానంలో ఆసీనుడై ఉన్నాడు. గౌడీయమఠ సన్యాసులు రూపగోస్వామిని గూర్చి, ఆయన గ్రంథాలను గురించి ప్రసంగాలు చేస్తున్నారు. ఆ కార్యక్రమం ఇంకా చాలా సేపు పట్టేట్లుంది. జనసమ్మర్దం వల్ల కాళీయోగి దగ్గరకు కూడా పోవటానికి వీలులేకపోయింది. ఈ సమావేశం గురించి ఆయనకు ముందుగా తెలియదా ? అలా అయితే తనను ఎందుకు రమ్మన్నట్లు ? ఏమీ తోచక నిరాశతో సభలో చిట్టచివర ఒక స్తంభాన్ని అనుకొని కూర్చుంది. ఇంతలో కాళీయోగి తన వైపే చూస్తున్నట్లు

అనిపించింది. నిజమే ! ఆయన తనవైపు నిశ్చలంగా నిర్నిమేషంగా దయతో చూస్తున్నాడు. తన కన్నులు మూతలు పడ్డవి. నిద్రవంటి స్థితి వచ్చింది. ఏ ఉపన్యాసమూ వినిపించటం లేదు. ఎవరూ కనిపించటం లేదు. నిశ్శబ్ద, నిరామయ ప్రకృతి ఆ చీకట్లను చీల్చుకొంటూ నెమ్మదిగా కాంతిరేఖలు వస్తున్నవి. అవి పెరిగి పెద్దవయి ఒక వెలుగు ముద్దవలె మారింది. ఆ మధ్యలో ఉన్నట్లుండి 8 అడుగుల ఎత్తున్న కాళీవిగ్రహం కన్పిస్తున్నది. ఎర్రని నాలుకతో నెత్తురు కారుతున్న మనుష్యుల తలల మాలలతో ఖడ్గధారియైన కాళీమూర్తి దర్శనమిచ్చింది. ముందు కాసేపు శిలారూపంవలె కన్పించినా చూస్తుంటే ప్రాణమున్న మనిషివలె కన్పిస్తున్నది. ఆమె ముందు నిలబడి కాళీయోగి స్తోత్రం చేస్తున్నాడు.

దిగంబరాం దివ్యకళాభిరామాం దృఙ్మండలాచ్ఛాదిత దీప్తి భీమాం
శ్యామాం శ్మశాన స్థలభోగధామాం కాళీం మహాకాళసఖీం భజామి.

దేదీప్యమానోజ్జ్వల శక్తి చండాం ధృతాసిశూలోగ్రకపాలరుండాం
త్రినేత్ర ఫాలాం గళముండమాలాం కాళీం కరాళీం సతతం భజామి.

స్వయంభూకాళీ దృగ్దరహసిత సౌందర్యనిధయే
నమస్తే శ్రీరాధా మధురమధురానంద నిధయే
బహూనాం జన్మాంతే స్ఫురణ మివవిస్తారమతయే
మహిమ్నః పారంతే జనని ! నవిజానామి సదయే !

కాళి ! కరాళి ! కపాలిని ! భైరవి ! కాత్యాయని ! కలికుండ నివాసిని
యోగేశ్వరి ! వరభోగదాయినీ ! రక్ష రక్ష ! కరుణామయి ! కాళీ !

స్తుతికాగానే కర్పూరహారతి ఇచ్చి ఆమె కన్నులవైపే చూస్తున్నాడు. ఇంతలో ఆమె ఆకృతి భీషణమైన మూర్తి నుండి పరమసుందరమైన ప్రేమరూపిణిగా మారింది. ఆమె అతనితో 'అదిగో అమ్మాయి యోగేశ్వరి వచ్చింది' అన్నది తాను ముందుకు వెళ్ళి జగన్మాతకు,కాళీయోగికి పాదనమస్కారం చేసి నిల్చున్నది. కాళీయోగి చిరునవ్వుతో "చాలాకాలం తరువాత జగజ్జనని దయవల్ల మళ్ళీ నా దగ్గరకు రాగలిగావు. దేవి కరుణవల్ల నీ భవిష్య జ్జీవితం కొత్త మలుపు తిరగబోతున్నది" అన్నాడు. ఇంతలో ఆ దృశ్యం మొత్తం మాయమయింది. మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూస్తే కాళీయోగి తన వైపే చూస్తున్నట్లుగా అనిపిస్తూనే ఉన్నది. ఎదురుగా ఉన్న ప్రేక్షకులకు ఆయన ఎవరిని చూస్తున్నదీ తెలియటం లేదు. నిర్దిష్ట లక్ష్యం ఉన్నట్లు గోచరించటం లేదు. యోగశాస్త్రంలో అంతర్లక్ష్యము, బహిర్దృష్టి ఉన్న శాంభవీముద్ర ఇదే అన్నట్లుగా ఉన్నది. ఆమె కిప్పుడు కొంత అర్థమయింది. తనకు ఈ కాళీదేవితో ఏదో జన్మాంతర బంధమున్నది. బృందావనముతో రాధాకృష్ణులతో ఏదో అనుబంధమున్నట్లు ఇదివరకు అనిపించేది. ఇప్పుడూ ఆ భావన నిలిచే ఉన్నది. కానీ కాళీదేవితో మరింత దృఢమైన బంధమున్నట్లున్నది. సిద్ధుడైన కాళీయోగి ఇంతమంది జనం మధ్యలో ఉన్నా, తనకొక ప్రత్యేకమైన అనుభవాన్ని ప్రసాదించాడు. ఈ పూటకు ఇంక ఇంటికి వెళతాను. ఈ సమావేశం ఇంకా చాలాసేపు పడుతుంది. రేపు వచ్చి మళ్ళీ స్వామి దర్శనం చేసుకొంటాను. స్వామికి దూరం ఉండే నమస్కరించి ఆమె ఆ పూటకు ఇంటి వెళ్ళింది.

మరునాడు సాయంకాలం మళ్ళీ ఆశ్రమానికి వెళ్ళేసరికి కాళీయోగి బయటకు వెళ్ళే ప్రయత్నంలో ఉన్నట్లు కన్పించింది. వారితో పాటు వారి పరివారము కొద్దిమంది బయలుదేరుతున్నారు. ఎక్కడికి వెడుతున్నారని నెమ్మదిగా పరివారంలో ఒకరిని అడిగింది. సనాతనగోస్వామి సమాధిదగ్గరకు, హితహరివంశ మహరాజ్ అదృశ్యమైన స్థలానికి వెడుతున్నట్లు చెప్పబడింది. వారితో పాటు తానుకూడా అక్కడికి వస్తానని అభ్యర్థించగా యోగి సరేనన్నాడు. ఆ రెండు చోట్లకూడా, పూర్వమహనీయులతో వారు మాట్లాడుతూనే ఉన్నట్లున్నది. అక్కడ నుండి మళ్ళీ రూపగోస్వామి సమాధిమందిరానికి వచ్చిన తరువాత శిష్యులంతా నమస్కరించి వెళ్ళిపోయినారు. యోగేశ్వరి ఒక్కతే మిగిలి ఉన్నది. యోగి విశ్రాంతిగా కూర్చున్న తరువాత, ఆమె నిన్న తాను పొందిన దర్శనాన్ని గూర్చి అడుగుదామని అనుకొంటూ ఉండగా యోగి ఇలా అన్నారు.

యోగి : అమ్మా ! నిన్న నీవు పొందిన అనుభవాన్ని గూర్చి అడగాలని అనుకొంటున్నావు. రాధాభక్తురాలివయిన నీకు కాళీదేవితో జన్మాంతర బంధం ఉండటం వల్ల నీకా అనుభూతి ఇవ్వబడింది. నీవు దర్శించిన కాళీదేవి విగ్రహం ఇక్కడకు కొన్ని వందల మైళ్ళ దూరంలో ఒక మహారణ్యంలోని నా ఆశ్రమంలో ఉన్నది. బృందావనంతోను ఇంతకముందు ఇక్కడ జీవించిన గోస్వాములతోను, భక్తులతోను ఉన్న అనుబంధం వల్ల వారు భౌతికశరీరాలతో ఉన్నప్పుడు ఏర్పడిన మైత్రిని పురస్కరించుకొని, వారు పాంచభౌతిక శరీరాలు విడచిపెట్టినా రాధాదేవి పరివారంలో మంజరులుగా మారిపోయినారు. నాకు దీర్ఘాయువు ఉండటం వల్ల ఇక్కడకు వచ్చి వారిని పలకరిస్తుంటాను. కాళీదేవి అనుగ్రహంవల్ల ఇప్పటికి కొన్ని వందల సంవత్సరాల నుండి జీవించియున్నాను. ఇక్కడి పెద్దల వల్ల నీవూ కొంతవిన్నావు. నీకు నిన్న ఇవ్వబడిన అనుభూతి కాళీదేవి యొక్క అనుగ్రహము నీలో పునర్వికసిత మవుతున్నదనటానికి గుర్తు. నిన్ను ఎన్నో జన్మలనుండి ఎరుగుదును. నీ వెవరో నీకు సంబంధించిన వివరాలు నీవే తెలుసుకొంటే నీకు సంతృప్తి కరంగా ఉంటుంది. ఆ స్థితి రావటానికి నీవు తీవ్రతపస్సు చేయాలి. వేగంగా రావాలంటే తాంత్రిక సాధనలు చేయాలి. అది నీ సంకల్పం మీద, భగవతి మహాకాళి కృపమీద ఆధారపడి ఉన్నది. నేనింక రెండు రోజులలో ఇక్కడ నుంచి బయలుదేరి వెడుతున్నాను. నీ మార్గం నిశ్చయించుకోవలసినదానిని నీవే.

యోగేశ్వరి : మీ మాటలు వింటూంటే నాలో ఏదో కొత్తమార్పు వస్తున్నది. నేను ఆలోచించుకొని రేపు మీ దర్శనానికి వస్తాను. మీ కరుణాకటాక్షములు నామీద ప్రసరించాలని ప్రార్థిస్తున్నాను.

యోగి : తథాస్తు.

యోగీశ్వరి ఇంటికి వెళ్ళిపోయింది. ఆ రాత్రంతా ఎడతెగని ఆలోచనలు. "ఇప్పుడు నేనేమి చేయాలి ? కాళీయోగి ఇచ్చిన అనుభూతివల్ల ఆయన మాటల వల్ల తెలియని

దివ్యలోకాల తలుపులు తెరుచుకొంటున్నవి. మొదటి నుండి ఆధ్యాత్మిక రంగంలో ఉన్నతస్థానం సాధించాలన్న తపన లోలోపల అగ్నిజ్వాలవలె రగులుతున్నది. దానిని సాధించాలంటే కఠోర తపస్సాధన చేయాలి. వయస్సు వచ్చింది కనుక పెళ్ళికి ఇప్పుడే ఆలస్యమయిందని అమ్మ గొడవ చేస్తున్నది. ఇంట్లో ఉంటే ఎక్కువకాలం పెళ్లిని ఆపటం సాధ్యం కాదు. కనుక గార్హస్థ్యబంధంలో ఇరుక్కోకుండా తాను సిద్ధయోగినిగా మారాలి. బృందావన ధామంలో అనన్యమైన రాధాకృష్ణభక్తి మార్గాన్ని తప్ప మరొకదానిని గూర్చి ఇక్కడి భక్తులు ఆలోచించరు. మంత్రశక్తుల యందు దీర్ఘాయువు నందు తాంత్రికసాధనల యందు ఇక్కడ ఆశ్రమాధిపతులకు గాని వారి శిష్యులకు గాని ఆసక్తి లేదు. నాకు రాధాకృష్ణుల యందు భక్తి ఉన్నది. కానీ దానితో పాటు సిద్ధులయందు కూడా మోజు ఉన్నది. ఆ కాళీయోగి ఎప్పటివాడో ? 300 ఏండ్లు దాటుతున్నా ముసలితనం రాలేదు. నేను కూడా ఆ విధంగా దీర్ఘాయు రారోగ్యములు సాధించగలనా ? జరాభారంపైన పడకుండా ఆపగలనా ? ఇవన్నీ సాధించాలంటే సిద్ధుడైన గురువు యొక్క సహాయం లేకుండా సాధ్యంకాదు. కన్పిస్తున్నంతలో ఒక్క కాళీయోగి మాత్రమే చేయగలిగిన పని ఇది. కనుక నా జీవిత లక్ష్యం నెరవేరాలంటే ఆయనతో వెళ్ళాలి. వారి ఆశ్రమంలో వారి నీడలో ఉండి, ఆయన అనుగ్రహంతోనే ననుకొన్నది సాధించాలి. ఒకసారి ఆయనతో వెళ్ళిపోతే తిరిగి ఎప్పటి రాగలనో, చెప్పకుండా వెడితే ఏమయినానో ! అని అమ్మ దిగులు పడుతుంది. చెప్పితే పోనీయరు" ఇలా పరిపరివిధాల ఆలోచించి ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది. మరునాడు ప్రొద్దునే లేచి యమునలోస్నానం చేసి వచ్చింది. బృందావనంలోని రాధాకృష్ణ మందిరాలకు వెళ్ళి నమస్కరించింది. మహనీయులైన యోగుల సమాధుల దగ్గరకు వెళ్ళింది. యమునాతీరాన సతీదేవి యొక్క కేశములు పడినచోట కేశకాళీమందిరము ఉన్నది. అక్కడికి వెళ్ళి ఆ దేవతను చూచి "అమ్మా ! నీ దయకోసం బయలుదేరుతున్నాను. నాకు విజయాన్ని ప్రసాదించు" అని వేడుకొన్నది. ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకొని, సాయంకాలం రాధాదామోదర మందిరానికి వెళ్ళి కాళీయోగి అక్కడి నుండి ఎప్పుడు వెళ్ళిపోతున్నాడో విచారణ చేసింది. ఆ రాత్రి తెల్లవారుజామునే వెడతారని అక్కడి ఆశ్రమ నిర్వాహకులు చెప్పారు. కాళీయోగి దర్శనానికి వెడదామని నాలుగడుగులు ముందుకు వేసి మళ్లీ ఆగింది. పునరాలోచన ఇప్పుడు వారి దగ్గరకు వెళ్ళి నన్ను మీతో తీసుకు వెళ్ళండి అంటే వారు అంగీకరిస్తారో అంగీకరించరో ! ఇంటి పెద్దల అనుమతి లేకుండా – వారితో ప్రయాణానికి ఒప్పుకోక పోతే ఇక తన జీవితమింతే. కనుక ఇప్పుడాయన దగ్గరకు వెళ్ళకుండా తెల్లవారు జామున ఆయననుసరించి ఊరుదాటి కొంతదూరం వెళ్ళిన తరువాత ఆయనను కలసి కాళ్ళమీదపడి ప్రార్థించాలి, అని నిశ్చయించుకొన్నది.

గుడిలో ఒక్క తాటాకు గంటము తీసుకొని నేను తపస్సు చేసుకోవటానికి వెడుతున్నాను. నా కోసం వెతకవద్దు దిగులు పడవద్దు. వీలైనంత త్వరలో నేనే తిరిగి వస్తానని వ్రాసి ఘంటము తిరిగి ఇచ్చి వేసి ఆ తాటాకును వస్త్రములో దాచుకొని ఇంటికి వెళ్ళింది. రాత్రి

అందరూ నిద్రపోయిన తరువాత రాత్రి మూడవ జాము సగపడగానే లేచి పూజామందిరంలో రాధాకృష్ణుల ముందు ఆ తాటాకు పెట్టి దానిపై చిన్న బరువు పెట్టి నెమ్మదిగా ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. కట్టుకొన్న బట్టలు దప్ప ఏ వస్తువూ ఆమె దగ్గర లేదు. రాధాదామోదర మందిరానికి ఆమె చేరుకొని లోపలకు వెళ్ళకుండా దూరంగా ఒక అరుగు మీద కూర్చున్నది. బ్రాహ్మీ ముహూర్తంలో కాళీయోగి బయటకు వచ్చారు. ఆశ్రమం పెద్దలు ఆయనకు వీడ్కోలు చెప్పి నాలుగడుగులు వేసిన తరువాత వారి నాగిపొమ్మని ఆయన ఒక్కడే బయలుదేరాడు. చిత్రం ఆయన చేతిలోనూ ఏ సామానులేదు. ఆయన కొంత దూరం వెళ్ళిన తరువాత, జాగ్రత్తగా ఆయనను అనుసరిస్తూ యోగేశ్వరి నడవటం మొదలు పెట్టింది. బృందావనధామం దాటారు. తెలతెలవారుతున్నది. త్రోవలో ఒక కదంబవృక్షం దగ్గర ఆయన ఆగాడు. వందగజాల దూరంలో ఉన్న యోగేశ్వరికి అమ్మా ! నీవు దగ్గరకురావచ్చు అన్న కాళీయోగి మాట విన్పించింది. ఆయన గొంతు తనకు తెలిసినదే. వెనుకకు తిరుగకుండా వెడుతున్న ఆయోగి తనరాకను గుర్తించాడన్న మాట. గబగబా నడుచుకుంటూ ఆయన దగ్గరకు వెళ్ళి కాళ్ళ మీదపడింది. "లే! యోగేశ్వరి ! చాలా దూరం శ్రమపడినడచి వచ్చావు. ఇంట్లో చెప్పకుండా బయలుదేరి సాహసం చేశావు. నాతో చెపితే వద్దంటానేమోనని వెంటవచ్చావు. సమస్త బంధాలు పరిత్యజించి భగవంతుని అన్వేషిస్తూ ఏకాంతంగా కదిలిపోయే భక్తుని వలె నన్ను నమ్మి నావెంట వచ్చావు. నీ నమ్మకం వ్యర్థంకాదు. ఇక్కడికి మన ఆశ్రమం కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉన్నది. స్నానం చేసి దేవతార్చన చేయవలసిన సమయం సమీపించింది. మామూలుగా నడచి వెళ్ళటం, అశ్వవృషభాదివాహనాల మీద వెళ్ళటం ఈ అడవులలో కుదరదు. నా చేయిపట్టుకొని కండ్లు మూసుకో అన్నాడు కాళీయోగి. ఆమె ఇలా అన్నది "స్వామీ! నే నిప్పుడు మార్జాలకిశోర స్థితిలో ఉన్నాను. నేను మీ చేయిపట్టుకొంటే మర్కట కిశోర న్యాయమవుతుంది. మీరే నాచేయిపట్టుకుంటే నాకు ధైర్యం ఎందుకంటే మీరు చెప్పిన దాన్నిబట్టి ఏగాలిలోనో తేలుతూపోతే నేను గట్టిగా మిమ్ముపట్టుకోలేక పోతే నేనే అఖాతంలోనో పడి పోతాను. దిక్కులేని దానిని, మీరే దిక్కని నమ్మి వచ్చాను. మీరే నా పాణిగ్రహణం చేయండి". కాళీయోగి కొంచెం ఆశ్చర్యంగా ఆమె వైపు చూచి, చిరునవ్వు నవ్వి 'అలాగే' అంటూ ఆమె చెయ్యిపట్టుకొని "యోగేశ్వరీ! మనందరికీ దిక్కు కాళీదేవియే. నీకే ఆపదారాదు". అన్నాడు. ఆమె "స్వామి! మీ రనుగ్రహిస్తే ఒక అభ్యర్థన, కండ్లు మూసుకోమని అన్నారు కండ్లు తెరచి మీ వేగాతి వేగగమనాన్ని చూడాలని కోరికగా ఉన్నది. మీరు నా పాణిగ్రహణం చేశారు కనుక నాకే ప్రమాదం రాదని ధైర్యంగా ఉన్నది అన్నది. యోగి అంగీకారసూచకంగా తల ఊపి, పాణిగ్రహణమన్న మాటను రెండవసారి వాడిన ఆబాలికను ఏకాగ్రంగా చూచి (పాణిగ్రహణమంటే సంస్కృతంలో వివాహమని అర్థం చేయిపట్టుకొనుట అన్నది సామాన్య అర్థం) ఇలా అన్నాడు. "అమ్మా చిన్నతనంలో తల్లి చెయ్యిపట్టుకొని బిడ్డకు నడక నేర్పుతుంది. తరువాత తండ్రి చెయ్యి పట్టుకొని పాఠశాలకు తీసుకువెళ్తాడు. ఆపైన భర్త చెయ్యిపట్టుకొని జీవితంలో నడిపిస్తాడు. నీ విప్పుడు రెండవ దశలో ఉన్నావు పద".

గగన వీధులలో భూమికి కొంచెంపైన వాళ్ళు వెడుతూంటే కింద అడవులు కొండలు గుట్టలు, నదులు, సరస్సులు, గ్రామాలు, పట్టణాలు ఎన్నో వెనుకకు వెళ్ళుతున్నవి. వారు వెడుతున్న ఆ మహావేగం ఆశ్చర్యకరంగా ఉన్నది. అస్త్రమంత్రాలతో అభిమంత్రించిన బాణాలు వెళ్తున్నట్లుగా వాళ్ళిద్దరూ వెళుతూంటే మబ్బులు విచ్చుకొని త్రోవ ఇస్తున్నట్లుగా ఉన్నది. ఆకాశంలో ఉన్న పక్షులు వీరి గమనాన్ని తెలుసుకో గలిగినట్లు లేదు. బహుశా అదృశ్యంగా ఉన్నారేమో. సూర్యోదయం అవుతూ ఉండగా ఒక అరణ్య ప్రదేశంలో భూమిమీద దిగారు. అడవిబాటగుండా ఆయన నడుస్తూ ముందుకు వెళుతున్నాడు. ఇంతలో ఒక పెద్దపులి గాండ్రిస్తూ వచ్చింది. దాని ముందుగానే ఏమీ మాట్లాడకుండా ఆయన నడుస్తూ వెళ్ళాడు. ఆయన వెంట యోగేశ్వరి – ఆ పులి నిశ్శబ్దంగా నిల్చున్నది. ఇంకొంచెం ముందుకు వెళ్ళిన తరువాత ఎటు చూచినా పెద్ద పెద్ద పాముపుట్టలు. కొన్ని మహాసర్పాలు పడగ విప్పి చూస్తున్నవి. నెమ్మదిగా నడిచి ఆశ్రమంలోకి ప్రవేశించారు. అక్కడ ఏమనుష్యుల అలికిడీ లేదు ఒక కుటీరము ఒక దేవతా మందిరము కొండరాళ్ళతో గుహవలె కనిపిస్తున్న ఆ మందిరంలోకి ప్రవేశించగానే లోపల ఎనిమిదడుగుల ఎత్తైన కాళీదేవి యొక్క భీషణ విగ్రహం ప్రకాశిస్తున్నది. దాని ముందొక హోమకుండం వెలుగుతున్నది. కాళీదేవికి ఆయనతో పాటు తాను కూడా నమస్కరించింది. ఆయన మౌనంగా కొద్ది దూరంలో ఉన్న సరస్సు దగ్గరకు వెళ్ళి స్నానం చేశాడు. ఆమె కూడా స్నానం చేసింది. కుటీరానికి తిరిగి వచ్చిన తరువాత ఆయన "అమ్మవారికి అలంకరించిన చీరలు లోపల ఉన్నవి. వాటిని నీవు ధరించవచ్చును" అన్నాడు ఆమె లోపలకు వెళ్ళి తడిబట్టలు విప్పి చీరను మార్చుకు వచ్చింది. ఆమె సిద్ధమై వచ్చేసరికి ఆయన పూజకు సిద్ధంగా ఉన్నాడు. ఎవరో అమర్చినట్లు పూజావస్తువులన్నీ అక్కడ ఉన్నవి. కాళీదేవికి శాస్త్రోక్త విధానంగా పూజచేసి ఎదురుగాఉన్న హోమ కుండంలో కొన్ని ప్రత్యేకద్రవ్యాలతో ఆయన ఆహుతులు వేశాడు. పూజ, హోమము ఇంచుమించు రెండు గంటలు పట్టింది. మరికొంతసేపు గంభీర కంఠంతో ఆయన, కాళీ స్తోత్రాలను పారాయణ చేశాడు. కొద్దిసేపు ధ్యానం చేసి "యోగీశ్వరీ! ఈపూటకు, అమ్మవారికి నైవేద్యం పెట్టిన పండ్లు తేనె, మనకు ఆహారం. రేపటి నుండి వంటకు ఏర్పాట్లు జరుగుతవి. ఇక్కడకు చుట్టూ ఉన్న క్రూరజంతువులు, సర్పములు, నిన్నేమీ చేయవు. నిర్భయంగా విశ్రాంతి తీసుకోవచ్చు" అన్నాడు. "స్వామీ! మీరుండగా నాకు భయమన్నది లేదు, మహాపురుషులైన మీపాద సన్నిధిలో నాజీవితం చరితార్థమౌతుంది" అన్నది. ప్రసాదస్వీకారానంతరం కొంత విశ్రాంతి తీసుకొన్న తరువాత సాయంకాలం కలకలం మొదలైంది. కొంత మంది గ్రామీణులు అమ్మవారి దర్శనం స్వామి వారిదర్శనం కోసం వచ్చారు. వస్తూ వస్తూ వంటసామగ్రి, ఆహారపదార్థాలు కాయగూరలు, పాలు రకరకాల వస్తువులూ తీసుకువచ్చారు. స్వామికి నమస్కరించి ఆయన సంజ్ఞతో ఆ సామాగ్రి అంతా ఆమెకు అప్పగించి కాళీదేవి దర్శనం చేసుకొని వాళ్ళు వెళ్ళిపోయినారు. కాళీయోగి యోగేశ్వరితో "కావలిసిన సామాగ్రి వచ్చింది. ఇకమీద వంట చేసుకొని మామూలు భోజనం చేయవచ్చు రేపటి నుండి నీ సాధన ప్రారంభం అవుతుంది".

యోగేశ్వరి: స్వామీ! సంసారానికి కావలసిని సామగ్రివచ్చింది. వంట చేస్తాను కానీ ఇక్కడ ఇంతకుముందు పొయ్యి రాజేసిన జాడ కనపడటం లేదు. ఇన్నాళ్ళుగా మీరు ఏమి ఆహారం తీసుకొంటున్నారో అర్ధంగావటం లేదు.

యోగి: ఓ అమాయక బాలికా! నాకు ఆహారంతో కాని నిద్రతో కాని పనిలేదు. ఏమయినా తినగలను, ఎంతయినా తినగలను, ఏమీ తినకుండా ఎంతకాలమయినా ఉండగలను. సామాన్య మానవ శరీరాలకు ఉండే ఏ అవసరమూ నన్ను బాధించదు.

యోగేశ్వరి: మహాత్మా! నాకాస్థితి ఎప్పటికి వస్తుంది?

యోగి: వచ్చిన దాకా ఈ ఆహార విహారాదులు అవసరమే కదా!

యోగేశ్వరి: నేను వంట చేస్తాను కానీ మీరు భోజనం చేస్తేనే నేను చేసేది.

యోగి: అలానే నాకు తీసుకున్నా ఒకటే, తీసుకోక పోయినా ఒకటే. అయినా నీ కోసం తీసుకొంటాను.

యోగేశ్వరి: తమ అనుగ్రహము. ఇప్పుడు మన సంసారము మొదలవుతున్నట్లు లెఖ్ఖ.

యోగి: సాధనలో ఒక్క రోజుకూడా వ్యర్థం కారాదు. ప్రతిరోజూ సాధకులకు విలువైనదే. ఈ రోజురాత్రి మొదటి ఝామము గడచిన తరువాత నీకు కాళీ మంత్రాన్ని ఉపదేశించటం జరుగుతుంది. అయితే కాళీసాధన మూడు పద్ధతులు 1. దక్షిణాచారము 2. వామాచారము 3. కౌళము. ఆ మార్గాల గురించి నీవు కొంత విని ఉండవచ్చు. వైదిక ఆచార పద్ధతిలో చేసేది దక్షిణ మార్గము. పంచమకారాలతో చేసేది వామ మార్గము. పగలు దక్షిణా చారము, రాత్రి వామాచారము చేస్తే కౌళము. ఇవి కాక సమయాచార, సిద్ధాంత మార్గములు మొదలైనవి ఉన్నవి. నీ అభిరుచిని అనుసరించి సాధన పద్ధతులు అవలంబించవచ్చును.

యోగేశ్వరి: అయ్యా! నాకు ఇన్నిమార్గములు ఆచారములు తెలుసుకొనవలసిన కోరికలేదు. నాకున్నదొకటే మార్గము. అది గురుమార్గము. గురువైన మీరే నాకు సర్వస్వం. నన్ను నేను మనసా, వాచా, కర్మణా సర్వార్పణం చేసుకొంటున్నాను. నన్ను ఎలా తీర్చిదిద్దుతారో మీ ఇష్టం. మీ చేతుల లోని బంకమట్టి బొమ్మను నేను. అని ఆయన పాదములపై వ్రాలింది.

అనంతరం అయిదు సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా అమె చేత బహువిధములైన తాంత్రిక సాధనలు చేయించాడు కాళీయోగి. సాధన సమయంలో అప్పుడప్పుడు గ్రామీణులు వచ్చి ఆహారాది పదార్థాలు ఇచ్చివెళ్ళేవారు. అయితే తనకు ఆశ్చర్యము కలిగించిన కొన్ని సంఘటనలున్నవి. అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక పర్వదినాలలో అద్భుత సౌందర్యవతులైన స్త్రీలు కొందరు వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళేవారు. అంటే తనవంటి శిష్యురాండ్రు

మరికొొందరు కూడా కాళీ యోగికి ఉన్నారన్నమాట. వారు కూడా తీవ్రసాధనలు చేసిన వారేనా? ఏమో తెలియదు. వారిని గురించి తాను స్వామివారిని అడుగలేదు. వారు చెప్పలేదు. బయటి ప్రపంచం తో సంబంధం లేకుండా వర్షపంచకము గడిచింది.

ఒకనాడు కాళీయోగి ఆమెను పిలిచి కాళీ సన్నిధిలో ఆమెను కూర్చోమని ఇలా అన్నాడు. "యోగేశ్వరీ! ప్రధానమైన తాంత్రికసాధనలన్నీ నీ చేత చేయించాను. అపురూపమైన కొన్ని శక్తులు నీకు లభించాయి. వాని వల్ల ప్రపంచానికి ఉపకారం చేయగల కొంతశక్తి నీకు వచ్చింది. నేనీ శరీరాన్ని విడిచి పెట్టవలసిన సమయమాసన్నమైంది. కాళీదేవి ఈ శరీరానికి ఇచ్చిన ఆయువు పూర్తయింది. అయితే, నేను మోక్షానికి వెళ్ళటంలేదు. పరమేశ్వరి ఆజ్ఞను అనుసరించి ఎక్కడ ఎప్పుడు, ఎంతకాలం ఉండవలసివస్తే అంతకాలం ఉంటాను. నీ కర్తవ్యం విను. ఇక్కడ ఏకాకిగా నీ వుండలేవు" అని అంటుండగా యోగేశ్వరి ఆయన వియోగాన్ని ఊహించలేక దుఃఖంతో కంటివెంట అశ్రువులు జాలువారుతుండగా కాళ్ళుపట్టుకొని "స్వామీ! మీరు వెళ్ళవద్దు. మీరులేక నేను జీవించలేను. నేను కూడా ఆత్మహత్య చేసుకొని మరణిస్తాను" అని పెద్దగా ఏడవటం మొదలు పెట్టింది. కాళీయోగి ఆమెను ఓదార్చి "యోగినీ! దేవీ భక్తులకు కన్నీళ్ళు తగవు. శోకాన్ని ఆపుకో. చెప్పేది జాగ్రత్తగా విను. చావుపుట్టుకలు సర్వప్రాణి సహజములు. పరమేశ్వరి చేతిలో అందరము ఉపకరణాలము. నీవలన లోకానికి కొంత మేలు చేకూరవలసి యున్నది కనుకనే జగన్మాత నిన్ను నాదగ్గరకు తీసుకు వచ్చింది. అయితే నీలో పరిపూర్ణసిద్ధి వికసించటానికి అయిదుసంవత్సరాలు చాలలేదు. నాకా, ప్రస్తుతం సమయం పూర్తయింది. నేను కొద్దిసేపటిలో కాళీదేవి ముందున్న హోమకుండంలో కూర్చుండి ఇచ్ఛాపూర్వకముగా దహన మవుతాను. నా శరీర చితాభస్మాన్ని నీవుధరించు. ఎప్పుడూ నీకు నేను అండగా ఉంటాను. నా భస్మాన్ని ధరించిన క్షణం నుండి నీవు 'భైరవి' వి. బ్రాహ్మణకాంతవు గనుక 'భైరవీ–బ్రాహ్మణి' అనవచ్చు. ఆపేరే భవిష్యత్‌లో నిలిచిపోతుంది. నేను దహనమయిన కాసేపటికి ఒక వృద్ధబ్రాహ్మణుడు పొట్టిగా బంగారు రంగుతో ఉన్నవాడు వస్తాడు. ఆయనతో పాటు సన్నగా, పొడవుగా, నల్లగా ఉండే ఆయన కుమారుడు కూడా వస్తాడు. వాళ్ళకు ఆతిధ్య మర్యాదలుఇచ్చి సత్కారములు చెయ్యి. ఒక నెలరోజులపాటు ఇక్కడ ఉండి ఈ కాళీమందిర బాధ్యతను ఆ పెద్దాయనకు అప్పగించు. ఆ తరువాత నీవు తిరిగి బృందావనం వెళ్ళు. అక్కడ మీఅమ్మ ఇంకా జీవించి ఉన్నది. వృద్ధాప్యంలో ఉన్న ఆమె బ్రతికున్నంత కాలమూ సేవచేయి. ఆ పవిత్ర ధామంలో రాధాకృష్ణులను నిరంతరం సేవించు. అక్కడకు వెళ్ళిన తరువాత రాధామంత్రాన్ని నీవు జపించవలసి ఉంటుంది. నీవు నేను మరికొొందరు గోలోకానికి చెందినవారము. రసదేవత అయిన రాధాదేవి సంకల్పమువల్లనే మన జన్మపరంపర కొనసాగుతున్నది. ఆమె యొక్క మరొక రూపమే కాళీ. అక్కడ నీ చెల్లెలు పెరిగి పెద్దదయి ఇప్పటికే కృష్ణ భక్తిని హృదయంలో నింపుకొన్నది. మధురభక్తి మార్గంలో ఆమె జీవితం తరిస్తుంది. కృష్ణుడు తనను విడిచిపోతాడేమో అన్న భయంతో తాను పూజించే కృష్ణవిగ్రహాన్ని

ఎప్పుడూ కొంగుకు ముడివేసుకు ఉంచుకుంది. కృష్ణుడు తప్ప మరొక ప్రపంచం ఆ అమ్మాయికి ఉండదు. నీ కాళీభక్తి తాంత్రికసాధనలు ఆ అమ్మాయికి నచ్చవు. ఈ ప్రపంచంలో ఎవరిమార్గం వారిది. అయిదేండ్ల తరువాత నీ వక్కడికి వెళ్ళినా నిన్ను ఎవరూ ఏమీ అనరు. మీ తల్లికి సేవచేసి మాతృఋణం తీర్చుకొన్న తరువాత కాశీకి వెళ్ళు. అక్కడ త్రైలింగస్వామిని దర్శనం చేసుకో. ఆ మహానుభావుడు నాకు పరమాప్తుడు. ఆయన ఆశీస్సులు తీసుకొని అక్కడ కొన్నాళ్ళు తపస్సు చేయి. క్షేత్రపాలకుడయిన కాలభైరవుడు కాళీసహితుడై అక్కడ ఉన్నాడు. వారి అనుగ్రహం నీకు లభిస్తుంది. అనంతరం కొంతకాలము తీర్థయాత్రలు చేయి. కొందరు సాధకులకు నీవలన ఉపకారము జరుగవలసి ఉన్నది. కాళీదేవి అనుగ్రహం కోసం సాధన చేస్తున్నటువంటి యువకులు కొందరికి నీ మార్గదర్శనము, సహాయము అవసరమవుతుంది. వారెవరన్నది దివ్య చక్షువు వికసించటంవల్ల నీవు తెలుసుకోగలుగుతావు. వారిలో చివరివాడు కలకత్తాలోని దక్షిణేశ్వర మందిర పూజారి 'గదాధరుడు' అన్న యువకుడు. అతని చేత తాంత్రికసాధనలు చేయించు. ఆ తరువాత నన్ను మళ్ళీకలుసుకో గలుగుతావు. ఇప్పుడు నీ వయస్సు 21వ సంవత్సరము నడుస్తున్నది. దాదాపు 45 సంవత్సరముల తరువాత నన్ను మళ్ళీ చూడగలుగుతావు".

యోగేశ్వరి: స్వామీ! నా కప్పటికి షుమారు 70సం॥ సమీపిస్తుంటవి. వృద్ధత్వంలో ఉండే నేను మిమ్ము గుర్తుపట్టటం ఎలా? మీరు దివ్యశరీరంతో ఉంటారా లేక మానవ శరీరంలో ఉంటారా?.

యోగి: ఈ శరీరాన్ని వదలిన తరువాత పదిసంవత్సరాలు ఊర్ధ్వభూమికలలో ఉంటాను. కాళీదేవి పరివారంలో ఉండి మళ్ళీ ఆమె ఆజ్ఞవల్ల దక్షిణ దేశంలో పుట్టి ఒక ఆంధ్రకుటుంబంలో పెరిగి పెద్దవాడనయిన తరువాత దక్షిణాపథమంతా సంచరించి మళ్ళీ ఈ కాళీ దేవి దగ్గరకు వస్తాను. అప్పటికి ఇక్కడ ఇంతకుముందు చెప్పిన వృద్ధుడు, యువకుడు కాళీదేవిని సేవిస్తూ ఉంటారు. ఆ వృద్ధుడు కూడా సామాన్యుడు కాదు. కేవల భక్తిచేత తీవ్రసాధనలు లేకుండానే దీర్ఘాయువు సాధించిన వాడు. అతని కుమారుడు మాత్రం తీవ్రసాధనలు చేస్తాడు. ఆ వివరాలు ప్రస్తుతం నీకు అక్కరలేదు. నీవు మాత్రం ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు ఇక్కడకు వచ్చి ఎన్నాళ్ళుండాలనిపిస్తే అన్నాళ్ళు ఉండవచ్చు. నీవు చేసిన తాంత్రిక సాధనలవల్ల ఆకాశగమన శక్తిరాలేదుకాని, అలసట లేకుండా ఎంతదూరమైన వేగంగా నడచి పోగలశక్తి వచ్చింది. అలానే ముసలితనం గురించి ప్రస్తావించావు. నిన్ను వృద్ధురాలిగా చూడటం నాకు ఇష్టములేదు ఈ శరీరములో నీవున్నంతకాలం ఇప్పుడున్నట్లుగానే ఉంటావు. ముసలి తనం నిన్ను సమీపించదు. ఇది నేను ప్రత్యేకంగా నీకిస్తున్న వరం. ఇక నా అగ్నిప్రవేశ సమయమాసన్నమయింది.

యోగేశ్వరి: మహాత్మా! బృందావనంలో నన్ను రాధామంత్రం చేయమన్నారు. నేను మిమ్ము తప్ప మరెవరినీ గురువుగా స్వీకరించలేను. దయతో నాకు రాదామంత్రాన్ని ఉపదేశించండి.

యోగి: ఇప్పుడు సమయం చాలదు. నీవు బృందావనం వెళ్ళిన తరువాత భాద్రపద శుద్ధ అష్టమినాడు రాధాజయంతి వస్తుంది. ఆ రాత్రి నన్ను స్మరించు, నిద్రించు. నేను స్వయంగా వచ్చి నీకు మంత్రోపదేశం చేస్తాను. నీకు శుభమగునుగాక!.

యోగేశ్వరి: గురుదేవా! మీ శిష్యురాలిని, దాసురాలిని, మీ రెప్పుడూ నన్ను కనిపెట్టి ఉండండి. భవిష్యత్‌లో నేను మిమ్ము గుర్తించ లేకపోవచ్చు. యోగీశ్వరులైన మీరే నన్నుగుర్తించి దగ్గరకు తీసుకోవాలి. నా అభ్యర్ధనను అనుగ్రహించండి.

కాళీయోగి చిరునవ్వుతో చెయ్యెత్తి ఆశీర్వదించి గంభీరమైన కాళీ విగ్రహం వైపు చూస్తూ హోమకుండంలోకి ప్రవేశించి పద్మాసనంలో ధ్యానముద్రలో కూర్చొన్నాడు. అగ్నిస్తంభన సిద్ధుడైన ఆ మహనీయుని దహించే శక్తి అగ్నికి లేదు. ఆయన ఇచ్ఛాశక్తి వల్ల శరీరంలో నుండే అగ్ని ఉదయించి దహించటం మొదలు పెట్టింది. ప్రజ్వలిస్తున్న ఆ జ్వాలలో ఆ సిద్ధశరీరం దహనమవుతుంటే వాతావరణమంతా దివ్యపరిమళం వ్యాపించింది, ఒకవైపు అశ్రువులు కంటివెంట జాలువారుతుంటే, ఎంత ఆపుకున్నా ఆగని దుఃఖం మనసును ఆక్రమిస్తుంటే నిలుచో లేక ఒక స్తంభాన్ని పట్టుకొని అలా కూర్చుండిపోయింది యోగేశ్వరి. స్పృహ ఉన్నదో లేదో.

తరువాత కార్యక్రమం అంతా కాళీయోగి చెప్పినట్లే జరిగింది. కాళీ మందిరాన్ని యోగి సూచించిన ప్రకారం అక్కడికి వచ్చిన వృద్ధభక్తునకు అప్పగించింది. ఆయన కుమారుడు కూడా తీవ్రసాధకుని వలె కన్పించాడు. కొద్దిరోజులు అక్కడ ఉండి అక్కడ నుండి బయలుదేరి బృందావనం వెళ్ళింది. వృద్ధురాలైన తల్లి తనరాకకు ఎంతో సంతోషించింది. ఆమె అడిగితే తనసాధన గూర్చి గడచిన సంవత్సరాలలో చేసిన వాటి గురించి కొద్ది విశేషాలు చెప్పింది. వాటిని తన చెల్లెలు కూడా విన్నది. ఆమెకు వీటి మీద సదభిప్రాయం కలుగలేదు. యోగేశ్వరి కూడా నచ్చచెప్పటం కోసం ప్రయత్నంచేయలేదు. ఎవరి మార్గం వారిది. తనకు స్ఫురిస్తున్నదాన్నిబట్టి తన చెల్లెలు ఒక గోపికవలె కృష్ణుని విరహంతో తపించి తపించి కృతార్ధురాలవుతుంది. ఆ తరువాత కొద్ది కాలానికే వృద్ధురాలైన తల్లి మరణించింది. తమ స్వస్థలానికి వెళ్ళి అక్కడి ఆస్తి పాస్తుల వ్యవహారాలన్నీ సరిదిద్ది అన్నింటిని అమ్మివేసి ఆ ధనాన్ని తీసుకువచ్చి చెల్లెలికి అప్పగించింది. తనకు ఏవిధమైన పూర్వుల ఆర్జితము అక్కరలేదని ఇంతకు మునుపువలెనే, దేశదిమ్మరిగా తిరుగుతుంటానని చెప్పి చెల్లెలిని ఒప్పించి అక్కడినుండి కాశీ వెడుతున్నాని చెప్పింది. తల్లి మరణించిన ఇంట్లో తా నొక్కతే ఉండలేను గనుక, ఇప్పుడు ఉన్న ఇల్లు స్వగృహం కాదు కనుక తాను కూడా కాశీ వచ్చి కొన్నాళ్ళుంటానని చెల్లెలుకోరింది.

ఇద్దరూ కలిసి వారణాసికి చేరి కేదారేశ్వరుని దగ్గర ఒక ధర్మశాలలో ఉన్నారు. రోజూ విశ్వనాధుని దర్శనం, అన్నపూర్ణ, విశాలాక్షి మొదలైన దేవతలను పూజించటం జరిగేవి. కొన్నాళ్ళకు అక్కడికి దగ్గరలో ఒక చిన్నభవనం అమ్మకానికి ఉన్నదని విని యోగేశ్వరి

చెల్లెలు దానిని కొనాలని, కొంత కాలం కాశీవాసానికి ఉపయోగిస్తుందని భావించింది. యోగేశ్వరి కూడా మంచిఆలోచనే అనటం వల్ల ఆ ఇల్లు తీసుకొన్నారు. అక్కడ కొన్నాళ్ళు తపస్సు చేసిన తరువాత యోగేశ్వరి చెల్లెలిని విడిచి మళ్ళీ కొంతకాలానికి వస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

బయలుదేరిన యోగేశ్వరికి భాద్రపద శుద్ధ అష్టమి సమీపిస్తున్న సంగతి గుర్తుకు వచ్చింది. గురువుగారు చెప్పిన మాట స్మృతిలో మెదిలింది. బయలుదేరిన త్రోవమార్చి బృందావనానికి చేరుకొని, రాధాష్టమినాడు ఉపవసించి ఆ రోజు రాత్రి ధ్యానంలో కూర్చున్నది. అర్ధనిశా సమయానికి కాళీయోగి ధ్యాన భూమికలోకి వచ్చి రాధామంత్రాన్ని ఉపదేశించి ఆశీర్వదించి అదృశ్యమయినాడు. ఆయనతో ఎన్నో విషయాలు మాట్లాడాలని ఏవేవో చెప్పాలని ఆశించింది. కాని ఆయన దానికి అవకాశము ఇవ్వలేదు 'ప్రాప్తమింతే' అనుకొని 40 రోజులు ఆ పవిత్ర ధామంలో జపధ్యాన సాధన చేసింది. రాసేశ్వరి యొక్క కరుణా కటాక్షాలు తనయందు ప్రసరిస్తున్న అనుభూతి కలిగింది. సంతోషము కలిగినట్లు అనిపిస్తున్నది. హ్లాదినీ శక్తి తరంగాలు తనను ముంచెత్తడం ఆమె గమనించగలిగింది.

కర్తవ్య ప్రేరణవల్ల వంగదేశంలోని కొన్ని నిర్దిష్ట ప్రదేశాలకు వెళ్ళి చాలామంది సాధకులకు మంత్ర సాధనలవల్ల దివ్యానుభూతులు కలగటానికి తోడ్పడింది. కాళీయోగి శరీరాన్ని విడిచి పెట్టిన తరువాత మామూలు వస్త్రములు కాక కాషాయ వస్త్రధారిణియై విభూతి, కుంకుమ రెండూ ముఖమున ధరించి కంఠమున రుద్రాక్షమాలతో ఆమె నడచి వస్తూంటే తేజస్విని యైన ఒక మహాయోగిని కదలివస్తున్నట్లుగా ఉండేది. చూడటానికి 25సం॥ మాత్రమే ఆమె శరీరంపై కనబడేది. అక్కడి నుండి, భారతదేశములోని ఎన్నో దివ్యక్షేత్రములు దర్శించింది. ప్రధానంగా కాళీక్షేత్రములయిన ఉజ్జయినిలో, కామాఖ్యలో ఎక్కువ కాలం గడిపింది. అన్నిటికంటే కామాఖ్య అమెను ఎక్కువ ఆకర్షించటంవల్ల చాలాసంవత్సరాలు అక్కడే గడిపింది. హిమాలయాలకు వెళ్ళి తన గురువుగారు తపస్సు చేసిన గుహలో చాలాకాలం కాళీసాధన చేసింది. ధ్యానంలో కాళీదేవి, ఆమె సన్నిధిలో గురుదేవులు కనిపించేవారు.

ఇలా తీర్థయాత్రలలో క్షేత్ర కేంద్రీకృత తపస్సులో దాదాపు 40 సంవత్సరాలు గడిచిపోయినవి. గురువర్యులు ఇచ్చిన వరంవల్ల వయసు పైనబడ్డా ముసలి తనం రాలేదు. తనసంచారంలో భాగంగా కాశీ, బృందావనం మాత్రం తరుచుగా వెళ్ళి అక్కడ ఎక్కువ కాలం గడిపేది. కాశీలోని శవశివకాళీ మందిరంలో ధ్యానం చేస్తున్నపుడు తానే కాళినన్న తాదాత్మ్య భావన కలిగేది. అక్కడికి దగ్గరలో ఉన్న తారాపీఠంలో గాని, వటుక భైరవ మందిరానికి దగ్గరగా ఉన్న కామాఖ్య కాళి ఆలయంలో కాని ధ్యానం చేస్తే, అరుణ సుందరి అయిన మూర్తిగా తారా లక్షణాలుకల కాళి కనిపించేది. రతిప్రియయైన ఆ దేవత తనను ఆవేశించినట్లై, కామ భావనను తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న సమయంలో గురుదేవులు

సాక్షాత్కరించి కాపాడేవారు. అంతః ప్రేరణవల్ల మళ్ళీ వంగదేశం సంచారం చేస్తూ భిన్న ప్రదేశములలో తటస్థించిన ఇద్దరు యువకులకు తాంత్రిక సాధనలు కొన్ని అభ్యసింపచేసింది. వారికి చిన్న చిన్న శక్తులు కొన్ని లభించినవి. ఒక యువకుడు కావాలనుకొన్నపుడు తన శరీరంలోనుండి కాంతి పుంజాలను ఎంతదూరమైనా ప్రసరింపచేయ గలిగేవాడు. మరొక వ్యక్తికి అదృశ్యుడయ్యేశక్తి వచ్చింది. ఈ శక్తులను దుర్విని యోగం చేయవద్దని వారిని హెచ్చరించి తనదోవన తాను సంచారానికి బయలు దేరింది.

ఒకనాడు కలకత్తాలో గంగానది మీద పడవలో వెళ్ళి ఎదురుగా రాణీరాసమణీదేవి కట్టించిన దక్షిణేశ్వరకాళీ మందిరం వైపునడిచింది. అక్కడికి యాత్రికులుగా వచ్చిన సన్యాసులకు దేవాలయ అధికారులు వసతి భోజనసౌకర్యాలు ఏర్పాటు చేస్తారని విని ఉన్నది. గుడివైపు నడుస్తుండగా ఒక యువకుడు ఆమెను ఎదురుగా వచ్చి “మా మామయ్య మిమ్ములను తీసుకురమ్మన్నాడు. రండి”. అని ఆహ్వానించాడు. అక్కడ ఆమెకు పరిచితులెవరూ లేరు. మీ మామయ్య ఎవరు? ఎందుకు పిలుస్తున్నాడని అడగకుండా, సరే, పద అని ఆతని వెంబడి నడిచింది. ఆ యువకుడు గుడి పూజారి అయిన గదాధరుని దగ్గరకు తీసుకువెళ్ళాడు. గదాధరుని చూడగానే తను అతని కోసమే వచ్చానని స్ఫురణకల్గింది. “నాయనా! నీవు ఇక్కడ ఉన్నావా! నీ కోసమే వెతుకుతూ వస్తున్నాను” అన్నది. గదాధరుడు కూడా అలానా? తల్లీ! చాలా సంతోషము రా. అని మర్యాద చేసి సుఖాసనాసీనురాలిని చేశాడు. బాగా పరిచయమున్న వ్యక్తి తో మాట్లాడుతున్నట్లుగా గదాధరుడు తాను చేస్తున్న కాళీసాధన గురించి చెప్పి, తన అనుభవాలను చెప్పటం మొదలుపెట్టాడు. గదాధరుని మేనల్లుడు, ఆమెను ఆహ్వానించి తీసుకు వచ్చిన హృదయ్ ఆ దృశ్యాన్ని దిగ్భ్రాంతితో చూస్తున్నాడు. వారిద్దరూ చిరకాల పరిచితులవలె మాట్లాడుకుంటున్నారు. వారికి పూర్వపరిచయం లేదని తనకు తెలుసు. అద్భుత సౌందర్యంతో దివ్యతేజస్సుతో కాషాయంబరధారిణి యైన ఈ సన్యాసిని ఎవరు? ఆమె తన మేనమామను, గుడిపూజారిని నాయనా ! అని చిన్న పిల్లవానిగా పిలిచి మాట్లాడుతున్నది. తన మామ కూడ ఆమెను ‘అమ్మా’ అని తల్లివలె మాట్లాడుతున్నాడు. చూడటానికి ఇద్దరూ సమవయస్కులుగా ఉన్నారు. అతడికి ఏమీ అర్ధంకాలేదు. మామ సూచనను అనుసరించి ఆమెకు వసతి మొదలైన సౌకర్యాలు ఏర్పాటు చేయటం కోసం అతడు అవతలికి వెళ్ళాడు. గుడికి దగ్గరలో ఉన్న శ్మశానం లోని పంచవటిలో తాను చేసిన సాధనలను పొందిన దర్శనాలను, అనుభవాలను ఆమెకు విశదీకరించి చెప్పి “అమ్మా! నీవు చాలాగొప్పదానవు, సిద్ధురాలివి. నాకు కలిగిన ఈ అనుభవాలను విన్నవారు చాలా మంది మనః కల్పిత భ్రాంతులని కొట్టి వేస్తున్నారు. మరి కొందరు నన్ను పిచ్చివానిగా జమకడుతున్నారు. వీనిలో ఏది నిజమో నీవు చెప్పు అమ్మా” అని పసివాని వలె ఆమెను గదాధరుడు అభ్యర్థించాడు.

యోగేశ్వరి “నాయనా! నీవు పొందిన దర్శనాలు అనుభవాలు అన్నీ సుసత్యాలు. జగన్మాత అయిన కాళి నీకు ప్రసాదించిన అనుగ్రహ చిహ్నాలు. వాటి సత్యాన్ని గురించి నీవు

సందేహించవలసిన పనిలేదు. కాదనే వారి సంగతి ఇక నేను చూచుకొంటాను. నీవు నిశ్చింతగా ఉండు” అన్నది.

దేవాలయంలో ఆమెనివాసానికి ఒక గది ఏర్పాటు చేయబడింది. అక్కడ నుండి, ప్రతిరోజూ వారిద్దరూ ఏకాంతంగా కూర్చొని అనేక విషయాలు చర్చించేవారు. తరువాత గదాధరుని మేనల్లుడు చెప్పటం వల్లగాని, సామాజిక అవగాహన వల్లగాని ఇద్దరూ సమవయస్కులుగా కన్పిస్తున్నవారు. (నిజానికి భైరవీ బ్రాహ్మణి తనకంటే చాలా పెద్దదని గదాధరునికి తెలుసు. కానీ ఆమె 25సం॥ సౌందర్యవతిగా కన్పించేది.) ఒకే చోట ఉండటంగాని ఎక్కువసేపు కలిసి ఉన్నట్లు కనపడటంగాని ఉచితంగాదని గుర్తించి, తెలిసిన , వేరేచోట ఆమెకు వసతి ఏర్పాటు చేశాడు. ఆమె ఏ మహత్తర కార్యక్రమం కోసం వచ్చిందో ఆ కార్యక్రమం ప్రారంభించబడింది. కలకత్తాలో ఎక్కడెక్కడో వెదికి అనేక జంతువుల శరీరభాగాలు మూలికలు, కపాలములు తీసుకువచ్చి గదాధరుని చేత చిత్ర విచిత్రమైన సాధనలు చేయించింది. ఒకసారి ఆమె కపాలం లో చేపను ఉడికించి కాళికి నైవేద్యం పెట్టి గదాధరునికి ప్రసాదంగా ఇచ్చింది. గదాధరుడు తిన్నాడు (ఒరిస్సా బెంగాలు దేశాలలో బ్రాహ్మణులు చేపలుతినటం ఆచార విరుద్ధం కాదు. ఆయన భార్య శారదాదేవి అప్పుడప్పుడు చేపలపులుసు వండి భోజనంలో పెట్టటం అలవాటే) వేరొకరోజు ఇవాళ కాళీ దేవికి నరమాంసం నైవేద్యం పెట్టాలని వెదికి ఎక్కడా లభించక శ్మశానానికి వెళ్ళి పూడ్చి పెట్టిన శవంలోనించి ఒకముక్క కోసుకుని తెచ్చింది. ఆ శవం అప్పటికే కుళ్ళిపోయినది కావటంవల్ల అందలి మాంసం ముక్క కూడా కుళ్ళి దుర్వాసన వస్తున్నది. అయినా సరే పట్టుదలగా కాళికి నైవేద్యం పెట్టి కపాలంలో ఉంచిన ఆ నరమాంస ఖండాన్ని నైవేద్యంగా తీసుకోమని గదాధరునితో అన్నది. గదాధరుడు జుగుప్సావహంగా ఉన్న దానిని తీసుకోలేక, దీనిని ఎలాతీసుకోగలను? అన్నాడు. భైరవి “ఇలాతీసుకోవాలి” అంటూ కొంతముక్క తుంచి నోట్లో వేసుకొన్నది. ఆమె ముఖంలో ఏ వికారమూలేదు. ఆమె తీసుకోగలిగినప్పుడు నేనెందుకు తీసుకోలేను! సహ్యాము, అసహ్యాము రెండూ ఒకటే అన్న భావన కలిగి ఆ నైవేద్యాన్ని స్వీకరించాడు. అర్ధరాత్రి శ్మశానంలో పంచవటిలో అతడు దిగంబరుడై ధ్యానం చేస్తూంటే ఆమె ఎన్నో సార్లు మంత్రమార్గ నిర్దేశనం చేసేది. వికారాలకు, రాగద్వేషాలకు అతీతమైనస్థితిలో ఉన్న భైరవబ్రాహ్మణి ఎన్నిక చేయబడిన శిష్యుడు, సిద్ధ స్థితి వచ్చేలా చేయటమే తన ఆశయంగా అచంచలదీక్షతో కృషి చేసింది. ఒక రోజు రాత్రివేళ ఒక వేశ్యను తెచ్చి దిగంబరగా కూర్చోబెట్టి ఆవేశ్య యొక్క యోనిని చూస్తూ కాళీమంత్రం చేయమని ఆదేశించగా గదాధరుడు నిర్వికారంగా జపధ్యానములు పూర్తి చేశాడు. వేరొకరోజు రాత్రివేళ ఈ విధంగానే ఇద్దరు యువతీ యువకులను తెచ్చి వారు దిగంబరులై రతిక్రీడ చేస్తూ ఉండగా చూస్తూ మంత్రజపం చేయమని ఆతడిని ఆదేశించింది. ఆ దృశ్యాన్ని ఆమె ఎంత నిర్వికారంగా చూస్తున్నదో అంతకంటే నిర్వికారంగా చూస్తూ గదాధరుడు మంత్ర జపం చేశాడు. అయితే గదాధరునిలో విశేషమేమిటంటే జపం మొదలు పెట్టిన కొద్దిసేపటికే

ధ్యానస్థితిలోకి వెళ్ళి బాహ్యస్మృతిని కోల్పోయేవాడు. ఈ విధంగా 64 రకములైన తాంత్రిక సాధనలలో, భైరవీ బ్రాహ్మణి గురుత్వంలో గదాధరుడు శిక్షణ పూర్తి చేశాడు.

ఈ దశలో ఒకరోజు సుదీర్ఘదేహం కలిగిన ఒక నగ్న సాధువు దక్షిణేశ్వరం వచ్చాడు. గడ్డము జటాజూటములు గల ఆ దిగంబర సాధువు, నాగ సంప్రదాయానికి చెందినవాడు. గదాధరునిలో ఒక ప్రత్యేకత ఏమిటంటే తాను ఎంత సిద్ధపురుషుడైన, కాళీదేవీ యొక్క దర్శనాలను, అనుభూతులను పొందినవాడైనా, తాంత్రికసాధనలో ఉత్తీర్ణుడైనా, ఏదో ఒక విద్యలో నిష్ణాతులైన వ్యక్తులు వస్తే వారి ద్వారా ఆ విద్యనేర్చుకొని ఆ మార్గం యొక్క స్వరూపస్వభావాలు తెలుసుకోవాలని అనుకొనేవాడు. ఇప్పుడు వచ్చిన ఈ 'తోతాపురి' గదాధారుని యోగ్యతను గుర్తించి సన్యాసదీక్ష ఇవ్వాలని భావించాడు. అయితే ఆ విషయం గదాధరునితో చెప్పినపుడు "నాకు తల్లీ భార్య ఉన్నారు, నేను సన్యాసం తీసుకోవటానికి వారు ఇష్టపడరు" అని ఆతడన్నాడు. "సన్యాసానికి వైరాగ్యం ప్రధానం, తల్లి అనుమతి, భార్య అనుమతి కావాలని అంటే వారితో అనుబంధాలు, ఇంకా ఉన్నవన్నమాట. వైరాగ్యం కలిగినవారికి ఎవరి అనుమతీ అవసరం లేదు" అనగా గదాధరుడు – ఆ నాగసాధువు దగ్గర సన్యాస స్వీకారం చేశాడు. అతనికి 'రామకృష్ణ' అన్న నూతన నామధేయం ఇవ్వబడింది. సన్యాస మార్గంలో 'పరమహంస' అన్నది అత్యున్నతస్థానం కనుక, రామకృష్ణుడు ఆ స్థాయికి ఎదిగిన వాడుగనుక, అనంతరకాలంలో ఆయన 'రామకృష్ణ పరమహంస'గా పిలువబడినాడు.

తోతాపురి సూచనల వల్ల ప్రేరణ వల్ల నిర్వికల్ప సమాధిలో నిర్విరామంగా 3 రోజుల పాటు ఉండటం తోతాపురికే దిగ్భ్రాంతి కల్గించింది. కొన్నాళ్ళుండి తన కర్తవ్యం పూర్తయినదని భావించిన తోతాపురి అక్కడ నుండి వెళ్ళి పోయినాడు.

దక్షిణేశ్వర కాళీ మందిర యజమాని మధురాబాబుకు రామకృష్ణుడంటే ఎనలేని గౌరవం. కాళీమాత యొక్క దివ్యమైన అనుబంధాన్ని పొందిన మహాభక్తుడని ఆయనను గూర్చిన ప్రగాఢమైన విశ్వాసం. ఒకరోజు భైరవీబ్రాహ్మణి అక్కడ ఉండగా మధురాబాబు అక్కడికి వచ్చాడు. ఆమెకు రామకృష్ణునికి, ఇద్దరికి నమస్కారము చేసినప్పుడు సంభాషణ వశాన ఆమె రామకృష్ణుడు అవతార పురుషుడని ప్రతిపాదించింది. ఆ మాటలు విని మధుబాబు "రామకృష్ణులవారు, మహనీయులనటంలోను, కాళీదేవి కరుణను పొందిన వారనటం లోనూ ఎటువంటి సందేహమూ లేదు కానీ, అవతారాల విషయానికివస్తే నాకు తెలిసిన కొద్ది పరిజ్ఞానంలో అవతారాలు 10 అని అందులో 9 అవతారాలు కృష్ణావతారంతో పూర్తయినవని పదియవ అవతారం కలియుగాంతంలో మాత్రమే వస్తుందని ప్రజలు చెప్పగా విన్నాను అన్నాడు. దానికి భైరవబ్రాహ్మణి సమాధానం చెపుతూ "అవతారాలలో దశావతారాలు ముఖ్యమైనవి మాత్రమే, భాగవతంలో ఏకవింశతి అవతారాలు చెప్పబడినవి. మరికొన్నికూడా ఉండవచ్చు. రామకృష్ణులవారికి కలిగిన అనుభవాలను వివిధ సాధనల వల్ల ఆయన పొందిన సిద్ధశక్తులను విశ్లేషించినపుడు ఆయన అవతార మని చెప్పక తప్పదు. అదీకాక

మహాపురుషుడైన కృష్ణచైతన్య మహాప్రభువు మళ్ళీ అవతరిస్తాడని గౌడీయ సంప్రదాయంలో యోగులు చెపుతున్నారు. ఈ విషయం నేను వాదించి సప్రమాణంగా శాస్త్రబద్ధంగా నిరూపించి ఏ పండితుడినైనా ఒప్పిస్తాను. మీరు విద్వత్ సభ ఏర్పాటు చేయండి. మిగతావి నేను చూచుకుంటాను" అన్నది.

మధురాబాబు కొద్ది రోజులలోనే పండితసభ ఏర్పాటు చేశాడు. 'అందులో జరిగిన రకరకాల వాద ప్రతివాదాలలో వచ్చిన విద్వాంసులు రెండురకాలుగాను తర్కించారు. భైరవీబ్రాహ్మణి తన వాగ్వైభవమువల్ల పాండిత్యమువల్ల రామకృష్ణ పరమహంస అవతారపురుషుడని శాస్త్రబద్ధంగా తర్కనైపుణ్యంతో వాదించింది. ఆమెనెవరూ కాదనలేకపోయినారు. ఆ విధంగా ఆ సభ ముగిసింది. దీనివల్ల రామకృష్ణుని కీర్తి మరింతగా కలకత్తా నగరం అంతా వ్యాపించింది. ఈ విధంగా కొంత కాలం గడిచిన తరువాత ఒకసారి అందరూ కలిసి రామకృష్ణులవారి స్వగ్రామానికి వెళ్ళారు. అక్కడ వైభవోపేతంగా కాళీ పూజలు ఏర్పాటు చేయబడ్డాయి. పూజానంతరం అన్ని కులాలవారికి సమారాధన జరిగింది. భోజనాలయిన తరువాత భైరవీబ్రాహ్మణి సేవాభావంతో ఇతరకులాలవారి ఎంగిలి విస్తళ్ళను ఎత్తివేసింది. అది చూచిన రామకృష్ణుల మేనల్లుడు హృదయ్ ఆమెను పెద్దగా అవమానకరంగా దూషించాడు. అక్కడ ఉన్న వారి కుటుంబ సభ్యుల పెద్దలు ఆమె చేసిన పనిని గర్హించారు. ఆ సంఘటనంతా చూస్తూ కూడా రామకృష్ణులవారు ఏమీమాట్లాడలేదు. దానితో ఆయన జీవితంలో తన పాత్ర ముగిసిందని, తానిక నిష్క్రమించవలసిన సమయమాసన్నమైనదని గుర్తించింది. అది లోకసహజమే, కలకత్తా వెళ్ళిన తరువాత రామకృష్ణుల వారితో చెప్పి అక్కడి నుంచి కదిలి వెళ్ళిపోయింది. ఆయన కూడా ఉండమని ఏమీ బలవంతం చేయలేదు.

అక్కడి నుంచి మళ్ళీ కొద్ది సంవత్సరాల పాటు దేశసంచారం చేస్తూ కాశీకి వెళ్ళి తన చెల్లెలితో పాటు ఆమె కొన్న గృహములో ఉన్నది. అప్పుడప్పుడు త్రైలింగసామిని చూచి ఆయన ఆశీస్సులు తీసుకొంటూ జప ధ్యానములతో కాలం గడపసాగింది. ఇలా ఉండగా రామకృష్ణులవారు కాశీ వస్తున్నారన్న వార్తవచ్చింది. కొద్దిమందితో కలిసి రాగా, వారందరికి తమ ఇంటిలో వసతి ఏర్పాటు చేసింది. రామకృష్ణులు కొన్నాళ్ళు అక్కడ ఉండి, కాశీలో చూడవలసినవి చూచి తరువాత మళ్ళీ కలకత్తా వెళ్ళి పోయినాడు.

ఈ విధంగా మరికొంత కాలం గడచిన తరువాత కాళీభక్తు డెవరో వచ్చి దగ్గరలో ఉన్న ఒక ధర్మశాలలో బసచేశారని విని ఆసక్తి కొద్దీ దర్శిద్దామని వెళ్ళింది. అక్కడికి వెళ్ళి చూస్తే అతడు సుమారు 30, 35 సంవత్సరాల యువకుడు చిన్న నల్లని గడ్డము కొద్దిగా ఉంగరాలు తిరిగి విరబోసిన కేశపాశములు చామనచాయ శరీరము, తెల్లని వస్త్రాలు ధరించి ఉన్నాడు. ఆయన పరివారంలో కొందరు శిష్యులు మగవారు, ఆడవారు ఉన్నారు. లోపలికి వెళ్ళి ఆయనను దర్శించగానే, ఆయన కూర్చున్న చోటుకు వెనకాల నిలువెత్తు చిత్ర పటం

ఆమెను ఆకర్షించింది. అందులోని కాళీదేవి అచ్చం అరణ్యాలలో తన గురువైన కాళీయోగి స్థాపించిన మూర్తివలె ఉన్నది. అయితే అక్కడిది విగ్రహం, ఇక్కడిది చిత్రము. తను ఎన్నోచోట్ల కాళీదేవి విగ్రహాలను చూచింది. చిత్రకారులు చిత్రించిన చిత్రాలను చూచింది. కాశీలో శవశివకాళీ మందిరం, అక్కడికి దగ్గరలోని, తారాపీఠములోని కాళి అక్కడికి మరొక వైపున్న కరుణాకాళీ, దయాకాళి తన నెంతో ఆకర్షించినవి. అవి గొప్ప శక్తి కేంద్రాలు. త్రైలింగస్వామి పూజించిన మంగళాకాళి, కీనారాం అర్చించిన హింగుళాకాళి, ఈ కాళీమూర్తులు తనయందు అనుగ్రహం ఎప్పుడూ చూపిస్తునే ఉన్నారు. కానీ ఆమె పూజించిన కళింగారణ్యకాళీ చిత్రం చూడటం ఇదే మొదటిసారి. తన దేవత చిత్రాన్ని ఎవరు గీశారు? ఈయన దగ్గరకు ఎలా వచ్చింది? అందరూ స్వామి అని పిలుస్తున్న ఈ యువకుడు ఎవరు? ఇలా ఆలోచిస్తూ మూతలువడిన కన్నులు తెరిచే సరికి గదిలో ఆ స్వామి, తాను తప్ప ఎవరూలేరు. అందరూ బయటకు వెళ్ళి పోయినారు. సంధ్యాసమయం దాటి చిరుచీకట్లు చిమ్ముతూ, వెలిగించబడిన దీపాలకాంతిలో, ఆ తరుణస్వామి విచిత్ర వ్యక్తిగా భాసిస్తున్నాడు. ఆయనను, ఆ చిత్రంలోని కాళీదేవతను గురించి అడుగుదామని అనుకొంటుండగానే అత డిలా అన్నాడు.

యోగి: యోగీశ్వరీ! నీమనస్సులో కల్లోలిత మవుతున్న సందేహాలు నాకు తెలుసు. కాళీ చిత్రాన్ని గురించి తెలుసుకోవాలని అడుగ బోతున్నావు.

భైరవి: స్వామీ! నా పేరు మీకు ఎలా తెలుసు. నా మనసులోని ఆలోచనలు మీకు ఎలా తెలిసినవి?

యోగి: 50 ఏండ్ల క్రింద బృందావనంలో నా దగ్గరకు వచ్చినపుడు ఇదే ప్రశ్నవేశావు. అప్పుడు నేను, ఏది కావాలంటే అది తెలుసుకోగలను అని చెప్పాను గుర్తుతెచ్చుకో.

యోగేశ్వరి స్థితి నుండి భైరవీబ్రాహ్మణిగా పరిణామం చెందావు. దాదాపు 70ఏండ్లు వయస్సులో కూడా ఆనాటి యౌవనమే ఈనాడు కూడా ఉండటానికి కారణమైన నా వరాన్ని గుర్తుతెచ్చుకో.

భైరవి: స్వామీ! మీరు నా గురుదేవులయిన కాళీయోగియా? నాకు నోట మాటరావటంలేదు. దిగ్భ్రాంతిలో మునిగి ఉన్నాను.

యోగి: సుమారు 45 సంవత్సరాల క్రింద కాళీదేవి ముందరి అగ్ని కుండంలో నేను దహనమయి పోతున్నపుడు త్వరలో మళ్ళీ జన్మ తీసుకో వచ్చని చెప్పాను. అప్పుడు నీవు నేను మిమ్ము గుర్తుపట్ట లేకపోవచ్చు మీరే నాకు గుర్తు తీసుకురావాలి' అన్నావు.

భైరవి: నిజమే స్వామి, నిజమే ఆయ్యో! నేను ఎంత మూర్ఖురాలిని ఇన్ని విద్యలుండి కూడా మిమ్ము తెలుసుకో లేకపోయినాను. అని కంటి నుండి అశ్రువులు రాలుతుండగా

ఆయన పాదములపై వ్రాలిపోయింది. అత డామెను ఓదార్చి నెమ్మదిగా అనునయించి ఊరుకోమని చెప్పాడు. ఆమె స్వామివారు ఎక్కడ పుట్టింది ఆ వివరాలు అడిగింది అతడిలా చెప్పాడు "యోగినీ! సుమారు 35 సంవత్సరాలక్రింద దక్షిణ దేశంలో ఒక తెలుగు కుటుంబంలో పుట్టి కాళీదేవి అనుగ్రహం వల్ల పూర్వ స్మృతినిలిచి, ఆంధ్రదేశం దాటుతూ శ్రీకాకుళం దగ్గరి విజయనగరంలో కొంతకాలం ఉన్నాను. అక్కడి రాజావారు నాయందలి భక్తితో నాకొక అగ్రహారాన్ని సమర్పించడంవల్ల కొంత ఎక్కువ కాలం అక్కడ ఉండవలసి వచ్చింది. అక్కడి నుండి ఓఢ్ర భూములలోని మన కాళీదేవి ఆలయానికి వచ్చాను. అక్కడ నా సూచన మీద వృద్ధుడు యువకుడు శ్రద్ధగా దేవతాపూజ చేస్తునే ఉన్నాడు. నీవలెనే వారూ నన్ను గుర్తు పట్టలేదు. తెలిసిన తరువాత వారెంతో పొంగిపోయారు. అయితే ఆలయనిర్వహణ మీరే చేస్తుండమని నేను అప్పుడప్పుడు వచ్చిపోతుంటానని వారికి నచ్చచెప్పి నీకిచ్చిన మాటకోసం ఇక్కడకు వచ్చాను. ఈ శరీరంతో నీవు చేయవలసిన కర్తవ్యాలు చాలావరకు పూర్తయినవి. కొద్ది కాలంలోనే నీకు మరణం సంభవిస్తుంది. కర్మానుబంధం వల్ల నీవు ఇంకా కొన్ని జన్మలు ఎత్తవలసి ఉన్నది. నీవిక్కడే కాశీ క్షేత్రంలో మరణిస్తే నీకు పునర్జన్మ ఉండదు. కానీ నీవు ఇంకా కొన్ని జన్మలు తీసుకోవలసి ఉండటం వల్ల క్షేత్రపాలకుడైన కాలభైరవుడు నీయందు అనుగ్రహం కలవాడైనా నిన్ను ఇక్కడ ఉండనీయడు. కనుక నీవు బృందావనానికి వెళ్ళి అక్కడ శరీరాన్ని వదిలి వేద్దువుగానివి. కొద్దిరోజులలో నీ తాంత్రిక విద్యాశిష్యుడైన రామకృష్ణపరమహంస వస్తాడు. అతడు కూడా నిన్ను బృందావనం వెళ్ళమని సలహా ఇస్తాడు. ఇంతకూ అతడెవరో తెలుసునా? నేను బృందావనంలో ఉన్నపుడు అప్పుడైన రూపగోస్వామికి ఒక ప్రత్యేక ధ్యాన సాధనామార్గము తెలియచేశాను. ఒక వైపు రాధాకృష్ణ సాధన చేస్తూ కృష్ణతత్వానికి సంబంధించిన గ్రంధాలను రచిస్తూ కూడా రోజూ కొద్ది ఘడియలు నేను చెప్పిన మార్గంలో ధ్యానం చేసేవాడు. అయిదు సంవత్సరాలు ఆ సాధన చేసిన ఫలితంగా అంతరిక్ష చరుడైన ఒక కాళీసిద్ధునితో అనుబంధం కలిగింది. దాని వలన రూపగోస్వామి ఎన్నో ప్రయోజనాలు పొందాడు. ఆ కాళీసిద్ధుడు శాకంభరీ పీఠానికి చెందిన వాడు కావటం వల్ల ఆయనకు శాకంభరీయోగి అన్న పేరుండేది. అతడూ నాకు ఎంతో ఆప్తుడు, కాళీమండలానికి చెందినవాడు. అతడు కొంత కాలం క్రింద శరీరాన్ని విడిచి పెట్టి దివ్యభూమికలలో అల్పకాలం ఉండి పరమేశ్వరి సంకల్పం వల్ల రామకృష్ణ పరమహంసగా దిగివచ్చాడు. నీవు మరణించిన మరికొంతకాలానికి అతడు కూడా శరీరాన్ని విడిచి పెట్టి సిద్ధమండలంలో దాదాపు 400 సంవత్సరాలు ఉంటాడు. ఈ విషయాలు నీకు మాత్రమే. అతడికి నన్ను గురించి గాని ఈ విషయాలు గాని నీవు చెప్పవలసిన పనిలేదు.

నీవు మరణించిన తరువాత చాలా కొద్ది కాలానికి మళ్ళీ భృగువంశీయులైన బ్రాహ్మణుల ఇంటిలో పుట్టబోతున్నావు. నీ తల్లి నెలలు నిండకుండానే నిన్ను కన్నందు వల్ల నీవు చిన్న శరీరంతో బంగారు రంగుతో ఉండటం వల్ల నీతాత నిన్ను సూక్ష్మ భార్గవి అని పిలుస్తాడు. అయితే నామకరణ సమయంలో అందమైన నీ కన్నులను చూచి నీ తల్లితండ్రులు

నీకు సులోచన అన్న పేరు పెడతారు. ఇంకా 35 సంవత్సరముల తరువాత ఈ శరీరంలో ఉన్న నా దగ్గరకు వచ్చి శిష్యురాలివై కొన్నాళ్ళు సేవచేస్తావు. ఆ తరువాత సహజమైన పరిణామంలో వృద్ధత్వం వచ్చి మరణించి 20వ శతాబ్దం ద్వితీయార్ధంలో మళ్ళీ పుట్టి, దేవతాభక్తితో సాధనలు చేస్తావు. నేను కూడా ఈ శరీరాన్ని కొన్నాళ్ళకు విడిచిపెట్టి మళ్ళీ ఆంధ్రభూమిలో ఉదయించి ప్రసాదరాయకులపతి అన్న పేరుతో విద్వత్కవిగా ప్రసిద్ధిచెంది ఏవో ఉద్యోగాలలో సద్యోగాలలో కొంత కాలం గడిపి దక్షిణదేశంలోని కుర్తాళ సిద్ధేశ్వరీపీఠాధిపతి దగ్గర సన్యాసం తీసుకొని తరువాత దానికి పీఠాధిపతినై ఉన్నసమయంలో ఇప్పటివలెనే మళ్ళీ అప్పుడు నా దగ్గరకు వస్తావు. అప్పటినీ వివరాలు అప్పుడు నీవు తెలుసుకోగలవు. ఇప్పటి వలెనే గుర్తు చేస్తాను. తపస్వినివై, యోగినివై, ప్రకాశింతువుగాక!.

భైరవి : స్వామీ! ఇవన్నీ వింటూంటే నాకు చాలా భయంగా ఉన్నది. అసాధ్యమైన కర్మప్రభావం ముందు నేను దిక్కులేనిదాన నయిపోతాను. మీరే నేను ఎక్కడ ఉన్నా చేయిపట్టుకు నడిపించాలి.

యోగి: బృందావనం నుంచి బయలు దేరినపుడు నీకొక మాట చెప్పాను. చిన్నతనంలో బిడ్డను తల్లి చెయ్యిపట్టుకొని నడక నేర్పుతుంది. తరువాత తండ్రి చేయిపట్టుకొని విద్యాశాలకు తీసుకు వెడతాడు. వయసు వచ్చిన తరువాత భర్త, చెయ్యి పట్టుకునిజీవితంలో నడిపిస్తాడు. ఆనాడు నీవు రెండవదశలో ఉన్నావని చెప్పాను. రాబోయే జన్మలలో ఏదశలో నాదగ్గరకు వస్తావో! ఎలా వచ్చినా నిన్ను అనుగ్రహిస్తాను.

భైరవి: ధన్యురాలిని, అని స్వామి వారి పాదములకు నమస్కరించింది.

29. సిద్ధేశ్వరానందభారతీస్వామి

హిమాలయ పర్వతాలలో కర్దమ ప్రజాపతి ఆశ్రమం ఉంది. ఆయన కుమారుడు కపిలుడు. విష్ణువు యొక్క అంశవల్ల పుట్టటం దివ్యస్ఫురణ ఉండడం వల్ల అతడు సహజంగా ఏ సాధన లేకుండానే సిద్ధుడైనాడు. చిన్నప్పుడు పాఠశాలలో ఆయనతో పాటు జైగీషవ్యుడనే ఋషి కుమారుడు కూడా తోటి విద్యార్థి. ఇద్దరూ చాలా ఆప్తులుగా ఉండేవారు. కొన్ని సంవత్సరాలు వేదాది విద్యలు పూర్తి అయిన తర్వాత జైగీషవ్యునికి తపస్సు చేసి దివ్యశక్తులు సాధించాలన్న కోరిక కలిగింది. మిత్రుడైన కపిలుని సలహాతో కైలాసపర్వత ప్రాంతంలోని సిద్ధాశ్రమానికి వెళ్ళి అక్కడ కొన్ని సంవత్సరాలు కఠోరనియమాలతో కైలాసనాథుని గూర్చి తపస్సు చేశాడు. మహేశ్వరునకు కరుణ కలిగింది. సాక్షాత్కరించాడు. అయితే ఆయన నీలలోహితుడై వజ్రధరుడై దిగంబరుడై భీషణ సుందరమూర్తితో ఉన్నాడు. జైగీషవ్యునకు ఆశ్చర్యం కలిగింది. హరుడు చిరునవ్వుతో అన్నాడు "ఓయీ! నీ ఆశ్చర్యం చూస్తున్నాను. నీవు తపస్సు చేసిన యీ చోటు డాకినీ శ్మశానం. నీవు రుద్రభూమిలో చేసిన యీ సాధన

స్థల ప్రభావం వల్ల ఇక్కడి సిద్ధయోగుల కరుణవల్ల శీఘ్రఫలప్రదమైంది. ఇక్కడ నేను వజ్రకాళీవల్లభుడనై విహరిస్తుంటాను. మహాభైరవుడనై నీకు తీవ్రశక్తులను ప్రసాదిస్తున్నాను. ఈ అనంతకాలంలో నీవు నా ప్రతినిధిగా నిర్వర్తించవలసిన పాత్ర ఉంది. నీ మిత్రుడైన కపిలుడు విష్ణుదేవుని అంశావతారము. సమస్త సిద్ధులు అతని వశంలో ఉంటవి. ఆ మహాపురుషుని మైత్రి నీకు శ్రేయస్కరము. ఇక్కడ నుండి నీవు కాశీమహాక్షేత్రానికి వెళ్ళు. అక్కడి గుహలో మరికొంత కాలం ధ్యానదీక్షలలో ఉండు. వారణాసీ వల్లభుడైన విశ్వనాధుడు, ఆ దివ్యక్షేత్ర రక్షకుడైన కాలభైరవుడు నిన్ను అనుగ్రహిస్తారు. కాలమునకు అధిపతియైన ఆ భైరవుని కృపవల్ల అఖండకాలములో నీ పాత్రను సమర్థతతో నిర్వర్తించగలుగుతావు" అని వరములిచ్చి అదృశ్యుడైనాడు.

ఆ స్వామి ఆజ్ఞప్రకారం కాశీలో గుహావాసియై అహోరాత్రములు భేదం లేకుండా చిరకాలం ధ్యానం చేసి ప్రమథగణంలో స్థానం పొందగలిగాడు. ఒక రోజు దేవల మహర్షి గొప్ప తపస్సంపన్నుడని విని అతని ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడి శాంతవాతావరణం ఆయనకు వచ్చింది. ఆ స్థలంలో కొంతకాలం ఉందామనిపించింది. ఆయన ఆసక్తిని చూచి దేవలుడు "ఆర్యా ! మీరు మా ఆశ్రమంలో ఎంతకాలమైనా ఉండవచ్చు. తపస్సు చేసుకోవచ్చు. కావలసిన సౌకర్యాలన్నీ చేస్తాను. మీరు కోరిన సిద్ధి లభించిన దాకా మీ యిష్టదేవతా సాధనచేయండి" అన్నాడు. అతనికి జైగీషవ్యుని మహత్వాన్ని గురించి తెలియదు. సామాన్యుడైన మునిమాత్రునిగాను, ఇంకా సాధనదశలో ఉండి దేవతానుగ్రహం కోసం కృషిచేస్తున్న తపోభావుకునిగాను భావించాడు. జైగీషవ్యుడు కూడా దేవలుని అపరిపక్వతను గమనించి, ఏమీ తెలియని సామాన్యునిగా ఆ ఆశ్రమంలో నిత్యము జపధ్యానములు చేస్తూ గడుపుతున్నాడు. కొంతకాలం గడిచిన తర్వాత తన తపశ్శక్తిని, మహత్తులను జైగీషవ్యునకు చూపించాలన్న కుతూహలము, చాపల్యము దేవలునకు కలిగినవి. కలిగి ఇలాఅన్నాడు "జైగీషవ్యా ! ఈ రోజు నాకు కొంచెం పని ఉండి ఆకాశమార్గంలో దివ్యలోకాలకు వెళ్ళి వస్తాను. నీకేయిబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాను. నీకింకా అటువంటి శక్తులురాలేదు గదా! ఎప్పటికైనా రావచ్చు. శ్రద్ధగా సాధనచేస్తూ ఉండు" అని చెప్పి ఖేచరుడై కొన్ని వందల యోజనముల దూరంలో ఉన్న సముద్రం దగ్గరకు వెళ్ళి స్నానానికి దిగాడు. తీరా చూస్తే ఒడ్డుననే ధ్యానం చేస్తూ కండ్లు మూసుకొని ఉన్న జైగీషవ్యుడు కనిపించాడు. దిగ్భ్రాంతి కలిగింది. అక్కడి నుండి గగన పథంలో ప్రయాణించి సిద్ధలోకానికి వెళ్ళాడు. అక్కడ సిద్ధులంతా జైగీషవ్యుని పూజిస్తున్నారు. కొంత కనువిప్పు కలిగింది. "ఈయన సామాన్యుడనుకున్నాను. మహనీయులైన సిద్ధులచే పూజలందు కొంటున్నాడు. అయినా ఇంకా పైలోకాలకు వెళ్తాను. అక్కడకు కూడా చేరుకోగల శక్తి ఉన్నదా లేదా చూస్తాను" అని అగ్నిలోకము, సోమలోకము, వసులోకము, రుద్రలోకము, బృహస్పతిలోకము మొదలైన ఊర్ధ్వలోకాలకు వెళ్ళాడు. ఆశ్చర్యంగా ప్రతిచోట జైగీషవ్యుడు పూజించబడుతూ కనిపించాడు. చివరకు తపోలోకానికి వెళ్ళినా అంతే. జైగీషవ్యుని దగ్గరకు వెళ్ళి మాట్లాడదామని ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో ఆయన ఇంకా ఊర్ధ్వలోకానికి ఎగిరివెళ్ళిపోయినాడు. అక్కడ తపోనిధులను దేవలుడు జైగీషవ్యుని గూర్చి ప్రశ్నించాడు.

వారు “ఆయన యోగీశ్వరుడని, అసమాన అద్భుతశక్తి సమన్వితుడని ప్రస్తుతం ఇక్కడ నుండి బ్రహ్మలోకానికి వెళ్ళాడని – నీవింకా కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేస్తే గాని అక్కడకు వెళ్ళలేవని – ఆమహాపురుషునిలో లక్షోవంతు శక్తికూడ నీకు లేదని” తెలియజేశారు.

అప్పుడు దేవలుడు ఆ లోకమునుండి క్రిందికి దిగి తన ఆశ్రమానికి వస్తే అక్కడ జైగీషవ్యుడు ప్రశాంతంగా కూర్చుని ఉన్నాడు. మహర్షి ఆ మహానుభావుని కాళ్ళమీదపడి ఆయన అనుగ్రహంతో అనేక తత్వవిద్యారహస్యాలను తెలుసుకొన్నాడు.

అక్కడ కొన్నాళ్ళున్నతర్వాత జైగీషవ్యుడు బయలుదేరి తన మిత్రుడు మహనీయుడు అయిన కపిలమహర్షిని చూడాలనిపించి హిమగిరిలోని వారి నివాసానికి వెళ్ళాడు. ఆ మహాత్ము డిప్పుడు క్రౌంచద్వీపంలో ఉన్నట్లు తెలిసి ఆకాశమార్గాన ఆ ప్రదేశానికి చేరుకొన్నాడు. అది అరుణగిరిప్రాంతంలో ఉంది. (క్రౌంచద్వీపమంటే అమెరికా. కొలరాడో పర్వతాలే అరుణగిరి). చుక్క తెగిపడినట్లుగా అచట దిగి ఒక అశ్వత్థవృక్షం క్రింద ఆసీనుడై ఉన్న ఆ మహాపురుషునకు సాష్టాంగ ప్రణామం చేశాడు. కపిలుడు సాదరంగా ఆహ్వానించాడు.

కపిల : మిత్రుడా ! కుశలమే గదా ?

జైగీ : మీ దయవల్ల కుశలమే. మిత్రుడా అని నన్ను మీరాదరించారు. కానీ నేను మీ శిష్యుడను. మీ భక్తుడను.

కపిల : ఇద్దరమూ కలసి చిన్నప్పుడు చదువుకొన్నాము కనుక నాకు సతీర్థ్యుడవు, ఆప్తుడవు.

జైగీ : ఏదో నా పూర్వపుణ్యవశమున లభించిన అదృష్టము. విష్ణ్వంశ సంభూతులైన మీరు అవతారపురుషులు. మీ కృపవల్ల మీకు సఖుడను కాగల భాగ్యము లభించింది. సిద్ధులలో మిమ్ము మించినవాడు లేడు.

కపిల : తపస్సు వలన నీవు కూడా కొన్ని సిద్ధశక్తులు సాధించావు. అతి మానుషమైన శక్తులు నీకూ కొన్ని ఉన్నవి కదా!

జైగీ : నిజమే, కాని అవి కొన్ని మాత్రమే. దివ్యశక్తులు కొంత లభించిన మాట సత్యమే కాని, దివ్యజ్ఞానము మీకున్నంత నాకులేదు.

కపిల : అది యథార్థమే. దాని హేతువులు దానికున్నవి. నీకు గుర్తున్నది కదా! చాలాకాలం క్రింద ఒక రాజ్యంలో మనముండగా ఆరాజు మన దర్శనానికి వచ్చాడు. నీవు నన్ను గురించి చెపుతూ, సాక్షాత్ విష్ణుమూర్తి యొక్క అవతారమీ కపిలమహర్షి అని అన్నావు. ఆ రాజు నమ్మలేదు. దివ్యశక్తులు కొన్ని చూపించినా అతడికి విశ్వాసం కలుగలేదు. చివరకు నీ కోరికమీద నాస్వస్వరూపమైన నారాయణా కృతిని ధరించాను. నీవు గరుత్మంతుడవై నాకు వాహనమయినావు. అతడేదో కొంత నమ్మినట్లు కనిపించి వినయపూర్వకంగా

నమస్కారాలు అర్పించాడు. ఆ ఆకారాలతోటే మన మాకాశమార్గంలో మన ఆశ్రమానికి వచ్చాము.

జైగీ : ఋషివల్లభా ! నాకు గుర్తున్నది. ఇదే కాదు రావణాసురుని మీరు శిక్షించిన సంఘటన కూడా మీ అవతార మహత్వానికి నిరూపణగా గంధర్వులు కీర్తిస్తున్నారు.

కపిల : అవసరమై ఆవిధంగా చేయవలసి వచ్చింది. నేను హిమాలయాలలోని ఒక గుహలో నిద్రిస్తున్నాను. బలవంతుడైన రావణాసురుడు, ఎటో జైత్రయాత్ర వెడుతూ ఈ గుహలో ఏముందో చూదామని లోపలికి వచ్చాడు. లోపల శయనించి ఉన్న నన్ను చూచి ఎవరక్కడ అని పెద్దగా అరిచాడు. వాడి అరుపుకు ఎవరైనా నిద్రలేస్తారు. నేను లేవలేదు. వాడు ఆగ్రహించి నా మీద దెబ్బ వేయబోయినాడు. క్షణంలో నేను లేచి వానికొక ముష్టిఘాతం ఇచ్చాను. ఆ దెబ్బకు కళ్లు తిరిగి క్రిందపడ్డాడు. తమాయించు కొని లేచి దిగ్భ్రాంతి చెంది నన్ను చూచి ఇలా అన్నాడు. "అయ్యా ! నీ వెవరో నాకు అర్థం కావటం లేదు. ఒక్క దెబ్బతో నన్నిలా పడగొట్టినవాడు ఇంత వర కెవ్వరూ లేరు. నేను బ్రహ్మవరం వల్ల అజేయుడను. నేను రుద్రుని చూచాను. ఇంద్రుని ఎరుగుదును. యముని, అగ్నిని, తెలిసినవాడను. వా రెవ్వరికీ ఇంతటి పరాక్రమము, రౌద్రము లేవు. నీ వెవ్వరో తెలియచేయవలసినది" అనగా నేను వానితో "మూర్ఖుడా! అహంకారముతో బలముతో విర్రవీగుతూ లోకాలను బాధిస్తున్నావు. బ్రహ్మ ఇచ్చిన వరము నందు మర్యాదనుంచి నిన్నింతకాలము ఉపేక్షించాను. త్వరలో మానవునిగా అవతరించి నిన్ను సంహరిస్తాను. నే నెవరైతే నేమి ? బ్రహ్మరుద్రాదుల కతీతుడైన సర్వాత్మకుడను, జగన్నాథుడను నేను. వెళ్ళు" అన్నాను. వాడు తలవంచుకొని వెళ్ళిపోయినాడు.

జైగీ : మహాత్మా ! ఈ సంఘటన నేను విన్నాను. ఇది ఎప్పుడో త్రేతాయుగం నాటి కథ కదా ? అప్పుడు నే నెక్కడ ఉన్నాను.

కపిల : ఆత్మీయుడా ! ఇది దేవరహస్యము. అయినా నీ మీది ప్రేమ వలన చెబుతున్నాను. నేను ఆదియుగముల నాటి సిద్ధుడను. అనేక యుగములలో అవసరమయినప్పుడల్లా శరీరాన్ని నిర్మించుకొంటూ ఉంటాను. నేను నిర్మాణకాయుడను. వసిష్ఠుడు, అగస్త్యుడు, విశ్వామిత్రుడు మొదలైనవారు ఇట్టివారే. మేము లాంఛనముగా ఎవరికో సంతానముగా పుట్టినట్లు కనపడవచ్చు. కానీ పూర్వస్మృతి పోవటం కానీ దివ్యశక్తులు నశించటం కానీ ఉండవు. ఈ ద్వాపరంలో ఉన్న ఈ శరీరానికి ఇందులోని జీవునకు నీవు ఆప్తుడవు. నేను రావణాసురుని శిక్షించిననాడు – జమదగ్ని కుమారుడయిన భార్గవరాముని, పరశువులో నీవున్నావు. ఆ రేణుకాపుత్రుడు కైలాసములో మహేశ్వరుని సేవించి ఆయన శిష్యుడై ఆయుధవిద్యలు నేర్చుకొంటున్న రోజులలో భూతేశుడు, పరశుధరుడు, మహాదేవు డతని యందు కరుణించి తన పరశువు నుండి మరొక పరశువును సృష్టించి తన తేజః కిరణమయిన నిన్ను దానిలో నిక్షేపించి పంపించాడు. రుద్రశక్తివల్ల, మహాకాలుడి సంకల్పం వల్ల అతనిలో ప్రవేశించి అతని మనస్సును ప్రభావితం చేసి సర్వక్షత్రియ సంహారము

చేసింది నీవు. వైష్ణవ శక్తి కూడా అతనిని ఆవేశించి విష్ణువు యొక్క అంశావతారమని పేరు తెచ్చింది. పరశురాముడు శ్రీరాముని ఎదిరించినపుడు అవసరమైన క్షత్రియ సంహారకాండ అప్పటికి పూర్తి అయి ఉన్నది కనుక, వైష్ణవతేజస్సు దాశరథిలోనికి వెళ్ళిపోయింది. నీవూ పరశురాముని వదిలి అంతరిక్షంలోకి వెళ్ళి ఆతరువాత కొంతకాలానికి నీవే మునికుమారునిగా జన్మనెత్తావు. నాకు సతీర్థ్యుడవై మిత్రుడవై ఇన్నాళ్ళు గడిపావు. ఇప్పుడు త్వరలో మరొక మార్పు రానున్నది.

జైగీ : మీరిన్ని యుగాలు ఎలా జీవించగలిగారు ? నేనెందుకు జన్మ లెత్తుతున్నాను? నాకు రాబోయే మార్పు ఏమిటి ? ఆ మార్పు రాకుండా మీరు ఆపకూడదా ?

కపిల : స్నేహితుడా నాకు శరీరము నిమిత్త మాత్రము. నేను ఆద్యంత రహితుడను. అయినా మానవశరీరంలో ఉంటున్నాను కనుక సహజంగా కొన్ని అనుబంధాలు ఏర్పడుతాయి. వానియందు సముచితమైన ఆదరాన్ని చూపిస్తాను. విష్ణ్వంశ వల్ల నాకీ శాశ్వతత్వము లభించింది. విష్ణువు యొక్క అంశలలో నేనూ, దత్తాత్రేయుడు ఇటువంటివారము. నేను చేసే ప్రతి పనికి ఒక కారణం ఉంటుంది. నేనీ క్రౌంచ ద్వీపంలో నివాసమేర్పరచుకొన్న తరువాత తమ యజ్ఞాశ్వాన్ని అపహరించినవాడినని భావించి సగరపుత్రులు నన్నవమానించి నా క్రోధాగ్నికి దగ్ధులయినారు. వారికి సద్గతులు కలిగించటం కోసం వారి వంశీయుడైన భగీరథుడు తపస్సు చేసి గంగను భూమికి తెచ్చాడు. సగరపుత్రులు హిమాలయము నుండి ఇక్కడి దాకా సొరంగమార్గము త్రవ్వారు. ఆ గంగ కొంతభాగం ఆ సొరంగంలో గుండా ఇక్కడకు వచ్చి, ఇక్కడ భస్మరాశులను తడిపి వాళ్ళకు ఉత్తమగతులు కల్పించింది. ఈ సొరంగమార్గం గుండా నీవు హిమాలయాలకు వెళ్ళు. ఈ గంగామార్గాన్ని అనుసరించి విశ్వనాథుని నెలవైన వారణాసికి చేరుకో. ఆ కాశీక్షేత్రంలో గంగాతీరంలోని ఒక గుహలో తపస్సు చేయి (అక్కడ ఇప్పుడూ జైగీషవ్యగుహలున్నవి). అక్కడ నీకు శరీర పతనం జరుగుతుంది. కొద్దికాలానికే బ్రహ్మపుత్రానదీ ప్రాంతంలోని నాగభూమిలో నీవు జన్మిస్తావు. మనుష్యశరీరం ప్రధానంగా ఉండి అవసరమయినపుడు నాగదేహాన్ని ధరించగల్గిన నాగజాతిలో నీపుట్టుక కలుగుతుంది. పరోక్షంగా నిన్ను నేను కాపాడుతూనే ఉంటాను. విధి ప్రభావం వల్ల పరమేశ్వరుని ఇచ్ఛానుగుణంగా జరిగే ఈ ప్రయాణాన్ని ఆపాలని కోరవద్దు. భూమి మీద ఎవరెవరి వల్ల ఏ పనులు చేయించవలసి ఉన్నదో ఆ కార్యనిర్వహణకోసం దేవజాతుల వారు సిద్ధమండలిలోని వారు ఎంపిక చేయబడి పంపించబడతారు. ఆ విధంగా ఎన్నుకోబడిన వారిలో నీ వొకడవు. ప్రాణమిత్రుడా! ఈ మార్పును గురించి బాధపడవద్దు. నాగవంశంలో ఉదయించిన తరువాత అక్కడికి దగ్గరలో ప్రాగ్జ్యోతిషపురంలో అవతరించి ఉన్న కామాఖ్య కాళి దగ్గరకు వెడతావు. ఆమె అనంతర కర్తవ్యాన్ని నీ కుపదేశిస్తుంది. శుభం భవతు.

జైగీ : మీ ఆజ్ఞ. నేనేమీ మాట్లాడలేకుండా ఉన్నాను. మీరు నన్నెప్పుడూ పరిరక్షిస్తూ ప్రబోధిస్తూ ఉండాలని ప్రార్థన.

కపిల : తథాస్తు.

***

జైగీషవ్యుడు నాగజాతిలో జన్మించాడు. పెరిగి పెద్దవాడవుతున్నప్పటి నుండి పూర్వజన్మ సంస్కారబలం వల్ల సిద్ధసాధువుల యందు ఆసక్తి ఎక్కువగా ఉండేది. మహర్షుల ఆశ్రమాలకు, దివ్యక్షేత్రాలకు ఎక్కువగా తిరుగుతూ అక్కడి పెద్దల మాటలు వింటూ భగవద్ధ్యానం చేస్తుండేవాడు. సిద్ధులను, క్షేత్రాలను పట్టుకొని తిరుగుతూ ఉండడం వల్ల అతనిని సిద్ధనాగుడనేవారు. ఆ కాలంలో నాగజాతి నివాసాలు ఎక్కువగా బ్రహ్మపుత్రానదీ తీర ప్రాంతంలో, 'ఇక్షుమతి' నదిఒడ్డున, కురుక్షేత్రంలో, దక్షిణాపథం లోని కొన్ని ప్రదేశాలలో వ్యాపించి ఉండేవి. గంగానది యొక్క ఉత్తర భాగంలో శక్తిమంతమైన నాగరాజ్యం ఉండేది. ఐరావత, ధృతరాష్ట్రాది వంశాలకు చెందిన నాగజాతివారు అక్కడ ప్రభువులుగా ఉండేవారు. ప్రసిద్ధమైన ఖాండవవనం నాగుల అధీనంలోనే ఉండేది. క్రొత్త స్థలాలు చూడాలన్న కోరికతోను బంధువర్గంవారు తెలిసినవారు తమ జాతికి చెందినవారు విస్తరించి ఉండటం వల్లను సిద్ధనాగుడు సంచారం చేస్తూ అనేక ప్రదేశాలకు వెళ్ళాడు. ఆ యాత్రలో భాగంగా ఒకసారి గంగాతీరంలోని ఒక ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడి వాతావరణం ఎంతో నచ్చింది. ఆ రోజుల్లో ఋషుల ఆశ్రమాలకు వెడితే ఆతిథ్యానికి ఏ లోటూ ఉండేది కాదు. ఎంతో ప్రేమతో ఆహార వసతులు ఏర్పాటు చేసేవారు. అక్కడ కొన్నాళ్ళుండగా ఒక రోజు భృగువంశీయుడైన పరశురాముడు అక్కడకు వచ్చాడు. ఆ ఆశ్రమాధిపతి ఆయన శిష్యుడు కావటం వల్ల గురువుగారికి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజ చేసి, గౌరవమర్యాదలతో తమ ఆశ్రమంలో వీలయినంతకాలం ఉండమని ప్రార్థించాడు. ఆ మహాపురుషు డంగీకరించి ఏదో గ్రంథరచన చేయటం ప్రారంభించాడు. ఆయనను గురించిన కొన్ని విశేషాలు ఆశ్రమ వాసులద్వారా సిద్ధనాగుడు తెలిసికొన్నాడు. రామాయణకాలం నుండి జీవిస్తూ చిరంజీవిగా ఉన్న ఆ మహర్షి ఇటీవల తన శిష్యుడైన భీష్ముని చేతిలో విధి వశాన పరాజితుడై పూర్తి వైరాగ్యం కలిగి వెడుతూ ఇటువైపు వచ్చాడట. సర్వక్షత్రియ సంహారం చేసిన మహావీరునిగా జగత్ప్రసిద్ధుడైన ఆ మహానీయుడు తనలోని వైష్ణవతేజస్సు దశరథరామునిలో ప్రవేశించిన తరువాత ఆ మహత్వము తగ్గినా ఆయన సర్వ శస్త్రాస్త్ర కోవిదుడే. దేవజాతికి చెందిన వసువులు తమవాడని భీష్మునకు సహాయం చేసినందువల్ల మానవశరీరంలోని ఈ మహానీయుడు అపజయాన్ని అంగీకరించవలసి వచ్చింది. "శిష్యాదిచ్ఛేత్ పరాజయం" అన్నారు కనుక దానికి పరశురాముడు బాధపడలేదు. అయితే, లోకంలో తన పాత్ర యొక్క అవసరం తీరిపోయిందని గ్రహించిన ఋషివర్యుడు లోకోపకారం కోసం ఒక మంత్రశాస్త్ర గ్రంథాన్ని రచిస్తున్నాడు. ఆ విషయం విన్న సిద్ధనాగునకు ఆయనకు సేవచేసి ఆ రహస్యాలు నేర్చుకోవాలన్న ప్రబలమైన కాంక్ష కలిగింది. ఆయన శిష్యులను ప్రార్థించి కొన్ని సేవలు చేయటానికి అనుమతిని పొందాడు. ఆయనకు కావలసిన వస్తువులు పూలు, పండ్లు, పాలు మొదలైనవి నిత్యాగ్ని హోత్రములకు కావలసిన సమిధలు మొదలైనవి సమకూరుస్తూ రోజూ సాష్టాంగ దండప్రణామాలు చేస్తూ దూరంగా చేతులు కట్టుకొని నిల్చుండేవాడు. నిశిత మేధా సంపన్నుడయిన భార్గవుడు ఇతని సేవలను గ్రహించి ఆదరాన్ని చూపిస్తున్నాడు. కొంతకాలం గడచిన మీదట ఆయన కితని

మీద వాత్సల్యం కలిగింది. గ్రంథరచన పూర్తిచేసి ఆశ్రమం విడిచి వెళ్ళిపోయే సమయం వచ్చినప్పుడు సిద్ధనాగుని పిలిపించాడు. అతడు వచ్చి సాష్టాంగ దండప్రణామం చేసి నిల్చొన్నాడు.

పరశు : యువకుడా ! నీ సేవలు గమనిస్తున్నాను. నీ భక్తి శ్రద్ధలను నిర్మల మయిన నీ వినయసౌశీల్యాలను నేను తెలుసుకొన్నాను. ఏమి కోరి నా సేవచేశావు ? నీ కేమి కావాలి ?

సిద్ధ : ఋషివల్లభా ! బ్రాహ్మ్యము, క్షాత్రము మూర్తీభవించిన అవతార పురుషులు మీరు. మీ వంటి మహనీయుల సేవచేసే అవకాశం కల్గటం నా జన్మాంతర సుకృతం. మిమ్ము చూడగానే కారణము తెలియని భక్తిగౌరవములు నాకు కల్గినవి. నేను ఏ ప్రతి ఫలము ఆశించి సేవచేయలేదు. దయాభరితమైన మీ అనుగ్రహాన్ని నా యందు ప్రసరింప చేయండి ! చాలు.

పరశు : ఓయీ నీ మాటలు మరింతగా నా మనస్సును ఆకట్టుకొన్నవి. నాకు చేసిన సేవ ఎన్నడూ వ్యర్థం కారాదు. నే నివ్వగలిగిన దేదైనా నీవు కోరుకో. అయితే ఒక నిబంధన ఉన్నది. నా దగ్గర అస్త్రవిద్యలున్నాయి. బ్రాహ్మణేతరులకు వానిని ఉపదేశించను. నా చరిత్ర గురించి నీవు విని ఉంటావు. నా జీవిత అవసరాలను బట్టి అటువంటి నియమము ఏర్పరచుకోవలసి వచ్చినది. కనుక అవికాక ఇంకేదైనా నీవు అర్థించవచ్చు.

సిద్ధ : గురుదేవా ! నన్ను శిష్యునిగా స్వీకరించటానికి అంగీకరించినందుకు కృతజ్ఞుడను. నేను నాగజాతివాడను. ద్విరూపధారణశక్తి కలిగినవాడను. ఏ కారణం వల్లనో మా వంశంలోని ఇతరులవలె లౌకిక భోగములందు నా కాసక్తి లేదు. రాజ్యాధికారము లందు కోరిక లేదు. నా జాతిలో కులవ్యవస్థ లేదు. నా జాతిలోని కన్యలను బ్రాహ్మణులు, క్షత్రియులు వివాహమాడిన సంఘటనలు మీరు వినే ఉంటారు. సహజంగా జాతిలక్షణముతో వచ్చిన శక్తులు గాక మా వారిలో కూడా కొందరు తపస్సు నందు ఆసక్తి కలిగి ఆదిశేషునివలె విష్ణుదేవుని అనుగ్రహాన్ని, వాసుకివలె పరమశివుని అనుగ్రహాన్ని, కద్రువవలె ఇంద్రుని దయను పొందాలని సాధనచేస్తున్నారు. నేనుకూడా ఆ మార్గము నందు అపేక్ష కలిగి ఋషుల ఆశ్రమాల చుట్టూ తిరుగుతున్నాను. దివ్య క్షేత్రాలను దర్శిస్తున్నాను. ఇంతకాలానికి మహావీరులు, మహాయోగులయిన మీరు నాయందు దయ చూపించారు. ఏ సాధన నా జీవితాన్ని ఉద్ధరిస్తుందో దేనివలన నేను పరిపూర్ణమైన పరమేశ్వరానుగ్రహాన్ని పొందగలనో ఆ విద్యను నాకు ఉపదేశించండి.

పరశు : నేను మంత్రశాస్త్ర రచన చేస్తుండగా నీవు వచ్చావు. నా గ్రంథంలో శాక్తేయ సాధనలు చేసే పద్ధతులు వివరించాను. నేను సహజంగా శివభక్తుడను. మహాదేవుని అనుగ్రహం వల్ల ఆయన నుండి దివ్యమైన పరశువును పొంది సర్వక్షత్రియ సంహారం చేశాను. ఆ పరశువు యొక్క తేజోమయమైన ఆకృతి నీలో భాసిస్తున్నది. నీయందు వాత్సల్యం కలగటానికి, అభిమానం కలగటానికి ఇది ఒక కారణం. శివభక్తుడనైన నేను చిత్రమైన

పరిస్థితిలో దేవీభక్తునిగా మారాను. తండ్రి ఆజ్ఞవల్ల నా తల్లిశిరస్సును నేను ఖండించాను. అప్పుడామెలో పరమేశ్వరి ప్రవేశించింది. అపరాధ రహిత, త్యాగమూర్తి అయిన ఆమె దేవత అయిన సంగతి దత్తాత్రేయస్వామి చెప్పినదాకా నాకు తెలియలేదు. నా ప్రార్థనను మన్నించిన నా తండ్రి జమదగ్నిమహర్షి యొక్క తపశ్శక్తి వలన ఆమె పునరుజ్జీవితురాలయినదని మాత్రమే అనుకొన్నాను. నా మాత రేణుకాదేవి జగన్మాత అయినదని తెలుసుకొన్న తరువాత నాకు శాక్తేయమార్గము నందు అభిరుచి కల్గింది. అందుకే 'పరశురామకల్పం' అన్న పేరుతో ఈ మంత్రశాస్త్ర గ్రంధాన్ని రచించాను.సరే ! దాని సంగతి అటుంచు.

నీలోని జిజ్ఞాసను, అన్వేషణను నీ జీవుని వేదనను చూస్తున్నాను. నీవలన దేవకార్యములు కొన్ని కావలసి ఉన్నవి. దానికి కావలసిన శక్తులు పొందటానికి నీవు కాళీసాధన చేయాలి. నీకు కాళీమంత్రాన్ని ఉపదేశిస్తున్నాను. దీనిని గ్రహించి కామాఖ్యలోని కాళీసన్నిధికి వెళ్ళి సాధన చెయ్యి. అక్కడ ఇప్పుడు నరకాసురుడు పరిపాలిస్తునాడు. వాడు దుశ్శీలుడు, దుర్మార్గుడు. వానితో నీకు సంబంధం లేదు. ఆమె సన్నిధిలో కొన్నాళ్ళు తపస్సాధన చేయి. ఆ దేవత అనుగ్రహం కలుగుతుంది." సిద్ధనాగుడు భార్గవ రాముని నుండి కాళీమంత్రాన్ని పొంది మళ్ళీ ప్రయాణాలు చేస్తూ ప్రాగ్జ్యోతిషపురాన్ని చేరుకొన్నాడు. నరకాసురుని పాలనలో ఆ దేవి మహావైభవంతో ప్రకాశిస్తున్నది. పరమ శివుని భార్య అయిన సతీదేవి దక్షయజ్ఞంలో ప్రాణత్యాగం చేసినపుడు. ఆ యజ్ఞాన్ని వీరభద్రుని చేత ధ్వంసం చేయించిన తరువాత మహేశ్వరుడు వచ్చి భార్య కళేబరాన్ని చూచి బాధపడి ఆ శరీరాన్ని చేతులలో ఎత్తి పట్టుకొని ఆవేశంతో తాండవం చేశాడు. ఆ తాండవోద్ధతిని భరించలేక భువనములు కదలిపోయి కల్లోలితమవుతుంటే దేవతల ప్రార్థనమీద విష్ణుదేవుడు తన చక్రంతో ఆమె శరీరాన్ని ఖండములు చేశాడు. ఆ దేహభాగములు పడిన చోట్లు శక్తిపీఠములయినవి. ఆమె 'యోనిభాగం' పడిన చోటు ఈ కామాఖ్య. ఈ ప్రాంతానికి పరిపాలకుడయిన నరకుడు నిరంతర మద్యమాంసముల నీ దేవికి సమర్పించి వామాచారమార్గంలో సాధనచేసి అజేయ పరాక్రమాన్ని అమిత వశీకరణశక్తిని పొంది 16,000 మంది రాజకుమారికలను తెచ్చి వారిని బలవంతంగా అనుభవించాడు. వాని కామదాహానికి ఆహుతి అయిన కన్యలెందరో. ఇంతటి దుష్టునకు వరములిచ్చి వాడు దుష్కార్యములు చేస్తున్నా కాళీదేవి ఎందు కుపేక్షిస్తున్నదో తెలియదు. అయినా వీటిని గురించి ఆలోచించటం నాకర్తవ్యం కాదు. గురూపదిష్టమార్గంలో నా సాధన నేను కొనసాగించాలి. మధుకైటభసంహారిణి, శుంభ నిశుంభ వినాశిని, మహిషాసురమర్ధిని రాక్షస సంహారిణి అయిన, ఆ మహాశక్తిని పూజించి ఆమె అనుగ్రహాన్ని పొందాలి. అని నిశ్చయించుకొని సిద్ధనాగుడు తన సాధనను ప్రారంభించాడు. తన జన్మస్థానమయిన నాగభూమికి దగ్గరగా ఉన్న ప్రదేశమిది. తమవారంతా భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు, ఈ రాజ్యం గుండానే వెళ్ళాలి. నాగజాతికి అసురజాతికి అప్పుడు పెద్దగా విరోధాలు లేవు కనుక రాకపోకలకు కాని, కొన్నాళ్ళు ఉండటానికి గాని ఆంక్షలు, అడ్డంకులు లేవు. ఆలయానికి దగ్గరలో ఒక

వసతి ఏర్పరచుకొని ఆహార విహారాది కఠోరనియమాలతో దృఢ దీక్షతో జపధ్యానములు చేశాడు. కొంతకాలం గడచిన తరువాత అతనియందు కాళీదేవికి అనుగ్రహం కలిగింది. ఒకనాటి అర్ధనిశాసమయంలో తేజోమండలం మధ్య దేవి సాక్షాత్కరించి “సాధకుడా ! నీ తపస్సుకు సంతోషించాను. నీ జీవితగమనంలో మార్పులు రాబోతున్నాయి. సుమారు రెండు వందల సంవత్సరాల తరువాత నీకు మృత్యు గండమున్నది. నీజాతిని నశింపచేయటానికి ఒక రాజు సర్పయాగం తలపెడతాడు. మహాప్రభావసంపన్నులయిన బ్రాహ్మణుల మంత్రశక్తి వల్ల మీ జాతివారు కొన్ని లక్షలమంది హోమాగ్నిలోపడి దహనమవుతారు. నా భక్తుడవైన నిన్ను నేను కాపాడదలచుకొన్నాను.నేను రేపటి నుండి ఈ క్షేత్రంనుండి అదృశ్యమవుతున్నాను. భగవంతుడయిన నారాయణుడు నరకాసురాది దుష్టసంహారం కోసం అవతరించాడు. ఆయనలో నా శక్తి కూడా కలుస్తుంది. తపస్సు చేసిన వారికి మేము వరములిస్తాము. వారు దుర్మార్గాలు చేస్తే శిక్షిస్తాము. నీకు కృష్ణమంత్రాన్ని ఉపదేశిస్తున్నాను. ఇక్కడ నుండి నీవు బృందావనం వెళ్ళి అక్కడ ఈ మంత్రజపసాధన చేయి. నీకు కృష్ణానుగ్రహం కలుగుతుంది” అని అని చెప్పి అదృశ్యమయింది. మరునాడు రాత్రి బ్రహ్మణ్యుడైన వసిష్ఠమహర్షి అక్కడకు వచ్చాడు. ఆయన దేవాలయ ప్రాంగణానికి వచ్చేసరికి కాళీ మందిర ద్వారాలు మూసివేయబడినవి. కాళీదర్శనం కోసం వచ్చానని, తలుపు తెరిపించమని అక్కడి అధికారులను అడిగాడు. “దర్శన సమయం దాటిపోయింది. మహారాజు ఆజ్ఞఇస్తే తప్ప ఇప్పుడింక తలుపులు తెరవటం ఉండదు. కావాలంటే సార్వభౌముల నడగండి” అని వారు జవాబు చెప్పారు. వసిష్టమహర్షి సరాసరి నరకాసుర భవనానికి వెళ్ళి కాళీదర్శనం వెంటనే చేయాలని, తానెవరో కూడా చెప్పాడు. మద్యపానపు మత్తులో ఉన్న నరకుడు మహర్షి మాటలు పట్టించుకోలేదు. తిరస్కార పూర్వకంగా ఇప్పుడు వీలుకాదు పొమ్మన్నాడు వసిష్ఠునకు ఆగ్రహం కలిగింది. “నాకు దర్శన మివ్వని కాళి ఇక్కడ నుండి అదృశ్యమగును గాక!’ అని అక్కడ నుండి వెళ్ళి పోయినాడు. మరునాడు తెల్లవారేసరికి గర్భగుడిలో దేవతలేదు. అమ్మవారి లీలను గ్రహించిన సిద్ధనాగుడు అక్కడి నుండి బయలుదేరి వేగంగా బృందావనం చేరుకొన్నాడు. యమునాతీరంలో ఒక కుటీరం ఏర్పరచుకొని మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా కఠోర తపస్సు మొదలుపెట్టాడు. సర్పములలో ఒక లక్షణమున్నది. ఆహారం లేకుండా దీర్ఘకాలం జీవించగలవు. అంతేకాక అతడు ఓషధీ పరిజ్ఞాత. కొండలమీద నుండి జలపాతములు పడేచోట్ల మహాసర్పములు నివసించే సందుల దగ్గర రాతిబొడ్డు లేక రాతిమదం అనే పదార్థం ఉంటుంది. అది కొంచెం మింగితే నెలల తరబడి ఆహారం లేకుండా ఉండవచ్చు. తాను నాగరాజు కనుక దానిని సులభంగా సంపాదించ గలిగాడు. తన నాగభూమిలో హిమాలయపర్వత శిఖరాలపై నుండి ఎన్నో జలపాతాలు పడుతుంటవి. అక్కడ ఈ పదార్థం సమృద్ధిగా దొరకుతుంది. కావలసినంత సేకరించి దగ్గర ఉంచుకొన్న సిద్ధనాగుడు దాని సహాయం వల్ల ఆహారంతో అవసరం లేకుండా సర్వకాల సర్వావస్థలలో కృష్ణమంత్రసాధన చేస్తున్నాడు. ఎన్నాళ్లు గడచిందో ఎంతకాలం గడచిందో ఎన్ని సూర్యోదయ, అస్తమయాలు జరిగిపోయినవో, ఎన్ని పగ ళ్ళెన్ని రాత్రులు కరిగిపోయినవో తెలియటం లేదు.

ఒకనాటి సంధ్యాసమయంలో యమునాతీరమంతా కలకలంతో నిండిపోయింది. యక్షులు, గంధర్వులు మొదలైన దేవజాతుల వారు కనిస్తున్నారు. వారిలో కొందరితో పూర్వ పరిచయం కూడా తనకున్నది. వారి నడిగితే వారు వివరాలు చెప్పారు. “ఈ రోజు రాత్రి యమునాతీరంలో శ్రీకృష్ణదేవుడు, రాధాదేవితో రాసక్రీడలు జరుపబోతున్నాడు. నేడు కార్తీక పూర్ణిమ. ఆ దివ్య శృంగారదృశ్యాలను చూడటానికి ఊర్థ్వలోకాల నుండి దేవతలు విమానాలలో వస్తున్నారు వారంతా ఆకాశంలో దూరంగా తమ విమానాలలో ఉండి ఆ రాధాకృష్ణలీలలను చూస్తారట. ఈ విషయాన్ని మహనీయులైన పెద్దలు చెప్పగా విని మేము కూడా వచ్చాము. అయితే రాసక్రీడలు జరిగే దివ్యభూమికలో పురుషులెవ్వరికీ ప్రవేశముండదు. పరమేశ్వరుడయిన కృష్ణుడొక్కడే పురుషుడు. ఆయన ఎన్నివేల లక్షల శరీరాలనయినా ధరించగలడు. మనవంటి వారికి అందులో ప్రవేశము ఉండదు కనుక మేమంతా పక్షుల రూపాలను ధరించి ఇక్కడి చెట్లపై ఉండి కనులారా ఆ గోపసుందరుని దివ్యలీలలను దర్శించాలని అనుకొంటున్నానాము. నీవు కూడా మా వలెనే రూపం మార్చుకో, సరిపోతుంది”. “మీ వలె పక్షిరూపాన్ని నేను ధరించవలసిన పనిలేదు. మానవేతరమైన ఏ రూపమయినా ఫరవాలేదని మీ మాటలను బట్టి అర్థమవుతున్నది. నాకు సహజమైన నాగరూపాన్ని ధరించి దట్టమైన ఏ పొద దగ్గరో ఉండి గోవిందుల దర్శనం చేసుకొంటాను” అన్నాడు సిద్ధనాగుడు. పదహారు కళలతో చంద్రుడు సంవత్సరంలో ఒక్క కార్తీక పూర్ణిమరోజుననే ప్రకాశిస్తాడు. లలితకళాప్రపూర్ణుడైన కృష్ణచంద్రుడు రాసేశ్వరి అయిన రాధాదేవితో కలసి ఆడుతూ, పాడుతూ విహరించిన దృశ్యాలను చూచే అదృష్టం కలిగింది. శ్రీకృష్ణుని దివ్యమైన మురళీనాదం వినే అదృష్టం, బృందావనేశ్వరి అయిన రాధాదేవి నృత్యం చేస్తూంటే చూచే భాగ్యం అతనికి లభించినవి. దట్టమైన పొదల గుబురులమధ్య పడగయెత్తి చూస్తున్న అతనిని ఒక్క క్షణం పాటు కృష్ణచంద్రుడు వీక్షించాడు. గోవిందు డటువైపు ఎందుకు చూస్తున్నాడా అని రాధాదేవి కూడా చూచింది. ఆది దంపతులైన ఆ ప్రేమమూర్తుల కరుణార్ద్రదృష్టి ప్రసరించి తన తపస్సు ఫలించిందని అనిపించింది. “నాయనా ! బృందావనధామంలో ఉండటానికి నీకు అనుమతి నిస్తున్నాము. సర్పయాగ ప్రమాదం నిన్నంటదు. నీవెంట ఒక గోపిక ఉండి నిన్ను ఎప్పుడూ రక్షిస్తుంటుంది” అన్న సందేశం వినిపించింది. ఆ రాత్రి పూర్తయిన తరువాత నుండి బృందావన ధామంలోనే నివసిస్తున్నాడు. నిరంతర కృష్ణమంత్రాన్ని జపిస్తునే ఉన్నాడు. కొంతకాలం గడచిన తరువాత ఒకనాటి నిశీధసమయంలో కృష్ణుని మురళీనాదం వినిపించటం మొదలు పెట్టింది. అంతరిక్షం నుండి దివ్యతేజస్సు గల ఒక బాలిక దిగి వచ్చింది. “ఓయీ! చిరకాల కృష్ణమంత్ర జపం చేత రాధాసాధన చేయగల అర్హత నీకు లభించింది. నీ తపస్సు భావాత్మకంగా పరిణమించి దివ్యప్రేమామృతాన్ని అందుకోవటానికి రాసేశ్వరి కృపకావాలి. రాధాకృష్ణుల ఆజ్ఞవల్ల నీకు రాధామంత్రాన్ని ఉపదేశించటానికి వచ్చాను” అని ఆదివ్యమూర్తి అతనిని శ్రీరాధారసోపాసనలోనికి ప్రవేశపెట్టింది. ఆ సాధన వల్ల ఎన్నో దివ్యానుభూతుల నతడు పొందగలిగాడు.

కలియుగం ప్రారంభమైంది. భౌతికంగా శ్రీకృష్ణదేవుడు శరీరాన్ని పరిత్యజించిన తరువాత ప్రపంచంలో చాలా మార్పులు వచ్చినవి. బృందావనము, ఆ ప్రాంత ప్రదేశాలు అన్నింటికి రాజధానిగా ఉండే మధురకు శ్రీకృష్ణుని మునిమనుమడయిన 'వజ్రుడు' రాజయినాడు. పాండవులు మహాప్రస్థానానికి వెళ్ళిపోయినారు. అర్జున పౌత్రుడయిన పరీక్షిత్తు కురుసామ్రాజ్యానికధిపతి అయి సుమారు 60 సంవత్సరాలు పరిపాలించి మునిశాపం వల్ల తక్షక సర్పదష్టుడై మరణించాడు. అతని కుమారుడు జనమేజయుడు రాజై ఉదంక మహర్షి ప్రేరణవల్ల సర్పయాగం చేశాడు. తమజాతి వారు లక్షలమంది యాజ్ఞికుల మంత్రశక్తి చేత ఆకర్షింపబడి హోమకుండంలో పడి దగ్ధమయినారు. నాగరాజుల పరాక్రమాలు, దివ్యశక్తులు బ్రహ్మదండ ప్రభావంముందు పనిచేయలేదు. నాగప్రభువు, వాసుకి చెల్లెలయిన జరత్కారువునకు అదే పేరు గల మహర్షికి పుట్టిన అస్తీకుడనే మహర్షి సర్పయాగాన్ని ఆపించాడు. సర్పకులంలో మూడువంతులు నశించి పోయినవి. రాధాగోవిందుల అనుగ్రహం వల్ల తనకే ప్రమాదం జరుగలేదు తనవారిలో ఎందరు మిగిలి ఉన్నారో ఒక్కసారి తన స్వస్థానానికి వెళ్ళి చూచిరావాలని అనిపించింది. బృందావనం నుండి బయలుదేరి కౌరవరాజ్యాన్ని దాటి మగధసామ్రాజ్యము లోనికి ప్రవేశించాడు. జరాసంధుని వంశం వారు అక్కడ పరిపాలిస్తున్నారు. ఆ రాజ్యం నుండి బయలుదేరి హిమాలయ ప్రాంతాలకు చేరి, బ్రహ్మపుత్రానదీ ప్రాంతం ద్వారా ప్రాగ్జ్యోతిష పురం చేరుకొన్నాడు. తన ఇష్టదేవత అయిన కామాఖ్య కాళీ ఆలయానికి వెళితే ఆనందస్వరూపిణిగా ఆమె దర్శనమిచ్చింది. ఆనాడు వసిష్ఠుని వాక్కువల్ల కాళీదేవి అదృశ్యమైన సంగతి తనకు గుర్తున్నది. తరువాత జరిగిన సంఘటనలను అక్కడ విన్నాడు. కాళీదేవి ఎక్కడకు పోయిందో తెలియక నరకాసురుడు శుక్రాచార్యుని ఆహ్వానించి మళ్ళీకాళీదేవిని రప్పించమని ఆహ్వానించాడు. తిరుగులేని వసిష్ఠుని వాక్ ప్రభావాన్ని ఎరిగిన శుక్రుడు దేవిని తాను తిరిగి రప్పించలేనని చెప్పి అసురనాధుని సంతృప్తి కోసం కొన్ని యజ్ఞాలు చేసి అదనపు శక్తులు సమకూర్చి వెళ్ళిపోయినాడు. ఆ తరువాత కొంత కాలానికి శ్రీకృష్ణుడు తన ముద్దుల భార్య అయిన సత్యభామతో కలిసి నరకాసురుని మీదికి యుద్ధానికి వచ్చాడు. యుద్ధరంగంలోకి ప్రవేశించిన నరకుడు తన శత్రువైన కృష్ణుని వెనుక తనకు వరము లిచ్చిన కాళీదేవి ఉండటాన్ని గమనించాడు. తనకిక పరాజయం తప్పదని గ్రహించిన నరకుడు కృష్ణునితో పోరాడి వీరమరణం చెందాడు. శ్రీకృష్ణుడు కాళీదేవిని మరలా కామాఖ్య పీఠంపై ప్రతిష్ఠింపచేసి నరక పుత్రుడైన భగదత్తుని రాజును చేసి నరకుడు చెరపట్టిన 16000 మంది రాజకుమారికలను వివాహమాడి తనతో ద్వారకకు తీసుకొని వెళ్ళాడు. ఆ భగదత్తుడు తన తండ్రిని చంపిన కృష్ణుని మీది కోపంతో మహాభారతయుద్ధంలో దుర్యోధనుని పక్షంలో చేరి సంగ్రామంలో అర్జునుని చేత సంహరించబడ్డాడు. ఆ భగదత్తుని పుత్రుడు ఇప్పుడు రాజ్యమేలుతున్నాడు.

సిద్ధనాగుడు కామాఖ్య నుండి బయలుదేరి తన జన్మభూమికి చేరాడు. అక్కడ తన వంశీయులు, బంధుమిత్రులు ఇతనిని చూచి ఎంతో సంతోషించారు. అచ్చట అన్ని

వంశాలవారు సర్పయాగానంతరము ఎవరెవరు మిగిలి ఉన్నారో లెక్క పెట్టుకొనే స్థితిలో ఉన్నారు. తెలిసినవారందరిని చూచి పలకరించి హతశేషులను పరామర్శించిన తరువాత ఒకనాడు హఠాత్తుగా తన బాల్యమిత్రుడు శివనాగుడు కనిపించాడు. పట్టరాని ఆనందంతో చెట్టాపట్టా లేసుకొని ఇద్దరూ ఒక తోటలో కూర్చున్నారు. కుశల ప్రశ్నలు అయిన తరువాత ఇక్కడి విశేషాలు చెప్పవలసినదిగా అతడు శివనాగును ప్రశ్నించాడు. శివనాగుడు ఇలా అన్నాడు. "మిత్రుడా! చిన్నప్పటి నుండి మన ఇద్దరి అభిరుచులు ఒక్కటే. ఏదో సాధించాలన్న తపన మన పూర్వులయిన నాగరాజుల వలె తపస్సు చేసి పరమేశ్వరానుగ్రహం పొందాలన్న బలమైన కోరిక మన యిద్దరికీ ఉండేది కదా? నీ మార్గంలో నీవు అన్వేషిస్తూ ఎటో వెళ్ళిపోయినావు. నా మార్గంలో నేనూ బయలుదేరాను. మన కులపెద్ద అయిన వాసుకి పరమశివుని భక్తులలో ఒకడని తెలుసు గదా ! అతడు నన్ను శివుని గూర్చి తపస్సు చేయమని ప్రేరేపించాడు. సమస్త భారతదేశానికి మణిమకుటమయిన శివక్షేత్రం వారణాసి. అక్కడికి వెళ్ళి గంగాస్నానం చేసి విశ్వనాధుని దర్శించి కాశీ క్షేత్రమంతా తిరుగుతున్నాను. నాపూర్వ పుణ్యవశాన భోగనాధుడనే ఒక యోగితో పరిచయమయింది. అగస్త్యమహర్షి శిష్యుడైన ఆ మహానుభావుడు వేలఏండ్ల నుండి జీవిస్తున్నవాడు. ఆయన పాదములు ఆశ్రయించాను, సేవించాను. ఆ యోగి వర్యుడు దయతో నన్ను శిష్యునిగా స్వీకరించాడు. ఆ మహర్షి అప్పుడప్పుడు ఉత్తరకురుభూములలో హిమాలయ పర్వతాలకవతల సుదూర ప్రాంతంలో ఉన్న సుమేరు పర్వత భూములకు వెడుతూ ఉంటాడు. నన్ను కూడా తనతో తీసుకొని వెళ్ళాడు. హ్రస్వాంగులు పీతవర్ణులు అయిన చీనజాతి వారి స్థానమిది. పరకాయప్రవేశ విద్య శక్తివలన మా గురువుగా రొకసారి అచ్చటి స్థానికుని మృతశరీరంలో ప్రవేశించి కొంతకాలం దానిలో ఉండి ఆ దేశీయులకు తాంత్రిక విద్యలు నేర్పారు. నా చేత కూడా ఆయన ఎన్నో చిత్ర విచిత్ర సాధనలు చేయించారు. ఓషధీ పరిజ్ఞానాన్ని నేర్పారు. మూలికా రహస్యాలను తెలిపారు. ఒక వస్తువును మరొక వస్తువుగా మార్చే విద్య, బంగారాన్ని తయారుచేసే విధానం ఆ మహాయోగి నా కుపదేశించారు. ఆయన ఆజ్ఞవలన కొంతకాలం కాశీలో ఉన్నాను. హిమాలయాల లోని దేశాలన్నీ నాకు సుపరిచితమైనవి. వారి అనుగ్రహం వల్ల సర్పయాగం నుండి నేను రక్షించబడ్డాను. నీ సంగతులేమిటో తెలుసుకోవాలని ఉన్నది. నీవు కామాఖ్య వెళ్ళావని అక్కడ నుండి బృందావనం వెళ్ళావని మాత్రం విన్నాను. తరువాత సంగతులు నీవు చెప్తే వింటాను."

సిద్ధనాగుడు తన ఆప్తమిత్రునికి జరిగిన సంఘటనలన్నీ తెలియచేశాడు. కొద్దిరోజులలోనే భోగనాధుని నుండి కాశీకి రావలసినదిగా శివనాగునకు మానసిక సందేశం వచ్చింది. తన స్నేహితుడయిన సిద్ధనాగును కలుపుకొని వారణాసికి బయలుదేరాడు. ఇద్దరు మిత్రులూ కాశీకి చేరి గురువుగారి ఆశ్రమానికి వెళ్ళి ప్రణామాలు చేశారు. సిద్ధనాగుడు కూడా రావటం తనకు సంతోషంగా ఉందని ఆ యోగివర్యుడు చెప్పి "త్వరలో ఇక్కడ సిద్ధుల సమావేశం ఏర్పాటు చేయవలసి ఉన్నది. కలియుగ ప్రభావం వల్ల దెబ్బతింటున్న

ధర్మాన్ని రక్షించటానికి ప్రపంచంలోని సిద్ధుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాను. దానిని మీ రిద్దరూ నిర్వహించండి" అన్నారు. వారి మాట శిరసావహించి సిద్ధమహాసభ ఏర్పాటు చేయటం ఇతర ద్వీపాల నుండి కూడా సిద్ధులు రావటం జరిగింది. క్రౌంచద్వీపం నుండి ప్రత్యేకంగా కపిలాశ్రమయోగులు మయాసురజాతికి చెందిన కొందరు అరుణయోగులు కూడా ఆ సదస్సుకు వచ్చారు. వేదవ్యాసుని అధ్యక్షతన జరిగిన ఈ సభలో రకరకాల సూచనలు, చర్చలు జరిగినవి. కలియుగంలో జనులు అలసులు, మందబుద్ధులు, జరారోగపీడితులు, అల్పాయుష్కులు కావటం వల్ల తీవ్రమైన తపోయోగ సాధనలు చేయలేరు కనుక భక్తిమార్గాన్ని ప్రోత్సహించాలని హిమాలయ ఋషులు ఎక్కువమంది సూచించారు. వ్యాసమహర్షి దానికి ఆమోద ముద్ర వేయటంతో భక్తిని ప్రధాన సాధనంగాచేయాలని నిర్ణయం జరిగింది.

ఆతరువాత కొద్ది వందల సంవత్సరాలు గడిచిన అనంతరం దక్షిణ భారతంలోని కుర్తాళ క్షేత్రంలో అగస్త్య మహర్షి ఆశ్రమంలో మరొకసారి యోగుల సమావేశం జరిగింది. అక్కడ వివిధ కోణాలలో సాధక బాధకాలను చర్చించి ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యుని అధ్యక్షతలో భోగనాధయోగి కొన్ని క్రొత్త ఆలోచనలను తీర్మానరూపంగా ప్రకటించాడు.

1) అపారశక్తి సంపన్నులయిన సిద్ధయోగుల పర్యవేక్షణలో వివిధ ద్వీపాలలో ధర్మాభిరతి ఏరకంగా ఉన్నదో పరిశీలిస్తూ అధర్మం పెచ్చుమీరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యుగధర్మాన్ని బట్టి సిద్ధశరీరాలతో ఇక ముందు సామాన్య మానవులకు కనిపించరాదు. మన శరీర ప్రమాణాలు తేజస్వంతమైన ఈ ఆకృతులు బహిరంగ పరచటానికి వీలుండదు.

2) దీనిని దృష్టిలో ఉంచుకొని కొందరు సిద్ధులు మానవుల శరీరాలలో ప్రవేశించి వారికి తెలియకుండానే వారి మనసులను ప్రభావితం చేసి తమ దివ్యశక్తుల ద్వారా ఆ శరీరముల చేత మహాకార్యములు చేయించాలి. ఆ పనిపూర్తికాగానే వారా శరీరముల నుండి ఇవతలకు వచ్చి తమ స్వస్థానములో స్వస్వరూపములతో ఉండవచ్చు. ఆ ఆవేశం పొందిన మానవుడు ఆ మహాకార్యములను తామే చేశామని అనుకొంటారు. ప్రజలూ అలానే భావిస్తారు. వారి నలానే నమ్మనివ్వండి. మనకు దైవకార్యసిద్ధి ప్రధానం గాని, కీర్తి ప్రధానం కాదు. కొన్ని వేల సంవత్సరాల వరకు ఎప్పుడెప్పుడు ఎవరు ఎవరి శరీరాలలో ప్రవేశించాలో తెలియచేయబడుతుంటుంది. దీనికి సిద్ధులు సహకరించ వలసినదిగా కోరుతున్నాము.

3) ఇక్కడ సమావేశమయిన సిద్ధయోగులలో వివిధ దేవతా సాధనలు చేసి సిద్ధత్వమును పొందిన వారున్నారు. కొందరిలో ఇచ్ఛాశక్తి, కొందరిలో జ్ఞానశక్తి, కొందరిలో క్రియాశక్తి తర తమ భేదాలను బట్టి వికసించి ఉన్నవి. వీరిలో కొందరు మానవులుగా పుట్టవలసి ఉంటుంది. మీరంతా వ్యాసమహర్షి రచించిన పురాణ వాఙ్మయాన్ని చదివినవారే. భారతకాలంలో పూర్వయుగాలలోని రాక్షసులు మానవులుగా పుట్టి అధర్మకార్యాలు చేస్తూ దైవద్రోహం చేస్తూ తమ బలప్రభావం చేత బలహీనులను బాధిస్తుంటే వారిని శిక్షించటం కోసం సాక్షాత్ నారాయణుడే దిగిరావలసి వచ్చినది. ఆయన ఇచ్ఛానుగుణంగా భువర్లోక

సువర్లోకములలోని దేవతలు దేవయోనులు విద్యాధర గంధర్వాదులు అసంఖ్యాకంగా జన్మించారు. అవసరమయినప్పుడు తప్పని ప్రక్రియ ఇది. దీనికి కూడా మీరు ఆమోదం తెలుపవలసిదిగా కోరుతున్నాను. అయితే ఒక్క హామీమాత్రం వారికి ఇవ్వవలసి ఉంటుంది. మానవజన్మ ఎత్తినప్పుడు తామెవ్వరో మరచిపోవటం సహజపరిణామం అది ఎవ్వరికీ ఇష్టం ఉండదు. విధి నిర్ణయం కనుక అవి తప్పవు. జన్మ తీసుకోవలసి వచ్చిన వారికి ప్రధమశ్రేణిలో ఉన్న సిద్ధులు సహాయం చేస్తూ ఉండాలి. వారి మనస్సులను ప్రేరేపించి తపోయోగసాధనలు చేయిస్తూ పూర్వజన్మ స్మృతిని వారికి కలిగిస్తూ ధ్యానభూమికలో వారికి అప్పుడప్పుడు కన్పిస్తూ కర్తవ్యాన్ని ఉపదేశిస్తూ దానికి కావలసిన శక్తిని సమకూరుస్తూ ఉండాలి.

ఈ విషయాలను గురించి మరింతలోతుగా చర్చించిన తరువాత సమావేశం ముగిసి ఎవరి దేశాలకు, ప్రదేశాలకు వారు వెళ్ళిపోయినారు. ఆ తరువాత మిగిలిన వారిలో ముగ్గురిని భోగనాధుడు పిలిపించాడు. వారు శివనాగుడు, సిద్ధనాగుడు, రాజనాగుడు. మూడవ వ్యక్తి శివనాగుని కంటె ముందు ఆయన శిష్యుడైనవాడు. వారితో ఆ మహాయోగి ఈ విధంగా చెప్పాడు. "యువకులారా ! ఇష్టదేవతా సాధనలు చేసి ఆ దేవతల అనుగ్రహాన్ని కొంతవరకు సాధించినవారు మీరు. దేవకార్యం సిద్ధించటానికి పరమేశ్వర సంకల్పానుసారం సిద్ధమండలి తలపెట్టిన ప్రణాళికలు అమలుచేయటానికి మీ వంటి వారి సహకారం చాలా అవసరం. సిద్ధఋషులవలె దీర్ఘకాలం జీవిస్తూ ఉండాలన్న మీ కోరిక నాకు తెలుసు. దేవతా సాధనల వల్ల మీకు అజరత్వం వచ్చింది కాని అమరత్వం రాలేదు. మీ రిప్పటికి దాదాపు 1500 సంవత్సరాల నుండి జీవించి యున్నారు. ఈశరీరాలు పతనమయ్యే సమయం సమీపించింది. ఈ విధి నిర్ణయాన్ని తప్పించటానికి ఇప్పటి మీ తపశ్శక్తి చాలదు. కనుక దానికి బద్ధులై మీరు మరణించి మళ్ళీ జన్మలెత్తవలసి ఉన్నది. మీ ముగ్గురిలో రాజనాగుడు తపస్సులో అధికుడు. అతడు కొంతకాలం తరువాత ఈ దక్షిణాపధంలో జన్మించి నా శిష్యుడై యోగసాధనలు చేసి కుర్తాళం వచ్చి అగస్త్య మహర్షిని గూర్చి తపస్సుచేసి ఆయన అనుగ్రహం వల్ల సిద్ధుడై దీర్ఘకాలజీవియై మహావతార్‌బాబా అన్నపేరుతో ప్రసిద్ధిచెంది శ్రీకృష్ణుడు బోధించిన క్రియాయోగ మార్గాన్ని పునరుద్ధరించి సాధకు లెందరికో సహాయం చేసి ఆధ్యాత్మికరంగంలో పురోగమింపచేస్తాడు. ఇక మీ రిద్దరు కొన్ని జన్మలెత్తి ప్రతిజన్మలోను దేవతల భక్తిని నిలుపుకొంటూ సిద్ధులతో అనుబంధాన్ని ఎప్పటికప్పుడు పునరుద్ధరించు కొంటూ ముందుకు వెడుతుంటారు. ఇప్పటికి రెండువేల సంవత్సరాల తరువాత మరొక దేశంలో పుట్టి మన సిద్ధమండలిలోని ఒక యోగీశ్వరునకు శిష్యులవుతారు. ఆ తరువాత 1500 సంవత్సరాలు గడచిన అనంతరం బృందావనధామంలో మళ్ళీ కలుస్తారు. ఆ తరువాత 500 సంవత్సరాలకు మళ్ళీ కలుసుకోవటం జరుగుతుంది. మిగతా విషయాలు అవసరమయినంత వరకు మీకు తెలియచేయబడుతుంటవి. నేనెప్పుడూ మిమ్ము ఒక కంటకనిపెడుతూ ఉంటాను. రాజనాగుడు కూడా మీతో ఆత్మీయమైన అనుబంధం కలిగి ఉంటాడు. ఈ పరిణామాలకు మీ మనస్సులలో కలుగుతున్న వేదనను నేను గుర్తించగలను. సర్వశక్తి సంపన్నుడయిన

పరమేశ్వరుని ఇచ్ఛననుసరించి నడవవలసిన వారలమే మనమంతా కాకపోతే కొంచెం ముందు వెనుకలు, హెచ్చుతగ్గులు, ఈ భేదము, వైవిధ్యము తప్పవు". వారు గురుదేవుని ఈ మాటలు విని నిశ్శబ్దంగా ఆయన పాదములకు ప్రణమిల్లి నిర్దేశించబడిన పథంలో ప్రయాణీకులయినారు.

సిద్ధసంకల్పాన్ని అనుసరించి, గురువుల ఆజ్ఞననుసరించి ముగ్గురు యువకులూ తమ తమ జన్మపరంపరలలోకి వెళ్ళిపోయినారు. కాలాంతరమున రాజనాగుడు మహావతార్‌బాబాగా పరిణామం చెందాడు. శివనాగుడు మౌనస్వామి అన్నపేరుతో కుర్తాళంలో సిద్ధేశ్వరీ పీఠాన్ని స్థాపించాడు. సిద్ధనాగుడు తీర్థయాత్రలు చేస్తూ ఉజ్జయినికి వెళ్ళి అక్కడ మహాకాళిని, భైరవుని దర్శించి శివరాత్రి ప్రాణాలు వదిలాడు. భైరవానుగ్రహం వల్ల తరువాత జన్మలో భైరవనాథుడన్న పేరుతో పుట్టి ప్రచండమైన భైరవసాధన చేసి తీవ్రమైన శక్తులు సాధించి వెయ్యేండ్లకు పైగా జీవించి మరణించాడు. తదనంతరం విదేశాలలో మహాయోగి అయిన ఏసుక్రీస్తుకు శిష్యుడై 'జాన్' అన్నపేరుతో గురుబోధలను ప్రచారం చేశాడు. ఆ తరువాత మళ్ళీ భారతదేశంలో భానుదేవుడన్న పేరుతో రాజవంశంలో పుట్టి ఒక చిన్న రాజ్యానికి ప్రభువై మధ్యవయస్సులో శత్రువుల చేతిలో ఓడిపోయి రాజ్యభ్రష్టుడైనాడు. ఏ విధంగానైనా రాజ్యం పొందాలన్న కోరికతో మత్స్యేంద్రనాథుని శిష్యుడైన గోరఖ్‌నాథుని ఆశ్రయించాడు. ఆ మహాయోగి దివ్యదృష్టితో చూచి "భానుదేవా ! ఈ చిన్న రాజ్యానికిమళ్ళీ ప్రభుత్వం సంపాదించటం కోసం నన్నాశ్రయించావు. నీ పూర్వసంస్కారాన్ని అనుసరించి నీవీ చిన్నపరిధికి పరిమితం కావలసిన వాడవు కావు. వెనుక ఒక జన్మలో కాళీభక్తుడవు. ఆదేవి అనుగ్రహం నీమీద ఉంది. నీకు కాళీ మంత్రాన్ని ఉపదేశిస్తాను. తీవ్రసాధన చెయ్యి. కాళీదేవి అనుగ్రహించి తీరుతుంది. అప్పుడామెను ఏమికోరుతావన్నది నీఇష్టం" అని మంత్రోపదేశం చేశాడు. ఆ సిద్ధుడు చెప్పిన విధంగా సాధన మొదలు పెట్టి పట్టుదలతో చేశాడు భానుదేవుడు. కఠోరదీక్షలతో కొన్ని సంవత్సరాలు కష్టపడవలసి వచ్చింది. చివరకు కాళీదేవి సాక్షాత్కరించి "నాయనా నీకు ఏమి కావాలో కోరుకో' అన్నది. ఇన్ని సంవత్సరాల కఠోర శ్రమలో అతనికి లౌకిక సుఖభోగవాంఛనశించింది. మళ్ళీ రాజ్యం పొందాలన్న కోరిక తొలగిపోయింది. ''అమ్మా ! సమ్రాట్టును కావాలని సాధన మొదలుపెట్టాను. ఇప్పు డా వాంఛలేదు. కానీ నాకు పూర్తి వైరాగ్యమూ కలుగలేదు. అందువల్ల సిద్ధశక్తులతో లోకకల్యాణం చేస్తూ నీ సేవకునిగా ఉండాలని ఉన్నది. ఒక వేళ నేను మళ్ళీ జన్మలెత్త వలసి వచ్చినా ఎప్పుడూ నీ భక్తుడనై ఉండేటట్లుగా నన్ను అనుగ్రహించు" పరమేశ్వరి దయార్ద్రమైన చూపులతో చిరునవ్వు వెన్నెలను కురిపిస్తూ అతడు కోరిన వరమిచ్చి అదృశ్యమయింది. ఆ శరీరంలో కొంత దీర్ఘకాలం జీవించి మళ్ళీ హిమాలయాలలోని డెహ్రాడూను ప్రాంతంలో ఒక కాళీ భక్తుల ఇంట్లో పుట్టటం జరిగింది. తమవంశంలో ఉన్న కాళీపూజ, మంత్రసాధన సహజంగానే అబ్బినవి. ఆ ప్రాంతంలో ఒక దేవి ఆలయం ఉన్నది. ఆ ఆలయం లోని దేవీమూర్తి అంటే అతనికి ఆకర్షణ ఏర్పడింది. ఆ దేవతను చూచినప్పుడల్లా

మాతృభావన కాక మధుర ప్రేమభావన కలిగేది. పరమేశ్వరి విషయంలో ఈ భావన తప్పుకదా ! అనిపించేది. కానీ ఆ భావం నిల్చేది కాదు. పాశం వేసి లాగుతున్నట్లుగా అతని హృదయం ఆ దేవత వైపు బలంగా ప్రేమభావనతో మోహితమైంది. అతడు మంత్రశాస్త్ర గ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలించాడు. భాగవతాన్ని చాలా సార్లు చదివాడు. కృష్ణోపాసనలో గోపికాభావానికి ఉన్న ప్రాధాన్యాన్ని జాగ్రత్తగా అనుశీలనం చేశాడు. బృందావనంలో గోపకుల భార్యలు కృష్ణుని తమ ప్రియునిగా భావించి ఉపాసించి తరించారు. తల్లిగా, తండ్రిగా, అన్నగా, బంధువుగా, స్నేహితునిగా, ప్రియునిగా ఏ విధంగానైనా పరమేశ్వరుని భావించవచ్చు. చివరకు శత్రువుగా కూడా భావించవచ్చు. భావములో తీవ్రత, ఉద్దామధ్యాననిష్ఠ ప్రధానమని నారదుడు ధర్మరాజుతో చెప్పిన శ్లోకాలను పదేపదే మననం చేశాడు. పరమేశ్వర చైతన్యం గుణ, లింగ, నామరహితమైనది. పురుషరూపాన్ని కాని, స్త్రీరూపాన్ని కాని ఏది కావాలనుకుంటే అదిధరించకలదు. పరమేశ్వరుని పురుషునిగా తన ప్రియునిగా భావించిగోపికలు తరించినట్లు ఆ అనంత చైతన్యము స్త్రీగా భావించి ప్రియురాలిగా ఎందుకు ఉపాసించరాదు ? తాంత్రిక గ్రంథములలో “వీరమార్గము” అన్న పేరుతో ఈ పద్ధతి కన్పించింది. దానితో ఒక నిర్ణయానికి వచ్చి ఆ గుడిలో కూర్చొని ప్రేమభావంతో శ్యామకాళీమంత్రసాధన చేశాడు. కొద్దికాలం చేయగానే ఆ గుడిలోని దేవత సాక్షాత్కరించింది. “సాధకుడా ! నీ తపస్సుకు నేను సంతృప్తిని చెందాను. నీలో కలిగిన ప్రేమభావము తప్పు కాదు. దానికి కారణం నేనే. దేవాలయాలలో ఒక రహస్యమున్నది. ప్రతి దేవాలయంలోను ఎప్పుడూ ఆ దేవత ఉండదు. ఆ దేవత పరివారంలోని వారు ఆమె ఆజ్ఞవల్ల అక్కడ ఉంటూ భక్తుల కోరికలను వారి యోగ్యతను బట్టి ప్రసాదిస్తుంటారు. నేను భువనేశ్వరి పరవారంలోని అనూరాధ అనే దేవతను. పూర్ణ మానవశరీరంతో నీతో కొంతకాలం కాపరంచేస్తాను. నీకు దివ్యసుఖాల నందిస్తాను” అని వరమిచ్చింది. ఆ ప్రకారంగానే కొన్ని సంవత్సరాలు అతనితో ఆమె సంసారం చేసింది. ఆ దాంపత్య ఫలితంగా వారికొక కుమారుడు పుట్టాడు. వాడికి అయిదుఏండ్ల వయస్సు వచ్చిన తరువాత ఆ దేవత “మన దాంపత్య సమయంపూర్తయిపోయింది నేను వెడుతున్నాను. నీ జీవితంలో మళ్ళీ ఇక నేను కనపడే అవకాశం లేదు. కుమారుని జాగ్రత్తగా పెంచి పెద్దవాడిని చెయ్యి” అని వీడ్కోలు చెప్పి అదృశ్యమయింది. ఇన్ని సంవత్సరాలు ఆమెతో శృంగార క్రీడలో మునిగి కాళీసాధన సరిగా చేయలేదు. తన తపః ఫలమో లేక పూర్వపుణ్యమో పూర్తి అయిపోయింది. ఈ జన్మలో తనకింక సుఖం లేదు.పోనీ మళ్ళీ వెళ్ళి తపస్సుకు కూర్చుందాము అంటే ముద్దులొలికే చిన్నవాడిని విడిచిపెట్టి పోలేడు. తనకీ జన్మ కింతే అని మనసు కుదుట పరచుకొని ప్రేమస్వరూపిణి అయిన తన భార్య చెప్పిన విధంగా బిడ్డను పెంచి పెద్దచేశాడు. వానిని సంసారంలో స్థిరపరచేసరికి తనకు ముసలితనం వచ్చి ఆయువు తీరిపోయింది. సామాన్య సాధనయే తప్ప కఠిన తపస్సు చేయటానికి శరీరం సహకరించని స్థితిలో పడినాడు. మరణం సమీపించినప్పుడు కాళీమాతను ప్రార్థించాడు. “తల్లీ ! ఏ జన్మలో ఏమి సుకృతము చేశానో ఈ జన్మలో నీ భక్తుడనయ్యే అదృష్టం కలిగింది. కానీ, ఇంద్రియములకు లొంగిపోయి

కామవశుడనై ఒక దేవతనే భార్యగా చేయమని నిన్ను ప్రార్థించాను. నీ వనుగ్రహించి ప్రసాదించావు. కానీ, ఆ భోగంలో పడి తపస్సు విస్మరించాను. వచ్చే జన్మలో నయినా తపస్సు చేసి నీ పరిపూర్ణమయిన అనుగ్రహ సిద్ధిని పొందేలాగా కరుణించు" అని కాళీదేవిని మనస్సులో నిల్పుకొని ఆ దేవి మంత్రాన్ని జపిస్తూ తుదిశ్వాస వదిలాడు.

తరువాత జన్మలో మళ్ళీ కాళీసాధకుడయ్యాడు స్వప్నంలో కాళీదేవి స్వయంగా తన మంత్రాన్ని ఉపదేశించింది. ఈ జన్మలో సంసారంలేదు. చిన్న వయస్సులోనే దేవతా సాక్షాత్కారం పొందాలన్న తపన బయలుదేరింది. ఇంట్లో తల్లితండ్రుల బాధ్యత వహించవలసినది తనకంతగా లేదు. తన అన్నలున్నారు. విద్య యందు కాని లౌకిక విషయాల యందు కాని తనకు ఆసక్తి లేదు. ఎప్పుడూ గుళ్ళూ గోపురాలు పట్టుకొని తిరిగేవాడు. పెద్దలు ఎంత చెప్పి చూచినా అతను మారలేదు. కొంతకాలం తరువాత వీడు నలుగురి వంటివాడు కాదని నిశ్చయించుకొని ఇంట్లోవాళ్లు పట్టించుకోవటం మానివేశారు. అతడికి కావలసినదీ అదే. ఎప్పుడూ అమ్మవారి గుడికి వెళ్ళి అక్కడ కళ్ళు మూసుకొని కూర్చుండేవాడు. అప్పుడప్పుడు వారి ఇంటికి హరిద్వారంలో ఒక ఆశ్రమాధిపతిగా ఉంటున్న ఒక వృద్ధయోగి వచ్చేవాడు. ఒక పర్యాయం వచ్చినప్పుడు ఇతడు ఆయనను హరిద్వారానికి తీసుకొని వెళ్ళమని ప్రార్థించాడు.ఆయన ఆశ్రమంలో వేదపాఠశాల ఉన్నది. అక్కడికి వెడితే అక్కడి పిల్లల సహవాసంతోటైనా చదువులో పడవచ్చునేమో అని ఆయనతో వెళ్ళటానికి తల్లిదండ్రు లనుమతించారు.అది అతనికి పెద్దవరమయింది. ఆ వృద్ధయోగితో హరిద్వారం చేరుకొన్న తరువాత కొన్నాళ్ళు ఆశ్రమంలో ఉండి ఆయనతో తనకు తపస్సునందు ఉన్న ఆసక్తిని విన్నవించి తాను ఏకాంతంగా తపస్సు చేసుకోవటానికి అనుమతివ్వమని అర్థించాడు. ఇతని లక్షణాన్ని నిశ్చలమయిన పట్టుదలను సాధనలోని ఏకాగ్రతను గమనించి ఆ వృద్ధుడు దానికి సంతోషంగా అనుమతించి సాధనలో తీసుకోవలసిన జాగ్రత్తలు తనకు తోచినవి చెప్పాడు. అక్కడ నుండి హిమాలయ పర్వతాలలో కొంతదూరం వెళ్ళి ఆ కొండలలో ఒక చిన్నగుహను ఎన్నుకొని అక్కడ తపస్సు ప్రారంభించాడు. క్రూరమృగాలు లేని చోటు జనావాసాలకు మరీ దూరంకాని చోటది. గంగాజలం సమృద్ధిగా ప్రవహించే స్థలం. పండ్లు, పండ్లచెట్లు చాలా ఉన్నవి శరీరాన్ని నిలపటానికివి చాలు. ఆహార విహారాది కఠోర నియమాలతో ఒక వైపు శరీరాన్ని జాగ్రత్తగా రక్షించుకుంటూ కాళీమంత్ర జపసాధన చేయటం మొదలు పెట్టాడు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నవి. ఋతుగమనంలో మార్పులు వచ్చినట్లే అతని శరీరంలోనూ మార్పులు వస్తున్నాయి. ఆ ప్రాంతంలోని పొదలలోని కొన్ని చెట్ల పండ్లు చిన్నవి తింటే బాగా బలంగా ఉన్నట్లు అనిపించటాన్ని గమనించాడు. కొన్నిఫలాలు ఆకులు, తింటే రోజుల తరబడి ఆహారం యొక్క అవసరం లేకపోవటం గుర్తించాడు. ఈ విధంగా ఆయా వస్తువులనుపయోగించుకొంటూ ప్రాణరక్షణ చేసుకొంటూ మంత్రసాధన చేస్తున్నాడు.

కూర్చుండిన స్థలములోనె కూలిన కూలుదునుగాక!
ఎముకలగూడు వలె మారి ఎండిన ఎండుదునుగాక!
నా మాంసము నా చర్మము నా దేహము శిథిలమైన
నిను వీడను నిను వీడను నిను చూడక నే వదలను

ఈ కూర్చొన్న ఆసనంలో నాశరీరము శుష్కించిన శుష్కించును గాక! నా శరీరములోని మాంసము, చర్మము, ఎముకలు నశించిపోయిన పోవును గాక! నేను కోరిన దివ్యానుగ్రహాన్ని పొందకుండా ఇక్కడ నుండి కదలను.

తల్లీ! నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నవి. కాలాన్ని గణించే శక్తి కూడా నశించింది. ఎప్పటికైనా నిన్ను చూచి తీరాలి అన్న సంకల్పం ఒక్కటే మిగిలి ఉన్నది. ఎన్నో జన్మల నుండి నిన్నుకొలుస్తున్నాని క్షణక్షణము అనిపిస్తుంది. నీదర్శనం కోసం తపించి తపించి ఎండిన మోడువలె అయిపోతున్నాను. ఏడ్చిఏడ్చి కన్నీళ్ళు కూడా ఇంకిపోయినాయి. ఆర్తుడను దీనుడను అయిన నన్ను కాపాడు.

30. కాళినమస్తే - ఖేళినమస్తే

కాళి కాళి కంకాళి నమస్తే
నీలగగన దిక్చోళి నమస్తే
మునిహృదయాంబుజ హేళి – నమస్తే
సంగర కవితాచూళి – నమస్తే
జిహ్వాద్యుతి కంకేళి – నమస్తే
పదసంశ్రిత దేవాళి – నమస్తే
శివశిరస్థపదధూళి – నమస్తే
నమద్భైరవీపాళి – నమస్తే
మాయామాళవ గౌళి – నమస్తే
దనుజదళనదంభోళి – నమస్తే
నాగాలంకృత మౌళి – నమస్తే
సేవాపరబేతాళి – నమస్తే
కరధృత ఖడ్గకరాళి – నమస్తే
శ్యామకాంతిరింఛోళి – నమస్తే
బహువర్ణోత్సవ హోళి – నమస్తే
భీషణసౌందర్యాళి – నమస్తే
కాంతిచకితభూగోళి – నమస్తే
రాగోల్లసితవరాళి – నమస్తే

నీలశరీర తమాలి - నమస్తే
చండినమస్తే ముండి నమస్తే
చండ చండి చాముండి - నమస్తే
అమరి నమస్తే భ్రమరినమస్తే
శాత్రవభీకర ఖిదురి - నమస్తే
శాంతి నమస్తే కాంతి - నమస్తే
సకలలోక విక్రాంతి - నమస్తే
కాళినమస్తే ఖాళి - నమస్తే
మకార పంచక కేళి - నమస్తే
మూలాధారిత కీలి - నమస్తే
శూన్యభావ వైశాలి - నమస్తే
కరుణకవితలోజాలి - నమస్తే
గానలహరిలో లాలి - నమస్తే
కవిహృదయములో హోళి - నమస్తే
కాళి నమస్తే ఖాళి నమస్తే
హృదయశ్రీగిరి ఖేళి నమస్తే
సిద్ధేశ్వర హృత్కేళి నమస్తే

భక్తి భరితమైన ఈ వేదనకు, అతని చిరకాల కఠోర తపస్సుకు కాళీ దేవి కనికరించి, దయామయి అయిన ఆజగజ్జనని అతనిముందు సాక్షాత్కరించింది. “బిడ్డా! నీ కఠోరమైన తపస్సుకు నేను కదలివచ్చాను. పూర్వజన్మలలోనూ నీవు నా భక్తుడవు. ఎప్పుడూ నిన్ను అనుగ్రహిస్తునే ఉన్నాను. రెండు జన్మల క్రింద నీవు మహాసిద్ధుడవు. నీవు సుఖ భోగములను త్యజించి క్రూర తపస్సు చేసి కాపాలిక సాధనలు చేసి ఆనాడు నా అనుగ్రహాన్ని సాధించావు. అప్పుడు నీవు తపస్సు చేసిన చోటు కూడా ఇదే. నాటి నీ భౌతిక శరీరం నీ ఆజ్ఞ వల్ల నీ శిష్యులు ఈ గుహలో ఖననం చేశారు. నా సంకల్పం వల్ల నీ జీవు డిక్కడికి ఆకర్షించబడ్డాడు. మధ్యలో వచ్చిన జన్మలు నీ అంత రాంతరాలలో ఉన్న సుఖ భోగ కాంక్షలు తీరటానికి సరిపోయింది. ఈ జన్మలో మళ్ళీ ఇక్కడకు వచ్చి ఆనాటి నీ సమాధి మీదనే నీవు కూర్చొని జపం చేశావు. కాలవశాన వచ్చిన మార్పుల వల్ల ఆ చిహ్నాము లేవీ పైకి కన్పించక పోవడం వల్ల నీకు తెలియలేదు. నేనే, నీకు స్వప్నంలో మంత్రాన్ని ఇచ్చాను. నేనే, నిన్ను ఇక్కడకు రప్పించాను. నీ చేత తపస్సు చేయించాను. నీకు దివ్య శక్తులను ప్రసాదిస్తున్నాను. ఈ శరీరంలో నీవు మూడు వందల సంవత్సరాలు జీవిస్తావు నీకు తోడుగా నేను ఎప్పుడు ఉంటాను.” అని కాళీదేవి పలికింది. ఆ యోగి “అమ్మా! నీ అనుగ్రహం వల్ల నేను ధన్యుడనయినాను. ఎప్పుడూ నీ ఉపకరణంగా ఉంటూ నీవు సంకల్పించిన పనులను చేసే సేవకునిగా నన్ను నియమించు నీవు నాతో ఎప్పుడూ ఉంటానన్నావు. భౌతికంగా కూడా

అది జరిగేలా చెయ్యి అన్నాడు. కాళీదేవి నవ్వి "ఓయీ! చిత్రమైన కోరిక కోరావు. ఇది కలియుగం. నేను నీ వెంట దివ్యాకృతితో ఉండడం ఉచితంకాదు. కానీ నీ వంటి భక్తుని కోరికను కాదనలేను. చిన్న విగ్రహ రూపంలో నీతో ఉంటా. ఆ విగ్రహంలో నీకు కన్పిస్తాను, మాట్లాడుతాను. నీ బుద్ధిని ప్రచోదిస్తూ ఉంటాను. అయితే ఈ విగ్రహం అన్ని విగ్రహాల వంటిది కాదు. పసిబిడ్డ పెరిగి పెద్దదయినట్లే ఇదికూడా పెరిగి పెద్దదవుతూ ఉంటుంది. ఇది జీవత్ విగ్రహం అనడానికి నిరూపణగా దీనికి ఉఛ్వాస నిశ్వాసలుంటాయి. నాడీ స్పందన ఉంటుంది. ఇక్కడ నుండి నా విగ్రహంతో నీవు బయలుదేరి దేశ సంచారం చెయ్యి ఎందరో యోగులు, సిద్ధులు నీకు తటస్థిస్తుంటారు. ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రజలను మలుస్తూ యోగసాధనలలో తపస్సాధనలలో మరింత ముందుకు పోయేలా చేస్తూ నీవు పురోగమించు. ఈ విగ్రహం పెరిగి పెద్దదవుతూ ఉంటుంది. ఇప్పటి మనుష్యప్రమాణం వచ్చిన తరువాత దానినొకచోట స్థాపించి ఆలయాన్ని నిర్మిద్దువుగాని ఎప్పుడు ఏమి చేయ వలసినదీ నేను నిర్దేశిస్తూంటాను" అతనిముందు తేజస్వంతమైన ఒక చిన్న విగ్రహం అవతరించింది.

ఆ విగ్రహంతో హిమాలయాల నుండి బయలుదేరి యావద్భారత దేశము సంచారించాడు కాళీయోగి. ఉత్తరాపథంలో బృందావనంలో కొంత ఎక్కువకాలం ఉండవలసి వచ్చింది. అక్కడి రాధాకృష్ణ భక్తులైన రూపగోస్వామి, సనాతనగోస్వామి, మొదలైన ప్రేమయోగులతో అనుబంధం పెరిగింది. ఆధామంతో తనకున్న పూర్వజన్మ బంధాలు గుర్తుకువచ్చినవి. ఒకసారి హితహరివంశమహరాజ్ అనే రాధాభక్తుడు తన ఆశ్రమానికి ఆహ్వానించి తాను రచించిన రాధాసుధానిధి అనే గ్రంథం వినిపించాడు.తనను రాధాసఖిగా భావించుకొని అతడు చేసిన ఆ రచన తననెంతో ఆకర్షించింది. సంస్కృతంలో అంతటి రసవంతమైన రచన భక్తి ప్రేమామృతాన్ని వర్ణించే రచన మరొక్కటి లేదని అనిపించింది. అతడు కాళీయోగిని కాళీ రూపంగానే భావించేవాడు. కాళి కూడా రాధాసఖులలో ఒకరని వాదించేవాడు. ఆ రసిక భక్తునితో గడిపిన కాలం మరచిపోలేనిది. ఇక రూపగోస్వామితో మైత్రి చాలా గాఢమైనది. కాళీతంత్రంలో నుండి ఇతడుదాహరించిన ఒక సూత్రం అతనికి బాగా నచ్చింది. ఉచ్ఛ్వాసనిశ్వాసముల గమనాగమనములను కండ్లుమూసుకొని ఏకాగ్రతగా చూడటమే కాలమును జయించే కాళీసాధన అని ఆ వాక్యం. గోస్వామి కృష్ణభక్తికి సంబంధించిన ఒక గ్రంథం రచిస్తూ రాత్రులు కొంతకాలం ఈ సాధన చేశాడు. ఆ సాధన ఫలితంగా ఒక కాళీసిద్ధుడతనికి సాక్షాత్కరించాడు. గోస్వామి యందు ఆదరం చూపించి కాళీ కృష్ణులు ఒక్కటే అని చెప్పి దివ్యానుభూతులను, కొన్ని శక్తులను ప్రసాదించాడు. ఆకాశ సంచార శక్తిగల ఆ సిద్ధుడే తర్వాత రామకృష్ణపరమహంసగా జన్మించాడు. ఆ కాళీసిద్ధుడు ఇతని విగ్రహంలోని కాళీదేవిని పూజించడమేగాక జన్మమారిన తర్వాత రామకృష్ణునిగా కూడా ఇతని చివరి రోజులలో వచ్చి దర్శించి అమ్మను అర్చించి వెళ్ళాడు. కొంత కాలం కాళీయోగి కాశీలో ఉన్నాడు. అక్కడ త్రైలింగస్వామి అనే యతి శ్మశానకాళీ సాధన చేసి ఇతనివలె మూడు వందల యేండ్లు జీవించే వరం పొందాడు. అతడూ ఈ కాళీ దేవతామూర్తిని

అర్చించాడు. అక్కడి నుండి యోగి కొన్నాళ్ళు దక్షిణాపథంలో తిరిగాడు. చిత్రానదీ తీరంలోని కుర్తాళం అతనిని ఆకర్షించింది. ఆ పవిత్రస్థలంలో కొన్ని నెలలు ధ్యానం చేసుకుంటూ అక్కడి ఆర్తుల కష్టాలు తీరుస్తూ గడిపాడు. తిరిగి ఉత్తర భారతానికి బయలుదేరగా దోవలో ఆంధ్ర ప్రాంతంలో శ్రీనాధుడనే కవివర్యునితో పరిచయం కలిగింది. చింతామణి మంత్రసిద్ధుడై రాజ పూజితుడైన ఆ విద్వాంసుని కవిత్వ పాండిత్య ప్రాభవానికి అతడు ముగ్ధుడైనాడు. ఆ కవి–అతిథిగా తన భవనంలో కొంతకాలమైనా ఉండవలసినదిగా ప్రార్థించాడు. ఆతని ఆత్మీయ భావానికి సంతోషించి కొన్నాళ్ళున్నాడు. విపరీతంగా స్త్రీలోలుడు, కాముకుడు – అయిన ఆ కవి చిత్తవృత్తి చాలా చిత్రమనిపించింది. ఆనన్యమైన అతని శివభక్తి, తనకెంతో నచ్చింది. కాళీయోగి అక్కడినుండి బయలుదేరే రోజు ఆ కవిరాజు తన భవిష్యత్తును గూర్చి చెప్పమని ప్రార్థించాడు. ధ్యానంలో చూచి ఇలా చెప్పాడు. "మహాకవీ!" మీది చాలా గొప్ప జన్మ . ఆ విషయం నేను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఒక సిద్ధగురువు నీకు దివ్యమంత్రాన్ని ఉపదేశించాడు. ఆ సమయంలో అతడు నీకు కొన్ని నియమాలు పెట్టాడు. ఆ మహామహుని దయ వల్ల నీకు వాక్సిద్ధి లభించింది. నీ రంగంలో నీ ముందు నిలువగల వారుండరు. దిగ్విజయం చేసి సమ్రాట్టులచే కనకాభిషేకాలు పొందుతావు. ఎంతటి రాజులయినా నీ వశులవుతారు. మహాభోగాలు అనుభవిస్తావు. కానీ నీ స్త్రీలోలత నిన్ను దెబ్బతీస్తుంది. నీ పతనానికి దారి తీస్తుంది. ఇప్పుడే కాదు ఇంకా చాలా సంవత్సరాల తర్వాత. ఇప్పుడు నీ ప్రభజగజ్జేగీయ మానంగా వెలుగుతోంది. ఏనాడు నీ సిద్ధగురువు పెట్టిన నియమాన్ని ఉల్లంఘిస్తావో ఆనాడు నీ శకం ముగుస్తుంది. మరపువల్ల, కామంవల్ల, నీవు దోషం చేస్తావని, తదనంతరం నీవు హత్యచేయబడి ప్రేతమై కొన్ని వందల సంవత్సరాలు గాలిలో తిరుగుతుంటావని తోస్తున్నది. నీ పురుషకారం వల్ల, దైవభక్తి వల్ల నీ భవిష్యత్తు నేమైనా మార్చుకోగలవేమో ఆలోచించుకో" శ్రీనాధుడు "యోగిశేఖరా! కాళీదేవి అనుగ్రహపాత్రులైన మీరు ఎన్నో విశేషాలు తెలియజేశారు. మీరు చెప్పిన ప్రయత్నం చేస్తాను. కానీ ఎంత కృతకృత్యుడనవుతానో! ముక్కుకుత్రాడు వేసి గంగిరెద్దును దానిని ఆడించువాడు లాక్కువెళ్ళి ఆడించే విధంగా విధినాతో ఆడుకుంటున్నది. నాకు మనశ్శాంతి లేదు. చిన్నప్పుడే నా తల్లి దండ్రులు మరణించారు. నా స్వగ్రామం క్రాల్‌పట్టణం ఉప్పెన వచ్చి సముద్రంలో కొట్టుకుపోయింది. నా మేనమామ సనత్కుమారభట్టు నన్ను పెంచి పెద్ద చేశాడు. ఆయన కూతురును నాకు పెండ్లి చేయాలని ఆశించాడు. ఆ అమ్మాయి చాలా వికారంగా ఉంటుంది. నా జీవలక్షణం సౌందర్యోపాసన. ఆ అమ్మాయిని పెండ్లి చేసుకోనని తిరస్కరించాను. కృతఘ్నుడవని నన్ను దూషించాడు. నన్ను ఇంట్లో నుండి వెళ్ళగొట్టాడు. ఆయన పెద్ద అధికారపదవిలో ఉండడం వల్ల నా కెవ్వరూ ఆశ్రయమివ్వలేదు. ఆగమ్మకాకినై ఊళ్ళు పట్టుకు తిరిగాను. ఒక సిద్ధుడైన మహానుభావుడు కరుణించి మంత్రోపదేశం చేశాడు. అది సిద్ధించింది. దాని వల్ల వాగ్దేవి అనుగ్రహించింది. మహా కవియైన మా తాతగారు కమలనా భామాత్యుని వారసత్వంగా కవిత్వం వచ్చింది. సరస్వతీ చింతామణీదేవి ఇచ్చిన శక్తి వల్ల సాహిత్యరంగంలో

అప్రతిహత పరాక్రమంతో ప్రకాశిస్తున్నాను. దాని వల్ల సిరిసంపదలు లభించినవి. మీ వంటి మహానుభావులకు ఆతిధ్యమిచ్చి పూజించుకోగల అవకాశం లభించింది. అయితే మీరు నా భవిష్యత్తును గూర్చి చెప్పిన విషయాలు విన్నప్పుడు దిగులు కలుగుతున్నది. నా సాధనశక్తి చాలా పరిమితమైనది. దానివల్ల విధిని మార్చగలనని నాకు నమ్మకం లేదు. నన్ను మీరే రక్షించాలి. బ్రతుకు బాటలో ముండ్ల మీద ఉండవలసి వచ్చింది. ఎన్నో మలుపులు వచ్చినవి. వాటిని మీ ముందు ఏకరువుపెట్టను. ఆ పరిస్థితులలో స్త్రీలోలుడనైనాను. అయితే వేశ్యాగమనం చేస్తున్నాను గాని – యే పతివ్రత జోలికి పోలేదు. నా మంత్ర గురువులు మీకు తటస్థించవచ్చు. నేను ఎప్పుడైనా తప్పుచేస్తే నన్ను దయతో క్షమించమని వారికి చెప్పండి. వారిని మళ్ళీ చూచే అవకాశం ఉన్నదో, లేదో వా రెక్కడ ఉన్నారో ? ఏదైనా నన్ను మీరు కాపాడాలి. అని ప్రార్ధించాడు. మనసుకరిగిన కాళీయోగి మరోసారి నిమీలితనేత్రుడై ధ్యానించి "శ్రీనాధకవీ! చాలకాలం తర్వాత నీ యాత్రలో ఒక మంత్రవేత్త నీకు పరిచయమవుతాడు. అతడు నీకు పరకాయప్రవేశవిద్యను నేర్పుతాడు. అతని పేరు శివరాయప్ప – కన్నడిగుడు. సిద్ధవిద్య నేర్చుకోవాలన్న మోజులో అక్కడి మతంగ పర్వతం మీద 40 రోజులు సాధన చేస్తావు. ఆ విద్య సిద్ధిస్తుంది. దానిని పరీక్షచేసి చూడాలన్న కోరికతో ఒక యువకుని మృత శరీరంలో ప్రవేశిస్తావు. నీ కిష్టమైన సుందర యౌవనవతితో మూడు రోజులు శృంగారక్రీడలలో మునిగి ఉంటావు. ఆ సమయంలో నీ శత్రువుల అనుచరుడొకడు నీ అసలు శరీరంలో ప్రవేశించి తానే శ్రీనాధునిగా నటిస్తూ ఆంధ్ర దేశానికి వెళ్ళిపోతాడు. నీవు మూడురోజుల తర్వాత చూస్తే నీ శరీరం దొరకదు. ఆ యువకుని శరీరంలోనే ఉండిపోవలసివస్తుంది. నిస్సహాయ స్థితిలో ఉన్న నీ మాటలను ఎవరూ నమ్మరు. ఆ ప్రాంతంలో ఆంతకుముందు నిన్ను ఆదరించిన రాజుతో చెప్పుకొన్నా అతడు విశ్వసించడు. ఆంధ్రదేశానికి వెళ్ళి నిరూపించుకొందామని నీవు చేసే ప్రయత్నం విఫలమవుతుంది. విషప్రయోగంతో నీవు హత్యచేయబడతావు. ఇప్పటికి తెలుస్తున్న విషయాలివి. నీవు రక్షించమని ప్రార్ధిస్తున్నావు. కాని అప్పటికి నేనెక్కడ ఉంటానో బహుశా నీ హత్యా సమయానికి నేనీ శరీరంతో ఉండక పోవచ్చు. అయితే ఎక్కడ ఉన్నా నీ విషయంలో శ్రద్ధ వహిస్తాను. జగన్మాతకు నివేదించి నిన్ను రక్షించడానికి ప్రయత్నిస్తాను. శుభం భవతు "అని వీడ్కోలు పల్కి కాళీయోగి కళింగ సీమలో ప్రవేశించాడు.

అప్పటికి విగ్రహం పెరిగి పెద్దదయింది. ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు దగ్గర ఉన్న ఒక అరణ్యంలో ఆశ్రమం నిర్మించుకొని భక్తుల సహకారంతో కాళీదేవికి ఆలయం నిర్మించాడు. కాళి అనుగ్రహం వల్ల ముసలితనం ఎక్కువ ఇబ్బంది పెట్టకపోయినా శరీర పతనం తప్పలేదు. దానికి కొద్ది కాలం ముందే భైరవీబ్రాహ్మణి ఒకరు శిష్యురాలుగా చేరింది. ఆమె తాంత్రికసాధనలో ప్రవీణురాలు. ఎందరి చేతనో ఆ సాధనలు చేయించి కొన్ని సిద్ధశక్తులు వచ్చేలా చేయగలిగింది. ఆమె వద్ద ఆ సాధనలలో కృషి చేసిన వారిలో రామకృష్ణపరమహంస ఒకరు. ఆ భైరవి కాళీపూజ శ్రద్ధాభక్తులతో చేస్తున్నది. మరికొందరు శిష్యులు కూడా ఉన్నారు. వారికి ఆలయాన్ని అప్పగించి కాళీయోగి ప్రాణములు వదిలాడు.

ఆ తరువాత కొంత కాలానికి దక్షిణ దేశంలో కంచి క్షేత్రంలో జన్మించడం జరిగింది. దేవతల సిద్ధుల కరుణ వల్ల సాధన చిన్న వయస్సులోనే ప్రారంభమైంది. ఒక కొండ మీది దేవీఆలయంలో తీవ్రసాధన సాగింది. దేవతానుగ్రహం వల్ల పూర్వస్ఫురణ లభించింది. కళింగవనంలోని కాళి దగ్గరకు వెళ్ళి ఆ దేవి అనుగ్రహం కోసం మళ్ళీ తపస్సుచేశాడు.

ఈ సారి కొందరు తాంత్రికులు కలవటం వల్ల వామాచార సాధనలు శ్మశాన సాధనలు చేసి కాళి కృపను వేగంగా పొందటం జరిగింది. ఆనాటి తోటి సాధకులలో ఒకరు లీలానంద ఠాకూర్ అనే ఔత్తరాహుడు. అతడు కళింగా శ్రమంనుండి తనస్వస్థలం వెళ్ళి అక్కడ నుండి బృందావనం చేరి రాధాకృష్ణ భక్తుడై జీవితాన్ని చరితార్థం చేసుకొన్నాడు. అక్కడ అతనిని ఇబ్బంది పెట్టిన దుష్టులనుండి కాళీదేవి రక్షించింది. అతని కోర్కె ప్రకారం అతడు మరణించిన తర్వాత అతని సమాధి మీద కాళీ విగ్రహాన్ని స్థాపించా రతని శిష్యులు. ఈనాడు బృందావనంలో పాగల్ బాబా మందిరం సుప్రసిద్ధమైనది. తోటి సాధకులలో మరొక వ్యక్తి తరువాతి జన్మలో అద్దంకి కృష్ణమూర్తి అన్న పేరుతో విఖ్యాతుడైన మాంత్రికుడు. అప్పుడొక యాత్రలో మౌనస్వామి కలిసి కుర్తాళానికి ఆహ్వానించాడు. ఆనా డది సమకూడలేదు దాని ఫలితంగా తర్వాత జన్మలో మౌనస్వామిపీఠానికి ఆధిపత్యం స్వీకరించవలసివచ్చింది.

ఈ విధంగా ఆటుపోటులతో సుఖదుఃఖాలతో ఆ జీవితం సుమారు ఒక శతాబ్దం కొనసాగి మృత్యుకుహరంలోకి వెళ్ళి పోయింది. అనంతరం వచ్చిన ఇప్పటి జన్మ ఆంధ్రదేశంలో సంభవించింది. అనంత కాలంలోకి చొచ్చుకొనిపోయే దేవతల దృష్టి అపారమైనది. ఖండకాలానికి పరిమితం కాని వారి ప్రణాళికలు అందరికీ అర్థంకావు. అర్థమైన సిద్ధయోగులు దాదాపు పదిమంది తెలుగు దేశంలో పుట్టారు. కొందరు కాస్త ముందు – వెనకా – కొందరు సమకాలికులు. సింధువులో బిందువులు – మహాగ్ని కుండంలోని విస్ఫులింగాలు – పరమేశ్వరుడనే సూర్యబింబం నుండి బయలుదేరిన ఒక్కొక్క కిరణం వంటివారు. ఎవరి నిర్దిష్ట కార్యక్రమాన్ని వారు చేస్తూ – మధ్య మధ్యలో కలుస్తూ విడిపోతూ ఉంటారు.

కాళీసాధన

ఇప్పుడు గుంటూరులోని స్వయంసిద్ధకాళీ పీఠంలో అర్చిస్తున్న కాళీవిగ్రహం విషయం నాకు తెలియటానికి కొంత సమయం పట్టింది. ఒకరోజు ధ్యానంలో విశిష్టమైన అనుభూతి కల్గింది. నేను ఎక్కడో అడవిలో వెడుతున్నాను. నాతో మరికొందరు ప్రయాణీకులు ఉన్నారు. ఆ రాత్రి విశ్రమించి ప్రొద్దున లేచేసరికి ఎవ్వరూ లేరు. ఒక్కడినే ముందుకు వెడుతున్నాను అడవిలో కన్పించిన దోవలో ముందుకు పోతున్నాను. ఒక ఆశ్రమం వచ్చింది. చామనచాయతో బలంగా ఉన్న ఒక దీర్ఘదేహుడు విరబోసిన జుట్టు గడ్డము కలవాడు నాకు స్వాగతం చెప్పాడు. కఠిన తపస్సు చేత ఆయువును పెంపొందించుకొన్న ఆ మధ్య వయస్కుడు "ఆర్యా ! నేను మీ శిష్యపరంపరలోని వాడిని. ఈ కాళీదేవతను చాలా సంవత్సరాల నుండి నేను

పూజిస్తున్నాను. నా వయస్సు ఇప్పుడు 160 సంవత్సరములు. హిమాలయాలకు వెళ్ళాలని అనిపిస్తున్నది. మీ ఆజ్ఞకోసం వేచిఉన్నాను అన్నాడు. అతని తండ్రి కూడా అక్కడ ఉన్నాడు. కొంచెం పొట్టిగా బంగారురంగుతో ఉన్న ఆ వృద్ధుని వయస్సు 300 సంవత్సరాలు. అతడు ఇలా అన్నాడు. “సిద్దేశ్వరా ! జన్మ మారటం వల్ల ఈ విషయాలన్నీ మీ స్మృతికి రావటానికి కొంత సమయం పడుతున్నది. మా కుమారుడు మీకు ఇక్కడి విషయాలు చెప్పాడు. నేనూ మీ పూర్వపరిచితుడనే గురుకృప వల్ల నాకు దివ్యత్వం లభించింది. నా శరీరం కూడా సువర్ణచ్ఛాయకు మారిపోయింది. నా కుమారుడుకూడా అలా కావాలని నా వాంఛ. వాడు ఈ సాధన పూర్తిచేయడం కోసం హిమాలయాలకు వెళ్ళవలసి ఉన్నది. అందువల్ల ఈ కాళీవిగ్రహాన్ని మీకు మళ్ళీ అప్పగిస్తున్నాము”.

ఆ దర్శనం జరిగిన కొద్ది రోజులకు వారు సంకల్పించిన సిద్ధసహకారం వల్ల కాళీ విగ్రహం గుంటూరులోని మా ఆశ్రమంలో ప్రత్యక్షమయింది. దానికి ఆలయం కట్టించి పూజలు చేయటం జరుగుతున్నది. అక్కడ ఒక హోమకుండాన్ని అమ్మవారి ఎదురుగా ఏర్పాటు చేసి దానిలో నిత్యమూ హోమములు జరిగేటట్లుగా ఏర్పాటు చేశాను. అందలి అగ్ని ఆరదు. దానిలో ఏ హోమం చేసినా సిద్ధిస్తుంది. ఆ హోమ నిర్వహణకు జన్మాంతర శిష్యుడు, తీవ్రసాధకుడు అయిన ఒకభక్తుని ఏర్పాటు చేయటం జరిగింది. అతడు నా క్రిందటి జన్మలో ఒక కొండమీద దేవి ఆలయంలో నాతోపాటు నా శిష్యునిగా తీవ్రసాధన చేశాడు. ఆ కొండదేవత అతనిని అనుగ్రహించింది. ఆ కృప ఇప్పుడు పునరావృతమైంది. అప్పుడు నా కాళీ విగ్రహాన్ని పూజించి సాధన చేసిన ఒక స్త్రీ ఇప్పుడు అతని భార్య. ఇక్కడకు వచ్చి హోమములు చేయించుకొని కొన్ని వందలమంది, వేలమంది తమ కష్టాలు పోగొట్టుకొని కామ్యసిద్ధిని పొందుతున్నారు. కాళీదేవి అనుగ్రహం అనవద్యంగా అనితరసాధ్యంగా ప్రకాశిస్తున్నది.

కొద్దికాలం క్రింద ఒక భక్తుడు వచ్చి “అయ్యా ! నేను చాలా సంవత్సరాలుగా కాళీమంత్ర సాధన చేస్తున్నాను. ఆమె దర్శనం కోసం పరితపిస్తున్నాను. రెండు రోజుల క్రింద కాళీదేవి కలలో కనిపించి నేను గుంటూరులో అవతరించి ఉన్నాను. సిద్ధేశ్వరానందస్వామికోసం దిగివచ్చాను. అక్కడకు వచ్చి నా దర్శనం చేసుకో,అంటే వందలమైళ్ళదూరం నుంచి వెతుక్కుంటూ వచ్చాను” అన్నాడు. అదేవిధంగా మరొకసారి భద్రాచలం నుండి ఒక సాధకుడు వచ్చి “స్వామీ ! రకరకాల సమస్యలతో బాధపడుతూ వాటి పరిష్కారం తెలియక ఇటీవల నాడీజాతకం తీయించుకొన్నాను. దానిలో కుర్తాళపీఠాధిపతి గుంటూరులోని కాళీపీఠంలో ఉన్నారు. ఆయనను ఆశ్రయించు నీ సమస్యలు పరిష్కారం అవుతాయి అని అందులో వ్రాయబడి ఉన్నది. మీరు నన్ను రక్షించాలి” అని ప్రార్థించాడు. దానికి తగిన ఏర్పాటు చేయటం జరిగింది.

ఇంకొకసారి హైదరాబాదు నుండి ఒక జిల్లా జడ్జి వచ్చాడు. అతడు పూర్వ జన్మలో ఉజ్జయినిలో తనభక్తుడని కాళీదేవి తెలియచేసింది. ఆ విషయం ఆయనకు చెప్పాను. అతడు

"స్వామీజీ ! చాలా సంతోషకరమైన విషయం చెప్పారు. అయితే ఆ సంగతి నాకు స్వయంగా తెలుసుకోవాలని ఉన్నది. దానికి మార్గమేదయినా చెప్పండి" అని అర్థించాడు. కాళీమంత్రం తీసుకొని ఒక మండలం జపం చేయండి అన్నాను. ఉపదేశం పొంది వెళ్ళిపట్టుదలతో సాధన చేశాడు. 41వ రోజు ఫోను చేసి "స్వామీజీ! రాత్రి కాళీదేవి దర్శనమిచ్చింది. మీరు చెప్పిందే ఆమె తెలియపరచింది. ఎమర్జన్సీ కోటాలో రైలు టిక్కెట్ తీసుకొని ఉజ్జయిని వెడుతున్నాను. మీకు ఎంతో కృతజ్ఞుడిని. ఆశీర్వదించండి" అన్నాడు.

పూర్వజన్మలో ఉజ్జయిని మహాకాళిభక్తునిగా ఉన్న మరొకవ్యక్తి నాకు బాల్యమిత్రుడు. ఆనాడు విద్యాతీర్థ అనే పేరుతో ఉన్న సన్యాసి. ఇప్పుడు గృహస్థుడు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్. ప్రసిద్ధపత్రికా సంపాదకుడు. అతడు నాతో ఉజ్జయినికి వచ్చాడు. మంచి ధ్యానసాధకుడు కూడా కావడం వల్ల నేను చెప్పిన విషయాలను రూఢి చేసుకోవడం మాత్రమే కాక గత రెండు శతాబ్దాలలో ఆ ఆలయంలో జరిగిన మార్పులను అతడు గుర్తించగలిగాడు. కాళీదేవి గుంటూరులో అవతరించినపుడు వచ్చి చూచి ఇంత భయంకరమూర్తిని మీరు ఎట్లా భరిస్తున్నారు ? అన్నాడు. మళ్ళీ ఒక నెల తరువాత వచ్చినపుడు, ఉగ్రరూపిణి ఇంత శాంతరూపిణిగా ఎలా మార్చగలిగారు? అని ప్రశ్నించాడు. "బిడ్డల దగ్గరకు వచ్చినపుడు ఎంతటి భీషణమూర్తులయినా ప్రేమమూర్తులుగా మారటం సహజమే కదా!" అన్నాను నేను.

గుంటూరుజిల్లాలో పోలీసు సూపరింటెండెంట్‌గా చేసిన ఒక ఐ.పి.యస్. అధికారి పూర్వాశ్రమంలో నాకు ఆప్తుడు. అతడు పూర్వజన్మలో కళింగ రాష్ట్రంలో రాజవంశానికి చెందినవాడు. తీవ్రమైన అనారోగ్యంపాలై నూటయాభై సంవత్సరాల క్రింద భువనేశ్వర్ ప్రాంత అరణ్యంలోని నా ఆశ్రమానికి వచ్చి 40 రోజులు ఉండి కాళీపూజ చేసి ఆరోగ్యాన్ని పొంది వెళ్ళాడు. అప్పటి అనుబంధం ఇప్పుడూ వచ్చింది. అతడు శ్రీకాకుళం జిల్లాకు పోలీసు సూపరింటెండెంట్‌గా ఉన్నపుడు ఒరిస్సాలో వరదలు వస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇతని నేతృత్వంలో ఒక సహాయ బృందాన్ని పంపించింది. తెలియకుండానే తన పూర్వజన్మ ప్రాంతానికి అతడు సేవచేయకలిగాడు. జన్మాంతర బంధాలు మనుష్యులను అలా లాక్కువెడుతుంటాయి. 18వ శతాబ్దంలోని మరొక సంఘటన కూడా ఆ మధ్య కనిపించింది. నేనుకుటుంబంతో పరివారంతో శిష్యులతో కలసి తమిళనాడులో బయలుదేరి కళింగారణ్యాలలో ఉన్న కాళీదేవిని చూడటానికి వెళుతున్నాను. ఆంధ్రభూమిలో కొంతదూరం ప్రయాణం చేసి విశాఖపట్నం దాటి విజయనగరం చేరుకొని అక్కడి ఒక రెండంతస్థుల భవనంలో విడిది చేశాము. నేను మేడమీద ఉండగా అర్ధరాత్రి గందరగోళంగా కేకలు వినిపించినవి. లేచి చూస్తే దోచుకోటానికి దొంగలు సాయుధులై వచ్చారు. నా పరివారంలోని వారు వారిని తరిమి వేయటానికి పోరాడుతున్నారు. చివరికా దొంగలు పారిపోయినారు. ఆనాడు దొంగలతో పోరాడిన వారిలో ఒక వ్యక్తి ఇప్పుడు జన్మమారి నాకు ఎంతో సేవచేశాడు. నాషష్టిపూర్తి సమయంలో అభిమానుల సహకారాన్ని సంపాదించి నా గ్రంధాలన్నీ పునర్ముద్రణ చేయించటమే కాక ప్రత్యేకంగా ఒక విశిష్ట సంచికను వేయించాడు. ఇప్పటికీ ఎంతో భక్తితో అనేక విధాల సేవచేస్తున్నాడు.

అదేవిధంగా అప్పటిశిష్యులలో మరొక వ్యక్తి ఇప్పుడు పోలీసుశాఖలో అత్యున్నత పదవిలో ఉన్నాడు. సామాన్యంగా ఉన్నతోద్యోగాలలో ఉన్నవారు అధికార గర్వితులై ఉంటారు. దైవసాధన తీవ్రంగా చేసే లక్షణం అరుదుగా ఉంటుంది. ఆస్తికులుగా ఉండవచ్చు, దేవాలయాలకు వెళ్ళి అక్కడ ప్రత్యేకమర్యాదలు పొందవచ్చు. కాని కష్టపడి జపహోమాలు సాధనదృష్టితో చేయటం విశేషం. ఆ విశేషమే ఈ అధికారికి అబ్బింది. ఆనాడు నా ఆశ్రమంలో చేసిన సాధన, నా రక్షణకై చూపిన సాహసం. చేసిన పుణ్యకార్యములు ఉన్నతపదవినివ్వటమేకాక తీవ్రసాధక లక్షణాన్ని కూడా పెంపొందించినవి.

ఆనాటి నా ప్రయాణ సమయంలో తెలుగుదేశంలో ఒకచోట వరదలు వచ్చినవి. ఆ ప్రాంతానికి చెందిన ఒక జమీందారిణి ఆ కష్టంలో ప్రజలను ఎంతో ఆదుకొన్నది. తనపరివారంతో ఆహార ధనాది వస్తువులతో ఎంతో సేవ చేసింది. నాయందు భక్తి కలిగి మంత్రోపదేశం స్వీకరించింది. శ్రద్ధాభక్తులతో ఆ దేవతాసాధన చేసింది. ఈ రెండింటివల్ల లభించిన పుణ్యఫలితంగా ఈ జన్మలో చదువు సంస్కారము దేవాదాయ శాఖలో ఉన్నతోద్యోగము లభించినాయి. ఇప్పుడు కూడా మళ్ళీ నా దగ్గరకు వచ్చి ఉపదేశం పొంది శ్రద్ధగా మంత్రసాధన చేస్తున్నది.

కాళి యొక్క ఒక తీవ్రరూపం ప్రత్యంగిరా భద్రకాళి హైదరాబాదులో ఈ దేవతకు ఆలయం నిర్మించాము. అక్కడ ఉండగా ఒక రోజు ఆంధ్రప్రదేశ్ గవర్నరు నుండి ఆహ్వానం వచ్చింది. వారి అధికారులు దగ్గర ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు. గవర్నరు పాదపూజ చేసుకొన్నాడు. అప్పుడు నేను వారితో "ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత రాజభవన్‌లో ఇంతవరకు ఏ పీఠాధిపతికైనా పాదపూజ జరిగిందా" అన్నాను. 'లేదు' అన్నారు వారు. "మీరెవరికైనా పూర్వం చేశారా ?" అన్నాను. ఆయన "నేను మా రాష్ట్రంలో ఉండగా ద్వారకాపీఠాధిపతికి చేశాను. మీకు ఇప్పుడు చేశాను. నాకు రెండవ అవకాశం ఇది" అన్నారు. ఆయన వ్యక్తిగతమైన కోరిక ఒకటి కోరారు. ఆశీర్వదించాను. కొద్దిరోజుల్లో అది జరిగి ఇంకా ఉన్నతమైన ఆయన కోరిన పదవికి వెళ్ళిపోయినాడు. ఆయనకు ఒకటే సందేశమిచ్చాను "ఎక్కడ ఉన్నా మీ శక్తిని ధర్మ రక్షణకు వినియోగించండి" చేతనైనంత తప్పక చేస్తాను అన్నాడతడు. ఒక యతికి గౌరవాగౌరవాలతో పని లేదు కాని – కాళీదేవి ఈ సంప్రదాయ కీర్తికి చేసిన లీల ఇది. భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాదపూజ చేసుకొన్నప్పుడు కూడ కాళీదేవి ఇలానే ఆయన అభీష్టం తీర్చి తన దివ్యలీలను ప్రదర్శించింది.

యోగులు - సూక్ష్మ శరీరులు

ధ్యానసమయాలలో అప్పుడప్పుడు సూక్ష్మశరీరంతో వచ్చి కొందరు సందేశాలిచ్చే వారు. కొందరు మైత్రితో పలకరించి వెళ్ళిపోయేవారు. కొందరు మహనీయులు ఆశీర్వదించి,

కర్తవ్యోపదేశం చేసేవారు. మరి కొందరు తమ సాధనలో ముందుకు వెళ్ళటానికి మార్గం చెప్పమనేవారు. మరి కొందరు మంత్రోపదేశం కోరేవారు. ఈ విధంగా ఎందరితోనో ఆశరీరులతో సంభాషించవలసి వచ్చేది. ఈ అనుభవాలలో కొన్నింటిని ఈ విధంగా పలికాను.

సీ॥ అతడు శ్యామానందయతి సూక్ష్మదేహాన
నలువదేడుల క్రింద కలసినాడు
ఇతడు శ్రద్ధానందయతి ధ్యానమున నిల్చి
సన్యాసమునకు ప్రోత్సాహ మొసగె
అశరీరయోగీంద్రుడత డైన మరియింత
ఘనశక్తి కొరకు దీవెనలు కోరె
ఆ రామ -పూర్వదేహమ్మున భైరవి
చిరకాలగాథలు స్మృతికి దెచ్చె
గీ॥ ఎవ్వరెవ్వరొవచ్చెద రేవియేవొ
గుర్తు చేతురు వెనుకటి కూటములవి
కూడికలు తీసివేతలతోడ చరిత
పుటలలో క్రొత్త వ్రాతలు పుట్టు నేడు.

నలభై సంవత్సరాల క్రింద రాధాసాధన మొదలు పెట్టినప్పుడు శ్యామానంద అన్న అశరీర సన్యాసి నా దగ్గరకు వచ్చాడు. దానిని ఆనాడు శ్రీరాధికాప్రసాద్ మహారాజ్‌గారు కూడా గమనించారు. కాళీదేవి అవతరణ తర్వాత శ్రద్ధానందయోగి వచ్చి సన్యాసం తీసుకోవలసిన సమయం వచ్చిందని తెలియజేశాడు. పూర్వజన్మలో భైరవి యైన యోగిని ఒకరు సూక్ష్మదేహంతో కనిపించి ఆనాటి సంగతులు గుర్తుచేసింది. ఈ విధంగా మానవతీత ప్రపంచానికి మానవ ప్రపంచానికి ఉన్న చిత్రమైన సంబంధాలు – పరమేశ్వరి కరుణ వల్ల తెలుసుకొనే అవకాశం లభించింది.

ప్రకాశంజిల్లా అద్దంకిలో 'చెన్నూరు కృష్ణమూర్తి' అనే మంత్రసిద్ధుడు ఉండేవాడు. మహామంత్రవేత్త అయిన వారి తాతగారు, దగ్గర ఉండి 18 సంవత్సరములు సాధన చేయించి ఈయనను మంచి మాంత్రికునిగా తీర్చిదిద్దారు. మా ఇద్దరి మధ్య ఆత్మీయత పెరిగిన తరువాత కలిసి కొన్ని సాధనలు చేశాము. బృందావనంలో లీలానంద ఠాకూరు (పాగల్ బాబా) సమాధి దగ్గర ధ్యానం చేస్తుంటే దానిపైన స్థాపిత అయిన కాళీదేవి కొన్ని విశేషాలు తెలియచేసింది. నూట యాభై సంవత్సరముల క్రింద నేనూ, కృష్ణమూర్తి గారు కలిసి చేసిన సాధనలు కొన్నింటిని గుర్తు చేసింది. ఈ విషయం కృష్ణమూర్తి గారితో చెపితే ఆయన వచ్చి గుంటూరులో కాళీ విగ్రహం ముందు కూర్చుని ధ్యానం చేసి "మీరు చెప్పింది నిజమే. పూర్వజన్మలో నేను మీ సోదరుడను. భువనేశ్వర్ దగ్గర అడవిలో వందల కొద్ది ఉన్న సర్పాల మధ్య కాళీదేవిని గూర్చి పూజా జపహోమసాధనలు మీతో కలసి చేసినట్లు నాకు కన్పిస్తున్నది" అన్నాడు.

ప్రేమభక్తి నిలయమైన బృందావనంలో కూడా కాళీదేవికి ప్రత్యేకమైన స్థానమున్నది. సతీదేవి యొక్క శరీరభాగములు భూమిమీదపడి వివిధపీఠాలుగా వెలసినపుడు ఆమె కేశములు యమునా తీరంలో పడితే అక్కడ కేశకాళీ ఆలయాన్ని నిర్మించారు. ఇది కాక యమునా తీరంలో అక్కడక్కడ కాళీ ఆలయాలు నిర్మించబడి ఉన్నవి. గోపికలు కృష్ణుడు భర్త కావటం కోసం 'కాత్యాయనీ వ్రతం' చేసిన చోట నిర్మించబడిన ఆ దేవత ఆలయంలో ధ్యానంచేసినపుడల్లా కాళి కన్పించేది. కొన్నిసార్లు అక్కడకు వెడుతున్నపుడు, వస్తున్నపుడు, చీకటిలో కాళీదేవి పక్కనే నడుస్తుండేది. ఇటీవల అమెరికాలో సంచారం చేస్తున్నపుడు. ఆమె రక్షగా వచ్చిన సందర్భాలు ఉన్నవి. ఒక చోట, ఆకాశంలో, నెత్తురు బొట్లు రాలుతున్న ఆమె కత్తి నాముందు పోతూ చాలా సేపు కన్పించింది. రాబోయే ఒక ఆపదను తప్పించటానికి కాళీదేవి అలా చేసిందని తరువాత తెలియవచ్చింది. ఆ ప్రయాణనంతరము జరిగిన ఒక సమావేశంలో కలిసిన ఒక ధ్యానసాధకుడు. "ఖడ్గధారిణియైన కాళి మీలో కన్పిస్తున్నది" అని తన అనుభూతిని తెలియచేశాడు.

అప్పుడు చెప్పిన పద్యం –

అడ్గినవారికెల్లరకు అద్భుతరీతి ననుగ్రహించు మౌ
నీడ్గణసేవ్యమాన మహనీయమహోగ్రకరాళ కాళికా
ఖడ్గము రక్షగా అమెరికా గగనంబున నిల్వ – యోగి స
ద్రమా ద్గురుమౌళి నైతి అసమానవచోవిభవంబు వర్ధిలన్

రసయోగి శ్రీరాధికాప్రసాద్ మహారాజ్ (నాన్నగారు) రాధాదేవి యొక్క అనన్యభక్తుడు. ఏ ఇతర దేవతలనూ పూజించేవాడు కాదు. నా యందు ఎంతో అభిమానము ఉన్నా మా పీఠంలో అవతరించిన కాళీదేవిని చూడటానికి ఎప్పుడూ రాలేదు. ఒకరోజు ఆయన బృందావనం నుంచి వస్తూ ఉంటే కాళీదేవి కన్పించి, ఆయనతో "నాన్నా ! నేను రాధాసఖినే కదా! నన్ను చూడటానికి రావా ?" అని అడిగింది. ఆశ్చర్యపోయి గుంటూరురాగానే నేను కాళీదేవిని చూడటానికి వస్తాను" అని వార్త పంపారు. కాళీ మందిరానికి వచ్చి దర్శించిన తరువాత అక్కడ ఏర్పాటు చేసిన భక్తుల సమావేశంలో ప్రసంగిస్తూ "కాళీదేవతలో కూడ వివిధమైన ఆకృతులు ఉన్నవి. రాధాదేవి యొక్క సఖీ మండలంలో ఉన్న శ్యామకాళి, కోమలప్రేమస్వరూపిణి, నా కిక్కడ దర్శన మిస్తున్నది" అన్నారు. ఆయన చెప్పిన విధంగా శ్యామకాళి సుందరదేవత, ప్రసన్న స్వరూపిణి. కలకత్తా ప్రాంతంలో ఉన్న ఒక శ్యామకాళి దేవాలయంలో చాలాకాలం సేవచేసిన భక్తురాలు జన్మ మారి ప్రస్తుతం ఒక మిత్రుడి భార్యగా ఉన్న మహిళ ఆనాటి సమావేశంలో ఉండటం గమనించాను.

చాలా గ్రహణాలకు చీరాల దగ్గర ఉన్న 'వాడరేవు' కు వెళ్ళి అక్కడ సముద్రతీరం దగ్గర కూర్చుని ధ్యానం చేస్తూ ఉండేవాడిని. నాతో పాటు చాలా మంది రావటం గ్రహణ జపం తరువాత అక్కడే హోమములు చేయటం అలవాటైంది. ఒకసారి అక్కడ ధ్యానంలో

కాళీదేవి సాక్షాత్కరించి శ్రీశైలం రమ్మని ఆజ్ఞాపించింది. "అక్కడికి ఎందుకు? అని ప్రశ్నించాను" నేను. "అక్కడ ఉన్నది నేనే, వెంటనే రా" అన్నది. శ్రీశైలం వెళ్ళి దర్శనం చేసుకొని ఆ కొండమీద ఆమె ఇచ్చిన అనుభూతిని ఇలా వర్ణించాను.

చ॥ హరుడు స్వయమ్ముగా శిశువునట్టుల నన్గొని పోయి వత్సలాం
తరమున నప్పగింప నను నక్కున జేర్చి పరిస్ఫురత్పయో
ధరముల క్షీర ధారలను దన్పిన ప్రేమ సుధావలంబ - శ్రీ
గిరి భ్రమరాంబ పాదముల కేను సదా నతులాచరించెదన్.

మల్లికార్జునుడు నన్ను శిశువుగా మార్చి భ్రమరాంబ దగ్గరకు తీసుకు వెళ్ళి ఇడుగో! వీడు మనవాడు - అని అందించాడు. ఆమె వాత్సల్యంతో దగ్గరకు తీసుకొని స్తన్యపానం అనుగ్రహించింది. అంతటి దయచూసిన ఆ ప్రేమామృత నిలయమైన శ్రీశైల భ్రమరాంబ పాదములకు వినయపూర్వకంగా వినతులు చేస్తున్నాను.

శ్రీశైలం కారులో వెళ్తుండగా రోడ్డు మీద అడ్డంగా 8 అడుగులు పొడుగున్న పెద్ద నల్లత్రాచు వచ్చింది. కారు ఆపించాను. ఒకసారి తలయెత్తి అనుగ్రహ సూచకంగా చూచి నెమ్మదిగా కదలిపోయింది. అదే సమయంలో ఇదే అనుభూతి గుంటూరులో ఉన్న మా అమ్మాయి డా॥ జయంతికి కలగటం ఆశ్చర్యకరం !

కొద్ది నెలల క్రింద అయోధ్యలో సాధువుల సమ్మేళనం జరిగింది. దాదాపు వెయ్యిమంది సాధువులు, ఇరవై అయిదు వేల మంది ప్రజలు వచ్చారు. దక్షిణాపథం నుండి అక్కడు చేరినవాడను నే నొక్కడనే. 'విశ్వహిందూపరిషత్' ఏర్పాటు చేసిన సమావేశమది. సమ్మేళనానంతరం ప్రధాన కార్యకర్తలు ఆ రోజు రాత్రి ధర్మరక్షణకోసం యజ్ఞం చేయవలసిందిగా నన్ను అభ్యర్థించారు. "యాభై మంది పీఠాధిపతులు, వెయ్యి మంది సాధువులు ఇక్కడకు వచ్చారు. వా రెవ్వరినీ కోరక నన్నే ఎందుకు అడుగు తున్నారు ?" అన్నాను. "మీరు పిలిస్తే దేవతలు వస్తారని మా నమ్మకం" అన్నారు వారు. నేను చిరునవ్వుతో" వస్తారు. నిజమే ! కానీ ఆ సంగతి తెలుసుకోగల వాళ్ళెవరైనా ఉన్నారా ?" అన్నాను" ఉన్నారు. మధ్యప్రదేశ్ నుండి వచ్చిన కార్యకర్తలలో ధ్యానయోగి ఒకరున్నారు. అతడు దేవతల రాకను తెలుసుకోగలడు" అన్నారు. "సరే, సంతోషం అలానే చేద్దాము" అని ఆరోజు రాత్రి పన్నెండు గంటలకు సీతాదేవి పూజించినదని చెప్పబడే దేవకాళీ మందిరంలో అశ్వత్థ వృక్షం క్రింద నా అనుచరులతో కలసి హోమం చేయటం జరిగింది. కొంత సేపు ఆహుతులు వేసిన తరువాత ఆ ప్రదేశం అంతా సుగంధంతో నిండిపోయింది. దేవత హోమకుండంలో అవతరించడాన్ని ఆ ధ్యానయోగి గుర్తించి చెప్పాడు. అద్భుతకాంతిపుంజం మధ్య దేవత నిల్చున్నది అని అతడు చెప్పటం అక్కడి ప్రధాన వ్యక్తులకు సంతృప్తిని కలిగిగించింది. అప్పుడప్పుడు ఇటువంటి సన్నివేశాలు జరిగినవి. ఒకసారి కర్నూలులో మరొకసారి తెనాలిలో బౌద్ధ ధ్యానయోగ సంప్రదాయానికి చెందిన సాధకులు తమ ధ్యాన సమావేశానికి నన్ను

ఆహ్వానించి బుద్ధుని ఆవాహన చేయవలసినదిగా నన్నర్థించారు. "ఆప్తులారా ! నామీది గౌరవంతో ఈ సమావేశానికి నన్ను పిలిచారు. మీది నిర్గుణ ధ్యానయోగ పద్ధతి. మంత్ర మార్గం మీద మీకు నమ్మకం లేదు. నేను దేవతలను పిలవడానికి మంత్ర పద్ధతిని ఉపయోగిస్తాను. ఉన్న విషయం ఇది. మీ ఇష్టం" అన్నాను. "మీరు ఏమి చేసినాసరే, బుద్ధుని ఆవాహన చేయటం మాకు కావాలి" అన్నారు వారు. "బుద్ధుడు వచ్చినది, లేనిది తెలుసుకోగలవారు మీలో ఎవరైనా ఉన్నారా ?" అన్నాను. 'మేము గుర్తించగలము" అన్నారు. ఇద్దరు ధ్యానయోగులు. రెండు చోట్ల బుద్ధుడు అవతరించాడు. ఒక చోట ఎదురుగా వాయు మండలంలో నిల్చున్నాడు. మరొక చోట నా శరీరంలోకి ప్రవేశించాడు. అక్కడి సాధకులు ఈ విషయాన్ని గుర్తించటం జరిగింది. అయోధ్యలో కూడా అదే విధంగా భద్రకాళి దిగివచ్చి అనుగ్రహాన్ని చూపించింది.

కాశీ దగ్గర సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న చునార్ కొండలమీది కాళీ ఆలయానికి వెళ్ళాము. కాళీ దర్శనం చేసి, ఇవతల అందరమూ మాట్లాడుతూ ఉండగా వృద్ధుడైన ఒక యోగి అక్కడకు వచ్చిన నా వైపు చూచి ఇలా అన్నాడు. "నేను ఇక్కడకు కొద్ది మైళ్ళదూరంలో ఒక అడవిలో ఉంటూ ముప్పై ఏండ్ల నుంచి తపస్సు చేసుకొంటున్నాను. నిన్న రాత్రి కాళీదేవి నాకు ధ్యానంలో కనిపించి 'దక్షిణాపథం నుండి నా భక్తుడొకడు వస్తున్నాడు. ఆ సిద్ధేశ్వరుని దర్శనం చేసుకో' అని ఆదేశించింది, ఆమె అనుగ్రహం వల్ల మిమ్ము గుర్తుపట్టగలిగాను. అమ్మ దయకు పాత్రులైన మహాత్ములు మీరు" అని ప్రేమ గౌరవములతో తన సాధన గురించి చెప్పాడు. ఎక్కడి గుంటూరు ! ఎక్కడి చునార్ కొండలు ! ఎక్కడెక్కడి వ్యక్తులు వీరంతా ! ఆ కొండల దగ్గర క్రింద భాగంలో వల్లభాచార్యుడు స్థాపించిన రాధాకృష్ణ మందిరం ఉంది.ఆ మందిరం చూద్దామని నాతో వచ్చిన వారంతా అంటే సరే ! అని వెళ్ళాము. గర్భగుడి తలుపు పూజానంతరం తెరిచినపుడు సింహాసనం మీద అందమైన రాధాకృష్ణ విగ్రహాలను చూచి నమస్కరించి, " విగ్రహాలు చాలా అందంగా ఉన్నవి, శిల్ప నిర్మాణం అద్భుతమైనది" అన్నాను. అక్కడ వారు ఆశ్చర్యంతో "స్వామీజీ! ఇక్కడ విగ్రహాలు ఏమీ లేవు. ఆ సింహాసనమును 'రాధాకృష్ణుల గద్దె' అంటాము. ఇక్కడి సంప్రదాయంలో విగ్రహాలు పెట్టరు. రాధాకృష్ణులు అక్కడ ఉన్నారని భావించి పూజ చేస్తాము. మీకు విగ్రహాలు ఎలా కనిపించినవో మాకు అర్థం కావటం లేదు" అన్నారు. ఇవతలకు వచ్చిన వాణ్ణి మళ్ళీ వెళ్ళి చూశాను. నిజమే ! అక్కడ విగ్రహాలు ఏమీ లేవు. కానీ ఇంతకు ముందు నాకు కనిపించటం కూడా నిజమే. అది రాధాకృష్ణుల దయ.

కాశీలో కీనారామ్ అఘోరీ ఆశ్రమం ఉన్నది. షాజహాన్, ఔరంగజేబుల కాలంలో జీవించిన కాళీసిద్ధుడు అతడు. బెలూచిస్థాన్ లోని హింగుళాకాళీని శ్మశాన సాధనలతో ఆరాధించి సిద్ధుడై ఆమెను కాశీకి తీసుకు వచ్చాడు. పుర్రెల తోరణాల మాలతో ఉన్న ముఖద్వారం ఇప్పుడు కూడా అందరికి స్వాగతం చెపుతుంది. ఆనాడు అతడు 170

సంవత్సరాలు జీవించి సజీవసమాధిలోకి ప్రవేశించాడు. మణికర్ణికా ఘట్టం నుండి శ్మశాన అగ్నిని తెచ్చి అతడు వెలిగించిన హోమకుండం ఇప్పటికీ ఆరకుండా కొనసాగుతూనే ఉంది.ఆ ఆశ్రమంలో ప్రవేశించినపుడు పురా స్మృతులెన్నో మనసులో మెదిలినవి. అతని సంప్రదాయంలో సాధన చేసిన ఒక యోగి తన సాధన పరిపూర్ణత కోసం నూట యాభై సంవత్సరాల క్రింద కాశీలో నా దగ్గరకు వచ్చి నా శిష్యుడైనాడు. ఈనాడు అతడు జన్మమారి గుంటూరు హిందూకాలేజీలో లెక్చరర్‌గా ఉంటూ మళ్ళీ నా శిష్యుడై తీవ్రసాధన చేస్తున్నాడు.

ఢిల్లీలోని కల్కాజీ గుడి బహాయ్ మార్గీయుల లోటస్ టెంపులుకు దగ్గరగా ఉంది. ఆ కాళీ దేవి ఎంతో శక్తిగల దేవత. ఆమె తను అనుగ్రహాన్ని, దర్శనాన్ని ఎంతో వాత్సల్యంతో ప్రసాదించింది. కలకత్తాలోని ప్రాచీన కాళీదేవత నిత్యబలులతో రక్తపు మడుగుల మధ్య తీవ్రరూపిణిగా అలరారుతూ ఉంటే రామకృష్ణుడు పూజించిన దక్షిణేశ్వర కాళి ప్రసన్నశాంతరూపంగా భాసించింది. అర్చన పద్ధతులలో ఉండే తేడా అక్కడి చైతన్యమండలంలో స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. కాశీలో రామకృష్ణ పరమహంస సాధన చేసిన ఆశ్రమంలో కూడా కాళీదేవత ప్రసన్నమూర్తిగానే ఉన్నది. సిద్ధపురుషుడై మూడు వందల సంవత్సరాలు జీవించిన కాళీ భక్తుడు త్రైలింగస్వామి దర్శనం కోసం వచ్చినప్పుడు పరమహంస ఉన్న ఇల్లు అది. కాశీలోని త్రైలింగస్వామి ఆశ్రమంతోను ఆ మహనీయునితోను ఉన్న అనుబంధం ఇటీవల కొన్ని గుర్తుకు వచ్చినవి. రెండు వందల సంవత్సరాల క్రింద ఆయన శిష్యులుగా ఉన్న ఇద్దరు ఈనాడు నాకు శిష్యులు కావటమే కాక త్రైలింగ స్వామి కూడా నా కాళీ విగ్రహాన్ని పూజించిన వారిలో ఒకరు కావటం, అలానే రామకృష్ణ పరమహంస కూడా ఆ విగ్రహాన్ని పూజించిన వారిలో ఉండడం ఇటీవల స్మృతి పథంలోకి జగన్మాత తీసుకొని వచ్చింది.

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఒక తెలుగు దంపతుల కుమారుడు మంత్రసాధన యందు అభిరుచి కల్గి నా దగ్గరకు వచ్చాడు. కాళీసాధన చేయాలని తన ప్రబలమైన కాంక్షను వ్యక్తం చేయటంతో అతనికి మంత్రోపదేశం చేశాను. గుంటూరు లోను, కుర్తాళంలోను మా ఆశ్రమంలో తీవ్రంగా జపం చేశాడు. తనకు ధ్యానంలో కన్పించిన కాళీదేవి మూర్తులను అతడు చిత్రకారుడు కూడా కావడం వల్ల బొమ్మలు గీసి చూపించాడు. మంచి అనుభవాలు పొందుతున్నా డా యువకుడు. ఒక కార్తీకమాసంలో అండమాన్ దీవులలో దేవాలయ ప్రతిష్ఠల కోసం నేను వెళ్ళినపుడు స్వాతంత్ర్య సమరయోధుడు – 'సావర్కార్' ను ఉంచిన 'సెల్యులర్' జైలును చూచాను. దానిలో ఎందరో ఖైదీలను ఉంచిన గదులున్నాయి. ఒక గదిలో ఈ యువకుని పూర్వజన్మ స్వరూపం కన్పించింది. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని ద్వీపాంతర వాస శిక్ష విధించబడిన ఈ వ్యక్తి ఆనాడు ఔత్తరాహుడు. జైలులో ఉన్న రోజులలో కాళీ మంత్రసాధన చేసేవాడు. అది ఈనాడు మళ్ళీ అతడికి ప్రాప్తించింది.

కాశీలో శవశివకాళీ మందిరం ఒకటి విచిత్రమయినది. అక్కడ ప్రవేశించి దేవీ దర్శనం చేసుకోగానే నా కార్యదర్శి, భక్తుడు "స్వామీజీ ! నూట యాభై సంవత్సరాల క్రింద మనం ఇక్కడ ఉన్నట్లు ఈ మందిరంలో తపస్సు చేసినట్లు నాకు కన్పిస్తున్నది" అన్నాడు నిజమే, అతని అనుభూతి సత్యమైనదే. సిద్ధకవులు ఈ దేవత నిలా స్తుతించి భక్తిని చాటుకొన్నారు.

శ్లో॥ దిగంబరాం గతాసూనాం కరైర్గ్రథితమేఖలాం
శ్మశానస్థే చితాతల్పే శవస్యహృది సంస్థితాం
మహాకాళేన దేవేన మారయుద్ధం ప్రకుర్వతీం
మద్యమత్తాం మహాకాళీం భజేభీషణసుందరీం

శ్మశానంలో చితాశయ్య – దానిపై శవం – శవం మీద మహాకాలునితో పురుషాయిత క్రీడ చేస్తున్నది కాళి. ఆమె దిగంబర. నడుముచుట్టూ నరికిన చేతుల దండతో మూడు కన్నులతో మూడు లోకాలను శాసించే మహాశక్తి అటువంటి నిన్ను జపం చేస్తే ఓ మహాకాళీ ! జడుడు కూడా మహాకవి అవుతాడు.

కాళీదేవి కాళిదాసుకు కవిత్వము నిచ్చింది. తెనాలి రామకృష్ణునకు కూడ కవితాశక్తి నిచ్చింది. తెనాలి రామలింగేశ్వరాలయ ధ్వజ స్తంభం క్రింద దొరికిన కాళీ విగ్రహం దీనికి నిదర్శనంగా నిలిచి ఉంది. నేను కూడా రసగంగ అనే కావ్యంలో ఇలా పలికాను.

ఉ॥ కాళి కవిత్వమిచ్చునటె ! గంగనుభూమికి దెచ్చునట్టె ! లో
కాళి విచిత్రమన్ననుడి కల్పనకాదన – విగ్రహమ్ముగా
దేలుచ వచ్చి అద్భుతగతిన్ దిగినట్టి కరాళి – కాళి – కం
కాళి యొసంగ నేను రసగంగను జూపెద నాదు సృష్టిగా.

ఒకరోజు గుంటూరులోని కాళీపీఠంలో కూర్చుని ఉండగా ఒక మహిళ వచ్చింది. ఆమె రాష్ట్ర ప్రభుత్వంలో మైనారిటీ మతానికి చెందిన ఒక మంత్రి భార్య ఆమె వచ్చి నమస్కరించి "స్వామీజీ! నేను హిందువును కాదు, అయినా నాకు కొంత ధ్యానసాధన అలవాటు ఉంది. నేనీ కాళీదేవి ముందు కూర్చుని ధ్యానము చేయటానికి అనుమతిస్తారా!" అని అడిగింది.

నేను : అమ్మా ! మీకు ఈ సందేహముఎందుకు కలిగింది ? ఇక్కడ ఎవరయినా ధ్యానం చేయవచ్చు.

మహిళ : అయ్యా ! కొన్ని గుడులలోకి, పీఠములలోకి ఇతర మతస్థులను రానీయరు. అందుకని సందేహం తీర్చుకోవటానికి అడిగాను.

నేను : ఇక్కడ ధ్యానం చేయటానికి నియమం ఒక్కటే. ఈ కాళీ విగ్రహంలో దేవత ఉన్నది అని మీకు అంగీకారమయితే ఇక్కడ కూర్చుని ధ్యానం చేయటానికి అభ్యంతర ముండదు.

మహిళ : ఆ విశ్వాసముతోనే వచ్చాను.

నేను : అయితే నిరభ్యంతరముగా కూర్చొనవచ్చును. ఇంతకు ముందు తిరుపతిలో కూడా ఇటువంటి సంఘటన జరిగింది. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ గవర్నరు 'అబ్రహాం' అనే క్రైస్తవుడు శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమల వెళ్ళాడు. అక్కడ అధికారులు స్వాగతం చెప్పి తీసుకొని వెళ్ళారు. మహాద్వారం దగ్గర ప్రధాన పూజారి వారిని లోపలికి తీసుకు వెడుతూ ఇలా అన్నాడు" అయ్యా ! మీరు మహోన్నత అధికారులు. మిమ్ము ఆపగలశక్తి మాకు లేదు మీరు స్వామిని దర్శించటంలో ఆ విగ్రహాన్ని పురావస్తు శిల్పదృష్టితో చూడటానికి వచ్చారా ? లేక దేవుడని నమ్మి వచ్చారా? మీకు అభ్యంతరం లేకపోతే సమాధానం చెప్పండి" గవర్నరు 'దేవుడని నమ్మి వచ్చాను' అని జవాబు చెప్పాడు. "అలా అయితే మా 'దర్శకుల పుస్తకం' (Vistors Book) లో ఈ విషయం వ్రాయండి" అని అర్చకుడు కోరాడు. ఆయన వ్రాసి సంతకం పెట్టాడు. ఇప్పటికీ దేవస్థానం రికార్డులలో అది భద్రంగా ఉంది. అప్పుడప్పుడు ఇతర మతస్థులు ఇలా వచ్చి హిందూదేవాలయాలో ప్రవేశించి భక్తితో దర్శనం చేసుకోవటం ఉంది.

మహిళ : మన్నించండి. నేను అడగటానికి ఒక కారణం ఉంది. ఈ మధ్య పత్రికలలో ఒక వార్త వచ్చింది. ఉత్తర హిందూ స్థానంలోని ఒక శంకర పీఠాధిపతి ఇతర మతాలనుండి హిందూమతం స్వీకరించినవారు కాని, ఇతర మతస్థులు కాని హిందూ దేవాలయాలలో అడుగుపెట్టరాదు అని ప్రకటించారు. అందుకని మిమ్ము అడుగవలసి వచ్చింది.

నేను : ఆవార్తను నేను కూడా చూచాను. ఆచార సంబంధమైన విషయాలలో పీఠాధిపతుల అభిప్రాయాలు ఒకటిగా లేవు. వారి అభిప్రాయం వారు చెప్పారు. నా అభిప్రాయం ప్రకారం మతములు, మతమార్పిడులు జాతులు, దేశములు వీటితో సంబంధం లేకుండా దేవాలయంలోని విగ్రహాన్ని దేవునిగా అంగీకరించిన ఎవరయినా వచ్చి దర్శనం చేసుకోవచ్చు. కనుక నీవు హాయిగా ధ్యానం చేసుకోవచ్చు.

ఆమె ఒక గంట సేపు ధ్యానం చేసింది. అనంతరం మళ్ళీ వచ్చి "స్వామీ! ధ్యానంలో నాకు నా పూర్వజన్మ తెలిసింది. నేను అప్పుడు మగవాడినై ఎఱ్ఱని పంచ కట్టుకొని ఎర్రని బొట్టు పెట్టుకొని, మీ శిష్యుడనై ఈ కాళీదేవిని పూజిస్తున్నట్లు కన్పించింది. అన్నది. ఆమె చెప్పినది సత్యమే కనుక కాళీసాధన తీవ్రంగా చేయవలసినదని సూచించాను. ఆతరువాత కూడ ఆమె అప్పుడప్పుడు వచ్చి దర్శనం చేసుకొంటున్నది.

హైదరాబాదులో ఒకసారి భాగవతసప్తాహం చేస్తూ ఉండగా రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో ఉన్న ఒక భద్రమహిళ వచ్చి తన విషయాన్ని ఇలా విన్నవించుకొన్నది. "స్వామీ ! పదవి, ఐశ్వర్యం, సేవకులు, క్రింద ఉద్యోగులు – అన్నీ ఉన్న జీవితం నాది. ఎందరో అసూయపడుతున్న వైభవం నాది. ఇతరులకు తెలియని చెప్పలేని కష్టం నన్ను

పీడిస్తున్నది. సాంసారిక బంధం విచ్ఛిన్న మయింది. నేను మానసికంగా ఏకాకిని. నిరాశా నిస్పృహలతో బాధపడుతున్నాను. దీనికి పరిష్కారం ఏదయినా అనుగ్రహించండి". ధ్యానంలో ఆమె సంగతి చూచి ఈ విధంగా చెప్పాను. "అమ్మా ! నిన్ను ఇంతకుముందు 300 సంవత్సరాల నుండి ఎరుగుదును. ఒకప్పుడు నీవు కాళీ భక్తురాలివి, నా శిష్యురాలివి. ఆనాడు తెలిసో తెలియకో ఒక తప్పు చేశావు. దాని ఫలితంగా సర్ప జన్మ వచ్చింది. అయితే పూర్వస్మృతి ఉండడం వల్ల ఆ శరీరంలో ఉండలేక బాధపడుతూ ఒకరోజు మా కాళీ ఆశ్రమానికి వచ్చి పడగ ఎత్తి నిల్చొని దీనంగా నీ బాధను తెలియచేశావు. మనుష్యజన్మ వచ్చేటట్లు చేయమని ప్రార్థించావు. "అమ్మా! ఈ శరీరంలో మరికొంతకాలం, ఉంటే కర్మానుభవం పూర్తవుతుంది. అప్పుడు మనిషి జన్మ వస్తుంది" అన్నాను. "స్వామీ! ఈ శరీరం భరించలేకుండా ఉన్నాను. మానవశరీరం కావాలి. ఎంతటి కష్టాన్నయినా ఆ దేహంతో అనుభవిస్తాను" అని మరీ మరీ ప్రార్థించావు. ఆనాడు నాకు ఉన్న సిద్ధశక్తుల వల్ల నీకు మనుష్య జన్మ వచ్చేలా చేశాను. అదే నీ విప్పుడు ఉన్న జన్మ. అనుభవించవలసినఉన్న పాపం ఇంకా కొంత మిగిలి ఉంది. దానివలన ఈ జన్మలో ఇక సుఖములు పొందలేవు. వచ్చే జన్మలో పురుష శరీరం వస్తుంది. మంచిసాధన చేసి యోగివవుతావు. ఇక ఈ జన్మలో సుఖము లేకపోయినా మానసికంగా శాంతిని పొందే పద్ధతులు చెపుతాను. నేనుపదేశించిన మార్గంలో కాళీదేవి యొక్క ధ్యాన సాధన చేయవలసింది, అన్నాను. ఇప్పుడు ఆమె ఆ సాధనలో ఉంది.

మంత్రశాస్త్రంలో సంతానకాళి మంత్రం ఒకటి అద్భుతంగా ఉపయోగిస్తున్నది. సంతానం లేని వ్యక్తులు ఎందరో ఈ మంత్రోపదేశం పొంది, సాధన చేసి సంతానవంతులు అయినారు. భూతప్రేత బాధా నివారణలో కాళీదేవి అసామాన్యమైన అనుగ్రహాన్ని చూపిస్తున్నది. గుంటూరు కాళీపీఠంలో కాళీమంత్రసాధన చేసినవారిలో దాదాపు పదిమంది కాళీదేవి యొక్క దర్శనాన్ని పొందారు. అందులో ఒక సాధకురాలు పూర్వజన్మలో ఈ సిద్ధకాళికి అర్చకురాలుగా ఉండేది.

ఇలా కాళీదేవి ఎన్నో అద్భుత లీలలను చూపిస్తున్నది. ఆమె భీషణ సౌందర్యం నన్ను క్షణక్షణమూ ఆకర్షిస్తుంటే ఇలా స్తుతించాను.

శ్లో॥ ఆరక్తజిహ్వాం వికటోగ్ర దంష్ట్రాం
శూన్యాంబరాం సుందరభీషణాంగీం
కరత్రిశూలాం గళముండమాలాం
కాళీం కరాళీం సతతం భజామి.

ఎర్రని నాలుకతో వికటమైన దంష్ట్రలతో, చేతిలో శూలము, మెడలో పుర్రెల మాల అలరుతూ ఉండగా దిగంబరయై భయంకరంగా ప్రకాశించే భీషణ సౌందర్యమూర్తియైన కాళీదేవిని భజిస్తున్నాను.

ఉ॥ కంటకులైన శాత్రవుల గర్వము ఖర్వము సేయ అల్ల ము
క్కంటి గృహంబు నుండి అజకల్పిత లోకము లెన్నొ దాటి నా
యింటికి వచ్చి హోమగృహ మెఱ్ఱని నవ్వుల నింపి కుండపున్
మంటల మధ్య నిల్చు అతిమానుష కేళిని కాళినెంచెదన్.

నా శత్రువుల గర్వాన్ని అణచి వేయటానికి, నన్ను రక్షించటానికి కైలాసం నుండి బయలుదేరి ఎన్నో లోకాలు దాటి నా యింటిలోని హోమగృహంలో ఎఱ్రగా నవ్వుతూ కుండంలోని అగ్నిజ్వాలల మధ్య నిల్చున్న మానవాతీత క్రీడా స్వరూపిణియైన కాళీదేవిని స్మరిస్తున్నాను.

ఉ॥ అంటిన ప్రేమ వచ్చెను స్వయంభువుగా హిమశైలమందు, నే
డుంట కళింగ భూముల నహో ! శతపంచకవర్షమూర్తియై
గుంటురిలోని నన్ మరల గోరి వియత్తలి నుండి దేవతల్
ఘంటలు మ్రోయ విగ్రహముగా దిగివచ్చిన కాళి గొల్చెదన్.

ఆరువందల యేండ్ల క్రింద హిమాలయాలలో చేసిన నా తపస్సుకు సంతోషించి అవతరించి చిన్న విగ్రహంగా రూపుదాల్చింది. అది వయస్సును బట్టి పెరుగుతున్నది. పెద్ద విగ్రహమయ్యే సరికి నేను ఒరిస్సాలోని అడవిలో ఆశ్రమాన్ని నిర్మించుకొన్నాను. నే నిప్పుడు జన్మమారినా నా మీద దయవల్ల గుంటూరు లోని మా పీఠంలో దిగి వచ్చిన ఆ కాళిని భజిస్తున్నాను.

31. రత్నప్రభ

ఏ దేవి తురుముపై ఏడుకాలముదాక
కసుగందకుండు చెంగలువ దండ
ఏ దేవి సేవింతు రేకామ్రనాథుండు
కరిగిరీశ్వరుడు కింకరులవోలె
ఏ దేవిగొల్చి మత్స్యేంద్ర నాథాదులు
యోగసంసిద్ధికి నొడయలైరి
ఏ దేవి మణిదివ్య పాదుకాయుగళంబు
పాతాళపతిమోచు పడగలందు
అమ్మహాదేవి కామాక్షి అఖిలవంద్య
దేవతాదిమశక్తి సందీప్తమూర్తి **(శ్రీనాథుడు)**

అటువంటి కాంచీపుర కామాక్షీదేవి ఆలయంలో క్రీ.శ.1892 శరదృతువులో దేవీనవరాత్రోత్సవాలు ప్రారంభమైనవి. వైభవోపేతంగా శాస్త్రోక్త విధానంలో పూజలు,

హోమాలు మొదలైనవన్నీ జరుగుతున్నవి. కార్యక్రమాలలో భాగంగా సాయంకాలంపూట పండితుల ప్రవచనాలు ఏర్పాటు చేయబడినవి. ఒకరోజు భీషణ సుందరంగా అలంకరించిన కాళీ విగ్రహం సమావేశం జరిగేచోట ఎత్తుగా ఉంచి పూజిస్తున్నారు. రోజుకొక దేవీమూర్తి. ఆరోజు అర్చించబడుతున్న కాళీదేవి దగ్గర ఒకయోగి కూర్చుండి కాళీతత్త్వాన్ని గూర్చి అద్భుతంగా ఉపన్యాసం చెపుతున్నాడు. సదస్యులంతా పరవశించి పోతున్నారు. వారిలో రత్నప్రభ అనే అమ్మాయి ఉంది. కార్యక్రమం అయిన తర్వాత తెలిసిన పెద్దవారిని ఆ యోగిని గూర్చి అడిగింది.

ఆయన ఆంధ్రదేశంలో విజయనగరం నుండి వచ్చాడట. శ్రీపాదవారి వంశంలో ప్రభవించాడు. తల్లిదండ్రులు తీర్థయాత్రలకు వచ్చినప్పుడు కంచిలోనే పుట్టాడని కొందరు చెపుతున్నారు. ఏదైనా కంచితో వారికి బాగా అనుబంధం ఉంది. తరచుగా అక్కడికి వస్తుంటారు. కాళీమంత్రసిద్ధుడని దివ్యశక్తులు సాధించినవాడని ప్రఖ్యాతి పొందాడు. ఆయన పేరు అక్కడ ఎవరికీ తెలియదు. పరమాత్మస్వామి అని అందరూ పిలుస్తారు.

రత్నప్రభ ఇంటికి వెళ్ళి తల్లికి ఈ విషయాలను చెప్పింది. మర్నాడు ఆమెకూడా వచ్చి వారి ప్రవచనం విన్నది. ఆయన మహానుభావుడనే విశ్వాసం కలిగింది. ఇంట్లో పని వెసులుబాటు కలిగినరోజు వస్తున్నది. కూతురు మాత్రం రోజూవచ్చి ఆ మహాత్ముని వాక్కులవల్ల ఎంతో ప్రభావితురాలైంది. నవరాత్రులలో ఆయన ఎన్నో విషయాలు చెప్పాడు. అన్నింటిలో కాళీదేవిని గూర్చి ఆయన చెప్పినవి ఆ బాలిక నెంతో ఆకర్షించినవి. ఆలయం దగ్గరగా ఉన్న ఒకతోటలోని గృహంలో ఆ మహనీయుని వసతి అని, అక్కడికివెళ్ళి ప్రార్థించిన వారికి ఆయన మంత్రోపదేశం చేస్తున్నాడని విని తానుకూడా కాళీమంత్రోపదేశం పొందాలని భావించి తల్లితో చెప్పింది. తల్లి కాళీదేవి భయంకరదేవత అంటారు. ఏదైనా శాంత సుందరదేవత యొక్క మంత్రం ఉపదేశం తీసుకోరాదా అని అన్నదిగాని కూతురు పట్టుపట్టటంవల్ల కాదనలేక సరే అంది.

మరునాడు ఉదయం వారి నివాసానికి వెళ్ళి సందర్శకులంతా వెళ్ళిపోయిన తర్వాత చివరగావెళ్లి పాదనమస్కారం చేసింది.

రత్నప్రభ : స్వామీ! నాపేరు రత్నప్రభ. ఇక్కడికి దగ్గరలో మా అమ్మ నేను ఉంటాము. మీ ప్రవచనాలు విన్న తర్వాత కాళీమంత్రసాధన చేయాలని అనిపించింది. నన్ను అనుగ్రహించి నాకు మంత్రం ఉపదేశించండి.

స్వామి : మంత్రం చెపుతాను. నీవు చేతనైనంత జపం చేస్తావు. మంచిదే. అయితే ఏం కోరి ఈ సాధనలోకి ప్రవేశిస్తున్నావు? నీ ధ్యేయ మేమిటి?

రత్న : అయ్యా! మీ మాటలలోని ఆకర్షణవల్ల కాళీదేవి అంటే ఇష్టం కలిగింది. నేను రోజూ కామాక్షీదేవి దగ్గరకు వచ్చి నమస్కారం చేసి వెళుతుంటాను. ఇప్పుడెందుకో కాళీదేవి అంటే ఇష్టం ఏర్పడింది. ఆమెను చూడాలని, ఆమె ఒడిలో బిడ్డగా ఉండాలని అనిపిస్తున్నది.

స్వామీ : ప్రభా! ఆహారము, నిద్ర వదలి ఎన్నో యేండ్లు అడవులలో లేక మహాక్షేత్రాలలో కోటానుకోట్లు జపం చేస్తేగాని కాళీదర్శనం కాదు. మరి నీవలా చేయగలవా?

రత్న : ఏది చేసైనా అమ్మను చూడాలి. నా కెంతవరకు సాధ్యమో అర్థం కావటం లేదు. మీరు సిద్ధ పురుషులని కాళీదేవి మీతో మాట్లాడుతుందని విన్నాను. మీరు దయదలిస్తే ఈ తపస్సులు, ఈ కఠోర దీక్షలు లేకుండా దర్శనం ఇవ్వగలరు గదా!

స్వామి : ఇవ్వగలగవచ్చు. కానీ ఎందుకు ఇవ్వాలి? నా దగ్గరకు వందలమంది వస్తారు. రకరకాల కోరికలతో వారికి తగిన మంత్రమిచ్చి జపహోమాలు చేయిస్తాను. వారికి కష్టనివారణ అభీష్టసిద్ధి కలుగుతుంది. నీవూ వారివలెనే సాధనచెయ్యి. తీవ్రసాధన చేస్తే కొంత అనుగ్రహం కలగవచ్చు. కొన్ని అనుభూతులు రావచ్చు.

రత్న : మహాత్మా! నేను మీతో మాట్లాడలేను. మొదటిసారి మిమ్ము కామాక్షీదేవి దగ్గర చూచినప్పుడే ఏదో చెప్పలేని భక్తి పారవశ్యం కలిగింది. ఇది వర కెప్పుడో మిమ్మల్ని చూచానని అనిపించింది. ఎందుకో ఏమో తెలియదు. నా అనుభూతికి ఏ ఆధారము లేదు. కానీ అంతరాంతరాలలో మీరు తప్పక నన్ను కరుణిస్తారని అనిపిస్తున్నది. మీతో మాట్లాడాలని మీతో ఎక్కువసేపు గడపాలని, మీ సన్నిధిలో ఉండాలని తీవ్రమైన ఆకాంక్ష. నేను కొంచెం సంస్కృతం చదువుకొన్నాను. కాళిదాస మహాకవి రచించిన ఒక శ్లోకం గుర్తుకు వస్తున్నది.

శ్లో॥ రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకోభవతి యత్సుఖితో ఉపిజంతుః
తచ్చేతసా స్మరతి నూన మబోధ పూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని

ఎప్పటివో ఏవో పూర్వజన్మ అనుబంధాలు నన్ను కలచి వేస్తున్నవా? కానీ మీముందు అంత సాహస వచనాలు పలుకలేను.

స్వామీ : ఓ! మంచి పండితురాలివి. పంచకావ్యాల వరకు చదువుకొన్నావు గదా! ఇంకా చదివేదానివే. నీ తండ్రి – నిన్ను మీ అమ్మను విడిచిపెట్టి వేరెవరితోనో ఉండటంవల్ల మీ యింటి పరిస్థితి కల్లోలితమైంది. ఏదో మీ అమ్మ పుట్టింటి వారిచ్చిన ఆస్తితో నిన్నుపెంచి పెద్ద చేస్తున్నది. ఇంకా పెద్ద చదువులు చదవవలసిన దానివే. సరిలే! దానికేమి? ఈ మంత్రోపదేశం సంగతి అటుంచు. పెళ్ళెప్పుడు చేసుకొంటావు?

రత్న : స్వామీ! స్వామీ! నేనెంత అదృష్టవంతురాలిని. నా కుటుంబ విషయాలు నేను మీకు చెప్పలేదు. మీకెవరూ చెప్పే అవకాశం లేదు. ఇవి మీకెలా తెలిసినవని నేనడగను. మీరు సర్వజ్ఞులని సిద్ధపురుషులని లోకమంతా చెపుతున్నది. నన్ను గురించి తెలుసుకోవాలన్న ఆలోచన మీకు రావటమే నా అదృష్టం. పేదదానిని. నాకు పెళ్ళేమిటి? మీ సేవ చేసుకొనే అవకాశమిస్తే చాలు. జీవితమంతా మీ పాద సన్నిధిలో గడుపుతాను.

స్వామి : చాలు! చాలు! – చాలా ఉద్వేగంలో ఉన్నావు. నా సేవలోకి వస్తానంటున్నావు. మరి మీ అమ్మను ఏం చేస్తావు?

రత్న : గురుదేవా! నేనేమి చేస్తాను. మీరే నిర్ణయించాలి.

స్వామి : నన్ను గురుదేవా అంటున్నావు. నేనింకా మంత్రోపదేశం చేయలేదుగా!

రత్న : మహాప్రభూ! మంత్రోపదేశాన్ని మించిన జీవితోపదేశం మొదలైందని అనుకొంటున్నాను. మీరు ఆజ్ఞాపించండి! ఏం చేయమంటారు?

స్వామి : ఏమి చేయగలవు? ఏదైనా చేయగలరోజు భవిష్యత్తులో వస్తుంది. దానికోసం సాధన చేయాలి. నీవు మంత్రోపదేశం కోసం వచ్చావు. కానీ నేను నీకు ఉపదేశం చేయాలని అనుకోటంలేదు.

రత్న : పూజ్యగురుదేవా! అంత అయోగ్యురాలినా? మీ దగ్గర మంత్రం తీసుకొనే అర్హతలేదా? అయితే నేనింక బ్రతికి ప్రయోజనమేమున్నది?

స్వామి : ఉన్నది. నీకు మంత్రాన్ని కృష్ణ భైరవుడిచ్చేట్లు చేస్తాను.

రత్న : గురుదేవా! నాకు మీరే ఇవ్వాలని నా ప్రార్థన.

స్వామి : నీకోరిక కాదనను. అలానే!

రత్న : అయితే అనుగ్రహించండి!

స్వామి : ఇప్పుడు కాదు, ఇక్కడ కాదు.

రత్న : మరి యెప్పుడు? ఎక్కడ? నాకు చాలా ఆదుర్దాగా ఉంది.

స్వామి : ఆతురత అవసరంలేదు. సమయం వచ్చినప్పుడు అన్నీ జరగవలసిన పద్ధతిలో జరుగుతవి. నీ ఉపదేశాన్ని గురించి నేను చెప్పింది, నీవు కోరింది – రెండూ జరుగగలవు. అయితే భౌతిక భూమికలో కాదు. దివ్యభూమికలో నాలో కృష్ణభైరవుడుండి నీకు ఉపదేశిస్తాడు.

రత్న : సిద్ధేశ్వరా! కృష్ణభైరవు డుండుట యేమిటి! మీరే కృష్ణభైరవులు.

స్వామి : తథాస్తు! సిద్ధేశ్వరా! అన్నావు. భక్తితో నిఘంటువు యొక్క అర్థంలో అన్నా భవిష్యత్తులో నా పేరదే అవుతుంది. ఇప్పటివలెనే అప్పుడూ నా దగ్గరకు వస్తావు. అవన్నీ తరువాత తెలియజేయబడతవి.

రత్న : నేను రావటమేమిటి? మీరు రప్పించుకొంటారన్నమాట. ఇప్పుదర్థమవుతున్నది. నేను మంత్రం కోసం మీదగ్గరకు వచ్చానని అనుకొన్నాను. మీ సంకల్పంవల్ల నేను వచ్చానని ఇప్పుడు తెలుసుకొంటున్నాను.

స్వామి : (చిరునవ్వుతో) తెలివిగల దానివి. ఈ తెలివి నిజమైన అసలు తెలివిగా మారాలి. ఆరోజు త్వరలో వస్తుంది.

రత్న : మంత్రేశ్వరా! యోగీశ్వరులు మీరు. మీ మాటలు వింటుంటే నా తల తిరిగి పోతున్నది. నేనేమై పోతున్నానో అర్థం కావటంలేదు. మిమ్ము శరణు వేడుకొంటున్నాను. మీ పాదపద్మాలను ఆశ్రయిస్తున్నాను.

త్వమేవ మాతాచ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ నాధశ్చ గురు స్త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ!

అంటూ ఆనందాశ్రువులు జాలువారుతుండగా స్వామి వారి పాదములపై తల ఉంచి రెండు చేతులతో నాగిని వలె చుట్టి నమస్కరించింది.

స్వామి : రత్నా! లే! ఇప్పటికీ అనుభవం చాలు! జాగ్రత్తగా విను. ఈ నవరాత్రుల తర్వాత నేను తీర్థయాత్రలకు బయలుదేరుతున్నాను. శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ, ఉజ్జయిని, కామాఖ్య క్షేత్రాలకు ప్రయాణం. నాతో చాలామంది పరివారం భక్తయాత్రికులు ఉంటారు. మీ అమ్మతో చెప్పు. ఆమె నా ఇచ్ఛాశక్తివల్ల అంగీకరిస్తుంది. మీ యింటిని బంధువులకు అప్పగించండి. ఈ క్షేత్ర దేవతల అనుగ్రహంతో పునీతురాలివైన నీకు కామాఖ్యలో మంత్రోపదేశం జరుగుతుంది. ఇక యింటికి వెళ్ళు.

రత్న : మీ ఆజ్ఞ. మీ పాదపద్మస్థలమే నా యిల్లు. రేపు మళ్ళీ వస్తాను.

స్వామి : శుభమస్తు, వెళ్ళిరా.

ఆ విధంగా రత్నప్రభ వాళ్ళమ్మతో కలిసి స్వామి వారివెంట తీర్థయాత్రలకు వెళ్ళింది. ఆయా క్షేత్రాలలో తాము ఎన్నివందల సంవత్సరాల క్రింద ఉన్నది – పూర్వజన్మ విశేషాలు ఆ దేవతా మహిమవల్ల జరిగిన అద్భుతాలు స్వామివారు తెలియజేసేవారు. వారు మాటాడుతున్నప్పుడల్లా ఆ సమయాలలో తానుకూడా వారితో ఉన్నట్లు అనిపించేది. ఈ విధంగా దీర్ఘప్రయాణాలు చేసి చివరకు కామాఖ్య చేరుకొన్నారు. కామాఖ్య కాళి గురించి కాళీపురాణంలోని విశేషాలు స్వామివారు చెపుతుంటే దిగ్భ్రాంతి కలిగింది. ఆ ఊరిలో ఉండగా సంవత్సరాని కొకసారి జరిగే మహోత్సవములు వచ్చినవి. నాగ భూమి నుండి దిగంబర సాధువులెందరో ఆ కార్యక్రమాలలో పాల్గొనటానికి వచ్చారు. ఒకపూట అద్భుతమైన ఖడ్గ చాలన ప్రదర్శన జరిగింది. నిప్పులలో దూకేవారు, నారసాలు గుచ్చుకొనేవారు, కొరడాలతో కొట్టుకొనేవారు చిత్ర విచిత్ర తీవ్ర సాధకులక్కడ కనిపించారు. దీర్ఘకాలం ఉపవాసాలుండి, ఎండలో పంచాగ్ని మధ్యంలో నిల్చుని, శీతకాలంలో గొంతు లోతు

చన్నీళ్ళలో నిల్చొని కఠోర నియమాలతో ప్రాచీనులు తపస్సుచేస్తే – ఈ మార్గంలో శరీరాన్ని హింసిస్తూ సూదులతో పొడుచుకొంటూ కత్తులతో గుచ్చుకొంటూ, కర్రతో, కొరడాతో బాదుకొంటూ తామస మంత్రాలు చేస్తుంటే ఆ మంత్ర దేవతలు తొందరగా అనుగ్రహిస్తారని స్వామివారు తమ ప్రసంగాలలో తెలియజేశారు. అక్కడి ఉత్సవాలలో ప్రధానమైనరోజు స్వామివారు ఒక ఎర్రని గుడ్డలో చిన్న యంత్రం పెట్టియిచ్చి – దానిని రాత్రి తలక్రింద పెట్టుకొని నిద్రించమని చెప్పారు.

కామాఖ్యలో పరమేశ్వరి యోనిపూజించబడుతుంది. ఆ శిలాఖండం నుండి – ఆ దేవి రజస్వలయైన దానికి గుర్తుగా రక్తం స్రవిస్తూ ఉంటుంది. ఆ వస్త్ర ఖండాలను మహాప్రసాదంగా తీసుకొని పూజలో పెట్టుకొంటారు. ఆ వస్త్ర ఖండంలో కాళీయంత్రం ఉంచి యిచ్చారు స్వామివారు.

రాత్రి ఉపవాసం ఉండి భూశయనం చేసి కాళీదేవిని స్మరిస్తూ కండ్లు మూసుకొని పడుకొన్నది రత్నప్రభ. అప్పటికి మొదటిజాముదాటి రెండవజాము ప్రవేశించింది. నిద్రలో ఉన్నదో లేక మెలకువగా ఉన్నదో తెలియని స్థితిలో ఉన్నట్లుండి శరీరంలో నుండి బయటకు వచ్చినట్లు అనిపించింది. చూస్తే తాను ఆకాశంలో ఉంది. శరీరం క్రింద కనిపిస్తున్నది. గగనయానం చేస్తూ నీలిమబ్బుల మధ్య ఒక గుహలో ప్రవేశించింది. సుదీర్ఘమైన ఆ అంధకార కందరంలో వెళ్ళి వెళ్ళి చివరకు బయటకు వస్తే ఒక కాంతి పుంజం. ఆ తేజోమధ్యంలో కాళి – కాలభైరవుడు కనిపిస్తున్నారు. చిత్రం! ఇద్దరూ చాలా సుందరంగా ప్రేమమూర్తులుగా భాసిస్తున్నారు. కాళీదేవి భైరవునితో ఇలా అంది "భైరవస్వామీ! ఈ బాలిక బృందావనంలో రాధాదేవి చెలికత్తెయైన ఇందులేఖ యొక్క అంశ. మనోరమ అనే పేరుతో ఉండి నా భక్తుడైన ఒక సిద్ధునితో అనుబంధం కలిగి భువనేశ్వరారణ్యంలోని నామందిరంలో కొంతకాలం మంత్రసాధన చేసింది. ఆ మంత్రమునే మళ్ళీ మీరిప్పుడు నా భక్తురాలికి ప్రసాదించండి. నాలో రాధాదేవి అంశయైన శ్యామకాళి మీలో కృష్ణుని అంశయైన కృష్ణభైరవుడు పూర్ణత్వ ప్రాభవం పొందటం జరిగింది. కనుక రాధాకృష్ణ భక్తురాలైన ఈ జీవి మీ అనుగ్రహానికి అర్హురాలు." కాళీ ప్రియుడైన కృష్ణ భైరవుడు రత్నప్రభకు కాళీమంత్రాన్ని ఉపదేశించాడు.

రత్నప్రభ అత్యంత వినమ్రమూర్తియై ఇద్దరికి పాదనమస్కారం చేసి ఆ మంత్రాన్ని జపించటం మొదలుపెట్టింది. ప్రారంభించిన కాసేపటికి ఆజ్ఞాచక్రంలో కదలిక వచ్చింది. మూసిన తలుపులు తెరుచుకొన్నట్లు అక్కడ సంచలనం కలిగి దివ్యదృష్టి లభించింది. వరుసగా తన జన్మపరంపర గోచరిస్తున్నది. బృందావనంలో రాధాదేవి పరివారంలో శ్యామ అనేపేరుతో ఉండి – జనమేజయుని సర్పయాగంలో హోమకుండంలో పడి దహనం కాకుండా రాధాదేవి కరుణవల్ల రక్షించబడిన సిద్ధనాగుడనే నాగజాతి తపస్వికి ఆ ధామంలో సేవచేసింది. రాధా శరీరంలోని రాసేశ్వరి బయటకువెళ్ళి కృష్ణునితో కలిసి దివ్యభూమికలోకి ప్రవేశించిన తర్వాత మిగిలిన ఉశీనర రాజకుమారి రాధ – సిద్ధాశ్రమానికి తపస్సు చేసుకోటానికి వెళ్ళిపోయింది.

అనంతరం శ్యామసిద్ధ నాగునితో ఉంది. రాధాదేవి సంకల్పంవల్ల ప్రపంచంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ప్రణాళికలో భాగంగా తాను ఎన్నో జన్మలు తీసుకోవలసి వచ్చింది. సిద్ధనాగుడు కూడా పరమేశ్వరి ఇచ్ఛవల్ల జన్మపరంపర పొందటం జరిగింది. అతడు భైరవనాథుడనే సిద్ధునిగా, భానుదేవుడనే రాజయోగిగా ఉన్నప్పుడు ఆయనకు సేవచేసింది. ప్రవరసేనుడనే మహారాజుగా బృందావన ప్రాంతాన్ని పరిపాలించినపుడు ఆ నరపాలుని భార్య నాగావళిగా రాధాదేవిని కొలిచింది. ఆ సిద్ధేశ్వరుడు డెహ్రాడూన్ ప్రాంతంలో జన్మించినపుడు అనూరాధా అనే కాళీసఖిగా ఉండి భౌతికరూపం తీసుకొని ఆయనతో కాపురంచేసి సంతానంకని మళ్ళీ అమ్మ పరివారంలోకి వెళ్ళింది. తరువాత కొంతకాలం హిమాలయాలలో సిద్ధాశ్రమంలో లలితాదేవి ఆలయంలో కింకరిగా హిరణ్య అనేపేరుతో ఉంది. అక్కడ తాంత్రిక సాధనలుచేసి డాకినీ సిద్ధిని పొందింది. హిమాలయాలలో డాకిని అంటే దేవయోని జాతికి చెందిన దివ్యశక్తులు గల అప్సరస వంటిది. ఉత్తరభారతంలో డాకినీదేవి ఆలయాలు కూడా ఉన్నవి. దక్షిణ భారతంలో డాకిని అంటే పిశాచం. లలితాదేవి పరివారంలో డాకినీగణం ఉంది. ఆ గణంలో ఉంటూ ఒకరోజు త్రివిష్టప (టిబెట్) సమీప ప్రదేశంలోని ఒక గుహలో తపస్సు చేస్తున్న ఒక ఋషిదగ్గర ఆడిపాడి కుతూహలం కొద్దీ ఆతనిని కదిలించింది. ధ్యానభంగమై అతడు కోపం తెచ్చుకొని కోతివలె ప్రవర్తించి నాకు ఇబ్బంది కలిగించావు కనుక కోతి వగుదువుగాక! అని శపించాడు. ఆ శాపాన్ని అనుభవిస్తూ ఉండగా సిద్ధేశ్వరయోగి ఎవరి శరీరంలో ప్రవేశించి యున్నాడో ఆ పద్మ సంభవుడనే భైరవయోగి వజ్ర వైరోచనీమంత్ర సిద్ధుడక్కడికి వచ్చాడు. ఆ గుహలో ఉన్న వజ్రేశ్వరీ, భైరవులను సేవించి ప్రక్కన ఉన్న జలపాతం దగ్గర నిలుచున్నాడు. తానుశాపగ్రస్త బాలికగా అక్కడ తిరుగుతూ అతనిని చూచింది. తనవలె ఉన్న ఒక జీవిని చూడటం అదే మొదటిసారి. ఆ తరువాత అద్భుతమైన సన్నివేశాలు తన జీవితంలో వచ్చిన అనూహ్యమైన మార్పులు కనిపిస్తున్నవి. ఒక సాక్షివలె రత్నప్రభ ఆ దృశ్యాలను చూస్తున్నది.

ఇంతలో పన్నెండేళ్ళ అమ్మాయిగా తాను వచ్చింది. దిగంబర. చెట్ల ఆకులు కొన్ని నడుముకు చుట్టుకొన్నది. బలిష్ఠమైన పరిపుష్టమైన శరీరం. ఉన్నతమైన వక్షోజములు. విరబోసిన కేశపాశము, పద్మసంభవుని దగ్గరకు వచ్చింది. వింతగా చూస్తున్నది. కోతివలె కిచకిచమని ధ్వని చేసింది. చుట్టూ తిరిగింది. వస్త్రాలు పీకింది. మళ్ళీ నిల్చుని అదేపనిగా వీక్షిస్తున్నది. అతడామెను నిశితంగా పరిశీలించాడు. కోతి లక్షణాలు తప్ప మనిషి లక్షణాలు కనపడటం లేదు. మనుష్య భాష వచ్చినట్లు లేదు. ఈమె వివరాలు తెలుసుకోవాలి. తానీమె కోసం వచ్చినట్లుంది. ఈ మనిషికి భాష ఎందుకు రాలేదు ? ఒక్కసారి సమ్మోహినీ దేవతను స్మరించాడు. ఆ అమ్మాయి చెయ్యి పట్టుకొని ఒక పెద్ద రాతి బండ మీద కూర్చోబెట్టాడు. ఆ బాలిక కాదనలేదు. ఆ కన్య నొసలు బొటనవేలితో తాకి సమ్మోహన నిద్రలోకి పంపాడు. ఆరాతి మీద ఆమె వెల్లికల పడుకొన్నది. కన్నులు మూతలు పడినవి. ఆ స్థితిలో అతడామెను ప్రశ్నిస్తున్నాడు.

పద్మ : బాలికా ! ఎవరువు నీవు ?

కన్య : సమాధానం లేదు – ఏదో మాట్లాడాలని ప్రయత్నం. కాని మాటలు రావటం లేదు.

పద్మ : నిద్రలోనికి వెళ్తున్నావు. గాఢనిద్రలో ప్రవేశించావు. నీకు మాట్లాడే శక్తినిస్తున్నాను. పలుకు ! నీవు పలుకగలవు.

నానావిధ పరిమళపుష్పాణి సమర్పయామి. అనుచు వివిధ పుష్పములతో పూజించవలెను.

ధూపము :

శ్లో॥ వనస్పతి భవైర్దివ్యైః నానాగంధైః సుసంయుతం
ఆఘ్రేయః సర్వదేవానాం ధూపోయం ప్రతిగృహ్యతామ్

ధూపమాఘ్రాపయామి అనుచు అగరువత్తులతో లేక సాంబ్రాణితో ధూపము వేయవలెను.

దీపం :

శ్లో॥ ఘృతవర్తిసమాయుక్తం అంధకారవినాశకం
దీపందాస్యామి హే కాళి గృహాణ ముదితాభవ.

దీపం దర్శయామి అనుచు వెలిగించిన దీపమును అమ్మవారి చుట్టూ 3 సార్లు త్రిప్పవలెను. ఆకుతో లేక ఉద్ధరిణితో ఒక చుక్క నీరు దీపము చుట్టూ త్రిప్పి క్రింద వేయవలెను. లేదా పూలు దీపముచుట్టూ త్రిప్పి అమ్మవారి పాదమైలపై వేయవలెను. నీరు త్రిప్పినచో ధూప దీపానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి అనవలెను.

నైవేద్యం :

పండ్లు, పాలు, మధుర పదార్ధములు, మహానైవేద్యము సిద్ధమైనచో అన్నము, కూరలు. పిండివంటలు మొదలగు పదార్ధములు పళ్ళెములలో పెట్టి అమ్మవారి ఎదురుగా ఉంచవలెను. కొబ్బరి కాయలు కొట్టదలుచుకొన్నచో అమ్మవారి మంత్రమునుగాని, నామమునుకాని చెప్పి దేవత ఎదురుగా కొట్టవలెను. అవతలకొట్టితెచ్చినచో ఫలితముండదు. నైవేద్యము ఎంత ఎక్కువ వీలైన అంతఎక్కువ పెట్టుటమంచిది. కనీసం ఒకమనిషి తినగలిగినంత అయినను పెట్టవలెను. అవకాశము లేనిచో యాధాశక్తి సమర్పించవలెను. చేతిలో నీరు తీసుకొని

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి, ధియోయోనః ప్రచోదాయాత్.

అని చెప్పి పగలు అయినచో "సత్యంత్వర్తేన పరిషించామి, అని, రాత్రి అయినచో ఋతంత్వాసత్యేన పరిషించామి. అని పదార్ధముల చుట్టూ నీరు ప్రోక్షణ చేయ వలెను. అమృతమస్తు, అమృతో పస్తరణమసి అని నీరు పదార్ధములపై కొద్దిగా చల్లవలెను. అప్పుడు ఓం ప్రాణాయస్వాహా ఓం అపానాయస్వాహా, ఓం వ్యానాయస్వాహా, ఓం ఉదానాయస్వాహా, ఓ సమానాయస్వాహా, అనుచు చేతిలో తమలపాకు పట్టుకొని దేవతకు పదార్ధములు సమర్పించవలెను.

దేవత ఆయాపదార్ధములను భుజిస్తున్నట్లు భావిస్తూ ఆహారము తీసుకొనేటప్పుడు మధ్యలో మంచినీరు త్రాగవలసిన అవసరముంటుంది కనుక "మధ్యేమధ్యే పానీయం సమర్పయామి" అని ఆకుతో లాంఛనముగా నీరు చల్లవలెను. ఆహారము తీసుకొన్న తరువాత చేతులు కడుగు కొనవలెను కనుక "హాస్తౌ ప్రక్షాళయామి" అని ఆకుతో మరలనీరు వేయవలెను. పిదప కాళ్ళు కడుగు కొనుట ఆచారముగావున "పాదౌ ప్రక్షాళయామి" అని ఆకుతో మళ్ళీ నీరు వేయవలెను అలాగే కొద్దిగా నీరు త్రాగుటకు ఈయవలెను. కనుక "శుద్ధ ఆచమనీయం సమర్పయామి" అని ఇంకొకసారి ఆకుతో నీరు వేయవలెను. చివర తాంబూలము ఇచ్చుట భోగలక్షణము, ఆచారము గనుక తాంబూలము సమర్పించుచు,

శ్లో॥ పూగీ ఫలైశ్చ కర్పూరైః నాగవల్లీ దళైర్యుతం
ముక్తా చూర్ణ సమాయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్. అనవలెను.

నీరాజనము: దీప పాత్రలో కర్పూరము వేసి వెలిగించి,

శ్లో॥ దీపం జ్యోతి రహం జ్యోతిః జ్యోతిః కాళీ కళామయిూ
నీరాజనం మయాదత్తం గృహాణత్వం సురేశ్వరి.

'కర్పూర ఆనంద మంగళ నీరాజనం దర్శయామి' అనుచూ అమ్మవారి చుట్టూ 3 సార్లు గంట మోగిస్తూ త్రిప్పవలెను. తరువాత హారతి చుట్టూ త్రిప్పి కొంచెము నీరు క్రిందవేయ వలెను. (నీరాజనానంతరం ఆచమనీయం సమర్పయామి అనవలెను). తరువాత మంత్రపుష్పము పూర్తిగా గాని లేక

రాజాధి రాజాయ ప్రహస్యసాహినే నమోవయం వైశ్రవణాయ కుర్మహే
సమేకామాన్ కామకామాయ మహ్యం కామేశ్వరో వైశ్రవణోదదాతు
కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయ నమః.

అనుచు పూలను అమ్మవారి పాదములవద్ద సమర్పించవలెను. అనంతరము

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనావా ప్రకృతే స్వభావాత్
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి

అనుచూ అక్షతలు నీరు పళ్ళేములో వదలవలెను.

ఈ పూజాసందర్భమున స్తోత్రములు అష్టోత్తర సహస్రనామము పూజలు జపములు చేయదలచు కొన్నవారు పుష్పపూజ అనంతరము, ధూప దీప నైవేద్యములకు ముందు చేయవలెను. ఈ పూజా సందర్భమున ప్రత్యేకముగా ఆపదలు ఉపద్రవములు తొలగించుకొనుటకు అభీష్ట సిద్ధికి నీరాజనమునకు ముందు బలిని సమర్పంచవచ్చును.

1. పాయస బలి: సర్వోపద్రవ నివారణార్థం అభీష్ట సిద్ధ్యర్థం కాళీదేవతా యై పాయస బలిం సమర్మయామి అని క్షీరాన్నమును సమర్పించవలెను.

2. నారికేళ బలి: కొబ్బరికాయ పీచు పూర్తిగా తీసివేసి నీళ్ళుకలపిన కుంకుమ కాయకు పూర్తిగా రాసి పై సంకల్పము చెప్పుచూ నారికేళ బలిం సమర్పయామి అని ఎర్రని ఆ కొబ్బరికాయను అమ్మవారి ఎదురుగా పగుల కొట్టవలెను.

3. రక్తాన్న బలి: విస్తరినిండా అన్నము పెట్టి దానిలో కుంకుమ కలిపి ముద్దచేసి పై సంకల్పము చేప్పుచూ రక్తాన్నబలిం సమర్పయామి అని బలిని సమర్పించవలెను.

4. మినుములు పెరుగు కలిపి చిన్నకుప్పగా పెట్టి దధిమాష బలిం సమర్పయామి అని బలిని సమర్పించవలెను.

5. నిమ్మకాయ బలి: కాళీమంత్రము చెప్పుచూ నిమ్మకాయ కోసి కుంకుమ అద్ది జంబీరబలిం సమర్పయామి అనుచు నిమ్మకాయ బలిని సమర్పించవలెను. మరియొక నిమ్మకాయను తీసుకొని మంత్రము చెప్పుచూ కోసి కుంకుమ అద్ది కుడిచేతితో ఎడమవైపు ఎడమచేతితో కుడివైపు డిప్పలను పిండి ఎర్రని నిమ్మరసము క్రింద పడుచుండగా కాళీదేవికి రక్తతర్పణము చేస్తున్నట్లు భావించవలెను.

6. కూష్మాండ బలి: దక్షిణ దేశములో బూడిద గుమ్మడికాయ బలి ఇచ్చుట ఆచారము. ఆంధ్రదేశములో మంచి గుమ్మడికాయ ఇవ్వటము ఆచారము. ఎదైనా, కూష్మాండబలి జంతుబలితో సమానము. దీని విధానము మమ సర్వోపద్రవ నివారణార్థం అభీష్ట సిద్ధ్యర్థం 'కాళీ దేవతాయై కూష్మాండ బలిదానం కరిష్యే' 'తందగత్వేన బలి పూజనంచ కరిష్యే' అని పీటపై ఒక గుమ్మడి కాయను పెట్టి దానికి కుంకుమ పూయవలెను. ఆ కాయలోనికి బలిపశువును ఆవాహనం చేయవలెను. ఇక్కడ ఆవాహన మంత్రములు పఠించవచ్చును. కుంకుమతో పాటు గంధము కూడా అలంకరించ వచ్చును. ఆ కూష్మాండ బలిపశువుకు నమస్కరించుచు 'ఓత కూష్మాండ బలయే నమః'

శ్లో॥ పశుస్త్వం బలిరూపేణ మమభాగ్యాదవస్థితః
ప్రణమామి తతస్సర్వ రూపిణం బలిరూపిణం
కాళికా ప్రీతిదానేన దాతు రాపద్వినాశనం
కాళికా బలిరూపాయ బలేతుభ్యం నమోస్తుతే
యజ్ఞార్థం పశవస్సృష్టాః స్వయమేవ స్వయంభువా
అతస్త్వాం ఘాతయామ్యద్య తస్మాత్ యజ్ఞేవధోఽవధః

ఓ పశువా! నా అదృష్టము వలన నువ్వునాకు లభించావు. బలిరూపము అయిన నీకు నమస్కరిస్తున్నాను. కాళీదేవికి నిన్ను బలిఇచ్చినచో ఇచ్చినవాని ఆపదలన్నీ తొలగును. కనుక ఓ కాళి యొక్క బలి పశువా! నీకు నమస్కరిస్తున్నాను. బ్రహ్మచేత పశువులు యజ్ఞము కొరకై సృష్టించ బడినవి. యజ్ఞములో మంత్ర పూర్వకముగా పశువును వధించినచో అది వధకాదు హింసకాదు, కనుక నిన్ను వధిస్తున్నాను.

తరువాత కత్తికి గంధము కుంకుమ రాసి ఈ క్రింది మంత్రముతో అభి మంత్రించవలెను.

"ఐంహ్రీంశ్రీం రసనాత్వం కాళికాయాః సురలోక ప్రసాధకః", హ్రాం హ్రీం ఖడ్గ ఆం హుం ఫట్ అనుచు కత్తిని చేతితో పట్టుకొని, "ఓం కాళికాళివజ్రేశ్వరి లోహదండాయై నమః " అని చదువుతూ కత్తిఎత్తి కండ్లు మూసుకొని గుమ్మడి కాయను ఛేదించవలెను. రెండు భాగములుగా అయిన ఆ గుమ్మడి పండులో సగభాగముపై కుంకుమ, నీరు చల్లి నెత్తురు వలె కన్పించు నట్లు చేసి "కాళీకే రుధిరేణ ఆప్యాయతాం" అని కాళీమంత్రము స్మరించుచు కాళీదేవికి బలిని సమర్పించవలెను. మిగిలిన సగభాగమును 5 ముక్కలు చేసి ఒక్కొక్క ముక్కను ఒక్కొక్కదేవతకు ఈ విధముగా సమర్పించవలెను.

1. పూతనాయైనమః బలి భాగం నివేదయామి
2. చరక్యైనమః బలి భాగం నివేదయామి
3. విదార్యైనమః బలి భాగం నివేదయామి
4. పాపరాక్షస్యైనమః బలి భాగం నివేదయామి
5. రక్ష్యోభ్యోనమః ఓం హ్రీం స్ఫుర స్ఫుర ఓంహ్రీం ఓంహుం ఫట్

మర్దమర్దహుం రక్షోభ్యోనమః ఈ అయిదవ ముక్కను పూజామందిరమునకు బయట దూరముగా వేయవలెను. (కొందరు గుమ్మడికాయకు కత్తితో గాటు పెట్టి చిన్న ముక్కతీసి ఎర్రని వసంతమును లోపల పోసి మరల ముక్కను జాగ్రత్తగా కాయలో పోసి తర్వాత బలియిస్తారు. నరకగానే ఎర్రగా రక్తం చిమ్మినట్లు కనపడుతుంది. ఇది ప్రదర్శనకు మాత్రమే. గాయపడిన జంతువు బలికి పనికి రాదు. అలానే ముక్కజేసిన తర్వాత గుమ్మడికాయ నరకుట వలన ఉపయోగము లేదు. బలి ఫలితమురాదు).

పిష్ట బలి:

మనిషి ఆకారములో మినపపిండితో బొమ్మన తయారుచేసి దాని యందు సాధకుడు తన శత్రవును ఆవాహన చేసి, శత్రువులెవరూ లేని వారు అరిషడ్వర్గము అనగా కామ,క్రోధ, లోభ, మద, మాత్సర్య రూపముగా ఆ బొమ్మ ను భావించి కత్తితో రెండు ముక్కలుగా నరికి ఈ క్రింది మంత్రములు చెప్పుచూ దేవతకు సమర్పించవలెను.

1. స్కందాయ పశ్వర్థం సమర్పయామి.
2. విశిఖాయ పశ్వర్థం సమర్పయామి.

ఇక్కడ కాళికా మంత్రము చెప్పుచూ నైనను దేవతకు సమర్పించవచ్చును. ఆ తరువాత కత్తిని చేతిలో పట్టుకొని "ఖడ్గిని , శూలిని రక్షరక్ష పాహి పాహి" అనుచు కాళీదేవి చుట్టూ ప్రదక్షిణ చేయవలెను. ప్రదక్షిణకు ఆవకాశము లేనప్పుడు కత్తిని త్రిప్పుచూ నాలుగు సార్లు ఆత్మ ప్రదక్షిణము చేయవలెను.

క్షమాపణ:

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం సురేశ్వరి
యత్పూజితం మయాదేవి, పరిపూర్ణం తదస్తుతే
ఆవాహనం నజానామి, నజనామి విసర్జనం
పూజావిధిం నజానామి క్షమస్వ పరమేశ్వరి
యదక్షర పదభ్రష్టం మంత్రహీనంచ యద్భవేత్.
తత్సర్వం క్షమ్యతాం దేవి, ప్రసీద పరమేశ్వరి.
కామేశ్వరి మహాకాళి సచ్చిదానంద విగ్రహే
గృహాణార్చా మిమం సర్వం ప్రసీద పరమేశ్వరి.

ఓ కాళీదేవీ! నేను చేసిన పూజలో మంత్రోచ్చారణలో కానీ, అర్చనలో కానీ, ఏవైనా దోషములుండవచ్చు. నేను అజ్ఞానిని. ఆవాహనము ఎట్లా చేయవలెనో నిన్నెలా పూజించవలెనో తెలియని వాడను. నా దోషములను క్షమించి నన్ను గ్రహించవలసినది.

పూజానంతరము తీర్థ ప్రసాదములు స్వీకరించి పూజ అక్షతలు శిరస్సున ధరించ వలెను.

మానవీపూజ :

దేవతలను మానవులందు ఆవాహనచేసి పూజించటం ఆనే ఆచారము చిరకాలమునుండి ఉన్నది. మాతృదేవోభవ, పితృదేవోభవ , ఆచార్యదేవోభవ, అతిధిదేవోభవ అని వేదము చేప్పినది. తల్లిని, తండ్రిని, గురువును, అతిధిని దేవతలుగా భావించి పూజించటం ప్రాచీన కాలము నుండి ఉన్నది. మంత్రసాధకులు వేద విప్రులను ఇష్టదేవతా మూర్తులుగా భావించి పూజించట మనేది కూడా ఆచారముగా వస్తున్నది.

ఆశ్వీజ మాసంలోని దేవీనవరాత్రులలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క వయస్సుగల బాలికను పూజించవలెనని చెప్పబడినది. మొదటి రోజు రెండు సంవత్సరముల బాలికను కుమారిగా ఈ క్రింది మంత్రముతో పూజించవలెను.

మంత్రం: సర్వస్వరూపే సర్వేశి సర్వశక్తి స్వరూపిణి
పూజాం గృహాణ కౌమారి జగన్మాతః నమోస్తుతే.

రెండవరోజు 3సం॥ బాలికను త్రిమూర్తిని ఈ క్రింది మంత్రముతో పూజించ వలెను.

మంత్రం: త్రిపురాం త్రిపురాధారాం త్రివర్గాం జ్ఞానరూపిణీమ్,
త్రైలోక్యవందితాం దేవీం త్రిమూర్తిం పూజయామ్యహమ్

మూడవరోజు 4సం॥వయస్సు గల బాలికను కల్యాణిగా క్రింది మంత్రముతో పూజించవలెను.

మంత్రం: కళాత్మికాం కళాతీతాం కారుణ్యహృదయాం శివాం,
కళ్యాణ జననీం దేవీం కల్యాణీం పూజయామ్యహమ్.

నాల్గవ రోజు 5 ఏండ్ల బాలికను రోహిణిగా పూజించవలెను.

మంత్రం: అణిమాదిగుణాధారాం అకారాద్యక్షరాత్మికాం
అనంతశక్తిదాం లక్ష్మీం రోహిణీం పూజయామ్యహమ్.

అయిదవ రోజు 6సం॥ బాలికను కాళికగా పూజించవలెను.

మంత్రం: కామచారాం శుభాం కాంతాం కాలచక్రస్వరూపిణీం
కామదాం కరుణోదారాం కాళికాం పూజయామ్యహమ్.

ఆరవరోజు 7సం॥ వయసుగల బాలికను చండికగా పూజించవలెను.

మంత్రం : చండవీరాం చండమాయాం చండముండప్రభంజనీమ్
పూజయామి సదాదేవీం చండికాం చండవిక్రమాం.

ఏడవరోజు 8 ఏండ్ల బాలికను శాంభవిగా పూజించవలెను.

మంత్రం : సదానంద కరీం శాంతాం సర్వదేవ నమస్కృతాం
సర్వభూతాత్మికాం లక్ష్మీం శాంభవీం పూజయామ్యహమ్.

ఎనిమిదవరోజు 9 ఏండ్ల బాలకను దుర్గగా పూజించవలెను.

మంత్రం : దుర్గమే దుస్తరే కార్యే భవదుఃఖ వినాశినీం
పూజయామి సదా భక్త్యా దుర్గాం దుర్గార్తి నాశనీమ్.

తొమ్మిదవరోజు 10 ఏండ్ల బాలికను సుభద్రగా పూజించవలెను.

మంత్రం : సుందరీం స్వర్ణవర్ణాభాం సుఖసౌభాగ్య దాయినీమ్
సుభద్రజననీమ్ దేవీం సుభద్రాం పూజయామ్యహమ్.

ఈ విధంగా బాలికలను దేవతాభావముతో ధూపదీప నైవేద్యములతో పూజించవలెను. దీనివలన దేవతకు సంతృప్తికలుగును. మామూలుగా గృహములలో కూడా వ్రతములు పూజలు చేసినపుడు వృద్ధదంపతులను వాణీ హిరణ్య గర్భులుగా, లక్ష్మీ నారాయణులుగా, శివపార్వతులుగా పూజించే ఆచారమున్నది. మంత్రసాధనలో ఈ పూజలకు ప్రత్యేక ప్రాధాన్యము కలదు. లలితాదేవికి సంబంధించిన శ్రీచక్రార్చన చేసినప్పుడు సువాసినీపూజ చేసినచో త్రిపురసుందరికి ఎంతో ఇష్టమని లలితాసహస్ర నామములలోని 'సువాసిన్యర్చన ప్రీత' అను నామము చెప్పుచున్నది. ఇదే విధముగా కాళీసాధనలో కూడా యౌవనవతి యైన స్త్రీని ధూపదీప నైవేద్యములతో పూజించి ఎరుపు, లేక నలుపు నూతన వస్త్రములు సమర్పించి మధుర పదార్థములతో సంతృప్తిగా భోజనము పెట్టవలెను. కాళీ పూజవిధానములో వామాచార పద్ధతిలో కూడా స్త్రీలను పూజించుట ఉన్నది. పంచ

మకారములతో చేసే ఆ ప్రక్రియ కామాఖ్య కాళిని గూర్చి చెప్పిన విభాగములో అభివర్ణించ బడినది. మహనీయుడైన రామకృష్ణ పరమహంస, తనభార్య అయిన శారదా దేవిని త్రిపురసుందరిగా భావించి పూజించిన విధానము వారి జీవితచరిత్రలో వర్ణించబడినది.

సుప్రసిద్ధుడైన యోగి 'విశుద్ధానంద' 'కుమారీపూజ' కు ఎంతో ప్రాధాన్య మిచ్చేవాడు. ఎటువంటి కష్టములయినా ఆపదలైనా వానివలన తొలగిపోగలవని తాను స్వయముగా చేసి తన భక్తులచేత చేయించి నిరూపించాడు. చాలా చిక్కులలో ఉన్న ఒక భక్తుడు స్వామివారి సూచన ప్రకారం కుమారీపూజకు సంకల్పించి నచ్చిన బాలిక దొరికాక అవసరార్థం దొరికిన ఒక బాలికను ఇష్టపడకుండా పూజించాడు. ఆ అమ్మాయికి ఒంటి నిండా గజ్జి ఉన్నది. పూజించి విందుచేసి పంపిన తరువాత ఉన్నట్లుండి అతనికి ఒంటి నిండా గజ్జి వచ్చినది. ఉన్న కష్టాలకు తోడు క్రొత్త కష్టమొచ్చిందే! అన్నభయంతో గురువుగారి దగ్గరకు వెళ్ళి మొర పెట్టు కున్నాడు, జరిగిందంతా విని స్వామి విశుద్ధానంద పూజకు ముందు నీ ఇష్టమైన బాలికను ఎంపిక చేయవచ్చు. కానీ పూజ మొదలు పెట్టిన తరువాత దేవత ఆ బాలికలోకి వస్తుంది. అప్పు డసహ్యించుకోవటం పాపము ఆ దోషము నీశరీరము మీద వెంటనే విక్రియ చూపించింది. రేపు మళ్ళీ ఆ అమ్మాయినే తీసుకువచ్చి భక్తితో పూజించి ఆ అమ్మాయికి ఇష్టమైన వస్తువులతో కడుపునిండా అన్నం పెట్టి నమస్కరించి పంపించు అన్నాడు. భక్తుడా విధంగానే మరునాడు చేసి తీటను వదిలించుకొన్నాడు. దేవతా పూజల విషయంలో ఆ విషయంలో అశ్రద్ధ, అజాగ్రత్త పనికి రావని ఈ సంఘటనను బట్టి గ్రహించవచ్చు. పూజల విషయంలో కూడా ఇటువంటి జాగ్రత్తనే తీసుకోవాలి. సాధకుడు వట్టి జపమే చేస్తే చేయవచ్చు. "జపైస్తుష్యంతి దేవాశ్చ" అన్న ప్రకారం జపములచేత దేవతలు సంతుష్టి పొందుతారు. అయితే పూజలవల్ల అనుగ్రహం మరింత వేగంగా కలుగుతుంది. రోజూ పూజా నైవేద్యం అలవాటు చేస్తే మాత్రం మానుకోకూడదు. ఎందుకంటే నైవేద్యసమయామికి రోజూ దేవత రావటం అలవాటవుతుంది. సమయానికి నైవేద్యం పెట్టకపోతే దేవతలు అసంతృప్తి చెందే అవకాశం ఉన్నది. తెలుగులో ఒక సామెత ఉన్నది. "రోజూ బిచ్చం వేసే గృహిణి ఒక రోజు పెట్టకపోతే బిచ్చగాడు ఇలా అన్నాడట– పెట్టనమ్మ ఎలాగూ పెట్టదు, పెట్టేఅమ్మ కేమొచ్చిందిరా పెద్దరోగము" అని. దేవతలు కూడా అంతే. తామసదేవతలు, భూత, పిశాచాదులు, మొదలయిన వాటికి బలులు ఇవ్వటం అలవాటు చేసి మానుకుంటే వాటికి కోపం వస్తుందని తంత్రగ్రంథాలు చెపుతున్నాయి. "సంపత్తిం సంతతిం హన్యాత్ దేవీ క్రోధ బుభుక్షితా" ఆకలితో కోపించిన దేవత సాధకుని సంపదను సంతానాన్ని నాశనం చేస్తుందట. ఈ శ్లోకం చదివిన ఒకవ్యక్తి అయ్యా ! ఇదేమి న్యాయమండి? శిక్షిస్తే సాధకుని శిక్షించాలి కాని వాని పిల్లను నాశనం చేయటం ఏమి న్యాయం? అన్నాడు. మన న్యాయాలు మన చట్టాలు వేరు, దేవతల న్యాయ నిర్ణయ విధానం వేరు. తప్పు చేసినవానిని శిక్షించటానికి బాధించటానికి రకరకాల పద్ధతులుంటాయి.కర్మ సంబంధమైన విషయాలేవో సాధకునకు తెలియనివి ఎన్నోఉండవచ్చు.

ఏదైనప్పటికీ దేవతావాహన చేసి మానవీ మానవులను పూజించటం దేవాను గ్రహము శీఘ్రంగా పొందటానికి సహాయపడుతుందనటంలో ఎటువంటి సందేహమూ లేదు. అలానే పూజా సమయంలో దేవతగా పూజించిన స్త్రీకి ప్రధాన పాత్రలో, పాలు లేక పండ్లరసము నైవేద్యముగా సమర్పించి ఆమె సగముత్రాగి ఇచ్చిన తరువాత ఎంగిలిగా భావించక ప్రసాదముగా స్వీకరించి తీరవలెను. లేకున్నచో దేవతాపచారము మామూలుగా ప్రతి పూజలోను దేవతకు సమర్పించినది ప్రసాదముగా తీసుకొనటం అంటే అదే. అయితే లోక సామాన్యముగా కంటికి కనపడదు కనుక ఎంగిలి గురించి ఆలోచించరు. దేవాలయములో కాని, ఇంటిలో కాని దేవతకు పూజ చేసిన తరువాత నైవేద్యము కిర్లియన్ కెమెరాతో ఫోటో తీసినపుడు ప్రసాదము చుట్టూ కాంతి వలయ ముండటము చాలా మంది పరిశోధకులు గమనించారు. అదే విదముగా స్ఫటికమాలతో స్పటిక దండములతో పరిశీలించి సులభముగా నిరూపించ వచ్చును.

ఈ విధముగా పూజలవలన, దేవతానుగ్రహమును వేగముగా పొందవచ్చును.

45. గంధర్వగీతి

చాలా సంవత్సరాల క్రింద ఆంధ్ర ప్రభవారపత్రికలో ఈ గ్రంథం ప్రకటితమైంది. తరువాత పుస్తకంగా కూడా వచ్చింది. పర్షియన్‌కవి ఉమర్ ఖయ్యాం సూఫీ వేదాంతిగా భావించబడటమూ – ఆ సంప్రదాయములో దేవతను ప్రియురాలిగా – ప్రియురాలిని దేవతగా ఆరాధించటమూ నన్ను ఆకర్షించింది. తాంత్రిక సాధనలలో వీరమార్గం అటువంటిదే. ఈ రచన ఉమర్‌ఖయ్యాం రచనకు అనువాదం కాదు. అతని ప్రభావం మాత్రం కొంత ఉంది.

కాళీదేవిని గూర్చిన యీ గ్రంథంలో గంధర్వగీతి కూడా – వీరమార్గ భావుకం గనుక చేరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చినపుడు – బాగానే ఉంటుంది కానీ కొన్ని పద్యాలు ఇతర ధోరణులలోవి కూడా ఉన్నవి గదా అనిపించి సందేహించాను. సరే ! చివరకు ఈ చిన్నరచనలో కొన్ని వదలటం దేనికి – అన్నీ ఒకచోట ఉంటవిలే అని ప్రచురిస్తున్నాము.

తెలుగు పలుకులోని ఖుషీ తెలుగు పాటలోని నిషా
తెలుగు మాటలోని మజా తెలుగు మనసులోని హుషార్
కస్తూరీ కర్పూరపు గమగమలను కలిపి కవిత
చూపెదనో దేశమునే ఊపెదనో ఉవ్వెత్తుగ!

ఉమ్రఖయాం ఉత్తేజం ఉర్దూ కవితోల్లాసం
గులాబీల అత్తరుతో గుమ్మనగా గుస్తరించి
రూబాయిలుగా రచించి రూపకముల నాడెదనో
కవితా జలపాతములను గజలులుగా తీర్చెదనో!

తెలుగువాణి పెదవులపై తేనెలొలుకు చిరునవ్వై
వెన్నెల వలె తెలుగు తోట విరిసిన దిరిసెన పువ్వై
ఉదయించిన ఉషస్సునై ఊర్వశి గళమాలికనై
కవితలు కురిపించెదనో కాంతులు మెరిపించెదనో!

మణి ద్వీపదేవి చేతి మాణిక్యపు వల్లకినై
ఆ వల్లకి పలికించెడి అమృత రాగపల్లవినై
పలుకే ఒక పాటగాక పాటే జీవితము గాగ
ఖయ్యాం! నీ వలె మానవ గంధర్వుడనయ్యెదనో!

ప్రియురాలే దేవతగా విశ్వసించు రసయోగి! 1
జీవేశ్వరలయ హేతువు శృంగారమె అను భోగి! 2
ప్రేమయె దివ్యత్వమన్న విశ్వయోగి! ఓ ఖయ్యాం! 3
నీ తత్వము గ్రహియింపని నిర్భాగ్యుడు ప్రేమరోగి!

ప్రేయసిలో పరమేశ్వరి వీక్షించిన ఋషివి నీవు
ప్రేమ మంత్రసిద్ధుడవగు వీరారాధకుడ వీవు
ప్రణయతత్వ నవ భాష్య ప్రవక్తవగు ఖయ్యామా!
ప్రపంచమున నీ హృదయము పఠియించిన దెంతమంది?

మనసు లేని మగువ కంటె మంచిదె మద్యం 4
మమతల రేకెత్తిస్తే మంచిదె పద్యం
మారిన మనుషులకోసం మారని ఓ ఖయ్యాం!
మతమునకూ గతమునకూ మానుమింక నైవేద్యం

గులాబీల చెక్కిళ్లకు గులామునైపోయితిని
లలనామణి చిరునవ్వుకు లాల్! సలాము చేసితిని
గుండెలు తీసిన బంటని గుర్తించిన క్షణమున
గుండె ఆగి విరాగినై గోసాయిగ మారితిని!

ప్రేమ వనములో ఎప్పుడు ఒకటే బుల్ బుల్
బహు భార్యా చట్టమ్మది పట్టని దీ మంజిల్
రాముని వలె ఏక సతీవ్రతుడవైన ఓ ఖయ్యాం!
కాముని వలె కైత గట్టి కదిలింతువు దిల్ దిల్ !

---

1. మహాభక్తుడు చండీదాస్ పంథాయిది.

2. మధురభక్తి మార్గమిది

3. ప్రేమ అయిదవ పురుషార్థమని బృందావనయోగుల సిద్ధాంతము.

4. వామాచార సాధనలో మద్యం ఉపయోగిస్తారు.

మనసిచ్చిన మగువుంటే మరి యెందుకు గంజాయి? 1
మారిపోదు వొక్కసారి మనిషివిగా గోసాయీ!
ప్రేమకన్న ధనం లేదు ప్రేమకన్న మతం లేదు
నవాబైన గరీబైన అందున ఒకటే భాయీ!

ప్రాణేశ్వరి దొరికితే బ్రతుకంతా అచ్ఛా
ప్రణయ రాజ్యపాలకుడగు ప్రతివాడూ పాచ్ఛా
మతము కొరకు మనసులనూ మమతలను తెగకోసే
మనిషి మనిషి కాడు సుమా! మనసు లేని లుచ్ఛా!

హమేషా నవ్వుతావు ఎందుకె పిల్లా!
తమాషాలు ఏడేనట లోకంలోకెల్లా
ఎనిమిదో వింత ఏదో తెలుసా? ఖయ్యాం!
కవివి నీవు కావటమే మాషా అల్లా!

సీసా కొత్తది కానీ సారా పాతదె బేటా!
పరుపు పాతదే–కొత్తది పై దుప్పటి ఈ పూటా
కవిత పాతదే గానీ కళ కొంచెము మార్చుటచే
నా పలుకే రూబాయిగ నానునింక ప్రతినోటా!

మనిషికీ – మనసుకూ మంచే ధ్యేయం
మసీదుకు నీవొస్తే చెప్పులు మాయం
మతబోధకు డెంత చెప్పి మార్చగ యత్నించినా
మారనీవు ఓ ఖయ్యాం! మమతా గేయం!
భవ్యులు సేవించారు సురాలయం తీర్థం
నవ్యులు సేవిస్తారు సురాలయం తీర్థం
పాపపుణ్య చింతనే పరమార్థం వారికీ
వీరికేమొ కావాలి సౌఖ్యం స్వార్థం!

రసవాదము నేర్చుటకై బ్రహ్మ చెంత చేరితిని
చిరకాలము శుశ్రూషలు చేసి చేసి విసిగితిని
బాధను గమనించినట్టి పడతి సాఖీ
రసయోగము నేర్పి నన్ను రారాజును చేసినది!

---

1. మద్యం కంటె, భంగు, గంజాయి సాధనకెక్కువగా ఉపకరిస్తునట !
"సంవిదాస్వయోర్మధ్యే సంవిదేవగరీయసీ"

నిజం చెప్పమంటావా నీతో ఖుర్రం
గజల్ వింటే ఆడుతుంది గజ్జెల గుర్రం
మజా చేద్దామంటావా దానితోడ
బజారెక్కితే కూలును పరువు మేడ!

జనాకర్షణేమిటో తెలుసా నీకు
చెబుతున్నా వింటావా చిన్న జోకు
గజ్జె కట్టి నర్తించే కాంతల సభకు
గతి లేక మతి లేక కవిగా పోకు!

మంత్రివరుల సన్మానం మదిరాక్షుల సంధానం
కిరాయి జన సముదాయం కిరికిరి చేసే చోటుల
రాజకీయ రాబందులు రచన చేయు వేళలలో
పంచరత్న కవిగా మరి పదముంచగబోకు!

బధిరాంధకశవములైన అధికారులు చేరి
ఉత్సవ విగ్రహములుగా ఉంచెదరొక్కొక్కసారి
అయోగ్యులగు ఆ వ్యక్తుల అనవసరముగా పొగిడి
ఛందోనటి గొంతు పిసికి చంపగబోకు!

గుల్‌మొహర్ ఆడితె కోటి కోహినూర్లు
నూర్జహాన్ పాడితె నూరు వేయిసార్లు
కవి పద్యం పలికితే కష్టంమీద
నూటికొక్కడిస్తాడు నూట పదార్లు!

మనసుంటే మార్గముంది మంచికి చెడు కెప్పుడూ
మనసు చంపుకొన్న వారె మన నాయకులిప్పుడు
కరుణామయుడే పూర్వము కవియైనాడెప్పుడు
ఇంటింటా వంటింటా ఎందరొ కవులిప్పుడు!

రాజకీయముల భ్రష్టులు నటనారంగ శ్రేష్ఠులు
నటనారంగ భ్రష్టులు నవ కవితా రేచకులై
కావ్యాంగణ పాచకులై కళారంగ కీచకులై
కవుల నెత్తిమీద కెక్కి కాలాంతకులైరిప్పుడు!

ఖయ్యామును చదివావా? కవితా ద్వేషీ!
కవి కావటమే నీకు కడు నామోషీ
కాంతా కనకాల మీద కలిగిన మోజు
నిలువదురా కవితలపైనీకీరోజు

అందరికీ కావాలి మందూ పొందూ
కొందరికే కావాలి కవనపు విందు
ఒక్కమాట చెబుతాను వినుకో ఖయ్యాం!
అరసి అరసి నిలువకుమా అరసికుల ముందు!

అసిధారా వ్రతమురా ఆశు కావ్య రచనం
అందుకే చెబుతారు అందరూ వచనం
సస్పెన్సులు మసాలాలు చమక్ చమక్ పోపు పెట్టి
వడ్డిస్తున్నారు ఉడికీ ఉడకని వచనం!

కాంతల కొందురు కొందరు కామేశ్వరులు
కవితల కొందురు కొందరు కనకేశ్వరులు
కలికిలోని కవితలోని కమనీయత కాంచక
చూచెదరూ పై డాబును శునకేశ్వరులు!

రాజకీయ నాయకులు దేవాంతకులు
కవులూ గాయకులు మరి కాలాంతకులు
కళా ప్రేమ నటియించే కపటాత్మకులు
లోగుట్టును దాచుకొనే లోకాంతకులు!

కవులూ గాయకులంతా గత జన్మయోగులు
కళా ప్రియులు భూతలమున గత కర్మ భోగులు
గాంధర్వ కామనలివి కాదనువారే
అదృష్టమ్ము చాలనట్టి అంధబధిరరోగులు!

రథగజాశ్వ పదాతులను ప్రపంచమే రణరంగం
ఆ బొమ్మల ఆటతోడి బ్రతుకే ఒక చదరంగం
తానే ప్రతిదానికి కర్తననుకొని నరుడూ
వేస్తాడు వెర్రివోలె అపుడప్పుడు వీరంగం!

వద్దు వద్దంటూనే పైరవీలు చేస్తారు
రద్దు రద్దంటూనే రాజకీయ మేలుతారు
ముద్దు వచ్చినప్పుడే మరి మురిసి చంక నెక్కాలని
హద్దూ పద్దూ లేక అర్థం సాధిస్తారు!

జీవునితో చేస్తారు వ్యాపారం బేహారులు
దేవునితో చేస్తారు వ్యాపారం పూజారులు
ఇద్దరికీ లేదు సుమా! ధర్మపు చింత
అద్దరి చేరేటపుడు తప్పదు వంత!

బాధ గురువులే తోచెదరడుగడుగందు
బోధ గురువులే భువిలో కనపడరెందు
చేతిలోన రూపాయి- చెవిలోన మంత్రం
చెల్లదింక ఎన్నాళ్లో ఈ దుస్తంత్రం

వాసంతం వస్తేనే కోయిల పలుకు
కోయిల 'కూ' అంటేనే తేనెలు చిలుకు
ఉలుకు పలుకూ లేని ఉవిదలతోడ
ఏనాటికి కలుగుతుంది తళుకూ బెళుకూ

అడ్డు లేక వెలిగినపుడు నేనొక రాణా
గ్రుడ్డిదైనా గుర్రానికి తగ్గదు దాణా
ఎన్నాళ్లిక వ్యర్థమైన బ్రతుకో సాకీ
ఎత్తేస్తా ఈ జగతిని ఇంక బిచాణా

మనసు తనువు అర్పించిన మగువ పేరె మంత్రం
మనసు నిలవటానికిదే మారని తంత్రం
తనివితీర మధువు త్రావి తరుణి వొడిని చేర్చితే
పరవశించి కదలిపోవు మానవ యంత్రం

ప్రణయినిపై సదా ధ్యాస - పరధ్యానమింటిలోన
ఎవరితోడ మాటాడెడి ఇచ్ఛలేక మౌనిగనై
నా మనసున నేనే ఒక బందీని పోయితిని
నా గృహమున నేనే ఒక పరదేశిగ మారితిని !

చిత్తములో ఎగురుచున్న చిద్గగనపు చిల్క
మత్తు చెందె రావిప్పుడు మాటలు పల్క
నెత్తిమీద వేవెలుగులు నిండిన వింక
కత్తిరించబడుతుంది కవివరు నాల్క!*

*** సహస్రార చక్రంలో సంచలనం కలిగి వాక్కు ఆగిపోతుంది**
"యతో వాచోని వర్తంతే"

ఉపవనముకంటి మొన్న యోగీశ్వరుని
మధుశాలను కంటి నిన్న మాంత్రికవరుని
నీ కొరకే యీ ఇద్దరు నిలుచుట చూచి
నీయందే కంటి నేడు నిజమగు గురుని!

పాపమ్ముల హరియించెడి గంగా వారి
స్నానమాడి భజియింపుము భక్తి పురారి
లేదా రమియింపు మెపుడు ప్రేమను చేరి
ఉన్నత స్తనములతో నొప్పెడి నారి!

అసలు కవిత అంటేనే తీరని దాహం
ఎందుకురా దానిపైన అంతటి మోహం
అందరూ కోరుతారు అతివల స్నేహం
ఎడద దోచిపోవడమే ఎన్నరాని ద్రోహం!

కాలుని దేవాలయాన మ్రోగెను గంట
కలికీ! నా గుండెలోన రేగెను మంట
పిలుపక్కడినుండి వచ్చె ఎక్కడి తంటా!
పిలిచినా రావు నీవు ఎన్నాళ్లుంటా?

సిద్ధాశ్రమ భూములలో ఋషులకు నెలవౌ
హిమగిరీంద్ర నితంబములు సేవ్యమ్ములు సతము
లేదా సుమబాణు కొలువుకూటమ్ముగ నలరు
భామా ఘననితంబములు భావ్యమ్ములు సతము!

జగీశ్వరి తల్లి యనుట అందరి మాట
చూపెద నీనాడు నేను క్రొత్తగుబాట
దేవిలోన ప్రియురాలిని చూచెదవేనీ!*
జీవితమే మరువరాని చిత్రమ్మగు మౌనీ!

రామకృష్ణ పరమహంస ప్రణయిని యెవరు?
వివేకానంద యోగి ప్రేయసి యెవరు?
రమణాఖ్య మహర్షివరుని రమణీమణి యెవరు?
ముక్తికాంత చరియించెను ముగ్గురి చెంత?

---

* వీరమార్గసాధన

ముక్తి పదము కోరినచో మోహము విడుము
భక్తి పదము కోరినచో మోహము పడుము
రక్తి లేక భక్తి లేదు భక్తి లేక ముక్తి రాదు
అద్వైతుల యుక్తి వాదమది మాటల గారడీ!

ఆత్మసఖీ! నీ వింకా కరుణించకపోతే
ఆత్మహత్య నా ముఖమున వ్రాసిన వ్రాతే
ప్రయాగలో సంగమాన పడి చస్తాను*
ప్రభువు విక్రమార్కునిగా ప్రభవిస్తాను!

ఆమ్రపాలి రూపములో అందముగంటి
తామ్రోష్ఠపు స్పర్శ కొరకు తహతహమంటి
ఉమ్రావుల ఖాఖానుల నొల్లని వాల్గంటి
ఉమ్రఖయామ్! నీ కవితల కొరగుట గంటి!

సిద్ధులను యోగులను చేరుట మెండు
బద్ధమైన కోరికలే గుండెల నిండు
సిద్ధిలోని రహస్యమ్ము చెప్పరు వారు
బుద్ధి లేని కింకరులై యుందురు వీరు!

సహజ పాండితీయుతుడగు పోతన్నను గంటి
సహజ గాయకాగ్రణి యగు త్యాగయ్యను వింటి
సహజ యోగి వేమన్నను కవితల కనుగొంటి
సహజ యాన పంథీనై సాగుచునుంటి!

ప్రపంచమంతా ఒక పాంథుల సత్రం
మూడునాళ్ళ ముచ్చటే ఎవరికైన మిత్రం
సతులైనా సుతులైనా కలిసి ఉంట కొన్నాళ్ళే
శాశ్వతమని చెందబోకు ఊరక ఆత్రం!

కాలములో పరుగుదీయు కట్టెలు రెండు
కలిసి ఉంట కాసేపే చూస్తూ ఉండు
పైన ఒకడు విడదీసి మంటను త్రోయ
దేనివంతు వచ్చినప్పుడయ్యది మండు!

*** త్రివేణీసంగమంలో వటవృక్షం మీద నుండి నీళ్ళలో దూకి ఆత్మహత్య చేసుకొంటే కోరిన కోర్కె వచ్చే జన్మలో తీరుతుందని స్థలపురాణం.**

నీకోసం కావించా నిత్యం యోగం
నీ కొరకే భరియించా ఇంత వియోగం
తలపంతా చీకటిగా తడిమీ తడిమీ
తలుపులు తెరిచుంచాను సాకీ బేగం!

గురువు కొరకు వెతికాను కొండా కోనా
గురి కుదరగలేదు నాకు ఎవ్వరిపైనా
కొసమెరుపుగ తోచావు చివరకు మైనా
గుండె యెల్ల దోచావు వెన్నెల సోనా!

నీకొరకె చేయుచుంటిని నిత్యం ధ్యానం
నిన్ను మరువకుండుటకే యీ మధుపానం
నీ నామమె అమృతమై చేసితి స్నానం
నీకోసమె పెదవులపై నిల్పితి మౌనం!

సురత్రావిన శుక్రునిలో శూరత గంటి
సురలనే లెక్కింపని సూక్తులనే వింటి
సురనారిని సాధించెడి శుభ సమయము కొరకు
సురత శబ్దయోగములో చొక్కుచునుంటి!*

పూటపూట కొక కొత్త ప్రసంగం
జీవితమే ఒక నాటకరంగం
వివిధ కేశములు సిద్ధము చేసెద
ఎప్పటికెది యా రంగును వేసెద!

మతమును మార్చుము మార్చుము మంత్రం
మారదు మారదు మానవ తంత్రం
మగువల కోసం మహా యుద్ధములు
మానదు నరుడను కదిలే యంత్రం!

పోయుము జీవన పాత్రను మధువు
తృప్తింపరచెదను కవితా వధువు
రసదేవతకై రగిలే గుండె
నేటికి మధురస ధారల నిండె!

*** మంత్రం జపం చేయకుండా వినటానికి చేసే సాధన దీనివల్ల ఋషిత్వం త్వరగా వస్తుందని ఈ సంప్రదాయం వారు చెపుతారు.**

ప్రియను రమింపుము ప్రియను రమింపుము
రమింపు ప్రియనో మూఢమతీ!
ముసలితనమ్మది ముందుకు వచ్చిన
చేయునదుండదు భిన్నగతీ!

త్రావుము మధువును త్రావును మధువును
మధువును త్రావుము మందమతీ!
ఏకాగ్రతకై ఏకదీక్షగా
త్రావుము ప్రియతో ధ్యానరతీ!

తామరాకుపై నిలుచు జలకణం
బ్రతుకే భయమగు క్షణక్షణం
ఆధివ్యాధి గ్రాహగ్రస్తము
కాకముందె కను సుఖము సమస్తము!

మధుమథనోత్సవ విభవము కన్నను
మదనోత్సవమే కడు మిన్న
మధురానాథుని మంచి చేసుకొని
మదనుడు నిలిచెను జగమెన్న

మదన కదనమున మహావీరుడౌ
బృందావన పతి శరణనుమా!
రసయోగీశ్వరి రాధ కరుణచే
రసికలోకమున నడుగిడుమా!

చెందకు ధనజనయౌవన గర్వము
హరించు కాలము క్షణమున సర్వము
అశాశ్వతమ్మిది విడు మఖిలంబును
విడువకు చెలియిడు మధుచషకంబును!

ఎందుకు అధికారాగత చింత?
చపలుడ! లేడా నీకు నియంత?
ప్రణయిని కలయిక ఒకటే చూడ
భవజలధిని దాటించెడి ఓడ!

కషాయాంబరము కట్టెను గానీ
కాంతల కలయిక విడిచెను గానీ
ధనమును విడువడు మనమును గెలువడు
ఎందుకు జీవితమంతా గ్లాని!

కావులు కట్టిన గోచులు పెట్టిన
బలవంతముగా మది నరికట్టిన
మృతుడై మోక్షము కనుట అబద్ధం
కామపిశాచమ్మగుటయె సిద్ధం!

మాయావాదము మిథ్యావాదము
శూన్యవాదముల సృష్టి గమింపదు
విశ్వము నడపెడి సూత్రమొక్కటే
హృదయ ప్రణయము-సదయ ప్రణయము!

శుక్తి రజతములు రజ్జు సర్పములు
భ్రాంతులు క్రాంతులు వృథా దర్పములు
వ్యర్థ వాదముల గడుపకు కాలము
అందుకొనుము చెలి కరతాంబూలము

గేయము దేవీ పదసాహస్రము
ధ్యేయము ప్రణయిని రూపమజస్రము
నేయము రసికుల సంగతి చిత్తము
దేయము భక్త జనాళికి విత్తము!

దేవి పదాంబుజ నిర్భర భక్తిని
అచిరముగానే కాంతువు రక్తిని
పలుకుము కవితల పరమాసక్తిని
పొందెద వద్భుత జీవన్ముక్తిని!

శృంగారమ్ము తపస్సు నాకు కవితాశ్రీమన్మహారాజ్ఞియే
బంగారమ్ముల పంట నాకు హృదయ ప్రాసాద సింహాసన
మ్మంగీకారము చేసి యే చెలువ నా ఆత్మార్పణమ్మంది-నన్
కెంగేలన్ గ్రహియించు నా మధుర శక్తిన్ భక్తి నర్చించెదన్!

ప్రణవోపాసన చేసి నిర్గుణ పరబ్రహ్మమ్ము భావించి నా
యణువుల్ సర్వము తన్మయీ భవన సంప్రాప్తిన్ విరాజిల్ల నీ
ప్రణయోపాసన యేల యందు వొకొ! ఓ ప్రాణేశ్వరీ! జీవ తా
రిణివౌ నీ విడు దివ్య భావ మధురార్తిన్ నేను కాంక్షించెదన్!



గులాబీల అత్తరులతో క్రొవ్వల పాడి
గుల్‌బహార్ వచ్చింది క్రొమ్ముడి వీడి
వేళా పాళా లేదని విసుగుకోకు ఓ సాకి!
వియోగులకు ఎల్లప్పుడు వెన్నెల వేడి




ఇలలో పగలంతా మురిపించావు
కలలో రాతిరి నీవె కనిపించావు
కలలోనే కలయమనే కలినాత్మకురాలా!
కసితో నా బ్రతుకు మట్టి కలిపించావు!



నిలకడ లేని మనస్సుకు నీతా? పాడా?
అలకనగా దూకుతాడు న్యాయపు గోడ
మత్తులో మైకంలో మగువైతే చాలు
తొమ్మిదికీ తొంభైకీ తోచదు తేడా!



అందినట్లే ఉంటుందీ అందరికీ స్వర్గం
కొందరికే దొరుకుతుంది కోరిన మార్గం
పిసరంత త్రాగితే ప్రియురాలు దొరికితే
ఎందుకురా? వేరొకటి - ఇదె సుఖ మార్గం!



కన్నె తనను గెలుచుటకు కావలసింది
కలం కాదు కత్తి గాదు పోపొమ్మంది
ఆరాధనలో ఆమె చూచింది హాయీ
అందుకే రమ్మంది రేయీ రేయీ!



ఎర్రని ద్రాక్షరసమ్ము ఎసరేగిన రాగముతో
కుర్రది ఒడిలోన చేరి కోకొమ్మని యిస్తుంటే
కుచకలశం మధుకలశం కుంకుమ విరబూస్తుంటే
మత గురువుల జలకలశం మాటెత్తకు నా ముందర!




గులాబీలు కావాలా కొంటెవాడా
చాలాకీది ఉన్నదిరా చేనుకాడ
కత చెప్పి కైత చెప్పి కరిగిస్తే చాలు
దొరుకుతుందిరా దాని తోడూ - నీడా!



అసలు కవిత అంటేనే తీరని దాహం
ఎందుకురా దానిపైన అంతటి మోహం
అందరూ కోరుతారు అతివల స్నేహం
ఎడద దోచిపోవడమే ఎన్నరాని ద్రోహం!



కాలుని దేవాలయాన మ్రోగెను గంట
కలికీ! నా గుండెలోన రేగెను మంట
పిలుపక్కడినుండి వచ్చె ఎక్కడి తంటా?
పిలిచినా రావు నీవు ఎన్నాళ్లుంటా?



నీ కోసం కావించా నిత్యం యోగం
నీ కొరకే భరియించా ఇంత వియోగం
తలపంతా చీకటిగా తడిమీ తడిమీ
తలుపులు తెరిచుంచాను సాకీ బేగం!



గురువు కొరకు వెతికాను కొండా కోనా
గురి కుదరగలేదు నాకు ఎవ్వరిపైనా
కొసమెరుపుగ తోచావు చివరకు మైనా
గుండె యెల్ల దోచావు వెన్నెల సోనా!



నీకొరకె చేయుచుంటిని నిత్యం ధ్యానం
నిన్ను మరువకుండుటకే యీ మధుపానం
నీ నామమె అమృతమ్మై చేసితి స్నానం
నీకోసమె పెదవులపై నిల్పితి మౌనం!



కలం ఆగిపోతుంది గళం మూగదవుతుంది
మాట నిలఁచిపోతుంది మనసు తిరిగి వస్తుంది
మస్తకమున ప్రణయినియౌ మణి పద్మం వికసంపగ
మెరుపులు వేయొక్కసారి మెరిసినట్లు తోస్తుంది!



వేయంచుల పూవుమీద వెన్నెల కురిసి
వెచ్చని పూదేనెమీద వెలుగులు విరిసి
వెలుగులోన వేలుపువై వెలసిన ఓ సాకీ!
మునిగిపోతి నీ వలపున మురిసీ మురిసీ!



జీవిత సార్థక్యమునకు పథములు రెండు
విరాగియై ఆశ్రమముల గడపుట మెండు
లేదా ప్రియురాలి జడను పూవుల చెండు
తావిలో వివశుడై ఊగుట వేరొండు!



విరాగివై తపము చేయ సాధ్యము కాకున్న
రాగివై ప్రేమతపము కావింపుము చిన్నా!
కామమ్మును గెలుచుటకై కష్టపడుటకన్న
కామియై కామేశ్వరి సాధించుట మిన్న!



పొంగుచున్న ప్రతి అలలో భుజగీశుని చూచి
గంగలోన మునిగాను కాశీపతి తలచి
అంతరంగమున అభవుడు నిలిచెను నిశ్శంక
యమ మహిషపు లోహ ఘంట వినబడదింక!



కలిసి చదువుకొన్నాము కాముని శాస్త్రం
కాని బటయ విప్పకుమా! అనుభవాల దస్త్రం
ఇతరులెవ్వరెరుగరాని పరమ రహస్యం
ఇద్దరికే పరిమిత మీ రస కవితాస్త్రం!



రాదు రాదు ఒకసారి గడచినచో యౌవనం
వ్యర్థము కాకుండ గడపు నిత్యము నీ జీవనం
శక్తియుండగా చేయుము ప్రేమ తపస్సు
సాధింతువు కృపామధుర దేవి మనస్సు!




నీ అడుగుల ఉంచాను గుండె గులాబీ
నెట్టివేసి పోవకుమా జమునా బీబీ
మన ప్రణయపు సఫలతపై చట్ట సభలో
చర్చలను చేస్తున్నది పెద్దల లాబీ!



తేనియలను కురిపించే తియ్యని మోవి
పలుకులలో చల్లుతుంది పువ్వుల తావి
ఆ తలపున నిలుపుమా బృందావన దేవి
అపుడు నీకు వినిపించును పిల్లన గ్రోవి!



ఎంతకాలమీ ఆగని యాత్ర
ఎంత పాలు నాకిచ్చుట పాత్ర
ఏటి యేటి కొక సత్రపు మజిలీ
తోడుగ నెన్నాళ్లుందువు బిజిలీ!



ధనముల కోసము పదవుల కోసము

సమయము వ్యర్థము సలుపకుమా!

ప్రేయసి కౌగిలి మించిన పదవి

ప్రపంచమందే లేదు సుమా!



నీలో కాముడు నాలో కాముడు
అజాత నాస్తికుడతడు సుమా!
అతడు సాక్షిగా చేయు కేళియే
అద్వైతమ్మది మరువకుమా!



పవలు రాత్రులును ఉభయ సంధ్యలును
వర్షాశరత్తులు వచ్చును పోవును
కాలమ్మాడెడి పోయెడి నాయువు
కానీ వదలకు ప్రేమ స్థాయువు!



చేతిలోన ఉన్నదిలే మధురస పాత్ర
చేయుచుంటి కనులు మూసి కాశీ యాత్ర
గంగా యమునా మధ్యమ సంగమమందు
కనిపించెను కలలోపలి జలరుహ నేత్ర!

నాలో జీవుడు ప్రేమ భావుడయి ఆ నందాంగనా డింభకుం
డై లోలోపలి జీవ లక్షణము లెట్లైనన్ పొకాలంగ నీ
పాలిండ్లన్ గ్రహియించి తద్గత కవిత్వ ప్రాణగానంబుతో
నీలో దేవుడు గాగ మారగలడో నీ గుండెలన్ మ్రోగుచున్!

ప్రేమ ఉషస్సువంటి దొక వేళను ఎండగ మారు నింతలో
కోమల సాంధ్యరాగములకున్ నెలవౌ మలిసంజలో రస
స్వామిని పాదపూజలను చల్లని వెన్నెలగా ద్రవించి దే
వీ మృదుహాసరేఖల పవిత్రత గాంచి వరంబులందెడున్!

వలపు హిమాచలమ్మువలె పైపయికిన్ జన నింతలోన లో
కులు పలుగాకులై ఎదురుకో భరియింపగలేక వేదనా
జ్వలితమునై అతర్కిత విపత్పరిణామములైన మండుటెం
డలకు కరంగునో సుకరుణావిలవాహినియై స్రవించునో!

మెత్తని నీ పదమ్ములిల మెల్లగ పెట్టుచు రమ్ము చూపు పూ
గుత్తుల తోడ నీ తెరువు క్రొంబరపుల్ పరపించి యుంచితిన్
అత్తరు తావిక్రమ్ముకొనె నంతట వచ్చుచునుంటి వౌక్కొ నీ
చిత్తము నాదు భాగ్యమిక చెల్వ! భవ త్పదపద్మ దాసుడన్

ఎపుడెపుడంచు వేచితి సఖీ! భవదాగమనాభిలాషతో
రెపరెపలాడు ప్రాణమిది రేపటిదాకను నిల్వగల్గునో
కపురపు దీప మీ వలపు గాలికి నారునొ కొండయెక్కునో
తపము ఫలించి ప్రామినుకు దారుల నిన్ దివి నుండి తెచ్చునో!

కృష్ణుండన్ మరి జీవుడన్ ప్రియసఖీ క్రీడా వినోద క్రియా
జిష్ణుండన్ పరమాత్ముడన్ ప్రణయ రాజిష్ణుండ బృందావనీ
విష్ణుత్వంబు వహించి నే తిరిగెదన్ వీర స్వభావంబుతో
ఉష్ణోష్ణంబగు ప్రేమ వాహినులలో ఊగాడెదన్ నిత్యమున్!

నా భ్రాంతింగని నవ్వుచుండిన సుషుమ్నా మార్గ సంచారిణీ!
నా భ్రూ మధ్యమునందునిల్చిన మనోన్మన్యాకృతీ! ఎవ్వరీ
అభ్రాంతంబుల తొంగి చూచెదరు జ్యోత్స్నాకార రేఖావళీ
సుభ్రూ సుందర నర్తకీ గణము నాజూకైన నాట్యమ్ములన్!

ధ్యానాభ్యాస వశీకృతమ్ము మనసంతర్యోగ విస్ఫారమై
నా నాసాగ్ర నివాస భాసితను నిన్నె కొల్చు నే వేళ నీ
ఆనందోదయ వేణునాదమిది సంధ్యా తాండవమ్మౌనొ! లీ
లా నూత్నస్ఫురణోదితమ్మయిన హేలా లాస్యమౌనో సఖీ!

నా పలుకొక్క రాగమయి నాట్యమునై నవచిత్రమోహినీ
రూపకమై రసోదయనిరూపక కాంతి మరీచి మాలికా
దీపకమై త్వదీయ పద దీధితినందునొ లేక గోపికా
గోపక పాదకంజ వనకుంజములన్ వివశత్వమొందునో!

విద్యుల్లేఖయొ ఇంద్రచాపమొ సురీ విన్యాస నాట్యావళీ
సద్యస్సుందర చక్ర చంక్రమణమో సర్వేంద్రియ భ్రాంతికృ
న్మాద్యత్పాన ఫలమ్మొ మాంత్రిక మనోమాయా విలాసమ్మొ నీ
ఉద్యద్వీక్షణ మాలికా విలసనమ్మొ దేవి! నన్ చుట్టెడున్!

ఈ మత్తిల్లిన కోకిల ధ్వనులలో ఈ నందనోద్యానపున్
సీమన్ పూవుల తోటలే ప్రతియెడన్ స్వేచ్ఛా విహంగమ్ము నే
ప్రేమోన్మాదిని నాకు నీవొక గులాబీవై ప్రకాశింతు వీ
శ్యామశ్యామలశాద్వలీ స్థలులలో ఆకర్షణా స్థానివై!

దేవీ ! నీవు గులాబి అత్తరువు నీ దేహమ్ము, సాజమ్ముగా
తావుల్ జిమ్మును నాకు దక్కిన మహద్భాగ్య మ్మసత్యమ్మటం
చేవాడైన వచించినన్ సహజ సుశ్రీగంధధమ్మిల్ల దే
వీ వామాంగ ప్రమాణమున్ నిలిపెదన్ విద్యా బలస్ఫూర్తితో !

నిఖిలంబున్ ప్రణయేశ్వరీమయము చండీదాసు భావించి చి
త్సుఖమున్ ప్రేమ తపస్సులో వెలుగుగా జూచెన్ సమాధి స్థితిన్
ప్రఖరానంద విభావమే సహజ యానంబైన శృంగారపున్
శిఖరంబెక్కెద నేను నాతనివలెన్ జీవాత్మ యోగంబునన్!

ప్రేమాత్మన్ పరమాత్మగా నెరుగ సూఫీయోగులన్ గోరితిన్
నా మాటల్ విని నవ్వి చిద్గగన చంద్రజ్యోత్స్న వాంఛింతువే
నీ మార్గంబు విచిత్రమైనది సుమా ! నీతాతముత్తాతలం
దీమార్గంబెవరైన బట్టి రొకొ నీకేలందు రేవేళలన్

వామాచార మెరుంగుదున్ గురుల సేవన్ దక్షిణాచారమున్
సామర్థ్యంబున జూచితిన్ సలిపితిన్ సద్యః ఫలత్తంత్రముల్
ప్రేమాంతఃపురనాయికా హృదయ దేవీ పాదమంజీర నా
దామోఘూజ్ఞచరింతు నేడు ధిషణాహంకారమున్ వీడుచున్!

లావొక్కింతయు లేని నా యెదదలో లావా ప్రవాహమ్ములై
ఏవో పాటలు పర్వులెత్తును రుబాయీలుద్రమఖయ్యామ! నీ
ఆవేశంబును నాకు వచ్చెను తుఫానై తీవ్ర వేగంబుతో
నే విశ్వంబు కదల్చెదన్ కవితలన్ శృంగార శృంగమ్ములన్!

ఔలే! నీదు గజల్వినందలతు ఖయ్యామా! గులాబీలతో
ఆలేఖించెద నూత్న చిత్రములతో అస్మత్ప్రియాగానమున్
నీలో నీవె సమాధిలో పలికెదో? నేనున్ ప్రయాణించెదన్
కాలాంతఃపురకామినీకుచతటీ కార్కశ్యమున్ జూడగన్ !

ఓయి ఖయామ! నీవలెనె ఊహకు మూర్తిని కట్టినాడ సా
కీ!యని నీవు పిల్చిన సఖీ! యని నేను రచింతు ద్రాక్ష సా
రాయపు మత్తులో మధుర రాసపు లాహిరిలో తరించి ఆ
ప్యాయత జీవితమ్ము చరితార్థము చేసికొనన్ తపించెదన్!

ప్రేయసి నాకు దేవతయె వేలుపురాణినె నాదు గుండెలో
ప్రేయసిగా వరించితి తరించెద ప్రేమతపస్సులో తరం
గాయితరాగవాహిని మహాద్భుత వేగముతో స్రవింపగా
ఊయలలూగుచుంటి నిట ఉక్కిరిబిక్కిరియౌ తలంపులన్!

నేనొక నష్టజాతకుడ నేను దరిద్రుడ మూర్ఖబుద్ధి సు
ల్తానులకైన లొంగని విలాసిని సుందర మూర్తియైన లై
లాను వరించితిన్ తుది నెడారులలో మజిలీల మధ్య మ
జ్నూ నయిపోయితిన్ వెదకుచుంటిని నేడు సమాధులందునన్!

రేబవళుల్ శ్రమంచెడి గరీబును నేను నిరంతరమ్ము ము
స్తాబయి నిల్చియుండు సులతానుల రత్నకిరీట కాంతి గా
రాబము సేయు లేయడుగులన్ చెలువొందెడి దేవి వీవు నా
ప్రాబలుకున్ భవన్మనము రంజిలచేయునొ లేదొ కోమలీ!

తేకువ లేక జారిపడితిన్ పొరపాటెదియో యొనర్చిపై
లోకమునుండి ఆ కమలలోచను డెంత అనుగ్రహించునో
నా కనుమానమోసి కరుణామయి! స్వప్న జగద్విలాస! స్వ
ర్లోక విహార! నీ మనసులోపలి మాట నొకింత చెప్పుమా!

46. ఆంధ్రానువాద సహిత పురాతన కాళీస్తవము

విరించాది దేవా స్త్రయస్తే గుణాంస్త్రీం
సమారాధ్య కాళీం ప్రధానా బభూవుః
అనాదిం సురాదిం మఖాదిం భవాదిం
స్వరూపం త్వదీయం న విందంతి దేవాః

బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు భక్తితో నిను గొల్చియే
సుప్రధాన స్థానములలో శోభనందిరి యీశ్వరీ!
ఇల అనాదియు అలసురాదియు ఇక మఖాది భవాదియౌ
నీ స్వరూపము నెరుగజాలరు నిఖిలసురలును కాళికా

జగన్మోహినీయంతు వాగ్వాదినీయం
సుహృత్పోషిణీ శత్రుసంహారిణీయం
వచస్త ్సంభనీయం కిముచ్చాట నీయం
స్వరూపం త్వదీయం న విందంతి దేవాః

జగములను మోహింపజేసిడి శక్తియౌ వాగ్వాదినీ!
సుహృదయుల పోషించు తల్లివి అహితులను హరియించుచున్.
వాక్కులను స్తభింపజేతువు పారద్రోలుదు వుద్ధతిన్
నీ స్వరూపము నెరుగజాలరు నిఖిలసురలును కాళికా!

ఇయం స్వర్గదాత్రీపునః కల్పవల్లీ
మనోజాం స్తు కామాన్ యధార్థం ప్రకుర్యాత్
తథార్థే కృతార్థా భవంతీతినిత్యం
స్వరూపం త్వదీయం న విందంతి దేవాః

కల్పవల్లిగ మనసులోపలి కామితమ్ముల తీర్తువున్
స్వర్గ సుఖముల నొసగజాలెడి జనని యో జగదంబికా!
ఆశ్రితులను కృతార్థులనుగా ఆచరింతువు నిత్యమున్
నీ స్వరూపము నెరుగజాలరు నిఖిలసురలును కాళికా!
సురాపానమత్తా సుభక్తానురక్తా
లసత్పూతచిత్తే సదావిర్భవస్తే
జపధ్యాన పూజా సుధాధౌతపంకా
స్వరూపం త్వదీయం నవిందంతి దేవాః

మధురమధుపానమ్ము చేయుచు మత్తుగా చెలువొందుచున్
భక్తి గొలిచెడి వారి యెదదల రక్తితో నుదయింతువున్
వర జప ధ్యానార్చనా పద పాపపంకక్షాలినీ!
నీ స్వరూపము నెరుగ జాలరు నిఖిల సురలును కాళికా!

చిదానంద కందం హసన్మంద మందం
శరచ్చంద్రకోటి ప్రభాపుంజ బింబం
మునీనాంకవీనాం హృదిద్యోతయంతం
స్వరూపం త్వదీయం న విందంతి దేవాః

కోటిచంద్రుల కాంతు లొకపరి కురియ చిన్నగ నవ్వుచున్
చిత్త గగనమునందు మెరసెడి చిన్మయానందాత్మికా!
కవుల గుండెల మునులమనసుల క్రాంతివెలసెడి వెల్గువౌ
నీ స్వరూపము నెరుగ జాలరు నిఖిల సురలును కాళికా!

మహామేఘ కాళీ సురక్తాపి శుభ్రా
కదాచిద్విచిత్రా కృతిర్యోగమయా
న బాలాన వృద్ధా న కామాతు రాపి
స్వరూపం త్వదీయం న విందంతి దేవాః

కారుమబ్బులు క్రమ్మినట్టులు గాఢనీల విచిత్రవై
రక్తసిక్తవునయ్యు శుభ్రవు రమ్య యౌగికమాయవున్
కావుబాలవు కావువృద్ధవు కావు కామాతురవునున్
నీ స్వరూపము నెరుగ జాలరు నిఖిల సురలును కాళికా
క్షమస్వాపరాధం మహా గుప్తభావం
మయాలోక మధ్యే ప్రకాశీకృతం యత్
తవధ్యాన పూతేన చాపల్యభావాత్
స్వరూపం త్వదీయంన విందంతి దేవాః

చపలతను నీ గుప్త భావము జగతి చాటితి మాతరో
తప్పు చేసినచో క్షమింపవె దండమిడెదను దాసుడన్
తావకధ్యాన ప్రపూతాంతరిత దీధితి నీయవే
నీ స్వరూపము నెరుగ జాలరు నిఖిల సురలును కాళికా!

యదిధ్యాన యుక్తః పఠేద్యో మనుష్యః
తదా సర్వలోకే విశాలోభవేచ్చ
గృహేచా (చే) ష్ట సిద్ధిః మృతేచాపి ముక్తిః
స్వరూపం త్వదీయం న విందంతి దేవాః

ధ్యాన యుక్తుండగుచు నెవ డీస్తవము పఠనము చేయునో
అతడు పొందును ఇష్ట కామ్యము లష్టసిద్ధులు ముక్తియున్
భక్తులకును ఉపాసకులకును భవ్యశక్తి ప్రదాత్రివౌ
నీ స్వరూపము నెరుగజాలరు నిఖిల సురలును కాళికా!

47. ఉజ్జయినీ కాళి

వింధ్యాద్రిస్థలిదుర్గ–పార్వతి హిమోర్వీమండలంబందునన్
కంధ్యగ్రంబున కన్య– కంచిపురిలో కామాక్షి దుర్దాంతని
ర్వంధ్య ప్రక్రమ విక్రమార్క వరద ప్రఖ్యాత భర్గోల్లసత్
సంధ్యాతాండవకేళి ఉజ్జయిని భాస్వత్కాళి నర్చించెదన్

48. కలకత్తా కాళి

ముంతల్ ముంతలు కల్లు ద్రావి పిశితంబున్ మెక్కి ఆ ఊపుతో
గంతుల్ వేయుచు దుష్ట శాత్రవుల పై కాల్దువ్వ చుగ్రంబుగా
కంతు క్రీడకు కాలభైరవునిపై కామంబుతో దూకు నా
దంతి ప్రాభవ పప్రకేళి కలకత్తాకాళి నర్చించెదన్

49. శ్రీశైల కాళి

గ్రహణవేళ సముద్రతీరాన ధ్యాన
సాధనము సేయుచుండ సాక్షాత్కరించి
శ్రీగిరీంద్రమ్మున్ భ్రామరిగను నేనె
ఉంటి రమ్మన్న కాళీచిరంటి గొలుతు

50. దక్షిణేశ్వర కాళి

దక్షిణేశ్వరాన తపసియౌ శ్రీరామ
కృష్ణునకును సిద్ధు లిచ్చె నెవరు
అట్టి అమృతవల్లి అమరీమతల్లియౌ
తల్లి దలతు భక్తి తత్పరతను

51. ఢిల్లీ కాళి

పల్కున్ పిల్చిన భక్తితో శ్రితులకున్ భద్రమ్ము చేకూర్చు పై
జిల్కున్ భవ్య దయారసమ్ము వెలుగున్ జీకట్ల వింతాటలో
ఉల్కాపాత మహానుభూతినిడె నే ఉల్లాసినీమూర్తి ఆ
కల్కాజీయన ఢిల్లిలోగల మహాకాళిన్ సదా గొల్పెదన్

52. బృందావన కాళి

(సతీదేవి కేశములు పడినచోట కేశ కాళీమందిరం ఇక్కడ యమునాతీరంలో ఉంది.)
కాళీ సాధన బృందావనమున
గాఢముగా నుండుటను చూచితిని

కాళియు కృష్ణుడు నొక్కటేయని
గౌడీయమతం బందున వింటిని

రాధాశక్తులలోన నొక్కటై
రాజిల్లును శివకేళిక కాళిక
అందుచేతనే బృందావనమున
అనుమతించినది అమ్మ కాళికను

ఆ కాళిక చైతన్యపు చూళిక
దిక్చోళిక దివ్యోజ్వల కేళిక
దక్షిణేశ్వర స్ఫూర్జిత హేళిక
దయామూర్తియై అవతరించెనట

53. స్వయంభూకాళి

భువనేశ్వరవని పూర్వజన్మమున
పూజలందుకొనె పురుషిక కాళిక
కపాలేశ్వరుడు కాళిదాసముని
కారుణ్యముచే దిగె నా యేలిక

నిఖిలేశ్వరఋషి నిర్మల కృపయును
అచల మునీంద్రుల ఆత్మీయతయును
కులపతి భక్తియు ప్రేరేపింపగ
కదలివచ్చినది కరుణను కాళిక

వేయిమైళ్ళ దూరమ్ము నుండియే
వేగముగా పయనించి వచ్చెనటె!
ప్రథమ యామమున అర్చన నందిన
విధము గంటి మా విగ్రహమందున
ప్రళయ భయంకర కేళిక కాళిక
ప్రసన్నయై యిట కనపడుచున్నది
కరుణామయమౌ కాంతిలహరికలు
కనులలోన జాల్వారు చున్నవి
ఆ కాళిక పాదమ్ముల చెంగట
నతశిరుండనై నమస్కరించితి
శ్యామసుందరీ ప్రేమకోసమై
సాష్టాంగముగా సాగిల పడితిని

ఆప్తులు శిష్యులు అభిమానులు కడు
ఆశ్చర్యముతో అవలోకించిరి
నలుగురు మనుజులు మోయలేని ఒక
నల్లని శిలయే యెట్లు వచ్చెనని

తరతరాల ఒక తాంత్రిక శక్తికి
తార్కాణమ్మా అద్భుత దృశ్యము
మహిమాన్వితులౌ సిద్ధుల యోగుల
మాంత్రిక శక్తికి ఇది నిదర్శనము

నాలో దివ్య స్ఫురణ కలుగగా
పరమ గురువు లొనరించు యత్నమిది
నాలో అంతర్జ్యోతి వెలుగగా
పరమేశ్వరి చూపించిన కృప యిది

పూర్వ బంధములు పూర్వ వాసనలు
పూర్వజన్మ ఋణములును సాధనలు
పుష్పించెడి యీా పుణ్యవేళ ఆ
గురులకు సురలకు గూర్తు వినతులను

***

దిగంబరాం దీపిత శక్తి చండాం
ధృతాసి శూలోగ్ర కపాలరుండాం
త్రినేత్రఫాలాం గళముండ మాలాం
కాళీం కరాళీం సతతం నమామి

స్వయంభూకాళీ దృగ్దరహసిత సౌందర్య నిధయే
సమస్తే శ్రీరాధా మధుర మధురానంద విధయే
బహూనాం జన్మాంతే స్ఫురణ మివ విస్తారమతయే
మహిమ్నః పారంతే జనని నవిజానామి సదయే

గతాసూనాం బాహు ప్రకర కృత కాంచీ పరిలస
న్నితంబాం దిగ్వస్త్రాం త్రిభువన విధాత్రీం త్రిణయనాం
అసిం శూలం ముండం నరవరకపాలంచ దధతీం
మహాకాళీం ధ్యాయే త్రిశతయుగ వర్షార్చిత పదాం.

54. కాళీ గీతము

అదిలేని ఈ యాత్రలోననే
మజిలీ లెన్నో మారిపోయెనే
ఆపలేని ఈ యాత్రలోననే
అరువది యేడులు గడచిపోయెనే
యాత్ర ఆపి నీ సత్రమందు నా
అంతు తేల్చుకొన అడుగు పెట్టితిని
అరచి అరచి నా కంఠ మరిగినది
కరగి కరగి నా గుండె జారినది
జనబంధమ్ములు జరారోగములు
వెంటాడగ ఈ పరుగుపందెమున
సాగలేను మరి ఆగలేను నీ
నెలవును చేరుట ఎప్పటికే? నీ
వెలుగును కాంచుట యెన్నటికే?
నిరాహారములు నిద్రా రహితము
లహోరాత్రములు సంధ్యా వేళలు
శుక్ల కృష్ణ పక్షమ్ములు నెలలును
సంవత్సరములు జరిగిపోయె నీ
రాకలేదు నా బాధ పోదికన్
ఎన్ని ఆపదలు! ఎన్ని విఘ్నములు!
ఎన్ని కష్టములు! ఎన్ని నష్టములు
ఎంతకు నాకీ సంయమనం?
ఎప్పటికో నీ ఆగమనం?
కాశీ మజలీ కథల వోలెనే
గడచిపోవు ఈ విచిత్ర యానం
చెప్పలేని వ్యథ నీ కోసం
చేయుచుంటి ఈ ప్రస్థానం
కఠినమైన ఈ శిలాశాసనం
కాలుని వ్రాతెపుడర్థమ్మగునో
రామప్రసాదుని యింట బాలవై
ప్రేమతోడ క్రీడించితి వంట!
కులపతి గుండెను కొలువుదీరి నీ

లలితహాసమున వెలుగు చూపవే!
కన్నీరే అభిషేక జలముగా
కామేశ్వరి! నీ కాళ్ళు కడిగెదను
తనువు కోసి రక్తమ్ము తోడ నీ
అడుగుదమ్ములను తడిపి వేసెదను
మృదుల మనోహర జీవన తరువిది
ఎండి మోడుగా మారకముందే
కఠిన శిలామయ కంటక పథమున
ఈ శరీరమది రాలకముందే
  గమ్యము చేర్చవె కాళీ!
  కన్నుల నిలువు కరాళీ!
కణ కణ మండే నిప్పుల చూపుల
కాల భైరవుడు గర్జన సేయగ
ఒడ్డుల నొరసి పారు వరదవలె
ఉగ్రభైరవుడు ఉరకలు వేయగ
డమడమార్భటుల డమరుక రవమున
చండ భైరవుడు సంభ్రమింపగా
ప్రకట శంఖ విస్ఫార నాదమున
ప్రచండభైరవు డగ్రసరుడుగా
యోగశక్తి లహరీ విలాసముల
నాగభైరవుడు నాట్యము సేయగ
సాకిని యాకిని రాకిని డాకిని
సరభసవృత్తిని సాహోలిడగా
ప్రేత భూతములు భేతాళంబులు
ఆతురగతితో అంజలి పట్టగ
రుద్రగణమ్ములు రూక్షే క్షణముల
పార్శ్వచరులుగా భద్రత నిలువగ
వియచ్చరులు విభ్రాంతిని చూడగ
నీలగగనమున నిలిచిన సిద్ధులు
అచల గుహల ధ్యానించెడి యోగులు
పాహి పాహియని ప్రార్థన సేయగ
చిద్గహనమ్ముల చిర నిరీక్షకులు
త్రాహి త్రాహి యని రక్షణ వేడగ

ఆవహింపవే! అవతరింపవే
వరదాయినివై! కరుణజూపవే
కాళి! కరాళి! కపాలిని భైరవి!
కాత్యాయని! కలికుండ నివాసిని!
వజ్రేశ్వరి!వైరోచని!వాసవి!
వామదేవ సంవర్ధిత రూపిణి!
అరుణారుణ చరణాంబుజ భాసిని!
తరుణ తపస్విని!తారాయోగిని!
అహిర్బుధ్న్య సందర్శిత రూపిణి!
అఖిలాండేశ్వరి! ఆది పరాత్పరి!
దురిత వినాశిని! దుర్గ భవానీ!
నిఖిలేశ్వర సంభావిత జీవని!
నిఖిల భక్తజన హృదయోజ్జీవని!
పరమ శుభంకరి! ప్రళయ భయంకరి!
అష్టసిద్ధి సంధాయిని! జననీ!
ఆశ్రితావనీ! అఖిల పావనీ!
అవతరింపవే! ఆదరింపవే!
కులపతి గుండెను కొలువు దీరవే!

55. దివినుండి భువికి దిగివచ్చిన కాళి

కంటకులైన శాత్రవుల గర్వముఖర్వము సేయ అల్ల ము
క్కంటి గృహమ్ము నుండి అజకల్పిత లోకము లెల్ల దాటి నా
యింటికి వచ్చి హోమగృహ మెర్రని నవ్వుల నింపి కుండపున్
మంటల మధ్య నిల్చి పలుమారులు దర్శన మిచ్చి నిత్యమున్

కంటికి రెప్పవోలె నను కావగ శక్తి మహత్య మీయిగా
పంటవలంతియై సిరుల పల్లకియై వర విగ్రహాకృతిన్
గుంటూరు పట్టణమ్మునకు క్రొత్తచరిత్ర నొసంగుచున్ వియ
ద్ఘంటలు మ్రోయగా దిగిన కాళికి పాదములంటి మ్రొక్కెదన్

ఏదేవి నా కొర కైదువందల యేండ్ల
పూర్వంబునన్ స్వయంభువుగ దిగియె
చిన్నమూర్తిగ ముందు చెలువొందు నే శక్తి
నరదేహము విధాన పెరుగదొడగె

ఏ భువనేశ్వరి ఆ భువనేశ్వర
వనిని నిన్నటి దాక వాసమొందె
ఏ నాయిక కళింగ కాననమ్ములు దాటి
భువిపైన నా కొఱ కవతరించె

సాధకులు యోగు లే జగజ్జనని గొల్చి
ఉన్నతంబైన సిద్ధుల నొందినారొ
ఆ మహాకాళి కంకాళి నతికరాళి
ననితరంబగు భక్తితో నాశ్రయింతు

నిఖిలేశ్వరానందు డఖిల మంత్ర ప్రభుం
డే మాతను స్తుతించె నిచ్చ కొలది
ఉత్తరాపథమందు యోగి శాకంభరి
ఏదేవి గొల్చి సిద్ధేశుడయ్యె
ఏ యీశ్వరిన్ కపాలేశ్వర కాళిదా
సెన్నిక నర్చించె నిన్నదాక
ఏ వహ్నిరూపిణి నావాహనము చేసె
మహిత లీలానంద మాంత్రికుండు
ఏ సవిత్రిని చెన్నూరి కృష్ణమూర్తి
పూర్వజని సోదరుండయి పూజ చేసె
ఆశ్రితావన హేళి ఆ శ్యామకాళి
కాలజిత్కేళి దక్షిణకాళి గొలుతు

బృందావనేశ్వరి శ్రీరాధ కరుణింప
అద్భుత దర్శమ్మంది నాడ
త్రిభువన సారయౌ దేవత తారతో
చెలువంబు మీర భాషించినాడ
మాతంగి ప్రేమతో మణివల్లకిని మీటి
మోహంబు జూపింప మురిసినాడ
మాణిక్యమకుటయౌ రేణుకాదేవి వా
త్సల్య వర్షంబులో తడిసినాడ

ఎందరో దేవతల కృపా వృష్టి ఝురుల
మునిగి యిప్పుడు కాళికాంభోధిలోన
తేలినాడను సిద్ధశక్తి ప్రభావ
గురుమహన్నౌక నెక్కి సాగుదును గాక!

56. కాళిని చూడాలి

కాళిని చూడాలి – చిన్మయకేళిని చూడాలి
బ్రహ్మవిష్ణు పరమేశ్వర ముఖ్యులు, బ్రహ్మణ్యులు మరి బ్రహ్మ వాదులు.
ఏ తత్వమ్మును ఎరుగగ గోరెద – రాతత్వమునకు మూలకందమౌ। ॥కాళిని॥

నరసుర సిద్ధులు నాగకిన్నరులు – నభశ్చరులు మునినారదాదులును
ఏ చరణమ్ముల నెరగుచుందురో –ఎవరిని మనసున గొలిచెదరో ఆ ॥ ॥కాళిని॥

మత్స్యేంద్రుడు గోరక్షనాధుడును, మహామాంత్రికులు భైరవనాధులు
కాళిదాసు మరి విక్రమార్కుడును ఎవరికరుణచే సిద్ధులు గని రా ॥కాళిని॥

మహాకవీంద్రుడు రామప్రసాదును, మహాయోగియగు రామకృష్ణుడును
ఏకరుణామయినిత్యదర్శనము నింపుమీరగా పొందగలిగిరా ॥కాళిని॥

మబ్బుల బొమ్మల మహాకాశమున – కారుచీకటుల కాలయవనికల
చీల్చుకు వచ్చెడి చిదగ్ని దేహను దిగివచ్చెడి ఆ దివ్యమూర్తిని ॥కాళిని॥

అమ్మా ! అమ్మా ! అఖిలేశ్వరియని అమరులు ఋషులును సతతము కొలిచే
ఆదిశక్తి వేదాంతవిహారిణి అఖిలజనని ఆనందనిలయయౌ ॥కాళిని॥

మధుకైటభ సంహారకారిణిని మహిషమహాసుర ప్రాణహారిణిని
మహాప్రభావను మంత్రోజ్జీవను మాతలమాతగ మహి వెలసిన ఆ ॥కాళిని॥

జరారోగములజర్జరితమ్మై శరీరమియ్యది జారకముందే
ప్రళయపూరుషుని ఉచ్ఛ్వాసమ్ముల ప్రాణవాయువులు చేరకముందే
ఈ దేహములో ప్రాణముండగా ఈ ప్రాణములో శక్తి ఉండగా
ఈ మనస్సులో స్మృతియుండగనే ఎట్టులనైనా ఎప్పటికైనా ॥కాళిని॥
ముగ్గురమ్మల మూలపుటమ్మను ముందుగ చూడాలి
అమ్మలగన్న అమ్మయైన ఆ తల్లిని కరుణాకల్పవల్లిని ॥కాళిని॥

57.(ఎ) దక్షిణకాళీ మంగళహారతి

దివ్యభూములనుండి హిమగిరి భవ్యసీమల యందున
ఆరువందల యేండ్ల క్రిందట అవతరించిన కాళికా
ఉత్తరాపధమందు చెలగియు ఓఢ్రవనముల మెట్టియు
ఆంధ్రభూమికి కోరివచ్చిన అంబ ! నీ కిదె మంగళం.

మూడువందల యేండ్లు కులపతి పూజలందియు మెచ్చియు
వరములిచ్చియు మంచుకొండల వైభవమ్మును పెంచితే
భక్తవర్యుల సిద్ధయోగుల ప్రార్థనల మన్నించియు
ప్రేమనిలిచిన భీషణాంగీ ! త్రిభువనేశ్వరి ! మంగళం

అల త్రిలింగస్వామి - కాశీయతియు నిన్నర్చించెను
భైరవీ బ్రాహ్మణియు నిన్నతి భక్తితో సేవించెను
రామకృష్ణుడు పరమహంసగ రమణ నిను పూజించెను
నేడు మా పూజల గ్రహింపవె ! నిర్మలాంగీ ! మంగళం

తుహినగిరిలో సిద్ధమండల మహిత పూజల నందియు
వింధ్యపర్వత సానువులలో విహిత సేవల గాంచియు
అంగ వంగ కళింగములలో అర్చనల హర్షించియు
తెలుగునేలను దిగిన తల్లికి దేవమాతకు మంగళం

ఎచట హిమగిరి ! ఎట కళింగము ! ఎచట గుంటూ రంబరో !
కులపతీంద్రుని పూజలందగ కోరివచ్చిన కాళికా !
ఆ కపాలేశ్వరుడు చేసిన అర్చనల సుమమాలతో
అంతరిక్షము నుండి దిగిన అఖిల జననికి మంగళం

మంగళం జయమంగళం శుభమంగళం పరమేశ్వరీ
మహిత సిద్ధులు ఋషులు కొలిచెడి మంగళాంగికి మంగళం
మంగళం జయమంగళం శుభమంగళం జగదీశ్వరీ
మధువినాశిని మహిషమర్దిని మహాకాళికి మంగళం

(బి) జయ జయ కాళీ దక్షిణ కాళీ

హిమాలయమ్మున వెలసిన కాళీ
ఉత్తర భూముల ఉద్ధత కాళీ
బృందావనమున సుందర కాళీ
ఉజ్జయినీ పురి ఉజ్వల కాళీ
కామాఖ్యాపురి కామిని కాళీ
కళింగభూముల కరాళకాళీ
మళయాళమ్మున భగవతి కాళీ
మహాకాళుపై మనసిడు కాళీ
భైరవ యోగుల భద్ర కాళీ
కుటిలశాత్రవుల కూల్చెడు కాళీ

దుష్టదానవుల త్రుంచెడు కాళీ
పాపవినాశిని పావన కాళీ
భక్తజనావని భయహర కాళీ
ఆర్తరక్షిణీ అద్భుత కాళీ
వరప్రదాయిని స్వయంభు కాళీ
మంగళహారతి మహేశ కాళీ
కప్పురహారతి కరాళ కాళీ
రత్న హారతీ రసమయ కాళీ
వజ్రహారతి - ప్రపూర్ణ కాళీ
జయజయకాళి దక్షిణ కాళీ.











VICTORY
విక్టరీ పబ్లిషర్స్
30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,
విజయవాడ - 520 002, ఫోన్ : 0866-2444156